Cittūru jillā kalpanāsāhityaṁ (navala, kathānika) - vastu, rūpa viślēṣaṇa

A Thesis submitted to the University of Hyderabad in partial fulfilment of the requirement for the award of

Doctor of Philosophy

In

Telugu

Researcher

ANKIREDDI SUNIL KUMAR REDDY

(Regd No: 16HTPH02)

Department of Telugu
School of Humanities
University of Hyderabad
Hyderabad - 500 046
Telangana, India

December - 2022

చిత్తూరు జిల్లా కల్పనాసాహిత్యం

(నవల, కథానిక) - వస్తు, రూప విశ్లేషణ

పిహెచ్.డి. పట్టా కోసం హైదరాబాదు విశ్వవిద్యాలయం వారికి సమర్పించిన

పరిశోధన గ్రంథం

పరిశోధకుడు

అంకిరెడ్డి సునీల్ కుమార్ రెడ్డి

(Reg No: 16HTPH02)

పర్యవేక్షకుడు

ఆచార్య తుమ్మల రామకృష్ణ

ఉప పర్యవేక్షకుడు

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

తెలుగుశాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్,

హైదరాబాద్–500046

డిసెంబర్–2022

DECLARATION

I, Ankireddi Sunil Kumar Reddy hereby declare that this thesis entitled **Cittūru jillā kalpanāsāhityaṁ (navala, kathānika) - vastu, rūpa viślēṣaṇa** submitted by me under the guidance and supervision of Prof. Tummala Ramakrishna and Co-supervision of Prof. Darla Venkateswara Rao is my bonafide research work. I also declare that it has not been submitted previouslyin part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that this thesis can be deposited in Shodhganga /INFLIBNET.

Signature of the Student

Date:

Name: Ankireddi Sunil Kumar Reddy

Registration No. 16HTPH02

CERTIFICATE

This is to certify the Thesis entitled **Cittūru jillā kalpanāsāhityaṁ (navala, kathānika) - vastu, rūpa viślēṣaṇa** submitted by **Mr.** Ankireddi Sunil Kumar Reddy bearing **Regd. No. 16HTPH02** in partial fulfilment of the requirements for the award of **Doctor of Philosophy** in the School of Humanities, Department of Telugu is a bonafide work carried out by him under my supervision and guidance.

The thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma.

A. Published in the following publications:

1. ***'cittūru jillā tolitaraṁ kathalu – vastu viślēṣaṇa', Bhavaveena Journal of Arts, Literary, Culture & Language Study Monthly, UGC _Care Journal, ISSN No.2456-4702, march, 2022, Vol.19-Issue.03, Pages: 6-10. Editor: Kolla Sri Krishnarao, Chief Editor: Pitta Santhi, Published by*** Kolla SriKrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, Guntur, A.P.India.
2. **'Tānu mātramē rāyagaligina kathalu...'** seemasanthakam. ISBN no 978-81-908572-8-4. Pages: 54-59. Editors: Rachapalem Chandrasekhara Reddy, singamneni Narayana. Published on January 2021.

B. Presented in the following National seminars:

1. ***''Viṣappurugu' kathalu – girijana, sañcāra tegala jīvana citraṇa'*** International Webinar on telugu katha samakaaleenatha conducted by Sri Raja Rajeshwara Government Arts and Science College (Karimnagar) and University of Madras. Dated on 2,3. July 2021

2. ***'Mīḍiyā valalō paḍḍa yuvataraṁ bhaviṣyattuku niluvuṭaddaṁ 'pralōbhaṁ'*** International Webinar on telugu saahithyam samakaaleenatha conducted by VSR & NVR College tenali. Dated on 24,25. Auagust 2020

Further, the student has passed the following courses towards fulfilment of course work requirement forPh.D.

Sl.No	Course Code	Name of the Subject	Credits	Pass/Fail
1.	HT-801	Research Methodology	4.00	Pass
2.	HT-802	History of Telugu Research	4.00	Pass
3.	HT-803	Studies in Literature and Language	4.00	Pass
4.	HT-804	Specialized area and Broad Field	4.00	Pass

(Prof. Tummala Ramakrishna)

Research Supervisor

(Prof.Darla Venkateswara Rao)
Research Co-Supervisor

(Prof.Darla Venkateswara Rao)
Head, Department of Telugu

(Prof.V. Krishna)
Dean, School of Humanities

కృతజ్ఞతలు

అను నిత్యం నా అభ్యున్నతికై పాటుపడే అమ్మా, నాన్నలకు (శ్రీమతి రమణమ్మ, శ్రీ రామిరెడ్డి)... అన్నా వదినలకు (శశిధర్, స్వాతి) గార్లకు.....

ఈ పరిశోధనకు అవకాశం కల్పించిన హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం వారికి...

నా పరిశోధనకు కొంతకాలం పర్యవేక్షణా బాధ్యతను వహించి, తగు సలహాలను, సూచనలను అందిస్తూ, నిత్యం ప్రోత్సహించి, ప్రస్తుత ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా పనిచేస్తున్న మా గురువు గారు ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికి...

ఎదురు పడగానే ప్రేమగా పలకరించి, ఆరోగ్య విషయాలతో పాటూ, పరిశోధనకు సంబంధించిన మెళుకువలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలియజేస్తూ, సాహిత్య అధ్యయన విధానంలో విద్యార్థులకు ఉండవలసిన దృక్పథాలను తెలియజేసే తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారికి...

నా పరిశోధనకు ఆచార్య తుమ్మల రామకృష్ణ గారి తర్వాత ఉప పర్యవేక్షణా బాధ్యతను వహించి, యు.జి.సి. వారు అందించే senior research fellowship కు, research advisory committee కి రెండేళ్లుగా సంతకాలు చేస్తూ, తగు సూచనలను, సలహాలను అందించిన ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారికి...

సొంత బిడ్డలుగా భావించి నా పట్ల ఆదరాభిమానాలను చూపించే విజయ అక్కకు, డాక్టర్ మంజుశ్రీ మేడం గారికి....

ఎం. ఫిల్, పిహెచ్.డి.లలో పాఠాలు బోధించిన ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నారాణి గారికి, ఆచార్య జి. అరుణ కుమారి గారికి.... అలాగే తెలుగు శాఖ ఇతర అధ్యాపకులైన ఆచార్య రేమిల్ల రామకృష్ణ శాస్త్రి గారికి, ఆచార్య పిల్లలమర్రి రాములు గారికి, ఆచార్య గోనా నాయక్ గారికి, కీర్తిశేషులు ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారికి, ఆచార్య పమ్మి పవన్ కుమార్ గారికి, ఆచార్య డి.విజయలక్ష్మి గారికి, డా॥ బాణాల భుజంగ రెడ్డి గారికి, డా॥ డి.విజయకుమారి గారికి,

నాకు ఎం.ఏలో పాఠాలు చెప్తున్నప్పుడే పరిశోధన పట్ల కూడా ఆసక్తిని కలిగించిన, ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మగారికి (తెలుగు శాఖ అధ్యక్షులు, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం), ఆచార్య మేడిపల్లి రవికుమార్ గారికి (శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం), ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి గారికి (శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం)....

వివిధ సందర్భాలలో నా పరిశోధనకు సంబంధించిన సలహాలను అందించిన ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి గారికి (విశ్రాంత ఆచార్యులు యోగివేమన విశ్వవిద్యాలయం, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత), ఆచార్య వెలమల సిమ్మన్న గారికి (ఆంధ్ర విశ్వ కళాపరిషత్ దూరవిద్యా కేంద్రం), ఆచార్య జి. బాలసుబ్రహ్మణ్యం (తెలుగుశాఖ అధ్యక్షులు శ్రీ కృష్ణదేవరాయ

విశ్వవిద్యాలయం), ఆచార్య విస్తాలి శంకరరావు గారికి (తెలుగుశాఖ అధ్యక్షులు, మద్రాసు విశ్వవిద్యాలయం), డా॥ కె.లావణ్య గారికి (తెలంగాణ విశ్వవిద్యాలయం), డా॥ వేంకటరమణ గారికి (మదురై కామరాజ్ విశ్వవిద్యాలయం), డా॥ నల్లపరెడ్డి ఈశ్వర రెడ్డి (యోగి వేమన విశ్వవిద్యాలయం), ఆచార్య ఎటూరి జ్యోతిగారికి (కాకతీయ విశ్వవిద్యాలయం)....

నా పరిశోధనకు సంబందించిన విషయ సేకరణలో సహాయపడిన కథానిలయం నిర్వాహకులు కాళీపట్నం సుబ్బారావు గారికి...

నాకు జె.ఆర్.ఎఫ్ & ఎస్.ఆర్.ఎఫ్ ద్వారా పరిశోధన చేయడానికి కావలసిన ఆర్థిక సహకారాన్ని అందించిన యూనివర్సిటి గ్రాంట్స్ కమీషన్, న్యూఢిల్లీ వారికి,

ఇందిరాగాంధీ మెమోరియల్ లైబ్రరీ (హైదరాబాదు విశ్వవిద్యాలయం), శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ గ్రంథాలయం (తిరుపతి), శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ గ్రంథాలయం (అనంతపురం), ఆంధ్ర విశ్వకళా పరిషత్ గ్రంథాలయం (విశాఖపట్నం), సి.పి. బ్రౌన్ స్మారక గ్రంథాలయం (కడప), జిల్లా గ్రంథాలయం (చిత్తూరు), జిల్లా గ్రంథాలయం (అనంతపురం) వారికి....

నాకు స్ఫూర్తిగా నిలుస్తున్న డా॥ సతీష్ అన్నకు, డా డా॥ తవ్వా వెంకటయ్య గారికి....

నా జీవితంలో ఎదురయ్యే కష్ట సుఖాలను పంచుకొంటూ, పరిశోధన సకాలంలో జరిగేలా సహకరించిన అర్ధాంగి సుమలతకు...., మిత్రులకి...., ఈ పరిశోధనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన వారందరికీ నా హృదయ పూర్వక కృతజ్ఞతలు.

అంకిరెడ్డి సునీల్ కుమార్ రెడ్డి
16HTPH02

ప్రవేశిక

1. పరిశోధనాంశం పరిచయం (Introduction)

భారతదేశంలో ఆంగ్లేయుల పాలన మొదలైన తరువాత భారతీయ సామాజిక జీవన విధానాలలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. వాటిలో భాగంగానే ప్రయాణ సౌకర్యాలు, అచ్చు యంత్రాలు, వార్తా పత్రికలు, ఆంగ్ల పాఠశాలలు పుట్టుకు రావడం జరిగింది. ఇలా కొన్ని లాభాలతో పాటు దేశీయ సాంస్కృతిక విలువలు పడిపోవడం, కుల వృత్తులు క్షీణించడం లాంటి నష్టాలూ లేకపోలేదు. ఈ విషయాన్ని పక్కనపెట్టి సాహిత్యం విషయానికొస్తే, ఆంగ్ల సాహిత్య పరిజ్ఞాన ప్రభావం వల్ల భారతీయ సాహిత్యంలోనూ అలానే తెలుగు సాహిత్యంలోనూ అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా ఇతివృత్త స్వీకరణలోనూ, ప్రక్రియా వైవిధ్యంలోనూ వైవిధ్య భరితమైన మార్పులు చోటుచేసుకున్నాయి. వచన సాహిత్య ప్రక్రియలు ఎన్నో పుట్టుకు వచ్చాయి. ఇలా పుట్టుకు వచ్చిన వచన సాహిత్య ప్రక్రియలో నవల, కథానికలు నేడు ప్రజల ఆదరాభిమానాలను ఎక్కువగా పొందుతున్న ప్రక్రియలు. ఈ నవల, కథానిక ప్రక్రియలనే నేడు మనం కల్పనా సాహిత్య ప్రక్రియలుగా చెప్పుకుంటున్నాం.

పూర్వం కావ్యాలు, ప్రబంధాలు, ద్విపదలు, యక్షగానాలు లాంటి ప్రక్రియలు ఏ పురాణ గాథనో స్వీకరించి రచించబడితే, నేటి కల్పనా సాహిత్య ప్రక్రియలైన నవల, కథానిక లాంటి ప్రక్రియలు కొన్ని వాస్తవిక అంశాలతో, కాల్పనికాంశాలతో ఒక వ్యక్తి జీవితాన్ని గురించి గాని, జీవితంలో ఒక ముఖ్యమైన భాగాన్ని గానీ, స్థల, కాల, సన్నివేశాలను గానీ ప్రధానంగా చేసుకొని చిత్రించబడుతున్నాయి. ఇటువంటి కల్పనా సాహిత్య ప్రక్రియలైన నవల, కథానికా రచనలను చేపట్టి తెలుగు సాహిత్యానికి జవజీవాలు కల్పిస్తున్న రచయితలు తెలుగు సాహిత్యంలో చాలామంది ఉన్నారు.

పరిశోధనా పరంగా చూసినప్పుడు ప్రాంతీయవాద దృక్పథంతో, అస్తిత్వంవాద దృక్పథంలో ఏ ప్రాంత సాహిత్యాన్ని ఆప్రాంత పరిశోధకులు, విమర్శకులు, సాహిత్యాభిమానుల ఆయా ప్రాంతాల సాహిత్యాన్ని వెలికితీసి పరిశోధిస్తున్నారు. వీరి ఫలితాల ద్వారా నేటి సాహిత్య చరిత్రను తిరగరాయాల్సిన పరిస్థితి ఉంది అంటే ఆశ్చర్యపోవాల్సిన అవసరం ఏమీలేదు. ఈ విధంగా చూస్తే నేను చిత్తూరు జిల్లా ప్రాంతానికి చెందిన వాన్ని కనుక ఇక్కడి నుండి వెలువడిన కల్పనాసాహిత్యాన్ని గురించి పరిశోధన చేయాలనే అభిలాషతో **"చిత్తూరు జిల్లా కల్పనాసాహిత్యం (నవల, కథానిక) – వస్తు, రూప విశ్లేషణ"** అనే అంశాన్ని నా పిహెచ్.డి. పరిశోధనాంశంగా ఎన్నుకున్నాను. నేను మొదట ఈ పరిశోధనను ఆచార్య తుమ్మల రామకృష్ణ గారి పర్యవేక్షణలో ప్రారంభించాను. ఆయన 26, నవంబర్ 2020న ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా నియమితులై హైదరాబాదు విశ్వవిద్యాలయం నుండి వెళ్ళిపోయారు. అప్పటి నుండి ఈ పరిశోధనను ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారి ఉప పర్యవేక్షణలో కొనసాగిస్తున్నాను.

2. **పరిశోధనా అవశ్యకత** (Necessity of the Research)

తెలుగులో నవలా సాహిత్యం మొదలై ఇప్పటికి 150 సంవత్సరాలు పూర్తవుతూ ఉంది. 1872లో మొదలైన నవలాసాహిత్యంపైన ఇప్పటిదాకా అనేక పరిశోధనలు, విమర్శలు, సమీక్షలు వచ్చాయి. వీటిలో ఎక్కువ శాతం విడివిడి పరిశోధనలు, విమర్శలే. తెలుగులో నవలా సాహిత్యంపైన కృషి చేసిన (పరిశోధనలు, విమర్శలు, సమీక్షలు) బి.వి.కుటుంబరావు, పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు, మొదలి నాగభూషణశర్మ, అక్కిరాజు రమాపతిరావు, కోడూరి శ్రీరామమూర్తి, సి. మృణాళిని, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, మధురాంతకం రాజారాం, టి. ఎస్. ఏ. కృష్ణమూర్తి, పొదిలి నాగరాజు మొదలైన వారు, రాయలసీమ నవల అందులో చిత్తూరు జిల్లా నవల గురించి తమదైన అభిప్రాయాలను తెలియచేశారు. వాటిని పరిశీలిస్తే పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు, మధురాంతకం రాజారాం, టి. ఎస్. ఏ. కృష్ణమూర్తి, పొదిలి నాగరాజు మినహా ఎవరూకూడా 1950కి ముందు చిత్తూరు జిల్లానుండే కాదు మొత్తం రాయలసీమ నుండి కూడా నవలలు రాలేదనే అభిప్రాయాన్ని తెలియజేశారు. అయితే అప్పటికే చిత్తూరు జిల్లా నుండి 8 నవలలు ప్రచురించబడి ఉన్నాయి. అవి చాందసుల్తాన(1920), తానీషా(1925), రత్నాభాయి (1925), వీర గాంధర్వము (1927), భానుమతి(1930), పేటికాంతార శవము(1930), మోహన(1931), భిక్షుకి(1948). దీనిని బట్టి 1920లోనే చిత్తూరు జిల్లా నవలా సాహిత్యం మొదలైందని తెలుస్తోంది.

అదేవిధంగా చిత్తూరు జిల్లా కథానిక విషయానికి వస్తే తెలుగు నవలా సాహిత్యం పైన ఏవిధంగానైతే పరిశోధన గ్రంథాలు, విమర్శా గ్రంథాలు వెలువడ్డాయో అదే విధంగా కథానికా సాహిత్యంపైన కూడా అనేక గ్రంథాలు వెలువడ్డాయి. వీటిలో చిత్తూరు జిల్లా కథానికకు(రాయలసీమ కథానిక) ప్రాధాన్యతనిచ్చిన గ్రంథాలను, రచయితల అభిప్రాయాలను పరిశీలిస్తే, కె. సభానే చిత్తూరు జిల్లా కథానికకు ఆద్యుడుగా చెప్పారు. వీరి 'కడగండ్లు' (1944 చిత్రగుప్త పత్రిక) అనే కథనే చిత్తూరు జిల్లా మొదటి కథగా కూడా చెప్పారు. అయితే ఇటీవల ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమ నేపథ్యంతో అప్పిరెడ్డి హరినాథరెడ్డి, తవ్వా వెంకటయ్య చేసిన పరిశోధనల మూలంగా పై అభిప్రాయాన్ని మార్చుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. వీరి కృషి ఫలితంగా చిత్తూరు జిల్లా నుండి మొదట కథా రచన చేపట్టిన వ్యక్తి యం.వి. పాపన్న గుప్త అని, ఈయన 1927లోనే శారద, హైమావతి, సావిత్రి అనే కథలు రాశారని తెలుస్తోంది. అదే విధంగా కె. సభా కంటే ముందు చిత్తూరు జిల్లా నుండి కథా రచన చేసినవారు ఉన్నట్లుగా కూడా మనకు తెలుస్తుంది.

ఈ విధంగా చూస్తే 1920లో నవల, 1927లో కథానికలతో చిత్తూరు జిల్లా కల్పనాసాహిత్యం మొదలైందని చెప్పొచ్చు. అప్పటి నుండి చిత్తూరు జిల్లా కల్పనాసాహిత్యాన్ని సుసంపన్నం చేస్తూ, సమాజంలో వస్తున్న ప్రతి మార్పునూ స్వాగతిస్తూ నూతన నవల, కథానికా వస్తువులతో రచనలను చేసిన, చేస్తున్న రచయితలు జిల్లాలో అనేక మంది ఉన్నారు. పల్లెల

గురించి, పట్టణాల గురించి, మధ్య తరగతి జీవితాల గురించి, రైతుల బాధలను, దళితుల జీవన విధానాలను, సంచార, యాచక, గిరిజన జాతుల జీవన విధానాలను, అలాగే వర్గ తారతమ్యాలను, వీటన్నింటినీ మించి రాయలసీమ ప్రత్యేక లక్షణాలుగా చెప్పుకునే కరువు కాటకాలను ఇలా అనేక సమస్యలను వారి వారి దృక్కోణాలలో నుండి చిత్రించిన రచయితలు జిల్లాలో అనేక మంది ఉన్నారు. అయితే వారిలో ఏ కొద్ది మంది రచనలపైన మాత్రమే పరిశోధనలు జరిగాయి. చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యాన్నంతటినీ కలిపి వస్తురీత్యా గానీ శిల్పరీత్యా గానీ పరిణామ వికాసాన్ని అంచనా వేసే దిశగా పరిశోధనలు జరగలేదు. కాబట్టి ఈ దిశగా చిత్తూరు జిల్లా కల్పనాసాహిత్యాన్ని అధ్యయనం చేసి విశ్లేషించాల్సిన ఆవశ్యకత ఉందనే దృక్పథంతో ఈ అంశాన్ని పరిశోధనాంశంగా తీసుకున్నాను.

3. **పరిశోధన పరిధి** (Scope of Research)

తెలుగులో చిత్తూరు జిల్లా నుండి వచ్చిన కల్పనా సాహిత్యం చాలా విస్తృతమైంది. సీరియస్ ఇంకా పాపులర్ రచయితల రచనలను కలిపి ఇప్పటి వరకూ మూడు వందలకుపైగా నవలలు, మూడు వేలకుపైగా కథలు వచ్చుంటాయని నా అంచనా. వాటన్నింటినీ సేకరించి పరిశీలించడం ఒక్కరివల్ల సాధ్యమయ్యే పనికాదు. ఇది సంస్థాగతంగా చేయాల్సిన పని. అందుకని చిత్తూరు జిల్లాలోని పాపులర్ రచయితల రచనలను మినహాయించి, 1975 వరకూ వచ్చిన నవలలు, కథలు వరకూ మాత్రమే పరిధిగా పెట్టుకొని ఈ అంశాన్ని విశ్లేషించే ప్రయత్నం చేశాను.

4. **పూర్వ పరిశోధనలు** (Previous Research)

నాకు లభించిన సమాచారం మేరకు నేను పరిశోధనకు ఎంచుకున్న అంశంపై (చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యం (నవల, కథానిక) – వస్తురూప విశ్లేషణ) ఇంతవరకూ ఏ పరిశోధన జరగలేదు. అయితే కె. సభా, మధురాంతకం రాజారాం, కలువకొలను సదానంద, పులికంటి కృష్ణారెడ్డి, ఆర్.ఎస్. సుదర్శనం, వల్లంపాటి వెంకటసుబ్బయ్య లాంటి వారి రచనలపైన (నవలలు, కథానికలు) విడివిడిగా అనేక కోణాల్లో పరిశోధనలు జరిగాయి.

క్రమ సంఖ్య	పరిశోధన పేరు	పరిశోధకుని పేరు	విశ్వవిద్యాలయం	పర్యవేక్షకుడు	సంవత్సరం
1.	ఆర్.ఎస్. సుదర్శనం రచనలు–ఒక పరిశీలన (పిహెచ్.డి)	పి. భవాని	హైదరాబాదు విశ్వవిద్యాలయం	జి.వి. సుబ్రహ్మణ్యం	1987
2.	మధురాంతకం రాజారాం నవలలు–అనుశీలన (ఎం.ఫిల్)	కె. శారద	శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం	పి. నరసింహారెడ్డి	1985

3.	మధురాంతకం రాజారాం కథలు– పరిశీలన (పిహెచ్.డి)	కె. శారద	శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం	పి. నరసింహారెడ్డి	1991
4.	కె. సభా సాహిత్యం– వాస్తవికత(పిహెచ్.డి)	కృష్ణ కళావతమ్మ	శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం	ఎం.కె. దేవకి	1993
5.	కలువకొలను సదానంద కథలు–పరిశీలన (పిహెచ్.డి)	జి. అనసూయ	శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం	ఎన్. మునిరత్నమ్మ	2000
6.	కలువకొలను సదానంద నవలలు–ఒక పరిశీలన (ఎం.ఫిల్)	వి. ఆంజనేయులు	శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం	స్వతంత్రం	1994
7.	పాటూరు రాజగోపాలనాయుడు రచనలు– పరిశీలన (పిహెచ్.డి)	దాసరి రమణమూర్తి	శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం	జి. బాలసుబ్రమణ్యం	2008
8.	వల్లంపాటి సాహిత్యం సమాలోచన (పిహెచ్.డి)	ఎస్. మమత	మద్రాసు విశ్వవిద్యాలయం	ఎం. సంపత్ కుమార్	2017
9.	రాయలసీమ నవల తొలిదశ–ఒక ఆధ్యయనం (పిహెచ్.డి)	పొదిలి నాగరాజు	యోగివేమన విశ్వవిద్యాలయం		2014
10.	రాయలసీమ కథానిక తొలిదశ : ఒక అధ్యయనం (పిహెచ్.డి)	తవ్వా వెంకటయ్య	యోగివేమన విశ్వవిద్యాలయం	తప్పెట రామ ప్రసాదరెడ్డి	2014
11.	చిత్తూరు జిల్లా తొలితరం కథలు – విశ్లేషణ (ఎం.ఫిల్)	అంకిరెడ్డి సునిల్ కుమార్ రెడ్డి	హైదరాబాదు విశ్వవిద్యాలయం	తుమ్మల రామకృష్ణ	2016

5. **క్షేత్ర పర్యటన/ గ్రంథ సేకరణ** (Field-Work/ Book collection)

చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యాన్ని (నవల కథానిక) సేకరించే క్రమంలో నాకున్న పరిమితులను దృష్టిలో ఉంచుకొని ప్రసిద్ధమైన ఇందిరాగాంధీ మెమోరియల్ లైబ్రరీ (హైదరాబాదు విశ్వవిద్యాలయం), కథానిలయం (శ్రీకాకుళం), శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ గ్రంథాలయం (తిరుపతి), శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ గ్రంథాలయం (అనంతపురం), ఆంధ్ర విశ్వకళా పరిషత్ గ్రంథాలయం (విశాఖపట్నం), సి.పి. బ్రౌన్ స్మారక గ్రంథాలయం (కడప), జిల్లా గ్రంథాలయం (చిత్తూరు), జిల్లా గ్రంథాలయం (అనంతపురం), ఏ.పి. ప్రెస్ అకాడమీలను (డిజిటల్ లైబ్రరీ) ప్రధానంగా సందర్శించాను. అలాగే మరి కొంతమంది ప్రముఖులను, పరిశోధకులను కలిసి నా పరిశోధనాంశానికి సంబంధించిన నవలలను కథలను సేకరించాను. ఈ క్రమంలో ఇప్పటి వరకూ వెలుగులోకిరాని కొన్ని నవలలు కొన్ని కథలు నాకు లభించాయి. కొన్ని రచనలు పునర్ముద్రణకు నోచుకోక పోవడం వల్ల లభించలేదు. వీటి వివరాలను అనుబంధంలో పొందుపరిచాను. ఈ రచనలన్నింటినీ లోతుగా పరిశీలించే ప్రయత్నం చేశాను.

6. **పరిశోధన ఆకరాలు** (Research Source)

నా పరిశోధన పూర్తి చేయడానికి అనేక గ్రంథాలు, పత్రికలు, ఇతరేతర ఆధారాలు తోడ్పడ్డాయి. వాటన్నింటినీ నా సిద్ధాంత గ్రంథ ఉపయుక్త సూచిలో పొందుపరిచాను. ఉదాహరణకు కొన్ని గ్రంథాలను ఇక్కడ పేర్కొంటున్నాను.

1. కె.ఆర్. రెడ్డి (1967 ***అబలలూ – అనుమానాలు***. హైదరాబాదు: మహతీ పబ్లికేషన్స్.
2. పాపన్న గుప్త, యం.వి. (1930). ***భానుమతి***. ప్రొద్దుటూరు: భారత కథానిధి చిత్రకథల పత్రిక.
3. మనోహర్, కోటకొండ.; ఉమామహేశ్వర రావు, ఆర్.ఎం (సంపాదకులు). (2009). ***వల్లంపాటి కథలు***. మదనపల్లి: వల్లంపాటి ప్రచురణలు.
4. మనోహర్, కోటకొండ.; ఉమామహేశ్వర రావు, ఆర్.ఎం. (సంపాదకులు). (2009). ***వల్లంపాటి నవలలు***. మదనపల్లి: వల్లంపాటి ప్రచురణలు,
5. రాజగోపాలనాయుడు, పి. (ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక 1972). ***ఓరుగల్లు పునరాక్రమణ***.
6. రాజారాం, మధురాంతకం. (1961) ***వర్షించిన మేఘం***. విశాఖపట్నం: పద్మప్రియ ప్రచురణలు.
7. రాజారాం, మధురాంతకం. (1962) ***ప్రాణదాత***. మద్రాసు: శ్రీ పబ్లికేషన్స్.
8. రాజారాం, మధురాంతకం. (1963) ***తాను వెలిగించిన దీపాలు***. విజయవాడ: ఆంధ్ర హిందీ ప్రచార ప్రెస్.
9. రాజారాం, మధురాంతకం. (1968) ***కమ్మ తెమ్మెర***. నేండ్రగుంట: విశ్వప్రభ ప్రచురణలు.

10. రాజారాం, మధురాంతకం. (1968) ***కళ్యాణ కింకిణి***. నేండ్రగుంట: విశ్వ ప్రభ ప్రచురణలు.
11. రాజారాం, మధురాంతకం. (1968) ***పునర్నవం***. నేండ్రగుంట: విశ్వప్రభా ప్రచురణలు.
12. రాజారాం, మధురాంతకం. (1971). ***చిన్న ప్రపంచం సిరివాడ***.
13. రాజారాం, మధురాంతకం.(1969) ***త్రిశంకుడి స్వర్గం***. మద్రాసు: శ్రీ కళ ప్రింటర్స్
14. రామానుజులు రెడ్డి, బూదూరు. (1925). ***రత్నాబాయి***. ప్రొద్దుటూరు: జానకి ముద్రాక్షరశాల.
15. వెంకటరమణయ్య, దూబగుంట. (1925). ***చాందసుల్తానా***. రాజమండ్రి: రాజేశ్వరి ప్రెస్.
16. వెంకటరమణయ్య, దూబగుంట. (1925). ***తానీషా***. రాజమండ్రి: నేషనల్ బుక్ డిపో.
17. వేణు, సి. (2014). ***నవ్వీన ధాన్య రాశి***. బెంగళూరు: స్వచ్ఛత ప్రచురణ.
18. సదానంద, కలువకొలను. (1965). ***రక్త యజ్ఞం***. నేండ్రగుంట: విశ్వప్రభ పబ్లిషింగ్ హౌస్.
19. సదానంద, కలువకొలను. (1967). ***పైరుగాలి. నేండ్రగుంట***: విశ్వప్రభ పబ్లిషింగ్ హౌస్.
20. సదానంద, కలువకొలను. (1972). ***గాడిద బ్రతుకులు***. నేండ్ర గుంట: విశ్వప్రభ పబ్లిక్ సింగ్ హౌస్.
21. సదానంద, కలువకొలను. (1975). ***నవ్వే పెదవులు ఏడ్చే కళ్ళు***. నేండ్రగుంట: విశ్వప్రభ పబ్లిషింగ్ హౌస్.
22. సభా, కె. (1960). ***మొగిలి***. చేతిరాత ప్రతి.
23. సభా, కె. (1963) ***బంగారు***. చిత్తూరు: రమణా పబ్లిషర్స్.
24. సభా, కె. (1969) ***పాతాళగంగ***. చిత్తూరు: పద్మశ్రీ అండ్ కో.
25. సభాపతి. (1948). ***భిక్షుకి***. మద్రాసు: ఆనంద బోధని కార్యాలయం.
26. సుదర్శనం, ఆర్.ఎస్. (1958). ***అనుభందాలు***. విజయవాడ: ఆదర్శ గ్రంథ మండలి.
27. సుదర్శనం, ఆర్.ఎస్. (1960). ***మళ్ళీ వసంతం***. విజయవాడ: ఆదర్శ గ్రంథ మండలి.
28. సుదర్శనం, ఆర్.ఎస్. (భారతి పత్రిక 1965-1966). ***అసుర సంధ్య.***

7. పరిశోధన గ్రంథ రచనా పద్ధతి (Method of Research)

ఈ పరిశోధన సామాజిక దృష్టి కోణంతో (social aspect) పరిశీలించి వివరించే ప్రయత్నం చేశాను. నా పరిశోధన సిద్ధాంత గ్రంథ రచనలో APA (American psychological Association) శైలీ పత్రాన్ని అనుసరించాను. చిత్తూరు జిల్లా నుండి వచ్చిన కల్పనా సాహిత్యాన్ని దృష్టిలో పెట్టుకొని, అందులోగల వైవిధ్యతలను గమనించి సిద్ధాంత గ్రంథాన్ని ఆరు అధ్యాయాలుగా విభజించాను.

మొదటి అధ్యాయం	:	***చిత్తూరు జిల్లా భౌగోళిక పరిస్థితులు***
రెండవ అధ్యాయ	:	***ప్రపంచ సాహిత్యంలో నవల, కథానికల ప్రారంభం***
మూడవ అధ్యాయం	:	***చిత్తూరు జిల్లా రచయితలు (నవల, కథానిక) – జీవన రేఖలు***
నాల్గవ అధ్యాయం	:	***చిత్తూరు జిల్లా నవలా సాహిత్యం – వస్తు వైవిధ్యం***
ఐదవ అధ్యాయం	:	***చిత్తూరు జిల్లా కథా సాహిత్యం – వస్తు వైవిధ్యం***
ఆరవ అధ్యాయం	:	***చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యం – రూప (శిల్ప) వైవిధ్యం***

మొదటి అధ్యాయం ***'చిత్తూరు జిల్లా భౌగోళిక పరిస్థితులు'***లో చిత్తూరు జిల్లా ఏర్పడిన విధానం, జిల్లా యొక్క భౌగోళిక పరిస్థితులు, జిల్లాను పరిపాలించిన రాజ వంశాలు, జిల్లాలో జరిగిన ఉద్యమాలు, జిల్లాలోని సాంఘిక, సాంస్కృతిక విషయాలైన మతం, దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలు, జాతరలు, ఉత్సవాలు, పండుగల గురించి పేర్కొన్నాను. ఎందుకంటే, ఒక ప్రాంత సాహిత్యాన్ని అర్థం చేసుకోవాలంటే ఆ ప్రాంత వనరులు, ఉత్పత్తులు, ప్రజా జీవన విధానం అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. అప్పుడే ఆ ప్రాంత సాహిత్యం బాగా అవగాహన చేసుకోగలం.

రెండవ అధ్యాయం ***'ప్రపంచ సాహిత్యంలో నవల, కథానికల ప్రారంభం'***లో కల్పనా సాహిత్యం అంటే ఏంటి? కల్పనా సాహిత్యం కింద ఏయే ప్రక్రియలు వస్తాయి? అనే అంశాలను పరిచయం చేశాను. అలాగే కల్పనా సాహిత్యాన్ని గురించి పలువురి అభిప్రాయాలను, ప్రపంచ నవల, కథానికల ఆవిర్భావాలన్ని, అందుకు గల నేపథ్యాన్ని స్థూలంగా వివరించాను. అంతేకాక ప్రపంచంలోని వివిధ భాషల్లో మొదటి నవల, మొదటి కథానిక ఎప్పుడు ప్రారంభమైంది, అది ఏది? అనే అంశాలను, పాశ్చాత్య ప్రభావంతో భారతదేశంలోకి ప్రవేశించిన నవల, కథానికల పుట్టుక ఎప్పుడు ప్రారంభం అయ్యింది అనే అంశాలను, భారతదేశంలోని వివిధ భాషల్లో మొదటి నవల, కథానిక ఏది? అన్న విషయాలను, తెలుగులో నవల, కథానికలు ఎప్పుడు ఎలా మొదలయ్యింది, ఏది మొదటి నవల, ఏది మొదటి కథానిక అనే విషయంలో గల భిన్నాభిప్రాయాలను పేర్కొన్నాను.

మూడవ అధ్యాయం ***'చిత్తూరు జిల్లా రచయితలు (నవల, కథానిక) – జీవన రేఖలు'***లో కె. సభా కంటే ముందు ఉన్న రచయితలతో(సి.యస్. నీలకంఠయ్యర్, పూతలపట్టు శ్రీరాములు రెడ్డి, టి.కె. రంగస్వామి అయ్యంగార్, రావూరు చంగనార్య, టి. ఆర్యోగంపిళ్ళై) మొదలు పెట్టి 94 మంది రచయితలను, రచయిత్రులను స్థూలంగా పరిచయం చేయడం జరిగింది. అలాగే ఈ 94 మందే కాకుండా అప్పుడప్పుడు మాత్రమే కథలు రాసి, పెద్దగా గుర్తింపు రాని వారు, ఇప్పుడిప్పుడే కథారచన చేపట్టిన వారు, ఇతర జిల్లాల నుండి వచ్చి ఇక్కడ స్థిరపడి నవలా, కథా రచన చేపట్టిన వారు అంటూ మధురాంతకం రాజారాం **(చిత్తూరు జిల్లా సాహిత్య చరిత్ర)**, పేరూరు

బాలసుబ్రమణ్యం **(చిత్తూరు కథ)**, **చిత్తూరు జిల్లా శతాబ్ది సాహిత్య ఉత్సవాలు ప్రత్యేక సంచిక**, టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి **(చిత్తూరు జిల్లా వందేళ్ళ కథా సారధులు)** ప్రస్తావించిన మరి కొంత మంది రచయితల పేర్లను కూడా ఈ అధ్యాయంలో పేర్కొన్నాను.

నాల్గవ అధ్యాయం ***'చిత్తూరు జిల్లా నవలా సాహిత్యం – వస్తు వైవిధ్యం'***లో చిత్తూరు జిల్లా నవల పట్ల పూర్వ పరిశోధకుల, విమర్శకుల అభిప్రాయాలను మొదట తెలియజేశాను. ఆ తర్వాత, చిత్తూరు జిల్లా రచయితలు రాసిన నవలలను 1920 నుండి 1950 వరకు, 1950 నుండి 1975వరకు అని రెండు ప్రధాన ఉపశీర్షికలుగా విభజించి ఆయా కాలాల్లో వచ్చిన నవలల్లో గల వస్తు వైవిధ్యతలను చారిత్రక నవలలు, సాంఘిక నవలలు (సంఘ సంస్కరణ నవలలు, వెట్టి చాకిరీని చిత్రించిన నవలలు, అస్తిత్వ ప్రభావం కలిగిన నవలలు, కరువును చిత్రించిన నవలలు, హాస్య వ్యంగ్య నవలలు, ఇతరాలు)గా వింగడించి విశ్లేషించాను.

పై 17 నవలల్లో దేశాభిమానాన్ని కలుగజేస్తూ, స్వేచ్ఛా స్వాతంత్ర్యేచ్ఛలను రేకెత్తింస్తూ, చరిత్రను సంస్కృతిని తెలియజేస్తూ చాందసుల్తానా, తానీషా, రామానుజుని ప్రతిజ్ఞ, ఓరుగల్లు పునరాక్రమణ అనే నాలుగు చారిత్రక నవలలు; సంఘసంస్కరణ దృక్పథంతో సమాజంలోని సాంఘిక దురాచారాలైన బాల్య వివాహ వ్యవస్థ పట్ల, స్త్రీల అసమానతల పట్ల, వరశుల్క/ కన్యాశుల్క సమస్యల పట్ల, మద్యపాన అవస్థలు, శకునాలు, సముద్రయానంపై హిందువులకుగల విశ్వాసాల పట్ల, వేశ్యావృత్తి పట్ల, వెట్టి చాకిరీ పట్ల వ్యతిరేకలను, ఉచితానుచితాలను తెలియజేస్తూ, వితంతు వివాహ అభిలాషను తెలుపుతూ రత్నాబాయి, భానుమతి, మోహన, భిక్షుకి వంటి నాలుగు నవలలు; అస్తిత్వవాద దృక్పథాన్ని తెలియజేస్తూ అనుబంధాలు, మళ్ళీ వసంతం, అసురసంధ్య వంటి మూడు నవలలు; రాయలసీమలో దాపురించిన భయంకర కరువును చిత్రిస్తూ మొగిలి నవల; సమాజంలో జరుగుతున్న అన్యాయాలను వ్యంగ్యంగా ఎత్తిపోడుస్తూ, స్త్రీల పెత్తన్నాన్ని ఎత్తి చూపుతూ చిన్న ప్రపంచం సిరివాడ, గాడిద బ్రతుకులు అనే రెండు నవలలు; డబ్బు మీద అత్యాశగల మధ్యతరగతి జీవితాన్ని తెలియజేస్తూ త్రిశంకుడి స్వర్గం అనే నవల; జీవితంలో మనిషికి ఎదురయ్యే ఉత్తాన పతన్నాలకు, తనకు తను చేసుకొనే కొన్ని పొరపాట్లకు బలైపోయే జీవితాలను, నిజాయితీగల వ్యక్తిత్వాలను తెలియజేస్తూ ఇంద్రధనుస్సు, దూరతీరాలు అనే రెండు నవలలు ఉన్నాయి. వీటన్నింటినీ ఈ అధ్యాయంలో సోదాహరణంగా వివరించాను.

ఐదవ అధ్యాయం ***'చిత్తూరు జిల్లా కథా సాహిత్యం – వస్తు వైవిధ్యం'***లో చిత్తూరు జిల్లా కథ పట్ల పూర్వ పరిశోధకుల, విమర్శకుల అభిప్రాయాలను మొదట తెలియజేశాను. ఆ తర్వాత, చిత్తూరు జిల్లా రచయితలు రాసిన కథలను 1920 నుండి 1950 వరకు, 1950 నుండి 1975వరకు అనే ప్రధాన శీర్షికల కింద విశ్లేషించాను.

మూఢవిశ్వాసాలకుకు సంబంధించిన కథలు, సామాజిక రుగ్మతలకు సంబంధించిన కథలు, కుటుంబ సంబంధ/ అనుబంధాలకు సంబంధించిన కథలు, స్త్రీ సమస్యలకు సంబంధించిన కథలు, ప్రేమకు సంబంధ కథలు, వివాహ సంబంధ కథలు, ఉపాధ్యాయ/ ఇతర

ఉద్యోగ సంబంధ కథలు, రచయితలకు సంబంధించిన కథలు, వ్యవసాయ, కరువు సంబంధ కథలు, ఆర్థిక సంబంధ కథలు, రాజకీయ సంబంధ కథలు, ఇతరాలకు సంబంధించిన కథలుగా ఇలా అనేక రకాలుగా వింగడించి విశ్లేషించడం జరిగింది. అలాగే ఈ అధ్యాయం చివర్లో చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యంలో (నవల, కథ) వచ్చిన వస్తుపరిణామం ఏవిధంగా జరిగిందో స్థూలంగా వివరించాను.

ఆరవ అధ్యాయం ***'చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యం – రూప (శిల్ప) వైవిధ్యం'***లో చిత్తూరు జిల్లా రచయితలు (నవల, కథానిక) వారి వారి రచనల్లో పాటించిన శిల్ప నైపుణ్యాలను అంటే శీర్షిక మొదలు ఎత్తుగడ, పాత్ర చిత్రణలో, కథాకథనం (దృష్టి కోణం), భాష, శైలీ వంటి అంశాలల్లో వారు కనబరిచిన వైవిధ్యాలను పరిశీలించడం జరిగింది. అలాగే చిత్తూరు జిల్లా నవలల్లో కథల్లో సామెతలను, మాండలిక పదాలను, అన్యదేశ పదాలను, ద్వాన్యనుకరణ పదాలను, జంట పదాలను ఎంత వరకూ ప్రయోగించారో వివరించాను. అలాగే చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యంలో శిల్పపరిణామం ఏవిధంగా జరిగిందో స్థూలంగా పేర్కొంటూ ముఖ్యంగా శైలి విషయాన్ని చర్చించాను.

చిత్తూరు జిల్లా నవలా సాహిత్యాన్ని పరిశీలిస్తే 1950కి ముందు వచ్చిన ఆరు నవలల్లో ఒక్క 'భిక్షుకి' నవల తప్పనిచ్చి మిగిలిన నవలల్లో సరళ గ్రాంథిక శైలి కనిపిస్తుంది. వీటిల్లో అక్కడక్కడా గ్రాంథిక శైలి కూడా చూడవచ్చు. నవల పూర్తిగా వచన సాహిత్య ప్రక్రియ అయినప్పటికీ ప్రారంభదినాల్లో పద్య సాహిత్య వాసనలు పూర్తిగా పోగొట్టుకోలేక ఆయా రచయితలు అక్కడక్కడా సందర్భానుసారంగా పద్యాలు కూడా రాశారు. ఈ విధమైన శైలిని ఎక్కువగా తానీషా, రత్నాబాయి, మోహన వంటి నవలల్లో చూడవచ్చు. అలాగే 1950 తర్వాత వచ్చిన అనుబంధాలు, మళ్లీ వసంతం, మొగిలి, ఇంద్రధనస్సు, దూరతీరాలు, అసురసంధ్య, త్రిశంకుడి స్వర్గం, చిన్న ప్రపంచం సిరివాడ, గాడిద బ్రతుకులు, రామానుజుని ప్రతిజ్ఞ, ఓరుగల్లు పునరాక్రమణ, వంటి నవలలన్నీ సరళ శైలిలో నడిచిన నవలలే. అలాగే కథా విషయంలో కూడా 1950కి ముందు వచ్చిన కథల్లో గ్రాంథిక శైలి ఆతర్వాత వచ్చిన కథల్లో సరలసైలిని చూడవచ్చు. ఈ అంశాలనన్నింటినీ ఈ అధ్యాయంలో సోదాహరణంగా వివరించాను.

8. **అనుబంధాలు** (Annexures)

ఈ పరిశోధన గ్రంథం చివర్లో ఐదు అనుబంధాలను జతపరిచాను.

మొదటి అనుబంధంలో చిత్తూరు జిల్లా నవలా సాహిత్యానికి సంబంధించిన నవలలు ఇక్కడ పట్టిక రూపంలో పొందుపరిచాను. నా పరిశోధనాంశ పరిధిలోకి సంబంధించిన నవలలే కాకుండా ఇప్పటి వరకూ వచ్చిన రచనలన్నింటినీ, అలాగే ఇప్పటి వరకూ సాహిత్య చరిత్రకారుల దృష్టిలోకిరాని, విమర్శకుల దృష్టిలోపడని రచనలను కూడా ఇందులో పొందుపరిచాను.

రెండవ అనుబంధంలో చిత్తూరు జిల్లా కథా సాహిత్యానికి సంబంధించిన రచనలను ఇక్కడ పట్టిక రూపంలో పొందుపరిచాను. నా పరిశోధనాంశ పరిధిలోకి సంబంధించిన కథలే

కాకుండా ఇప్పటి వరకూ వచ్చిన రచనలన్నింటినీ, అలాగే ఇప్పటి వరకూ సాహిత్య చరిత్రకారుల దృష్టిలోకిరాని, విమర్శకుల దృష్టిలోపడని రచనలను కూడా ఇందులో పొందుపరిచాను.

మూడవ అనుబంధంలో పరిశోధన కాలంలో నేను వివిధ అంతర్జాతీయ, జాతీయ సదస్సులు, వెబినార్లల్లో పాల్గొని వివిధ అంశాలపై పత్రాలను సమర్పించాను. వాటికి సంబంధించిన సర్టిఫికెట్స్ ను పొందుపరిచాను.

నాల్గవ అనుబంధంలో పరిశోధన కాలంలో నేను వివిధ అంతర్జాతీయ, జాతీయ సదస్సులు, వెబినార్లల్లో పాల్గొని వివిధ అంశాలపై పత్రాలను సమర్పించాను. వాటి వివరాలను ఇక్కడ పొందుపరిచాను. అలాగే నేను రాసిన వ్యాసాలు కొన్ని పత్రికల్లో, పుస్తకాల్లో ప్రచురితమవడం జరిగింది. వాటి వివరాలను ఇక్కడ పొందుపరిచాను.

1. భావవీణ (కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక. మార్చ్, 2022) 'చిత్తూరు జిల్లా తొలితరం కథలు – వస్తు విశ్లేషణ' పుటలు: 6–10.
2. 'తెలుగు కథ సమకాలీనత' అనే అంశంపై శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల(కరీంనగర్), మద్రాసు విశ్వవిద్యాలయం (చెన్నై) సంయుక్త ఆధ్వర్యంలో 2, 3, జూలై, 2021న నిర్వహించిన అంతర్జాతీయ అంతర్జాల సదస్సులో ''విషప్పురుగు' కథలు – గిరిజన, సంచార తెగల జీవన చిత్రణ'పై పత్రం సమర్పించాను.
3. పచ్చగా నూరేళ్లు' నవల – వ్యవసాయ వృత్తి సమస్యల చిత్రణ – తెలుగు నవల భారతీయ వృత్తిజీవిత ప్రతిఫలనం
4. 'తెలుగు సాహిత్యం – సమకాలీనత' అనే అంశంపై వి.ఎస్.ఆర్.& ఎన్.వి.ఆర్. కళాశాల (తెనాలి) 24, 25, ఆగష్టు, 2020న నిర్వహించిన అంతర్జాతీయ అంతర్జాల సదస్సు (వెబినార్)లో 'మీడియా వలలో పడ్డ యువతరం భవిష్యత్తుకు నిలువుటద్దం 'ప్రలోభం' నవల' పై పత్రం సమర్పించాను.
5. సీమ సంతకం (తుమ్మల రామకృష్ణ 60 వసంతాల ప్రత్యేక సంచిక)లో 'తాను మాత్రమే రాయగలిగిన కథలు...' పుటలు: 54–58.

మూడవ అనుబంధంలో నేను, కథా సాహిత్యంపై పరిశోధన చేస్తున్న నేపథ్యంలో కథా నిర్మాణాన్ని, నా అవగాహనని పరీక్షించుకోవడంకోసం ఒక కథ (ఇరవై ఏళ్ల కల) రాశాను. దాన్ని ప్రస్థావన పత్రికకు పంపించాను. వాళ్ళు సంచికలో ప్రచురించారు. అంతే కాకుండా దానికి బహుమతిగా పారితోషకాన్ని కూడా ఇచ్చారు. ఆ కథను ఇక్కడ జతపరిచాను.

9. **పరిశోధన లక్ష్యం – ప్రయోజనాలు** (Research Objects - Results)

- ఈ పరిశోధన ద్వారా చిత్తూరు జిల్లాలో ఉన్న నవలా రచయితలను, కథా రచయితలను గుర్తించడం ప్రధాన లక్ష్యం.
- చిత్తూరు జిల్లాలో ఉన్న నవల, కథ రచయితలు ఈ ప్రక్రియలలోని సాహిత్యాన్ని రాయడానికి గల కారణాలను అన్వేషించడం.

- జిల్లాలోని రచయితలు ఈ ప్రాంతానికి చెందిన సాంస్కృతిక జీవనానికి ఇచ్చిన ప్రాధాన్యాన్ని దాని ప్రత్యేకతను గుర్తించడం.
- ఈ ప్రాంతంలో ఉన్న రచయితలు ఏ భావజాలాలతో తమ రచనలను కొనసాగించారో విశ్లేషించడం.
- ఈ ప్రాంతంలో రచయితలు తీసుకున్న వస్తువులు కేవలం ఈ ప్రాంతానికే పరిమితమైనవా లేక ఇతర ప్రాంతాల వారి జీవనాన్ని కూడా ప్రతిపాదిస్తున్నాయా అనేది పరిశీలించడం.
- ఈ ప్రాంతానికి చెందిన రచయితలు తమ రచనల ద్వారా వివిధ సమస్యలను పరిష్కరించడానికి చేసిన కృషిని సమీక్షించడం.
- ఈ ప్రాంతానికి చెందిన రచయితలకు ఈ ప్రాంతంలో లభించిన గుర్తింపు ఇతర ప్రాంతాలలో వచ్చిన గుర్తింపును గుర్తించడం.

10. **ఫలితాంశాలు** (Research Results)

- చిత్తూరు జిల్లా నుండి 50 మంది నవలా రచయితులను, 120 మంది కథా రచయితలను నా పరిశోధనలో గుర్తించాను.
- రాయలసీమకు ఒక ప్రత్యేకమైన భౌగోళిక పరిస్థితులు ఉన్నాయి. అందులో చిత్తూరు జిల్లా ఒక భాగం. కనుక, ఇక్కడి నుండి వచ్చిన నవలాసాహిత్యంలో, కథా సాహిత్యంలో, ఆ ప్రాంత పరిస్థితులను, అక్కడి వాతావరణాన్ని, అక్కడ సామాజిక సాంస్కృతిక జీవన విధానాన్ని వాస్తవిక దృష్టితో చిత్రించారనే విషయం తెలుస్తోంది.
- 1950 కి ముందు వచ్చిన చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యంలో సంఘసంస్కణ దృష్టి, దేశాభిమానం ఎక్కువగా కనిపిస్తుంది.
- 1950 తర్వాత వచ్చిన కల్పనా సాహిత్యాన్ని అధ్యయం చేసిన తర్వాత ఆ సాహిత్యమంతా ఎక్కువగా మధ్యతరగతి మానవుడి జీవితాల చుట్టూ అలముకున్న దుర్భర పరిస్థితులను ప్రధానంగా చేసుకొని వచ్చినట్లుగా తెలుస్తుంది.
- కె. సభా 1948లో రాసిన భిక్షుకి నవల నేడు అలభ్య రచనల జాబితాలోకి చేరిపోయింది. అయితే, ఆ నవల ప్రస్తుతం నాకు లభించింది. ఈ నవలలో వెట్టిచాకిరీ విధానం ప్రధాన విషయం. షావుకారుల దురాగతాలకు నిదర్శనంగా వెట్టిచాకిరీ విధానానికి బలైపోయిన ఒక అబల జీవితం ఇందులో ప్రధానాంశం. ఈ నవలను అధ్యాయం చేయడం ద్వారా రాయలసీమ పరిస్థితులు, భూస్వాముల దౌర్జన్యాలు, షావుకారుల దురాగతాలు ఎలా ఉంటాయో తెలుస్తుంది.
- ఈ ప్రాంతం నుండి వచ్చిన సాహిత్యం కేవలం ఈ ప్రాంత జీవితాన్ని లేదా సమస్యలను చిత్రించడమే కాకుండా ప్రాపంచిక దృక్పథంతో వివిధ ప్రాంతాలకు చెందిన సమస్యలను కూడా వస్తువులుగా తీసుకొని రచనలు చేశారు.

- చిత్తూరు జిల్లాలో కనబడే ప్రధాన సమస్య: నీటి సమస్య తద్వారా వ్యాపించే కరువు సమస్యలు (రాయలసీమలో మొత్తంగా కూడా) వీటిని ప్రధానంగా చేసుకొని రాసిన రచనలు ఉన్నాయని తెలుస్తుంది.
- బూదురు రామానుజుల రెడ్డి 1931లో రాసిన మోహన అనే నవల నా పరిశోధనలో కొత్తగా లభించింది. ఈ నవలను అధ్యయనం చేయడం ద్వారా వేశ్యా ప్రవృత్తి సమాజ పురోభివృద్ధికి ఎంత ప్రతిబంధకమో తెలుస్తుంది.
- చిత్తూరు జిల్లా కథ సాహిత్యని(1975) అధ్యయనం చేసిన తర్వాత ఈ ప్రాంతం నుండి ఎక్కువగా కుటుంబ, ఉద్యోగుల సమస్యలను వారికి సంబంధించిన ఆర్థిక సమస్యలను ప్రధానంగా చేసుకొని వచ్చిన కథలే ఎక్కువగా ఉన్నాయని తెలుస్తోంది.
- చిత్తూరు జిల్లా నవలా సాహిత్యంలో నాలుగు చారిత్రక నవలలు వచ్చాయని విషయం తెలుస్తుంది. వాటిల్లో ఓరుగల్లు పునరాక్రమణ (పి రాజగోపాల నాయుడు) అనే నవలలను 1973 లో ఆంధ్రప్రదేశ్ మాస పత్రికలో అచ్చేయ్యింది. అయితే ఈ నవల ఉన్నట్లు పూర్వ పరిశోధనలో ఎక్కడ నేను గమనించలేదు.
- చిత్తూరు జిల్లాకు చెందిన కథా రచయితగా గుర్తింపు పొందని, కథా విమర్శకుల దృష్టిలో పడని కె.ఆర్ రెడ్డి అనే కథ రచయిత ఉన్నాడని నా పరిశోధనలో వెల్లడయింది. ఈయన 1967లో 'ఆభలలు అనుమానాలు' అనే ఒక సంకలనాన్ని ప్రచురించారు. ఇందులో 12 కథలు ఉన్నాయి. ఈ కథలన్నీ కూడా స్త్రీ సమస్యలను ప్రధానంగా చేసుకొని రాసినవి అని నా పరిశోధనలో గుర్తించాను.

➢ **నా ఈ పరిశోధనలో కొత్తగా సేకరించిన కథలు నవలు**

1. యం. వి. పాపన్న గుప్త 'సావిత్రి' కథ. మార్చి 1928 భారత కథానిధి
2. కాసారం కుప్పుస్వామి 'బ్రతుకు బరువు' కథ. డిసెంబర్ 1958 భారతి పత్రిక
3. కె.ఆర్. రెడ్డి అమలలు అనుమానాలు కథాసంపుటి (1967)
4. పి రాజగోపాల నాయుడు ఓరుగల్లు పునరాక్రమణ నవల (1972 – 73 ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక)
5. బూదూరు రామానుజుల రెడ్డి 'మోహన' నవల (1931)

విషయసూచిక

కృతజ్ఞతలు **vi**

ప్రవేశిక **viii**

1. పరిశోధనాంశం పరిచయం (Introduction)
2. పరిశోధన ఆవశ్యకత (Necessity of the Research)
3. పరిశోధన పరిధి (Scope of Research)
4. పూర్వ పరిశోధనలు (Previous Research)
5. క్షేత్ర పర్యటన/ గ్రంథ సేకరణ (Field-Work/ Book collection)
6. పరిశోధన ఆకరాలు (Research Source)
7. పరిశోధన గ్రంథ రచనా పద్ధతి (Method of Research)
8. అనుబంధాలు (Annexures)
9. పరిశోధన లక్ష్యం – ప్రయోజనాలు(Research Objects – Results)
10. ఫలితాంశాలు (Research Results)

మొదటి అధ్యాయం

చిత్తూరు జిల్లా భౌగోళిక పరిస్థితులు (1-23)

1.1. చిత్తూరు జిల్లా ఏర్పడిన విధానం: 1

1.2. చిత్తూరు జిల్లా భౌగోళిక పరిస్థితులు: 2

1.2.1. పర్వతాలు: 2

1.2.2. శతోష్ణస్థితి: 2

1.2.3. వర్షపాతం: 2

1.2.4. నదులు: 3

1.2.5. అడవులు: 3

1.2.6. వ్యవసాయం: 3

1.2.7. ఖనిజ సంపద: 4

1.2.8. పుణ్య క్షేత్రాలు: 4

1.3. చిత్తూరు జిల్లాలోని శాసనాలు: 4

1.4. చిత్తూరు జిల్లా చరిత్ర: 5

1.4.1. చిత్తూరు జిల్లాను పాలించిన రాజ వంశాలు: 5

1.4.1.1. మౌర్యులు: 5

1.4.1.2. శాతవాహనులు: 6

1.4.1.3. పల్లవులు: 6

1.4.1.4. రేనాటి చోళులు: 6
1.4.1.5. వైదుంబులు: 7
1.4.1.6. బాణులు: 7
1.4.1.7. పశ్చిమ గాంగులు: 7
1.4.1.8. తంజావూరు చోళులు: 7
1.4.1.9. చోళులకు సామంతులుగా చిత్తూరును పాలించిన రాజవంశాలు: 8
1.4.10. విజయనగర రాజులు: 8
1.4.2. చిత్తూరు జిల్లా – ముస్లింల పాలన: 9
1.4.3. చిత్తూరు జిల్లా – ఆంగ్లేయుల పాలన: 10
1.5. చిత్తూరు జిల్లాలో జరిగిన ఉద్యమాలు: 11
1.5.1. సంఘ సంస్కరణోద్యమం: 11
1.5.2. జాతీయోద్యమం: 12
1.5.3. రైతు ఉద్యమం: 14
1.5.4. గ్రంథాలయోద్యమం: 15
1.6. చిత్తూరు జిల్లా సాంఘిక సాంస్కృతిక నేపథ్యాలు: 15
1.6.1. మతం: 15
1.6.1.1. హిందూ మతం: 15
1.6.1.2. జైన మతం: 16
1.6.1.3. ఇస్లాం మతం: 16
1.6.1.4. క్రైస్తవ మతం: 16
1.6.2. దేవాలయాలు: 17
1.6.2.1. గుడిమల్లం పరశురామేశ్వరాలయం: 18
1.6.2.2. తిరుమల – శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం: 18
1.6.2.3. శ్రీకాళహస్తి: 19
1.6.2.4. కాణిపాకం: 19
1.6.3. పర్యాటక ప్రాంతాలు: 20
1.6.4. జాతరలు – ఉత్సవాలు – పండుగలు: 22

అధ్యాయం – 2

ప్రపంచం సాహిత్యంలో నవల, కథానికల ఆవిర్భావం (24-63)

2.0. కల్పనా సాహిత్యం – పరిచయం: 24

2.1. ప్రపంచ నవలా సాహిత్యం – పుట్టుక – నేపథ్యం: 27
2.1.1. నేపథ్యం: 28
2.1.2. ప్రపంచంలోని వివిధ భాషల్లో (దేశాలల్లో) నవల – పుట్టుక: 30
2.1.2.1. వర్తమాన నవలకు పూర్వరూపాలైన రచనలు: 30
2.1.2.2. ఇంగ్లాండ్ దేశంలో మొదటి నవల: 32
2.1.2.3. ఫ్రెంచ్ దేశంలో మొదటి నవల: 33
2.1.2.4. స్పెయిన్ దేశంలో మొదటి నవల: 34
2.1.2.5. జర్మన్ దేశంలో మొదటి నవల: 34
2.1.2.6. రష్యా దేశంలో మొదటి నవల: 34
2.1.2.7. అమెరికా దేశంలో మొదటి నవల: 34
2.1.2.8. జపాన్ దేశంలో మొదటి నవల: 34
2.1.3. భారతీయ భాషల్లో నవల ప్రవేశం – నేపథ్యం: 35
2.1.4. వివిధ భారతీయ భాషలలో మొదటి నవలలు: 36
2.1.4.1. బెంగాలీ నవల (1856) : 36
2.1.4.2. మరాఠీ నవల (1857) : 37
2.1.4.3. గుజరాతీ నవల (1866) : 37
2.1.4.4. ఉర్దూ నవల (1869) : 37
2.1.4.5. తెలుగు నవల (1872) : 37
2.1.4.6. తమిళ నవల (1879) : 37
2.1.4.7. మలయాళీ నవల (1889) : 37
2.1.4.8. అస్సామీ నవల (1890) : 38
2.1.4.9. ఒరియా నవల (1891) : 38
2.1.4.10. పంజాబీ నవల (1897) : 38
2.1.4.11. కన్నడ నవల (1915) : 38
2.1.4.12. నేపాలీ నవల (1934) : 39
2.1.4.13. రాజస్థానీ నవల (1952) : 39
2.1.5. తెలుగులో నవల పుట్టుక – నేపథ్యం: 39
2.1.6. తెలుగులో మొదటి నవల – భిన్నాభిప్రాయాలు: 40
2.1.6.1. తొలి తెలుగు నవల – కళాపూర్ణోదయము ?: 41
2.1.6.2. తొలి తెలుగు నవల – మహాశ్వేత?: 42
2.1.6.3. తొలి తెలుగు నవల – శ్రీ రంగరాజ చరిత్ర?: 43
2.1.6.3.1. కొత్తపల్లివీరభద్రరావు – తెలుగు సాహిత్యంపై ఇంగ్లీషు ప్రభావము(1956): 44

2.1.6.3.2. బి.వి. కుటుంబరావు – ఆంధ్ర నవలా పరిణామము (1963): 44
2.1.6.3.3. మొదలి నాగభూషణశర్మ – తెలుగు నవలా వికాసం (1971): 45
2.1.6.3.4. అక్కిరాజు రమాపతిరావు – తెలుగు నవల (1975): 45
2.1.6.3.5. కోడూరి శ్రీరామమూర్తి – తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ(1979): 46
2.1.6.3.6. ఎ.బి. సాయిప్రసాద్ – దక్షణాది భాషల్లో తొలి నవల(వ్యాసం).(ఏప్రిల్1979): 46
2.1.6.4. తొలి తెలుగు నవల – రాజశేఖర చరిత్ర: 47
2.1.6.4.1. పుల్లాబొట్ల వెంకటేశ్వర్లు – తెలుగు నవలా సాహిత్య వికాసము(1974): 47
2.1.6.4.2. వల్లంపాటి వెంకటసుబ్బయ్య – నవలా శిల్పం (1989);రాయలసీమలో ఆధునిక సాహిత్యం సామాజిక సాంస్కృతిక విశ్లేషణ (2006): 48
2.1.6.4.3. డి. విద్యేశ్వరి – భారతీయ భాషల్లో నవలా ప్రక్రియ (1998): 49
2.2. ప్రపంచ కథా (కథానిక) సాహిత్యం – పుట్టుక – నేపథ్యం: 49
2.2.1. నేపథ్యం: 50
2.2.2. ప్రపంచ కథా సాహిత్యం – మొదటి కథ: 52
2.2.3. భారతీయ కథానిక ఆవిర్భావం – నేపథం: 53
2.2.4. వివిధ భారతీయ భాషలలో కథానిక ఆవిర్భావం: 53
2.2.4.1. బెంగాలీ కథానిక: 53
2.2.4.2. తెలుగు కథానిక: 53
2.2.4.3. మలయాళ కథానిక: 54
2.2.4.4. ఒరియా కథానిక: 54
2.2.4.5. మరాఠీకథానిక: 54
2.2.4.6. గుజరాతీ కథానిక: 54
2.2.4.7. కన్నడ కథానిక: 55
2.2.4.8. ఉర్దూ కథానిక: 55
2.2.4.10. హిందీ కథానిక: 55
2.2.4.11. తమిళ కథానిక: 55
2.2.5. తెలుగులో తొలి కథానిక భిన్నాభిప్రాయాలు: 56
2.2.5.1. తెలుగులో తొలి కథానిక – పాత చర్చ: 56
2.2.5.1.1 పొరకి దక్షిణామూర్తి: 56
2.2.5.1.2. పెద్దిబొట్ల సుబ్బరామయ్య: 57
2.2.5.1.3. అక్కిరాజు రమాపతిరావు: 57
2.2.5.1.4. వల్లంపాటి వెంకటసుబ్బయ్య: 57
2.2.5.1.5. మధురాంతకం రాజారాం, సింగమనేని నారాయణ: 57

2.2.5.1.6. పోలాప్రగడ సత్యనారాయణమూర్తి: 57
2.2.5.1.7. సత్యవతి: 58
2.2.5.1.8. కర్రి భార్గవీరావు: 58
2.2.5.1.9. కె. కె. రంగానాథాచార్యులు: 58
2.2.5.1.10. పురిపండ అప్పలస్వామి: 59
2.2.5.1.11. ఆరుద్ర: 59
2.2.5.1.12. ముదిగంటి సుజాతారెడ్డి: 59
2.2.5.2. తెలుగులో తొలి కథానిక – కొత్త చర్చ: 60
2.2.5.2.1. వివినమూర్తి – దిద్దుబాటలు (2015) : 60

అధ్యాయం –3

చిత్తూరు జిల్లా రచయితలు (నవల, కథానిక) – జీవన రేఖలు (64-114)

3.0. పరిచయం: 64
3.1. పూతలపట్టు శ్రీరాములు రెడ్డి (1892): 65
3.2. యం.వి. పాపన్న గుప్త (1905–1986) :(చిత్తూరు జిల్లా తొలి కథానికా రచయిత):66
3.3. దూబగుంట వెంకట రమణయ్య: (చిత్తూరు జిల్లా మొదటి నవలా రచయిత): 67
3.4. బూదూరు రామానుజుల రెడ్డి: 67
3.5. పెరుమల రామాచౌదరి: 68
3.6. టి. ఆరోగ్యం పిళ్ళై: 68
3.7. టి. కె. రంగస్వామి అయ్యంగార్: 68
3.8. రావూరి చంగనార్య: 68
3.9. సి. యస్. నీలకంఠయ్యర్: 68
3.10. పాటూరి రాజగోపాలనాయుడు (1920 – 1997): 68
3.11. కె. సభా (కనక సభాపతి పిళ్ళై) (1923 – 1980): 69
3.12. సీకల వేణుగోపాలరెడ్డి (సి. వేణు, చిత్రభాను) (1926): 71
3.13. ఆర్. ఎస్. సుదర్శనం (రాచకొండ సుబ్బయ్య సుదర్శనం)(1927 –2001): 71
3.14. అవిలేలి వెంకటరామారెడ్డి (1927): 72
3.15. ఎం.ఆర్ చంద్ర (1928): 73
3.16. ఇరువారం లోకనాథం (1928): 73
3.17. మధురాంతకం రాజారాం (1930 – 1999): 74
3.18. పులికంటి కృష్ణారెడ్డి (1931 – 2007): 75
3.19. కె. ఆర్. రెడ్డి (కె. రామిరెడ్డి) (1932): 76

3.20. శ్రీనివాసపురం రామాచార్యులు (1935): 77
3.21. కె. రామకృష్ణ నాయుడు (1935): 77
3.22. వల్లంపాటి వెంకటసుబ్బయ్య (1937–2007): 78
3.23. కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళై (1936 – 2016): 79
3.24. మన్నవ భాస్కరనాయుడు (1936): 79
3.25. కాణిపాకం లింగన్న (1936): 80
3.26. శింగు మునిసుందరం (1937 – 2015): 80
3.27. కాశీనాథ విశ్వం (1938): 81
3.28. సనగరం పార్థసారథి (1939): 81
3.29. కట్టమంచి బాలకృష్ణారెడ్డి (1939): 82
3.30. కలువకొలను సదానంద (1939): 82
3.31. నూతలపాటి గంగాధరం (1939 – 1975): 83
3.32. లంకిపల్లె కన్నయ్య నాయుడు (1940): 84
3.33. కలువకుంట్ల గురునాథ పిళ్ళై (1940): 84
3.34. కరణం శేషపిళ్ళై (1941): 85
3.35. వక్కంతం సూర్యనారాయణరావు (1942): 85
3.36. వేంపల్లి అబ్దుల్‌ఖాదర్ (1945): 86
3.37. పెనుమూరు కేశవరెడ్డి (1946 – 2015): 86
3.38. టి. ఎస్. ఎ. కృష్ణమూర్తి (తొడిమెల్ల కృష్ణమూర్తి) (1950): 87
3.39. వారాల కృష్ణమూర్తి (1950): 88
3.40. గార్లపాటి దామోదరనాయుడు (1951): 88
3.41. నాయుని కృష్ణమూర్తి (1951): 88
3.42. కె.ఎస్.వి నరసింహం (కేఎస్వీ) (1952): 90
3.43. సయ్యద్ జాఫర్ (1953): 90
3.44. వీరపల్లె వీణావాణి (వి. ఆంజనేయులు నాయుడు) (1955 – 2010): 90
3.45. కె.ఎస్ రమణ (1956): 91
3.46. చిత్తారి శైలకుమార్ (1956): 91
3.47. తుమ్మల రామకృష్ణ (1957): 92
3.48. వి. ఆర్. రాసాని (రాసాని వెంకట్రామయ్య) (1957): 93
3.49. మధురాంతకం నరేంద్ర (1957): 95
3.50. మేర్లపాక మురళి (1957): 96
3.51. కె.యం బాలరాజు (1958): 96

3.52. మధురాంతకం మహేంద్ర (1959 – 1998): 96
3.53. పేట శ్రీనివాసులురెడ్డి (పేటశ్రీ) (1959): 97
3.54. నామినిసుబ్రమణ్యం నాయుడు (1960): 98
3.55. ఓలేటి నరసింహులు గుప్త (1960): 98
3.56. గోపిని కరుణాకర్ (1966): 99
3.57. జిల్లేళ్ళ బాలాజీ (1966): 99
3.58. రాచపూటి రమేష్ (1967): 99
3.59. వుజ్జని రవినాయుడు (1967): 100
3.60. పేరూరు బాలసుబ్రమణ్యం (1971): 100
3.61. సుంకోజి దేవేంద్రాచారి (1974): 100
3.62. పలమనేరు బాలాజీ (1974): 101
3.63. నక్కల ప్రభాకరరెడ్డి (1977) : 101
3.64. కంపల్లె రవిచంద్రన్ (1979): 101
3.65. పురాణం త్యాగమూర్తి శర్మ: 102
3.66. టి. వెంకటసుబ్బారెడ్డి: 102
3.67. గార్ల అర్జున: 102
3.68. సొదా: 102
3.69. టేకుమళ్ళ కామేశ్వరరావు (1907): 102
3.70. జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి (1962) : 102
3.71. తిరుచినాపల్లి రమణారెడ్డి (మదనగోపాల రేవతి) (1953) : 104
3.72. మల్లెల గురవయ్య (1939) : 104
3.73. ముదిపర్తి కొండమాచార్యులు (1922) : 104
3.74. సి.హెచ్ వెంకటరత్నం (ద్వారకా) (1931): 105
3.75. సి. ఎన్. చంద్రశేఖర్ (1958) : 105
3.76. జోలెపాళెం మంగమ్మ (1925): 107
3.77. ఆర్. వసుంధరాదేవి (1931): 107
3.78. కానాల నాగాలక్ష్మమ్మ (1939): 107
3.79. జోలెపాళెం భాగ్యలక్ష్మి (1940): 108
3.80. దండాల మునిరెడ్డి ప్రేమావతి (1942): 108
3.81. తెనాలి సుశీలాదేవి (1945): 108
3.82. గల్లా అరుణ కుమారి (1945): 108
3.83. సి. ఉమాదేవి (1947): 109

3.84. లక్ష్మీ రాఘవ (1948): 109
3.85. ఎం.కె. దేవకి (1951): 110
3.86. పి. శైలజ (1958): 110
3.87. ఎం.ఆర్. అరుణకుమారి (1960): 110
3.88. పసుపులేటి గీత (1964): 110
3.89. శైలజామిత్ర (1966): 111
3.90. గండికోట వారిజ (1972): 111
3.91. గంజాం భ్రమరాంబ (1973): 111
3.92. డేగల అనితాసూరి (1974): 111
3.93. ఎండపల్లి భారతి (1981): 112
3.94. ఎ. పుష్పాంజలి: 112

అధ్యాయం – 4

చిత్తూరు జిల్లా నవలాసాహిత్యం – వస్తు వైవిధ్యం (115-187)

4.0. పరిచయం: 115
4.1. చిత్తూరు జిల్లా నవల – పూర్వ పరిశోధకుల, విమర్శకుల అభిప్రాయాలు: 115
4.2. చిత్తూరు జిల్లా నవల – వస్తు వైవిధ్యం: 118
4.2.1. 1920 నుండి 1950 వరకూ వచ్చిన చిత్తూరు జిల్లా నవలలు: 121
4.2.1.1.చారిత్రక నవలలు: 121
4.2.1.1.1. చాందసుల్తానా: 122
4.2.1.1.2. తానీషా: 126
4.2.1.2.సాంఘిక నవలలు: 128
4.2.1.2.1. సంఘ సంస్కరణ నవలలు: 129
4.2.1.2.1.1. రత్నాబాయి: 130
4.2.1.2.1.2. భానుమతి: 131
4.2.1.2.1.3. మోహన: 137
4.2.1.2.2. వెట్టి చాకిరీ సమస్యను చిత్రించిన నవలలు: 138
4.2.1.2.2.1. భిక్షుకి: 139
4.2.2. 1951 నుండి 1975 వరకూ వచ్చిన నవలలు: 143
4.2.2.1. సాంఘిక నవలలు: 143
4.2.2.1.1. అస్తిత్వ వాదప్రభావం కల నవలలు: 144
4.2.2.1.1.1. అనుబంధాలు: 145

4.2.2.1.1.2. మళ్ళీ వసంతం: 147
4.2.2.1.1.3. అసురసంధ్య 150
4.2.2.1.2. కరువును చిత్రించిన నవలలు: 152
4.2.2.1.2.1. మొగిలి: 154
4.2.2.1.3. హాస్య/వ్యంగ్య నవలలు: 156
4.2.2.1.3.1. చిన్న ప్రపంచం సిరివాడ: 158
4.2.2.1.3.2. గాడిద బ్రతుకులు: 163
4.2.2.1.4. ఇతరాలు: 168
4.2.2.1.4.1. ఇంద్రధనుస్సు: 168
4.2.2.1.4.2. దూరతీరాలు: 170
4.2.2.1.4.3. త్రిశంకుడి స్వర్గం: 172
4.2.2.2. చారిత్రక నవలలు: 176
4.2.2.2.1. రామానుజుని ప్రతిజ్ఞ: 176
4.2.2.2.2. ఓరుగల్లు పునరాక్రమణ: 181

అధ్యాయం – 5

చిత్తూరు జిల్లా కథాసాహిత్యం – వస్తు వైవిధ్యం (188-245)
5.0. పరిచయం: 188
5.1. చిత్తూరు జిల్లా కథానిక – పూర్వ పరిశోధకుల, విమర్శకుల అభిప్రాయాలు: 188
5.2. చిత్తూరు జిల్లా కథానిక – వస్తు వైవిధ్యం: 191
5.2. 1927 నుండి1950 వరకూ వచ్చిన చిత్తూరు జిల్లా కథానికలు: 191
5.2.1. మూఢవిశ్వాసాలకు సంబంధించిన కథలు: 191
5.2.1.1. శారద: 191
5.2.2. భోగపు మేళానికి సంబంధించిన కథలు: 193
5.2.2.1. భోగపు మేళములు: 193
5.2.3. స్త్రీ సమస్యలకు సంబంధించినకథలు: 194
5.2.3.1. నా చిట్టితల్లి: 194
5.2.4. ప్రేమకు సంబంధించిన కథలు: 195
5.2.4.1. సావిత్రి: 195
5.2.5. మద్యపాన సమస్యకు సంబంధించిన కథలు: 196
5.2.5.1. కల్లుముంత: 196

5.2.6. సావుకార్ల దురాగతాలకు/భూస్వామ్య వ్యవస్థకు సంబంధించిన కథలు: 197
5.2.6.1. కడగండ్లు: 197
5.2.6.2. అస్తిపంజరం నవ్వింది: 198
5.2.6.3. తొలి బలి: 198
5.2.7. రాజకీయ కథలు: 199
5.2.7.1. సమాధి: 199
5.2.8. ఆర్థిక సమస్యలకు సంబంధించిన కథలు: 200
5.2.8.1. హైమావతి: 200
5.2.9. మతం ముసుగులో జరిగే అన్యాయాన్ని ఎత్తి చూపే కథ: 200
5.2.9.1. పాపిచావు: 200
5.2.10. దేశభక్తి: 201
5.2.10.1. విప్లవాంగన: 201
5.2.12. ఇతరాలు: 201
5.2.12.1. వేయి రూపాయలు: 201
5.3. 1951 నుండి 1975 వరకూ వచ్చిన చిత్తూరు జిల్లా కథానికలు: 203
5.3.1. మూఢవిశ్వాసాలు: 203
5.3.1.1.పునర్జన్మ: 203
5.3.1.2. దెయ్యాల కనుమ: 203
5.3.1.3. వికృత వాణి: 204
5.3.2. సామాజిక రుగ్మతలకు సంబంధించిన కథలు: 205
5.3.2.1. ఏకాంతం (ధూమపానం): 205
5.3.2.2. ధర్మ హాని (ధూమపానం): 205
5.3.2.3. చక్రం (జూదం): 206
5.3.3. కుటుంబ సంబంధ కథలు/ అనుబందాలకు సంబంధించిన కథలు: 207
5.3.3.1.భార్యా భర్తలకు (దాంపత్య) సంబంధించిన కథలు: 207
5.3.3.1.1. సర్వీసు రిజిస్టరు: 207
5.3.3.1.2. పశ్చాత్తప్త చిత్తుడు: 207
5.3.3.1.3. వర్ష రాత్రి: 208
5.3.3.2. తల్లీ బిడ్డలకు సంబంధించిన కథలు: 209
5.3.3.2.1. అనుబంధాలు: 209
5.3.3.2.2. సూత్రధారి: 210
5.3.3.3. తండ్రీ కొడుకులకు సంబంధించిన కథలు: 210

5.3.3.3.1. మమకారం: 210
5.3.3.3.2. రంగయ్య స్వర్గం: 211
5.3.3.4. అవ్వ మనవడు సంబంధించిన కథలు: 211
5.3.3.4.1. ఏకాకి: 211
5.3.3.5. తాత మనవళ్ళకు సంబంధించిన కథలు: 211
5.3.3.5.1. సంకల్ప సిద్ధి: 211
5.3.3.6. అన్నా తమ్ముళ్లకు సంబంధించిన కథలు: 212
5.3.3.6.1. పుట్టగొడుగు: 212
5.3.3.6.2. మెత్తని పులి: 212
5.3.3.7. అక్కా తమ్ముళ్ళకు సంబంధించిన కథలు: 213
5.3.3.7.1. పరిస్థితులు పరిణామాలు: 213
5.3.3.8. బావ మరదళ్ళకు సంబంధించిన కథలు: 214
5.3.3.8.1. పైరుగాలి: 214
5.3.3.9. ఇతరాలు: 214
5.3.4. స్త్రీ సమస్యలను చిత్రించిన కథలు: 215
5.3.4.1 వరకట్న సంబంధ కథలు: 215
5.3.4.1.1. మూగ భావాలు: 215
5.3.4.1.2. సంధ్యా సమస్యలు: 216
5.3.4. 1.3. కన్నె చెర: 218
5.3.4.2. వేశ్య సంబంధ కథలు: 219
5.3.4. 2.1. పంకజం: 219
5.3.4.2.2. పువ్వులు నలగని రాత్రి: 220
5.3.4.3. ఇతరాలు: 220
5.3.4.3.1. కూనలమ్మ కోన: 220
5.3.4.3.2. లచ్చి బ్రతుకు: 221
5.3.4.3.3. సభల: 222
5.3.4.3.4. అగంతుక: 222
5.3.5. ప్రేమకథలు: 223
5.3.5.1.ముక్కుదాడు: 223
5.3.5.2. ప్రియ బాంధవి: 224
5.3.5.3. మారెమ్మ గుడి: 224
5.3.5.4. నవ్విన ధాన్యరాశి: 225

5.3.6. పెళ్లి సంబంధ కథలు: 226
5.3.6.1. గ్రూప్ ఫోటో: 226
5.3.6.2. వ్రత భంగం: 226
5.3.6.3. ఎదురుగాలి: 226
5.3.6.4. కమ్మ తెమ్మెర: 227
5.3.7. ఉపాధ్యాయ, ఇతర ఉద్యోగ సంబంధ కథలు: 227
5.3.7.1. బడిపంతులు: 227
5.3.7.2. బ్రతుకు బరువు: 228
5.3.7.3. అల్ప సంతోషులు: 229
5.3.7.4. తాను వెలిగించిన దీపాలు: 230
5.3.7.5. బాలామణి: 230
5.3.7.6. సమర్థుడు: 231
5.3.8. రచయితలకు సంబంధించిన కథలు: 231
5.3.8.1. ఎడారి పువ్వు: 231
5.3.8.2. కథా వస్తువు: 232
5.3.8.3. జీవన విపణి: 233
5.3.8.4. కామ దహనం: 234
5.3.8.5. ధర్మగ్లాని: 234
5.3.9. కరువు సంబంధ కథలు: 235
5.3.9.1. ఇక్కడ మేమంతా క్షామం: 235
5.3.9.2. అంతరంగం: 236
5.3.10. రాజకీయ కథలు: 237
5.3.10.1. కామందుల వారు: 237
5.3.10.2. తాత దిగిపోయిన బండి: 237
5.3.11. ఆర్థిక సంబంధ కథలు: 238
5.3.11.1. బంగారు: 238
5.3.11.2. అప్పిచ్చువాడు: 239
5.3.11.3. వాన: 239
5.3.12. రైతు కథలు: 240
5.3.12.1. పాతాళ గంగ: 240
5.3.13. ఇతరాలు: 240
5.3.13.1. జంతు ప్రేమ/పశువులపై ప్రీతి: 240

5.3.13.1.1.అమూల్యం: 240
5.3.13.1.2. పిల్లసగ్రోవి: 241
5.3.13.2. డిటెక్టివ్ కథ/అపరాధ పరిశోధక కథ: 241
5.3.13.2.1. కొత్త కథ: 241
5.3.13.3. కళాకారులకు సంబంధించిన కథలు: 242
5.3.13.3.1. అర్జున విషాద యోగం: 242
5.3.13.3.2. సర్కస్ డేరా: 242
5.4. చిత్తూరు జిల్లా కల్పనాసాహిత్యం (నవల, కథానిక) – వస్తు పరిణామం: 243

అధ్యాయం – 5

చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యం (నవల, కథానికి)– రూప (శిల్ప) విశ్లేషణ(246-286)

6.0. పరిచయం: 246
6.1. చిత్తూరు జిల్లా నవలా సాహిత్యం – రూప (శిల్ప) వైవిధ్యం: 247
6.1.1. పాత్ర చిత్రణ: 247
6.1.1.1. చాందసుల్తానా: 249
6.1.1.2. అక్కన్న మాదన్నలు: 249
6.1.1.3. హరికిషోరుడు: 250
6.1.1.4. వైకుంఠ శర్మ: 250
6.1.1.5. కళావతి: 250
6.1.1.6. మోహన: 250
6.1.1.7. నంజుండప్ప: 251
6.1.1.8. బంగారు: 251
6.1.1.9. వేదమూర్తి: 251
6.1.1.10. ఊర్మిళ: 251
6.1.1.11. శ్రీధర్: 252
6.1.1.12. మొగిలప్ప: 252
6.1.1.13. రామ జోగి: 252
6.1.1.14. రాజశేఖరం, చంద్రశేఖరం: 253
6.1.1.15. గజలక్ష్మి: 253
6.1.1.16. వన మోహిని: 253
6.1.1.17. విశ్వనాధయ్య: 253
6.1.1.18. ప్రకాశం: 254

6.1.1.19. రత్నమ్మ: 254
6.1.1.20. శారద: 254
6.1.1.21. డాక్టర్ విజయరత్నం: 255
6.1.1.22. రామానుజుడు: 255
6.1.1.23. కులోత్తుంగ చోళుడు: 255
6.1.1.24. త్రిపురాంతకుడు: 255
6.1.1.25. విద్యారణ్య యతింద్రుడు: 256
6.1.1.26. హరిహరరాయలు బుక్కరాయలు: 256
6.1.2. కథాకథనం/దృష్టికోణం: 257
6.1.2.1. ప్రథమ పురుష దృష్టికోణం (సర్వసాక్షి దృష్టికోణం): 257
6.1.2.2. ఉత్తమపురుష దృష్టికోణం: 257
6.1.3. భాష: 258
6.1.3.1. సామెతలు: 258
6.1.3.2. మాండలిక పదాలు: 260
6.1.3.3. అన్యదేశ పదాలు: 261
6.1.3.3.1. ఆంగ్ల పదాలు: 261
6.1.3.3.2. పర్సియన్, ఆరబిక్, ఉర్దూ పదాలు: 261
5.2.3.1.4. ధ్వన్యనుకరణ పదాలు: 262
6.1.3.5. జంట పదాలు: 263
6.1.4. శైలి: 263
6.2. చిత్తూరు జిల్లా కథా సాహిత్యం – రూప (శిల్ప) వైవిధ్యం: 267
6.2.1. శీర్షిక: 267
6.2.2. ఎత్తుగడ: 268
6.2.2.1. సాధారణ ఎత్తుగడ/నేరుగా కథను ప్రారంభించే ఎత్తుగడ: 269
6.2.2.2. సంభాషణాత్మక ఎత్తుగడ: 270
6.2.2.3. వర్ణనాత్మక ఎత్తుగడ: 271
6.2.3. కథాకథనం/దృష్టికోణం: 272
6.2.3.1. ప్రథమపురుష దృష్టికోణం (సర్వసాక్షి దృష్టికోణం): 272
6.2.3.2. ఉత్తమపురుష దృష్టికోణం: 273
6.2.4. పాత్ర చిత్రణ: 273
6.2.5. వర్ణనలు: 277
6.2.6. భాష: 280

6.2.6.1. సామెతలు: 280
6.2.6.2. మాండలిక పదాలు: 281
6.2.6.3. ధ్వన్యనుకరణ పదాలు: 283
6.2.6.4. జంటపదాలు: 284
6.2.7. శైలి: 284
6.3. చిత్తూరు జిల్లా కల్పనాసాహిత్యం (నవల, కథానిక) – రూప (శిల్ప) పరిణామం: 284
సింహావలోకనం **287**
ఫలితాలు **290**
ఉపయుక్త గ్రంథసూచి **292**
అనుబంధం 1 xx– xxvi
అనుబంధం 2 xxvi – xxxii
అనుబంధం 3 xxxiii– xxxv
అనుబంధం 4 xxxvilxxvii
అనుబంధం 5 lxxviii–lxxxiv

అధ్యాయం – 1

చిత్తూరుజిల్లా భౌగోళిక పరిస్థితులు

1.1. చిత్తూరు జిల్లా ఏర్పడిన విధానం:

శ్రీకృష్ణదేవరాయల కాలంలో రతనాల సీమగా కీర్తింపబడి, ఆంగ్ల పాలకుల ఏలుబడిలో దత్త మండలాలుగా ఉండి, రాయలసీమగా ఏర్పడ్డ నాలుగు జిల్లాల్లో చిత్తూరు జిల్లా ఒకటి. ప్రధానంగా రాయలసీమ కరువు ప్రాంతం. కారణం రాయలసీమలో జీవ నదులు లేవు. ఎటువైపు చూసినా కొండలు, గుట్టలు, పర్వతాలు. వ్యవసాయం చెరువుల కింద, బావుల కింద, బోర్ల కింద సాగాల్సిందే. తీవ్రమైన దుర్భిక్షం వల్ల చాలా కాలంగా నీటి చుక్క కంటబడక పోవడంతో రాయలసీమ ఓ అగ్నిగుండంలా కనిపిస్తుంది. రాయలసీమలోని మిగిలిన మూడు జిల్లాలతో పోలిస్తే చిత్తూరు జిల్లాకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. మూడు సరిహద్దు రాష్ట్రాల సంస్కృతి సంప్రదాయాల సమ్మేళనంగా ఈ జిల్లా క్రీ.శ 1911 ఏప్రిల్ 1న ఏర్పడింది. నేటికీ ఈ జిల్లా తమిళ, కన్నడ, తెలుగు భాషా సంస్కృతి సంప్రదాయాల త్రివేణి సంగమంగా భాసిల్లుతోంది. భారతదేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం ఆయా ప్రాంతాలలో ఆరాటం మొదలై ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచి తెలుగు ప్రాంతాలు విడిపోవాలనే పోరాటాలు జరుగుతున్న నేపథ్యంలో చిత్తూరు జిల్లా ఆవిర్భవించింది.

తమిళనాడు రాష్ట్రంలోని ఉత్తర ఆర్కాటు జిల్లాకు చెందిన చిత్తూరు, పలమనేరు, చంద్రగిరి తాలూకాలను, కడప జిల్లాకు చెందిన వాయల్పాడు, మదనపల్లి తాలూకాలను, మాజీ జమీందారీలైన పుంగనూరు, పుత్తూరు, శ్రీకాళహస్తి, కార్వేటినగరం ప్రాంతాలను కలిపి చిత్తూరు జిల్లాను క్రీ.శ 1911లో బ్రిటీష్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ తర్వాత క్రీ.శ1928లో ఉత్తర ఆర్కాట్‌లోని కంగుంది (కుప్పం) జమీందారీ నుంచి 28 గ్రామాలను మినహాయించి తక్కిన గ్రామాలను పలమనేరు (చిత్తూరు జిల్లా) తాలూకాలో కలిపారు. క్రీ.శ1950లో స్టేట్ అబ్సార్ప్షన్ ఆర్డర్ కింద మైసూరు రాష్ట్రానికి చెందిన 8 గ్రామాలను చిత్తూరు జిల్లాలో కలిపారు.

క్రీ.శ1960లో పటాస్కర్ అవార్డును అనుసరించి చిత్తూరు జిల్లా తిరుత్తని తాలూకాలోని 282 గ్రామాలు తిరుత్తని పుణ్యక్షేత్రంతో పాటు తమిళనాడులోని చెంగల్పట్టు జిల్లాలో చేర్చారు. అందుకు ప్రతిగా తమిళనాడులోని తిరువళ్ళూరు తాలూకాకు చెందిన 76 గ్రామాల సత్యవేడు ప్రాంతం, పొన్నెరి తాలూకాకు చెందిన 19 గ్రామాలు, పుత్తూరు తాలూకాలోని 17 గ్రామాలను కలిపి సత్యవేడు తాలూకా అనే కొత్త తాలూకాను ఏర్పాటు చేశారు. ఈవిధమైన మార్పు చేర్పులతో క్రీ.శ1960 నాటికి చిత్తూరు జిల్లా మూడు రెవిన్యూ డివిజన్‌లు, 15 తాలూకాలు, 20 సమితులతో సమగ్ర రూపాన్ని సంతరించుకుంది. క్రీ.శ1985లో రెవిన్యూ మాండలిక వ్యవస్థ ఆవిర్భవించాక తాలూకాలు, సమితుల స్థానంలో 66 మండలాలతో చిత్తూరు జిల్లా ఏర్పడింది.

1.2. చిత్తూరు జిల్లా భౌగోళిక పరిస్థితులు:

చిత్తూరు జిల్లాలోని ప్రధాన పట్టణమైన చిత్తూరును బట్టి ఈ జిల్లాకు చిత్తూరు జిల్లా అని పేరు వచ్చింది. చిట్రఊర్ అనే ఊరు తమిళనాడులో ఉండేది. *"చిట్రు అంటే చిన్నదయిన అని అర్థం ఊర్ అంటే ఊరు అని అర్థం. చిట్రఊర్ చిట్రూర్ గాను ఆ తర్వాత చిత్తూరు గాను రూపాంతరం చెందింది"* (చిత్తూరు జిల్లా శతాబ్ది సాహిత్య ఉత్సవాల ప్రత్యేక సంచిక. డిసెంబర్ 24 – 26, 1999: 1). 1ఏప్రిల్1911 న ఏర్పడిన చిత్తూరు జిల్లా $12^{o}37^{l}$నుండి $14^{o}8^{l}$వరకూ గల ఉత్తర అక్షాంశాల మధ్య, $78^{o}33^{l}$నుండి $79^{o}51^{l}$వరకూ గల తూర్పు రేఖాంశాల మధ్య విస్తరించి ఉంది. చిత్తూరు జిల్లాకు తూర్పున ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా, తమిళనాడులోని తిరువళ్ళూరు, వేలూరు జిల్లాలు, పశ్చిమాన కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ జిల్లా, ఉత్తరాన తమిళనాడులోని ఉత్తర ఆర్కాట్, ధర్మపురి జిల్లాలు సరిహద్దులుగా ఉన్నాయి. చిత్తూరు జిల్లా వైశాల్యం 15,152 చదరపు కి.మీ. జిల్లాలోని భూతల ప్రాంతం సముద్ర మట్టానికి 2,500 అడుగుల ఎత్తున ఉంది.

1.2.1 పర్వతాలు:

చిత్తూరు జిల్లాలోని పర్వత సముదాయం అధిక శాతం తూర్పు కనుమలకు చెందింది. ఈ కొండలు జిల్లాలోని నైరుతి దిక్కున ప్రారంభమై తూర్పు భాగం గుండా ఉత్తర దిశగా పయనించి తిరుపతి కొండల వరకూ చేరుకుంటాయి. ఈ ప్రాంతంలోని లోయ ఇటు చిత్తూరు జిల్లానుండి అటు కడప జిల్లాలోకి విస్తరిస్తుంది. ఈ జిల్లాలోని తూర్పు ప్రాంతంలో విశాలమైన మరొక కొండ లోయ ఉన్నది. దీనికి తూర్పు దిశన నగిరి కొండలు ఉన్నాయి. మదనపల్లి సమీపంలోని హార్సిలీ కొండలు (ఏనుగు మల్లమ్మ కొండలు) సౌందర్య శోభితంగా, చూడ ముచ్చటగా ఉంటాయి. ఈ కొండలలో వేసవిలో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండి వేసవి విడిది కేంద్రంగా ప్రసిద్ధికెక్కాయి.

1.2.2. శీతోష్ణస్థితి:

చిత్తూరు జిల్లాలో వాతావరణం పొడిగా ఉండి జీవరాశికి అనుకూలంగా ఉంటుంది. వేసవి కాలం మార్చి నుండి జూన్ వరకూ, వర్షాకాలం జూలై నుండి అక్టోబర్ వరకూ, చలికాలం నవంబర్ నుండి ఫిబ్రవరి వరకూ ఉంటుంది. ఉష్ణోగ్రత మే నెలలో ఎక్కువగాను జనవరిలో తక్కువగాను ఉంటుంది. జిల్లాలో ఎత్తైన ప్రాంతాలైన మదనపల్లి డివిజన్‌లోని కొన్ని ప్రాంతాలు వేసవిలో సైతం చల్లగా ఉంటాయి.

1.2.3 వర్షపాతం:

జిల్లాలో సగటు వర్షపాతం 908.1 మి.మీ. ఉంటుంది. జిల్లాలోని తూర్పు భాగంలో వర్షపాతం అధికంగా ఉండి పశ్చిమ దిశగా పోను పోను తగ్గుతూ ఉంటుంది. అందువల్లే తూర్పున ఉన్న సత్యవేడు తాలూకాలో 1108 మి.మీ. వర్షపాతం కాగా, పశ్చిమాన ఉన్న పెద్ద తిప్ప సముద్రం వద్ద 556 మి.మీ. వర్షపాతం మాత్రమే ఉంటుంది. జిల్లాలోని పశ్చిమ మధ్య

మండలాలలో నైరుతి ఋతుపవనాల వల్ల తూర్పు మండలంలో ఈశాన్య ఋతుపవనాల వల్ల వర్షపాతం అధికంగా ఉంటుంది.

1.2.4 నదులు:

చిత్తూరు జిల్లాలో నదుల విషయానికొస్తే, ఈ జిల్లాలో పెద్ద నదులంటూ చెప్పుకోవడానికి ఏమీ లేవు. ఇక్కడ ఉన్న చిన్న నదుల్లో ముఖ్యమైనవి పాపాఘ్ని, పించ, కౌండిన్య, పాలార్, ఆరణి, కుశస్థలి, స్వర్ణముఖి, బహుదా, కల్యాణి. ఈ జిల్లాలోని నదులు ఉత్తర భాగాన ఉన్నవి ఉత్తర దిశకు, దక్షిణ భాగాన ఉన్నవి ఆగ్నేయ దిశకు ప్రవహిస్తాయి. పాపాఘ్ని నది కర్ణాటకలోని నంది పర్వతాలలో పుట్టి, మదనపల్లి తాలూకా గుండా ప్రవహించి, కడప జిల్లాలోని బహుదానదిలో కలుస్తుంది. పాలార్ నది కర్ణాటకలో పుట్టి, కుప్పం తాలూకా గుండా ప్రవహించి ఉత్తర ఆర్కాట్ జిల్లాలోకి ప్రవేశిస్తుంది. స్వర్ణముఖి నది చంద్రగిరి కొండల్లో జన్మించి, చంద్రగిరి, తిరుపతి పట్టణ లోయల గుండా ప్రవహించి శ్రీకాళహస్తి మీదుగా నెల్లూరు జిల్లాలోని గూడూరు తాలూకాలోని సిద్ధవరం వద్ద సముద్రంలో కలుస్తుంది. బహుదానది మదనపల్లి తాలూకాలోని హార్సిలీ కొండల మధ్య పుట్టి వాయల్పాడు తాలూకా మీదుగా కడప జిల్లాలో ప్రవేశించి, పెన్నా నదిలో కలుస్తుంది.

1.2.5 అడవులు:

"చిత్తూరు జిల్లాలోని అడవులు 4.53 లక్షల హెక్టార్లు విస్తరించి ఉన్నాయి. జిల్లా మొత్తం విస్తీర్ణంలో అడవుల విస్తీర్ణం 30.2 శాతం" (ఆంధ్ర ప్రదేశ్ దర్శిని, 963). ఈ అడవులు ప్రధానంగా వెంకటగిరి కోట, ఏర్పేడు, రామాపురం, అడవరం, అంజూర్, కాట్రపల్లి మొదలైన ప్రాంతాలలో కనిపిస్తాయి. తిరుపతి కొండల వద్ద మామండూర్ లోయలోనూ, బాక్రాపేట, తలకోన రిజర్వ్ అడవుల్లోనూ, నారాయణ వనం, పనప్పాకం లోయల్లో అడవులు దట్టంగా ఉంటాయి. ఈ అడవి ప్రాంతాలలో ఎర్ర చందనం, గందపు చెక్క ప్రధాన ఉత్పత్తులు. వీటిని ఆదారంగా తిరుచానూరు, తిరుపతి, మాధవ మాల ఊర్లల్లో చిన్న చిన్న కుటీర పరిశ్రమలు నడుస్తున్నాయి.

1.2.6 వ్యవసాయం:

చిత్తూరు జిల్లాలోని భూమిలో సగభాగం అడవులు, బంజరు భూములే ఉండడం వల్ల వీలైనంత వరకూ పంటను వ్యవసాయ యోగ్యమైన భూమిలోనే పండిస్తారు. ఇక్కడ ఎక్కువగా ఎరుపు, నలుపు మిశ్రమ తరగతులకు చెందిన నేలలు, ఇసుకతో కూడిన బంకమట్టి నేలలు, కేవలం బంకమట్టి నేలలు కనిపిస్తాయి. ఇక్కడ ప్రధానంగా వరి, రాగులు, సజ్జ, జొన్న, ఉలవలు, ఆహార పంటలుగాను వేరుశనగ, చెఱకు, ఆహారేతర పంటలుగానూ పండిస్తారు. జిల్లా విస్తీర్ణంలో 34% భూమి వ్యవసాయానికి ఉపయోగపడుతోంది. జిల్లాలో ఎక్కువ శాతం సేద్యం బావుల కిందనే జరుగుతుంది. *"రాష్ట్రంలో కెల్లా బావుల కింద వ్యవసాయం చేయు జిల్లాలో చిత్తూరు జిల్లా ప్రథమ స్థానంలో ఉంది"* (చిత్తూరు జిల్లా శతాబ్ది సాహిత్య ఉత్సవాల ప్రత్యేక సంచిక. డిసెంబర్ 24 – 26, 1999: 2).

జిల్లాలో భారీ నీటి పారుదల ప్రాజెక్టులు లేవు. అందువల్లే ఇక్కడ వ్యవసాయం 73% బావుల కింద, 20.4% చెరువుల కింద సాగుతుంది. జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టులు 8 కలవు. అవి: స్వర్ణముఖి ఆనకట్ట, అరణియార్, మల్లెమడుగు, కాళంగి, బ్రహ్మదా, సిద్దల గండి ప్రాజెక్టు, క్రిష్ణాపురం ప్రాజెక్టు పెద్దేరు ప్రాజెక్టులు.

1.2.7. ఖనిజ సంపద:

చిత్తూరు జిల్లాలో ఖనిజ సంపద చాలా తక్కువ. కుప్పం తాలూకా చికర్ గుడి, నందిమడుగు గ్రామాలలోనూ, మల్లప్పకొండ ప్రాంతాలలోనూ సుమారు మూడు కిలోమీటర్ల పొడవున ముడి బంగారు నిల్వలున్నాయి. ఇక్కడ టన్నుకు 4.5 గ్రాముల బంగారం లభిస్తుంది. పుత్తూరు, గంగాధర నెల్లూరు, చిత్తూరు పట్టణ పరిసర ప్రాంతాలలో స్టియలైట్ అనే ఖనిజం, కుప్పం పరిసర ప్రాంతాలలో ఇనుము, క్వార్ట్జ్, జింక్, శ్రీకాళహస్తి, పుత్తూరు, వాయల్పాడు తాలూకాలలో ముడి ఇనుము లభిస్తున్నాయి.

1.2.8 పుణ్య క్షేత్రాలు:

ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా పుణ్యక్షేత్రాలకు ప్రసిద్ధి చెందిన ప్రాంతం. జిల్లాలో తిరుమల, తిరుపతి, శ్రీకాళహస్తి, కాణిపాకం, తలకోన, నారాయణవనం, అప్పలాయగుంట, తిరుచానూరు, శ్రీనివాస మంగాపురం, గుడిమల్లం, అర్థగిరి, బోయకొండ మొదలైన పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. వీటి గురించి ఇదే అధ్యాయంలో 'చిత్తూరు జిల్లా సాంఘిక సాంస్కృతిక నేపథ్యాలు' అనే ఉప శీర్షికలోవిపులంగా వివరించాను.

1.3. చిత్తూరు జిల్లాలోని శాసనాలు:

ఏ దేశ చరిత్ర నిర్మాణానికైనా ఆనాటికి లభిస్తున్న వాఙ్మయాధారాలతో పాటు పురావస్తు ఆధారాలైన శాసనాలను, నాణేలను, భౌగోళిక అవశేషాలను కూడా పరిశీలించినపుడే ఆ దేశ చరిత్ర సమగ్రం అనిపించుకుంటుంది. చరిత్ర పూర్వ యుగం నుండి నేటి వరకూ చిత్తూరు జిల్లా వాసుల జీవన విధానాలకు సంబంధించిన సమాచారం పురావస్తు, వాఙ్మయ రూపాలలో లభిస్తోంది. చిత్తూరు జిల్లాను క్రీ.పూ. 4వ శతాబ్దం నుండి మౌర్యుల మొదలు నేటి ప్రజా ప్రతినిధుల వరకూ అనేక రాజవంశాల వారు పరిపాలిస్తూ వచ్చారు. వీరి పాలనా విధానాలను, సంస్కృతిని తెలియజేసే శాసనాలు చాలా వరకు జిల్లాలో తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో లభిస్తున్నాయి.

ఈ జిల్లాకు ఈనాడు భాషా సంస్కృతుల కలయిక వల్ల ఎలాంటి ప్రత్యేకత ఉందో, రాజుల కాలంలో కూడా అలాంటి ప్రత్యేకతే ఉండేది. ఇది గుర్తించిన పాలకులు కూడా చోళుల కాలం నుండి ఒక విషయాన్ని ఈ ప్రాంతపు ప్రజలకు చెప్పాల్సి వచ్చినప్పుడు తమ శాసనాలను తమిళ, కన్నడ, తెలుగు, సంస్కృత భాషలలో వేయించేవారు. ఈ ప్రాంతంలో త్రిభాషా సూత్రాన్ని అవలంబించారని చెప్పొచ్చు.

నొలంబ వంశస్థుల, పశ్చిమ గంగరాజుల, తంజావూరు చోళుల, యాదవరాయ వంశస్థుల, అడియార్ నాయకుల, శ్రీయగంగ వంశస్థుల ప్రశస్తి గల శాసనాలు, విజయనగర రాజులైన హరిహర బుక్కరాయల, కుమార కంపరాయల శాసనాలు, మొదటి దేవరాయలకు చెందిన 5 శాసనాలు, శ్రీకృష్ణదేవరాయలకు చెందిన 85 శాసనాలు, అచ్యుతరాయల శాసనాలు, మట్లి రాజుల శాసనాలు చిత్తూరు జిల్లాలోని కార్వనపల్లి, కలకత్తూర్, పుంగనూరు, శివాడి, గుడిమల్లం, తిరుపతి, శ్రీకాళహస్తి, లడ్డిగం మొదలైన ప్రాంతాలలో లభించినట్లు వి.కె. మోహన్ గారు 'చిత్తూరు జిల్లా సమగ్ర చరిత్ర – సంస్కృతి' అనే గ్రంథంలో తెలిపారు.

1.4. చిత్తూరు జిల్లా చరిత్ర:

మొదట ద్రావిడ దేశంలో భాగంగా గల చిత్తూరు జిల్లాలో నవీన శిలాయుగం నుండి మానవులు నివసించినట్టు అక్కడక్కడ కనిపించే పాండవ గుళ్ళ వల్ల తెలుస్తుంది. ప్రాచీన కాలంలో చిత్తూరు జిల్లా మొత్తం ఏకీకృత పాలనా విభాగంగా ఉండేది కాదు. అనేక రాజవంశాల ఆధీనంలో దీని భాగాలు ఉండేవి. ఆ ప్రధాన రాజవంశాలు మౌర్యులు, శాతవాహనులు, పల్లవులు, బాదామి చాళుక్యులు, రాష్ట్ర కూటులు, కళ్యాణి చాళుక్యులు, చోళులు, పాండ్యులు, విజయనగర రాజులు, కుతుబ్ షాహీలు, మొగలాయిలు, అసఫ్ జాహీలు, మహారాష్ట్ర మైసూర్ పాలకులు, ఆంగ్లేయులు. వీరేకాక బాణులు, వైదుంబులు, నొలంబులు, పశ్చిమ గాంగులు, యాదవరాజులు, మట్లిరాజులు, కడప ఆర్కాట్ నవాబులు మొదలైన సామంత రాజవంశాలు కూడా చిత్తూరు జిల్లాలో రాజ్యమేలినారు.

1.4.1 చిత్తూరు జిల్లాను పాలించిన రాజవంశాలు:

చిత్తూరు జిల్లాను ఎంతో మంది రాజ వంశాలు పాలించాయి. వారిలో ఒక్కొక్కరిని చూద్దాం.

1.4.1.1.మౌర్యులు:

క్రీ.పూ. 7 శతాబ్దానికి ముందు తీరాంధ్ర ప్రాంతం మినహా దక్షిణ దేశం గురించి ఆర్యులకు పరిజ్ఞానం లేదు. వీరు దక్షిణం వైపు ప్రయాణించి క్రీ.పూ. 350 నాటికి తంజావూరు, మధురై వరకు గల భూభాగాలతో పరిచయం ఏర్పరుచుకున్నారు. తొలినాటి చిత్తూరు జిల్లా చరిత్రకు సంబంధించిన ప్రత్యక్ష ఆధారాలు లేకపోయినప్పటికీ ఆంధ్రదేశంలోని ఇతర జిల్లాలవలే చిత్తూరు జిల్లాలోనూ మౌర్యులతో రాజకీయ చరిత్ర ప్రారంభమవుతుంది. నందుల పాలనను అంతం చేసిన మౌర్యులు తమ అధికారాన్ని దక్షిణానికి విస్తరింపజేశారు. ఇటీవల జరిపిన తవ్వకాలలో మౌర్యులనాటి విద్దంక నాణేలు చిత్తూరు జిల్లా గుడిమల్లంలో లభించాయి.

చిత్తూరు జిల్లాకు సంబంధించిన కొంత సమాచారం తమిళ సంగ సాహిత్యంలో ఉంది. *"తమిళం మాట్లాడే ప్రాంతానికి ఉత్తర సరిహద్దు వేంగడం అని అతి ప్రాచీనమైన తోల్కాప్పియంలోపేర్కొనబడింది"* (చిత్తూరు జిల్లా సమగ్ర చరిత్ర – సంస్కృతి, 2009: 31). తిరుపతి ప్రాచీన నామమే వేంగడం. వేంగడంకు పైన గల భాగం వడుగర్దేయంగా పిలువబడినట్లు

తెలుస్తోంది. *"ఒకప్పుడు వడుగర్ నివసించిన ఈ ప్రాంతంలో నేడు తూర్పున తెలుగు, పడమర కన్నడ భాష మాట్లాడేవారు కలరు. ఈ వడుగర్ మౌర్యులకు సరిహద్దు రక్షకులుగా ఉన్నట్లు 'అహనానూర్' లో పేర్కొనబడింది"* (చిత్తూరు జిల్లా సమగ్ర చరిత్ర – సంస్కృతి, 2009: 31). దీని ప్రకారంమౌర్యుల పాలన చిత్తూరు జిల్లాలో కొనసాగిందని చెప్పవచ్చు.

1.4.1.2. శాతవాహనులు:

"శాతవాహన రాజైన గౌతమీ పుత్ర శాతకర్ణి అసిక, అసక, ములక, సురత, కుకుర, అపరాంత, అనూప, విదర్భ, ఆకరవంత ప్రాంతాలను జయించినట్లు, త్రిసముద్రతోయ బిరుదు ధరించినట్లు నాసిక్ ప్రశస్తిలో ప్రస్తావించబడినది" (చిత్తూరు జిల్లా సమగ్ర చరిత్ర – సంస్కృతి, 2009: 32). ఈ బిరుదుని బట్టి గౌతమీ పుత్రుడు మూడు సముద్రాలకు (బంగాళాఖాతం, అరేబియా, హిందూ మహాసముద్రాలు) మధ్యగల భూభాగాన్నంతటిని పాలించాడని తెలుస్తుంది. కావున చిత్తూరు జిల్లా శాతవాహనుల ఆధీనంలో ఉన్నట్లు చెప్పవచ్చు. గుడిమల్లంలో జరిగిన తవ్వకాలలో శాతవాహనుల నాటి అవశేషాలు బయల్పడినవి.

1.4.1.3. పల్లవులు:

శాతవాహనుల తర్వాత చిత్తూరు ప్రాంతాన్ని పల్లవులు పాలించారు. నాల్గవ పులోమావి కాలంలో శాతవాహన ప్రతినిధిగా దక్షిణ దేశాన్ని, ద్రావిడ దేశాన్ని స్కందనాగుడు పాలించేవాడు. శాతవాహన రాజ్యం అంతమైన తర్వాత స్కందనాగుడు స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నాడు. ఇతని సామ్రాజ్యంలో చిత్తూరు ప్రాంతం మధ్యలో ఉంది. పల్లవులు కంచి రాజధానిగా చిత్తూరు ప్రాంతంతో పాటు ఇతర దక్షిణాంధ్ర ప్రాంతాలపై ఆధిపత్యాన్ని చలాయించారు. కంచి ప్రాంతం కొరకు, చిత్తూరు జిల్లాపై ఆధిపత్యం కోసం పల్లవులకు, చోళులకు అనేక యుద్ధాలు జరిగాయి. పల్లవ రాజు మొదటి మహేంద్రవర్మ తన రాజ్యంలోని ఉత్తర ప్రాంతాలను బాదామి చాళుక్యుడైన రెండవ పులకేశికి కోల్పోవలసి రాగా, కొంత కాలానికే మొదటి నరసింహవర్మ పల్లవుల పాలనను చిత్తూరు ప్రాంతంలో పునరుద్ధరించాడు. తర్వాత వచ్చిన పల్లవ రాజులందరూ ఈ ప్రాంతంపై ఆధిపత్యాన్ని చలాయించారు. ఇందుకు నిదర్శనం వీరి శాసనాలు చిత్తూరు జిల్లా ప్రాంతంలో లభించడమే.

1.4.1.4. రేనాటి చోళులు:

రేనాటి చోళులు క్రీ.శ. 6వ శతాబ్ది అర్ధభాగం నుండి 9వ శతాబ్దం వరకూ రాయలసీమను పాలించారు. ద్రావిడ దేశంలో కంచి పల్లవులు, దక్కన్‌లో బాదామి చాళుక్యులు పాలిస్తున్న కాలంలో కరికాల చోళుని సంతతి వారని చెప్పుకున్న రేనాటి చోళులు చిత్తూరు జిల్లాలోని కొద్ది భాగంలో రాజ్యమేలారు. చిత్తూరు జిల్లాలో లభ్యమైన తొలి శాసనం రేనాండు – 7000ను పాలించిన రేనాటి చోళులది. *"మదనపల్లి పట్టణ శివారులోని చిప్పిలి వీరి రాజధాని అని కొందరు విద్వాంసులు భావించారు. శ్రీ పరబ్రహ్మశాస్త్రిగారు కడపజిల్లా కమలాపురం తాలూకాలోని చిప్పిలిని వీరి రాజధానిగా నిర్ణయించారు. శ్రీ నీలకంఠశాస్త్రిగారు రేనాటి చోళుల*

రాజధాని ఉరయూరు అన్నారు. కానీ ఈ ఊరు ఏ ప్రాంతంలో ఉందో చెప్పలేదు" (రాయలసీమలో ఆధునిక సాహిత్యం సామాజిక సాంస్కృతిక విశ్లేషణ, 2006:1).

1.4.1.5. వైదుంబులు:

చిత్తూరు జిల్లాలో తెలుగు చోళుల తర్వాత అధికారంలోకి వచ్చిన వారు వైదుంబులు. చిత్తూరు జిల్లాలోని 'వైదుంబ్రోలు' వీరి రాజధాని. *"వీరు రేనాటి చోళులను జయించి స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత వీరు తమ రాజధానిని మదనపల్లి సమీపంలోని చిప్పిలికి, ఆ తర్వాత రాజంపేట సమీపంలోని పొత్తలికి మార్చినట్టుగా శాసనాధారాలున్నాయి"* (రాయలసీమలో ఆధునిక సాహిత్యం సామాజిక సాంస్కృతిక విశ్లేషణ, 2006:8). వీరు రేనాటితో పాటు నేటి చిత్తూరు జిల్లాలోని పడమటి తాలూకాలను పాలించారు.

1.4.1.6.బాణులు:

చిత్తూరు జిల్లాను పాలించిన సామంత రాజవంశాలలో బాణ వంశం ప్రధానమైనది. వీరు పల్లవులకు సామంతులుగా రాజ్యమేలారు. రాయలసీమలో బృహద్ బాణులు చాళుక్యులకు సామంతులుగా ఉండగా, బాణవంశంలోని ఒక శాఖవారు చిత్తూరు జిల్లాలోని దక్షిణ ప్రాంతాలను పాలించారు. అనంతపురం జిల్లా హిందూపురం తాలూకా 'పరిగి'ని రాజధానిగా చేసుకొని చిత్తూరు, పుంగనూరు, శ్రీకాళహస్తి మొదలైన ప్రాంతాలను పాలించారు.

1.4.1.7. పశ్చిమ గాంగులు:

చిత్తూరు జిల్లాలో కొంత భాగాన్ని పాలించిన మరో సామంత రాజవంశం పశ్చిమ గాంగ వంశం. వీరు పల్లవులకు సామంతులుగా క్రీ.శ. 4వ శతాబ్దంలో అధికారంలోకి వచ్చారు. ఈ ప్రాంతంలో బాణులను అణచడానికి పల్లవరాజు మొదటి నరసింహవర్మ గాంగ వంశానికి చెందిన హరివర్మను రాజుగా చేశాడు. పుంగనూరు తాలూకాలో లభ్యమైన ఒక శాసనాన్ని బట్టి పశ్చిమ గంగరాజు మారసింహుని రాజ్యంలో చిత్తూరు జిల్లా కొంత భాగమున్నట్లు తెలుస్తుంది. మారసింహుని కుమారుడు రెండో పృథ్వీపతి పుంగనూరు, మదనపల్లి తాలూకాలలో కొంత భాగంలో కూడిన పులినాడును పాలించాడు.

1.4.1.8. తంజావూరు చోళులు:

చోళరాజైన మొదటి ఆదిత్యుడు (క్రీ.శ. 871 – 907) పల్లవ రాజైన అపరాజిత వర్మను ఓడించడంతో పల్లవుల పాలన అంతమై చోళుల ప్రాబల్యం పెరిగింది. మొదటి ఆదిత్యుని తర్వాత ఇతని కుమారుడు మొదటి పరాంతకుడు అధికారంలోకి వచ్చేనాటికి చోళ రాజ్యం ఉత్తరాన శ్రీకాళహస్తి మొదలు దక్షిణాన కావేరి వరకు విస్తరించింది. ఆ తర్వాత గండరాదిత్యుడు, రెండో పరాంతకుడు, మొదటి రాజరాజు, మొదటి రాజేంద్రుడు మొదలు అధిరాజేంద్రుని వరకు వరుసగా ఈ ప్రాంతాన్ని పాలించారు. క్రీ.శ. 1070లో తూర్పు చాళుక్య యువరాజు రెండో రాజేంద్రుడు కులోత్తుంగ బిరుదుతో చోళ సింహాసనాన్నెక్కాడు. ఇతని తర్వాత పాలించిన వారు చాళుక్య – చోళ చక్రవర్తులుగా పిలువబడినారు. కులోత్తుంగుని తరువాత విక్రమచోళుడు రెండవ

కులోత్తుంగుడు, రెండవ రాజరాజు, రెండవ రాజాధిరాజు వరుసగా చిత్తూరు జిల్లాలో అధికారాన్ని చలాయించారు.

1.4.1.9. చోళులకు సామంతులుగా చిత్తూరును పాలించిన రాజవంశాలు:

చోళరాజైన విక్రమ చోళుని కాలం వరకూ వీరి సామంతులైన యాదవరాయ వంశస్థులు, తెలుగు చోడ, ఉత్తమ చోళ గంగ, అడియమాన్, శ్రీయగంగ పాలకులు చిత్తూరు జిల్లాను పాలించారు.

మొదటి కులోత్తుంగుని పాలనా కాలంలో కరుప్పారు ప్రాంతానికి చెందిన ఒక నాయక వంశం చిత్తూరు ప్రాంతంలో రాజ్యమేలారు. వీరినే యాదవరాయ వంశస్థులంటారు. చోళుల అధికారం బలహీనం కావడంతో సామంతులైన యాదవరాయ వంశంతో పాటు తెలుగు చోడులు కూడా స్వతంత్రతని ప్రకటించుకున్నారు. వీరిని పాండ్యరాజు సుందర పాండ్యుడు జయించే వరకూ చిత్తూరు ప్రాంతంలో వీరి పాలన కొనసాగింది. తర్వాత ఉత్తమ చోళగాంగ వంశ పాలకులు చోళ చక్రవర్తి రెండో రాజేంద్రుని కాలంలో కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ ప్రాంతంనుండి రాజ్యమేలారు. అడియమాన్ నాయక వంశస్థులు చోళుల సామంతులుగా తగడూర్ (నేటి ధర్మపురి) నుండి రాజ్యమేలారు. వీరి వంశంలో విడుగాడళగియ పెరుమాల్ ఒక్కడే తన ప్రభావాన్ని చిత్తూరు జిల్లాలోని పుంగనూరు ప్రాంతం వరకూ విస్తరింపజేశాడు.

1.4.1.10. విజయనగర రాజులు:

ఇంత వరకూ రాయలసీమ మొత్తం ప్రాంతాన్ని కలిపి పరిపాలించిన రాజులు తక్కువ. రేనాటి చోళుల తర్వాత రాయలసీమతో పాటు దక్షిణాపథాన్నంతా ఏకచత్రాధిపత్యంగా పాలించినవారు విజయనగర రాజులు. క్రీ.శ. 1336లో విజయనగర రాజ్యం స్థాపించబడిన నాటినుండి క్రీ.శ. 17వ శతాబ్దం చివరి వరకు సంగమ, సాళువ, తుళు, ఆరవీటి వంశాలకు చెందిన రాజులు విజయనగర సామ్రాజ్యంలో విలీనమైన చిత్తూరు జిల్లాను పాలించారు. సంగమ వంశంలో హరిహర బుక్కరాయల సామంతునిగా రెండవ కుమార కంపన (మొదటి బుక్కరాయల కుమారుడు) చిత్తూరు జిల్లా ప్రాంతాన్ని పాలించాడు. చిత్తూరు జిల్లాలో లభ్యమైన తొలి విజయనగర రాజుల శాసనాలు రెండవ కుమార కంపనకు సంబంధించినవే. ఇతని కాలంలో సాళువ మంగిదేవుడు (కంపన సామంతుడు) చిత్తూరు పరిసర ప్రాంతాలను పాలించాడు.

నరసనాయకుని సహాయంతో క్రీ.శ. 1456 లో చంద్రగిరిలో తన వంశ వారసత్వంగా అధికారానికి వచ్చిన సాళువ నరసింహుడు 1485లో విజయనగర సింహాసనాన్ని అధిష్టించడంతో విజయనగర సామ్రాజ్యంలోని చిత్తూరు జిల్లా ప్రాంతంలో సాళువ వంశ పాలన మొదలౌతుంది. *"తిరుమలలో గల విష్ణువును ఆరాధించడానికి ఇతడు చంద్రగిరిని తన నివాసంగా చేసుకున్నాడని శ్రీ రాజనాథ డిండుమని సాళువాభ్యుదయంలో వర్ణించబడింది"* (చిత్తూరు జిల్లా

సమగ్ర చరిత్ర – సంస్కృతి, 2009: 81). ఇతని తర్వాత నరసనాయకుని సంరక్షణలో ఇమ్మడి నరసింహుడు చిత్తూరు జిల్లా ప్రాంతాన్ని పాలించాడు.

తరువాత తుళు వంశ స్థాపకుడైన వీర నరసింహునితో ఈ ప్రాంతంలో తుళువంశ పాలన మొదలవుతుంది. ఈ వంశంలో చెప్పుకోదగ్గ పాలకుడు శ్రీ కృష్ణదేవరాయలు. రాయలకు సంబంధించిన శాసనాలు చిత్తూరు జిల్లాలో 100 దాకా లభిస్తున్నాయి. రాయలు ఈశాన్య ప్రాంతాలపై దండెత్తడానికి వెళ్ళేటప్పుడు తిరిగి వచ్చేటప్పుడు తప్పనిసరిగా తిరుపతి, శ్రీకాళహస్తిని దర్శించేవాడు. రాయలు వేంకటేశ్వర స్వామికి పరమ భక్తుడు. ఇతను రాసిన 'ఆముక్త మాల్యద' కావ్యాన్ని తిరుమల వేంకటేశ్వర స్వామివారికి అంకితమిచ్చాడు. రాయల అనంతరం ఈ ప్రాంతాన్ని అచ్యుత రాయలు పాలించాడు. తుళువ వంశానంతరం ఆరవీటి వంశ పాలకులైన రామరాయలు, తిరుమల రాయలు చిత్తూరు జిల్లా పరిసర ప్రాంతాలపై అధికారాన్ని చలాయించారు. పై నాలుగు వంశాలకు చెందిన శాసనాలనేకం శ్రీకాళహస్తి, తిరుపతి, తిరుమల, చంద్రగిరి మొదలైన ప్రాంతాలలో లభించినట్లు వి.కె. మోహన్ గారి సంపాదకత్వంలో వచ్చిన 'చిత్తూరు జిల్లా సమగ్ర చరిత్ర – సంస్కృతి' అనే గ్రంథంలో తెలిపారు.

1.4.2. చిత్తూరు జిల్లా – ముస్లింల పాలన:

విజయనగర సామ్రాజ్య స్థాపన తర్వాత 11 సంవత్సరాలకు అంటే 1347లో దక్కన్‌లో బహమనీ రాజ్యం ఏర్పడినది. బహమనీ రాజ్యం విజయనగర సామ్రాజ్యంతో అనేక యుద్ధాలు చేసింది. చివరికి రాజ్యపతనమై దక్కన్‌లో 5 స్వతంత్ర ముస్లిం రాజ్యాలు ఏర్పడ్డాయి. అందులో ఒకటి గోల్కొండ – కుతుబ్ షాహివంశం. కులీ కుతుబ్‌షాతో ఆవిర్భవించిన గోల్కొండ రాజ్యం తొలుత తెలంగాణ ప్రాంతానికే పరిమితమైనా విజయనగర సామ్రాజ్య పతనానంతరం ఆంధ్రదేశమంతటా విస్తరించింది. వీరు విజయనగర రాజులతో యుద్ధాలు చేసే సమయంలో షాజహాన్ గోల్కొండపై దండెత్తగా అబ్దుల్లా కుతుబ్ షా ఇతనితో సంధి చేసుకుని సామంతుడైనాడు. అప్పటికే చిత్తూరు ప్రాంతం గోల్కొండ రాజ్యంలో విలీనమైంది. అబ్దులా తరువాత అధికారంలోకి వచ్చిన అబుల్ హసన్ శివాజీతో సంధి చేసుకోవడం నచ్చని ఔరంగజేబు గోల్కొండ రాజ్యంపై దండెత్తి కుతుబ్ షాహి రాజ్యాన్ని మొగల్ సామ్రాజ్యంలో విలీనం చేయడంతో చిత్తూరు జిల్లా మొగలుల పాలనలోకి వచ్చింది.

మొగల్ సామ్రాజ్యం బలహీనపడుతున్న సమయంలో దక్కన్ ప్రాంతపు సుబేదారుగా ఉన్న నిజాం ఉల్ ముల్క్ స్వతంత్రతను ప్రకటించుకుని ఆంధ్రదేశంతో పాటు తమిళనాడు, ఒరిస్సాలోని కొన్ని ప్రాంతాలపై అధికారాన్ని చెలాయించాడు. ఇతని సామంతులుగా కడప నవాబులు చిత్తూరు జిల్లాలో కొంత భాగాన్ని, ఆర్కాట్ కేంద్రంగా కర్ణాటకను పాలించే కర్ణాటక నవాబులు చిత్తూరు జిల్లాలో అధిక భాగాన్ని పాలించారు. సదతుల్లా, దోస్త్ అలీ, సఫ్దర్ అలీ, ముర్తిజ్ అలీ, మహమ్మద్ అలీ, అన్వరుద్దీన్ వరుసగా ఆర్కాట్‌ను (చిత్తూరు జిల్లాలో అధిక భాగం) పాలించారు.

తరువాత చిత్తూరు జిల్లాను పాలించిన వారిలో మైసూర్ పాలకులైన హైదర్ అలీ, టిప్పు సుల్తాన్‌లు ప్రముఖులు. చిత్తూరు జిల్లాను భౌగోళికంగా రెండు ప్రత్యేక భాగాలుగా విభజించారు. వీటిలో మొదటిది తూర్పు ప్రాంతాలైన కార్వేటి నగరం, శ్రీకాళహస్తి, చంద్రగిరి, పుత్తూరు, చిత్తూరు ప్రాంతాలు కర్ణాటక నవాబుల రాజ్యంలో ఉండగా, రెండవది పశ్చిమ ప్రాంతాలైన వెంకటగిరి కోట, కంగుంది (కుప్పం), పుంగనూరు, మదనపల్లి, వాయల్పాడు, పీలేరు ప్రాంతాలు హైదరాలి, టిప్పు సుల్తాన్ ఆధీనంలోని మైసూర్ రాజ్యంలో ఉండేవి. టిప్పు సుల్తాన్ చివరి కాలంలో మైసూర్ యుద్ధాల అనంతరం గుర్రం కొండ (చిత్తూరు జిల్లా), కంగుంది ప్రాంతాలు నిజాం స్వాధీనంలోకి రాగా, శ్రీకాళహస్తి, కార్వేటినగరం, పుంగనూరు పాలెములు బ్రిటీష్ వారి ఆధీనంలోకి వచ్చాయి. ఈ విధంగా చిత్తూరు జిల్లాలోని అనేక ప్రాంతాలలో గోల్కొండ నవాబుల, కడప నవాబుల, కర్ణాటక నవాబుల, మైసూర్ పాలకుల అధికారం నడిచింది.

1.4.3. చిత్తూరు జిల్లా – ఆంగ్లేయుల పాలన:

ఐరోపాకు, భారతదేశానికి చాలా కాలంగా వ్యాపార సంబంధాలు ఉండేవి. 1453లో తురుష్కులు కాన్‌స్టాంటినోపుల్‌ను స్వాధీనం చేసుకోవడంతో భూమార్గం ద్వారా ఐరోపావారు వ్యాపార లావాదేవీలు నడపడానికి వీలు లేకుండా పోయింది. దీంతో ఐరోపా వారు సముద్ర మార్గాన్వేషణ చేయాల్సి వచ్చింది. ఇలావచ్చిన వారిలో ప్రథములు పోర్చుగీసు వారు. ఆ తరువాత డచ్, ఫ్రెంచ్, ఆంగ్లేయులు భారతదేశానికి వచ్చి వర్తక స్థావరాలను ఏర్పాటు చేసుకున్నారు. తరువాత వీరు భారత రాజకీయాలలో జోక్యం చేసుకొని రాజ్య స్థాపన కోసం కలహించుకోగా చివరకు ఆంగ్లేయులు విజయం సాధించారు.

హైదరాలీ తరువాత రాజైన టిప్పు సుల్తాన్ బ్రిటీష్ వారి ఆధిపత్యానికి ప్రతిబంధకంగా తయారయ్యాడు. బ్రిటీష్ వారు మరాఠా, నిజాం రాజుల సహాయంతో 1790లో మూడవ మైసూర్ యుద్ధంలో టిప్పు సుల్తాన్‌ను ఓడించారు. తరువాత బ్రిటీష్ వారికి, నిజాం నవాబుకు జరిగిన సంధి ప్రకారం మైసూర్ రాజ్యంలో గల రాయలసీమను బ్రిటీష్ వారు నిజాం నవాబుకిచ్చారు. తరువాత నిజాం నవాబు మరాఠా దాడులనుండి రక్షణ పొందడానికి బ్రిటీష్ వారి సహకారం పొందవలసి వచ్చింది. ఇందుకు ప్రతిగా నిజాం ప్రభువు రాయలసీమ ప్రాంతాలను బ్రిటీష్ వారికి ధారాదత్తం చేశాడు. అప్పటి నుండి కడప, కర్నూలు, అనంతపురం, బళ్లారి జిల్లాలను దత్త మండలాలని అంటారు. వీటిలో ప్రస్తుత చిత్తూరు జిల్లాలోని కొంత భాగం కడపలో ఉండేది. చిత్తూరు జిల్లాలోని మిగిలిన ప్రాంతం ఆర్కాట్ నవాబుల నుండి ఆక్రమించడంతో చిత్తూరు జిల్లా ఆంగ్లేయుల స్వాధీనమైంది.

ఆర్కాట్ నవాబులనుండి, నిజాం నవాబుల నుండి ఆంగ్లేయులకు చిత్తూరు జిల్లాలో 30 పాలెములు సంక్రమించాయి. ఈ విధంగా ఆంగ్లేయులు చిత్తూరు జిల్లాను స్వాధీన పరచుకునే నాటికి అక్కడ పాలెగాళ్ళు అనే అధికారులు యథేచ్ఛగా వ్యవహరిస్తుండేవారు. వీరు చుట్టు పక్కల ప్రజలనుండి ధనాన్ని వసూలు చేస్తుండేవారు. ఆంగ్లేయులు ఈ పాలెగాళ్ళను అణచి వారిని

అదుపాజ్ఞలలో పెట్టసాగారు. దీనితో కొంతమంది పాలెగాళ్ళు ఎదురు తిరగగా వారిని అణచివేశారు. ఈ విధంగా చిత్తూరు జిల్లాలో బ్రిటీష్ వారి పాలన కొనసాగింది.

1.5. చిత్తూరు జిల్లాలో జరిగిన ఉద్యమాలు:

చిత్తూరు జిల్లాలో జరిగిన ఉద్యమాలను ఒక్కొక్కటిగా పరిశీలిద్దాం.

1.5.1. సంఘ సంస్కరణోద్యమం:

19వ శతాబ్ది ప్రారంభంలో భారతదేశంలో సంఘ సంస్కరణోద్యమాలు ప్రారంభమైనాయి. మొదట బెంగాల్‌లో ప్రారంభమైన ఈ ఉద్యమాలు క్రమ క్రమంగా ఆంధ్ర దేశమంతటా విస్తరించాయి. ఇది మొదలయ్యే నాటికి భారతదేశంలో బ్రిటీష్ పాలన ఒక కీలక దశకు చేరుకుంది. బ్రిటీష్ వారు పరిపాలనా సౌలభ్యం కోసం అనేక సంస్కరణలను ప్రవేశపెట్టారు. ఈ సంస్కరణలు భారతీయ సమాజంలో అనేక మార్పులకు దోహదం చేశాయి. అనేక నూతన వర్గాలు తలెత్తాయి. అందులో ముఖ్యమైనది మధ్య తరగతి వర్గం. ఈ వర్గం సామాజిక పరివర్తనకు నూతన భావజాలాన్ని అందిపుచ్చుకుని సంఘ సంస్కరణలు చేపట్టి సామాజిక మార్పుకు నాంది పలికాయి.

ఆంధ్రదేశంలో 19 శతాబ్దం ద్వితీయార్థంలో ఇది ఉద్యమరూపాన్ని సంతరించుకుంది. ఈ ఉద్యమాలకు గోదావరి మండలం కేంద్ర స్థానం కాగా కందుకూరి వీరేశలింగం ఆద్యుడయ్యాడు. సంఘ సంస్కరణలలో భాగంగా చిత్తూరు జిల్లాలో అనేక పాఠశాలలు ఏర్పాటు చేశారు. చిత్తూరులో ప్రథమంగా క్రైస్తవ మిషనరీలు పాఠశాలలను ఏర్పాటు చేశారు. 1854 నాటికి చిత్తూరు, వేలూరులలో నాలుగు వెర్నాకులర్ పాఠశాలలను అమెరికన్ మిషన్ ప్రారంభించింది. ఆ తర్వాత తిరుపతి, చంద్రగిరి, పుంగనూరు, మదనపల్లి, నగిరి, కార్వేటి నగరం మొదలైన చోట్ల ఆంగ్లో – వెర్నాకులర్ పాఠశాలలు ప్రారంభమైనాయి. జిల్లాలో స్త్రీ విద్యావ్యాప్తికి కూడా కృషి జరిగింది. సంఘ సంస్కరణలో భాగంగా అనేక బాలికల పాఠశాలలు కూడా ప్రారంభమైనాయి.

దివ్యజ్ఞాన సమాజ ప్రభావంతో చిత్తూరు జిల్లాలో సంస్కరణోద్యమాలు కొనసాగాయి. దివ్యజ్ఞాన ప్రచారానికి ఈ సంస్థ చిత్తూరు జిల్లాలో కొన్ని శాఖలను ఏర్పాటు చేసింది. అందులో చిత్తూరు లాడ్జీ, జిజ్ఞాన థియోసాఫికల్ లాడ్జి (వాయల్పాడు), మదనపల్లి లాడ్జి ముఖ్యమైనవి. దివ్యజ్ఞాన ప్రచారం ఆంగ్లంలో జరగడం వల్ల ఆ జ్ఞానం తెలుగువారికి లభింపజేయుటకు 'హంస' అనే పేరుతో ఒక తెలుగు పత్రికను 1908 జనవరిలో అనంతపురం జిల్లా గుత్తిలో ప్రారంభించారు. 1910లో దీనిని చిత్తూరుకు మార్చి 'దివ్యజ్ఞాన దీపిక' అనే పేరును పెట్టారు. వితంతు పునర్వివాహాలు ప్రోత్సహించడం, సమాజంలోని దురాచారాలపై పోరాడడం, మత్తు పానీయాలకు వ్యతిరేకంగా పోరాటాలు, జంతు వధను ఖండించడం మొదలైన విషయాల పట్ల దివ్యజ్ఞాన సమాజ సభ్యులు కృషిచేశారు. చిత్తూరు జిల్లా వాయల్పాడు నివాసి చింతా రఘునాథరెడ్డి

ఆర్య సమాజ ప్రచార ప్రభావితుడై యజ్ఞోపవీతం ధరించి తన పేరును రఘునాథ శర్మగా మార్చుకుని బలిజ, బోయ తదితర కులాల వారితో యజ్ఞోపవీత ధారణ చేయించాడు.

ప్రజలను చైతన్య వంతుల్ని చేయడంలో పత్రికల పాత్ర కూడా చాలా ఉంది. ప్రజల్లో సంఘ సంస్కరణకు కావలసిన వాతావరణాన్ని సృష్టించడంలో పత్రికల పాత్ర గణనీయమైంది. చిత్తూరు నుండి చిత్తూరు వార్తారాణి, అవేకనర్ ఆఫ్ ఇండియా, వాణి రంజని, సుజ్ఞాన, స్నేహలత, దివ్యజ్ఞాన దీపిక, రాయలసీమ, కాల చక్రం మొదలైన పత్రికల్లో సంస్కర్తలు తమ తమ ఆదర్శభావాలను ప్రచారం చేశారు.

1.5.2. జాతీయోద్యమం:

బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా భారత స్వతంత్ర పోరాటం ఒక్కసారిగా 18, 19 శతాబ్దాలలో జరగలేదు. ఆంగ్ల అధికార స్థాపన జరిగిన నాటినుండే ప్రజల్లో బ్రిటీష్ వ్యతిరేక స్వతంత్ర పోరాటాలు జరిగాయి. ప్రజల్లో జాతీయతా భావం ఉద్భవించడానికి, పూర్వం జరిగిన ఉద్యమాలు చాలావరకు ఒకదానికొకటి సంబంధం లేకుండా ప్రాంతీయంగా ప్రాంతీయ నాయకత్వాన సాగాయి. క్రమంగా ప్రజల్లో జాతీయ భావం పరిపూర్ణ రూపాన్ని సంతరించుకుని భారత జాతీయ కాంగ్రెస్ నాయకత్వాన ముఖ్యంగా గాంధీజీ రాజకీయ ప్రవేశం తర్వాత స్వాతంత్రోద్యమం జాతీయోద్యమంగా ప్రజా ఉద్యమంగా సాగింది. దేశ దాస్య విముక్తికై యావత్ భారతదేశం సాగించిన ఈ ఉద్యమంలో చిత్తూరు జిల్లావాసుల పాత్ర గణనీయమైంది.

బ్రిటీష్ వారి విధివిధానాల వల్ల భారతదేశం ఆర్థికంగా దెబ్బతినడం, ప్రజలను రెచ్చగొట్టే విధానాలు అమలు చేయడంతో ప్రజల్లో జాతీయతా భావం ఏర్పడి ఉద్యమం జరపవలసిన ఆవశ్యకత ఏర్పడింది. ఇందులో భాగంగా ఇండియన్ అసోషియేషన్, మద్రాస్ మహాజన సభ, సార్వజనీన సభ, బొంబాయి ప్రెసిడెన్సీ అసోషియేషన్ అనే ప్రాంతీయ సంస్థలు ఏర్పడ్డాయి. ఇలా ఏర్పడిన మద్రాస్ మహాజన సభను చిత్తూరు జిల్లాకు చెందిన పి. ఆనందాచార్యులు 1884లో స్థాపించాడు. ఈ సంస్థ ప్రజా సమస్యలను చర్చించడానికి ప్రధాన వేదికగా తోడ్పడింది. *"ఈ సంస్థలన్నింటినీ సంఘటిత పరచి జాతీయ స్థాయిలో భారత జాతీయ కాంగ్రెస్ అనే పేరుతో ఎ.ఓ. హ్యూమ్ ఒక సంస్థను 1885లో స్థాపించాడు. ఈ సంస్థ ఆధ్వర్యంలో ప్రధానంగా భారత జాతీయోద్యమం కొనసాగింది"* (చిత్తూరు జిల్లా సమగ్ర చరిత్ర – సంస్కృతి, 2009: 334).

1885 నుండి 1905 వరకు జాతీయోద్యమానికి మితవాదులు నాయకత్వం వహించారు. వీరిలో చిత్తూరు జిల్లాలోని కట్టమంచి నివాసియైన ఆనందాచార్యులు కూడా ముఖ్యమైన వారు. మితవాదులు ప్రార్థన, విజ్ఞప్తి, నిరసనల ద్వారా రాజ్యాంగబద్ధమైన శాంతియుత మార్గాల ద్వారా తమ కోర్కెలను తీర్చుకొనుటకు ప్రయత్నించారు. 1891లో నాగపూర్‌లో సమావేశమైన భారత జాతీయ కాంగ్రెస్ మహాసభకు అధ్యక్షత వహించిన ఆనందాచార్యులు అధ్యక్షోపన్యాసంలో పై విధానాల ద్వారానే మన వాంఛలు నెరవేర్చుకోవాలని తెలియజేశారు. అతివాద యుగంలో ఈ ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా

వందేమాతర ఉద్యమం ప్రారంభించారు. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాలలో వందేమాతర ఉద్యమం కొనసాగింది.

1914లో మొదటి ప్రపంచ యుద్ధానంతరం ఆంగ్లేయులకు వ్యతిరేకంగా జాతీయోద్యమంలో భాగంగా 'హోంరూల్ ఉద్యమం' ప్రారంభమైంది. ఆంధ్ర దేశంలో హరి సర్వోత్తమ రావు కార్యదర్శిగా హోంరూల్ లీగ్ శాఖలు మదనపల్లి, చంద్రగిరి, చిత్తూరులలో ఏర్పాటు చేశారు. హోంరూల్ లీగ్ తెలుగు ప్రాంతాలకు ఇన్‌ఛార్జిగా చిత్తూరు నివాసి పి.ఆర్.పార్థసారథి అయ్యంగార్‌ను నియమించారు. అనిబిసెంట్ ఈ ఉద్యమంలో భాగంగా 1916 మార్చి 18న చిత్తూరు జిల్లాలో జరిగిన సమావేశంలో పాల్గొని తన ఉపన్యాసాన్నిచ్చారు. అనిబిసెంట్ 1916 మే నెలలో మదనపల్లిలో ఒక కళాశాలను ఏర్పాటు చేశారు. హోంరూల్ ఉద్యమకాలంలో ఈ కళాశాల రాజకీయ కార్యకలాపాలకు కేంద్రం అయింది. చిత్తూరు జిల్లాలో స్వదేశీ అభిమానం బలపడటానికి, జాతీయ ఉద్యమానికీ ఈ కళాశాల ఎనలేని సేవ చేసింది.

జలియన్ వాలాబాగ్ హత్యలకు నిరసనగా ఖిలాఫత్ ఉద్యమానికి మద్దతుగా గాంధీ 1921లో సహాయ నిరాకరణోద్యమం ప్రారంభించాడు. ఈ ఉద్యమంలో చిత్తూరు జిల్లావాసులు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. *"గాంధీ ఆంధ్ర పర్యటనతో చిత్తూరు ప్రాంతంలో సహాయ నిరాకరణోద్యమం బాగా బలపడింది. తిరుపతి, రేణిగుంట, పుత్తూరు, కలికిరి, చిత్తూరు, రాజంపేట, కడప, తాడిపత్రి, కర్నూలు, ఆదోని, గుంతకల్ ప్రాంతాలను మూడు రోజులలో పర్యటించాడు. ఈ పర్యటనలో గాంధీ వెంట మౌలానా ఆజాద్, సుబాని, కొండా వెంకటప్పయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమ రావు ఉన్నారు"* (చిత్తూరు జిల్లా సమగ్ర చరిత్ర – సంస్కృతి, 2009: 342).

గాంధీ సైమన్ కమీషన్‌కు వ్యతిరేకంగా సంపూర్ణ స్వతంత్ర తీర్మానానంతరం 'శాసనోల్లంఘనోద్యమం' ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఉప్పు తయారు చేయకూడదనే శాసనాన్ని ఉల్లంఘించాలని గాంధీ తీర్మానించారు. ఈ ఉద్యమ కాలంలో చిత్తూరు జిల్లావాసుల పాత్ర అమోఘమైంది. ఈ ఉద్యమ కాలంలో అనంతశయనం అయ్యంగార్, శ్రీనివాసాచారి చిత్తూరు జిల్లాలో కాంగ్రెస్ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రచారం చేశారు. ఈ ఉద్యమాన్ని కొనసాగించడానికి చిత్తూరు జిల్లా భౌగోళిక పరిస్థితులు అంతగా అనుకూలించవు ఎందుకంటే సముద్ర తీర ప్రాంతం జిల్లాకు దూరంగా ఉంది కనుక. అయినప్పటికీ జిల్లాలో కొన్ని చోట్ల చౌడుమట్టితో ఉప్పును తయారు చేశారు.

1940లో గాంధీ వ్యక్తి సత్యాగ్రహాన్ని ప్రారంభించగా చిత్తూరు జిల్లాలో కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, శాసనసభ్యులు రామకృష్ణరాజు కార్వేటి నగరంలో డిసెంబర్ 1న ప్రజల ముందు వ్యక్తి సత్యాగ్రహం చేశారు. ఆ తరువాత అనంతశయనం అయ్యంగార్, గంగాధర పిళ్ళె, పుంగనూరు వాసి చెన్నారెడ్డి, యం.పి. పాపన్న గుప్త ఇలా అనేక మంది వ్యక్తి సత్యాగ్రహం చేసి జైలు శిక్షకు గురయ్యారు.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఆంగ్లేయులకు వ్యతిరేకంగా జరిగిన ఆఖరి పోరాటం క్విట్ ఇండియా ఉద్యమం. ఇందులో గాంధీ నిర్బంధించబడడంతో ప్రజలలో విధ్వంసకాండ మొదలైంది. చిత్తూరు జిల్లాలో నిరసనలు, హర్తాళ్‌లు, ఊరేగింపులు ముమ్మరంగా జరిగాయి. ఈ ఉద్యమంలో విద్యార్థులు కీలక పాత్రను పోషించారు. "తిరుపతి దేవస్థానం హైస్కూల్ విద్యార్థులు తరగతులను బహిష్కరించి గోవిందరాజస్వామి పుష్కరిణి దగ్గర బహిరంగ సభను నిర్వహించారు. నగరిలోక్రీ.శ.1942 ఆగస్టు 17న సుమారు 500ల మందితో గొప్ప ఊరేగింపు జరిపి పోలీస్ స్టేషన్‌పై దాడి చేయడమే గాక వేపగుంట దగ్గర టెలిగ్రాఫ్ తీగలు తొలగించారు" (చిత్తూరు జిల్లా సమగ్ర చరిత్ర – సంస్కృతి, 2009: 342).

ఈ విధంగా భారత స్వతంత్ర సంగ్రామంలో బ్రిటీష్ దాస్య శృంఖలాల నుండి విముక్తి పొందడానికి వందేమాతర ఉద్యమం, హోంరూల్ ఉద్యమం, శాసనోల్లంఘనోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, వ్యక్తి సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాలలో చిత్తూరు జిల్లావాసులు తమ వంతు కర్తవ్యాన్ని ప్రశంసనీయంగా నిర్వహించి దేశభక్తిని చాటుకున్నారు.

1.5.3. రైతు ఉద్యమం:

చిత్తూరు జిల్లా కంపెనీ పాలన కింద చేర్చబడిన తర్వాత భూసంబంధాలలో అనేక మార్పులు వచ్చాయి. ఎక్కువ మంది భూమిని సాగు చేసినప్పుడు రాజుకు ఎక్కువ ఆదాయం వచ్చేది. పండిన పంటలో రాజభాగంగా 1/6, 1/4 కొన్ని కొన్ని రాజ్యాలలో 1/2%కూడా ఇవ్వాల్సి వచ్చేది. శిస్తు చెల్లించక పోతే శిక్షలు ఉండేవి. తిరగబడిన వారిని సైన్యాలు అణచివేసేవారు.

ఆంగ్లేయులు తమ ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలకోసం అప్పటివరకూ అమలులో ఉన్న విధానాలకి భిన్నంగా కొత్త శిస్తు విధానాన్ని ప్రవేశపెట్టారు. జాగీర్దారీ, రైత్వారీ, గ్రామవారీ, ఇనాందారీ విధానాలను కూడా ప్రవేశపెట్టారు. చిత్తూరులో ఆనాటికి 10 పాలెములు ఉండేవి. అవి పాకాల, మొగరాల, పుల్లూరు, కల్లూరు, పులిచెర్ల, ఎదురు కొండ, నర్గంతి, తుంబు, గుడిపాటి, బంగారు పాలెములు. వీటిపై అధికారం చెలాయించేవారిని పాలెగాళ్ళని అనేవారు. ఆంగ్లేయులు వీరిపై విపరీతమైన పన్ను భారాన్ని విధించడంతో పాలెగాళ్ళు, రైతులు అనేక ఇబ్బందులకు గురైనారు. దీనితో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా 10 మంది పాలెగాళ్ళలో 9 మంది తిరగబడ్డారు. ఈ తిరుగుబాటులో అనేక మంది రైతులు కూడా పాల్గొన్నారు. కట్టమంచి, కాణిపాకం, కొత్తకోట మొదలైన ప్రాంతాల రైతులు గ్రామాలు వదిలి నిరసనలు తెలియజేశారు. రెడ్లు, బ్రాహ్మణులు, పాటిళ్ళు, ఇతరులు రైత్వారీ విధాన రద్దుకు కృషి చేశారు. ఈ విధమైన తిరుగుబాట్లలో పాలెగాళ్ళకు పలు రైతు వర్గాల సహకారం అందించారు. ఈ తిరుగుబాటును అణచడానికి ఆంగ్లేయులు గ్రామాలను తగులబెట్టడం, దోచుకోవడం, గ్రామీణులను బంధించడం వంటి చర్యలు చేపట్టినప్పటికీ ప్రజలందరూ ఏకమై పోరాడేవారు. చివరికి ఆంగ్లేయులు ఈ తిరుగుబాటును

అణచివేశారు. ఈ విధమైన నూతన శిస్తు విధానాలకి వ్యతిరేకంగా రైతులు, పాలెగాళ్ళు సాగించిన పోరాటమే రైతు ఉద్యమం.

1.5.4. గ్రంథాలయోద్యమం:

చిత్తూరు జిల్లాలో గ్రంథాలయోద్యమం 19వ శతాబ్దం ద్వితీయార్ధంలో ఆరంభమైంది. జిల్లాలో వ్యవస్థీకృతమైన గ్రంథాలయోద్యమం ఇటీవలి కాలంలో ఆవిర్భవించినప్పటికీ గతంలో కొందరు వ్యక్తులు జిల్లాలో గ్రంథాలయాలనునిర్వహించారు. చిత్తూరు జిల్లాలో తొలిసారిగా 1870లో మదనపల్లిలో అమెరికన్ మిషన్ ఫ్రీ రీడింగ్ రూం అను పేరుతో రీడింగ్ రూంను మరియు గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఆ తరువాత 1880లో చిత్తూరులో అమెరికన్ మిషన్ ఫ్రీ రీడింగ్ రూంను నెలకొల్పారు. 1880 – 1900 మధ్య కాలంలో పుంగనూరు, తిరుపతి, వాయల్పాడు మొదలైన ప్రాంతాలలో లైబ్రరీలు నెలకొల్పబడినాయి.

"1950 ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం పౌర గ్రంథాలయ చట్టం, 1955 హైదరాబాదు పౌర గ్రంథాలయ చట్టాలు ఏర్పడినవి. 1950 ఉమ్మడి మద్రాసు రాష్ట్రం గ్రంథాలయ చట్టం ఆంధ్ర ప్రాంతానికి, 1955 హైదరాబాద్ పౌరగ్రంథాలయ చట్టం తెలంగాణా ప్రాంతానికి వర్తించేవి" (చిత్తూరు జిల్లా సమగ్ర చరిత్ర – సంస్కృతి, 2009: 366). పై రెండు చట్టాల ప్రకారం ప్రతి జిల్లాకు లోకల్ లైబ్రరీ అథారిటీలు ఏర్పడినవి. సదరు లోకల్ లైబ్రరీ అథారిటీల ఆధీనంలో ప్రతి జిల్లాకు జిల్లా కేంద్ర గ్రంథాలయం, కొన్ని శాఖా గ్రంథాలయాలు ఏర్పడినవి. వీటి వల్ల ప్రజల్లో గ్రంథ పఠనమే కాక రాజకీయ, ఆర్థిక సమస్యలపై కూడా ఆసక్తి పెంపొందింది. ఇంకా దేశం కోసం త్యాగం చేయాల్సిన ఆవశ్యకతను, స్వాతంత్ర్య కాంక్షను గూర్చి ప్రజల్లో ఆసక్తిని రేకెత్తించాయి.

1.6. చిత్తూరు జిల్లా సాంఘిక – సాంస్కృతిక నేపథ్యాలు:

మూడు రాష్ట్రాల సంస్కృతులు కలిసిన చిత్తూరు జిల్లాలో అనేక రకాల మతాల వారు సంస్కృతుల వారు జీవిస్తున్నారు. వాటికి సంబంధించిన వివరాలు ఇక్కడచూద్దాం.

1.6.1. మతం:

భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ విశిష్ట లక్షణం. భారతదేశం వివిధ మతాలకు పుట్టినిల్లులాంటిది. హిందూ, బౌద్ధ, జైన, శిక్కు, ఇస్లాం ఇలా అనేక మతాలు దేశంలో ఉద్భవించాయి. భారత రాజ్యాంగం ప్రజలకు తమకు నచ్చిన మతాన్ని స్వీకరించి అభివృద్ధి పరచుకునే వెసులుబాటును కల్పించింది. ఇటువంటి విధానాలకు చిత్తూరు జిల్లా భిన్నమైనదేమీ కాదు. చిత్తూరు జిల్లాలో హిందూ మతం, జైన మతం, ఇస్లాం మతం, క్రైస్తవ మతం ప్రచారంలో ఉన్నాయి.

1.6.1.1. హిందూ మతం:

చిత్తూరు జిల్లాలో ఇతర మతాలతో పోలిస్తే హిందూ మతాన్ని ఆచరించేవారే అధికంగా ఉన్నారు. ఈ జిల్లాలో గల తిరుపతి, శ్రీకాళహస్తి అను రెండు ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలు ప్రాచీన

కాలంనుండి మత కేంద్రాలుగా ప్రసిద్ధి చెందినవి. తిరుపతి వైష్ణవ మత కేంద్రంగానూ, శ్రీకాళహస్తి శైవ మత కేంద్రంగానూ ప్రసిద్ధికెక్కాయి. శాతవాహనుల మొదలు అనేక రాజవంశాలు ఈ హిందూ మతాన్ని అభివృద్ధి చేస్తూనే వచ్చారు. అనేక దేవాలయాలను, వాటికి అనుసంధానంగా మఠాలను నిర్మించి హిందూ మతోద్ధరణకు పూనుకున్నారు. విజయనగర రాజుల కాలంలో వైష్ణవ మత ప్రాబల్యం అధికంగా ఉండేది. తిరుపతి తిరుమలలో అనేక మఠాలను నిర్మించారు.

1.6.1.2. జైన మతం:

"ప్రాచీన కాలంలో నేటి చిత్తూరు జిల్లాను వేంగడం ప్రాంతమని తమిళ గ్రంథమైన 'అహనానూర్'లో ప్రస్తావించబడింది" (చిత్తూరు జిల్లా సమగ్ర చరిత్ర – సంస్కృతి, 2009: 31132). ఈ ప్రాంతం తొండైనాడుకు సమీపంలో కలదు. క్రీ.పూ. 2వ శతాబ్దం నాటికి తొండైనాడులోకి జైనం విస్తరించడాన్ని బట్టి చిత్తూరు ప్రాంతానికి క్రీ.పూ. 1వ శతాబ్దానికి జైనం వ్యాపించి ఉండవచ్చని 'చిత్తూరు జిల్లా సమగ్ర చరిత్ర – సంస్కృతి' అనే గ్రంథంలో వి.కె. మోహన్ తెలిపారు. *"ప్రథమంలో జైనంపై పరిశోధనలు చేసిన ఎన్. గోపాల కృష్ణమూర్తి వల్లిమలై, నింద్ర, నల్లత్తూరు, చంద్రగిరిలను జైన కేంద్రాలుగా పేర్కొన్నాడు"* (చిత్తూరు జిల్లా సమగ్ర చరిత్ర – సంస్కృతి, 2009: 133).

1.6.1.3. ఇస్లాం మతం:

అరబ్బు ముస్లింలు ఆంధ్రదేశంలో వ్యాపార నిమిత్తమై వచ్చిన తర్వాత విజయనగర రాజుల కాలంలో కిరాయి సైనికులుగా చిత్తూరు జిల్లా ప్రాంతాలకు వచ్చారు. తర్వాత గోల్కొండ సుల్తానులు, హైదరాబాద్‌ను పాలించిన అసఫ్జాహీలు, ఆర్కాట్ నవాబులు, మైసూర్ పాలకులైన హైదరాలీ, టిప్పు సుల్తానులు చిత్తూరు జిల్లా ప్రాంతాన్ని పాలించారు. వీరి కాలంలో ఈ ప్రాంతంపై ముస్లింల ప్రాబల్యం పెరగడంతో ముస్లిం జనాభా కూడా పెరిగింది. పుంగనూరు, మదనపల్లి, చంద్రగిరి, పీలేరు, తిరుపతి మొదలైన అనేక ప్రాంతాలలో వీరు మసీదులు నిర్మించారు. నేటికీ ఈ ప్రాంతాలలో ముస్లింల జనాభా చెప్పుకోదగ్గదిగానే ఉంది. చిత్తూరులో గల దర్గాలో ప్రతి సంవత్సరం ఉత్సవాలు జరుగుతుంటాయి. ఈ ఉత్సవాలలో ముస్లింలేకాక ఇతర మతాలవారు కూడా ఉత్సాహంగా పాల్గొంటారు.

1.6.1.4. క్రైస్తవ మతం:

బెరుసలేంలో జన్మించిన క్రైస్తవ మతం క్రీ.శ. 53లోనే భారతదేశంలోకి ప్రవేశించింది. ఆంధ్ర ప్రాంతంలో క్రైస్తవమత ప్రచారం చేయుటకు క్రీ.శ. 1700లో 'కర్ణాటక మిషన్' వారు ప్రథమంగా ఒక సంఘంను ఏర్పాటు చేశారు. *"కర్ణాటక మిషన్ వారు 1701లో చిత్తూరు జిల్లా పుంగనూరుకు చెందిన ఒక వెలమ కుటుంబంకు క్రైస్తవ మత దీక్షను ఇచ్చారు. క్రమంగా పుంగనూరు ఒకక్రైస్తవ మతకేంద్రమైంది. ఆ తరువాత ఈ మతం జిల్లాలోని ఇతర ప్రాంతాలకు వ్యాపించింది"* (చిత్తూరు జిల్లా సమగ్ర చరిత్ర – సంస్కృతి, 2009: 136). స్కడ్డర్ సోదరుల కృషి వల్ల చిత్తూరు జిల్లాలో క్రైస్తవ మతం బాగా వ్యాప్తి చెందింది. క్రైస్తవమత ప్రచారకులు జిల్లాలో

అనేక చోట్ల పాఠశాలలు, వైద్యశాలలను నిర్మించారు. నేటికీ జిల్లాలో క్రైస్తవమత ప్రబోధనల కృషి ఫలితంగా నిమ్నజాతులు వారు క్రైస్తవ మతమును స్వీకరిస్తున్నారు.

1.6.2. దేవాలయాలు:

చిత్తూరు జిల్లాలో పల్లవ, చోళ, విజయనగర రాజుల కాలాలకు చెందిన ఆలయాలు చాలాఉన్నాయి. చిత్తూరు జిల్లాలో చోళ యుగానికి ముందు గల ఆలయాలు చాలా తక్కువగా ఉండడం, విజయనగర కాలానికి చెందిన ఆలయాలు ఎక్కువగా ఉండడాన్ని బట్టి జిల్లాలో దేవాలయ నిర్మాణ కార్యక్రమం చోళుల కాలంలో చురుకుగా సాగిందని, ఆ తరువాత దీనిని విజయనగర రాజులు కొనసాగించారని తెలుస్తుంది. లద్దిగం, వావిల్ తోట, కట్టమంచి, కలవగుంట, కాణిపాకం, మొగిలి, జోగిమల్లవరం, బొక్కిసపాలెం, కపిలతీర్థం, శ్రీకాళహస్తి, యాటవాకిలి, తొండమనాడు మొదలైన చోట్ల చోళ దేవాలయాలు కలవు. చోళ ఆలయాలతో పాటు యాదవరాయ రాజులు పునర్నిర్మించిన ఆలయాలు కూడా చిత్తూరు జిల్లాలో ఉన్నాయి. అందులో తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం గోవిందరాజ ఆలయం ప్రధానమైనవి.

విజయనగర పాలకులు, వారి సామంతులు దేవాలయం నిర్మాణానికి అధిక ప్రాముఖ్యతనిచ్చారు. పూతలపట్టు, యాదమరి, తిరుచానూరు, తిరుపతి, మంగాపురం, నారాయణవనం, నాగలాపురం, సోమపాలెం, చంద్రగిరి, పెద్దవలగటూరు మొదలైన చోట్ల వీరి ఆలయాలు ఉన్నాయి. అంతేకాక, చోళుల కాలంనాటి ఆలయాలకు గోపురాలు, కళ్యాణ మండపాలు, ఊంజల మండపాలు నిర్మించి విస్తృతపరిచారు. ఈ విధంగా విస్తృతపరిచిన ఆలయాలు కట్టమంచి, కలవగుంట, కాణిపాకం, తిరుపతి, తిరుమల, కపిల తీర్థం, శ్రీకాళహస్తి మొదలైనవి.

చిత్తూరు జిల్లాలో తిరుమల శ్రీ వేంకటేశ్వరాలయం, తిరుపతిలో గోవిందరాజ స్వామి ఆలయం, కోదండ రామ స్వామి ఆలయం, కపిలేశ్వర స్వామి ఆలయం, కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం, వేషాలమ్మ, ఇలగోలమ్మ, రంగమ్మ, గంగమ్మ, వరదరాజస్వామి ఆలయాలు, శ్రీనివాస మంగాపురం, అలమేల్ మంగాపురం, శ్రీకాళహస్తిలో శ్రీకాళహస్తీశ్వరాలయం, కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం, మొగిలో మొగిలీశ్వరాలయం, కట్టమంచి కళందీశ్వరాలయం, యాదమరి వరదరాజస్వామి ఆలయం, పూతల పట్టు భీమేశ్వరాలయం, కలవగుంట మొక్కంటీశ్వరాలయం, గుడిమల్లం పరశురామేశ్వరాలయం, తొండమనాడు కోదండ రామేశ్వరాలయం, అర్థగిరి ఆంజనేయాలయం, నారాయణ వనం, కళ్యాణ వేంకటేశ్వరాలయం, బోయ కొండ గంగమ్మ దేవాలయం మొదలైన దేవాలయాలు ఉన్నాయి. వీటితో పాటు గుర్రంకొండ, పెనుమూరు, కర్షకపల్లె, చౌడేపల్లి, పుంగనూరు మొదలైన చోట్ల కూడా ఆలయాలు కలవు. అయితే జిల్లాలో తిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయం, తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయం, కాళహస్తీశ్వరాలయం, కాణిపాకం వినాయక స్వామి ఆలయాలు మిగిలిన ఆలయాల కంటే ఎక్కువగా భక్తుల రద్దీతో కిటకిటలాడే దేవాలయాలు.

1.6.2.1. గుడిమల్లం పరశురామేశ్వరాలయం:

చిత్తూరు జిల్లాలో గల తొలి హైందవ నిర్మాణం, ఒకే ఒక గజపృష్టాకారంలో గల ఆలయం గుడిమల్లంలో గల పరశురామేశ్వరాలయం. భారతదేశంలో ఇప్పటి వరకూ లభ్యమైన లింగాలలో గుడిమల్లం లింగం అత్యంత ప్రాచీనమైనది. *"గుడిమల్లం ఆలయం నందివర్మ శైలికి చెందిన పల్లవ కట్టడమని కె.ఎ. నీలకంఠ శాస్త్రి పేర్కొన్నాడు. అయితే ఈ ఆలయం చోళుల కాలం నాటిదని కె.ఆర్. శ్రీనివాసన్ అభిప్రాయపడ్డారు"* (చిత్తూరు జిల్లా సమగ్ర చరిత్ర – సంస్కృతి, 2009: 146).

1.6.2.2. తిరుమల – శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం:

భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన ఆలయాలలో తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం ఒకటి. సముద్ర మట్టానికి 853 మీటర్ల ఎత్తులో ఏడు కొండలపై వెలసిన కలియుగ శ్రీ వేంకటేశ్వరుడు హిందువులకు ఆరాధ్య దైవంగా విరాజిల్లుతున్నాడు. స్వదేశీయులే కాక విదేశీయులు కూడా తిరుమల స్వామివారి దర్శనార్థం వస్తూ ఉంటారు. "ప్రపంచంలో రోమ్‌లోని వాటికన్ సిటీ తర్వాత అత్యధిక ఆదాయం గల రెండో దేవస్థానంగా తిరుమల తిరుపతి దేవస్థానం ప్రసిద్ధి చెందినది" (చిత్తూరు జిల్లా సమగ్ర చరిత్ర – సంస్కృతి, 2009: 147). తిరుమలకు ఎగువ తిరుపతి అని మరో పేరు కలదు. తిరుమలకు పోవుటకు రోడ్డు మార్గంతో పాటు మరో రెండు కాలి నడక మార్గాలు ఉన్నాయి. అవి అలిపిరి మీదుగా ఒకటి, శ్రీనివాస మంగాపురం మీదుగా మరోటి. ఈ మూడు మార్గాల గుండా ప్రతిరోజూ వేలాదిమంది భక్తులు తిరుమలకు వెళ్ళి స్వామివారికి కానుకలను, తమ ముడుపులను చెల్లించుకుంటుంటారు.

పూర్వ గాథల ప్రకారం ఈ ఆలయం నాలుగు యుగాలలో పవిత్రమైంది. కృత యుగంలో వృషభాచలంగా, త్రేతాయుగంలో అంజనాచలంగా, ద్వాపరయుగంలో శేషాచలంగా, కలియుగంలో వేంకటాచలంగా పిలవబడుతోంది. ఈ ఆలయం కొన్ని శతాబ్దాల వారీగా అనేక రాజవంశాల చేతులలో అభివృద్ధి చేయబడింది. తిరుపతి నుండి తిరుమలకు వెళ్లే కాలినడక మార్గాన కనపడు గాలి గోపురం కడప జిల్లా రాయచోటి తాలూకాకు చెందిన సామంతులైన మట్లి కుటుంబ సభ్యుడు మట్లి కుమార అనంతరాజు నిర్మించాడు. *"భవిష్య పురాణం ప్రకారం స్వామియొక్క స్వయం వ్యక్త విగ్రహానికి తొండమాన్ చక్రవర్తి స్వామి పుష్కరిణికి దక్షిణాన అన్ని హంగులతో ఆలయం నిర్మించాడు"* (చిత్తూరు జిల్లా సమగ్ర చరిత్ర – సంస్కృతి, 2009: 147). అందం, పవిత్రత మిళితమైన స్థలంగా ప్రసిద్ధిగాంచిన ఈ స్థలాన్ని గూర్చి శాస్త్రాలు, పురాణాలు, స్థల మహత్యాలు ప్రశంసించాయి.

తిరుమల కొండ మీద ప్రధాన ఆలయం వేంకటేశ్వర స్వామిది. దీనితో పాటు అనేక ఆలయాలు, 108 పుణ్య తీర్థాలు కలవు. గర్భగుడిలో గల స్వామి వారి విగ్రహాన్ని స్వయంభువుగా భావిస్తారు. దేశంలో గల స్వామి విగ్రహాలలో ఇదే అత్యంత ప్రాచీనమైనది. ఇక్కడ గల విగ్రహాన్ని శివునిదని, బాలత్రిపురసుందరిదని, సుబ్రమణ్య స్వామిదని అంటారు.

1.6.2.3. శ్రీకాళహస్తి:

ప్రకృతిలోని ఐదు పంచభూత లింగాలలో వాయులింగం ఒకటి మిగిలిన నాలుగు లింగాలైన పృథ్వి లింగం, అప్పు లింగం, తేజో లింగం, ఆకాశ లింగం తమిళనాడులో ఉండగా వాయులింగం మాత్రం ఆంధ్ర రాష్ట్రంలో కలదు. ఇది చిత్తూరు జిల్లాలోని శ్రీకాళహస్తి కావడం విశేషం. శ్రీకాళహస్తిలో ప్రధాన ఆలయం శ్రీకాళహస్తీశ్వరాలయం. ఇది స్వర్ణముఖి నది ఒడ్డున కలదు. శ్రీ, కాల, హస్తి అను పదాలనుండి శ్రీకాళహస్తి పదం ఏర్పడింది. తనపై అపారమైన భక్తి కనపరిచినందు వల్ల శివుడు సాలెపురుగు, పాము, ఏనుగులకు మోక్షం ప్రసాదించాడు. అందువల్ల ఈ క్షేత్రానికి ఆ పేరు వచ్చింది. పురాణాలలో, శివానందలహరిలో ధూర్జటి శ్రీకాళహస్తి మహాత్మ్యంలో ఈ క్షేత్ర ప్రస్తావన కలదు.

పురాణాల ప్రకారం మేరు పర్వతం నుండి మూడు భాగాలు విడువడి మూడు ప్రాంతాలలో పడింది. అందులో ఒకటి శ్రీకాళహస్తి. దీనికి కైలాసగిరి అని పేరు కూడా కలదు. దక్షిణ భారతదేశంలో గల ఇతర పెద్ద ఆలయాల వలే శ్రీకాళహస్తీశ్వరాలయ సముదాయం మొత్తం ఒక్కసారిగా నిర్మించబడలేదు. కొన్ని శతాబ్దాల వారీగా పల్లవ, చోళ, విజయనగర రాజుల చేతుల్లో అభివృద్ధి చెందుతూ వచ్చింది. ఈ ఆలయాన్ని పల్లవరాజులు నిర్మించగా చోళ రాజులు పునర్నిర్మాణం చేసి ప్రధాన ఆలయాన్ని నిర్మించారు. ఆ తరువాత కుళోత్తుంగ చోళుడు గాలిగోపురాన్ని, కార్వేటి నగరం పాలించే యాదవ రాయలు వెలుపలి ప్రాకారాన్ని, క్రీ.శ. 1516లో శ్రీకృష్ణదేవరాయలు 100 స్తంభాల మండపాన్ని నిర్మించినట్లు చిత్తూరు జిల్లా సమగ్ర చరిత్ర – సంస్కృతి అనే గ్రంథంలో వి.కె. మోహన్ గారు తెలియజేశారు.

ఇక్కడ శ్రీకాళహస్తీశ్వరాలయంతో పాటు ధర్మరాజు ఆలయం, వరదరాజస్వామి ఆలయం, నీలకంఠేశ్వర స్వామి ఆలయం, ముక్తి వినాయక ఆలయం, కన్నప్ప ఆలయం, దుర్గాలయం కలవు. వీటితో పాటు కైలాసగిరి కొండలో హరిహర తీర్థం, కళింగ తీర్థం, సహస్రలింగ తీర్థం, మార్కండేయ తీర్థం మరియు భరద్వాజ, మయూర, నారద, సరస్వతి మొదలైన పవిత్ర తీర్థాలు కూడా కలవు. ఇక్కడ మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు 13 రోజులపాటు జరుగుతాయి. ఈ ఉత్సవ సమయంలో మకర సంక్రాంతి రోజు శివపార్వతుల ఊరేగింపు జరుగుతుంది. ఈ ఉత్సవ సమయంలోనూ, ఇతర సమయాలలోనూ స్వామి వారిని చూడడానికి భక్తులు దేశ విదేశాలనుండి ఇక్కడికి వస్తుంటారు. ఈ విధంగా వైష్ణవ క్షేత్రమైన తిరుమలకు 40 కి.మీ. దూరంలో గల ఈ క్షేత్రం దక్షిణ కైలాసంగా, ఉచిష్ట నిలయంగా, రాహు కేతు దోష నివారణ కేంద్రంగా ప్రసిద్ధి చెందింది.

1.6.2.4. కాణిపాకం:

కాణిపాకంలో బహుదా నది పక్కన స్వయంభువుగా వెలసిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి సత్య ప్రమాణాలకు ప్రసిద్ధిగా, భక్తుల పాలిట కోరిన వరాలిచ్చే కొంగు బంగారంగా విరాజిల్లుతున్నాడు. 15 ఏళ్ళ క్రితం అతి చిన్న దేవాలయంగా ఉన్న ఈ కాణిపాకం శ్రీమతి గల్లా

అరుణ కుమారి కృషి ఫలితంగా నేడు రాష్ట్రంలో అతి పెద్ద పుణ్య క్షేత్రాలలో ఒకటిగా విరాజిల్లుతోంది. తిరుమల దర్శనార్థం విచ్చేయు భక్తులు చాలామంది ఇక్కడికి వస్తుంటారు.

రోజు రోజుకు అభివృద్ధి చెందుతున్న ఈ కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుటకు ప్రతిరోజూ వేలాది మంది భక్తులు తరలి వస్తుంటారు. *"అయ్యప్ప దీక్ష తరహాలో కాణిపాకంలో గణేష్ దీక్షను దేవస్థానం వారు 2006 నుండి ప్రవేశపెట్టారు. ఆలయంలో మొట్ట మొదటి సారిగా 2007లో స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా భాద్రపద శుద్ధ చవితి రోజున ఈ గణేష్ దీక్ష మాలాధారణ కార్యక్రమాన్ని వినాయక చవితి రోజున ప్రారంభించారు"* (చిత్తూరు జిల్లా సమగ్ర చరిత్ర – సంస్కృతి, 2009: – 170).

1.6.3. పర్యాటక ప్రాంతాలు:

పర్యాటక రంగంలో చిత్తూరు జిల్లా అంతర్జాతీయ గుర్తింపు పొందింది. ప్రపంచంలోనే అధిక సంఖ్యలో యాత్రికులు సందర్శిస్తున్న తిరుమల దేవాలయం జిల్లా కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేస్తోంది. జిల్లాలోని అనేక పుణ్య క్షేత్రాలు, పర్యాటక ప్రదేశాలు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపును పొందాయి. చిత్తూరు జిల్లాలో చూడదగిన ప్రదేశాలలో ప్రముఖమైనవి తిరుమల, తిరుపతి, తిరుచానూరు, చంద్రగిరి, కాణిపాకం, శ్రీకాళహస్తి, నాగలాపురం, కైలాస కోన, తలకోన, కపిలతీర్థం, కైగల్ జలపాతం, హార్సిలీ కొండలు, వేంకటేశ్వర జంతు ప్రదర్శన శాల, యస్.వి. మ్యూజియం, చంద్రగిరి కోట మొదలైనవి. జిల్లా ఆర్థిక, సామాజిక పరిస్థితులపై ఈ పర్యాటక ప్రదేశాల ప్రభావం అధికంగా ఉంది. రవాణా, వ్యాపార రంగాల అభివృద్ధికి కూడా ఈ పర్యాటక ప్రాంతాలు దోహదపడుతున్నాయి.

జిల్లాలోని ప్రతి పర్యాటక ప్రాంతంలో ఏదో ఒక ఆలయం ఉండి ఇటు భక్తులకు, అటు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. తిరుమల, తిరుపతి, శ్రీకాళహస్తి, కాణిపాకం మొదలైన ప్రాంతాలు పుణ్య క్షేత్రాలుగా ప్రసిద్ధి చెంది పర్యాటకులను కూడ అలరింపజేస్తున్నాయి. మిగిలిన ప్రాంతాలైన కైలాసకోన, తలకోన, కైగల్ జలపాతం, హార్సిలీ కొండలు కేవలం పర్యాటక ప్రాంతాలుగా ప్రసిద్ధి చెందాయి.

నారాయణ వనం నుండి 8 కి.మీ. దూరంలో గల 'కైలాస కోన' విహార కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. ఈ ప్రాంతాన్ని వీక్షించడానికి వేసవిలో యాత్రికులు ఎక్కువగా వస్తుంటారు. ఇక్కడ ఉన్న జలపాతం సుమారు 100 అడుగుల ఎత్తునుండి క్రిందికి జాలువారుతుంది. ఈ సుందర జలపాతం ఏడు బావుల గుండా ప్రవహించి క్రిందికి దూకడం, సంవత్సరం పొడవునా ఇది ప్రవహించడం విశేషం. ఇక్కడ గల సదాశివేశ్వరాలయంలో ప్రతి శివరాత్రినాడు ఉత్సవాలు జరుగుతుంటాయి. ఇక్కడ గల జలపాతంలో స్నానాలు ఆచరించడం వల్ల, సేవించడం వల్ల కొన్ని రుగ్మతలు నయమవుతాయని భక్తుల నమ్మకం. ఈ జలపాతాన్ని ఇక్కడ జరిగే ఉత్సవాన్ని చూడటానికి మన రాష్ట్రం నుండే కాక తమిళనాడు నుండి కూడా అనేకమంది యాత్రికులు వస్తుంటారు.

తిరుపతికి 56 కి.మీ. దూరంలో 'తలకోన' జలపాతం కలదు. ఇక్కడికి భక్తి ప్రపత్తులతో కొంత మంది వస్తే, మానసికానందం కోసం మరికొంతమంది వస్తుంటారు. చల్లని వాతావరణం, అందమైన ప్రకృతి, ఎత్తైన కొండల మధ్య ప్రవహించే జలపాతం, శివగంగ స్నాన ఘట్టం, శ్రీ సిద్ధేశ్వర స్వామి ఆలయం, అటవీ సమాచార కేంద్రం, అతిథి గృహాలు, కమనీయమైన దృశ్యాలు ఇక్కడికి వచ్చే పర్యాటకులను ఆనంద డోలికలలో విహరింపజేస్తుంటాయి. తలకోన రాయలసీమ జిల్లాలో దట్టమైన అటవీ ప్రాంతమే కాక, అత్యంత శోభాయమానంగా పర్యాటకులను ఆకర్షించే పర్యాటక ప్రాంతం కూడా. మొదట్లో తలకోన పుణ్యతీర్థంగానే ప్రసిద్ధి చెందింది. కానీ ఇటీవల చలన చిత్రీకరణ ఊపందుకోవడంతో వెండి తెరపై తలకోన పచ్చదనాలు, అందమైన దృశ్యాలు దశదిశలా వ్యాపించి పొరుగు రాష్ట్రాల వరకు తలకోన పేరు వ్యాపించింది.

చిత్తూరు జిల్లాలో చెప్పుకోదగ్గ మరో జలపాతం 'కైగల్ జలపాతం'. పచ్చని చెట్లు, చల్లటి గాలి, చుట్టూ కొండలు గల ఈ జలపాతం ఎత్తైన బండల నుండి జాలువారుతూ చుట్టుప్రక్కల ప్రాంతాల వారినే కాక కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల వారిని కూడా ఆకట్టుకుంటున్నది. పలమనేరు నుండి 30 కి.మీ. దూరంలో కుప్పం రహదారిలో కైగల్ గ్రామం వద్ద ఇది ఉంది.

ఆంధ్ర రాష్ట్రంలో ఏకైక విడిది కేంద్రంగా, ఆంధ్రా ఊటీగా పిలువబడుతున్న ప్రముఖ పర్యాటక కేంద్రమైన 'హార్సిలీహిల్స్" చిత్తూరు జిల్లా బి.కొత్తకోట మండలంలో ఉంది. *"1870లో ఇండియన్ సివిల్ సర్వీస్‌కు చెందిన హార్సిలీ దీనిని వేసవి విశ్రాంతి కేంద్రంగా అభివృద్ధి పరిచి వాడుకున్నాడు"* (చిత్తూరు జిల్లా సమగ్ర చరిత్ర – సంస్కృతి, 2009: 552). నిండు వేసవిలో చల్లదనాన్ని అందిస్తూ, నిత్యం ప్రకృతి అందాలతో, అడుగడుగునా పక్షుల కిలకిలారావాలతో, రమణీయమైన దృశ్యాలతో ప్రసిద్ధి చెందిన ప్రాంతం హార్సిలీ హిల్స్. పర్యాటకుల కోసం ఇక్కడ రాష్ట్ర టూరిజం వారు రెస్టారెంట్లు, అతిథి గృహాలు, స్విమ్మింగ్ పూల్, ప్లే గ్రౌండ్, కాన్ఫరెన్స్ హాల్‌ను ఏర్పాటు చేశారు. ఇంకా అటవీశాఖ ఆధ్వర్యంలో జంతు ప్రదర్శనశాల, జింకల పార్కు, మొసళ్ళ పార్కు, ప్రకృతి అధ్యయన కేంద్రం, మినీ ధియేటర్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ ప్రకృతి సిద్ధంగా ఉన్న గాలిబండ, ప్రేమికుల ఏకాంతానికి ఆకర్షణగా నిలిచింది. ఈ విధమైన అందాలతో హార్సిలీహిల్స్ పర్యాటకులను ఆకర్షిస్తోంది.

తిరుపతికి 5 కి.మీ. దూరంలో గల యస్.వి. జూ పార్కు రకరకాల జంతువులతో, పక్షులతో కళకళలాడుతుంది. ఇక్కడ గల సింహాలు, చిరుతలు, ఆఫ్రికన్ కోతులు, మొసళ్ళు రకరకాల జంతువులను సంరక్షిస్తూ పర్యాటకులకు కనువిందు చేస్తూ సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటున్న ప్రాంతం శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శన శాల. తరువాత తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర మ్యూజియం ఆఫ్ టెంపుల్ ఆర్ట్స్, యస్.వి. మ్యూజియం చిత్తూరు జిల్లాలో చూడదగ్గ మ్యూజియాలు.

వీటితో పాటు చిత్తూరు సదాశివ కోన, గంగమ్మ శిరస్సు జలపాతం, కళ్యాణ రేవు, పలమనేరు సమీపంలోగల కౌండిన్య ప్రాజెక్ట్ ఎలిఫెంట్, పెనుమూరు సమీపంలోగల పులిగుండు,

చంద్రగిరి దుర్గం, గుర్రం కొండ, చిత్తూరు రిజర్వు ఫారెస్టు మొదలైనవి చూడదగ్గ పర్యాటక ప్రాంతాలు.

1.6.4. జాతరలు – ఉత్సావాలు – పండుగలు:

తెలుగు వారింట పండుగలు – పబ్బాలు, నోములు, వ్రతాలు, ఉత్సవాలు, ఊరేగింపులు, జాతరలు, కొలువులు, తరతరాలుగా సమాజంలోని వివిధ వర్గాల వ్యక్తుల్ని ఒక్క చోటకు చేరుస్తున్నాయి. ఇలాంటి సాంఘిక జానపదాచారాలలో జాతరలు అత్యంత ప్రాచీనమైనవి మరియు ప్రముఖమైనవి. ఆంధ్ర దేశంలో ఈ జాతరలకు ఎంతో ప్రాధాన్యత కలదు. రాష్ట్రం మొత్తం మీద రాయలసీమలో ఈ జాతరలను అత్యంత వైభవంగా చేస్తారు. జాతరలు మన సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపడతాయి. సాధారణంగా ఏప్రిల్ నెలలో ప్రారంభమయ్యే ఈ జాతరలు కొన్ని కొన్ని ప్రాంతాలలో ముందుగానే మొదలవుతాయి. ప్రజలు ఈ జాతరలను ఎంతో భయభక్తులతో చేస్తారు. గ్రామ దేవతను ఆరాధించడం ద్వారా తమ కష్టాలు తీరి మంచి జరుగుతుందనే నమ్మకం ప్రజల్లో బాగా నాటుకు పోయింది. అంతేకాకుండా, ఎలాంటి రోగాలు రాకుండా, అంటు వ్యాధులు రాకుండా చూసుకుంటుందని, వర్షాలు కురిపించి పాడి పంటలకు కొదవ లేకుండా చేస్తుందని ప్రజల నమ్మకం.

చిత్తూరు జిల్లాలో ఈ జాతరలు పట్టణాలలోనే గాక గ్రామాల్లోనూ జరుపుకుంటారు. జిల్లా మొత్తం మీద జరుపుకునే ఈ జాతరలలో చిత్తూరు గంగ జాతర, శ్రీకాళహస్తి ఏడుగంగల జాతర, పుంగనూరు గంగజాతర, పలమనేరు గంగజాతర, పాకాల గంగజాతర, చింతపర్తి గంగజాతర, కుప్పం గంగజాతర, తిరుపతి గంగజాతర మొదలైనవి ప్రముఖమైనవి. వీటిలో చిత్తూరు, తిరుపతి గంగజాతరలు వారం రోజులపాటు, కుప్పంలో రెండు వారాల పాటు జరుపుకుంటారు.

చిత్తూరు జిల్లాలో జరిగే ఉత్సవాల విషయానికొస్తే ప్రతి ఊళ్ళో ఏదో ఒక ఉత్సవం, పరష, ఊరేగింపు ఎప్పుడూ జరుగుతూ ఉంటాయి. రథోత్సవాలు, తెప్పోత్సవాలు ఇలా అనేకమైనవి దేవుడి పేరున జరుగుతాయి. జాతరలు, ఉత్సవాలు తేదీల ప్రకారమైన రావచ్చు లేదా ఏదో ఒక మంచి రోజు నిర్ణయించి ఆ రోజు జరపవచ్చు. మామూలు ఉత్సవాలు, ఊరేగింపులు వివిధ పండుగల నాడు జరుగుతాయి. ఉదాహరణకు శ్రీరామనవమికి కళ్యాణోత్సవాలు, ఊరేగింపులు లాంటివి. తిరుపతిలో కోదండ రామస్వామికి శ్రీరామనవమి సందర్భంగా రథోత్సవం, తెప్పోత్సవం జరుపుతారు. కోదండ రామస్వామి, వరదరాజ స్వామి, వేంకటేశ్వర స్వామి, కృష్ణ పెరుమాల్ స్వామి, లక్ష్మీ నరసింహస్వామి, వేణు గోపాల స్వామి మొదలగు వైష్ణవ దేవుళ్లకు వరుసగా చిత్తూరు, యాదమరి, పుల్లూరు, ఉత్రబ్రాహ్మణపల్లి, పాపిపల్లి, వెంకటగిరి కోట మొదలైన ప్రాంతాలలో ఉత్సవాలు, జాతరలు జరుగుతాయి. ఇంకా వింజం, ఐరాల, మొగిలి, పలమనేరు సోమల, చౌడేపల్లి మొదలైన ప్రాంతాలలో శైవ దేవుళ్లైన సిద్ధేశ్వర స్వామి, వీరభద్ర స్వామి, మొగిళీశ్వర స్వామి, కాశీ విశ్వేశ్వర స్వామి పేర్ల మీద ఉత్సవాలు జరుగుతాయి.

తరతరాలుగా జన సమూహంలో నిలిచి ఉన్న నమ్మకాలు, సంప్రదాయాలు, క్రియారూపాన్ని దాల్చగా పండుగలేర్పడ్డాయి. మొదట ప్రకృత్యారాధనగా ప్రారంభమై, వ్యవసాయ సంస్కృతి కాలంలో స్పష్టమైన రూపాన్ని పొంది, తర్వాతి కాలంలో ఇంకా క్లిష్ట స్వరూపం సంపాదించి చివర ప్రాచీన ఆచారాలు సూచ్య గుణాన్ని మాత్రం కలిగి ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కలిగించేవిగా పండుగలు రూపొందాయి.

తెలుగు వారి పండుగలైన ఉగాది, శ్రీరామనవమి, నాగులచవితి, వరలక్ష్మీ వ్రతం, శ్రీకృష్ణాష్టమి, వినాయక చవితి, దసరా, దీపావళి, సంక్రాంతి, శివరాత్రి మొదలైన పండుగలను ఆంధ్ర దేశంలో అన్ని జిల్లాల వారిలాగే చిత్తూరు జిల్లావారు కూడా ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు. వీటితో పాటు ముస్లిం పండుగలైన రంజాన్, బక్రీద్, మొహరం, పీర్ల పండుగ, క్రైస్తవ పండుగలైన క్రిస్మస్, గుడ్ ఫ్రైడే, నూతన సంవత్సర పండుగలు కూడా చిత్తూరు జిల్లాలోని ఆయా మతాలవారు జరుపుకుంటారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అనే భేదం లేకుండా కులమతాలకతీతంగా పండుగలను అందరూ కలిసి చేసుకుంటారు.

ఈ అధ్యాయంలో చిత్తూరు జిల్లా భౌగోళిక పరిస్థితులకు సంబంధించిన అన్ని విషయాలనూ స్థూలంగా తెలియజేశాను. తర్వాత రాబోయే అధ్యాయంలో ప్రపంచసాహిత్యంలో నవల, కథానిక ఆవిర్భావాన్ని చర్చించబోతున్నాను.

అధ్యాయం – 2

ప్రపంచ సాహిత్యంలో నవల, కథానికల ప్రారంభం

2.0. కల్పనా సాహిత్యం – పరిచయం:

కల్పనా సాహిత్యం అంటే కల్పితము అని అర్థం కాదు. జీవితానికి సంబంధించినటువంటి ఒక యదార్థాన్ని ఒక వాస్తవిక స్థితిలో ఆవిష్కరించటం. సాహిత్య పరంగా ఈ మాటని నూటికి నూరు శాతం కాకపోయినా అధిక శాతంగా నవల, కథానిక ప్రక్రియలు సుసంపన్నం చేస్తున్నాయి. ఈ రెండు ప్రక్రియలూ తెలుగు సాహిత్యంలోకి ఆధునిక కాలంలో, పాశ్చాత్య ప్రభావం వల్ల వచ్చాయి.

స్థూలంగా తెలుగు సాహిత్యాన్ని సాహిత్య చరిత్రకారులు ప్రాచీన సాహిత్యం, ఆధునిక సాహిత్యం అని రెండు భాగాలుగా విభజించారు. ఇటీవల వస్తున్న సాహిత్యాన్ని ఆధునికోత్తర సాహిత్యం అని కూడా అంటున్నారు. ఈ ఆధునికోత్తర సాహిత్యం అనే మాటను అటుంచి తెలుగు సాహిత్యాన్ని చూస్తే, ప్రాచీన సాహిత్యం అంతా (ఒకటి అరా మినహాయింపులు ఉండొచ్చు) లౌకిక కర్తవ్యాన్ని బోధించే అంశాలను ప్రధానంగా చేసుకొని వచ్చింది. వీటితో పాటూ అక్కడక్కడా ప్రజల జీవన విధానాలకు సంబంధించిన నైతిక విలువలను, మంచి చెడులను బోధించే సాహిత్యం కూడా కొంత వచ్చింది. ఉదాహరణకు శతక సాహిత్యాల్లాంటివి. ఇంకా మనిషి తన జీవితంలో పడుతున్న కష్టాలను, ఇబ్బందులను మరిచిపోయి ఆనందలోకాల్లో విహరింపజేయగలిగే ఆత్మాశయ కవిత్వం కూడా ఇందులో భాగంగానే వచ్చింది. ఉదాహరణకు భక్తి సాహిత్యంలాంటివి.

అయితే ప్రాచీన సాహిత్యం కన్నా నేడు ఆధునిక సాహిత్యంగా పిలవబడుతూ వస్తున్న సాహిత్యం చాలా విషయాల్లో భిన్నమైనదిగా కనిపిస్తుంది. ఎలా అంటే ప్రధానంగా వస్తువులోను, రూపంలోను, అభివ్యక్తిలోను మార్పు రావడం. ప్రాచీన సాహిత్యంలోని వస్తువులా కాక సామాన్యున్ని ప్రధానంగా చేసుకొని, ఆ సామాన్యుని చుట్టూ అల్లుకున్న సమాజంలోని ప్రతి విషయాన్నీ ప్రధానంగా చేసుకొని రచన రూపుదిద్దుకోవడం ఆధునిక సాహిత్యంలో వచ్చిన ప్రధాన మార్పు. దీనితో పాటూ ఎన్నుకున్న వస్తువుకు సరిపడా ప్రక్రియని ఎంచుకోవడంలో కనపరిచిన ప్రక్రియా వైవిధ్యం కూడా ఒక గొప్ప మార్పే.

అయితే ప్రాచీన సాహిత్యంలో వచ్చిన సాహిత్యమంతా చాలా వరకూ దేవుళ్ళకు (వైష్ణవ, శైవ), మతాలకు, రాజులకు సంబంధించిన, లేదా బ్రాహ్మణులకు సంబంధించిన విషయాలే ఎక్కువగా ఉన్నాయిగానీ సామాన్య ప్రజానికానికి సంబంధించి ఆ సామాన్యుని చుట్టూ అలుముకున్న కష్టాలను, బాధలను గురించి, సమాజంలో జరుగుతున్న దోపిడీ (ఆర్థిక పరంగా, రాజకీయ పరంగా, వర్గ పరంగా, శ్రమ పరంగా) గురించి తెలిపే విషయాలు అరుదు అంటే ఆశ్చర్యపడాల్సిన పనేమిలేదు. అందుకే ముదిగంటి సుజాతారెడ్డి గారు తెలుగు నవలానుశీలనంలో *"ఆర్థిక, సామాజిక చైతన్య స్ఫురణను, సామాజికావగాహనను విషయవిజ్ఞానాన్ని కలిగించే సాహిత్య సృష్టి ప్రధానంగా ఆధునిక కాలంలోనే జరిగింది"* (తెలుగు నవలానుశీలనం, 2017: 7) అని చెప్తూ, ఇటువంటి సాహిత్య ప్రయోజనాన్ని సాధించే కవితలు, కథానికలు, నాటికలు, నవలలు, వ్యాసాలూ ఆధునిక కాలంలో చాలా వచ్చాయి అని కూడా చెప్పారు.

ఈ విధంగా వచ్చినటువంటి ఆధునిక సాహిత్య ప్రక్రియలలో దినదిన ప్రవర్తమానమవుతూ, ప్రజల ఆదరాభిమానాలను అధికంగా పొందుతున్న ప్రక్రియలు నవల, కథానికలు. నేడు మనం ఈ ప్రక్రియలను కల్పనా సాహిత్య ప్రక్రియలుగా చెప్పుకుంటున్నాము. (ఇక్కడ కల్పనాసాహిత్యం అంటే ఏమిటి అని మనకు సందేహం రావచ్చు. 'జీవితానికి సంబంధించినటువంటి ఒక యదార్థాన్ని ఒక వాస్తవిక స్థితిలో ఆవిష్కరించటం ఈ రోజున మనం మాట్లాడుకొనే కల్పనా అన్న మాటకు అర్థం'గా మనం చేసుకోవచ్చు) కవిత్వం, నాటకం ఒక్కొక్కసారి ఈ కోవకు చెందుతాయేమో అనిపిస్తుంది. "నవల, నవలిక, కథ– ఈ మూడింటినీ కలిపి "కల్పనా సాహిత్యం" అని వల్లంపాటి వెంకటసుబ్బయ్య కథాశిల్పం అనే గ్రంథంలో చెప్పారు. అలానే fictionకి తెలుగులో సమానార్థక పదంగా వాడుతున్న 'కల్పనా సాహిత్యం' అనే సాంకేతిక పదం కిందికి నవల, కథానిక ప్రక్రియలే వస్తాయన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

అలాగే సి. మృణాళిని గారు 'సాంఘిక నవల – కథన శిల్పం' అనే గ్రంథంలో *"పాశ్చాత్య నవలా విమర్శకులు 'నావెల్', 'ఫిక్షన్' అనే పదాలను తరచూ సమానార్థకాలుగా ప్రయోగించారు. వాస్తవానికి 'ఫిక్షన్' అంటే 'కల్పనా సాహిత్యం'. కవిత్వనాటకాదులు కూడా కల్పనాసాహిత్యానికి చెందినవే అయినప్పటికి వీరి విమర్శలో నవల, 'ఫిక్షను'కు రూఢ్యార్థంగా నిలిచిపోయింది"* అని చెప్పారు. (సాంఘిక నవల – కథన శిల్పం, 1988: 25).

అంతేకాక Fiction (కల్పనాసాహిత్యం)కి A DICTIONARY OF LITERARY TERMSలో కింది విధంగా అర్థం చెప్పారు.

"Fiction: a vague and general term for an imaginative work, usually in prose. at any rate. It does not normally cover poetry and drama though both are a form of fiction in that they are moulded and contrived – or feigned, fiction is now used in general of the novel, the short story, the novella (qq.v.) and related genres" (A DICTIONARY OF LITERARY TERMS. 1979: 270).

సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ అనే గ్రంథంలో ఎస్.ఎస్. నళిని కల్పనా సాహిత్యం అనే పదానికి కింది విధంగా అర్థం చెప్పారు.

కల్పనా సాహిత్యం(ఫిక్షన్):

"కల్పిత కథలూ, సంఘటనలతో వచనంలో రాసే రచనలు. నవలా సాహిత్యాన్నీ, కథా సాహిత్యాన్నీ ఉద్దేశించి ఈ మాటని ఎక్కువగా వాడుతారు. కవిత్వాన్నీ, నాటక రచననూ ఉద్దేశించి ఈ మాటని వాడడం అరుదు. చారిత్రక సత్యాన్నో, సామాజిక వాస్తవికతనో తీసుకోవడం కాక రచయిత తన ఊహల ఆధారంగా చేసిన రచన. అయితే ఒక్కొక్కసారి రచయితలు చారిత్రక పాత్రలనూ, ఇతిహాస పురుషులనూ తీసుకుని వాటికి తన స్వీయ ఊహలను జోడించి రాయడం కూడా ఉన్నది. వీటిని చారిత్రక కల్పనా సాహిత్యం (హిస్టారికల్ ఫిక్షన్) అంటారు. అలాగే ప్రసిద్ధ వ్యక్తిని ఎన్నుకుని అతని జీవితంలో జరిగినట్టుగా సంఘటనలను తామే ఊహించి రాసే రచనలూ ఉన్నాయి. ఇలాంటి వాటిని కాల్పనిక జీవిత చరిత్రలు (ఫిక్షనల్ బయోగ్రఫీ) అంటారు. ఒక్కొక్కసారి రచయిత తన జీవితంలో జరిగిన సంఘటనలకే కొన్ని కల్పనలు జోడించి రాస్తాడు. వీటిని కాల్పనిక ఆత్మకథలు (ఆటో బయోగ్రాఫికల్ ఫిక్షన్) అంటారు. కాల్పనిక సాహిత్యానికి ఉన్న ప్రధాన ఉద్దేశ్యం 'ఆనందాన్ని' ఇవ్వడమే. వీలయినంత వరకూ ఆసక్తికరంగా ఉండడం. వాస్తవంలో జరిగే సంఘటనలకే రచయిత తన ధోరణిలో ఆసక్తికరంగా అందిస్తాడు. కాల్పనిక సాహిత్యం అనేది ఒక రకపు రచనా ప్రక్రియ కంటే కూడా కథా వస్తువుకీ, రచనా విధానానికీ సంబంధించిన విషయం" (సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ, 2021: 59, 60).

అలాగే మేడిపల్లి రవికుమార్ కథానిక: వస్తువు–శిల్పం అనే వ్యాసంలో *"కథానిక ప్రక్రియ ఆంగ్లంలోని ఫిక్షన్ (Fiction) పరిధికి చెందింది. ఫిక్షన్ అనే మాట తెలుగులో 'కాల్పనిక సాహిత్యం'గా వ్యవహిమ్పబడుతూ వచ్చింది. నిజానికి ఈ మాట కథానికా ప్రక్రియకు పరిపూర్ణంగా పొసగదు. అనుభూతికి ప్రామాణికతను కల్పించే రచన కాల్పనిక సాహిత్యం ఆవరనంలోకి వస్తుంది. కథానిక ప్రక్రియ కేవలం అనుభూతికి కట్టుబడదు. అనుభూతిని అధిగమించి*

వ్యవహరిస్తుంది. వాస్తవంలో జీవిస్తుంది. అందువల్ల కథానిక ప్రక్రియను రొమాంటిసిజాన్ని (Romanticism) గుర్తుకు తెచ్చే కాల్పనిక సాహిత్యం అనిగాక, కల్పనా సాహిత్యం అని గుర్తిస్తే మరికొంత స్పష్టత ఏర్పడుతుంది. 'ఫిక్షన్' అనే ఆంగ్ల పదానికి కల్పనా సాహిత్యం అని భవిష్యత్తులో రూఢి పరుచుకోవాల్సిన అవసరం ఉంది" (కథానిక-పాఠాలు. 2016: 71) అని అంటారు. అంటే ఇక్కడ కల్పనలకు అధిక ప్రాధాన్యతను ఇచ్చే కాల్పనికసాహిత్యంలోకి కథానికను చేర్చడంకన్నా, వాస్తవిక జీవితాన్ని చిత్రించడానికి అధిక ప్రాధాన్యతను ఇచ్చే కల్పనా సాహిత్యంలోకి చేర్చడం సబబు అని వీరి అభిప్రాయం.

పైన చెప్పిన పలువురి అభిప్రాయాలను బట్టి కల్పనా సాహిత్యం అనగా నవల, కథానిక ప్రక్రియలు మాత్రమే అని భావించి, ఈ రెండు ప్రక్రియలని పరిధిగా ఉంచుకొని, 'చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యం (నవల, కథానిక) – వస్తు,రూప విశ్లేషణ' అనే శీర్షిక కింద నా పరిశోధనను అధ్యయం చేస్తున్నాను.

కల్పనా సాహిత్య ప్రక్రియలైన నవల, కథానికలను గమనిస్తే ఈ రెండు ప్రక్రియలు పాశ్చాత్య సాహిత్య ప్రభావం వల్ల తెలుగులోకి వచ్చిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ప్రపంచ దేశాల్లో ఈ ప్రక్రియల పుట్టుక, వాటికి గల చారిత్రక నేపథ్యం కొంతైనా తెలుసుకోవడం అవసరం. కాబట్టి, మొదట ప్రపంచ దేశాలలో పుట్టింది నవల కనుక మొదట దీని గురించి తెలుసుకొని ఆ తర్వాత కథానిక విషయంలోకి వెళ్దాం.

2.1 ప్రపంచ నవలా సాహిత్యం – పుట్టుక – నేపథ్యం:

ప్రపంచంలో ఏ దేశంలోనైనా ఏ భాషలోనైనా మొదట పుట్టింది పద్య సాహిత్యమే. ఆ తరవాతే వచన సాహిత్య ప్రక్రియలు పుట్టుకొచ్చాయి. వచన కవిత, నాటకం, కథానిక, నవల, వ్యాసం ఇలా అనేక ప్రక్రియలు ఎన్నో పుట్టుకొచ్చినప్పటికీ నేడు ప్రజల ఆదరాభిమానాలను అధికంగా పొందుతున్న ప్రక్రియలు నవల, కథానికలే. ఎందుకంటే నవల, కథానికలు సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని చిత్రించగలుగుతున్నాయి. ప్రాచీన సాహిత్యంలోని కావ్యాదులు ఈ పనిని అంతగా చేయలేకపోయాయి. ఎందుకంటే కావ్యాలు కేవలం లౌకిక కర్తవ్యాలను బోధించడానికే నిర్దేశించబడినట్లు ఉంటాయి కాబట్టి. వాటిల్లో దేవుళ్ళకు, మతాలకు, రాజులకు సంబంధించిన విషయాలే ప్రధానంగా ఉంటూ, వాస్తవిక జగత్తుకు భిన్నంగా అనేక విషయాలు చిత్రించబడుతూ ఉండేవి.

నవల అలాకాక వాస్తవిక సమాజానికి అద్దం పడుతూ, ప్రతి విషయాన్నీ తనలో ఇముడ్చుకొని అవాస్తవాలను పక్కకు నెట్టి వాస్తవికతే పునాదిగా చేసుకొని దానికి కొంత కల్పనను

జోడించుకొని ఆర్థిక, రాజకీయ, సాంఘిక, చారిత్రకాది అనేక విషయాలను స్పృశిస్తూ సామాన్య మానవున్ని సైతం చైతన్యవంతున్ని చేసే విధంగా ముందుకు వెళుతూ ఉంది. కథానిక కూడా ఇదేపని చేస్తూ ఉన్నది. కాకపోతే నవలకున్నంత పరిధిలో కాకపోయినప్పటికీ దానికున్న పరిమితుల దృష్ట్యా అన్ని విషయాలనూ స్పృశిస్తూనే ఉన్నదని నిర్మొహమాటంగా చెప్పొచ్చు.

అయితే మొదట్లో ఈ నవలలను 'స్త్రీలు పొద్దుపోకకో, ఊహా లోకాల్లో విహరించడానికో చదివే పుస్తకాలుగా, పెద్దగా విద్యా విజ్ఞానం లేనివాళ్ళు రాసే, చదివే సాహిత్యంగా చూశారు. క్రమంగా విద్య, సామాజిక రంగాల్లో మార్పుతోపాటు ప్రజల్లో పఠనాశక్తి పెరిగి నవలకు ప్రజాదరణ పెరిగింది. కాబట్టే పాశ్చాత్య దేశాల్లో నవలా రచయితలను ఇప్పుడు మహా రచయితలుగా పిలుస్తున్నారు. నవలా ప్రక్రియను ఆధునిక మహాకావ్యంగా గుర్తిస్తున్నారు. అలాగే నవలా రచయితలకు సాహిత్య పరంగా నోబెల్ అవార్డు కూడా ప్రధానం చేస్తున్నారు. దీనిని బట్టి చూస్తే నవలకు గల ప్రాముఖ్యత ఏంటో మనకు అర్థమవుతుంది. కాబట్టి ఇంతటి ప్రాముఖ్యత గల నవల మొదట ఏ భాషలో పుట్టింది, ఏ పరిస్థితుల మధ్య పుట్టింది, ఎలా భారతీయ భాషల్లోకి ప్రవేశించింది అనేది తెలుసుకోవడం అవసరం. దీనికంటే ముందు నవల అంటే ఏంటి, దీనికాపేరు ఎలా వచ్చిందో తెలుసుకుందాం.

నవల అనే ప్రక్రియ పూర్తిగా పాశ్చాత్య దేశాలల్లో పుట్టి, వికసించిన ప్రక్రియ. ఇది భారతీయ భాషల్లోకి అందులోనూ తెలుగులోకి ప్రవేశించింది మాత్రం ఇంగ్లీషు సాహిత్య ప్రభావంవల్లే. ఇంగ్లీష్ లో ఈ ప్రక్రియను 'నావెల్' అని పిలుస్తారు. ఈ నావెల్ అనే పదం ఇటాలియన్ భాషలోని 'నావెల్లా' అనే పదం నుండీ వచ్చింది. *"ఇటాలియన్ భాషలో నావెల్లా అంటే "ఏ లిటిల్ న్యూథింగ్" – చిన్నదైన కొత్తది – అని అర్థం".* (తెలుగు నవలానుశీలనం, 2017: 31).

2.1.1 నేపథ్యం:

ప్రపంచ సాహిత్యంలో నవల ఎలాంటి సామాజిక పరిస్థితుల నుంచి ఆవిర్భవించిందో చెప్తూ వల్లంపాటి వెంకటసుబ్బయ్య ఇలా అంటారు, *"నవల పుట్టటానికి ముందు దాదాపు అన్ని భాషల్లోనూ చాలా కాలంగా బహుళ ప్రచారాన్ని పొందుతూ ఉండిన సాహిత్య ప్రక్రియ మహాకావ్యం (ఎపిక్). మహాకావ్యం రాజరిక – జమీందారీ సంస్కృతికి దర్పణం. ఫ్యూడల్ యుగం తరవాత సామాజిక దశ బూర్జువా యుగం. బూర్జువా సంస్కృతి రూపొందించుకున్న సాహిత్య ప్రక్రియ నవల. బూర్జువా సంస్కృతి నిర్మాతలు మధ్య తరగతి ప్రజలు, వారే నవలకు*

నిర్మాతలూ పోషకులూ కూడా. బూర్జువా సంస్కృతి ప్రపంచ సాహిత్యానికిచ్చిన మహోజ్వలమైన కానుక నవల" (నవలా శిల్పం, 2021: 7,8)

పాశ్చాత్యదేశాలల్లో ఫ్యూడలిజం పట్ల నిరసనలు ప్రారంభమైన తరువాత రాచరిక, జమీందారీ, భూస్వామ్య సంస్కృతి పతనమైపోయింది. క్రమంగా మహా కావ్యాలనేవి రావడం తగ్గిపోయింది. యూరోపియన్ దేశాల్లో పవిత్ర మత ప్రాంతాల కోసం జరిగిన యుద్ధాల అనంతరం (క్రూసేడులు) ప్రాచీన గ్రీకు రోమన్ సంస్కృతి అంతరించింది. ఇలాంటి సమయంలో గ్రీకు పండితులు యూరప్ అంతటా వ్యాపించి సంస్కృతి సాహిత్యాల పునరుద్ధరణకై ప్రయత్నించారు. దీనినే 'సాంస్కృతిక పునరుజ్జీవనం' అంటారు.

తర్వాత రోమన్స్ వాడే ప్రాచీన భాష లాటిన్ ప్రభావం కొంత తగ్గి యూరోపియన్ రచయితలు తమ దేశాల్లో వాడే ప్రాంతీయ భాషలలో రచనలు చేయడం మొదలు పెట్టారు. ఆ తర్వాత సమాజంలో మానవతావాదం, ప్రజాస్వామ్య భావాలు ప్రబలడంతో అనేక నూతన భావాలు వ్యాపించడం జరిగింది. దీనికి పారిశ్రామిక విప్లవం ఎంతగానో తోడ్పడింది. క్రమంగా సైన్సు, సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి చెందడంతో అచ్చు యంత్రం, ఆవిరి యంత్రం, దిక్సూచి లాంటివి పుట్టుకొచ్చాయి. దీనితో ప్రజల్లో అనేక విషయాలపట్ల అవగాహన ఏర్పడి అమానుష విషయాలు, మూఢనమ్మకాల పట్ల చైతన్యవంతులై ప్రతి విషయాన్నీ తర్కించడం మొదలు పెట్టారు. తర్వాత రాజకీయ, సామాజిక పరిస్థితులు మెరుగు పడడంతో సమాజంలో ఒక కొత్త వర్గం పుట్టుకొచ్చింది. అదే మధ్యతరగతి వర్గం. ఇది అతి తక్కువ కాలంలోనే ఒక బలమైన సామాజిక శక్తిగా తయారైంది. తర్వాత అక్షరాస్యత అబివృద్ధి చెంది, నగర ప్రాంతాల నుండి గ్రామీణ ప్రాంతాల వరకూ కూడా విస్తరించింది. క్రమంగా చదువుకున్న మధ్యతరగతి వారు ఎక్కువయ్యారు. దీనితో మధ్యతరగతి వారి ఆశలను, ఆశయాలను, భావాలను వ్యక్తపరచడానికి ఒక సాహిత్య రూపం కావాల్సొచ్చింది. అయితే అప్పటికే బాగా ప్రచారంలో ఉన్న సాంప్రదాయ సాహిత్యం వారికి వంటపట్టలేదు. అందువల్ల వారు ఆస్థాన సాహిత్యాన్ని గాక వారి కోరికలకు అనువైన ఒక ప్రక్రియను సృష్టించుకున్నారు. అదే నవలగా ఆవిర్భవించింది అంటూ వల్లంపాటి వెంకటసుబ్బయ్య నవలా శిల్పం అనే గ్రంథంలో అంటారు. అంటే ప్రపంచ దేశాల్లో నవల అనేది మధ్యతరగతి వర్గం ఏర్పరచుకున్న ఒక గొప్ప సాహిత్య ప్రక్రియగా చెప్పవచ్చు.

అలాగే నవలా ఆవిర్భావం గురించి వల్లంపాటి వెంకటసుబ్బయ్య చెప్తూ కవిత్వం మీద వచనం చేసిన తిరుగుబాటే నవల ఆవిర్భావానికి కారణం అనే అభిప్రాయాన్ని వెల్లడిస్తూ "పాశ్చాత్య దేశాలల్లో నవల మధ్యయుగాల రాజాస్థాన సాహిత్యం మీద వచ్చిన తిరుగుబాటు

సాహిత్య ప్రక్రియ. రాజాస్తాన సాహిత్యంలోని అవాస్తవిక పలాయనత్వం మీద వాస్తవికత చేసిన తిరుగుబాటు నవల. ఆకాశపు వీధుల్లో హడావిడిగా వెళ్ళిపోతున్న ఆలోచనను భూమార్గం పట్టించిన సాహిత్య ప్రక్రియ నవల" అని అంటాడు. (నవలా శిల్పం, 2021: 8)

2.1.2 ప్రపంచంలోని వివిధ భాషల్లో (దేశాలల్లో) నవల – పుట్టుక:

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వివిధ భాషల్లో నవల ప్రాచుర్యంలో ఉంది. అయితే, ఆ నవలా ప్రక్రియ పుట్టుక, దాని వికాసాన్ని ఈ పరిశోధనకు నేపథ్య సిద్ధాంతంగా ఉండటం వల్ల దాన్ని ఇక్కడ సంక్షిప్తంగా చూద్దాం.

2.1.2.1 వర్తమాన నవలకు పూర్వరూపాలైన రచనలు:

ప్రపంచవ్యాప్తంగా నేడు అందరి ఆదరాభిమానాలను అధికంగా పొందుతున్న సాహిత్య ప్రక్రియ నవల. అయితే ఈ నవల మొదట ఎక్కడ పుట్టింది, ఎప్పుడు పుట్టింది, ఏ భాషలో పుట్టింది అన్న విషయం ఈ నాటికీ చర్చనీయాంశంగానే ఉంది. ప్రపంచంలో అన్ని లక్షణాలూ కలిగిన నవలగా 'ఆధునిక విమర్శకులు క్రీ.శ. 1605లో స్పెయిన్లో సేర్వాంటీస్ రచించిన 'డాన్ క్వీజీట్' ను ప్రథమ ఆధునిక నవలగా పరిగణిస్తున్నట్లు encyclopaedia Britannica లో ఉన్నట్లే ప్రముఖ విమర్శకురాలు సి. మృణాళిని తన సిద్ధాంత గ్రంథం *సాంఘిక నవల – కథన శిల్పం*'లో చెప్పారు.

అయితే, ప్రథమ ఆధునిక నవల 1605 లో వచ్చిందని తెలుస్తున్నప్పటికీ అంతకంటే ముందు సుమారు క్రీస్తు పూర్వంకు ముందే నవలలు లేదా నవల అనదగినటు వంటి రచనలు లేదా నేడు మనం నిర్వచించుకుంటున్న నవలకు స్వల్ప పోలికలు కలిగిన రచనలు ఉన్నట్లు కొన్ని వాదనలు మనకు వినిపిస్తున్నాయి. అవి: 1. *"నవలకు జన్మ భూమి చైనాదేశమనే అభిప్రాయం ఒకటి. పెర్ల్ ఎస్. బక్ అన్న ప్రసిద్ధ నవలా రచయిత్రి తన ద చైనీస్ నోవెల్ అనే పుస్తకంలో చైనా మీద అభిమానంతో చైనా భాషలో వేయి సంవత్సరాల కిందటనే సామాజిక స్పృహ గల రచనలు అంటే నవలలనదగిన రచనలు వచ్చాయని స్థాపించింది"* (తెలుగు నవలానుశీలనం, 2017: 41).

2. "నవల అనే ప్రక్రియ క్రీస్తు పూర్వమే గ్రీసు దేశంలో జనించిందనే అభిప్రాయం మరొకటి. అప్రోడీషియాకు చెందిన చారిటాన్ రచన "ఛారియస్ అండ్ కాలిర్ హ" (క్రీ.పూ. 30) మొట్టమొదటి నవల అని ఒక విమర్శకుడు అభిప్రాయ పడ్డాడు. ఇదే కాక క్రీ.పూ. 161లో గ్రీకు భాషలో మూడు హాస్య నవలలు వెలువడ్డాయని కూడా వీరి అభిప్రాయం" (సాంఘిక నవల – కథన శిల్పం.1988: 13).

3. "ఈజిప్టు దేశంలో క్రీస్తు పూర్వం 2000 వ సంవత్సరం నాటికే నవలలు, కథలు ఉండేవని, ఐతే ప్రస్తుతం అవి అలభ్యాలని కొందరు భావించారు" (సాంఘిక నవల – కథన శిల్పం.1988: 13).

4. నవలా ప్రక్రియ మొదటగా జపాను సాహిత్యంలో ఉద్భవించిందని మరొక సిద్ధాంతం. క్రీ.శ. 1000 వ సంవత్సరంలో 'లేడీ మురసాకీ' రచించిన 'గెంజి గాథ' విశ్వసాహిత్యంలో ప్రథమ నవల అని, ప్రేమ కథను చిత్రించేదే నిజమైన నవల అని, ఆ దృష్టితో చూసినప్పుడు ఈ నవలే ప్రప్రథమమని 'డేవిస్ సౌరత్' భావించారు. (సాంఘిక నవల – కథన శిల్పం.1988:14)

5. క్రీ.శ. 14వ శతాబ్దంలో చైనా, ఇటలీ భాషా సాహిత్యాలలో నవలా స్వరూపం కలిగిన రచనలు వెలువడ్డాయి. చారిత్రక కాల్పనిక, అతిమానుష శక్తుల చిత్రణ కథావస్తువుగా ఈ కాలంలో వెలువడిన చైనీయ నవలలు ఈనాటికీ ప్రచారంలో ఉన్నాయి. అదే విధంగా ఇటలీలో 14వ శతాబ్దంలో 'బొకాషియో' రచించిన 'డీకామెరాన్' యూరపు ఖండంలో నవలా రచనలో నాంది పలికిందని చెప్పవచ్చంటూ సి. మృణాళిని గారు చెప్పారు. (సాంఘిక నవల – కథన శిల్పం.1988: 16)

పైవన్నీ ఆధునిక నవలకు పూర్వరూపాలుగా ఉన్నప్పటికీ గెంజిగాథకు పూర్వం వచ్చిన రచనలలో జానపద సాహిత్య లక్షణాలు అధికంగా ఉండడం, అభూత కల్పనలు, మాయాజాలాలు అధికంగా ఉండడం వల్ల అవి మొదటి నవలలుగా అంగీకరించలేమని. లేడీ మురసాకి రచించిన 'గెంజిగాథ' నేటి నవలా లక్షణాలనెన్నిటినో కలిగి ఉండి, పాత్రచిత్రనలోను, కథాకథనంలోను, మనోవిశ్లేషణలోనూ, ఆధునిక నవలకు ధీటుగా, కొన్ని చోట్ల ఆధునిక నవల కంటే మిన్నగా కనిపిస్తుందన్న కారణంగా గెంజిగాథను మొదటి నవలగా పరిగణించవచ్చని సి. మృణాళిని 'సాంఘిక నవల – కథన శిల్పం'; ముదిగంటి సుజాతారెడ్డి 'తెలుగు నవలానుశీలనం' అనే గ్రంథాలలో చాలా వివరంగా చెప్పారు.

అయితే గెంజిగాథకు పూర్వమున్న నవలల గురించి సి. మృణాళిని గారు చెప్తూ *"సమకాలీన సాంఘీక జీవితాన్ని వాస్తవిక దృష్టితో చిత్రించడం, నిత్య జీవితంలో తారసపడే వ్యక్తులవంటి పాత్రలనెన్నుకోవడం, వ్యావహారిక భాషా ప్రయోగం, సంభాషణలో సహజత్వం, జీవితాన్ని వ్యాఖ్యానించడం, పూర్తిగా గద్యంలో రచించడం నవలలోని విభిన్న అంశాలను ఏకత్రాటిపై నిలిపి అనుసంధించే శిల్పం నిర్వహించడం– ఈ లక్షణాలు కూడా ప్రతి నవలకు అనివార్యాలని భావిస్తే, ప్రథమ నవలగా పేర్కొనబడిన వాటిలో పరిపూర్ణ నవలా లక్షణాలు కనిపించక పోవచ్చు. అందువల్ల వాటిని నవలకు ప్రాతిపదికలుగ పేర్కొనవచ్చు గాని, నాటి నుండి నవలా రచన*

ప్రారంభమైందనడం అంత సముచితం కాదు" అని అంటారు. (సాంఘిక నవల – కథన శిల్పం.1988: 16).

అలాగే 1000 వ సంవత్సరంలో వెలువడిన 'గెంజిగాథ' ప్రథమ నవల అని చెప్పడానికి ఆధారాలు ఉన్నప్పటికీ, ఎక్కువమంది ఆధునిక విమర్శకులు అసామాన్యమూ, అతిమానుషమూ లాంటి కాల్పనికతని వదిలి ప్రజలను వాస్తవిక స్థితికి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో సేర్వాంటీస్ రాసిన 'డాన్ క్వీజీట్' నే ప్రథమాధునిక నవలగా పరిగణిస్తున్నారు అని అంటారు మృణాళినిగారు.

ఏది ఏమైనప్పటికీ పైవన్నీ నవలకు పూర్వ రూపాలుగా పునాదులుగా ఉండగా 18 వ శతాబ్దం నుండే వర్తమాన నవల అనేటువంటి ప్రక్రియ పుట్టిందని సాహిత్య విమర్శకారులు చెప్తున్నారు. కాబట్టి భారత దేశంలోకి ఈ నవలా ప్రక్రియ ప్రవేశించే ముందు ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలల్లో మొదటి నవల అనేది ఎప్పుడు పుట్టిందో తెలుసుకోవడం మంచిది. (నవలా ప్రక్రియ పట్ల స్థూల అవగాహన కోసం ఈ సమాచారం)

భారతీయులకు మొదట నవలా ప్రక్రియను పరిచయం చేసింది ఆంగ్ల సాహిత్యమే కాబట్టి మొదట ఇంగ్లాండ్ దేశంలో నవల ప్రారంభం గురించి పరిశీలిద్దాం.

2.1.2.2 ఇంగ్లాండ్ దేశంలో మొదటి నవల:

17వ శతాబ్దం వరకూ ఆంగ్ల సాహిత్యంలో నాటకమే అధిక ప్రాధాన్యతను సంతరించుకున్నది. కాబట్టే ఇంగ్లీషులో నవలా ప్రక్రియ ఇతర యూరోపియన్ భాషల కన్నా ఆలస్యంగా పుట్టింది. క్రీ.శ. 14వ శతాబ్దంలో ఇటాలియన్ భాషలలో 'నావెల్లా' అనే ప్రక్రియకు చెందిన రచనలు అనేకం వచ్చాయి. వాటిల్లో బొకాషియో రాసిన డీకామెరోన్ అనే రచన బాగా ప్రసిద్ధి పొంది, ఇది ఇంగ్లీషు భాషలోకి అనువదింపబడి ఇంగ్లాండులో బాగా ప్రాచుర్యం పొందింది. ఆ తర్వాతే ఆంగ్ల సాహిత్యంలో నవలా ప్రక్రియ పట్ల అవగాహన ఏర్పడి నవలా వికాసానికి బీజవ్యాప్తి కలిగింది అని అంటారు ముదిగంటి సుజాతారెడ్డి. ఇటాలియన్ భాషలోని 'నావెల్లా' ప్రక్రియే కాక స్పెయిన్ దేశంలోని స్పానిష్ భాషలో 'పికారస్క్యూ' అనే ప్రక్రియ కూడా ఇంగ్లీషు నవలా వికాసానికి తోడ్పడింది. అలాగే యూరప్ దేశంలో 'రోమాన్స్' పేరుతో కొన్ని పద్యరూపమైన కావ్యాలు వచ్చాయి. ఈ ప్రక్రియ కూడా ఇంగ్లీషు నవలా వికాసానికి ప్రేరణ కలిగించింది. క్రీ.శ.14వ శతాబ్దంలో ఇటాలియన్ భాషలలో వచ్చిన 'నావెల్లా' అనే ప్రక్రియ ఈ రోమాన్స్ ప్రక్రియను పోలిన రచనే తెలుగు నవలానుశీలనంలో ముదిగంటి సుజాతారెడ్డి అంటారు.

'నావెల్లా' అనే రచనల్లో ప్రయాణికుల అనుభవాలు, సాహస కృత్యాలు, ప్రేమలు ఉండేవి. అలాగే 'రొమాన్స్'లో రాజదర్బారుల్లోని వీరుల సాహస ప్రేమ గాథలు ఉండేవి. ఇంకా 'పికారస్క్యూ' అనే వాటిల్లో హాస్యం, వ్యంగ్యం ప్రధానంగా కలిగిన 'రోగ్' పాత్రచిత్రణ ఉండేది. అయితే నావెల్లా ప్రక్రియ క్రమంగా ఇవేవీ కనిపించని ఆధునిక నవలా ప్రక్రియగా రూపొందింది. అందుకే ఇటాలియన్ భాషలోని ఈ "నావెల్లా" అనే పదాన్నే ఇంగ్లీషులోని నవలా ప్రక్రియకు పేరుగా గ్రహించి "నావెల్" అని పిలవసాగారు. అయితే జర్మన్, స్పానిష్, ఫ్రెంచ్, రష్యన్ మొదలైన ఎన్నో బాషల్లో నవలను రొమాన్స్ అనేపిలుస్తున్నారు అంటూ ఈ పేర్ల వల్లనే నవలా ప్రక్రియకు మూలాధారాలు ఎక్కడున్న పోమనం గుర్తించవచ్చు అంటారు ముదిగంటి సుజాతారెడ్డి.

'థామస్ నాషే' (క్రీ.శ. 1567–1601) రాసిన 'ద అన్ఫార్చ్యునేట్ ట్రావెలర్' ఇంగ్లీషు సాహిత్యంలో మొదటి నవల అంటారు. ఇది 'పికారస్క్యూ' ప్రక్రియకు దగ్గరగా ఉన్న రచన. క్రీ.శ. 1719లో 'డేనియల్ డేఫో' 'రాబిన్సన్ క్రూసో' అనే నవలను రాశాడు. దీనిని *"జార్జి సాంప్సన్ రాబిన్సన్ క్రూసోను ఇంగ్లీషులో మొదటి నవల అనవచ్చునన్నాడు"*. (తెలుగు నవలానుశీలనం, 2017. 34). దీనినే చాలా మంది ఇంగ్లీషు మొదటి నవల అని చెప్పారు. అయితే ఇవి రొమాన్స్, నావెల్లా, పికారస్క్యూ ప్రక్రియలకు పిల్లలనదగిన రచనలే కానీ ఇంగ్లీషులో రాయబడిన నిజమైన నవలలు కాదనే అభిప్రాయాన్ని ముదిగంటి సుజాతారెడ్డి తెలుగు నవలానుశీలనం అనే గ్రంథంలో చెప్తూ ఇంగ్లీషులో సంపూర్ణ లక్షణాలు కలిగిన ఆధునిక నవలగా క్రీ.శ. 1740 లో సామ్యూల్ రిచ్చర్డ్సన్ రాసిన 'పామెలా' అని చెప్తారు.

ఇలా డేనియల్ డేఫో రాసిన 'రాబిన్సన్ క్రూసో'ను మొదటి ఆంగ్ల నవల అని చెప్పుతున్నప్పటికీ సంపూర్ణ లక్షణాలు కలిగిన ఆధునిక నవలగా సామ్యూల్ రిచ్చర్డ్సన్ రాసిన 'పామెలా'నే అనేక మంది మొదటి ఆంగ్ల నవలగా పరిగణిస్తున్నారు. తర్వాత ఆంగ్ల నవల హెన్రీ ఫీల్డింగ్, వాల్ పోల్, జేన్ ఆస్టన్, జార్జ్ ఎలియట్, హెచ్.జి. వెల్స్, జేమ్స్ జాయిస్, వర్జీనియా ఉల్ఫ్ లాంటి వారి చేతుల్లో అనేక మార్పులకు లోనై ప్రపంచవ్యాప్తంగా గొప్ప స్థానాన్ని సంతరించుకుంది.

2.1.2.3. ఫ్రెంచ్ దేశంలో మొదటి నవల:

ఆంగ్ల నవలలతో సమానంగా అభివృద్ధి చెంది ఉన్నత దశకు చేరుకున్న నవల ఫ్రెంచి నవల. ఫ్రెంచ్ నవలకు విశ్వ సాహిత్యంలో ఒక ప్రత్యేకత ఉంది. ఈనాడు విశ్వసాహిత్యమంతటా విజృంభిస్తున్న చైతన్య స్రవంతికి మార్సెల్ ప్రౌస్టు, అస్తిత్వ వాదానికి జీన్ పాల్ సార్త్రే ప్రాతిపదిక వేశారు. అలాగే ప్రపంచ సాహిత్యంలో హృదయ సంబంధి అయిన మొదటి నవలను మేడమ్

డిస్టేల్ రాశారు. రూసో, ఛాట్ బ్రాండ్, విక్టర్ హ్యూగో, అలెగ్జాండర్ డ్యూమా లాంటివారు ప్రథమ దశలోనూ ఆతర్వాత బాల్జాక్, ఫ్లాబ్, హెన్రీ జేమ్స్ , కామూ, సార్త్రే వంటి వారి చేతిలో ఫ్రెంచి నవల అభివృద్ధి చెందింది.

2.1.2.4. స్పెయిన్ దేశంలో మొదటి నవల:

ఆధునిక నవలకు నాంది పలికింది స్పెయిన్ సాహిత్యమే. స్పెయిన్ లో సెర్వాంటీస్ రాసిన డాన్ క్వీజాట్ నవలే ప్రపంచంలో మొదటి ఆధునిక నవలగా పేరు పొందింది. సెర్వాంటీస్ కంటే ముందు స్పానిష్ భాషలో నవలలున్నాయని చెప్తున్నప్పటికీ వాటి గ్రంథ రచయితలు కాల నిర్ధారణ కాకపోవడం వల్ల సెర్వాంటీస్ నే మొదటి వాడుగా పరిగణిస్తున్నారు.

2.1.2.5. జర్మన్ దేశంలో మొదటి నవల:

18 వ శతాబ్దానికి చెందిన వీలండ్ ను జర్మన్ సాహిత్యంలో ప్రథమ నవలా రచయితగా చెప్తారు. ఇతడు మనోవైజ్ఞానికత ప్రధానమైన నవలలను రచించాడు. గేథే, హఫ్ మాన్, కెల్లర్, వాసర్ మాన్, థామస్ మాన్ మొదలైన వారు జర్మన్ నవలా రచయితలలో ప్రముఖులు.

2.1.2.6. రష్యా దేశంలో మొదటి నవల:

1792లో 'కరామ్ జిన్' రాసిన 'పూర్ లిజా' అనే నవల రష్యన్ భాషలో మొదటి నవల. నవలను ఇతిహాస స్థాయికి తీసుకెళ్ళిన ఘనత కలిగిన 'టాల్ స్టాయ్' రష్యాకు చెందిన వాడే. ఈ నాటికీ ఆయన రచించిన 'వార్ అండ్ పీస్' ప్రపంచ నవలా సాహిత్యంలో ఒక అద్భుతమైన నవలగా పరిగణింపబడుతున్నది. దాస్తోయ్ విస్కీ, గోగోల్, టర్గెనెవ్, షోలకోవ్, రొమనోవ్, పుష్కిన్ లు రష్యన్ నవలాకారులలో ప్రముఖులు.

2.1.2.7. అమెరికా దేశంలో మొదటి నవల:

18వ శతాబ్దానికి చెందిన విలియమ్ బ్రౌన్ అమెరికా సాహిత్యంలో ప్రధాన నవలా రచయిత. ప్రపంచ నవలా సాహిత్యంలో శిల్పానికి ప్రాధాన్యతనిచ్చిన హెన్రీ జేమ్స్ అమెరికా నవలా రచయితే. హెర్మన్ మెల్ విల్, మార్క్ ట్వేన్, నెథాలియన్ హథార్న్, విలియమ్ ఫాక్నర్, ఎర్నెస్ట్ హెమ్మింగ్ వే మొదలైన వారు అమెరికన్ నవలా రచయితలలో ప్రముఖులు.

2.1.2.8. జపాన్ దేశంలో మొదటి నవల:

విశ్వసాహిత్యంలో నవల మొదట జపాన్ భాషలోనే పుట్టిందని, క్రీ.శ.1000వ సంవత్సరంలో 'లేడీ మురసాకీ' రచించిన 'గెంజిగాథ'ను విశ్వసాహిత్యంలో ప్రథమ నవల అని, ఆధునిక నవలకు ఇది ఏ మాత్రం తీసిపోదని కొన్ని వాదనలున్నాయి. ఈ విషయాలన్నీ 'వర్తమాన

నవలకు పూర్వరూపాలైన రచనలు' అన్న ఉప శీర్షిక కింద ఇది వరకే ప్రస్తావించాను. టానిజాకి, యసునారి మొదలైన వారు జపాను నవలా సాహిత్యంలో ప్రముఖులు.

2.1.3. భారతీయ భాషల్లో నవల ప్రవేశం – నేపథ్యం.

15వ శతాబ్దంలో పోర్చుగీసు వారు భారతదేశంలో అడుగు పెట్టేవరకూ భారతీయ సాహిత్యంపై సంస్కృత భాషా ప్రభావమే అధికంగా ఉండేది. అప్పటి వరకూ సంస్కృతంలో వెలసిన వేద, పురాణ, ఇతిహాస వాఙ్మయాల ఆధారంగా భారతీయ భాషలలో పద్య రూపాలైన వివిధ ప్రక్రియలు పుట్టుకురావడం జరిగింది. 9, 10 శతాబ్దాల నుండీ భారతదేశంలో ముస్లిం, పర్షియన్, మొగలు నాగరికతలు ప్రవేశించినప్పటికీ వారి భాషా సంస్కృతుల ప్రభావం ఉర్దూ సాహిత్యంపై చూపించినంతగా వేరే ఇతర భారతీయ భాషా సాహిత్యాలపై చూపించలేదు.

"తన ఇరుగుపొరుగు సాహిత్యముల సంస్కృతుల ప్రభావము సోకని సాహిత్యమనునది ప్రపంచమున లేదనుట సత్యదూరము. అతి ప్రాచీనములయిన సంస్కృతము, గ్రీకు, లాటిను భాషల విషయములోనే ఈ వాక్యము సార్థకమైనప్పుడు మిగిలిన భాషల విషయము వేరుగ చెప్పనక్కరలేదు" (తెలుగు సాహిత్యముపై ఇంగ్లీషు ప్రభావము, 1960: ముందుమాట) అని కొత్తపల్లి వీరభద్రరావు చెప్తారు. ఈ మాట ముమ్మాటికీ నిజమే. వాణిజ్య, వ్యాపార పరమైన సంబంధాలు నెలకొల్పే క్రమంలో పోర్చుగీసు, డచ్చి, ఫ్రెంచి వారి తర్వాత భారతదేశంలో అడుగు పెట్టిన వారు ఆంగ్లేయులు. వలస వ్యాపారులుగా అడుగుపెట్టిన ఆంగ్లేయులు క్రమంగా సర్వాధికారాలను చేజిక్కించుకున్న తర్వాత వారి నాగరికత ప్రభావం దేశంలోని ప్రతి రంగంలోనూ ప్రవేశించింది. క్రమంగా ప్రజా జీవనంలోనూ, ఆలోచనా విధానంలోనూ మార్పులు వచ్చాయి.

భారతదేశము కంపెనీ పాలన నుండీ ఇంగ్లీషు పార్లమెంటరీ యొక్క ప్రత్యక్ష పాలన కిందికి వచ్చాక దేశంలో రాజకీయ, సాహిత్య , సాంస్కృతిక రంగాల్లో అనేక మార్పులు వచ్చాయి. మొదట్లో వ్యాపార సంబంధ విషయాలకు మాత్రమే పరిమితమైన బ్రిటీష్ ప్రభుత్వం క్రమంగా స్వప్రయోజనాల కోసం ప్రాచ్య పాశ్చాత్య ఉద్యోగుల కోసం వారికి విద్య నేర్పాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. దీనికోసం దేశ వ్యాప్తంగా అనేక పాఠశాలలను నెలకొల్పారు. అలాగే మత ప్రచారం కోసం భారతదేశంలో అడుగుపెట్టిన మిషనరీలు కూడా చిన్న చిన్న విద్యాసంస్థలను ప్రారంభించాయి. దీనితో భారతదేశంలో ఆంగ్ల విద్యకు అంకురార్పణ జరిగింది. తర్వాత దేశ వ్యాప్తంగా బ్రిటీష్ ప్రభుత్వం విద్యావ్యాప్తి పట్ల శ్రద్ధ వహించి లార్డ్ విలియం బెంటింక్ తీర్పుతో ఆంగ్ల విద్యను నిర్ణీత ప్రణాళికల ఆధారంగా ప్రవేశపెట్టారు. క్రమంగా మద్రాసు, కలకత్తా,

బొంబాయి వంటి నగరాలల్లో విశ్వవిద్యాలయాలు కూడా స్థాపించబడ్డాయి. దీనితో భారతీయ ప్రజలకు ఆంగ్లవిద్య పట్ల మక్కువ పెరిగి ఆంగ్ల విద్యను అభ్యసించే వారి సంఖ్య కూడా పెరిగింది. క్రమంగా పాశ్చాత్య సాహిత్య సంస్కృతులు స్వదేశీయులకు అలవడ్డాయి. ఇటువంటి తరుణంలో దేశంలో వచన రచనల అభివృద్ధి జరిగింది. క్రమంగా దేశంలో ముద్రణా యంత్రాలు, పత్రికలు పుట్టుకొచ్చాయి. దేశం నలుమూలల్లోని మేధావులు, సంఘ సంస్కర్తలు ఆంగ్ల విద్యవల్ల ప్రభావితులై సాహిత్య రంగంలో కొత్తపోకడలను తీసుకువచ్చారు. దేశంలో అలుముకున్న అవిద్య, అజ్ఞానం, మూఢాచారాల ప్రాబల్యం, స్త్రీ దుస్థితిని రూపుమాపడానికి ప్రయత్నించారు. ఇవి కేవలం ప్రబోధాలుగా చెప్పడంకన్నా పాఠకులను, శ్రోతలను ఆకర్షించే కథారూపంలో చెప్పడం మేలనిపించి వచన రచనలకు ప్రాధాన్యాన్ని కల్పించారు. ఈ నేపథ్యంలో ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల భారతదేశంలో నవలాసాహిత్యం (కథానిక) ఆవిర్భవించింది.

ఈ విధంగా ఆంగ్ల విద్యా విధానం, వారి సాహిత్య ప్రభావం కారణంగానే భారతీయ రచయితలలో సాహిత్య పరంగా కొంత చైతన్యం కలిగి పాశ్చాత్య దేశాలల్లో పుట్టి పెరిగిన నవల భారతీయ భాషలలోకి ప్రవేశించింది. ప్రారంభదశలో నవలా సాహిత్యానికి సంబంధించినంత వరకూ మొదట ఆంగ్ల నవలలే మార్గదర్శకాలుగా నిలిచాయి. ఆ తర్వాతే భారతీయ రచయితలకు ఇతర పాశ్చాత్య భాషా సాహిత్యాలతో పరిచయం ఏర్పడి ఫ్రెంచ్, రష్యన్ నవలలతో పరిచయం ఏర్పడి క్రమంగా భారతీయ నవలలపై వాటి ప్రభావం కూడా పడింది. అయితే పై చెప్పుకున్న పాశ్చాత్య సాహిత్య ప్రభావం భారతదేశంలో మొదట బెంగాల్ రచయితలను ఆకర్షించింది. అందుకే భారతదేశంలో మొదటి స్వతంత్ర నవల బెంగాల్ లో పుట్టింది. ఆ తర్వాతే వివిధ భాషలలోకి నవల ప్రవేశించింది.

2.1.4. వివిధ భారతీయ భాషలలో మొదటి నవలలు:

భారతదేశంలోని వివిధ బాషలలో ప్రథమ నవల ఎప్పుడు మొదలైంది. అది ఏది అనే విషయాలను స్థూలంగా చూద్దాం.

2.1.4.1. బెంగాలీ నవల: (1856)

భారతదేశంలో మొట్టమొదట స్వతంత్ర నవల పుట్టింది బెంగాల్ బాషలోనే. పి. ఆర్. ఇ. చంద్ మిత్ర 'టేక్ చంద్ ఠాకూర్' అనే కలం పేరుతో 'అలారేర్ ఘరేర్ దులాల్' (పెద్దింటి గారాల బిడ్డ) అనే నవలను 1856లో రాశారు. *"ఈ నవల మొట్టమొదటి నవలగానే కాక మొదటి సారిగా మధ్య తరగతి జీవితాలను అత్యంత సహజంగా చిత్రించిన నవలగా కూడా పేరుపొందింది"* (భారతీయ భాషల్లో నవలా ప్రక్రియ.1988: 10) అని విద్యేశ్వరి అన్నారు.

2.1.4.2. మరాఠీ నవల: (1857)

'బాబా పద్మన్ జీ' రాసిన యమునా పర్యటన్ (1857) అనే నవల మరాఠీలో మొదటి నవల. అయితే ఇది పాఠకుల ఆదరణను అంతగా పొందలేకపోయింది. *"కథాకథన శైలి ధారావాహికమైన భాష ఉత్తమంగా ఉన్నప్పటికీ రచయిత ఎన్నుకున్న ఇతివృత్తం కారణంగా ఈ నవలను పాఠకులు నిరాదరించారు".* (భారతీయ భాషల్లో నవలా ప్రక్రియ.1988 10) అని విద్యేశ్వరి గారు చెప్తూ *"ఒక నవ్య సాహిత్య ప్రక్రియగా నవలా చరిత్రలో మొదటి స్థానాన్ని తప్ప యమునా పర్యటన్ నవలకు రావలసినంత పేరు రాలేదు"* (భారతీయ భాషల్లో నవలా ప్రక్రియ.1988: 10) అని అంటారు.

2.1.4.3. గుజరాతీ నవల: (1866)

భారతీయ నవలల్లో ప్రముఖ స్థానం పొందిన నవల 'కరణ్ ఘేలో'. గుజరాతీలో మొదటి నవల కూడా ఇదే. దీనిని 'నంద్ శంకర్ తుల్జాశంకర్' 1866లో రాశాడు.

2.1.4.4. ఉర్దూ నవల: (1869)

'నజీర్ అహమ్మద్' 1869లో రాసిన 'మిరతుల్ ఉరుస్' (వధువు చేతిలో అద్దం) అనే నవల ఉర్దూలో మొదటి నవల. ఈ నవలలో స్త్రీలకు విద్య అవసరమని, దేశీయమైన సంస్కృతిని బోధించి, మూఢాచారాలను, అంధ విశ్వాసాలను తొలగించే ప్రయత్నం చేసినట్లు విద్యేశ్వరి భారతీయ భాషల్లో నవలా ప్రక్రియ అనే గ్రంథంలో తెలియజేశారు.

2.1.4.5. తెలుగు నవల: (1872)

తెలుగు నవల గురించి, తెలుగులో మొదటి నవల ఎప్పుడు వచ్చింది, అది ఏది అన్న విషయాలను తెలుగులో మొదటి నవల అన్న ఉప శీర్షిక కింద వివరిస్తాను.

2.1.4.6. తమిళ నవల: (1879)

'శామ్యూల్ వేదనాయకం పిళ్ళై' 1879లో రాసిన 'ప్రతాప మొదలియార్ చరిత్రం' అనే సాంఘిక నవల తమిళంలో మొదటి నవల. తమిళంలో వచన రచనల అవసరాన్ని పెంచాలని, వీలైనంత ఎక్కువ మంది పాఠకులకు సున్నితమైన పద్ధతిలో నైతిక విలువలను ఉదాహరణ పూర్వకంగాను, నిత్య జీవితంలోని సంఘటనల వర్ణనలతోను చిత్రించి చూపాలని తన ఉద్దేశ్యమని ఆయన చెప్పుకున్నట్లు తెలుస్తుంది.

2.1.4.7. మలయాళీ నవల: (1889)

మలయాళీ 'అప్పనెడుంగడి' రాసిన 'కుందలత' అనే నవల 1887లో వెలువడింది. అయితే దీనిని కేవలం ఆహ్లాదకరమైన, వినోదభరితమైన రచనగా, తొలిదశ నవలగా పేర్కొన్నారు

తప్ప సమగ్రమైన మలయాళీ నవలగా చెప్పలేదు. తర్వాత 1899లో 'చందుమీనన్' రాసిన 'ఇందులేఖ'ను మొదటి సమగ్ర మలయాళీ నవలగా పేర్కొన్నారు.

2.1.4.8. అస్సామీ నవల: (1890)

బెంగాలీ సాహిత్య ప్రభావం వల్ల అప్పటి వరకూ సుదీర్ఘ కథా ప్రక్రియలుగానే చెప్పుకునే సృజనాత్మక రచనలైన కథ, నవలలకు మధ్య తేడాని స్పష్టం చేసుకున్నాక అస్సామీ భాషలో 1877లోను, 1884లోను కొన్ని నవలలు వచ్చాయి. అయితే అవేవీ నవలా లక్షణాలను సంపూర్ణంగా కలిగినవి కావనే కారణంగా వాటిని మొదటి నవలలుగా గుర్తించలేదు. ఆ తర్వాత ఒనాకీ, బిజిలి అనే పత్రికల ప్రోత్సాహం వల్ల 'పద్మనాద్ గొహాయిన్ బారువ' 1890లో రాసిన 'భానుమతి' నవలను మొదటి అస్సామీ నవలగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది.

2.1.4.9. ఒరియా నవల: (1891)

ఆంగ్లేయుల పాలనలో ఒరిస్సా ప్రాంతాన్ని కొంత బెంగాల్ లోను, కొంత మద్రాస్ ప్రెసిడెన్సీలోను కలపడం కారణంగా అప్పటి నుండి ఒరిస్సాపై బెంగాలీల ప్రభావం ఎక్కువగా ఉండేది. ఈ ప్రభావంతోనే ఒరియాలో తొలి నవల రాసిన ఘనత బెంగాలీ వారికే దక్కింది. 'రామ్ శంకర్ రాయ్' అనే బెంగాలీ వ్యక్తి రాసిన 'సౌదామిని', 'ఉన్మాది'ని అనే నవలలు 1877 – 1879 మధ్య ఉత్కళ మధుప, ఇంద్రధను అనే పత్రికల్లో ప్రచురితమయ్యాయి. అయితే ఈ పత్రికలు ఆగిపోవడంతో ఈ నవలలు అసంపూర్ణంగానే మిగిలాయి. ఆ తర్వాత రామ్ శంకర్ రాయ్ 1891లో తన సంపూర్ణ నవలైన 'బిబాసినిని' ఉత్కళ ప్రభ అనే పత్రికలో సీరియల్గా ప్రకటించాడు. *"ఒరియాలో తొలి నవల తానే వ్రాసానని రాయ్ సగర్వంగా చెప్పుకున్నాడు"* (భారతీయ భాషల్లో నవలా ప్రక్రియ.1988: 10). ఒరియాలో బిబాసిని కన్నా ముందు మూడు అసంపూర్ణ నవలలు వెలువడ్డాయి. అవి 1888లో ఉమేష్ చంద్ర సర్కార్ రాసిన పద్మామాలి, ఒక అజ్ఞాత రచయిత ప్రదీప మాస పత్రికలో ప్రకటించిన మార్గ, రసంబాద, ఆనథిని అనే నవలలు.

2.1.4.10. పంజాబీ నవల: (1897)

భాయావీర్ సింగ్ 1897లో రాసిన సుందరి అనే నవల పంజాబీలో మొదటి నవల.

2.1.4.11. కన్నడ నవల: (1915)

కన్నడంలో నవలను కాదంబరి అని పిలుస్తారు. 1895 నుండీ కాదంబరి అనే పేరుతో పాటు నవల అనే పేరు కూడా కన్నడంలో వ్యవహారంలో ఉంది. అయినప్పటికీ కన్నడంలో 1915 వరకూ సమగ్రమైన నవల వెలువడలేదు. అంతకు ముందు కొన్ని ప్రయత్నాలు జరిగినప్పటికి వాటిల్లో ఆధునిక నవలకు ఉండవలసిన లక్షణాలేవీ లేని కారణంగా వాటిని మొదటి నవలగా

పరిగణించట్లేదు. 'ఎమ్. ఎస్. పుట్టున్ని' రాసిన 'మాడిడ్డున్నో మహారాయ' (విత్తుకొద్ది ఫలం) అనే నవల కన్నడంలో తొలి నవల.

2.1.4.12. నేపాలీ నవల: (1934)

నేపాలీ భాషలో తొలి సమగ్ర నవల 1934 లో వచ్చింది. నవల పేరు 'రూప్ మతి'. దీనిని 'రుద్రరాజ్ పాండే' రాశారు. 1903లో అజ్ఞాత రచయిత రాసిన ఒక డిటెక్టివ్ నవలతో పాటూ 1934 వరకూ మరికొన్ని డిటెక్టివ్ నవలలు వచ్చినట్లు తెలుస్తున్నప్పటికీ వాటిని తొలి నవలలుగా గుర్తించలేదు.

2.1.4.13. రాజస్థానీ నవల: (1952)

రాజస్థానీ భాషలో కూడా 1903లో నవలలు వెలువడినట్లు తెలుస్తున్నా వాటిని తొలి నవలలుగా పరిగణించట్లేదు. ఎందుకంటే వాటిని వలస రచయితలు రాసిన కారణంగా ప్రాంతీయత లోపించింది అని. ఆ తర్వాత 1952లో 'ఎస్. ఎన్. జోషి' రాసిన 'ఆబాయ్ వట్ కీ' అనే నవల రాజస్థానీలో మొదటి నవలగా పేరు పొందింది.

తర్వాత మైథిలి, మణిపురి, సింధీ, కాశ్మీరి, డోంగ్రీ, సంస్కృతం వంటి భారతీయ భాషలలో నవలా ప్రక్రియ కొంత కాల బేధాలతో ప్రవేశించింది.

2.1.5. తెలుగులో నవల పుట్టుక – నేపథ్యం:

యూరోపియన్ దేశాలలో నవల పుట్టుకకు ఉన్న చారిత్రక, సామాజిక, రాజకీయ నేపథ్యాలు భారతీయ నవల పుట్టుకకుగాని, తెలుగు నవలా పుట్టుకకు గాని లేవనే చెప్పాలి. ఎందుకంటే ఫ్యూడల్ వ్యవస్థ పతనం, మధ్య తరగతి ప్రబలమైన సామాజిక శక్తిగా అవతరణ, అక్షరాస్యత అభివృద్ధి, ఉదారభావాల వ్యాప్తి అనేవి మొదటగా యూరోపియన్ దేశాలలోనే మొదలైనాయి కాబట్టి. అందుకే వల్లంపాటి వెంకటసుబ్బయ్య 'నవలాసాహిత్యంలో రాయలసీమ చైతన్యం' గురించి చెప్తూ *"భారతదేశంలో – ఆంధ్రదేశంలో– ఈ ప్రభావాలు ప్రత్యక్షంగా నవల పుట్టుకను ప్రభావితం చెయ్యలేదు. యూరోపియన్ దేశాల నుంచి ఈ ప్రభావాలు ఆంగ్లేయ పరిపాలన ద్వారా, ఆంగ్లభాష ద్వారా వచ్చాయి"* అని చెప్తారు. (రాయలసీమలో ఆధునిక సాహిత్యం సామాజిక సాంస్కృతిక విశ్లేషణ 2006: 85)

భారతీయ భాషల్లో నవలా ప్రవేశం – నేపథ్యం అన్న ఉపశీర్షిక కింద చెప్పిన ప్రతి అంశం తెలుగు నవలాపుట్టుకకు కూడా దోహదం చేశాయి అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఆంగ్లేయుల సంపర్కం వల్ల మొదట వాణిజ్య, ప్రభుత్వ రంగాలకు సంబంధించిన కొన్ని ఆంగ్ల పదాలు తెలుగు భాషలోకి ప్రవేశించాయి, ఆ తర్వాత ఆంగ్లేయులు స్థాపించిన పాఠశాలల వల్ల,

వాటిని పోలిన దేశీయ పాఠశాలల వల్ల ఆంగ్ల విద్యాసంస్కారాలు తెలుగు వారికి అలవడ్డాయి. క్రమంగా ఆంగ్ల సాహిత్య పఠనం వల్ల వారి శాస్త్ర సాంకేతిక విజ్ఞాన విషయాలు మనవారిని అధికంగా ఆకర్షించాయి. అలాగే ఆంగ్ల సాహిత్యంలోని ప్రక్రియా వైవిధ్యంపట్ల కూడా మనవారు ఆకర్షితులయ్యారు. ఈ క్రమంలో ఆంగ్లంలో అప్పటికే నవల అనే వచన రచనా ప్రక్రియ నిలదొక్కుకొని ఉండడం కారణంగా వారి సంస్కృతుల మిశ్రమంలో ఆ ప్రక్రియ మన సాహిత్యంలోకి వచ్చింది.

మొదలి నాగభూషణశర్మ తెలుగు నవలా వికాసంలో తెలుగు నవల సంక్షిప్త చరిత్రను గురించి చెప్తూ *"1897 లో జరిగిన ప్రథమ స్వాతంత్ర్య సమరం తరవాత దేశంలో బ్రిటీష్ వారి రాజ్యం సుస్థిరం అయ్యింది. కేవలం రాజకీయమైన పరిపాలనేగాక, సాంఘిక, విద్యాది రంగాల్లో కూడా ఆంగ్లేయుల ప్రభావం స్పష్టంగా మన జీవిత విధానం మీద పడ్డది. సాంఘికమైన దురాచారాలను ఒక పక్క నిశితంగా విమర్శిస్తూ, వానిని రూపు మాపడానికి సంఘసంస్కర్తలు ప్రయత్నం చేస్తూవుండగా, వేరొక వంక ఆంగ్ల సాహిత్య ప్రభావం ద్వారా ఉత్తేజితులైన భారతీయ రచయితలు ఆయా సిద్ధాంతాలను, భావాలను, ఆంగ్ల సాహిత్యం నుంచి స్వీకరించిన నూతన ప్రక్రియల ద్వారా తమ జాతీయ సాహిత్యంలో కూడా ప్రతిఫలింప జేయాలని దీక్షబూనారు. దీనికి ప్రతిఫలమే నూతన సృజనాత్మక రూపాలైన నాటకం, నవల, కథ మొదలైనవి"* (తెలుగు నవలా వికాసం, 1971: 40) అని తెలుగులో నవల, కథ పుట్టుక గురించి చెప్పారు.

వల్లంపాటి వెంకటసుబ్బయ్య తెలుగు నవల ప్రాదుర్భావాన్ని చెప్తూ *"19వ శతాబ్దం ఉత్తరార్ధంలో ఆంగ్ల సాహిత్యం చదువుకున్న తెలుగు రచయితలు నవలకు పురుడుపోశారు. స్విఫ్ట్, స్కాట్, డికెన్స్, గోల్డ్ స్మిత్ మొదలైన వారి నవలలు చదివి అలాంటివి మన సాహిత్యంలోనూ వుంటే బాగుంటుందన్న ఆశాభావమే మనవారిని నవలా రచనకు పురికొల్పింది. నరహరి గోపాలకృష్ణమ శెట్టి కానీ, కందుకూరి వీరేశలింగం పంతులు కానీ అలాంటి వారే"* అని చెప్పారు. (నవలా శిల్పం, 2021: 13, 14). దీనిని బట్టి తెలుగులో నవల పుట్టడానికి ఆంగ్లేయుల సాహిత్య సంపర్కాలే కారణం అని తెలుస్తోంది.

2.1.6. తెలుగులో మొదటి నవల– భిన్నాభిప్రాయాలు

తెలుగులో తొలి నవల ఏది అన్న విషయం గురించి మాట్లాడాల్సి వస్తే ప్రధానంగా చర్చకు వచ్చేవి రెండు విషయాలు. అవి మొదటిది 'నరహరి గోపాలకృష్ణమ శెట్టి' రచించిన 'శ్రీ రంగరాజ చరిత్ర' (1872). రెండవది 'కందుకూరి వీరేశలింగం పంతులు' రచించిన 'రాజశేఖర చరిత్ర' (1878). వీటితో పాటూ పింగళి సూరన రాసిన 'కళాపూర్ణోదయం', కొక్కొండ

వెంకటరత్నం పంతులు రాసిన 'మహాశ్వేత' అనే రెండు రచనలు కూడా తొలి నవల ఏది అన్న విషయంలో చర్చకు వచ్చిన రచనలే. అయితే వీటిలో దేనిని తొలి తెలుగు నవలగా గుర్తించాలి అన్న విషయంలో చాలా మంది విమర్శకులు, సాహిత్య చరిత్రకారులు భిన్నభిన్న అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అవి కింది విధంగా ఉన్నాయి.

2.1.6.1. తొలి తెలుగు నవల – కళాపూర్ణోదయము?:

ఆధునిక నవలా లక్షణాలుగా ఈరోజు మనం చెప్పుకుంటున్న అన్ని లక్షణాలూ లేకపోయినప్పటికీ పద్య రూపంలో ఉందన్న ఒక్క కారణం తప్ప నవలకు ఉండవలసిన అన్ని లక్షణాలూ కళాపూర్ణోదయానికి ఉన్నాయి అని, ఈ కారణంగా పద్యరూపంలో ఉన్న నవల అని కళాపూర్ణోదయాన్ని కొంతమంది విమర్శకులు చెప్తున్నారు. తొలి నవలగా లేదా ఆధునిక నవలగా దీనిని చెప్పకపోయినప్పటికీ ఆరుద్ర, జి. నాగయ్య, ద్వానా శాస్త్రి లాంటి సాహిత్య చరిత్రకారులు కళాపూర్ణోదయం రచన నవలా రచనలాగా సాగిందని కొన్ని అభిప్రాయాలను తెలిపారు. అవి:

1. *"ఈ ఇరవయ్యో శతాబ్దంలో సహితము తెలుగు నవలలు నిజమైన నవలల్లాగా లేవు. అటువంటిది 1550 ప్రాంతాలలో సూరపరాజు కళాపూర్ణోదయాన్ని నవలలాగా వ్రాశారు. కవి స్వయంగా చెప్పే కథకన్నా పాత్రల సంభాషణల ద్వారా పూర్వ కథలు తెలిపే పద్ధతి చాలా మంచిది. కళాపూర్ణోదయంలో సూరపరాజుగారు ఈ పద్ధతినే వాడారు. కొంత నవలలాగా, కొంత నాటకంలాగా, కొంత ఈనాటి సినిమా చిత్రంలాగా ఈ రచన సాగింది"*(సమగ్రాంధ్ర సాహిత్యం – రెండవ సంపుటం. 2012: 307).

2. *"కళాపూర్ణోదయమందలి కథ అనల్ప కల్పనాచాతుర్యంతో ముగియుచు నవలా లక్షణాలను సంతరించుకొనినది"*. (తెలుగు సాహిత్య సమీక్ష – రెండవ సంపుటం. 2019: 138)

3. డాక్టర్ వాడపల్లి చక్రపాణిరావు "తెలుగు సాహిత్య చరిత్ర" అనే గ్రంథంలో *"ఈ కావ్యము ఆధునిక మగు నవల వంటిది"* అనడం స్వభావోక్తి అవుతుంది" అని అంటారు. (తెలుగు సాహిత్య చరిత్ర, 1986: 143)

4. *"ఈనాడు నవలకు ఏ లక్షణాలు మనం చెప్పుకుంటున్నామో అవి అన్నీ కళాపూర్ణోదయంలో వున్నాయి ఒక్క వచనంలో లేకపోవడం మినహాయించి. కథాకథనంలో పద్యంలో సాగిందా గద్యంలో సాగిందా అన్న ప్రశ్న అంత ముఖ్యమైనదికాద"*ని కొందరి వాదం. (తెలుగు నవలా వికాసం, 1971: 33)

పై అభిప్రాయాలు ఇలా ఉంటే మొదలి నాగభూషణ శర్మ గారు తెలుగు నవలావికాసంలో కళాపూర్ణోదయాన్ని గురించి చర్చిస్తూ *"ఒకసారి నవల వచన వాఙ్మయానికి చెందిన ప్రక్రియగా*

గ్రహించిన తర్వాత ఈనాడు పద్యంలో ఎవరైనా నవల వ్రాసినా దానిని నవలగా స్వీకరించం. దానిని కథాకావ్యము అనే అంటాము. అయితే నవలకు పూర్వరూపంగా మనం స్వీకరించవచ్చు" (తెలుగు నవలా వికాసం, 1971: 34) అని అంటారు.

2.1.6.2 తొలి తెలుగు నవల – మహాశ్వేత?:

శ్రీ రంగరాజచరిత్ర కంటే ముందు కొక్కొండ వెంకటరత్నం పంతులు 1867లో మహాశ్వేత అనే నవలను రాశారని, ఇదే తెలుగులో మొదటి నవల అని, దీనిని రచించిన కొక్కొండ వెంకటరత్నం పంతులు గారే నవలా రచనలో మొదటి వారని నిడదవోలు వెంకటరావు మొదట తెలియజేశారు. మహాశ్వేత తెలుగులో మొదటి నవల అనడానికి ఆయన కొక్కొండ వెంకటరత్నం పంతులుపై రాసిన వ్యాసంలో ఈవిధంగా అంటారు.

"వైవాని యన్నింటికన్న ముఖ్యమైనది మహాశ్వేత నవలారచన. పంతులుగారు క్రీ. శ. ౧౮౬౭ (1867) సంవత్సరమున రచించిరి. తెలుగున నవలారచనకు పంతులుగారు ప్రథములు. ఈ నవలలో కొంతభాగము ౧౮౯౫ (1895) సంవత్సరమున 'వైజయంతి' పత్రిక యందు ప్రకటితమైనది. ఇది వీరేశలింగము పంతులుగారి రాజశేఖరచరిత్రకన్న యిరువదిరెండేండ్లు ముందుగ వెలసినది". (భారతిపత్రిక. ఏప్రిల్ 1951: 368)

పై మాటలకు ఆధారంగా శివశంకర పాండ్య గారు రాసిన 'వెంకటరత్నం పంతులు గారి జీవిత చరిత్ర'లో అన్న మాట అని తెలుస్తుంది. ఈ విషయాలను నిడదవోలు వెంకటరావు తన ఆంధ్ర వచన వాఙ్మయం అనే గ్రంథంలో కింది విధంగా తెలిపారు.

"నవ్య వాఙ్మయశాఖలలో నాంగ్లేయ భాషా సంస్కారప్రభావము హెచ్చుగా గలిగినశాఖ నవలయే యని చెప్పనొప్పును. ఈ శాఖయందలి ప్రాథమిక రచనము లప్పటి భాషాపరిపాటిని బట్టి గ్రాంథిక భాషలో రచితములు. వానిలో మొదటిది కొక్కొండ వెంకటరత్నము పంతులుగారి 'మహాశ్వేత' అనునది. ఇది మన భాషలో మొదటి నవలయని కీర్తి శేషులు శివశంకర పాండ్యాగారు, వెంకటరత్నము పంతులుగారి జీవిత చరిత్రలో నిట్లు వ్రాసియున్నారు. "In 1867, he (Venkataratnam pantulu) composed the first Telugu Novel by name Mahasweta founded on the plesant story of Kadambari, the master piece of Bana Bhatta in Sanskrit"". *(ఆంధ్ర వచన వాఙ్మయం. పుట: 122,123)*

అయితే ఇక్కడ మహాశ్వేత అనే రచన 1867లో రచించారానడానికి శివశంకర పాండ్యాగారి మాట తప్ప మరే నిదర్శనం లేకపోవడం, రాసిన 28 సంవత్సరాల తర్వాత అందులో కొంత భాగం మాత్రమే వైజయంతి పత్రికలో ప్రచురించబడడం, మొత్తం గ్రంథం

లభించకపోవడం, కథా వస్తువు కల్పితమైనది కాకపోవడం మొదలైన కారణాలవల్ల దీనిని వచన ప్రబంధంగా ఎవ్వరూ పరిగణించలేదని చెప్తూ, మొదలి నాగభూషణ శర్మ తన తెలుగు నవలా వికాసం అన్న గ్రంథంలో *"ఏ విధంగా చూసినా మహాశ్వేతను తొలి తెలుగు నవల అనడానికి వీలులేదు. కల్పిత కథలేదు. దొరుకుతున్న భాగం అసంపూర్ణం. అది కూడా 1867లో వ్రాయబడిందనడానికి తగిన ఆధారాలు లేవు"* (తెలుగు నవలా వికాసం, 1971: 35) అని చెప్పారు.

2.1.6.3. తొలి తెలుగు నవల – శ్రీ రంగరాజ చరిత్ర?:

పై విషయాలు ఎలా ఉన్నప్పటికీ తెలుగులో తొలి నవల ఏది అనే విషయంలో ఎక్కువగా చర్చకు వచ్చిన నవలలు రెండే రెండు. అవి మొదటిది నరహరి గోపాలకృష్ణమ శెట్టి రచించిన శ్రీ రంగరాజ చరిత్ర(1872). రెండవది కందుకూరి వీరేశలింగం పంతులు రచించిన రాజశేఖర చరిత్ర(1878). వీటి విషయంలో ఎవరెవరి అభిప్రాయాలు ఏవిధంగా ఉన్నాయో ఒకసారి చూద్దాం.

శ్రీ రంగరాజ చరిత్రను తొలి తెలుగు నవలగా గుర్తించిన వాళ్ళు

1. కొత్తపల్లి వీరభద్రరావు
2. బి. వి. కుటుంబరావు
3. మొదలి నాగభూషణ శర్మ
4. అక్కిరాజు రమాపతిరావు
5. కోడూరి శ్రీరామమూర్తి
6. ఎ. బి. సాయిప్రసాద్
7. దాశరథి రంగాచార్య
8. సి. మృణాళిని
9. వైద్యం వేంకటేశ్వరాచార్యులు
10. జయధీర్ తిరుమలరావు
11. ఆరుద్ర
12. వెలమల సిమ్మన
13. కొలకలూరి ఇనాక్
14. కడియాల రామమోహనరావు
15. పొదిలి నాగరాజు

2.1.6.3.1. కొత్తపల్లి వీరభద్రరావు – తెలుగు సాహిత్యంపై ఇంగ్లీషు ప్రభావము (1956):

కొత్తపల్లి వీరభద్రరావు 'తెలుగు సాహిత్యంపై ఇంగ్లీషు ప్రభావము' అనే గ్రంథంలో *"1878లో భాగములుగా ప్రచురించబడి, 1888లో పుస్తకరూపమును పొందిన వీరేశలింగం పంతులుగారి 'రాజశేఖరచరిత్ర' కంటే ముందే 1872లో 'శ్రీరంగరాజచరిత్ర' అను పేర నవల యొకటి ప్రకటింపబడెను. దీనిని గోపాలకృష్ణమ శెట్టి వ్రాసెను. పంతులుగారి నవల కవ్యవహితపూర్వమునవెలువడిన నవల ఇయ్యదియే"* (తెలుగు సాహిత్యంపై ఇంగ్లీషు ప్రభావము. 1960: 285) అని శ్రీ రంగరాజచరిత్రను తొలి తెలుగు నవలగా తెలియజేశారు.

ఈయన అభిప్రాయంలో శ్రీరంగరాజచరిత్రను తొలి తెలుగు నవలగా గుర్తించడంలో రెండు ప్రధానాంశాలు తెలియజేశారు. అవి ఒకటి శ్రీరంగరాజచరిత్రలోని ఇతివృత్తం కల్పితమవ్వడం, రెండు ఆంగ్ల సాహిత్య సంస్కృతుల ప్రభావం దీనిపై ఉండడం. ఈ రెండు కారణాలు లేవన్న కారణంగానే మహాశ్వేతను రాజశేఖరచరిత్ర కంటే ముందు వచ్చినప్పటికి ఈయన దానిని నవలగా గుర్తించలేదు.

అలాగే Fort st. George Gazette, Supplementలో శ్రీరంగరాజచరిత్రను గురించి చెప్తూ *"This is apparently the first attempt ever made in this part of India at novel writing in Telugu prose"* (తెలుగు సాహిత్యంపై ఇంగ్లీషు ప్రభావము, 1960: 286). అని చెప్పి ఉండడం, దీనిని రచయిత నవీన ప్రబంధము అనినప్పటికి గెజిట్ novel అనడం, 14, జూన్ 1872లో ప్రచురించబడింది అని చెప్పడం కారణాలుగా చెప్తూ దీనిని మొదటి నవలగా కొత్తపల్లి వీరభద్రరావు గుర్తించారు.

2.1.6.3.2. బి. వి. కుటుంబరావు – ఆంధ్ర నవలా పరిణామము (1963):

బి. వి. కుటుంబరావు ఆంధ్ర నవలా పరిణామము అనే గ్రంథంలో తెలుగులో తొలి నవల ఏది అనే విషయం మీద సుదీర్ఘమైన చర్చే చేశారు. ఈ చర్చలో భాగంగా *"సాహిత్యకముగ వైదేశికపూర్వరంగ ప్రభావముగల యిది ప్రథమాంధ్రమౌళిక నవల"* అని చెప్తూ శ్రీరంగరాజచరిత్రను మొదటి నవలగా గుర్తించారు. (ఆంధ్ర నవలా పరిణామము, 1971: 144). అలాగే *"యావత్ దక్షిణభారతదేశమునకు దీనిని సాంఘికనవలా ప్రథమప్రసిద్ధ ప్రయత్నమని కూడా చెప్పనొప్పును"* అని అంటారు. (ఆంధ్ర నవలా పరిణామము, 1971: 145) అయితే నవలా విమర్శకులు, సాహిత్య చరిత్రకారులు ఈ రంగరాజచరిత్రను తొలి నవలగా గుర్తించకపోవడానికి కారణంగా ఆనాటికి సరహరి గోపాలకృష్ణమ శెట్టి అంత ప్రసిద్ధుడు కాకపోవడమే అని చెప్తూ ఇలా అంటారు *"ప్రథమాంధ్రస్వతంత్రనవలగా లోక మిట్టిదాని*

నుటంకింపమికి ప్రధాన కారణము తత్కర్త యంత ప్రసిద్ధుడు గామియే యనిపించుచున్నది". (ఆంధ్ర నవలా పరిణామము, 1971: 146)

2.1.6.3.3. మొదలి నాగభూషణశర్మ – తెలుగు నవలా వికాసం (1971):

మొదలి నాగభూషణశర్మ తొలి తెలుగు నవలను నిర్ధారించే విషయంలో శ్రీ రంగరాజచరిత్రే తొలి తెలుగు నవల అని చెప్తూ అందుకు గల కారణాలను కొన్ని చెప్పారు.

ఫోర్ట్ సెంట్ జార్జి గెజిట్ లో ప్రస్తావించబడిన విషయాలను తెలుపుతూ (నవల ప్రకటించబడిన తేదీ, గెజిట్ లో దీనిని నవలగా చెప్పడం మొదలైన విషయాలు) *"నవల ఆంగ్లభాషా ప్రభావం కలదిగా గుర్తించినంతమాత్రాన కల్పితము, మౌళికము అయి, రాజశేఖర చరిత్ర కన్న ముందు వ్రాయబడ్డ శ్రీ రంగరాజ చరిత్రను మొదటి తెలుగు నవలకాదనడం సాహసమే"* అని అంటారు. (తెలుగు నవలా వికాసం, 1971: 38)

అలాగే సర్వలక్షణ సమగ్రత అనే విషయంలో కూడా "కల్పిత కథ, జనుల ఆచార వ్యవహారాలను ప్రతిబింబించే రచన, మూఢ విశ్వాసాల విమర్శ- ఇవి తొలి తెలుగు నవలలకు ప్రత్యేకమైన లక్షణాలు అనుకుంటే *"శ్రీ రంగరాజ చరిత్ర" తెలుగులో మొట్టమొదటి నవల అని చెప్పక తప్పదు. అది రాజశేఖర చరిత్ర కన్న ఆరు సంవత్సరాలు ముందు వ్రాయబడ్డది – అనడం అంతకన్నా ముఖ్యమైన కారణం"* (తెలుగు నవలా వికాసం 1971: 38) అని అంటారు.

అలాగే మిగిలిన నవలలపై ఈ నవల యొక్క ప్రభావం ఎంతో వున్నది అన్న అంశం మీద దాని ప్రథమత్వం ఆధారపడదు అంటూ నరహరి గోపాలకృష్ణమ శెట్టి గారి శ్రీ రంగరాజ చరిత్రను తొలి తెలుగు నవల అనక తప్పదు అంటారు.

2.1.6.3.4. అక్కిరాజు రమాపతిరావు – తెలుగు నవల(1975):

"శ్రీరంగరాజ చరిత్రం స్వకపోలకల్పితమైన రచన. చారిత్రకమైన పాత్రలు, ప్రదేశాలు స్వీకరించడంవల్ల, ఇతివృత్తం చారిత్రకమైనదేమో అని అనిపిస్తుంది కాని, జరిగిన కథ కాదనీ, కల్పించినదేననీ రచయిత ప్రస్తావించారు. సంఘంలో ప్రచురంగా కనబడుతున్న కులాచారాలు, కట్టుబాట్లు, నమ్మకాలు, ప్రసక్తానుప్రసక్తంగా రచయిత వర్ణించాడు. తెలుగు నవలా రచనకు తొలి ప్రయత్నంగా దీన్ని భావించవచ్చు" (తెలుగు నవల. 1975: 2) అంటూ అక్కిరాజు రమాపతిరావు తన తెలుగు నవల అన్న చిన్న గ్రంథంలో శ్రీ రంగరాజ చరిత్రను తెలుగులో తొలి నవలగా గుర్తించారు.

2.1.6.3.5. కోడూరి శ్రీ రామమూర్తి – తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ1979:

కోడూరి శ్రీ రామమూర్తి తొలి తెలుగు నవల గురించి చర్చిస్తూ నరహరి గోపాలకృష్ణమ శెట్టి రాసిన శ్రీ రంగరాజ చరిత్రను తొలి తెలుగు నవలగా గుర్తించారు.

"శ్రీ రంగరాజ చరిత్రం వెలువడిన ఆరు సంవత్సరాలకు వీరేశలింగంగారు తాను నడుపుతున్న 'వివేకవర్ధిని' మాస పత్రికలో 'రాజశేఖరచరిత్రం' ధారావాహికగా ప్రచురించడం ప్రారంభించింది". (తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ, 1979: 6) అని చెప్తూ వీరేశలింగం గారు చెప్పుకున్న 'మొదటి వచన ప్రబంధమును నేనే చేసితిని' అన్న వాక్యాలు ఎంత మాత్రమూ అంగీకార యోగ్యము కావు అని కూడా చెప్పారు.

2.1.6.3.6. ఎ. బి. సాయిప్రసాద్ – దక్షణాది భాషల్లో తొలి నవల(వ్యాసం) –ఏప్రిల్ 1979:

ఇంతకు ముందు పేర్కొన్న విమర్శకుల కంటే ఎ. బి. సాయిప్రసాద్ 'శ్రీ రంగరాజ చరిత్ర' తెలుగులోనే కాదు మొత్తం భారతీయ భాషలలోనే తొలి నవల అని అభిప్రాయపడ్డాడు. ఇందుకు ఆయన చూపిన కారణాలు

అందరూ భావిస్తున్నట్లు తొలి ఆధునిక నవల వంగదేశంలో జన్మించలేదు. తెలుగు గడ్డపై అది పురుడు పోసుకుంది. *""హిందువుల యాచారములు తెలుపు" నవీన ప్రబంధం 'శ్రీ రంగ రాజ చరిత్ర'ను మనం మొదటి నవలగా పరిగణించవచ్చు"* (అభ్యుదయ. ఏప్రిల్, 1979: 13) అని చెప్తూ అందుకు గల సహేతుకమైన కారణాలను అన్నింటినీ ఈ వ్యాసంలో చూపిస్తూ అన్ని విధాలా శ్రీ రంగరాజ చరిత్రను స్వతంత్ర నవలగా కూడా చెప్పారు.

"తమిల్ నావల్ (నూరాండ్ వరలారుమ్ వళర్చియుం) గ్రంథ రచయితలు– శ్రీయుతులుఫై. జి. సుందర రాజన్ (చిట్టి) యస్ శివపాద సుందరం– 'దుర్గేశనందుని' ప్రచురణా కాలాన్ని 1865గా పేర్కొన్నారు. కానీ నార్ల వెంకటేశ్వరరావు తమ ఆంగ్ల పుస్తకం 'వీరేశలింగం'లో 'దుర్గేశనందిని' ప్రచురణా కాలాన్ని 1875గా అభివర్ణించారు. నార్లవారి Chatterji serialised in 1875 his Durgesa Nandini his literary nournal bangadarshan అంతటితో ఆగక Three years lates veeresalingam began publishing his Rajasekara Charitra (page. 51,3rd para) అని కూడా వ్రాశారు. నార్లవారు రాసిన రెండవ వాక్యంలో నిజం ఉంది. వారు నమోదు చేసిన తారీకునాడే రాజశేఖర చరిత్ర వ్రాయడం జరిగింది. ఈ తర్కం ఆధారంగానే నార్ల వీరేశలింగాన్ని భారతదేశపు రెండవ నవలాకారుడిగా స్తుతిస్తున్నారు. శ్రీయుతులు చిట్టి, శివపాదసుందరంలు పొరబాటుగా 1865ను 1875కు బదులుగా వాడి ఉండవచ్చును. ఏతావాతా తేలేదేమంటే బంకిమ్ చంద్రఛటర్జీ నవల

'దుర్గేశనందిని' 1875లోనే వెలువడిందన్నది. కానీ తొలి తెలుగు నవల 1872లోనే ప్రచురించబడింది" (అభ్యుదయ. ఏప్రిల్, 1979: 13).

అదేవిధంగా దాశరథి రంగాచార్య, సి. మృణాళిని, వైద్యం వెంకటేశ్వరరాచార్యులు, జయధీర్ తిరుమలరావు, ఆరుద్ర, వెలమల సిమ్మన్న, కొలకలూరి ఇనాక్, కడియాల రామమోహనరాయ్, ముదిగంటి సుజాతారెడ్డి, ఇటీవల రాయలసీమ నవలపై పరిశోధన చేసిన పొదిలి నాగరాజు లాంటి పరిశోధకులు, విమర్శకులు, సాహిత్య చరిత్రకారులు శ్రీ రంగరాజ చరిత్రనే తొలి తెలుగు నవలగా గుర్తించాలని వారి వారి గ్రంథాలలో స్పష్టంగా తెలియజేశారు.

2.1.6.4. తొలి తెలుగు నవల – రాజశేఖర చరిత్ర:

రాజశేఖర చరిత్రను తొలి నవలగా గుర్తించిన వాళ్ళు

1. పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు
2. వల్లంపాటి వెంకటసుబ్బయ్య
3. డి. విద్యేశ్వరి

ఇతరులు

2.1.6.4.1. పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు – తెలుగు నవలా సాహిత్య వికాసము (1974):

తెలుగు నవలా సాహిత్యంపైన ఒక పెద్ద పరిశోధనా గ్రంథాన్ని వెలువరించిన పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు తన 'తెలుగు నవలా సాహిత్య వికాసము' అనే గ్రంథంలో తొలి తెలుగు నవలగా కందుకూరి వీరేశలింగం రచించిన రాజశేఖర చరిత్రను పేర్కొన్నారు.

"ఈ రాజశేఖర చరిత్రను మన సాహిత్య సుక్షేత్రమున పూచిన తొలిపువ్వుగా అందరును ఏకగ్రీవముగా ఆమోదించి, వారికి నవలా రచనమున ప్రథమ స్థానమునిచ్చి గౌరవించిరి. ఆ నవల మహత్తర గుబాళింపుతో తెలుగు వారి హృదయములలో ఒకక్రొత్త సంచలనము, ఒక క్రొత్త వెలుగు వెల్లివిరిసినది. తెలుగు నవలా సాహిత్య చరిత్రకు రాజశేఖర చరిత్ర పునాదిరాయియై వర్ధిల్లినది" (తెలుగు నవలా సాహిత్య వికాసము, 1974: 80, 81)అని పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు అంటారు.

అలాగే "కర్నూలు వాసియైన నరహరి గోపాలకృష్ణమ శెట్టి గారు 1872 వ సంవత్సరమున *"శ్రీ రంగరాజ చరిత్ర"* మను పేరుగల నవలను వ్రాసి ప్రకటించినట్లు *మరికొందరు తెలుపుదురు"* (తెలుగు నవలా సాహిత్య వికాసము, 1974: 80)అని అన్నారు. అయితే ఇక్కడ శ్రీ రంగరాజ చరిత్ర తొలి నవల కాదనడానికి ఏ కారణాలనూ ఆయన పేర్కొనలేదు. రాజశేఖర చరిత్ర కంటే ముందు ఇటువంటి నవల ఒకటి ఉంది అని ఎవరో

అన్నట్లుగా చెప్పారే గానీ దీని గురించి మరేవిధమైన ప్రత్యేకమైన అభిప్రాయాన్ని ఈయన చెప్పలేదు.

2.1.6.4.2. వల్లంపాటి వెంకటసుబ్బయ్య– నవలా శిల్పం 1989; రాయలసీమలో ఆధునిక సాహిత్యం సామాజిక సాంస్కృతిక విశ్లేషణ (2006)

నవలపై ఒక మంచి విమర్శా గ్రంథాన్ని ప్రకటించిన వల్లంపాటి వెంకటసుబ్బయ్య తన నవలా శిల్పంలో రాజశేఖర చరిత్రను తెలుగులో మొదటి సామాజిక నవలగా చాలామంది విమర్శకులు భావిస్తున్నట్లు చెప్తూ *"ఈ వాతావరణంలో పుట్టి, పెరిగి, రచన ప్రారంభించి తన్నుతాను మార్చుకొని, తన చుట్టూరా ఉన్న వాతావరణాన్ని మార్చటానికి జీవితాన్ని అంకితం చేసిన మనీషి, నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు వారు రాసిన "రాజశేఖర చరిత్రము" (1878) ను తెలుగులో మొదటి సామాజిక నవలగా చాలామంది విమర్శకులు భావిస్తునారు"* (నవలా శిల్పం, 1989: 6,7) అని అంటారు. వల్లంపాటి అభిప్రాయం కూడా అదే అన్నట్లు చెప్పారు. అయితే ఈ గ్రంథంలో శ్రీ రంగరాజ చరిత్రను గురించి కనీస ప్రస్తావన కూడా లేదు.

నవలాశిల్పం తరవాత వల్లంపాటి వారు ప్రకటించిన రాయలసీమలో ఆధునిక సాహిత్యం సామాజిక సాంస్కృతిక విశ్లేషణ అనే గ్రంథంలో శ్రీ రంగరాజ చరిత్రను తొలి తెలుగు నవల కాదని నిర్ణయించడానికి చాలా పెద్ద చర్చ చేశారు. ఇందులో ఆయన చెప్పిన కారణాలు

"అతడు తన గ్రంథాన్ని తెలుగులో "వచన ప్రబంధము" అని చెప్పుకున్నా, తన గ్రంథానికి ఇంగ్లీషులో రాసిన preface లో in the from of a novel అని స్పష్టంగా చెప్పాడు. కానీ "శ్రీ రంగరాజ చరిత్ర"లో నవలా లక్షణాలు దాదాపుగా లేవు" (రాయలసీమలో ఆధునిక సాహిత్యం సామాజిక సాంస్కృతిక విశ్లేషణ, 2006: 85,86) అని అంటారు.

ఇందులో కథా కాలం రచనా కాలం కంటే నాలుగు వందల సంవత్సరాల క్రితంది. అంటే ఆంధ్రదేశాన్ని 'మూరురాయరగండడు' పరిపాలిస్తున్న కాలానికి చెందింది. 'మూరురాయరగండడు' అన్నది కృష్ణదేవరాయలకున్న బిరుదు. కానీ అతనికి శ్రీ రంగరాజు అన్న కొడుకు ఉన్నట్లుగా ఎలాంటి చారిత్రిక ఆధారమూ లేదు. అంటే దీన్ని చారిత్రక "నవల"గా పరిగణించడానికి కూడా వీలు లేదు". (రాయలసీమలో ఆధునిక సాహిత్యం సామాజిక సాంస్కృతిక విశ్లేషణ, 2006: 86)

"పంతొమ్మిదవ శతాబ్దం మలి సగంలో తెలుగు సమాజంలో వస్తూ ఉండిన కొత్త గాలుల ప్రస్తావన "శ్రీరంగరాజు చరిత్ర"లో మచ్చుకు కూడా లేవు" (రాయలసీమలో ఆధునిక సాహిత్యం సామాజిక సాంస్కృతిక విశ్లేషణ, 2006: 86)

"శ్రీరంగరాజు చరిత్ర" తెలుగులో మొట్టమొదటి నవల కాదు". (రాయలసీమలో ఆధునిక సాహిత్యం సామాజిక సాంస్కృతిక విశ్లేషణ, 2006: 86)

పై విధమైన కారణాలతో శ్రీరంగరాజ చరిత్రను తొలి తెలుగు నవల కాదని చెప్తూ రాజశేఖర చరిత్రను తొలి తెలుగు నవలగా వల్లంపాటి గుర్తించారు.

2.1.6.4.3. డి. విద్యేశ్వరి – భారతీయ భాషల్లో నవలా ప్రక్రియ (స్థూల పరిచయం) 1998

డి. విద్యేశ్వరి భారతీయ భాషల్లో నవలా ప్రక్రియను పరిచయం చేస్తూ *"అటు తరవాత 1878లో కందుకూరి వీరేశలింగం (1847-1919) రాజశేఖర చరిత్ర అనే తొలి తెలుగు సమగ్ర సాంఘిక నవల వెలువడింది"* (భారతీయ భాషల్లో నవలా ప్రక్రియ, 1998: 13) అని చెప్తూ రాజశేఖర చరిత్రను తొలి తెలుగు నవలగా చెప్పారు.

అయితే ఇక్కడ మహా శ్వేతకు గాని, శ్రీ రంగరాజ చరిత్రకు గాని నవలా లక్షణాలు లేవని అభిప్రాయపడుతూ ఇలా అంటారు. *"ఇంతకు ముందే కొక్కొండ వెంకటరత్నం పంతులుగారు మహాశ్వేత (1867) అనే నవలను, కర్నూలు వాసియైన నరహరి గోపాలకృష్ణమ శెట్టి 1872లో శ్రీ రంగరాజ చరిత్రము అనే నవల వ్రాశారు. అయితే వీటిలో మొదటి రచన బాణుడి కాదంబరిని పోలిన తెలుగు రచనగా ఉండటం, శ్రీ రంగరాజ చరిత్రలో ఒక కథా సంవిధానం తప్ప ఆధునిక నవలకుండవలసిన సహజ పాత్ర పోషణ, తత్కాలీన సహజ చిత్రణలు లేకపోవటం మూలంగా ఈ రెంటిని సమగ్ర నవలలుగా అధిక శాతం సాహితీ వేత్తలు, విమర్శకులు అంగీకరించలేదు"* (భారతీయ భాషల్లో నవలా ప్రక్రియ , 1998: 13)

వీరితో పాటూ కోవెల సుప్రసన్నాచార్య, నవీన్, పార్థసారథి, ఆవుల మంజులత, కేతు విశ్వనాథ రెడ్డి లాంటి వారు రాజశేఖర చరిత్రను తొలి తెలుగు నవలగా గుర్తించారు.

2.2. ప్రపంచ కథా (కథానిక) సాహిత్యం – పుట్టుక – నేపథ్యం:

కథానిక – ఈ పేరు వినగానే మనకు 'కథ' గుర్తుకు వస్తుంది. 'మానవుని ఊహ ఏనాడు రెక్క విప్పుకొన్నదో ఆనాడే పుట్టింది కథ' అంటారు పోరంకి దక్షిణామూర్తి. అయితే ఈ కథ చాలా పురాతనమైనది. మానవ నాగరికతలు కూడా అభివృద్ధి చెందని రోజుల్లో నుండే ఈ కథ ఉన్నది. అందుకే మనిషంత పురాతనమైంది 'కథ అంటారు. అప్పటికి భాషకు లిపి సౌలభ్యం లేదు కాబట్టి మొదట ఈ కథ జనపదాలలో, జానపదుల నోళ్ళల్లో మాత్రమే నిక్షిప్తమై ఉండేది. క్రమంగా భాషకు

లిపులు ఏర్పడడంతో కథ జనపదాల్లో నుండీ జానపద సాహిత్యంలో నుండీ శిష్ట సాహిత్యంలోకి ప్రవేశించింది. వేదాల దగ్గర నుంచీ ఉపనిషత్తులు, ఇతిహాసాలు, పురాణాలు తర్వాత వచ్చిన జైన జాతక కథలు, ఆ తర్వాత చాలా కాలం తర్వాత వచ్చిన బృహత్కథ, కథాసరిత్సాగరం, బేతాళ పంచవింశతి , శుకసప్తతి, పంచతంత్రాది గ్రంథాలల్లో కథ చోటుచేసుకోవడమే కాకుండా సుస్థిర స్థానాన్ని కూడా సంపాదించుకుంది. అయితే ఈ కథకు ఇప్పుడు మనం చెప్పుకుంటున్న కథకు (కథానిక) చాలా వ్యత్యాసం ఉంది.

'కథానిక' ప్రస్తావన అగ్నిపురాణంలో ఉన్నా, తర్వాత పురాణ, ఇతిహాస, కావ్యాల్లో ఏదో ఒక రూపంలో కథ ఉంటూ వచ్చిందన్నా, అవన్నీ పద్యాల్లో చెప్పిన కథలే అన్నా అదంతా నేటి కథానికకు పూర్వ చరిత్ర లేకపోలేదు అని చెప్పడం వరకే అని పోలాప్రగడ సత్యనారాయణ మూర్తి 'తెలుగు కథానిక' అన్న గ్రంథంలో చెప్పారు. ఇది నిజం. నేటి కథానిక పూర్తిగా ఆధునికమైనది. పాశ్చాత్య ప్రభావంతో, ఆంగ్ల విద్యావిధానం వల్ల ప్రభావితమై, భారతీయ భాషలలో ప్రవేశించిన నూతన ప్రక్రియల పరంపరలో జనించింది 'కథానిక'.

ఈనాడు సౌలభ్యం కోసం మనం కథ, కథానిక అనే రెండు పదాలనూ సమానార్థకాలుగా చెప్పుకుంటున్నప్పటికీ అవి రెండూ పూర్తిగా భిన్నమైనవి. ప్రాచీన కథ ఒక రకంగా జాగృతావస్థ లోని మనిషిని నిద్రలోనికి తీసుకెళ్ళడానికి చెప్పేది. ఉదాహరణకు శుకసప్తతి కథలు, పలకని పద్మాక్షి కథలు లాంటివి. (అయితే ప్రాచీన కథా సాహిత్యం మొత్తం అలా ఉందని నా ఉద్దేశం కాదు). సుసుప్తావస్థలోని మనిషిని, సుసుప్తావస్థలోని సమాజాన్ని జాగృతావస్థలోకి తెచ్చేదే నేటి కథానిక.

ఈ ప్రక్రియ తెలుగులోనే కాదు మొత్తం భారతీయ భాషలలో కూడా నేరుగా ఉద్భవించలేదు. మొదట పాశ్చాత్య దేశాలల్లో పుట్టి క్రమంగా అభివృద్ధి చెంది ఆంగ్ల పాలకుల సంస్కృతి సంప్రదాయాల పరంపరలో భాగంగా మన దేశంలోకి ప్రవేశించింది. కాబట్టి పాశ్చాత్య కథానిక ఆవిర్భావానికి గల నేపథ్యాన్ని కొంత చూసి ఆ తర్వాత భారతీయ భాషలలో కథానికావిర్భావం, ఆ తర్వాత తెలుగులో కథానిక ఆవిర్భావం వాటికి గల నేపథ్యాలను స్థూలంగానైనా ఇక్కడ చూడాల్సిన అవసరం ఉంది.

2.2.1. నేపథ్యం:

"నవలను బూర్జువాసమాజం ప్రపంచసంస్కృతికిచ్చిన మహత్తరమైన కానుకగా నవలా సాహిత్య విమర్శకులు అభివర్ణిస్తారు. ఆ పద్ధతిలోనే మనం కథను పారిశ్రామిక నాగరికత ప్రపంచ సంస్కృతికిచ్చిన మహత్తరమైన కానుకగా అభివర్ణించవచ్చు" (కథాశిల్పం, 2016: 4) అని

కథానిక ఆవిర్భావం గురించి ప్రముఖ కథానికా విమర్శకుడు వల్లంపాటి వెంకటసుబ్బయ్య చెప్పిన అభిప్రాయం యదార్థమైనది.

1770లో ప్రారంభమైన పారిశ్రామిక విప్లవం ఇంగ్లాండు ఎల్లలు దాటి యూరోపియన్ దేశాలకు విస్తరించిన తరవాత దాని ప్రభావం ప్రజా జీవితంపైన బలంగా పడింది. పారిశ్రామిక విప్లవం యొక్క ప్రధాన ఉద్దేశం యంత్రాన్ని ఉపయోగించి వస్తువు ఉత్పత్తిని పెంచడమే కాబట్టి మొదట యంత్రోత్పతి పెరిగింది. తర్వాత ప్రయాణ సౌకర్యాలు పెరిగాయి. శాస్త్ర సాంకేతిక రంగంలో వచ్చిన మార్పులు పారిశ్రామిక రంగంలో నూతన ఆవిష్కరణలకు ఊతమిచ్చింది. క్రమంగా మగ్గం, ఆవిరి యంత్రం, విద్యుచ్ఛక్తి, టెలిగ్రాఫ్, టెలిఫోన్, రేడియోలు ఆవిర్భవించాయి.

అలాగే నగరాల్లో కర్మాగారాలు రావటంతో గ్రామీణ ప్రజలు నగరాలకు వలసపోవటం జరిగింది. సమాజంలో వ్యాపారులూ, పెట్టుబడిదారులూ పెరగడంతో పేద ధనిక వర్గాల మధ్య అంతరం పెరిగింది. క్రమంగా శ్రామికవర్గం ఒకటి ఏర్పడింది. వీరికి రాజకీయ చైతన్యం కూడా పెరిగింది. ఇలా సమాజంలోని ప్రజాజీవితంలో అనేక మార్పులు కలగడం వల్ల ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో అనేక మార్పులు వచ్చాయి. శాస్త్ర సాంకేతికత ఎలా ఉన్నా 19 వ శతాబ్దపు జీవితము ఎంతగానో మారిపోయింది. అంతవరకూ సమాజంలో ఉన్న నిశ్చలత, భద్రత కనుమరుగైపోయింది. వీటి ఫలితంగా మానవ జీవితంలో క్లిష్టత మరింతగా పెరిగింది. ఈ మార్పులు సాహిత్య రంగానికేమి మినహాయింపు కాదు.

"అంతవరకూ నవల, సుభద్రమైన వాతావరణంలో జీవిస్తున్న పాఠకుల కోసం రాయబడేది. వారు సుదీర్ఘమైన నవలల్ని చదివి మరింత భద్రతను అనుభవించేవారు. 19 వ శతాబ్దపు జీవితంలో క్లిష్టత ఊహాతీతంగా పెరగటం చేత అంతకు క్రితంలాగా జీవితాన్ని మొత్తంగా కాకుండా శకలాలుగా చూడవలసిన అవసరం పెరిగింది. రచయితలు అసమర్థులు కావటం చేత వారు మొత్తం జీవితాన్ని వదిలి శకలాలను చూడలేదు. జీవిత శకలాలకు ప్రాముఖ్యం పెరగటం చేత రచయితలు వాటిని పట్టించుకోక తప్పలేదు" (కథాశిల్పం, 2016: 7) అని వల్లంపాటి వెంకట సుబ్బయ్య కథానిక పుట్టుక ఎలా జరిగిందో చెప్పారు.

"సుప్రసిద్ధ కథా రచయిత హెచ్.ఇ. బేట్స్ ఈ ఆందోళననూ, విశ్వాసరాహిత్యాన్నీ చిత్రించటానికి నవల కంటే, కవిత కంటే కథానిక చాలా మెరుగైన సాహిత్య ప్రక్రియ అని భావించాడు. అందుకే అతడు కథానికను The form of the Present Moment అని అభివర్ణించాడు" అని వల్లంపాటి అంటారు. (కథాశిల్పం, 2016: 8)

ఇలా కథానిక గురించి వల్లంపాటి గారు చెప్తూ నవలకు ఉపశాఖగా కథానిక పుట్టలేదని ఇలా అంటారు. *"కాబట్టి కథ నవలలో నుంచి పుట్టిన ఉపప్రక్రియ ఎంతమాత్రమూ కాదు. నవల సాధించలేని కొన్ని ప్రత్యేక కార్యాలను సాధించటానికి ఒక నిర్దిష్ట చారిత్రక దశలో పుట్టిన ప్రత్యామ్నాయ ప్రక్రియ (Alternate Genre) కథ"* (కథాశిల్పం పుట 9).

2.2.2. ప్రపంచ కథా సాహిత్యం – మొదటి కథ:

వాస్తవానికి కథ అనే సాంప్రదాయం మనకు క్రీ. పూ 3, 4 వేల సంవత్సరాలల్లో ఈజిప్టుల కాలం నుంచే ఉందంటారు. The tales of the magician అనే పేరుతో ఈజిప్టుల కాలం నాటి కథలు మనకు కనిపిస్తున్నాయి. ఆ తర్వాత గ్రీకు సాహిత్యంలో కూడా కథ అనేది వివిధ ప్రక్రియల్లోను ఉంది. ఆ తర్వాత జియోఫ్రే చాసర్ రాసిన conterbury tales, గియోవన్ని బొకాషియో రాసిన decameran (జియోఫ్రే చాసర్, గియోవన్ని బొకాషియోలను పాశ్చాత్య కథా సాహిత్యానికి పితామహులుగా చెపుతారు) లాంటి వాటితో పాటూ 17, 18 శతాబ్దాలల్లో అనేక కథలు కథానికా రూపాలుగా వచ్చాయి. ఇలా అనేక కథలు వేరు వేరు కాలాల్లో వచ్చినప్పటికీ ఎడ్గర్ ఆలెన్ పో మూలాన దీనికి పూర్తి స్వభావం 19వ శతాబ్దం నాటికి కానీ రాలేదు. అందుకే ప్రపంచ కథా సాహిత్యానికి ఆద్యుడు ఎడ్గర్ ఆలెన్ పో అని అంటారు.

ఈ ఆధునిక కథానిక ప్రారంభం నిర్దిష్టంగా ఒక రచయిత ద్వారా గానీ, ఒక దేశంలో గానీ జరిగిందని చెప్పలేము. 1814–21 మధ్య కాలంలో జర్మన్ లో ఇ. టి. డబ్యు హాఫ్ మెన్ తన కథల సంపుటాన్ని ప్రచురించాడు. 1812–15 మధ్య కాలంలో జాకోబ్, విలియం గ్రిమ్ లు తమ ఫెయిర్ టేల్స్ ను, లెజెండులను వెలుగులోకి తెచ్చారు. ఈ కాలంలోనే జాన్ లుదగ్ద్ టియోక్ కథా రచన చేస్తున్నాడు. 1819–20 మధ్య కాలంలో అమెరికాకు చెందిన ఇర్వింగ్ the sketch book అనే పేరుతో మూడు కథా సంపుటాలను ప్రచురించాడు. అప్పటికే ఇతనికి సమకాలికులైన నెథానియన్ హాథారాన్, ఎడ్గర్ ఆలెన్ పో లు కథానిక రచనలో ప్రారంభకులుగా ఉన్నారు. 1813లో రష్యాలో అలెగ్జాండర్ పుష్కిన్, నికోలో గోగోల్ కథానికా రచన వైపు దృష్టి పెట్టి ఉన్నట్లు తెలుస్తోంది. ఇలా కథానికా రచన అనేక దేశాల రచయితలు దాదాపు 10, 20 సంవత్సరాల కాల వ్యవధిలో మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. పై రచయితల చేతుల్లో కథానిక ప్రారంభమై వివిధ దేశాలకు విస్తరించింది. ఏది ఏమైనప్పటికీ మొత్తంగా ఆధునిక కథానికకు ఆద్యుడుగా చాలా మంది ఎడ్గర్ ఆలెన్ పో ను చెప్తారు.

అయితే వల్లంపాటి వారు ప్రపంచ కథా సాహిత్యాన్ని గురించి చెప్తూ "పాశ్చాత్య కథాసాహిత్యం 1832 జనవరిలో "మెంట్ జన్ గర్ స్టెయిన్" అన్న కథను అమెరికన్ రచయిత

ఎడ్గర్ ఆలెన్ పో ప్రచురించడంతో ప్రారంభమైందని చాలామంది భావిస్తారు. నేను కూడా 1980లో రాసిన "కథాంగాలు" అన్న వ్యాసంలో అలాగే అన్నాను. ఇప్పుడు ఆ అభిప్రాయాన్ని మార్చుకొని ఎడ్గర్ ఆలెన్ పో తో పాటూ రష్యన్ రచయిత నికోలాయ్ గోగోల్ కూడా కథా సాహిత్యానికి ప్రారంభకుడని నమ్ముతున్నాను" అని అంటారు.

2.2.3. భారతీయ కథానిక ఆవిర్భావం – నేపథ్యం:

ఆధునిక కథానిక ఆవిర్భావానికి ప్రాచీన కథా సాహిత్యానికీ ఎటువంటి అవినాభావ సంబంధం లేదు. ఎందుకంటే కథానిక పూర్తిగా ఆధునికమైనది. కథానిక పాశ్చాత్య ప్రభావం వల్లనే భారతదేశంలో నవల లాగే పుట్టింది. దీనికి ప్రధాన కారణం 19, 20 శతాబ్దాలలో ఆంగ్లేయుల వల్ల వచ్చిన నవ చైతన్యమే. దీనికి సంబంధించిన నేపథ్యాన్ని భారతీయ నవల పుట్టుక – నేపథ్యం అన్న శీర్షిక కింద చెప్పాను. పాశ్చాత్య విద్య వల్ల ప్రభావితులైన భారతీయ మధ్యతరగతి విద్యావంతులే ఆధునిక భారతీయ సాహిత్యానికి అందులోను వివిధ ప్రక్రియల ఆవిర్భావానికి కారకులయ్యారు. ఆ విధంగా పుట్టుకు వచ్చిన కథానిక భారతీయ భాషలన్నింటిలో ఒకేసారి పుట్టలేదు మొదట బెంగాళీలో పుట్టి ఆ తర్వాత వివిధ భాషలలో పుట్టినది. ఆ పరిణామాన్ని ఇప్పుడు చూద్దాం.

2.2.4. వివిధ భారతీయ భాషలలో కథానిక ఆవిర్భావం:

భారతదేశంలోని వివిధ భాషల్లో మొదటి నవల ఏది అది ఎప్పుడు వచ్చింది అనేది ఇక్కడ చూద్దాం.

2.2.4.1. బెంగాలీ కథానిక:

భారతీయ సాహిత్యంలో కథానిక మొదట బెంగాల్ భాషలో ఆవిర్భవించింది. 1873లో వచ్చిన 'మధుమతి' అనే కథానికే బెంగాల్ లోనూ, భారతీయ కథానికా సాహిత్య చరిత్రలోనూ మొట్టమొదటిదిగా చరిత్రకారులు అంగీకరించారు. ఈ కథానిక బంకించంద్ర ఛటర్జీ సంపాదకత్వంలోని బంగదర్శన్ అనే సాహిత్య మాస పత్రికలో వచ్చింది.

2.2.4.2. తెలుగు కథానిక:

1910లో గురజాడ అప్పారావు రాసిన 'దిద్దుబాటు' కథను తెలుగులో మొదటి కథానిక అని చాలామంది విమర్శకులు భావించారు. అయితే దిద్దుబాటు కంటే ముందు బండారు అచ్చమాంబ రాసిన 'ధన త్రయోదశి'ని, 'స్త్రీ విద్య'ని మొదటి తెలుగు కథానికలుగా కొంతమంది చెప్పారు. ఆ తర్వాత ఆచంట వేంకట సాంఖ్యాయన శర్మ రాసిన 'లలిత', 'విశాఖ', 'అపూర్వోపన్యాసము' అనే కథలను తొలి కథానికలుగా కొంతమంది చెప్పారు.

అయితే ఆ తర్వాత వివినమూర్తి, అప్పిరెడ్డి హరినాథ రెడ్డి, తవ్వా వెంకటయ్యల కృషి మూలంగా తెలుగు కథానిక పుట్టుకకు సంబంధించి కొన్ని కొత్త విషయాలు వెలుగులోనికి వచ్చాయి. వీటి మూలంగా 1879లో 'చిలుకను గుఱించిన సంభాషణ' అనే కథే తెలుగులో మొదటి కథానిక అవుతుంది. అయితే దీనికి రచయిత ఎవరో తెలియదు. రచయిత తెలిసి తెలుగులో లభిస్తున్న మొదటి కథానిక 'మృదుభాషణ విద్యావిశారదుల కథ' అనే కథ. దీనిని 1895లో రాయసం వెంకటశివుడు అనే ఆయన రాశారు. దీనితో తెలుగు కథానిక రచయిత పేరు తెలియకుండా 1879లోనూ, రచయిత తెలిసి 1895లోనూ ప్రారంభమయ్యిందని చెప్పవచ్చు.

తెలుగులో తొలి కథ భిన్నాభిప్రాయాలు అనే శీర్షికన తెలుగు కథానిక గురించి మరింత వివరంగా చెప్పాను.

2.2.4.3. మలయాళ కథానిక:

తెలుగు తర్వాత భారతీయ సాహిత్యంలో కథానిక మలయాళంలో ఆవిర్భవించింది. 1891లో విద్యావినోధిని అనే మాస పత్రికలో ప్రచురించబడిన 'కుంజిరామన్ నయనార్' 'వసనవికృతి' అనే కథే మలయాళంలో మొదటి కథానికగా గుర్తింపు పొందింది.

2.2.4.4. ఒరియా కథానిక:

'ఫకీర్ మోహన్ సేనాపతి'తోనే ఒరియా సాహిత్యంలో వచన రచనలు ప్రారంభమయ్యాయని అంటారు. ఒరియాలో మొట్టమొదటి కథానికను రాసింది కూడా ఈయనే. ఈయన 1898లో రాసిన 'రెబటి' (రేవతి) అనే కథే ఒరిస్సా భాషలో మొదటి కథానికగా గుర్తింపు పొందింది.

2.2.4.5. మరాఠీకథానిక:

మరాఠీలో ఆధునిక కథానిక 1896లో ప్రారంభమైనట్లు తెలుస్తుంది.

2.2.4.6. గుజరాతీ కథానిక:

గుజరాతీలో కథానిక 1900లో ప్రారంభమయ్యింది. అంతకుముందు గుజరాతీ భాషలో కథానికలు ఉన్నప్పటికీ అవి జానపద కథల నుండి గ్రహించినవిగానూ, విదేశీ రచనలకు అనువాదాలుగానూ ఉన్న కారణంగా వాటిని మొదటి కథానికలుగా గుర్తించలేదు. 1900లో 'అంబలాల్ దేశాయ్' రాసిన 'శాంతిదాస్' అనేదే గుజరాతీలో అసలైన మొదటి కథానికగా గుర్తించబడింది.

2.2.4.7. కన్నడ కథానిక:

1900లో సువాసిని పత్రికలో వచ్చిన 'పంజేమంగేశ రావు' రాసిన 'నన్న చిక్కతాయి', 'భారతశ్రహో', 'కమల పురద హోట్టినల్లి' అనే కథలు కన్నడలో మొదటి కథానికలుగా గుర్తింపు పొందాయి.

2.2.4.8. ఉర్దూ కథానిక:

ఉర్దూ కథానికకు వాస్తవికతను పరిచయం చేసిన ప్రేమ్ చంద్ తో ఉర్దూలో కథానిక మొదలైంది. 1907లో తన మొదటి కథ 'దున్యాకాసచేసే అన్మోల్ రతన్' అనే కథానికను జనానా పత్రిక ప్రచురించింది. దీనినే ఉర్దూలో మొదటి కథానికగా చెప్తారు.

2.2.4.9. అస్సామీ కథానిక:

అస్సామీ కథానికకు ప్రారంభకుడుగా 'లక్ష్మీనాథ బెజ్ బరువా'ను చెప్తారు. ఇతని మొట్ట మొదటి కథానికా సంపుటి 'సురభి' 1909లో వచ్చింది.

2.2.4.10. హిందీ కథానిక:

హిందీలో కథానిక 1901లో ప్రారంభయయ్యిందని, 1916లో ప్రారంభమయ్యిందని కొన్ని వాదాలున్నాయి. అయితే 1911లోనే అసలైన హిందీ కథానికలు వచ్చినట్లు చెప్తారు. అవి చంద్ర శర్మ గులేరి రాసిన 'ఉన్ సే కహథా'; బంగమహిల రాసిన 'దులాయి వాలి'; కిశోరిలాల్ గోస్వామి రాసిన 'ఇందుమతి'. ఈ మూడు కథానికలు కూడా హిందీలో మొదటి కథానికలుగా గుర్తింపు పొందాయి.

2.2.4.11. తమిళ కథానిక:

తమిళంలో కథానికను రచించిన వారిలో వ. వే. సు.అయ్యర్ ను మొదటి వాడుగా చెప్తారు. "వ. వే. సు.అయ్యరే తొలిసారిగా చిన్న కథకు సముచితమగు కలారూపమునొసగి గొప్ప కళాత్మక రచనలను తమిళమునందు వెలయించెను" (తమిళ వాఙ్మయ చరిత్ర. పుట: 341). ఈయన 1915-17 మధ్య కాలంలో రాసిన కథలను 'మంగైయర్ క్కరసియిన్ కాదల్ మొదలయిన తమిళ కథలు' అనే పేరుతో 1917లో సంపుటిగా ప్రచురించాడు.

ఇలా భారతదేశంలో మొదట బెంగాల్ (1873) లో ప్రారంభమైన కథానిక ఆ తర్వాత తెలుగు (1895-79), మలయాళం (1891), ఒరియా (1898), మరాఠీ (1896), గుజరాతీ (1900), కన్నడ (1900), ఉర్దూ (1907), అస్సామీ (1909), హిందీ (1911), తమిళం (1917), పంజాబీ (1921), సింధీ (1930), కాశ్మీరీ (1950) లాంటి భాషలలో ప్రారంభమై నేడు ప్రజల ఆదరాభిమానాలను అధికంగా పొందుతున్న ప్రక్రియగా నిలిచింది.

2.2.5. తెలుగులో తొలి కథానిక భిన్నాభిప్రాయాలు:

తెలుగులో తొలి కథానిక ఏది, దాని రచయిత ఎవరన్న విషయంలో కథానికా పరిశోధకులు, విమర్శకులు, సాహిత్య చరిత్రకారులు భిన్న భిన్న అభిప్రాయాలను వ్యక్తం చేశారు. యువ భారతి వారు 1987లో ప్రచురించిన 'నవ్యసాహితీ లహరి' అన్న పుస్తకంలో కథానికపై పోరంకి దక్షిణామూర్తి రాసిన 'కథానిక' అన్న వ్యాసం, 1994లో అక్కిరాజు రమాపతిరావు 'సాహితీ వ్యాసంగం'లో రాసిన 'తెలుగు కథ – వాస్తవికత' అన్న వ్యాసం, 1995లో వల్లంపాటి వెంకటసుబ్బయ్య 'కథాశిల్పం', 1980లో ఆంధ్రప్రదేశ్ దర్శిని-2లో పెద్దిబొట్ల సుబ్బరామయ్య 'కథానికా వాఙ్మయం' అన్న వ్యాసం, 1998లో వచ్చిన 'తెలుగు కథకులు కథనరీతులు' అన్న పుస్తకానికి మధురాంతకం రాజారాం, సింగమనేని నారాయణలు రాసిన ముందు మాట, 1999లో పోలాప్రగడ సత్యనారాయణమూర్తి రాసిన 'తెలుగు కథానిక', 2000లో వచ్చిన 'కథాయాత్ర' అన్న పుస్తకం, 2006లో కథానిలయం వారు ప్రచురించిన 'తొలి తెలుగు కథ ఏడు అభిప్రాయాలు', 2008లో కె. కె. రంగనాథాచార్యులు రాసిన 'తొలినాటి తెలుగు కథానికలు' అన్న పుస్తకాలల్లో తొలి తెలుగు కథ ఏది అన్న విషయంపై కొంత మంది సుదీర్ఘంగానూ. కొంత మంది సూచనప్రాయంగానూ చర్చించారు. అయితే ఇదంతా పాత చర్చ. పై గ్రంథాలలో వీరు చేసిన చర్చ గురించి స్థూలంగా తొలి కథ గురించి ఏమి చెప్పారో చూద్దాం.

2.2.5.1. తెలుగులో తొలి కథానిక – పాత చర్చ:

మొదట గురజాడ అప్పారావు 1910లో రాసిన 'దిద్దుబాటు'ను మొదటి కథానిక అన్నవారిని చూద్దాం.

2.2.5.1.1 పోరంకి దక్షిణామూర్తి:

పోరంకి దక్షిణామూర్తి గురజాడ 1910లో రాసిన 'దిద్దుబాటు'ను తొలి కథగా భావించారు. ఈయన 'కథానిక' అన్న వ్యాసంలో గురజాడ 'దిద్దుబాటు'కు ముందు వచ్చిన 'లలిత' కథను గురించి చెప్తూ *"తీరా చూస్తే, దాంట్లో ఆధునిక కథానిక లక్షణాలు బొత్తిగా లేవు. కథావస్తువు సిల్లీగా కనిపించింది. భాష కూడా ఆధునికం కాదు. శిల్పం అసలేలేదు"* (నవ్యసాహితీ లహరి,1987: 27) అని అంటారు. అలాగే ఆచంట వేంకటసాంఖ్యాయన శర్మ రాసిన 'అపూర్వోపన్యాసము' అన్న కథ కూడా అంతంత మాత్రంగానే ఉంది అని అంటారు. *"వస్తురీత్యా, భాషరీత్యా, శిల్పరీత్యా ఆధునిక కథానికలో ముఖ్యంగా గురజాడ వారి కథల్లో ఉన్న నిర్దిష్టతా నైశిత్యమూ విశిష్టతా ఈ రెండు కథల్లోనూలేవు. అందుచేత తెలుగులో కథానికా ప్రక్రియకు*

గురజాడవారే ఆద్యులని చెప్పవలసి ఉంటుంది" (నవ్యసాహితీ లహరి, 1987: 28) అని అంటారు.

2.2.5.1.2. పెద్దిబొట్ల సుబ్బరామయ్య:

పెద్దిబొట్ల సుబ్బరామయ్య 1980లో వచ్చిన 'ఆంధ్రప్రదేశ్ దర్శిని –2' అన్న గ్రంథంలో 'కథానికా వాఙ్మయం' అన్న సుదీర్ఘ వ్యాసంలో తొలి కథ గురించి ఈ విధంగా అభిప్రాయపడ్డారు. *"కన్యాశుల్కంతో తెలుగు పాఠకులకు షాక్ ఇచ్చిన గురజాడ ఆధునికమని చెప్పదగిన కథ వ్రాసిన ఆద్యుడు, ఆరాధ్యుడు అయినాడు"* (ఆంధ్రప్రదేశ్ దర్శిని –2, 1998: 497).

2.2.5.1.3. అక్కిరాజు రమాపతిరావు:

అక్కిరాజు రమాపతిరావు 'సాహితీ వ్యాసంగం' అనే గ్రంథంలో 'తెలుగు కథ – వాస్తవికత' అన్న వ్యాసంలో తొలి కథ గురించి ఇలా అంటారు. *"ఆధునికమైన విలువలతో, రూపురేఖలతో తెలుగులో మొట్టమొదట కథ గురజాడ అప్పారావుగారే వ్రాశారని విమర్శకులు స్థిరీకరించారు".* (సాహితీ వ్యాసంగం, 1974: 61)

2.2.5.1.4. వల్లంపాటి వెంకటసుబ్బయ్య:

వల్లంపాటి వెంకటసుబ్బయ్య "తెలుగులో మొట్టమొదటి కథ ఏది అన్న వివాదాన్ని కథా సాహిత్య చరిత్రకారులకు వదిలిపెట్టి గురజాడ *"దిద్దుబాటు" మొదటి కథ అన్న పరికల్పనతో తెలుగు కథాపరిణామాన్ని గురించి ఆలోచిద్దాం"* (కథాశిల్పం, 2016: 104) అని కథ గురించి అభిప్రాయపడ్డారు.

2.2.5.1.5. మధురాంతకం రాజారాం, సింగమనేని నారాయణ:

వీరు 1998లో సంకలనం చేసిన 'తెలుగు కథకులు కథన రీతులు' అన్న పుస్తకానికి ముందుమాట రాస్తూ అందులో మొదటి కథ ఇదే అని ఖచ్చితంగా చెప్పకపోయినప్పటికీ వారి ఉద్దేశంలో గురజాడ రాసిన దిద్దుబాటునే మొదటి కథగా అభిప్రాయపడుతూ ఇలా అంటారు. *"దిద్దుబాటు రచనాకాలం 1910, పాతదనానికి భరతవాక్యం కనిపించక మునుపే, కొత్తదనానికి స్వాగత వాక్యం పలకడం అప్పారావుగారి క్రాంతదర్శిత్వానికి గుర్తు"* (తెలుగు కథకులు కథన రీతులు, 1998: ముందుమాట)

2.2.5.1.6. పోలాప్రగడ సత్యనారాయణమూర్తి:

పోలాప్రగడ సత్యనారాయణమూర్తి 'తెలుగు కథానిక' అన్న గ్రంథంలో దిద్దుబాటునే తొలి కథగా చెప్తూ ఇలా అంటారు *"తెలుగు కథ మొదట్లోనే సద్యోయౌవ్వనంతో జన్మించింది, గురజాడ వారి కలం నుంచి. తెలుగులో మొదటి కథగా గుర్తింపు పొందింది"* (తెలుగు కథానిక, పుట: 27)

పై వారితో పాటూ తెలుగు కథా పరిణామం అన్న వ్యాసం రాస్తూ మధురాంతకం రాజారాం, తెలుగు కథానిక అన్న చిన్న పుస్తకం రాసిన వేదగిరి రాంబాబు, కథానిక – దాని పరిణామము అన్న వ్యాసంలో తల్లావఝుల శివశంకరశాస్త్రి, శెట్టి ఈశ్వరరావు, కె. వి. రమణారెడ్డి (మహోదయం), కేతు విశ్వనాథ రెడ్డి (దృష్టి), డి. రామలింగం (తెలుగు కథ, ఒక తరం తెలుగు కథ సంకలనాల ముందుమాట) లాంటి వారు గురజాడ రాసిన దిద్దుబాటు కథను తొలి కథానికగా గుర్తించారు

భండారు అచ్చమాంబ కథలను మొదటి కథలుగా భావించిన వారు.

2.2.5.1.7. సత్యవతి:

"తెలుగు సాహిత్య చరిత్రలో ఆనాటి రచయిత్రులకు జరిగిన అన్యాయం అంతా ఇంతా కాదు. తెలుగులో తొలి ఆధునిక కథ రాసిన భండారు అచ్చమాంబకు జరిగిన అన్యాయం గురించి కె. లలిత బయట పెట్టేవరకూ ఎవ్వరికీ తెలియదు. 1902లోనే 'ధనత్రయోదశి' కథరాసిన భండారు అచ్చమాంబను వెనక్కినెట్టేసి 1911? (1910)లో గురజాడ రాసిన దిద్దుబాటును తొలి ఆధునిక కథగా సాహిత్య చరిత్రకారులు స్థిరీకరించారు" (తొలి తెలుగుకథ ఏడు అభిప్రాయాలు, 2006: 14). అని సత్యవతి గారు భండారు అచ్చమాంబ రాసిన 'ధనత్రయోదశి' అనే కథకు మొదటి స్థానం ఇవ్వాలనే అభిప్రాయాన్ని తెలియజేశారు.

2.2.5.1.8. కర్రి భార్గవీరావు:

"1902 లోనే బందరులో తొలి మహిళా సమాజాన్ని – బృందావన స్త్రీ సమాజాన్ని – స్థాపించిన అచ్చమాంబగారు మొదటి రచయిత్రి అని గర్వంగా చెప్తూ వారి రచన 'స్త్రీవిద్య'ను మొదటి కథగా మేము వేసుకున్నాము. గురజాడ వారి "దిద్దుబాటు" మొదటి కథ అనుకోవడం పొరబాటని సవినయంగా మనవి చేస్తున్నాము" అని కర్రి భార్గవీరావు 'నూరేళ్ళపంట' కథాసంకలనంలో చెప్పినట్లు తొలి తెలుగు కథ ఏడు అభిప్రాయాలులో చెప్పారు. (తొలి తెలుగుకథ ఏడు అభిప్రాయాలు, 2006: 20)

2.2.5.1.9. కె. కె. రంగానాథాచార్యులు:

కె. కె. రంగానాథాచార్యులు 'తొలినాటి తెలుగు కథానికలు (మొదటి నుంచీ 1930 వరకు)' అన్న పుస్తకంలో తెలుగులో తొలి కథానికపైన సుదీర్ఘ చర్చే చేశారు. ఇందులో బండారు అచ్చమాంబ కథల గురించి చెప్తూ 1898 నాటికే బండారు అచ్చమాంబ గారు కథలు రాస్తున్నట్లు చెప్పారు. అవి భాషను వదిలేస్తే ఆధునిక కథా శిల్పం దృష్ట్యా 'ధనత్రయోదశి', 'బీద కుటుంబము' చెప్పుకోదగ్గ కథలుగా చెప్పారు. అలాగే *"వేరే ఆధారాలు సామాగ్రి లభించేంత వరకు బండారు*

అచ్చమాంబ (1874-1905) కథలే తెలుగులో తొలి కథలని చెప్పవలసి ఉంటుంది" అని అన్నారు. (తొలినాటి తెలుగు కథానికలు, 2008: 24)

ఆచంట వేంకట సాంఖ్యాయన శర్మ కథలను తొలి కథలుగు భావించిన వాళ్ళు

2.2.5.1.10. పురిపండ అప్పలస్వామి:

"గురజాడ వారి 'దిద్దుబాటు' (1910)కు పూర్వమే ఆచంట వేంకట సాంఖ్యాయన శర్మ గారు 'కల్పలత' పత్రికలో ప్రచురించిన 'లలిత' (1903) అనే కథ తెలుగులో తొలి కథానిక అని పురిపండ అప్పలస్వామి అభిప్రాయం". (నవ్యసాహితీ లహరి1987: 27)

2.2.5.1.11. ఆరుద్ర:

ఆరుద్ర గారు తన సమగ్రాంధ్ర సాహిత్యము నాల్గవ సంపుటంలో ఆచంట వేంకట సాంఖ్యాయన శర్మ రాసిన విశాఖ కథను తొలి కథానికగా భావించారు. సమగ్రాంధ్ర సాహిత్యములో *"సాంఖ్యాయన శర్మగారి 'విశాఖ' మొట్టమొదటి తెలుగు కథానిక అన్నంత మాత్రాన గురజాడ గురుపీఠానికి చలనం లేదు"* (సమగ్రాంధ్ర సాహిత్యము నాల్గవ సంపుటము, 2012: 515) అని అంటారు.

ఆచంట వేంకట సాంఖ్యాయన శర్మ తెలుగులో కథకు శ్రీకారం చుట్టినవారని గిడుగు సీతాపతి చెప్పినట్లు తెలుస్తోంది అని, నిడదవోలు వేంకటరావు సాంఖ్యాయన శర్మ నవలికలనే చిన్న కథలు రాశారని చెప్పాడని, ఈయన కథలలో ఒకటైన 'అపూర్వోపన్యాసము' అనే కథను తొలి కథగా అక్కిరాజు రమాపతిరావు ముందుకు తీసుకువచ్చినట్లు తొలినాటి తెలుగు కథానికలు అనే పుస్తకంలో కె. కె. రంగానాథాచార్యులు చెప్పారు.

అలాగే కొమర్రాజు వేంకటలక్ష్మణరావు రాసిన 'ఏబదివేల బేరము' (ఆంధ్రసచిత్రవార పత్రిక 1910) అనే కథ కూడా తొలి కథానిక అనే చర్చలో భాగమైన కథే.

మాడపాటి హనుమంతరావు రాసిన 'హృదయ శల్యము'ను తొలి కథగా చెప్పిన వాళ్ళు.

2.2.5.1.12. ముదిగంటి సుజాతారెడ్డి:

"గురజాడ వ్రాసిన "దిద్దుబాటు" కథ "ఆంధ్రభారతి" లో 1910 ఫిబ్రవరిలో అచ్చయితే మాడపాటి "హృదయశల్యము" కథ "ఆంధ్రభారతి"లోనే 1912 జనవరిన అచ్చయింది. అంటే దాదాపు రెండు సంవత్సరాలకు అచ్చయింది మాడపాటి హనుమంతరావు జీవిత చరిత్రను రాస్తూ ప్రసిద్ధ చారిత్రకుడు ఆదిరాజు వీరభద్రరావు *"ఆంధ్రములో కథానికలు నూతన పద్ధతుల మీద మొట్టమొదట వ్రాసిన కీర్తి శ్రీ హనుమంతరావు గారికే చెందవలసియున్నదని"* చెప్పాడు. *ఆంధ్రభారతికి కథను మొదట పంపింది మాడపాటియేనేమో. అది అచ్చుకాక మూలనపడివుంది*

మొదటి కథ అన్న కీర్తిని దక్కించుకోలేక పోయిందా! ఒకవేళ ఆంధ్రభారతిలో అచ్చయిన తీరుతెన్నులను తప్పి వెలికితీస్తే దీనిలోని సత్యం బయటపడుతుందేమో! ఆఖరికి తెలుగులో రెండో కథారచయిత అన్న పేరయినా మాడపాటికి దక్కాలి" (తొలి తెలుగుకథ ఏడు అభిప్రాయాలు, 2006: 60) అని అంటారు.

ఈ విధంగా తెలుగులో తొలి కథ గురించి కొంత చర్చ జరిగింది. ఇదంతా పాత చర్చ అని ముందే చెప్పాను. ఎందుకంటే పై కథల చర్చ అలా జరుగుతుండగా 2015లో వివినమూర్తి గారు గురజాడ దిద్దుబాటు కథ కంటే ముందు వచ్చిన 92 కథలతో 'దిద్దుబాటలు' అనే ఒక సంకలనాన్ని తెచ్చారు. దానితో తొలి కథపై కొత్త చర్చ ప్రారంభమైంది. ఇప్పుడు ఆ కొత్త చర్చను పరిశీలిద్దాం.

2.2.5.2. తెలుగులో తొలి కథానిక – కొత్త చర్చ:

తెలుగు కథ పైన విశేష కృషి చేసి, గురజాడ అప్పారావుకు (దిద్దుబాటు) ముందు వచ్చిన కథలను ఒక సంకలంగా తెచ్చిన వివినమూర్తి గారి అభిప్రాయాన్ని ఇక్కడ చూద్దాం.

2.2.5.2.1. వివినమూర్తి – దిద్దుబాటలు (2015):

తెలుగులో ఏది తొలి కథ అన్న చర్చ కొనసాగుతున్న సమయంలో 'వివినమూర్తి' ఆ విషయాన్ని తెల్చడం కన్నా 'దిద్దుబాటు'కు ముందు వచ్చిన కథలను సేకరించే ప్రయత్నం అవసరమని, ఆ పనికి పూనుకున్నారు. ఈ ప్రయత్నానికి ఫలితంగా జనవినోదిని, హిందూజన సంస్కారిణి, కల్పలత, తెలుగు జనానా, బాలిక, చింతామణి, మహారాణి, శారదా, హిందూసుందరి, సావిత్రి, కృష్ణా పత్రిక, ఆంధ్ర భారతి, సువర్ణలేఖ వంటి పత్రికలపైన నాలుగేళ్ళు కృషి చేసి వాటిల్లో సేకరించిన 92 కథలను ఎంపిక చేసి ఒక సంకలనంగా తెలుగు సాహితీలోకానికి పరిచయం చేశారు. ఇవన్నీ కూడా గురజాడకు ముందు అంటే దిద్దుబాటుకు (1910) ముందు వచ్చినవే. వీటిని కథలుగా అనడానికి ఈయన పెట్టుకున్న నియమాలు నాలుగు. అవి, 1. కథల నిడివి. 2. కథగా పత్రిక అనటం. 3. సంభాషణల రూపంలో చాలా ఉన్నాయి, వాటిని కథలన్న ఉద్దేశ్యంతోనే రాశారు కానీ ప్రదర్శన నిమిత్తం రాయలేదు. కనుక వాటిని కథలుగా తీసుకున్నాను. 4. పత్రికలూ బాలల కోసం అన్న వాటిని ఇందులో చేర్చలేదు.

ఈ సంకలనానికి వివినమూర్తి రాసిన ముందుమాటలో *"తెలుగులో తొలికథ ఏది అన్న వెదుకులాటకి ఈ పుస్తకం ప్రకారం చూస్తే ఏదో ఒకటి అనవచ్చు గాని, రచయిత ఎవరూ అంటే సమాధానం దొరకదని నిశ్చితంగా చెప్పగలను. అంతే కాదు ఈ కథలను శ్రద్ధగా చదివితే మంచి*

కథకి కావలసిన ఊహా శక్తీ, కల్పనాశక్తీ, సామాజిక బాధ్యతలను ఆరంభంలోనే తెలుగువాడు గ్రహించాడని మనం గర్వపడగలం" (దిద్దుబాటలు, 2015: ముందుమాట) అని అంటారు.

వివినమూర్తి తొలి తెలుగు కథ ఏది అని నిర్ధారించాలన్న కుతూహలం నాకు లేదు అంటూ *"తొలివాటిని నిర్ధారించాలన్న కుతూహలం నాకులేదు. కాని అలాంటి కుతూహలం కలవారికోసం నా ఈ సేకరణలో తేలిన విషయాలు ఇవి"* (దిద్దుబాటలు, 2015: ముందుమాట) అని కొన్ని ముఖ్యమైన అంశాలను పాయింట్ల ప్రకారం చెప్పారు. అందులో మొదటిది

"తొలి కథ – చిలుకను గుఱించిన సంభాషణ 1879 జనవరి జనవినోదిని" (దిద్దుబాటలు, 2015: ముందుమాట) అని అంటారు. అయితే ఈ కథకి రచయిత ఎవరో తెలియరాలేదు అని అంటారు.

తర్వాత ఆరవ పాయింటుగా తొలి కథా రచయిత గురించి చెప్తూ *"తొలి కథా రచయిత రెండు కథలు వంగూరి నందీశ్వరరావు, ఎస్. రామస్వామి అయ్యర్ పేర్లతో కనిపించినా వాటి కథాలక్షణాలను బట్టి చూస్తే అవి కథలుగా అనటం కష్టం. కొంతైనా కథాలక్షణ అవగాహనతో రాసిన వారు రాయసం వెంకటశివుడు"*. (దిద్దుబాటలు, 2015: ముందుమాట) అని అంటారు.

మొత్తంగా వివినమూర్తి గారి కృషిని మనం ఈ విధంగా అర్థం చేసుకోవచ్చు. 'దిద్దుబాటలు' అనే 92 కథల ఈ సంకలనం ప్రకారం 'తొలి తెలుగు కథ 1879లో 'జనవినోదిని' అనే పత్రికలో "చిలుకను గుఱించిన సంభాషణ" అనే పేరుతో ప్రచురించబడింది. కాలానుక్రమంగా చూస్తే ఈ కథను తొలి తెలుగు కథగా మనం చెప్పవచ్చు'. అయితే ఈ కథకు రచయిత ఎవరనేది తెలియదని ఈ సంకలన కర్త ద్వారా తెలుస్తోంది. తరవాత 1879 నుండీ 1895 వరకూ వచ్చిన దాదాపు 17 కథలకు రచయితల పేర్లు తెలీయడంలేదు. ఆ తరవాత 1895లో తెలుగు జనానా పత్రికలో ప్రచురితమైన "మృదుభాషణ విద్యావిశారదుల కథ" అనే కథకు రచయిత రాయసం వెంకటశివుడుగా మనకు తెలుస్తోంది. దీనితో 'లభ్యతను బట్టి రచయిత పేరు తెలియకుండా తెలుగులో తొలి కథ 1879లో ప్రారంభమైంది అనుకుంటే, రచయిత తెలిసి తెలుగులో తొలి కథ 1895లో రాయసం వెంకటశివుడుతో ప్రారంభమైందని చెప్పవచ్చు'.

ఈ పాత కొత్తల చర్చల (పరిశోధనల) ఫలితంగా తెలుగు కథ మొదట 1910లో తర్వాత 1902లో తర్వాత 1903లో తర్వాత 1904లో అంటూ చివరికి 1879–1895 మధ్యన పుట్టిందని చెప్పవచ్చు. ఇలా చూస్తే గురజాడ కంటే ముప్పై సంవత్సరాలకు ముందే తెలుగు కథ ప్రారంభమైందని ఇప్పటికి లభించిన ఆధారాలను బట్టి చెప్పొచ్చు.

కల్పనాసాహిత్య ప్రక్రియలైన నవల, కథానికలు పాశ్చాత్య ప్రభావంతో భారతీయ భాషలలోకి ప్రవేశించాయి. ఇందులో ఎటువంటి సందేహమూ లేదు. పాశ్చాత్య దేశాలలో ఈ రెండు ప్రక్రియల పుట్టుకకు గల నేపథ్యం, అలాగే భారతీయ భాషలలోకి ప్రవేశించడానికి గల నేపథ్యం, ప్రపంచ దేశాలలో వాటి తొలి రచన అనే విషయాలను అటుంచితే, తెలుగులో నవల కథానిక ప్రక్రియలలో మొదటి రచనకు సంబంధించి కొంత చర్చ నాకు లభించిన సమాచారం మేరకు నా అవగాహన మేరకు ఈ అధ్యాయంలో స్థూలంగా తెలియజేశాను. అయితే ఇక్కడ తెలుగులో నవల విషయంలోగాని, కథానిక విషయంలోగాని మొదటి అనే మాటకు అనేకమైన అభిప్రాయాలను మనం గమనించాం. ఇక్కడ ముఖ్యంగా గుర్తించాల్సిన విషయం ఏమిటంటే– లభ్యతను బట్టి, కాలక్రమాన్ని అనుసరించి మొదట లభించిన రచనను మొదటిదిగానే గుర్తించాలి. అలా కాకుండా సమగ్రమైన లేదా సర్వలక్షణ సమన్వితమైన అనే మాటను ఆయా రచనలకు అన్వయించి మొదటి వాటికి దక్కవలసిన గౌరవం వాటికి దక్కనీయకుండా చేయడం సరైనది కాదని నా అభిప్రాయం. ఒకరచన మొదటిది కావడానికి దాని సమగ్రతకు సంబంధం లేదు. "ఆ దృష్టితో చూస్తే రాజశేఖర చరిత్ర కంటే సమగ్రమైన నవలలు తెలుగులో చాలా వచ్చాయి (మాలపల్లి లాంటివి). వాటిని ఆయాకాలానికి సంబంధించిన తొలి నవలలుగా చెప్పుకోవాల్సి ఉంటుంది. కాబట్టి తొలి అనేది సమగ్రత మీద ఆధారపడి ఉండదు" అని రాయలసీమ నవలపై పరిశోధన చేసిన పొదిలి నాగరాజు అంటారు. ఈ మాటలు సత్యం. కాబట్టి నవల విషయంలో తెలుగులో మొదటి నవల 'శ్రీ రంగరాజ చరిత్ర' అనే చెప్పాలి. ఆ తర్వాత సమగ్రమైనదని చెప్పుకున్నా, రెండవదని చెప్పుకున్నా గొప్పదని చెప్పుకున్నా రాజశేఖర చరిత్రను చెప్పుకోవచ్చు.

అలాగే కథానిక విషయంలో కూడా సమగ్రంగా ఉందని గురజాడ దిద్దుబాటునే మొదటి తెలుగు కథానిక అనలేం. కథానికకు ఉండవలసిన అన్ని లక్షణాలూ లేకపోయినా నిడివి, వస్తునవ్యతా, సామాజిక బాధ్యత కలిగిన మొదటి కథలను మొదటి కథలుగానే గుర్తించాలని నా అభిప్రాయం. ఆ విధంగా చూస్తే వివినమూర్తి సేకరించిన కథలను కథానికలు అనడానికి పెట్టుకున్న నియమాలు కథానికా లక్షణాలలో ఉన్నాయి. కాబట్టి మొదటి కథానిక రచయిత తెలీకుండా 'చిలుకను గుఱించిన సంభాషణ' అవుతుంది. రచయిత తెలిసి రాయసం వెంకటశివుడు రాసిన 'మృదుభాషణ విద్యావిశారదుల కథ' మొదటి కథానిక అవుతుంది.

చివరగా, ఈ అధ్యాయంలో నవల కథానికల నిర్వచనాలు, లక్షణాల వివరణ విషయానికి నేను వెళ్ళలేదు. ఎందుకంటే అధ్యాయం నిడివి దృష్ట్యా, నేను నిర్ణయించుకున్న ప్రణాళిక దృష్ట్యా కల్పనాసాహిత్యం (నవల, కథానిక) ప్రారంభాన్ని చెప్పదలచుకున్నాను కాబట్టి. అలాగే ఇంకొక్క

విషయం కల్పనా సాహిత్య ప్రక్రియలైన నవల, కథానికలకు ఇతర సాహిత్య ప్రక్రియలకు గల సంబంధ, పోలిక విషయాలను, అలానే కల్పనా సాహిత్య శాఖలకు వాటి ఉపశాఖలైన నవలిక, గల్పిక, స్కెచ్ లాంటి వాటికి మధ్య పోలిక, సంబంధాలను ఇందులో చెప్పలేదు. కల్పనాసాహిత్య ప్రారంభ నేపథ్యాన్ని స్థూలంగా పరిచయం చేసే దృష్టితోనే నా ఈ రెండవ అధ్యాయాన్ని పూర్తి చేశాను.

తరవాత మూడో అధ్యాయంగా చిత్తూరు జిల్లా రచయితలు (నవల, కథానిక) – జీవనరేఖలు గురించి చెప్పబోతున్నాను.

అధ్యాయం –3

చిత్తూరు జిల్లా రచయితలు (నవల, కథానిక) – జీవన రేఖలు

3.0. పరిచయం:

ముందు అధ్యాయంలో ప్రపంచ సాహిత్యంలో కల్పనాసాహిత్య ప్రక్రియలైన నవల, కథానికల ప్రారంభం గురించి చర్చిస్తూ, పాశ్చాత్య దేశాలలోను (వివిధ భాషలలో), భారత దేశంలోను (వివిధ భాషలలో), ప్రత్యేకంగా తెలుగు భాషలోను వాటి పుట్టుకను గురించి, అందుకు గల సామాజిక నేపథ్యాలను గురించి కొంత వరకూ స్థూలంగా వివరించే ప్రయత్నం చేశాను. ఈ అధ్యాయంలో చిత్తూరు జిల్లా రచయితల (నవల, కథానిక) జీవన రేఖలను వివరించే ప్రయత్నం చేస్తాను.

నిన్న మొన్నటి వరకు చిత్తూరు జిల్లా కథా సాహిత్యానికి ఆద్యుడుగా కె. సభా గారిని చెప్పుకుంటూ వచ్చాం. అయితే ఇటీవల ప్రాంతీయ అస్తిత్వ నేపథ్యంతో ఏ ప్రాంత సాహిత్యాన్ని ఆ ప్రాంత సాహితీకారులు, పరిశోధకులు వెలికితీస్తున్నారు. ఈ క్రమంలో ఒక చిత్తూరు జిల్లా కథా సాహిత్య చరిత్రే కాదు మొత్తం తెలుగు కథా (నవల) సాహిత్య చరిత్రల రూపురేఖలను తిరగ రాయాల్సిన అవసరం వచ్చింది.

తెలుగు కథ 1910 లో గురజాడ వారి దిద్దుబాటుతో మొదలైందని అనుకుంటే దాని కంటే ముందే 1902లో బండారు అచ్చమాంబ రాసిన ధన త్రయోదశితో మొదలైందని కొంత మంది అభిప్రాయపడ్డారు. భాషా పరంగా కొంత గ్రాంథికంలో ఉన్నప్పటికీ దీనినే తొలి కథగా కొంత మంది చెప్పారు. ఇది ఇంకా కొనసాగుతున్న తరుణంలో వివినమూర్తి 1915లో దిద్దుబాటలు అనే పేరుతో గురజాడ కంటే ముందు 92 కథలతో ఒక కథా సంకలనాన్ని వెలువరించాడు. దీని ప్రకారం తొలి తెలుగు కథ 1879లో 'చిలుకను గురించిన సంభాషణ' అనే పేరుతో జన వినోదిని పత్రికలో ప్రచురితమైంది. కాలక్రమంతో పోల్చితే ఈ కథను తొలి తెలుగు కథగా చెప్పచ్చు. అయితే ఈ కథకు రచయిత ఎవరో తెలీదు. రచయిత తెలిసినంతలో 1895లో తెలుగు జనానా అనే పత్రికలో రాయసం వెంకటశివుడు రాసిన 'మృదుభాషన విద్యా విశారదల కథ' అనే కథ మొదటి తెలుగు కథ. దీనితో రచయిత పేరు తెలియకుండా 1879లో, రచయిత తెలిసి 1895లో తెలుగు కథ ప్రారంభమైంది.

అలాగే రాయలసీమ కథా విషయానికి వస్తే అందులోనూ చిత్తూరు జిల్లా కథా విషయానికి వస్తే 1944 చిత్రగుప్తలో అచ్చయిన 'కడగండ్లు' (కె.సభా) కథ కంటే ముందే 'శారద' అనే కథ 1927 జనవరి భారత కథానిధి పత్రికలో అచ్చయింది. ఈ కథను రాసింది యం.వి.

పాపన్న గుప్త. దీని ప్రకారం చిత్తూరు జిల్లా తొలి కథా రచయితగా యం.వి. పాపన్న గుప్తను నిర్వ్వంద్వంగా చెప్పవచ్చు.

3.1. పూతలపట్టు శ్రీరాములు రెడ్డి (1892 – 1971):

పూతలపట్టు శ్రీరాములు రెడ్డి 05.04.1892లో చిత్తూరు జిల్లా పూతలపట్టు గ్రామంలో పుట్టారు. లక్ష్మమ్మ, పెద్దబుచ్చిరెడ్డి వీరి తల్లిదండ్రులు. ఈయన ప్రాథమిక విద్య వరకూ మాత్రమే చదువుకొని ఆ తర్వాత స్వయం కృషితో తెలుగు, తమిళం, సంస్కృతం వంటి భాషలలో ప్రావీణ్యాన్ని సంపాదించాడు. అలాగే తన తండ్రి వద్ద హరికథ చెప్పడంలో ప్రావీణ్యాన్ని సంపాదించాడు. మద్రాస్ విశ్వవిద్యాలయం నిర్వహించిన విద్వత్ పరీక్షల్లో ఉత్తీర్ణులై తెలుగు పండితుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించాడు. విద్యాబోధన చేస్తూనే తన రచనా వ్యాసంగాన్ని ప్రారంభించాడు.

ఈయన రచనలు:

అనువాదాలు: కంబరామాయణం (తమిళం నుండి అనువాదం), నాలడియారు (తమిళం నుండి అనువాదం), పెరియ పురాణము (తమిళం నుండి అనువాదం), శిలప్పదికారము (తమిళం నుండి అనువాదం), మణిమేఖల (తమిళం నుండి అనువాదం), కుమార సంభవము (సంస్కృతం నుండి అనువాదం), ప్రశ్నోత్తర రత్నావళి (సంస్కృతం నుండి అనువాదం)

తెలుగు రచనలు: సూక్తిసుధ, తెనుగు సందేశము, త్రివర్గము, నీతిగుచ్ఛము, సురాభాండేశ్వరము (1953) ఇది చిత్తూరు జిల్లా వాయల్పాడు తాలూకాలో కలకడ గ్రామంలో వెలసిన సురాభాండేశ్వరుడు గురించిన స్థలపురాణం, భక్తిమాల (పెద్దపురాణము), మధురకవితా సంహిత, త్రికటుకము, అభిదాన దర్పణము

కథలు: ఈయన రాసిన 'ఒక ఆదియాంధ్ర భక్తుని జీవిత చరిత్ర' అన్న ఒక కథ మాత్రమే మనకు ప్రస్తుతం లభ్యమవుతూ ఉంది. ఈ కథ డిసెంబర్ 1928లో భారత కథానిధి అనే పత్రికలో ప్రచురించబడింది.

బిరుదులు: విద్వత్కవికులతిలక, సాహిత్య రత్నాకర, కవితాతపస్వి, అభినవ పోతనామాత్య, ఆంధ్ర కంబర్.

సత్కారాలు, పదవులు: పూతలపట్టు గ్రామ ప్రజలచే పల్లకీ ఊరేగింపు, ఆంధ్ర నలంద గుడివాడ వారిచే బంగారు పతకం, తమిళనాడు కారక్కుడిలో జరిగిన కంబకవి వార్షికోత్సవంలో కనకాభిషేకం, 1953లో ఆంధ్ర కళాపరిషత్ అధ్యక్షుడు, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తిరుపతి సెనేట్ సభ్యుడు, ఆంధ్ర సాహిత్య అకాడమీ, హైదరాబాదు సభ్యుడు, రాష్ట్రపతిచే మంజూరైన గౌరవ వేతనం మరణించేదాకా ఇలా అనేక పదవులను, సత్కారాలను పొందారు.

3.2. యం. వి. పాపన్న గుప్త (1905 – 1986) : (చిత్తూరు జిల్లా తొలి కథానికా రచయిత):

స్వాతంత్ర్య సమరయోధుడుగానే తెలిసిన యం. వి. పాపన్న గుప్త కథకుడే కాదు కవి, నవలాకారుడు కూడా. యం. వి. పాపన్న గుప్త 12-6-1905న మదనపల్లిలో మొగిలి వంశానికి చెందిన రామలక్ష్మమ్మ, కన్నయ్యలకు జన్మించాడు. వీరి తండ్రి బ్రిటీష్ ఇండియా గవర్నమెంట్ లో తహశీల్దారుగా, ఇన్చార్జి డిప్యూటీ కలెక్టర్ గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ ఉండేవారు. తండ్రి మరణానంతరం పెద్ద తల్లిగారి ఆదరాభిమానాలతో పాపన్న గుప్త గారు విద్యలో చక్కటి ప్రతిభ కనబరుస్తూ పెరిగి పెద్దవారయ్యారు.

ఈయన 12వ ఏటనే డాక్టర్ అనిబిసెంట్ గారి ఉపన్యాసాలకు ప్రేరేపితుడై దేశభక్తితో అనిబిసెంట్ గారి వెంబడి హోమ్ రూల్ ఉద్యమంలోనూ, మాలవ్యా గారి వెంబడి విదేశీ వస్త్ర బహిష్కరణ ఉద్యమంలోనూ పాల్గొన్నారు. తదుపరి 1918లో ప్రిన్స్ ఆఫ్ వేల్స్ మద్రాసు వచ్చినప్పుడు పాఠశాల బాల భటులతో వెళ్లి ప్రిన్స్ సన్మానమును బహిష్కరించు కార్యక్రమంలో పాల్గొన్నారు. అప్పుడే వారు ప్రభుత్వ పాఠశాలను వదిలి జాతీయ కళాశాలలో విద్యార్థిగా చేరడం జరిగింది. అప్పట్నుంచి వారు చదువులోనే కాక ప్రసంగాలలో, రచనలలో ప్రతిభను కనబరిచి ప్రఖ్యాతి చెందారు.

తెలుగు భాష మీద ప్రేమతో క్రమంగా భాష మీద సాధికారత సాధించి చిలకమర్తి లక్ష్మీ నరసింహం గారి అసంపూర్ణ నవలైన కర్పూర మంజరిని పూర్తి చేశారు.

మంచి విద్యార్థిగా, గొప్ప హాకీ క్రీడాకారుడుగా ఎదుగుతున్న పాపన్న గుప్త గారు తమ కుటుంబ ఆర్థిక పరిస్థితుల వల్ల చదువుకు దూరమై ఉద్యోగంలో ప్రవేశించాల్సి వచ్చింది. ఉద్యోగంలో కూడా తనదైన ముద్రను కనబరుస్తూ అంచెలంచెలుగా పైకెదిగి, దేశాభిమానంతో ఉద్యోగాన్ని వదిలేసి ఖద్దరు ప్రచారంలో భాగస్వాములయ్యారు. క్రమంగా గాంధీగారి అడుగుజాడల్లో నడుస్తూ కాంగ్రెస్ సేవలో దేశమంతా పర్యటించారు. ఆనాటి అఖిలభారత ఆర్యవైశ్య యువజన సంఘం వారు పాపన్న గుప్త గారిని సంఘమునకు అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.

పాపన్న గుప్త కథలు భారత కథానిధి అనే పత్రికలో ప్రచురితమైనాయి. దురదృష్టవశాత్తు వీరి కథలు ఏవీ పెద్దగా అందుబాటులోకి రాకపోవడం విచారకరం. ప్రస్తుతం వీరు రాసిన 'శారద' 'హైమావతి' 'సావిత్రి' అన్న కథలు లభ్యమవుతున్నాయి. వీటితో పాటు వెల్లాల మైసూరయ్యతో కలిసి కొన్ని కథలను అనువాదం చేశారు. వాటిలో ప్రస్తుతం పునర్వివాహములు (1928, ఏప్రిల్. భారత కథానిధి), కంకాళము (1928, మే, భారత కథానిధి) అనేవ కథలు లభ్యమవుతున్నాయి. పాపన్న గుప్త కథలతో పాటూ 'భానుమతి' (1930) అనే నవలను రాశారు. వీరు పద్య రచనలు కూడా చేశారు. ఈనాడు అవి ఏవీ అందుబాటులో లేవు. ఉన్నంతలో 'ఆర్యవైశ్యఔన్నత్య ప్రబోధనలు' మాత్రం లభ్యమవుతున్నది.

కవిగా రచయితగానే కాక ఆనాటి స్వాతంత్రోద్యమంలో పాపన్న గుప్త గారు భారత ప్రజల దాస్య విముక్తికై ఎన్నో సేవలందించాడు. విజయవాడ, హైదరాబాద్ ఆలిండియా రేడియో కేంద్రాలకు ప్రభుత్వం తరఫున గౌరవ సంచాలకులుగా, దక్షిణ భారత హిందీ ప్రచార సభకు ఆంధ్ర ప్రాంతపు చైర్మన్ గా, దక్షిణ భారత హిందీ మహాసభకు చెందిన ఐదు రాష్ట్రాల బ్రాంచి అయిన మద్రాసు టి.నగర్ హెడ్ ఆఫీస్ కు ఐదు సంవత్సరాలు చైర్మన్ గా బాధ్యతలను నిర్వహించారు. హరిజన గిరిజనులకు టీటీడీ ఆలయాల్లో ప్రవేశార్హతలు కల్పించడం, ఉప్పు సత్యాగ్రహం, విదేశీ వస్తు బహిష్కరణ కార్యక్రమాల్లో తమవంతు కృషిని అందించడం , బచావత్ ఒడంబడికకు చెందిన కమిటీ సభ్యుడిగా వ్యవహరించడం, ఇంకా స్త్రీ విద్యను ప్రోత్సహించడం బాల్య వివాహాలను చేయరాదని, ఆడపిల్లలు రజస్వల అయినప్పుడు అట్టహాసంగా వేడుకలు చేయరాదని ఇలా ఎన్నో రకాలుగా స్త్రీల అభివృద్ధికి కృషి చేశారు.

ఆనాడు ప్రభుత్వం నుండీ తామ్రపత్రం పొందిన ఈ ప్రాంతపు మొదటి వ్యక్తి కూడా ఇతడే. రవీంద్రభారతిలో రాష్ట్రపతి నుండి సన్మానం పొందారు.

3.3. దూబగుంట వెంకట రమణయ్య: (చిత్తూరు జిల్లా మొదటి నవలా రచయిత):

దూబగుంట వెంకటరమణయ్య చిత్తూరు జిల్లా కాళహస్తి ప్రాంతానికి చెందిన వ్యక్తి. ఈయన కాళహస్తిలో ఉన్న 'రాజా పానుగంటి బంగారమ్మ మిడిల్ పాఠశాల'లో చరిత్ర ఉపాధ్యాయుడుగా పనిచేశారు. ఈయన 'చాందసుల్తాన'(1920), 'తానీషా'(1925) అనే రెండు చారిత్రక **నవలలను** రాశారు. ప్రస్తుతం లభిస్తున్న సమాచారాన్ని బట్టి ఈయన రాసిన చాందసుల్తాన అనే నవలే చిత్తూరు జిల్లా నుండి వచ్చిన మొదటి నవల. ఈ నవలను తన తండ్రి దూబగుంట వెంకట నారాయణాఖ్యునికి అంకితం ఇచ్చినట్లు 'చాందసుల్తాన' నవల ద్వారా తెలుస్తుంది. అలాగే ఈయన రాసిన రెండవ నవలను తన తల్లి సుబ్బమాంబకు అంకితం ఇచ్చారు.

3.4. బూదూరు రామానుజుల రెడ్డి:

బూదూరు రామానుజుల రెడ్డి చిత్తూరు జిల్లా చివ్వాడ ప్రాంతానికి చెందినవారు. ఉపాధ్యాయ వృత్తి నిమిత్తం తిరుత్తణికి వచ్చి అక్కడే నివాసం ఏర్పరచుకొన్నారు. ఈయనకు కవి భూషణ అనే బిరుదు కూడా ఉంది. ఈయన మూడు సాంఘిక నవలలను రాశారు. అందులో మొదటిది వరశుల్కం అనే పిశాచి సామాన్య ప్రజలను ఏవిధంగా పీల్చి పిప్పిచేస్తూ ఉందొ తెలియజేసే 'రత్నాబాయి' (1925) అనే నవల, రెండవది వైవాహిక జీవన ఉత్కృష్టను, ప్రేమతత్వాన్ని వెల్లడించిన సాంఘికాదర్శ నవల 'వీర గాంధర్వము' (1927). ప్రస్తుతం ఇది లభించటం లేదు. తర్వాత మూడవ నవల సమాజాన్ని పట్టి పీడిస్తున్న వ్యభిచార జీవనంలోని నైచ్యతను తెలియజేసే 'మోహన' అనే నవల. ఈయన ఈ మూడు నవలలే కాక ఖండకావ్యాలు, పద్యకావ్యాలు, వచనకావ్యాలు కూడా రాశారు. అవి: రతిందేవుడు 1988 (వచనం), పూలగుత్తి 1946 (ఖండ), పూలదండ 1960 (ఖండ), రాణిదుర్గ 1951 (పద్య).

3.5. పెరుమల రామాచౌదరి :

పెటికాంతర శవము అనే అపరాధక పరిశోధక నవలను 1930లో రాశాడు. ఈయన మదనపల్లికి చెందిన వ్యక్తి. ప్రస్తుతం ఈయన రాసిన రచనలేవీ లభ్యం కావటం లేదు.

3.6. టి. ఆర్యోగం పిళ్ళై:

ఈయనది చిత్తూరు జిల్లా తాటినూకల పల్లె. ఈయన మద్రాసులోని ముత్యాల పేట హైస్కూలులో ప్రధానాంధ్రోపాధ్యాయుడుగా పనిచేశారు. ఈయన రచనల విషయానికొస్తే తెలుగు తల్లి పత్రికలో ప్రచురితమైన మూడు కథలు మాత్రమే ప్రస్తుతం మనకు లభిస్తున్నాయి. అవి: రాఘవేంద్రరావు గారి రాజీనామా (తెలుగు తల్లి పత్రిక 09.1937), బిక్కిరింత పిదప వెక్కిరింత (తెలుగు తల్లి పత్రిక 11.1937), పాపి చావు (తెలుగు తల్లి పత్రిక 12.1937). వీటితో పాటూ మదన విలాసము అనే వచన గ్రంథాన్ని కూడా ఈయన రాశారు.

3.7. టి. కె. రంగస్వామి అయ్యంగార్:

వీరు భారత కథానిధి పత్రికకు కట్టిన చందా వివరాలను బట్టి చిత్తూరు జిల్లా ప్రాంతం వారని తప్ప మరే సమాచారం లభించలేదు. 'నాచిట్టి తల్లి' అనే వీరి కథ భారత కథానిది పత్రికలో ప్రచురించబడింది.

3.8. రావూరి చంగనార్య:

వీరు కూడా భారత కథానిధి పత్రికకు కట్టిన చందా వివరాలను బట్టి చిత్తూరు జిల్లా ప్రాంతం వారని తప్ప మరే సమాచారం లభించలేదు. చంద్రికా మోహనులు (తెలుగు తల్లి పత్రిక 08.1937) వీరు రాసిన కథ నేడు మనకు లభిస్తోంది.

3.9. సి. యస్. నీలకంఠయ్యర్:

వీరు కూడా భారత కథానిధి పత్రికకు కట్టిన చందా వివరాలను బట్టి చిత్తూరు జిల్లా ప్రాంతం వారని తప్ప మరే సమాచారం లభించలేదు. భోగపుమేళాలు (భారత కథానిది 12.1927) వీరు రాసిన కథ నేడు మనకు లభిస్తోంది.

3.10. పాటూరి రాజగోపాలనాయుడు (1920 – 1997):

పాటూరి రాజగోపాలనాయుడు చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం, దిగువమాఘం గ్రామంలో 05.04.1920న జన్మించాడు. ఈయన తల్లిదండ్రులు పాటూరి లక్ష్మమ్మ, శ్రీనివాసులు నాయుడు. మోతుబరి రైతు కుటుంబంలో జన్మించిన ఈయన విద్యాభ్యాసం వీధి బడిలో మొదలై ఎస్. ఎస్. ఎల్. సి. దాటి బి. ఎ. వరకూ సాగింది. ఈయన 1942లో వివాహానంతరం షోలింగరులో ఎలిమెంటరీ స్కూల్ టీచర్‌గా ఉద్యోగం, తర్వాత శ్రీరాములు రెడ్డితో కలిసి ఉత్తర బ్రాహ్మణపల్లెలోనూ, తవణం పల్లెలోనూ ఎలిమెంటరీ స్కూల్ ప్రారంభం చేసి అక్కడి డ్రాప్ అవుట్స్ ను విద్యావంతులుగా చేసే ప్రయత్నం చేశారు. ఆచార్య ఎన్.జీ రంగా రైతు సేవాసంఘం, స్వతంత్ర సాహితీ సమితి లాంటివి ఏర్పరిచి వాటి ద్వారా అనేక సేవా కార్యక్రమాలను చేశారు. గాంధేయవాదిగా ఉంటూ ఖాదీ ప్రచారం, హరిజనోద్ధరణ, జాతీయ భాషా ప్రచారం లాంటి

కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. ఆ తర్వాత ఎన్. జీ. రంగా స్థాపించిన కృషికార్ లోక్ పార్టీ తరపున 1952లో పోటీ చేసి ఓటమిని చవి చూశాడు. ఆ సమయంలో చిత్తూరు జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులకు స్పందిస్తూ రామకృష్ణ మిషన్ సహాయంతో 600ల గంజి కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు చేరువై ప్రజానాయకుడుగా ఎదిగారు. ఆ తర్వాత 1955, 1962లో కృషికార్ లోక్ పార్టీ తరపున, 1977లో కాంగ్రెస్ తరపున లోక్ సభకు, 1980లో పార్లమెంటు సభ్యునిగా వ్యవహరించారు.

ఈయన రచనా వ్యాసంగ విషయానికి వస్తే ప్రజలను కళల ద్వారా తొందరగా ప్రభావితం చేయవచ్చనే ఉద్దేశంతో మొదట నాటకకళ, బుర్రకథలను ప్రధానంగా చేసుకొని రచనలు చేశారు. తర్వాత జాకబ్ అనే టీచర్ తో కలసి మూడు స్టేజి నాటకాలను రాశారు. నాటకం, బుర్రకథలే కాక ఈయన రచనల్లో గేయాలు, కథలు, నవలలు, వ్యాసాలు ఉన్నాయి. అంతే గాక ఈయన అనువాదం, పరిశోధన లాంటి సాహిత్య ప్రక్రియల్లోను రచనలు చేశాడు. ఈయన రచనల్లో 'సారా సీసా', 'భగ్న హృదయం', 'పొరబాటు', 'రాణాప్రతాప్', 'కలశజలాలు' పేర్కొనదగిన నాటకాలు, నాటికలు; పిల్లల కోసం 'త్యాగభూమి', 'భారత విజయం', 'వెన్నెల వెలుగులు' లాంటి కథల పుస్తకాలు రాశాడు. రాధేయుడు, భాగ్యనగరం, అమర స్మృతి అనేవి వీరి కావ్యాలు. అలాగే వెన్నెల వెలుగు అనే గేయ కావ్యాన్ని కూడా రాశారు. ఈయన వ్రాసిన నవలల్లో చంద్రగిరి దుర్గం, ఛత్రపతి శివాజీ(2013), దైవోపహతుడు, దారా, బేజవ్వ (1995), రామానుజుని ప్రతిజ్ఞ(1969), ఓరుగల్లు పునరాక్రమణ (1972-73లో ఆంధ్రప్రదేశ్ మాసపత్రికలో సీరియల్గా వచ్చింది), నేతాజీ, తథాగతుడు లాంటి నవలలు పేర్కొనదగినవి. కృష్ణావతారం, భగవాన్ పరశురామ్, పృథ్వీ వల్లభుడు, లకుమ అనేవి అనువాదాలు. పాటల ఛందస్సు, కురుక్షేత్రే అనేవి వీరి పరిశోధనా గ్రంథాలు. ఈయన ఆంగ్లంలో The Trial, The Triumph అనే పేర్లతో మహాభారతం రచించాడు.

1984 లో చిత్తూరు జిల్లా రచయితల సహకార ప్రచురణ సంఘాన్ని ఏర్పాటు చేసి దాదాపు 16 గ్రంథాలు ప్రచురించాడు. ఇలా అనేక రంగాల్లో సేవలందించిన ఈయన 21.10.1997న చనిపోయాడు.

3.11. కె. సభా (కనక సభాపతి పిళ్ళై) 1923 – 1980:

నిన్న మొన్నటి వరకు చిత్తూరు జిల్లాలోనే కాక మొత్తం రాయలసీమలోనే కథారచన చేసినవారిలో మొదటి వ్యక్తిగా కె. సభాను చాలామంది పరిశోధకులు గుర్తించారు. అయితే ఇటీవల ప్రాంతీయ స్పృహతో జరిగిన పరిశోధనల వల్ల పై అభిప్రాయాన్ని మార్చుకోవలసి వచ్చింది (ఈ విషయం గురించి మొదట్లోనే చెప్పడం జరిగింది). దాదాపు 300 లకు పైగా కథలను రాసి తెలుగు కథాసాహిత్యంలోనే తనదైన ముద్రను వేసుకున్న ఈయన పూర్తిపేరు కనక సభాపతి పిళ్ళై.

కె. సభా చిత్తూరు జిల్లా కొట్రకోన గ్రామంలో 1923 జూలై 1న పార్వతమ్మ, చంగల్రాయులకు జన్మించారు. బీద కుటుంబం నుండి వచ్చిన సభా 8వ తరగతి వరకూ

పాఠశాలకు వెళ్లి చదువుకొన్నాడు. ఆ తర్వాత చాలా వరకూ ఆయన చదువు ప్రైవేటుగానే సాగింది. 1940లో టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసి 16 సంవత్సరాల వయస్సులోనే ఉపాధ్యాయవృత్తి చేపట్టారు. బి.ఎ. వరకు ప్రైవేటుగా చదువు సాగించారు. ఉపాధ్యాయ వృత్తిని వదిలేసి, పత్రికా జీవితాన్ని ప్రారంభించి ఆంధ్రప్రభ, నాగేలు, ప్రజా తంత్ర పత్రికలకు ఉప సంపాదకుడుగా, వాహిని పత్రికకు సంపాదకుడుగా పనిచేశాడు. కె. సభా శ్రీరమణా పబ్లికేషన్స్, 'దేవదత్తం' పత్రిక – వీటి ద్వారా ఎందరో రచయితల్ని ప్రోత్సహించారు. శారదా పీఠాన్ని స్థాపించి కళాకారుల్ని ప్రోత్సహించారు. సభా చిత్రకారుడు కూడా కావడం విశేషం. ఈయన మొదట నాస్తికుడుగా ఉండి చలం శిష్యరికంతో ఆధ్యాత్మికత వైపు మళ్లి రమణ మహర్షి భక్తుడైనాడు. 1980 నవంబర్ నాలుగున గుండెపోటుతో చనిపోయారు.

రచనలు: సభా రచనల విషయానికి వస్తే కె. సభా, రమణ, కుమారి నిర్మల, జాబిల్లి వంటి కలం పేర్లతో దాదాపు తెలుగు సాహిత్యంలోని అన్ని ప్రక్రియల్ని స్పృశించాడు.

నవలలు: భిక్షుకి (1948), దేవాంతకుడు (1953), మొగిలి (1969) అనే మూడు నవలల్ని రాశాడు. అయితే ప్రస్తుతం వీటిల్లో మొగిలి నవల మాత్రమే మనకు లభ్యమవుతూ ఉంది.

కథలు: 1940లో తన రచనా జీవితాన్ని ప్రారంభించిన కె. సభా దాదాపు 300 కథల్ని రాశాడు. వాటిలో కొన్ని బంగారు (1963), పాతాళగంగ(1969), నీటిదీపాలు(1981) అనే సంపుటాలుగా వెలువడ్డాయి. కేతు విశ్వనాథరెడ్డి సంపాదకత్వంలో 'కె. సభా ఉత్తమ కథలు' (2010) పేరుతో 25 కథల సంకలనం ఒకటి వచ్చింది. వీటితో పాటు కథానిలయంలో బడిపంతులు (దీనిని కె.సభా సాహిత్యం – వాస్తవికత అనే అంశంపై పరిశోధన చేసిన కె. కృష్ణ కళావతమ్మ సాంఘిక నవలగా చెప్పారు. అయితే ఇది తప్పు. ఇది పెద్దకథ మాత్రమే) ధర్మసత్రం, పిచ్చి, వైరాగ్యం, సమాధి, అస్థిపంజరం, రేచుక్క పగటి చుక్క, వేయి రూపాయలు, తొలిబలి, మదరాసులో, అవతరించెను తెలుగుతల్లి, ప్రజాసేవకుడు, శిథిల శిఖరం, రామచిలుక, క్రతంబుర, ఉగాది సాంగ్యం, చిత్రకారుడు, సంక్రాంతి కోడె, మూగభావాలు, కామందులవారి కపాలం, రాహులుడు, నీడకథ, కామందులవారు, కుటుంబ నియంత్రణ లాంటి 25 చిన్న, పెద్ద కథలు మనకు లభిస్తున్నాయి. ఇలా మొత్తంగా సభా కథలు 56 మాత్రమే లభిస్తున్నాయి.

పిల్లల నవలలు: ఉపాధ్యాయుడుగా ఆయన పిల్లల మధ్య జీవితాన్ని గడిపిన అనుభవంతో ఏడు నవలల్ని రాశారు. అవి: మత్స్యకన్యలు, సూర్యం, చంద్రం, కవీ గాయకుడు, పసి హృదయాలు, పావురాలు, బుజ్జీ జిజ్జీ. పిల్లల కథలు: పిల్లల కథల్ని కొన్ని వందల వరకూ రాశారు. అవన్నీ ఇప్పటి వరకూ తొమ్మిది సంపుటాలుగా వచ్చాయి. అవి: అరగొండ కథలు, సీసా చరిత్ర, ఐకమత్యం, చిలకమ్మ, బొంగరం, ప్రాచీన భారత విప్లవ గాథలు, అన్నయ్య – చిన్నయ్య, ఎత్తుకు పైఎత్తు, జాబిల్లి. పిల్లల నాటకాలు: ఇవి ఆరు సంపుటాలుగా వచ్చాయి. అవి: పరీక్షా ఫలితాలు, చిట్టి మరదలు, స్వాతంత్ర్యోద్యమం, పురవదినాయక, ఏటిగట్టున, చావుబేరం. అలాగే రైతురాజ్యం,

పాంచజన్యం అనే బుర్రకథలను , దయానిధి, వేదభూమి అనే పద్య కావ్యాలను, విశ్వరూప సందర్శనం అనే గేయ కావ్యాన్ని, ఇంకా బాలగేయాలను వెయ్యికి పైగా రాశారు.

3.12. సీకల వేణుగోపాలరెడ్డి (సి. వేణు) (1926):

చిత్తూరు జిల్లా గుడిపాల మండలం మందికృష్ణాపురంలో 10.2.1926న వీరు జన్మించారు. వీరి తల్లిదండ్రులు అమ్మన్నమ్మ, గంగిరెడ్డి. సాధారణ వ్యవసాయాధారిత కుటుంబంలో పుట్టిన వీరి విద్యాభ్యాసం ఎన్నో ఒడిదుడుకులతో విద్వాన్ పట్టా వరకూ సాగింది. గాంధీజీ ఖద్దరు ఉద్యమంలోను, గ్రంథాలయోద్యమంలోను పాలు పంచుకొని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. సి. వేణు, చిత్రభాను అన్న కలం పేర్లతో కవిగా, కథకులుగా, నాటక కర్తగా ప్రసిద్ధిచెందారు. వీరి మొదటి కథ 1950లో చిత్రగుప్త పత్రికలో ప్రచురితమైంది. ఆ తర్వాత వీరు రాసిన కథలతో పాటు కొన్ని గేయాలు ఆనందవాణి, నాగేలు, ఆంధ్ర పత్రిక, ఆంధ్ర ప్రభ వంటి పత్రికల్లో అచ్చయ్యాయి. నవ్వినా ధాన్యరాశి (1970), అక్షర భిక్ష(1990 ప్రాంతం) అనేవి వీరు రాసిన కథాసంపుటాలు. ఇటీవల వీరి కథలను 'నవ్వినా ధాన్యరాశి' అనే పేరుతో పుస్తకంగా వేశారు. నవ్వినా ధాన్యరాశి, మారేమ్మగుడి, వానొచ్చె గంగు కథలు వీరికి బాగా పేరు తెచ్చిన కథలు. బాల గేయాలు, బాపూజీ దండకం, బాల భటులు అనేవి వీరి గేయ సంపుటాలు. తెలుగు పలుకుల వేల్పుగిడ్డి సురవరం ప్రతాపరెడ్డి, ఆదర్శ అధ్యాపకుడు కొండా మునిరెడ్డి అనేవి వీరు రాసిన జీవిత చరిత్రలు. కాలచక్రం, బడిపంతులు అనేవి వీరి నాటకాలు. మల్లెలు తూరుపెత్తిన వేళ ఇటీవల వీరు ప్రచురించిన పుస్తకం. నవ్వినా ధాన్యరాశి కథకు 1962 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక నిర్వహించిన దీపావళి కథల పోటీలో మొదటి బహుమతి వచ్చింది. వీరు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును కూడా అందుకున్నారు.

3.13. ఆర్. ఎస్. సుదర్శనం (రాచకొండ సుబ్బయ్య సుదర్శనం) (1927 – 2001):

విమర్శకుడిగా, నవలాకారుడిగా, కథకుడిగా, కవిగా పేరుగాంచిన ఆర్.ఎస్. సుదర్శనం చిత్తూరు జిల్లా మదనపల్లెలో రాచకొండ సుబ్బయ్యనాయుడు, కనకమ్మ గార్లకు 13.12.1927న జన్మించాడు. ఈయన ప్రాథమిక విద్యాభ్యాసం నుంచి ఎం.ఎ. వరకు మదనపల్లెలోనే కొనసాగింది. తరువాత మద్రాసు క్రైస్తవ కళాశాలలో ఆంగ్లంలో బి.ఎ. (ఆనర్స్) పూర్తి చేశాడు. 1947లో మద్రాస్ క్రైస్తవ కళాశాలలో ఇంగ్లీష్ ట్యూటర్ గా, 1947-48లో మచలీపట్నం హిందూ కాలేజిలో ఇంగ్లీష్ లెక్చరర్ గా, 1948-49లో మదనపల్లి బెసెంట్ థియోసాఫికల్ కాలేజిలో లెక్చరర్ గా, అనంతపురం, వరంగల్, నల్గొంగ, చిత్తూరు గవర్నమెంట్ డిగ్రీ కాలేజీల్లో ఇంగ్లీష్ లెక్చరర్ గా, హెచ్ ఓడిగా పని చేశారు. తరువాత నెల్లూరు, చిత్తూరు, అనంతపురం, రాజమండ్రి డిగ్రీ కాలేజీలకు ప్రిన్స్ పల్ గా పనిచేసి రిటైర్ అయ్యి మదనపల్లిలో 2001 డిసెంబర్ 14న మరణించారు.

ఆర్.ఎస్. సుదర్శనం నవలా రచయితగా, కథా రచయితగా, విమర్శకుడిగా, కవిగా అనేక రచనలు చేశాడు. ఈయన వ్రాసిన నవలల్లో, 'అనుబంధాలు'(1958), 'మళ్లీ వసంతం'(1960), 'అసురసంధ్య'(1966), 'సంసారవృక్షం'(1976) అనే నాలుగు నవలలు పేర్కొనదగినవి. ఈయన వ్రాసిన కథలు రెండు సంపుటాలుగా వెలువడ్డాయి. అవి: కాలం తెచ్చిన మార్పు (1963), మధుర మీనాక్షి (1981). ఈయన రాసిన కవితలు 'నిశాంతం' అనే పేరుతో 1970లో ప్రచురించబడ్డాయి. ఈయన వ్రాసిన విమర్శనాత్మక గ్రంథాలు 'సాహిత్యంలో దృక్పథాలు'(1968), 'సమాజము – సాహిత్యము'(1972), 'సాహిత్య నేపథ్యం'(1983), 'కవి హృదయం'(1988) అనేవి తెలుగు విమర్శనా రంగంలో పేరెన్నిక గలవి. వీటిల్లో 'సమాజము – సాహిత్యము' అనే విమర్శనా గ్రంథానికి 1977లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు లభించడం విశేషం. ఇంకా 'నూరు సమీక్షలు', 'చలం జీవితం – సాహిత్యం' అనేవి వీరి రచనల్లో పేర్కొనదగినవి. ఈయన రాసిన సంసారవృక్షం అనే నవల ఇంగ్లీష్, హిందీ, గుజరాతీ భాషల్లోకి అనువాదం అయ్యింది. అలాగే అసురసంధ్య అనే నవల ఇంగ్లీష్ లోకి అనువాదమయింది. అలాగే ఈయన కథలు కూడా ఇంగ్లీష్ లోకి అనువదించబడ్డాయి. ఈయనకు 1979లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే ఉత్తమ అధ్యాపక పురస్కారం లభించింది. కేంద్ర సాహిత్య అకాడమీ సలహా సంఘం సభ్యుడుగా కొనసాగాడు.

3.14. అవిలేలి వెంకటరామారెడ్డి (1927):

అవిలేవి వెంకటరామారెడ్డి చిత్తూరు జిల్లా రేణిగుంట మండలం గాజులమండ్యం (నడవలూరు)లో 30.11.1927న జన్మించాడు. ఈయన తల్లి సిద్ధమాంబ, తండ్రి ఎల్లపరెడ్డి. ఈయన ప్రాథమిక విద్య నడవలూరు ప్రాథమిక పాఠశాలలో జరిగింది. హైస్కూల్ విద్య గాజులమండ్యంలో జరిగింది. ఉన్నత విద్య 1944 నుండి తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య కళాశాలలో కొనసాగింది. అక్కడ ఈయన విద్వాన్ పూర్తి చేశాడు. 1950లో దక్షిణ భారత హిందీ ప్రచార సభ (మద్రాసు)లో రాష్ట్ర భాష హిందీ పండిట్ శిక్షణ పూర్తి చేశాడు.

1955లో ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో పండిత శిక్షణ పూర్తి చేశాడు. 1959లో ఆంధ్రా యూనివర్శిటీ నుంచి హిందీ ఉపన్యాస్ సర్టిఫికెట్ కోర్స్ పూర్తి చేశాడు. వెంకటరామారెడ్డి 1946లో కమ్మనపల్లి మేనేజ్‌మెంట్ స్కూల్లో మొట్టమొదట ఉపాధ్యాయ వృత్తి చేపట్టాడు. రేణిగుంట ప్రైమరీ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడుగా వృత్తిని ప్రారంభించాడు. ఈయన రచనా వ్యాసంగాల్లో కావ్యాలు, అనువాదాలు, రేడియో ప్రసంగాలు పేర్కొనదగినవి. ఈయన వ్రాసిన కావ్యాలు పూలవాన, హారతి, హాలికోదాహరణం, బడిపంతులు పేర్కొనదగినవి. ఈయన రచించిన అనువాద కావ్యాలలో శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం (పద్య కావ్యం), గీత గౌతమి అనేవి, ఏ.వి. రెడ్డి త్రిశతి (శతక సాహిత్యం) పేర్కొనదగినవి. ఈయన సంకలన గ్రంథాలలో నామౌచిత్యం, కవుల చరిత్ర, జాతీయాలు, ధ్వన్యనుకరణాలు పేర్కొనదగినవి. ఈయన రాసిన కథల్లో ముసలి గ్రద్ద, మృత్యువు, బాటసారి, గొల్లని కథ, చీమ కృతజ్ఞత పేర్కొనదగినవి.

ఈయన చిత్తూరు జిల్లా పండిత సంఘం అధ్యక్షులుగాను, రాష్ట్ర స్థాయి ఛాంబర్ ఆఫ్ పంచాయితీ రాజ్ డైరెక్టర్ పదవులు అలంకరించారు. ఈయన జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందాడు. 1983లో తెలుగు విశ్వవిద్యాలయం వారి 'ఉగాది సమ్మేళనం'లో ఉత్తమ కవిగా సన్మానం పొందాడు. 1987వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నందమూరి తారక రామారావు గారిచే 'ఉత్తమ రచయిత' సన్మానాన్ని అందుకున్నాడు. 1992లో ధూర్జటి కవిపీఠం వారిచే ఉత్తమ కవి ప్రశంసా పత్ర సన్మానం లభించింది.

3.15. ఎం.ఆర్. చంద్ర (1928):

ఎం.ఆర్. చంద్ర చిత్తూరులో 11.09.1928న జన్మించాడు. ఈయన తల్లిదండ్రులు లక్ష్మీదేవి, మునస్వామిలు. ఈయన చదువులకు స్వస్తి చెప్పి వ్యవసాయం చేస్తూ గడిపేవాడు. ఈయనకు ఊహ తెలిసిన వయస్సులో కార్మికునిగా జీవితం ప్రారంభించాడు. తరువాత 1960లో చిత్తూరు నుంచి 'పల్లెసీమ' వారపత్రికను ప్రారంభించి, యాభై యేళ్ళ పాటు దిగ్విజయంగా నిర్వహించాడు. ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన చంద్ర పెద్దగా చదువుకోకపోయినా చిన్నతనం నుంచే సాహిత్యాభిలాషను పెంచుకున్నాడు. గురువులెవరూ లేకపోయినా స్వయంకృషితో సాహిత్య అధ్యయనానికి పూనుకొని, అభ్యుదయ కవిత్వం పట్ల మక్కువను పెంచుకొని 1950లో తన రచనా జీవితాన్ని ప్రారంభించాడు. ఈయన రెండు నవలలను, మూడు నాటకాలను, రెండు నాటికలను, ఒక పద్య కావ్యాన్ని, మూడు గేయ సంపుటాలను వెలువరించాడు. ఈయన రాసిన నవలల్లో 'బలి', 'అమర దంపతులు' పేర్కొనదగినవి. చంద్ర రచనలలో 'రాతిగుండెలు' (నాటకం), రాజనర్తకి (చారిత్రక నాటకం), విధి, రుధిర ధారలు (నాటిక), చీకటి వెలుగులు (పద్య కావ్యం), ఎండమావులు, పిచ్చిగీతలు – పచ్చి నిజాలు, ఓ నీతీ ఉరేసుకో గేయ సంపుటాలు పేర్కొనదగిన రచనలు. ఈయన బంగారు పాళ్యం ప్రభుత్వ జూనియర్ కళాశాల వ్యవస్థాపక కార్యదర్శిగాను, చిత్తూరు జిల్లా చిన్న వార్తాపత్రికల సంఘం వ్యవస్థాపక అధ్యక్షునిగాను పత్రికా రంగానికి సేవలందించాడు. చిత్తూరులో ఏ సాహిత్య కార్యక్రమం జరిగినా, ఏ కవి సమ్మేళనం జరిగినా ఈయన వాణి వాడిగా, వేడిగా వినిపించేది. చంద్ర మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డిచే 'ఆంధ్రబ్లిడ్జ్' అని ప్రశంసలను అందుకున్నాడు.

3.16. ఇరువారం లోకనాథం (1928):

చిత్తూరుకు దగ్గరలోని ఇరువారంలో 1928 సెప్టెంబర్ 11న వీరు జన్మించారు. జానకమ్మ, నరసింగ పిళ్ళైలు వీరి తల్లిదండ్రులు.సంగీతం పట్ల, నాటక కళపట్ల ఆసక్తి గల వీరు నాటకాలలో నటించి మంచి పేరు తెచ్చుకోవడంతో పాటు ఊర్వసి, గిరిజా కల్యాణం వంటి 15 సంగీత నృత్య రూపకాలను కూడా రాశారు. అలాగే బడిపంతులు, బదిలీ లాంటి నాటికలను, నీతి గీతాలు, మొగిలీశ్వర క్షేత్ర మహత్యం వంటి పద్య రచనలను, మాతృమూర్తి శతకాన్ని రాశారు. వీరి కథల విషయానికి వస్తే మరీచిక అనే కథా సంపుటిని రాశారు.

3.17. మధురాంతకం రాజారాం (1930 – 1999):

మధురాంతకం రాజారాం చిత్తూరు జిల్లా, చంద్రగిరి తాలూకా, పాకాల మండలంలోని దామల చెరువుకు దగ్గరలో, మొగరాల సమీపంలో ఉన్న రమణయ్యగారిపల్లెలో 1930 అక్టోబర్ 5న విజయరంగ పిళ్ళై, ఆదిలక్ష్మమ్మ (రెండవ భార్య) లకు జన్మించారు. ఈయన పూర్వీకులు తమిళనాడుకు చెందినవారు. తమిళనాడులోని అప్పటి నార్త్ ఆర్కాట్ జిల్లాకు చెందిన వెంకటాపురం నుండీ చిత్తూరుకి వచ్చి స్థిరపడ్డారు.

ఈయన ప్రాథమిక విద్యను తన తండ్రి దగ్గరే అభ్యసించారు. ఆ తరువాత హైస్కూల్ చదువును చిత్తూరులో పూర్తి చేశాడు. 1948లో సెకండరీ గ్రేడ్ టీచర్ ట్రైనింగ్ పూర్తిచేసి మొగరాలలో ఉపాధ్యాయుడుగా నియమితులైనారు. 1964లో సంక్షేమ హాస్టల్ వార్డెన్ గా (పాకాల), 1965లో దామల్ చెరువు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా, తర్వాత 1979 నుండి 1988 వరకు కొటాల, కొమ్మిరెడ్డి గారి పల్లె ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందినారు.

తాత మధురాంతకం మునిస్వామి పిళ్ళై, తండ్రి విజయరంగ పిళ్ళైలు ఉపాధ్యాయ వృత్తిలో ఉండడం కారణంగా రాజారాం గారిలో చిన్ననాటి నుండే సాహిత్యంపట్ల అభిరుచి ఏర్పడింది. అంతే కాక కలువకొలను గంగాధర పిళ్ళై, పూతలపట్టు శ్రీరాములు రెడ్డి గార్ల ప్రభావం మరియు చిత్తూరు జిల్లాలోని సాహితీకారుల పరిచయంతో రాజారాంగారు సృజనాత్మక రచనలు చేయడం మొదలుపెట్టారు. ఇలా రాసిన మొదటి కథే 'కార్డు కథ'. ఇది 1948లో చిత్రగుప్తలో ప్రచురించబడింది. ఈయన మొదట్లో దత్తాత్రేయ, నాదేంద్ర అన్న కలం పేర్లతో కథలు రాసేవారు.

తెలుగు కథా సాహిత్యానికి పరిపుష్టిని కలిగిస్తూ రాజారాం దాదాపు మూడు వందల కథలను రాసి రాయలసీమ నుండి గొప్ప కథకుడుగా పేరు తెచ్చుకున్నారు. వీరు ప్రచురించిన కథాసంపుటాలు: 1. వర్షించిన మేఘం (1961), 2. ప్రాణదాత (1962), 3. కారణ భూతుడు (1966), 4. అవశేషం (పెద్దకథ) (1966), 5. తాను వెలిగించిన దీపాలు (1967), 6. కమ్మతెమ్మెర (1968), 7. కళ్యాణ కింకిణి (1968), 8. తాను వెలిగించిన దీపాలు (1968), 9. వక్రగతులు–ఇతర కథలు (1968), 10. మధురాంతకం రాజారాం కథలు (1969), 11. రేపటి ప్రపంచం (1975), 12. వగపేటికి? (1977), 13. వినోద ప్రదర్శన (1978), 14. పాంథశాల (1993), 15. పాంథశాల (1994), 16. హోలీకులు కుశలమా! (1994), 17. జీవితానికి నిర్వచనం (1995), 18. కూనలమ్మ కోన (1995). పై కథలన్నింటినీ కలిపి విశాలాంధ్ర వారు 6 సంపుటాలుగా వేశారు.

రాజారాం గారు నిర్విరామ కథారచనతో పాటూ చిన్న ప్రపంచం సిరివాడ (1969), త్రిశంకుడి స్వర్గం (1971) అనే రెండు నవలలను; వన భోజనం, పువ్వు పుట్టగానే పరిమళం అనే పిల్లల కథలను, సుమాంజలి, అందాల పాప, పాటల తోట, పిల్లల పాటలు అనే పాటలను,

వ్యాసాలు(కథాయాత్ర), సి.ఆర్. రెడ్డి జీవిత చరిత్రను, ధర్మ క్షేత్రం, మిస్. మనోరమ అనే నాటకాలను రాశారు.

ఇంకా వీటితో పాటూ ఆఫ్రికా, పిల్లల టాగూరు, పిల్లల నెహ్రూ, ఆకాశదీపం, వీరసింహుడి విజయ యాత్రలు, మనస్విని, చిత్రసుందరి, జయకాంతన్ కథలు, ఇటీవలి తమిళ కథానికలు, నారు – నీరు లాంటి అనువాదాలు కూడా చేశారు.

ఈయన వ్రాసిన కవితలలో 'హేమంత సంక్రాంతి', 'మాఊరి మేరు', 'ఉగాది' మొదలైన కవితలు ఆంధ్రపత్రిక, భారతి వంటి పత్రికల్లో ప్రచురితమయ్యాయి.

ఈయన వ్రాసిన నాటకాలలో 'ధర్మదీక్ష', 'మిస్ మనోరమ' మొదలైన నాటకాలు పేర్కొనదగినవి. ఇవి చాలా చోట్ల ప్రదర్శించబడ్డాయి.

ఈయన చిత్తూరు జిల్లా రచయితల సంఘానికి అధ్యక్షుడుగా ఉన్నాడు. అలాగే చిత్తూరు జిల్లా కళాపరిషత్తుకు కార్యదర్శిగాను, గంగాధరం సాహితీ కుటుంబానికి అధ్యక్షులుగాను, అధికార భాషా సంఘంలో సభ్యులుగానూ ఉన్నారు. వీరి 'చిన్న ప్రపంచం – సిరివాడ' నవల రష్యన్ భాషలోకి తర్జుమా అయ్యింది. వీరు 1968లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు, తంజావూరు తమిళ విశ్వవిద్యాలయం అవార్డు, 1993లో కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి, 1994లో శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ గౌరవ డాక్టరేట్, 1996లో అప్పాజోస్యుల – విష్ణుభొట్ల ఫౌండేషన్ (అమెరికా) వారి ప్రతిభామూర్తి పురస్కారం అందుకున్నారు.

ఈయనకు 1967లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారి అవార్డు 'తాను వెలిగించిన దీపాలు' కథాసంపుటికి లభించింది. తరువాత 1990లో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం వారు ఉత్తమ సాహితీ అవార్డును ప్రధానం చేశారు. ఈయన దామల చెరువులో 31.03.1999న మరణించారు.

3.18. పులికంటి కృష్ణారెడ్డి (1931– 2007):

చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం జక్కదన గ్రామంలో పులికంటి కృష్ణారెడ్డి 3.07.1931న జన్మించాడు. ఈయన తల్లి శ్రీమతి పాపమ్మ, తండ్రి పులికంటి గోవిందరెడ్డిలు. ఈయన ప్రాథమిక విద్యాభ్యాసం గంటవారిపల్లెలోని వీధిబడిలో కొనసాగింది. హైస్కూలు విద్య నక్కలపెంట గ్రామంలో ఎయిడెడ్ స్కూల్లో కొనసాగింది. చంద్రగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పూర్తి కావస్తున్న సందర్భంలో ఈయనకు రైల్వేలో ఉద్యోగం లభించింది. దాంతో ఈయన చదువు అర్ధాంతరంగా ఆగిపోయింది. ఆ తరువాత 1951వ సంవత్సరంలో రైల్వేలో బుకింగ్ క్లర్క్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించాడు. కొంతకాలం తర్వాత కొన్ని కారణాల వల్ల ఆ ఉద్యోగానికి రాజీనామా చేశాడు. తర్వాత కాఫీ పొడి వ్యాపారం కూడా చేశాడు.

పులికంటి కృష్ణారెడ్డికి చిన్నతనం నుండి పాటల పైన, నాటకాల పైన ఆసక్తి ఉండడంతో, నటులతో పరిచయాలను ఏర్పరుచుకొని బెల్లంకొండ రామాదాసు రచించిన 'పునర్జన్మ'

నాటకంలో వృద్ధుని పాత్ర ధరించి తన నట జీవితాన్ని ప్రారంభించాడు. ఒక పక్క నటుడిగా ప్రశంసలందుకుంటూనే మరోపక్క రచనా వ్యాసంగం వైపు మొగ్గు చూపి అనేక ప్రక్రియల్లో రచనలు చేస్తూ కవిగా, కథకుడిగా, నవలాకారుడిగా, నటుడిగా, జానపద కళారూపాల ప్రదర్శకుడిగా, పాత్రికేయుడుగా, బుర్ర కథకుడిగా జానపద గాయకుడిగా, వీటన్నింటికీ మించి రాయలసీమ చిన్నోడుగా పేరు తెచ్చుకున్నారు. 1961 ఆంధ్రప్రభలో వచ్చిన 'గూడుకోసం గువ్వలు' అనేది ఈయన మొదటి కథ. ఈయన మొత్తం 170 కథలు రాశారు. అవి: గూడుకోసం గువ్వలు, పులికంటి కృష్ణారెడ్డి కథలు (1981), కోటిగాడు స్వతంత్రుడు (1983), పులికంటి దళిత కథలు (2000) అనే కథా సంపుటాలుగా వచ్చాయి. వివిధ పత్రికల్లో ప్రచురితమైన పులికంటి కృష్ణారెడ్డి గారి 72 కథలను 2003లో పులికంటి కథావాహిని (బి. జి. చలపతి రెడ్డి, జి. శ్రీధర్ సంపాదకత్వంలో)అన్న పేరుతో అచ్చు వేశారు. అగ్గిపుల్ల అనే ఒక నవలను వీరు రాశారు. ఈ నవలకు 1983లో చక్రపాణి మొదటి అవార్డు లభించింది.

ఈయన 'నాలుగ్గాళ్ల మండపం' అనే శీర్షికన ఆంధ్రప్రభ దినపత్రికలో 57 వారాలపాటు ధారావాహికంగా రాయలసీమ మాండలికంలో ప్రజల గ్రామీణ జీవితాన్ని, బడుగు రైతుల గుండె చప్పుళ్లని తెలియజేస్తూ సుమారు 200 కథలు రాశాడు. పులికంటి రచనల్లో ఇది ఎంతో ప్రత్యేకమైనది.

పులికంటి కృష్ణారెడ్డి జర్నలిజం పట్ల కూడా ఆసక్తిని పెంచుకొని 1971లో 'కామధేను' అనే పక్షపత్రికను నడిపాడు. ఈయన జానపద గేయ రచయితగా నండూరి సుబ్బారావు 'ఎంకిపాటల' ఒరవడిలో 'అమ్మి'ని సీమ ప్రతినిధిగా ఎంచుకొని 'అమ్మి పాటల'ను రచించాడు. పులికంటి కృష్ణారెడ్డికి 1972లో ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ద్వారా 'నటశేఖర' బిరుదును ప్రధానం చేశారు. 1979లో రాయలసీమ జానపద కళాభారతి జిల్లా రచయితల సంఘం, లలిత కళా పరిషత్తు సంయుక్త ఆధ్వర్యంలో 'జానపద కవికోకిల' అనే బిరుదును ప్రధానం చేశారు. 1984లో విజయవాడ ఉపాధ్యాయ పండిత పరిషత్తువారు 'పండితమిత్ర' అనే బిరుదును ప్రధానం చేశారు.

ఈయన 1992 నుంచి 1995 వరకు ఆకాశవాణి దూరదర్శన్‌లకు అడ్వయిజరీ ఎమిరిటస్‌గాను, 1994 నుంచి 1999 వరకు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లోని పర్‌ఫార్మెన్స్ ఆర్ట్స్ విభాగంలో సభ్యునిగాను వ్యవహరించాడు. ఈయన 2001 సంవత్సరానికి కథా ప్రక్రియలో తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారాన్ని, 2003లో గోపీచంద్ అవార్డును అందుకున్నాడు. 2005లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రధానం చేశారు. ఇలా వివిధ రంగాల్లో రాణించిన ఈయన 18-11-2007లో మరణించారు.

3.19. కె. ఆర్. రెడ్డి (కె. రామిరెడ్డి) (1932):

వీరు చిత్తూరు జిల్లా మర్రిమాకుల పల్లెలో 1932 జూన్ 30న జన్మించారు. విద్యార్థిదశ నుండి పద్య గద్య రచనలు చేసిన వీరు ఇంజనీరింగు వరకు చదివి మహబూబ్ నగర్ జిల్లా వనపర్తిలోని

కృష్ణదేవరాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాలుగా పనిచేశారు. వీరు అబలలూ–అనుమానాలు అనే కథాసంపుటిని 1967లో ప్రచురించారు.

3.20. శ్రీనివాసపురం రామాచార్యులు (1935):

శ్రీనివాసపురం సోదరుల్లో ఒకరైన శ్రీనివాసపురం రామాచార్యులు చిత్తూరు జిల్లా పలమనేరు తాలూకా పెంగరకుంట గ్రామంలో 1935న జన్మించారు. ఈయన తల్లి శ్రీమతి ఆదిలక్ష్మమ్మ, తండ్రి శ్రీకృష్ణమాచార్యులు. రామాచార్యులు తన 15వ ఏటనే కథారచనలు ప్రారంభించారు. ఈయన రచనలు కొన్ని 'రమ్యశ్రీ' కలం పేరుతో సాగాయి. ఈయన వందకు పైగా కథలు రాశారు. ఈయన సోదరులతో తలపెట్టిన 'విజయనగర నవలా మాలిక'లో 11వ సంపుటమైన 'జగన్మోహిని' వీరి మొదటి నవలగా పేర్కొనదగినది. విజయనగర నవలా మాలిక రచనలలో కుమార రాముడు, తొళవేశ్వరుడు, అమాత్యరత్నము, జ్ఞాతి కలహము అనే భాగాలకు ఈయనే సంచాలకులు. ప్రణయ బంధము, మీరాబాయి, కన్నీటి కడలి అనేవి వీరు రాసిన నవలలు. ప్రస్తుతం ఈయన కథలు కానీ నవలలు కానీ లభ్యం కావటంలేదు.

3.21. కె. రామకృష్ణ నాయుడు (1935):

కుంటముక్కల రామకృష్ణనాయుడు చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం, దిగువమాఘం గ్రామంలో 15.06.1935న జన్మించారు. వీరి తల్లిదండ్రులు సాయమ్మ, కె. లక్ష్మయ్యనాయుడు. వ్యవసాయ ఆధారిత కుటుంబంలో పుట్టిన వీరి ప్రాథమిక విద్య దిగువ మాఘంలోనే జరిగింది. ఉన్నత పాఠశాల విద్య అరగొండలో, కళాశాల విద్య తిరుపతి శ్రీ వెంకటేశ్వర ప్రాచ్య కళాశాలలో సాగింది. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి విద్వాన్ పట్టా పొందారు. మైసూర్ రీజనల్ కళాశాల ద్వారా 'కళ– సంస్కృతి' అన్న అంశం మీద ప్రత్యేక శిక్షణ పొందారు. రాజమండ్రి ప్రభుత్వ కళాశాల నుండి పండిత శిక్షణను పొందారు. చిత్తూరు జిల్లా పుంగనూరు హైస్కూలులో తెలుగు పండితులుగా వీరి ఉద్యోగ జీవితం ప్రారంభమైంది. తర్వాత చిత్తూరు మునిసిపల్ ఉన్నత పాఠశాలలో 1958 నుండి దాదాపు 35 సంవత్సరాలు ఉపాధ్యాయుడుగా పనిచేసి 1993 లో పదవీ విరమణ పొందారు. వీరు చిత్తూరు జిల్లా రచయితల సంఘం కార్యదర్శిగా, ఆపై ఉపాధ్యక్షుడిగా కూడా పనిచేశారు.

కుంటముక్కల రామకృష్ణనాయుడు కవిగా, కథకుడిగా, నాటక రచయితగా, నవలాకారుడిగా, వ్యాస కర్తగా అనేక ప్రక్రియలలో వీరి రచనా వ్యాసంగం జరిగింది. లోకం పోకడ, ప్రగతి ప్రయాణం అనేవి వీరి కవితలు. వీరు రాసిన 'స్వయంకృతం' అనే నవల ఆకాశవాణి తిరుపతి కేంద్రం నవలా స్రవంతి కార్యక్రమంలో ప్రసారమైంది. జననీ జన్మభూమిశ్చ, విజేత అనేవి వీరి కథలు. పిల్లల్ని జాగృత పరచాలనే ఉద్దేశంతో కొన్ని బాలల కథలను రాశారు. వాటిని కథాగుచ్ఛం, కథా తోరణం అనే సంపుటాలుగా వెలువరించారు. వీరి కథాగుచ్ఛం 1961లో ఆరవ తరగతికి ఉపవాచకంగా కూడా ఉండేది. పత్రికా రచయితగా, రేడియో కళాకారుడిగా వందలాది వ్యాసాలు, ప్రసంగాలు వెలువరించారు. సంస్కారశోభ, తేనె చినుకులు

అనేవి వీరి వ్యాస సంపుటాలు. సంస్కారశోభకు 2000 సంవత్సరానికి గాను కుప్పం రెడ్డెమ్మ సాహితీ అవార్డు లభించింది. అలాగే కన్నెపూలు అనే కావ్యాన్ని, సుమరాణి, గౌతమబుద్ధుడు అనే నాటికలను రాశారు.

3.22. వల్లంపాటి వెంకటసుబ్బయ్య (1937–2007):

వల్లంపాటి వెంకటసుబ్బయ్య చిత్తూరు జిల్లా, వాల్మీకిపురం (వాయల్పాడు) తాలూకా రొంపిచెర్ల గ్రామంలో 13.12.1927న జన్మించారు. ఈయన తల్లిదండ్రులు లక్ష్మీదేవమ్మ, అశ్వర్థామలు. ఈయన ప్రాథమిక విద్య, హైస్కూల్ విద్యలు రొంపిచెర్ల ప్రభుత్వ పాఠశాలలో కొనసాగాయి. ఆ తరువాత మదనపల్లెలో ఇంటర్, డిగ్రీలు పూర్తిచేసి, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. ఇంగ్లీషు పూర్తి చేశాడు. ఆ తరువాత సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ అండ్ ఫారెన్ లాంగ్వేజస్ హైదరాబాదు నుంచి పి.జి.డి.టి.ఇ. పూర్తి చేశాడు.

ఈయన చిత్తూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయునిగా ఉద్యోగ జీవితం ప్రారంభించాడు. ఆ తరువాత 1969 నుండి 1995 వరకు మదనపల్లె బి.టి. కళాశాలలో ఇంగ్లీషు అధ్యాపకునిగా పనిచేసి రిటైరయ్యాడు. వల్లంపాటి వెంకటసుబ్బయ్య చిత్తూరులో ఉపాధ్యాయునిగా పనిచేసే సమయంలో అక్కడి సాహిత్య వాతావరణం, మిత్రుల ప్రోత్సాహం ఆయన రచనా వ్యాసంగానికి ఊతమిచ్చాయి. ఆంగ్ల సాహిత్యంలో బాగా ప్రవేశమున్నందువల్ల పాశ్చాత్య సాహిత్య ప్రక్రియల రీతుల్ని, లక్షణాల్ని క్షుణ్ణంగా పరిశీలించాడు. వల్లంపాటి వెంకటసుబ్బయ్య రచనా వ్యాసంగం 1962లో ఆంధ్రప్రభలో ప్రచురితమైన 'అన్యధా శరణం నాస్తి' అనే కథతో ప్రారంభమైంది. ఇలా దాదాపు 70 కథలను రాశారని తెలుస్తుంది. అయితే ఈయన రాసిన కథలను వారు పుస్తక రూపంలో తీసుకురాలేదు. ఇటీవల ఈయన రాసిన 35 కథలను 'వల్లంపాటి కథలు' అనే పేరుతో వల్లంపాటి సాహితీ మిత్రులు ప్రచురించారు.

ఈయన మూడు నవలలను రాశారు. అవి ఇంద్రధనుస్సు (20–6–1962 నుండి 8–8–1962 వరకు ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో సీరియల్ గా ప్రచురితం), దూరతీరాలు (1965), మమతలు–మంచుతెరలు (1976). జానకి పెళ్ళి(1976) అనే నవలికను కూడా ఈయన రాశారు. అయితే ప్రస్తుతం ఇది అలభ్యం. అనుశీలన, నవలా శిల్పం, కథా శిల్పం, విమర్శా శిల్పం, వల్లంపాటి సాహితీవ్యాసాలు అనేవి వీరు రాసిన విమర్శనాత్మక గ్రంథాలు. ఈయన అనువాద గ్రంథాలలో చరిత్ర అంటే ఏమిటి?, చరిత్రలో ఏం జరిగింది?, నవల–ప్రజలు, ప్రపంచ చరిత్ర, ప్రాచీన భారతదేశంలో ప్రగతి సంప్రదాయ వాదం, ప్రాచీన భారతదేశ చరిత్ర అనేవి పేర్కొనదగినవి. లజ్జ అనే నవలను వల్లంపాటి తెలుగులోకి అనువదించారు.

వల్లంపాటి వెంకటసుబ్బయ్య 1962లో ఆంధ్రప్రభ నవల పోటీల్లో 'ఇంద్రధనుస్సు' అనే నవలకు ద్వితీయ బహుమతి లభించింది. ఈయన రాసిన కథాశిల్పానికి 1999లో ఉత్తమ సాహిత్య విమర్శా గ్రంథంగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఈయన చిత్తూరు

జిల్లా రచయితల సంఘంలో సభ్యుడుగాను, మదనపల్లి రచయితల సంఘం సభ్యుడుగాను కొనసాగారు.

3.23. కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళై (1936 – 2016):

పూతలపట్టు మండలం, తలుపుల పల్లె గ్రామంలో 01.02.1936లో వీరు జన్మించారు. వీరి తల్లిదండ్రులు కుమారస్వామి పిళ్ళై, కృష్ణవేణి. వీరు ఉన్నత విద్యను మదనపల్లె, పలమనేరులోను, పి.యూ.సి. యస్.వి. యునివర్సిటీలోను, భాషా ప్రవీణ ఆంధ్రా యునివర్సిటీలోను పూర్తి చేశారు. వీరు చిత్తూరు జిల్లాలో అనేక ఉన్నత పాఠశాలల్లో తెలుగు పండితులుగా పనిచేసి 1994లో పులిచెర్లలో పదవీ విరమణ పొందారు. వీరు తెలుగు సంస్కృత భాషలలో రచనలు చేశారు. పట్టాభిరామ సుప్రభాతము, యక్షప్రశ్నోపాఖ్యానమ్, ఘోషయాత్ర అనేవి వీరి సంస్కృత రచనలు. విషాద మాధవి, చరిత్రకెక్కని మారణహోమం, ఒక రాఘవరెడ్డి కథ, ఓరుగల్లు-వీరగల్లు అనేవి వీరి తెలుగు పద్య కావ్యాలు. దివిలో కవి సమ్మేళనం, అన్వేషణ – అంభి అనేవి వీరి సంస్కృత నాటకాలు. ఆ నవ్వే, జింకపిల్ల, గుండె ఊసులాడింది, ఒక కుచేలునికి ఒక కృష్ణుడుంటాడు అనేవి వీరి కథలు. చండాలుడు (2007), మర్రిమాను సాక్షిగా (2010 చతుర), బోయకొత్తములు పండ్రెండు (2013) (చారిత్రిక నవల) అనేవి వీరి నవలలు. ఈ పద్యం నేర్చుకుందామా, వెలుగు తగ్గిన తెలుగు, శ్రీ శంకరాచార్యుల కవితా వైభవం అనేవి వీరి వ్యాస సంపుటాలు. వీరి పరిశోధనాత్మక పుస్తకం తెలుగు: ఎప్పుడు.. ఎక్కడ.. ఎలా..?. వీరి 'గుండె ఊసులాడింది' కథ విపుల మాసపత్రికలో, 'ఆ నవ్వే' కథ స్వాతి పత్రికలో ప్రచురితమైంది. 2006 'ఆటా' కథల పోటీలో వీరు రచించిన 'జింకపిల్ల' కథకు బహుమతి లభించింది.

3.24. మన్నవ భాస్కరనాయుడు (1936):

మన్నవ భాస్కరనాయుడు చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలంలోని బందార్లపల్లి గ్రామంలో 10.09.1936న జన్మించారు. ఈయన తల్లిదండ్రులు మంగమ్మ, సీతారామనాయుడు. ఈయన ప్రాథమిక విద్య ఒడ్డేపల్లిలో మొదలై sslc వరకూ సాఫీగా సాగింది. ఆ తర్వాత ప్రైవేటు విద్యార్థిగా పి.యు.సి, బి.ఎ., ఎం.ఎ. వరకూ చదివారు. తర్వాత ఆధునికాంధ్ర కవిత్వంలో అలంకారం అనే అంశం పై పరిశోధన చేసి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ ను పొందారు. ఉద్యోగ విషయంలో ఈయన బందార్లపల్లెలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడుగా మొదలై బి. కొత్తకోట, కాణిపాకం, పలమనేరు వంటి ప్రాంతాలల్లో భాషాపండితుడుగా పనిచేసారు. ఆ తర్వాత తిరుపతి ఆర్ట్స్ కళాశాలలో ఉపన్యాసకులుగా, రీడర్ గా పనిచేసి పదవీ విరమణ పొందారు.

ఈయన కవిగా, రచయితగా, నాటక కర్తగా అనేక రచనలు చేశారు. అరిటాకు, అమ్మా, న్యాయ ప్రతినిధులు, అనే కథలను వీరు రాశారు. మన్నవ ముత్యాల సరాలు, శ్రీ వేంకటేశ్వర సుమాంజలి అనేవి ఈయన రాసిన శతకాలు. ఈయన పద్య కావ్యాలను కూడా రాశారు. అవి: హృదయోదయం, స్వేద సూర్యోదయం. అలాగే 'జ్ఞాన నేత్రాలు', 'తరాలు–అంతరాలు', 'చెక్‌పోస్ట్'

అనే నాటికలను కూడా రాశారు. ఇంకా ఈయన బుర్రకథ, హరికథ, రేడియో ప్రసారాలు, దూరదర్శన్ ప్రసారాలు కూడా అనేకం రాశారు.

3.25. కాణిపాకం లింగన్న (1936):

కాణిపాకం లింగన్న చిత్తూరు జిల్లా అరగొండకి దగ్గరలోని దిగువ తడకర గ్రామంలో లక్ష్మమ్మ, వరదపిళ్లైలకు 22-5-1936 లో జన్మించారు. ఈయన ప్రాథమిక విద్యాభ్యాసం, హైస్కూల్ చదువులు అరగొండ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో పూర్తి చేశాడు. తరువాత ఇంటర్, డిగ్రీలు చిత్తూరు పి.వి.కె.యస్. డిగ్రీ కళాశాలలో పూర్తి చేశాడు. ఆ తరువాత ఎం.ఎ. తెలుగు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పూర్తి చేశాడు. మద్రాసు దక్షిణ భారత హిందీ ప్రచార సభ నుండి హిందీ ప్రవీణ పూర్తి చేసి హిందీ పండిట్ గా ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడ్డారు ఎక్కువకాలం పూతల పట్టులో పనిచేసి 1996లో ఉత్తమ ఉపాధ్యాయులుగా రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపును పొందారు.

1960లో రచనా వ్యాసంగానికి శ్రీకారం చుట్టిన ఈయన భారతి పత్రికలో వచ్చిన గేయాలతో పాటూ ఇతరాలను కలిపి నేను సూర్యుడైన వేళ, వెలుగు, పిలుపు, నీవు – నేను, స్వేచ్ఛా గానం, జబ్ మై సూరజ్ బనా, నింగి–నేల, కవితామృతం అన్న గేయసంపుటాలను వెలువరించారు.

ఈయన రాసిన కథలు రేపటి పౌరులు, పోలీసు కథలు(2009) అనే కథాసంపుటాలుగా వెలువడినాయి. ఈయన ఇప్పటి వరకూ 13 నవలలు రాశారు. అవి: శాంతి చక్రం1970 (పిల్లల నవల), కోనేటి నదులు (1981), లైఫ్ పార్ట్నర్ (1990), స్మైల్ అగైన్ (1990), చినబాబు (1993), చిత్ర (1996), కొత్తమలుపు (1997), ఒక ఆదర్శం (1997), నా చెల్లెలు (2002), కరణం మల్లీశ్వరి, అతడు గాంధీ (2003). ఈయన రాసిన 'భారత్‌కి జై' అనే నాటకం పేర్కొనదగింది. ఈయన 'గాంధీ శతకము'ను కూడా రాశారు. ఈయన రాసిన వ్యాసాలన్నీ 'వ్యాసదీపిక' అనే వ్యాస సంపుటిగా వెలువడింది. ఈయన బాలల కోసం ఐదు కథా సంపుటాలు వెలువరించాడు.

ఈయన సాహితీ కృషికి ప్రతిఫలంగా ఎక్సరే, కుప్పం రెడ్డెమ్మ వంటి సాహితీ సంస్థలు ఈయన్ను ఘనంగా సన్మానించాయి. అలాగే ఉత్తమ కవి, ఆనందమయి, రసమయి వంటి పురస్కారాలను పొందారు. ఈయన చిత్తూరు జిల్లా రచయితల సంఘంలో సభ్యులుగా కొనసాగుతున్నారు. ఈయన 'సాహితీ క్షేత్రం' అనే సాహిత్య సంస్థను స్థాపించారు.

3.26. శింగు మునిసుందరం (1937 – 2015):

ప్రముఖ రచయిత శింగు మునిసుందరం 1937, సెప్టెంబర్ 14న చిత్తూరు జిల్లా తిరుపతి రామచంద్రాపురం మండలం, పారకాల్వ గ్రామంలో లక్ష్మమ్మ, నాదమునినాయుడు దంపతులకు జన్మించారు. మునిసుందరం గారి ప్రాథమిక విద్య వీధి బడిలోను, మాధ్యమిక విద్య తిరుపతిలోను సాగింది. మెట్రిక్ నుండి ఎం.ఎ. వరకు ప్రైవేటుగా చదివారు. తర్వాత శ్రీ

వెంకటేశ్వర ప్రాచ్య కళాశాలలో విద్వాన్ చేసి జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో హిందీ అధ్యాపకుడిగా పనిచేసి ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ పొందారు. కొంత కాలంగా మునిసుందరం గారు మధుమేహంతో బాధపడుతూ తన స్వగృహంలో ఫిబ్రవరి 13, 2015 న తుదిశ్వాస విడిచారు. మునిసుందరం గారు చిత్తూరు జిల్లా రచయితల సంఘంకు ఐదు ఏళ్లపాటు కార్యదర్శిగా పనిచేశారు. చిత్తూరు జిల్లా సహకార ప్రచురణ సంఘానికి మూడు సంవత్సరాలు అధ్యక్షుడిగా వ్యవహరించారు. 1976 నుండి నూతలపాటి సాహితీ కుటుంబం సంస్థకు కార్యదర్శిగా మరణించే వరకు వ్యవహరించారు. వీరు కవితలు, లలిత గీతాలు, త్రిపదలు, భక్తి గీతాలు, నాటికలు, నాటకాలు, కథలు, ఒక నవల ఇలా దాదాపు ఇరవై ఐదు పుస్తకాల వరకూ రాశారు. జవాబు తెలియని వాడు (2011) అనేది వీరి కథా సంపుటి. ఒక యుద్ధం తరవాత (2012) వీరు రాసిన ఏకైక నవల.

వీరి ప్రతిభకు 1989లో ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడమీ పురస్కారం, 1992లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, 2007లో గరుడ పురస్కారం, 2010లో తెలుగు థియేటర్ పురస్కారం లభించాయి.

3.27. కాశీనాథ విశ్వం (1938):

కాశీనాథ విశ్వం చిత్తూరు జిల్లా బొమ్మసముద్రం సమీపంలోని ముత్తురాశి కుప్పం గ్రామంలో 11.05.1938న జన్మించారు. ఈయన తల్లి మంగతాయారు, తండ్రి మునుస్వామి పిళ్ళై. చిత్తూరు జిల్లాలో వివిధ చోట్ల ఉపాధ్యాయునిగా పనిచేసి తవనం పల్లి అప్పర్ ప్రైమరీ స్కూల్ లో ప్రధానోపాధ్యాయుడిగా పదవీ విరమణ చేశారు. కాశీనాథ విశ్వం రచనా వ్యాసంగం 1958లో ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురితమైన 'తాకితే బంగారం' అనే ఆంగ్ల అనుసరణ కథతో ప్రారంభమైంది. అప్పటి నుండి ఇప్పటివరకు సుమారు ముప్పై స్వతంత్ర కథలు, పదిహేను అనువాద కథలు రాశారు. ఈ అనువాద కథల్లో కొన్ని ఆంగ్ల అనువాదాలు, కొన్ని తమిళ అనువాదాలు. ఈయన మొదటి కథా సంపుటాన్ని పన్నెండు కథలతో పరిష్కారం అనే పేరుతోను, రెండవ సంపుటిని 'మిస్ శ్రీరంగ పట్నం'(1998) అనే పేరుతోను వెలువరించారు. రెండవ సంపుటంలో కొన్ని అనువాద కథలు, కొన్ని స్వతంత్ర కథలు ఉన్నాయి. ఈయన 'కల్పవృక్షంలో కార్చిచ్చు1981' అనే **నవలను** కూడా రాశారు.

3.28. సనగరం పార్థసారథి (1939):

వీరు మదనపల్లి తాలూకాలోని పెద్ద తిప్పసముద్రంలో 26.8.193న జ్ఞానమ్మ, శంకరప్ప అనే దంపతులకు జన్మించారు. మదనపల్లె, మద్రాసులలో వీరి చదువు సాగింది. ఉద్యోగరీత్యా అనేక ఊర్లల్లో వీరు పనిచేశారు. వీరు కొంతమంది సాహితీ మిత్రులతో కలిసి కథా కల్పనాలయం అనే ఒక రచయితల వేదికను (1972-76) హిందూపూరులో ఏర్పాటు చేశారు. వీరు స్నేహితుడు, శిథిల శిల్పం, ఆరడుగులు చాలు, ఒకే అద్దం మూడు ముఖాలు, తరంగాలు,

రాజేశ్వరి ఇలా అనేక కథలను వీరు రాశారు. వీరి కథలు పార్థసారథి కథలు (1982), మాట్లాడని మల్లెమొగ్గ(2007) అనే రెండు కథాసంపుటాలుగా వచ్చాయి.

3.29. కట్టమంచి బాలకృష్ణారెడ్డి 1939 :

కట్టమంచి బాలకృష్ణారెడ్డి చిత్తూరులో 07.08.1939న జన్మించారు. ఈయన తల్లిదండ్రులు పున్నమ్మ, మునస్వామిరెడ్డిలు. ఈయనకు తెలుగు పట్ల, తెలుగు సాహిత్యం పట్ల ఉన్న అభిమానంతో అముద్రిత వ్యాసాలు, కథలు రాశారు. వాటిలో 'యూరప్ జ్ఞాపకాలు', 'మధురమైన మామిడి' లాంటి వ్యాసాలు పేర్కొనదగినవి. ఈయన రాసిన కథలలో 'చిత్తూరు చిన్నోడు', 'మల్లేసు' అనే కథలు పేర్కొనదగినవి.

3.30. కలువకొలను సదానంద (1939–2020):

కలువకొలను సదానంద చిత్తూరు జిల్లా చంద్రగిరి తాలూకా పాకాల గ్రామంలో 22.02.1939న జన్మించాడు. ఈయన తల్లిదండ్రులు నాగమ్మ, కృష్ణపిళ్ళెలు. ఈయన ప్రాథమిక విద్య, ప్రాథమికోన్నత విద్యలు పాకాలలోనే జరిగాయి. ఆ తరువాత ఉన్నత విద్య అభ్యసించకుండా టి.యన్.యల్.సి. (Teacher's School Leaving Certificate) మంగాపురంలో (తిరుపతి సమీపంలో) పూర్తి చేశాడు. ఆ తరువాత చంద్రగిరి తాలూకా గానుగపెంటలో ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించాడు. ఆ తరువాత అనేక ప్రాంతాల్లో పనిచేసి పాకాలలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా 1997న పదవీ విరమణ చేశాడు.

సదానంద గారు గత యాభై ఏళ్ళకు ముందు నుండీ నేటి దాకా వివిధ ప్రసిద్ధ పత్రికల్లో కథానికలు, నవలలు, కవితలు, వ్యాసాలు, పిల్లల కథలు, పిల్లల నవలలు, బాల గేయాలు, కార్టూన్లు, కార్టూన్ కథలు రాశారు. వీరు ఇప్పటి వరకూ 150 కథలదాకా రాశారు. అవి ఇప్పటి వరకూ ఐదు కథా సంపుటాలుగా వచ్చాయి. అవి: రక్త యజ్ఞం (1965), పైరుగాలి (1968), నవ్వేపెదాలు – ఏడ్చే కళ్ళు (1975), రంగు రంగుల చీకటి (1995), పరాగ భూమి (2016). వీరి పిల్లల కథలు సాంబయ్య గుర్రం, చల్లని తల్లి, విందు భోజనం, నీతి కథామంజరి అనే సంపుటాలుగా వచ్చాయి. శివానందలహరి అనే పేరుతో పురాణ కథల సంపుటిని ప్రచురించారు. ఈయన గాడిద బ్రతుకులు(1972), గందరగోళం (1975), నగ్నరాత్రి (1977. భారతి), వట్టిచేతులు (1978), రక్త యజ్ఞం (1975–76 భారతి) అనే నవలలు రాశారు. రాగజ్వల, బంగారు మామ అనే నవలలు అముద్రితాలుగా తెలుస్తున్నాయి. బంగారు నడిచిన బాట అనే పిల్లల నవలను రాశారు. వెల్లువలో మనం **అనే** కవితా సంపుటిని. ఓండ్రింతలు అనే వ్యంగ్య కథా మాలికను రాశారు. అలాగే కొన్ని బాలల గేయాలు (బాబుగోల, పసి మనసు, అబ్బాయి గారడీ లాంటివి), వ్యాసాలూ రాశారు. అందులో 'కథానికా రచన' అనే వ్యాసం ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురించబడింది.

సదానంద రాసిన 'నవ్వే పెదవులు – ఏడ్చే కళ్లు' కథల సంపుటికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు 1976లో లభించింది. ఆ తరువాత 1997లో 'వెల్లువలో మనం' అనే కావ్యానికి కుప్పం రెడ్డెమ్మ సాహితీ అవార్డు లభించింది. 1995లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి యన్.టి. రామారావు జన్మదినోత్సవ సందర్భంగా చిత్తూరు సాంస్కృతిక మండలిచే 'కళానీరాజన' సత్కారాన్ని పొందాడు. 1996లో ఉగాదినాడు ఈయనకు హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయం వారిచే సృజనాత్మక సాహిత్యంలో ధర్మనిధి పురస్కారం లభించింది. ఈయన ఆలిండియా రేడియో కడప కేంద్రంలో సలహా సభ్యులుగా ఏడేళ్ళపాటు కొనసాగాడు.

3.31. నూతలపాటి గంగాధరం (1939 – 1975):

నూతలపాటి గంగాధరం చిత్తూరు జిల్లా సత్యవేడు మండలంలోని రామగిరి గ్రామంలో 15.12.1939న జన్మించాడు. ఈయన తల్లిదండ్రులు శ్రీమతి కుప్పమ్మ, శ్రీ నూతలపాటి ముసస్వామినాయుడు. ఈయన ప్రాథమిక విద్యాభ్యాసం రామగిరి గ్రామంలో వీధి బడిలో కొనసాగింది. ఆ తరువాత పుత్తూరు సమీపంలోని చిన్నరాజకుప్పంలో తన సోదరి ఆదరణలో పుత్తూరు ఉన్నత పాఠశాలలో ఎస్.ఎస్.ఎల్.సి. పూర్తి చేశాడు. ఆ తరువాత తెలుగు సాహిత్యం మీద మక్కువతో తిరుపతి ప్రాచ్య కళాశాలలో విద్వాన్ కోర్సును పూర్తి చేశాడు. ఆ తరువాత కర్నూలులో ఉపాధ్యాయ శిక్షణ పొంది సత్యవేడు ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడుగా ఉద్యోగ జీవితం ప్రారంభించాడు.

గంగాధరం చిన్నతనంలోనే రచనా వ్యాసంగం పట్ల ఆసక్తిని పెంచుకున్నాడు. ఈయన ఆంధ్రవైయాకరణ కేసరి, చేబ్రోలు సుబ్రమణ్యశర్మ, ఆకెళ్ల పిచ్చయ్యశాస్త్రి, సింగరాజు సచ్చిదానంద మూర్తిల వద్ద శిష్యరికం చేసి వ్యాకరణ, అలంకార శాస్త్రాలకు సంబంధించిన అనేక గ్రంథాల్ని, అనేక సంస్కృత కావ్యాల్ని అధ్యయనం చేశాడు. ఈయన రాసిన 'సాహిత్య గంగాలహరి'లో (విమర్శా వ్యాసాలు) వేమన, గురజాడ, శ్రీశ్రీ, కుందుర్తి మొదలగు వారి రచనలపై విమర్శనాత్మక వ్యాసాలతో పాటు సాహిత్యోద్యమాల్ని గురించి, దిగంబర కవితోద్యమం గురించి, వచన కవిత్వం గురించిన వ్యాసాలు ఉన్నాయి. ఇవి అంతకుముందు భారతి లాంటి వివిధ పత్రికల్లో ప్రచురితమైన వ్యాసాలు.

ఈయన రచించిన తివాచీ, కల, పందెం లాంటి కథలు పేర్కొనదగినవి. ఈయన రాసిన నవల 'కాగితం పులి' (1972). ఈయన రాసిన వచన కవితలు చీకటి నుంచి, వెలుగులోకి అనే కవితా సంకలనాలుగా వెలువడ్డాయి.

నూతలపాటి గంగాధరం అనేక సాహిత్య సభలకు అధ్యక్షత వహించాడు. ఈయన కొంతకాలం పాటు ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం కార్యవర్గ సభ్యుడిగా కొనసాగాడు. చిత్తూరు జిల్లా రచయితల సంఘం ఏర్పాటులో ప్రముఖ పాత్ర వహించాడు. ఈయన తన స్వగ్రామంలోని ఇంటి ముంగిట్లో పడుకొని వున్నప్పుడు పాముకాటుకు గురై 29.05.1975న చనిపోయాడు. ఈయన అకాల మృత్యువుతో అవాక్కైపోయిన తోటి జిల్లా

రచయితలు ఈయన స్మృత్యర్థం ఏర్పాటు చేసిన 'గంగాధరం సాహితీ కుటుంబం' అనే సాహితీ పురస్కార సంస్థ గత 26 ఏళ్లుగా రచయితలను సత్కరిస్తూ, నగదు బహుమతినిస్తూ ఈయనకు అశ్రు నీరాజనాన్ని అర్పించుకుంటూ ఉంది.

3.32. లంకిపల్లె కన్నయ్య నాయుడు (1940):

లంకిపల్లె కన్నయ్య నాయుడు చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం తోటవారిపల్లె గ్రామంలో 04.04.1940లో లక్ష్మమ్మ, లంకిపల్లె నారాయణస్వామి అనే దంపతులకు జన్మించారు. స్వగ్రామంలోని నాటుబడిలో మొదలైన వీరి విద్యాభ్యాసం ఆ తర్వాత ఎమ్.ఎస్ సి., పి. హెచ్ డి. వరకు సాగింది. హిందీ భాష మీద మక్కువతో రాష్ట్ర భాషా విశారదను కూడా పూర్తిచేశారు. 1964 నుండి 2000 వరకు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ట్యూటర్ (గణిత శాస్త్రం)గా, లెక్షరర్ (సంఖ్యాక శాస్త్రం,)గా, రీడర్ (ఆర్థిక శాస్త్రం)గా, ప్రొఫెసర్ (ఎకనోమేత్రిక్స్)గా ఉద్యోగ భాధ్యతలను నిర్వర్తించారు. ప్రణాళికా అభివృద్ధి పరిశోధక సంస్థకు (1987-93) డైరెక్టర్ గా, తిరుపతి రాస్ సంస్థకు (1981-85) డైరెక్టర్ గా, పల్లె అభ్యుదయ పరిశోధక అభివృద్ధి అకాడమికి డైరెక్టర్ గా, కృష్ణదేవరాయ విద్యా సాంస్కృతిక సంఘం తిరుపతి వ్యవస్థాపక కార్యదర్శిగా ప్రెసిడెంట్ గా కూడా పనిచేశారు.

వీరు 35కు పైగా కథలు రాశారు. అవి జీవనం(1991), బతుకు బాట(2007), తొలకరి జల్లుకు తడిసిన గుండె అనే కథా సంపుటాలుగా వెలువరించారు. వీటిలో చాలా కథలకు బహుమతులు లభించాయి. వీరు నాలుగు నవలలను రాశారు. అవి: ఏటిగట్టు1993, పచ్చగా నూరేళ్ళు 2008, జీవకోన2009, తొలిసంధ్య2010. అలాగే కాకతీయనాయకులు 1990 (ఎన్.జి. రంగా రచనకు అనువాదం) అనే చారిత్రక రచనను అనువాదం చేశారు.

వీరికి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషియల్ సైన్స్ పరిశోధనా సంస్థ, న్యూఢిల్లీ వారు 1984లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఇచ్చారు. 1991లో కథానిలయం వారి సత్కారం, 1994లో కుప్పం రెడ్డెమ్మ సాహిత్య అవార్డు, దివాకర్ల వేంకటావధాని శతజయంతి సత్కారం, 2015లో తానా సాహిత్య సత్కారం లభించాయి.

3.33. కలువకుంట్ల గురునాథ పిళ్ళై (1940):

మదనపల్లెలో 01.07.1940లో వీరు జన్మించారు. రత్నం పిళ్ళై, స్వర్ణమ్మలు వీరి తల్లిదండ్రులు. ఎన్నో ఆటంకాలతో వీరి చదువు పి.యు.సి వరకూ సాగి, ఆ తర్వాత టీచర్స్ స్కూలు లీవింగ్ సర్టిఫికేట్ కోర్సులో టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసి 1961లో చిన్నగొట్టిగల్లులో తాత్కాలిక ఉపాధ్యాయుడుగా చేరారు. ఆ తర్వాత మదనపల్లిలో శాశ్వత ఉపాధ్యాయుడిగా నియమితులైనారు. అమ్మ మనసు, మనసున మల్లెలు, తొలిచూపు, ఓ ప్రేమ కథ, పీడా వదిలింది, కొత్తదారి, లక్ష్యం, ప్రేమ అమరం, దేవుడు చేసిన పెళ్ళి శీర్షికలతో కథలు రాశారు. వీరి కథ 'అమ్మో ఇదో పరమ రహస్యం' మదనపల్లె రచయితల సంఘం ప్రచురించిన 'కథాగుచ్ఛం'లో

ప్రచురితమైంది. వీరి కథలన్నీ కలిపి కలువకుంట్ల కథలు (2015) అనే సంపుటిగా ప్రచురించారు.

3.34. కరణం శేషపిళ్ళై (1941):

వీరు చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు మండలం రాసిమరెడ్డి పల్లెలో 1941లో జన్మించారు. వీరి తల్లిదండ్రులు లక్ష్మమ్మ, నారాయణ పిళ్ళైలు. 1957లో సెకండరీ గ్రేడ్ ట్రైనింగ్ పూర్తి చేసి 1958లో టీచర్ గా ఉద్యోగ ప్రవేశం చేశారు. ఈయన పైవేటుగా బి.ఎ., బి. ఈడి., ఎం.ఎ. తెలుగు, ఎం.ఎ. ఇంగ్లీష్, ఎల్.ఎల్.బి. ని పూర్తి చేశారు. ఈయన మిట్టూరోడి కథల పైన ఎం. ఫిల్. చేశారు. ఈయన అన్వేషణ అనే పేరుతో ఒక కథా సంపుటిని వెలువరించారు. ఇందులో గల ఈ కథలు వివిధ పత్రికల్లో ప్రచురితమైనవే. వీటిని 1988కి ముందే రాసినప్పటికీ కుటుంబ, వృత్తి బాధ్యతల రీత్యా ఆలస్యమై 2015లో సంపుటిగా ప్రచురించారు.

3.35. వక్కంతం సూర్యనారాయణరావు (1942):

చిత్తూరు జిల్లా పుంగనూరు తాలూకా రామసముద్రం మండలంలోని అరికెల గ్రామంలో 30.12.1942న వక్కంతం సుబ్బలక్ష్మమ్మ, వరదయ్యలకు జన్మించారు. వీరు అపరాధ పరిశోధక నవలా రచయిత టెంపోరావు ప్రభావంతో అనేక అపరాధ పరిశోధక నవలలను రాశారు. 1968 లో టెంపోరావు ఆధ్వర్యంలో నడిచిన యవ్వనం మాసపత్రికలో ప్రచురితమైన 'భృత్యుడు' అనే కథతోనూ, 'అబల ఆంతర్యం' అనే నవలతోనూ ఈయన రచనా వ్యాసంగం మొదలైంది. అప్పటి నుండి వంద నవలలను రాశారు. 1980 నుండి ఇతడు పూర్తిస్థాయి రచయితగా మారి డిటెక్టివ్ నవలలను, కథలను (శివరాం నేరాలు కథల సంపుటి) వి.ఎస్.రావు అనే పేరుతోను, ఆధ్యాత్మిక, సాంఘిక రచనలను తన పూర్తి పేరు వక్కంతం సూర్యనారాయణరావు అనే పేరుతోను ప్రకటించాడు. ఇతడు ఇంకా "బాటసారి, కౌండిన్య, సూర్యాత్రేయ, చిత్రభాను" అనే కలం పేర్లతో రచనలు చేశాడు. ఇతడు 100 కు పైగా క్రైమ్, డిటెక్టివ్ నవలలను, స్త్రీవాద నవలలను, సాంఘిక నవలలను, నాటకాలను, నాటికలను, ఆధ్యాత్మిక రచనలను చేశాడు. ఇంకా ఇతడు వందల కొద్దీ భక్తి పాటలను రాసి క్యాసెట్లుగా విడుదల చేశాడు. బాల సాహిత్యంలో కూడా ఈయన కొన్ని రచనలు చేశాడు.

ఇతడు అనేక పురస్కారాలను, బహుమతులను అందుకున్నాడు. ఈయనకు 1986లో 'విపుల' మాసపత్రికలో ప్రచురించబడిన 'మోడల్' అనే కథకు మంచిపేరు వచ్చింది. ఈయన 'మోడల్' కథ ఆధారంగా ఎన్.ఎఫ్.డి.సి. వాళ్లు తీస్తున్న 'సృష్టి' చిత్ర నిర్మాణానికి ఈయన మాటలు, పాటలు రాశారు. తరువాత 'చిటికెల పందిరి' వంటి చలన చిత్రాలకు మాటలు, పాటలు సమకూర్చినారు. ఇతని మోడల్ కథ హిందీ అనువాదం భారతీయ విశిష్ట కహానియా౯ వార్షిక సంచికలో ప్రచురింపబడింది. ఇతని స్త్రీ ప్రధాన సాంఘిక నాటకం న్యాయదుందుభి మనస్విని ఆత్రేయ లిటరరీ అవార్డును గెలుచుకుంది. అదే నాటకానికి కుప్పం రెడ్డెమ్మ సాహిత్య పురస్కారం లభించింది. యత్రనార్యస్తు బాధ్యంతే నాటకానికి సోమేశ్వర సాహిత్య పురస్కారం

లభించింది. గౌరీ కళ్యాణం నాటకానికి ఎన్.టి.ఆర్. విజ్ఞాన్ ట్రస్ట్ అవార్డ్ లభించింది. చతుర నవలల పోటీలో సంభవామి గృహే గృహే నవలకు మూడవ బహుమతి లభించింది. ఆటా (అమెరికన్ తెలుగు అసోసియేషన్) వారు నిర్వహించిన నవలల పోటీలో ఇతడు రాసిన మదర్ ఇండియా నవలకు రెండవ బహుమతి లభించింది. ఈ నవల నవ్య వీక్లీలో ధారావాహికగా ప్రచురింపబడింది.

3.36. వేంపల్లి అబ్దుల్‌ఖాదర్ (1945):

వేంపల్లి అబ్దుల్‌ఖాదర్ చిత్తూరు జిల్లా కలికిరిలో 01.07.1945న జన్మించాడు. ఈయన తల్లిదండ్రులు వి.హుసేన్ బీబీ, వి. హుసేన్‌లు. వీరు ప్రాథమిక విద్యాభ్యాసం నుంచి ఉన్నతవిద్య వరకు కలికిరిలోనే కొనసాగించారు. ఆ తర్వాత ఎం.ఎ, బి.ఈడి. చదివారు. వీరు 1961లో చిత్రలేఖనం ఉపాధ్యాయునిగా జీవితం ఆరంభించి తెలుగు అధ్యాపకునిగా ఉద్యోగ విరమణ చేశారు. ఈయన ఉగాది, సంక్రాంతి పండుగల సందర్భాల్లో చిన్న చిన్న కవితలు, కథలు రాయడంతో తన రచనా వ్యాసంగాన్ని ప్రారంభించాడు. ఈయన రచనల్లో సంప్రదాయ కవిత, వచన కవిత, కథలు, సమీక్షలు పేర్కొనదగినవి. మల్లిరేకు(2006) అన్న కథాసంపుటితో ఈయన కథకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత బిడ్డలు(2011), మెతుకు(2019) అనే కథా సంపుటాలను వెలువరించారు. చినుకు, మేఘం అనే కవితా సంపుటాలను, కిరణం అనే వచన కవితా సంపుటిని, వాకిలి, ఆలోచన అనే వ్యాస సంపుటాలను ఈయన రాశారు. ఇంకా ఈయన లోగిలి అనే శతకాన్ని కూడా రాశారు.

ఈయన రచనలకు గాను ఎన్నో బహుమతులను, అవార్డులను, పురస్కారాలను, సత్కారాలను అందుకున్నారు. ప్రభుత్వం వీరిని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులుగా, రాష్ట్ర అధికార బాషా సంఘ సభ్యులుగా నియమించి గౌరవించింది. ముసుగు కథకు కుప్పం రెడ్డెమ్మ పురస్కారం, శతక రచనకు కుప్పం రెడ్డెమ్మ పురస్కారం, 1999లో కుందుర్తి జాతీయ సాహితీ పురస్కారం, 2000 సంవత్సరములో ఎక్స్‌రే అవార్డు, 2003లో పులికిం సాహితీ సంస్కృతి పురస్కారం, 2004లో ప్రవాసాంధ్రా వసంతోత్సవ పురస్కారం, 2005 లో ఆంధ్రప్రదేశ్ అధికార భాషా పురస్కారం, ఇవే కాక ఎన్నో లైఫ్ టైం అచేవ్ మెంట్ అవార్డులను, ఎన్నో కవి సమ్మేళనాలల్లో విశిష్ట పురస్కారాలను, మరెన్నో ఆత్మీయ పురస్కారాలను అందుకున్నారు.

3.37. పెనుమూరు కేశవరెడ్డి (1946 – 2015)

పూతలపట్టు మండలం, తలపులపల్లి గ్రామంలో 10 మార్చి, 1946లో జన్మించారు. పెనుమూరు రంగారెడ్డి, అమ్మనమ్మ వీరి తల్లిదండ్రులు. కేశవరెడ్డి తిరుపతిలో పి. యు సి., పాండిచ్చేరిలో ఎం. బి. బి. యస్. చేశారు. తమిళనాడులోని రాయవేలూరులోని క్రిస్టియన్ మెడికల్ కాలేజిలో డెర్మటాలజిస్ట్ గా శిక్షణపొందారు. నిజామాబాదు జిల్లా డిచ్ పల్లిలో విక్టోరియా ఆసుపత్రిలో 30 ఏళ్లుగా కుష్టు రోగులకు సేవలందిస్తూ ఉన్నారు. 2006లో విక్టోరియా ఆసుపత్రి

నుంచి రిటైర్ అయ్యి నిజామాబాదు, ఆర్మూరులల్లో ప్రైవేటు ప్రాక్టీస్ చేశారు. తర్వాత కొంతకాలం బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతూ 13-02-2015లో తుది శ్వాస విడిచారు.

కేశవరెడ్డి తన రచనా వ్యాసంగాన్ని మొదట కథానికతో ప్రారంభించాడు. విశాలాంధ్ర అనుబంధాలు, కథాంజలి, జయశ్రీ వంటి పత్రికల్లో ఈయన కథలు 12 దాకా ప్రచురితమయ్యాయి. దురదృష్టం ఏమంటే ప్రస్తుతం ఈయన రాసిన శ్రీభగవానువాచ, ది రోడ్, పార్టీ అనే కథలు తప్ప మరే ఇతర కథలు మనకు లభ్యం కావడం లేదు. కేశవరెడ్డి నవలల విషయానికొస్తే మధురాంతకం రాజారాం గారి ఏకలవ్య శిష్యరికంతో ప్రారంభమైన ఈయన రచనా వ్యాసంగంలో ఇన్ క్రెడిబుల్ గాడెస్ (క్షుద్రదేవత)తో మొదలై మునెమ్మ వరకూ ఎనిమిది నవలలను రాశారు. అవి: 1.ఇన్ క్రెడిబుల్ గాడెస్ (క్షుద్రదేవత) (1977 ఆంధ్ర సచిత్ర వారపత్రికలో) (1979 విశ్వప్రభ తిరుపతి), (hbt 2011), 2. స్మశానం దున్నేరు (విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ 1979) (hbt. 2011), 3. సిటీ బ్యూటిఫుల్ (ఆంధ్రజ్యోతి వార పత్రిక 1986) (నందిని పబ్లికేషన్స్ ఆర్మూర్ 2003) (hbt 2011), 4. రాముడుండాడు రాజ్యముండాది (ఆంధ్రజ్యోతి వార పత్రిక 1986) (రీతిక 1997) (hbt 2010), 5. మూగవాని పిల్లనగ్రోవి (ఆంధ్ర సచిత్ర వార పత్రిక 1993) (రీతిక 1995) (hbt 2008), 6. చివరిగుడిసే (1993 ఆహ్వానం మాస పత్రిక) (రీతిక 1996) (hbt 2008), విశాలాంధ్ర, వి. పి. హెచ్. వాళ్ళు కూడా ముద్రించారు, 7. అతడు అడవిని జయించాడు (1984 ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక), (నందిని 2003) (hbt 2008), 8. మునెమ్మ (చతుర మాస పత్రిక 2007) (hbt 2008).

ఈయన నవలలైన ఇన్ క్రెడిబుల్ గాడెస్ (క్షుద్రదేవత)కు నూతలపాటి గంగాధరం సాహితీ సత్కారం లభించింది. అలాగే ఈ నవల మరాఠీలోకి కూడా అనువాదమైంది. అతడు అడవిని జయించాడు నవలకు 1988లో తెలుగు యూనివర్సిటీ ఉత్తమ నవల అవార్డు దక్కింది. దీనిని నేషనల్ బుక్ ట్రస్ట్ వాళ్ళు 14 భారతీయ భాషల్లోకి అనువదించారు. మూగవాని పిల్లనగ్రోవి నవలకు సహృదయ సాహితీ అవార్డు (వరంగల్), ఆరోస్ అవార్డు (రామచంద్రాపురం), రాచకొండ రచనా పురస్కారం (శ్రీకాకుళం), రావిశాస్త్రి స్మారక సాహిత్య పురస్కారం (హైదరాబాదు) లభించాయి.

3.38. టి. ఎస్. ఎ. కృష్ణమూర్తి (తొడిమెల్ల కృష్ణమూర్తి) (1950)

టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి చిత్తూరు జిల్లా మదనపల్లిలో 22.01.1950న జన్మించారు. ఈయన తల్లిదండ్రులు కమలమ్మ, ఆంజనేయులు. ఈయన మునిసిఫల్ అడ్మినిస్ట్రేషన్ మదనపల్లిలో క్లర్క్ గా పనిచేసి రిటైర్ అయ్యారు. ఈయన 1968 నుండి రచనా వ్యాసంగాన్ని మొదలుపెట్టారు. 1971 ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురించబడిన 'ఐ కెనాట్ ఫర్‌గెట్ హర్' అనే కథ ఈయన రాసిన మొట్టమొదటి పెద్ద కథ. ఆ తరువాత రెండు వందలకు పైగా కథలను, పది నవలికలను, నాలుగు నవలలను రాశారు.

ఈయన రాసిన కథలు అనేక సంపుటాలుగా వెలువడ్డాయి. అవి: టి. ఎస్ .ఎ. కృష్ణమూర్తి కథలు(2003), అడ్డదారులు(2006), ఈ గాలి నాది – ఈ నేల నాది(2010), ఘటోద్గజపురం గాథలు (వ్యంగ్య హాస్య కథా సంపుటి) (2011), దృశ్యకావ్యం(2012), టి. ఎస్ .ఎ. కథ 2012(2013), టి. ఎస్ .ఎ. కథ 2013(2014), టి. ఎస్ .ఎ. కథ 2014(2015). ఈయన రాసిన నవలలో కొత్త బంగారు లోకం(2006), కలువ విరిసింది(2009), కలల రాజ్యం(2015), ఆయుధం(2016) అనేవి పేర్కొనదగినవి. వీటితో పాటు చిత్తూరు జిల్లా వందేళ్ళ కథాసారథులు అనే పుస్తకాన్ని, అనేక వ్యాసాల్ని రాశారు. ఈయన రచించిన ఆధ్యాత్మిక వ్యాసాలు 'సప్తగిరి'లో ప్రచురితమైనాయి.

ఈయన రచనలకు అనేక పురస్కారాలు, అవార్డులు లభించాయి. కొత్తబంగారులోకం నవలకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు వారి ఉత్తమ గ్రంథ పురస్కారం 2008లో వచ్చింది. కలువ విరిసింది నవలకు కుప్పం రెడ్డెమ్మ సాహితీ సమితి వారి ప్రోత్సాహక అవార్డు 1994లో లభించింది. మెక్సా విశిష్ట వ్యక్తి పురస్కారం, రచన ' కథాపీఠం' పురస్కారం, సీమ సాహిత్య రత్నం పురస్కారం, అలాగే 'భరతముని ఆర్ట్స్ అకాడమీ' వారి కళారత్న అవార్డు ఇలా అనేక పురస్కారాలను, అవార్డులను పొందారు.

3.39. వారాల కృష్ణమూర్తి (1950)

చిత్తూరుజిల్లా వాయల్పాడులో 01.07.1950న వీరు పుట్టారు. బి. ఎ. వరకూ చదువుకున్న ఈయన సీనియర్ ఆడిట్ ఆఫీసర్ గా పనిచేసి రిటైర్ అయ్యారు. వీరు రెండు కథా సంపుటాలను ప్రచురించారు. అవి: దేవర దున్న (1993), నిశబ్ద సంకేతం (2011). ఎలా బతకాలి, నగరం ప్రశాంతంగా ఉంది, పులి మింగిన ఊరు అనే నాటకాలను, మాయ, చింతచెట్టు, సన్నప్లవర్స్, దేశం జైల్లో ఉంది, గోడలు, సమ్మతి, మే ఐ హెల్ప్ అనే నాటికలను రాశారు. వీరి దేవర దున్న కథాసంపుటికి ARTOS వారి సాహితీ పురస్కారం 1995లో లభించింది.

3.40. గార్లపాటి దామోదరనాయుడు (1951):

డా॥ జి. దామోదరనాయుడు చిత్తూరు జిల్లా యర్రావారిపాళెం మండలం ఉదయ మాణిక్యం గ్రామంలో 12.10.1951న జన్మించారు. ఈయన తల్లిదండ్రులు శ్రీమతి నారాయణమ్మ, శ్రీ మునస్వామి నాయుడు. ఈయన రచనలుగా 'భారత సూక్తి నిధి', 'గురు విజయము', 'అన్నమయ్య శ్రీ వేంకటేశ్వర శతక పరిశీలన', 'జానపదులు – భక్తి పూజలు', 'దశావతార తత్త్వ విశ్లేషణ', 'అన్వేషణ', 'ఆ వెనుక' కవితా సంపుటాలు, 'జయ సాహిత్య వ్యాసాలు', 'సన్నయ భారత సూక్తి నిధి', 'మన కులం – మన గోత్రం' (కథ) పేర్కొనదగినవి.

3.41. నాయుని కృష్ణమూర్తి (1951–2018)

ప్రముఖ కవి, కథకుడు, నవలాకారుడు, నాటక కర్త, సినీ గేయ రచయిత, నిఘంటువులకు సంకలన కర్త, పత్రికా సంపాదకుడు అయిన నాయుని కృష్ణమూర్తి చిత్తూరు జిల్లా నడిమిచెర్ల గ్రామంలో 1951న జన్మించారు. రామయ్య, నరసమ్మ వీరి తల్లిదండ్రులు. వీరి తండ్రి

ఉద్యోగ రీత్యా నడిమిచెర్ల నుండి చౌడేపల్లి దగ్గరున్న మేకల చిన్నపల్లెకు రావడం జరిగింది. అప్పటి నుండి వీరికి అదే స్థిర నివాసం అయ్యింది. వీరు ప్రాథమిక విద్య మేకచిన్న పల్లెలో, ఉన్నత విద్యను మదనపల్లి, చౌడేపల్లిలో, డిగ్రీ, ఎం.ఎ. తెలుగును తిరుపతిలో పూర్తి చేశారు. వీరు బొమ్మరిల్లు, విజయ, నీలిమ పత్రికలకు ఉపసంపాదకుడిగా కొంతకాలం పనిచేసి తర్వాత స్నేహబాల అనే పత్రికను కొంతకాలం నడిపాడు. అలాగే 1977లో మాబడి, 1978లో పాఠశాల వంటి పత్రికలను కూడా విద్యార్థుల కోసం నడిపారు. వీరు కుటుంబ సభ్యులతో కలిసి 1986లో విజయవాణి విద్యాసంస్థను స్థాపించారు. 1975-80ల మధ్య కాలంలో వీరి అవసరాల కోసం ఏర్పరచుకున్న చిన్న ప్రింటింగ్ ప్రెస్ ఆ తర్వాత విజయవాణి ప్రింటింగ్ ప్రెస్ గా మారింది. వీటి నిర్వహణలో కృష్ణమూర్తి గారి పాత్ర గణనీయమైనది. వీరు అక్షర తపస్మాన్ కార్యక్రమంలో జిల్లా సాక్షరతా సమితి అకడమిక్ కమిటీ చైర్మెన్ గా, రాష్ట్ర సాక్షరతా సమితి సభ్యుడిగా, కేంద్ర స్థాయిలో నేషనల్ లిటరసీ మిషన్ సభ్యుడిగా అనేక సేవలందించారు. ఐ.వి. సుబ్బారావు ఆదేశంతో వీరు నూతన అక్షరాస్యుల కోసం వెలుగుబాట అనే పత్రికను కొన్ని సంవత్సరాలు నడిపారు. నూతన అక్షరాస్యుల కోసం పఠనా సామాగ్రి అనే అంశంపైన అధ్యయనం చేయడానికి యు.కె. ప్రభుత్వం నిర్వహించిన కమిటీ ఈ పత్రికను కేస్టడిగా ఎన్నుకున్నారు. ఇంకా వీరు వారం వారం విజ్ఞానం కార్యక్రమంలోనూ, పిల్లల కోసం చదువు పత్రికను నిర్వహించడంలోను బాధ్యతాయుతంగా శ్రమించారు.

ఇక వీరి రచనల విషయానికొస్తే కథలు, నవలలు, నాటకాలు, అనువాదాలతో పాటు రామాయణ, భాగవతాలను వ్యవహారిక రూపంలోనూ, భారతాన్ని నవలా రూపంలోనూ తీసుకు వచ్చిన ఘనత వీరికి కలదు. నాయుని కృష్ణమూర్తి కథలు (2011), ఏంలేదు (2014) అనేవి వీరి కథా సంపుటాలు. యామినీ కుంతలాలు (రచనాకాలం:1973, ఆంధ్ర సచిత్ర వారపత్రిక నిర్వహించిన 1974 ఆనంద ఉగాది నవలల పోటీలో మూడవ బహుమతి.) (2011), మనసు గుర్రము రోరీ మనిషి (రచనాకాలం:1974) (2011), ప్రలోభం (ఆంధ్ర సచిత్ర వారపత్రిక 15.8.2003-2.1.2004 వరకూ) (2012), జయమ్ (మహాభారత మూల కథకు నవలా రూపం) (2016), ఖేల (1978), కాటుక కరిగి పోయింది (మరణించిన తర్వాత ప్రచురించారు) అనేవి వీరి నవలలు. ఈ కోతి డ్రామాకు పనికొస్తుందా అనేది వీరి అసంబద్ధ నాటిక. నీరాజనోదంతం వీరి అనువాద వచన గీతాల సంపుటి. తెలుగు – ఇంగ్లీష్ బొమ్మల నిఘంటువును, నాలుగు వేల పదాలతో తెలుగు – ఇంగ్లీష్ సచిత్ర నిఘంటువును, ఎనిమిది వేల పదాలతో తెలుగు – ఇంగ్లీష్ విద్యార్థి నిఘంటువును వీరు నిర్మించారు. సుమం ప్రతి సుమం సుమం (మహర్షి సినిమా), పలుకేమైనా సాయం వీణా (స్వర కల్పన సినిమా), నీ నామ మధురం సుధామయం అనే మూడు సినిమా పాటలను కూడా వీరు రాశారు.

3.42. కె.ఎస్.వి నరసింహం (కేఎస్వీ) 1952

కె.ఎస్వీగా ప్రసిద్ధి చెందిన కె.ఎస్.వి. నరసింహారావు చిత్తూరు జిల్లా కురబాలకోట గ్రామంలో 29.07.1952న జన్మించారు. ఈయన తల్లిదండ్రులు వెంకటసుబ్బయ్య, వెంకటస్వామి. కె.ఎస్వీ రచనా వ్యాసంగంలో కవితలు, కథలు, శతకాలు, నవలలు పేర్కొనదగినవి. 1969 లో ఎమెస్కో వారి కథాంజలిలో ప్రచురితమైన వింత మనసు కథతో వీరి రచనా వ్యాసంగం ప్రారంభమైంది. మొదటి దశలో సీరియస్ రచనలు చేసిన వీరు ఆ తర్వాత పాపులర్ రచయితగా స్థిరపడ్డారు. వీరు దాదాపు 170 కథలని రాశారు. కె.ఎస్వీ రచనలలో 'ఐరావతి'(1973)అనే కథల సంపుటి ఉత్తమ కథల సంపుటిగా పేరు తెచ్చుకుంది. సరసమైన కథలు(2012) పేరుతో మరో కథల సంపుటిని వెలువరించారు. వీరి మొదటి సీరియల్ రొమాంటిక్ ఫిక్షన్ 'ప్రేమ' ప్రగతి పత్రికలో 1975లో ప్రచురించబడింది. ఈయన అనన్య(2012), పంచపాత్ర (భారతిలో 1976 నుండి సీరియల్‌గా వచ్చింది) (ఇటాలియన్ రచయిత లూయీ పిరాండేల్లో రాసిన ఒక నాటకం ఆధారంగా) అనే నవలలతో పాటూ జీవితానికో మలుపు, మిస్ కవిత బి. ఏ., రెండూ ఒక్కటే, రోదసి వంటి ఏడు నలలను రాశారు. కేఎస్వీ శతకం, వేణుగోపాల శతకం అనే రెండు శతకాలను కూడా రాశారు. టార్గెట్, గన్ పాయింట్,కీ, దాదా, రిమోట్ కంట్రోల్, విచిత్ర వంటి వ్యాపార నవలలు రాశారు.

3.43. సయ్యద్ జాఫర్ (1953)

సయ్యద్ జాఫర్ చిత్తూరు జిల్లా పుంగనూరులో 24.07.1953న జన్మించారు. ఈయన తల్లిదండ్రులు ఇమామ్‌బీ, సయ్యద్ హుసేన్‌లు. ఈయన రాసిన కథలలో 'నన్ను చంపేయండి', 'ముసలెద్దు', 'మెమొరాండం', 'చర్విత చర్వణం', 'భూమి గుండ్రంగా ఉంది', 'మా అమ్మ మళ్ళీ పుట్టింది' అనే కథలు, 'జాతర', 'రాయచోటికి చేటు' అనే కవితలు పేర్కొనదగినవి. దాదాపు 20 కథలు వివిధ పత్రికలలో 'విమల మానస' అనే కలం పేరుతో ప్రచురించారు.

3.44. వీరపల్లె వీణావాణి (వి. ఆంజనేయులు నాయుడు) (1955 – 2010)

చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం, తలపులపల్లె గ్రామంలో జన్మించిన వి. ఆంజనేయులు నాయుడు కలం పేరు వీరపల్లె వీణావాణి. చిన్నతనంలోనే చనిపోయిన తన చెల్లెలు పేరునే తన కలం పేరుగా మార్చుకొని సాహిత్య రచన కొనసాగించాడు. కవిగా, కథకుడిగా, నాటకకర్తగా, కళాకారుడిగా పేరు తెచ్చుకున్నాడు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి పురాణం సీత 'ఇల్లాలి ముచ్చట్ల'పై ఎం.ఫిల్., కేశవరెడ్డి నవలలపై పి.హెచ్ డి. చేశాడు. పరాజితుడు (1982 చతుర), దండకారణ్యం (1985 చతుర), రాకాసి కోన (విశాలాంధ్ర నవలల పోటీలో బహుమతి పొందింది), సర్పయాగం (యానాదుల జీవన విధానం తెలిపే నవల), పొలి అనే నవలలను ఈయన రాశారు. అయితే ప్రస్తుతం వీరు రాసిన పరాజితుడు, దండకారణ్యం అనే నవలలు మాత్రమే ప్రస్తుతం లభిస్తున్నాయి. వీరు అపురూపం భయం,

మూలధారసూత్రం వంటి కథలను రాశారు. వీరు 'పృధ్వీ సూక్తం' అనే నాటకం, 'అశ్రువు నా పేరు' అనే కవితా సంపుటి ప్రకటించారు.

3.45. కె.యస్. రమణ 1956:

కె.యస్. రమణ చిత్తూరు జిల్లా, కొండరాజు కాల్వ గ్రామంలో 07.10.1956న జన్మించారు. రాయలసీమ కథా సాహిత్యంలో ఒక మైలు రాయి లాంటి కె. సభా గారు వీరి తండ్రి, శ్రీవల్లీ దేవి వీరి తల్లి. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో చలం మ్యూజింగ్స్ పై పరిశోధన చేసి పట్టాను(1984) పొందారు. హైదరాబాదులోని డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖలో 1986 నుండి అధ్యాపకులుగా చనిపోయే వరకూ పని చేశారు.

'నిశీ'కవుల్లో ఒకరిగా రెండు కవితా సంకలనాలను (చీకటి తరగలు, తమోనలం) వెలువరించారు. తపన అనే సుదీర్ఘ కవితను పుస్తకంగా వేశారు. తర్వాత 2000లో 'నది' అనే కవితా సంపుటిని వెలువరించారు. దీనికి 2001లో నూతలపాటి సాహితీ సత్కారం లభించింది. 2011లో జడి అనే కవితా సంపుటిని వెలువరించారు. వీరి తొలి కథ 'మచ్చ'ను 1980 లో రాశారు. అప్పటి నుండి 25 కథలు రాశారు. వీటిల్లో 16 కథలతో మలుపు అనే కథా సంపుటిని వెలువరించారు.

'సాహితీసుధ' లిఖిత మాసపత్రిక (1973-75), సప్తగిరి (1979), దేవదత్తం (1981-83) పత్రికల్లో సంపాదక వర్గంలో పనిచేశారు. చిత్తూరు జిల్లా యువ రచయిత సంఘం(1975-80), చిత్తూరు జిల్లా రచయితల సహకార ప్రచురణ సంఘం (1981-83) మొదలైన వాటి నిర్వహణలో పాలు పంచుకున్నారు. డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం కృషిని వివరిస్తూ వీరు రాసిన పుస్తకం దూరవిద్య – ప్రాంతీయ భాషల అభివృద్ధి 1999లో వెలువడింది.

3.46. చిత్తూరి శైలకుమార్ 1956:

చిత్తూరు జిల్లా నుండి పాపులర్ సాహిత్యాన్ని అందిస్తున్న మరో రచయిత శైలకుమార్. వీరు చిత్తూరు జిల్లా కొంపెచెర్ల గ్రామంలో 19.12.1956న జన్మించారు. ఈయన తల్లిదండ్రులు రత్నమ్మ శ్రీనివాస వర్మలు. ఈయన రెండువందల కథలు రాశారు. ఈయన రాసిన కథల్లో 'కాలం లేనిది', 'ప్రేమ', 'సాధుజీవి' అనేవి పేర్కొనదగినవి. ఈయన రచించిన నవలలు ఏకాంత (ఆంధ్ర ప్రభ వార పత్రిక), రాక్షసి (ఉదయం దినపత్రికలో సీరియల్), రణక్షేత్రం, స్వప్న సింహాసనం, యుద్ధకాండ (ఆంధ్ర జ్యోతిలో డైలీ సీరియల్), కథా నాయకి, జంగిల్ కింగ్, ఫ్లైయింగ్ హారర్, డ్రీం గరల్, కామనయని, వరుడు కావలెను (ఆంధ్ర ప్రభలో సీరియల్గా వచ్చింది, అలాగే కన్నడలో సినిమాగా తీయబడింది), అష్ట పదులు, అంతర్యుద్ధం, ఆరోహణ, మహర్షి, సర్ప వ్యూహం, ఎల్ ఫర్ లవ్, వంశధార, అవంతిక (1992) ఇలా ముప్పైదాకా రాశారు. వీరి నవలలు మోతాదుకు మించని క్రైం, శృంగారాలతో కూడుకొని ఉంటాయి. ఈయన రాసిన 'శ్రీనివాస కళ్యాణం' నాటకం చిత్తూరు జిల్లాలో బహుళ ప్రచారం పొందింది.

3.47. తుమ్మల రామకృష్ణ 1957:

తుమ్మల రామకృష్ణగారు చిత్తూరు జిల్లా సోమల మండలంలో ఒక మారుమూల గ్రామమైన ఆవులపల్లెలో 12.10.1957న జన్మించారు. వీరి తల్లిదండ్రులు తుమ్మల మునివెంకటప్ప, సాలమ్మలు. ఈయన ప్రాథమిక విద్య స్వగ్రామంలోనూ, మాధ్యమిక విద్య పెద్ద ఉప్పరపల్లి, నెరబైలులో సాగింది. ఆ తర్వాత ఇంటర్మీడియట్ నుండి పి. హెచ్. డి. వరకు తిరుపతిలో తన పెద్దన్న (వెంకటముని) వద్ద ఉంటూ కొనసాగించారు. 1983లో ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి పర్యవేక్షణలో బారిష్టర్ పార్వతీశం – ఒక పరిశీలన అనే అంశంపై ఎం.ఫిల్., 1988లో ఆచార్య జి. ఎన్. రెడ్డి పర్యవేక్షణలో తెలుగులో హాస్య నవలలు అనే అంశంపై పిహెచ్.డి. చేసి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ ను పొందారు.

పరిశోధన పూర్తైన తర్వాత 1989లో యస్. వి. యు. పి. జి. సెంటర్ (ప్రస్తుతం యస్. కే.యు. పి. జి. సెంటర్), కర్నూల్ లో యూనివర్సిటీ లెక్షరర్ గా ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. ఆ తర్వాత 2004లో యునివర్సిటీ ఆఫ్ హైదరాబాదు (హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం)లో ఆచార్యులుగా, 2015 నుండి అక్కడ శాఖాధ్యక్షులుగా సేవలందించారు. ప్రస్తుతం ద్రావిడ విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా సేవలందిస్తున్నారు.

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. విద్యార్థిగా ఉన్నప్పటి నుండి పరిశోధక విద్యార్థిగా ఉన్నప్పటి వరకు ఈయనకు గురువులుగా కేతు విశ్వనాథ రెడ్డి, జి. ఎన్. రెడ్డి, మద్దూరు సుబ్బారెడ్డి, జి. నాగయ్యలతో మంచి పరిచయాలుండడం, అలాగే మధురాంతకం రాజారాం, వల్లంపాటి వెంకట సుబ్బయ లాంటి కథకులు, విమర్శకులతో ఆ సమయంలో పరిచయాలేర్పడడం, కేతు విశ్వనాథ రెడ్డి, జి. ఎన్. రెడ్డి గార్ల దగ్గర నిఘంటు ప్రాజెక్టులో ప్రాజెక్టు అసిస్టెంట్ గా పనిచేస్తున్న సమయంలో రాష్ట్రంలోని వివిధ రచయితలతో పరిచయాలు ఏర్పడడం, అలాగే యస్.వి.యు.లో ఉన్నప్పుడు కె. ఎస్. రమణ, సౌభాగ్య, రాసాని, నరేంద్ర, మహేంద్ర, మునిసుందరం, 'నిశీ' కవుల స్నేహాలతో ఈయన చుట్టూ ఒక సాహితీ వాతావరణ ఏర్పడింది. ఇలాంటి వాతావరణంలో నుండే రామకృష్ణ గారు కథకుడిగా ఎదిగారు.

వీరు రాసిన మొదటి కథ 'ఓ సాయంత్రం'. ఇది మార్చి 27, 1994 ఆంధ్రప్రభ (ఆదివారం అనుబంధం)లో ప్రచురితమైంది. ఆ తర్వాత ఈయన కథలను 'మట్టిపొయ్యి' (2004) అనే పేరుతో ప్రచురించారు. దీనితో పాటు 'తెల్లకాకులు', నల్లకోతులు అనే కథలను కూడా వీరు రాశారు. వీరి కథల్లో సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు నిండుగా దర్శనమిస్తాయి. ఈయన ఏ కథ రాసినా, ఏ వ్యాసం రాసినా అవి బహుమతి కోసమో, పురస్కారం కోసమో రాసినవిగా ఉండవు. ఈ వ్యవస్థ పట్ల అసహనంతో, సమాజంలో జరుగుతున్న అన్యాయాల్ని పట్టి చిత్రిక పట్టి చూపేవిగా ఉంటాయి. ఈయన రాసిన కథలు చాలావరకూ హిందీ, ఇంగ్లీష్, తమిళ, కన్నడ, మలయాళం, ఉర్దూ భాషల్లోకి అనువాదమయ్యాయి. తెల్లకాకులు కథపై

వచ్చిన స్పందన, విమర్శన వ్యాసాలూ కలిసి 'ఎక్కడివీ తెల్లకాకులు' అనే పేరుతో ఒక వ్యాస సంకలం వచ్చింది.

తుమ్మల రామకృష్ణ గారు రాప్తాడు గోపాలకృష్ణ, శ్రీనివాస మూర్తితో కలిసి 'మల్లె మంగలి కథలు'1996, 'ఫ్యాక్షన్ కథలు'1997 ప్రచురించారు. పల్లె మంగలి కథలు సంకలనం అప్పట్లో ఒక సంచలనాన్ని రేపింది. ఆ తర్వాత కర్నూలు సాహితీ మిత్రులతో కలిసి 'కథా సమయం' కథలు 2001, 'హైద్రావతి కథలు' 2003 ప్రచురించారు.

కథకుడిగానే కాక ఈయన ఆధునిక సాహిత్యంలో నవల, కథ, కవిత్వం, శతకం, పరిశోధన వంటి అంశాలపైన ఎన్నో వ్యాసాలను రాసి పరిచయం2004, బహుముఖం2009 అనే రెండు వ్యాస సంపుటాలుగా ప్రచురించారు. అలాగే వీరు రాసిన మరిన్ని వ్యాసాలు అవగాహన, అభిచందనం (పాఠాలు, ప్రసంగాలు) అనే పేర్లతో వచ్చాయి. అలాగే 'ముందు మాటలు ముక్తాయింపులు', 'హాస్య వ్యాసాలు', 'తెలుగులో హాస్య నవలలు', 'మన హాస్య గ్రంథాలు' అనేవి ముద్రణలో ఉన్నాయి.

వివిధ అంశాలమీద వీరు చేసిన రేడియో ప్రసంగాలు (41) ఆకాశవాణి కర్నూల్ కేంద్రంలో ప్రసారమయ్యాయి. అలాగే ఓపెన్ యునివర్సిటీలైన అంబేద్కర్ యునివర్సిటీకి, ఎస్. కె. యు. కి , పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంకి, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయంకి ప్రత్యేకమైన అంశాలల్లో కోర్స్ మెటీరియల్స్ ను తయారు చేశారు. ఈమధ్య ఈయన వృత్తి కథలపై ప్రత్యక శ్రద్ధతో తెలుగు కథాసాహిత్యంలో వచ్చిన వివిధ వృత్తులకు సంబంధించిన కథలను సేకరించి అడపం, రేవు, కొలిమి, సారే అనే పేర్లతో కథలను సంకలనాలుగా తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. అలాగే సీమ సాహితీ అనే సాహిత్య సామాజిక మాసపత్రిక సంపాదక వర్గంలో సభ్యుడిగా, పీపుల్స్ ఫర్ ఇండియా కర్నూల్ వైస్ చైర్మెన్ గా, రెడ్ క్రాస్ కర్నూల్ మెంబర్ గా వ్యవహరించారు. ఈయన ప్రతిభకు అంబేద్కర్ మెడల్, అలాగే వరల్డ్ పోయెట్రీ ఫస్ట్నల్లో లైఫ్ టైం అచీవ్ మెంట్ అవార్డులు వీరికి లభ్యమయ్యాయి.

3.48. వి. ఆర్. రాసాని (రాసాని వెంకట్రామయ్య) (1957)

రాసాని వెంకట్రామయ్య చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలంలోని 'కురవ పల్లె'లో 19.04.1957న జన్మించాడు. ఈయన తల్లిదండ్రులు ఎల్లమ్మ, సిద్ధయ్యలు. ఈయన ప్రాథమిక విద్యాభ్యాసం పులిచెర్ల మండలం, కమ్మపల్లెలోని పంచాయితీ సమితి ప్రాథమిక పాఠశాలలో జరిగింది. ఆ తర్వాత పులిచెర్లలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హైస్కూలు విద్య సాగింది. ఆ తర్వాత పీలేరు ప్రభుత్వ జూనియర్ కాలేజిలో ఇంటర్, తర్వాత బి.ఎ., ఎం.ఎ., ఎం.ఫిల్ (చిత్తూరు జిల్లాలోని వేడుక పాటలు – ఒక పరిశీలన), పిహెచ్.డి. (రాయలసీమ వేడుక పాటలు – ఒక పరిశీలన) తిరుపతిలోని ఎస్. వి. ఆర్ట్స్ కళాశాల, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోను సాగింది. రాసాని 1982–83లో ఎం.ఎ. పూర్తి కాగానే సదుంలో అప్పుడే ప్రారంభించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పార్ట్ టైం లెక్చరర్‌గా నాలుగు నెలలు పనిచేశాడు. తర్వాత 1983లో

తిరుమల తిరుపతి దేవస్థానం వారి యాజమాన్యంలో నడుపబడుతున్న శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా చేరాడు. ఆ తర్వాత పదోన్నతి పొంది ఎస్.వి. ఆర్ట్స్ డిగ్రీ కాలేజీలో పని చేసి 2017లో పదవీ విరమణ చేశారు.

1977లో సాహితీ కల్పన విజయవాడ వారు నిర్వహించిన కథల పోటీలో వీరు రాసిన 'మధుర క్షణం' అనే కథ సాధారణ ప్రచురణకు ఎన్నికై ప్రచురింపబడింది. ఇదే వీరి మొదటి కథ. ఆ తర్వాత కొంతకాలం కథా సాహిత్యానికి దూరమై విపరీతంగా కవితలు, వ్యాసాలు రాస్తూ నాటకాలేసుకుంటూ ఉండిపోయారు. తర్వాత 1988లో 'నేలరాలిన వసంతం' కథతో తిరిగి కథా సాహిత్యంలోకి ప్రవేశించి కథలు రాయడం మొదలుపెట్టారు. ఇప్పటి వరకూ రాసాని వివిధ పత్రికల ద్వారా వందకు పైగా కవితలు, వందకు పైగా కథలు, తొమ్మిది నవలలు, ఐదు నాటికలు, నాలుగు నాటకాలను, అనేక వ్యాసాలను వెలువరించాడు.

రాసాని నవలలు: చీకటి రాజ్యం (1994), మట్టి బతుకులు (1996), బతుకాట (2005), ఏడో గ్రహం (2012), ముద్ర (2014), పరస (2015), చీకటి ముడులు (2015), వలస (2016), వక్రగీత (2021). ఈయన నవలలు చాలావరకు చతురలో ప్రచురించబడ్డాయి. కథా సంపుటాలు: మెరవణి (2005), పయనం (2007), మావూరి కథలు (2012), మృత్యుక్రీడ (2015), ముల్లుగర్ర (2016), విషప్పురుగు (2017), శ్రీకృష్ణ దేవరాయల కథలు. ఈయన నవలలు, కథలు వివిధ భాషల్లోకి అనువాదం కూడా అయ్యాయి. నాటకాలు: కాటమరాజు యుద్ధం, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ, చెంచిత, అజ్ఞాతం. నాటికలు: స్వర్గానికి ఇంటర్వ్యూ, దృష్టి, జలజూదం, మనిషి పారిపోయాడు, నేలతీపి. సంపాదకత్వం వహించినవి: 'కథావార్షిక'కు గత పదేళ్లుగా, మునిపల్లె రాజు కథలు, తెలుగు కథ – దళిత, గిరిజన, మైనారిటీ జీవితం. పరిశోధనా గ్రంథాలు: జానపద గేయాలలో పురాణాలు, వేడుక పాటలు, పని పాటలు, ప్రసిద్ధ తెలుగు నాటక పద్యాలు, అమరజీవి పొట్టి శ్రీరాములు

అలాగే ఈయన కాలమ్ రచయితగా కూడా ప్రసిద్ధుడే. కామధేను దినపత్రికలో 'రాయలసీమ నటరత్నాలు' అనే శీర్షికను 1988 నుండి 1994 వరకు నడిపాడు. ఆంధ్రప్రభ వారపత్రికలో 'ఇది తిరుపతి' శీర్షికన 1992 నుండి 1994 వరకు నడిపాడు. ఆంధ్రభూమి దినపత్రికలో 'మావూరి కవితలు' వారం వారం ఒక కథ చొప్పున 1998 నుండి 2000 వరకు రాశాడు. కళా దీపికలో 2016 నుండి లోకులు అనే ఒక వాక్య కవితలు రాశారు.

మధురాంతకం రాజారాం సాహిత్య సంస్థ నిర్వాహకుడిగా రాసాని, మధురాంతకం నరేంద్ర సహ సంపాదకత్వంలో కథా వార్షిక 2000, కథా వార్షిక 2001, కథావా ర్షిక 2002 అనే కథానికల సంకలనాలను ప్రచురించారు. ఈయనకు ఎన్నో సాహిత్య సంస్థలలో కూడా సభ్యత్వాలు, సంబంధ బాంధవ్యాలు ఉన్నాయి. 1986లో తిరుపతి కేంద్రంలో ఆవిర్భవించిన 'సాహిత్య కళాపీఠం' అనే సంస్థకు వ్యవస్థాపక కార్యదర్శిగా ఉండేవాడు. కథా వేదిక జిల్లా కన్వీనర్‌గా వ్యవహరించాడు. అలాగే 1989లో మధురాంతకం రాజారాం స్మృత్యర్థం

ఆవిర్భవించిన 'మధురాంతకం రాజారాం సాహిత్య సంస్థ'కు వ్యవస్థాపక కార్యదర్శిగా వ్యవహరిస్తూ ఉన్నాడు.

1996లో 'చీకటి రాజ్యం' నవలకు కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారం లభించింది. మట్టి బతుకు నవలకు చతుర పోటీలో ప్రత్యేక బహుమతి లభించింది. 2001లో అమెరికా వారి 'తానా' అవార్డు 'బతుకాట' నవలకు వచ్చింది. అలాగే దీనికి తెలుగు విశ్వవిద్యాలయం ధర్మనిధి పురస్కారం కూడా దక్కింది. మెరవణి కథలకు విమలా శాంతి పురస్కారం, పయనం కథలకు శ్రీ శ్రీ పురస్కారం, అధికార భాషా పురస్కారం వీరి ప్రతిభకు లభించిన అవార్డులు.

3.49. మధురాంతకం నరేంద్ర (1957)

మధురాంతకం నరేంద్ర చిత్తూరు జిల్లా, పాకాల మండలం, రమణయ్యగారి పల్లెలో 1959, జూలై 16న (మార్చ్ 6) జన్మించాడు. ఈయన తల్లి శ్రీమతి నాగభూషణమ్మ, తండ్రి మధురాంతకం రాజారాం. ఈయన ప్రాథమిక విద్య దామల చేరువులో సాగింది. పదో తరగతి అయిన తర్వాత నరేంద్ర పాలిటెక్నిక్ లో డి.ఫార్మసీని, ప్రైవేటుగా ఇంటర్మీడియట్ ను పూర్తి చేశాడు. ఆ తరువాత బి.ఏ. పూర్తి చేశాడు. తరువాత శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆంగ్ల సాహిత్యంలో ఎం.ఎ, రవీంద్రనాథ్ టాగూర్ కథలపై ఎం.ఫిల్, నయనతార సెహగల్ రచనలపై పిహెచ్.డి చేశాడు.

తాడిపత్రి గవర్నమెంటు డిగ్రీ కాలేజీలో ఒక సంవత్సరం పనిచేశాక శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా, అసోసియేట్ ప్రొఫెసర్ గా, ప్రొఫెసర్ గా పనిచేసి 2019లో పదవీ విరమణ పొంది ప్రస్తుతం తిరుపతిలో ఉంటున్నారు. వీరు 'చివరికి దొరికిన జవాబు' అనే పేరుతో మొదటి కథ రాశాడు. తరువాత చందమామ, ఆంధ్రజ్యోతి, ఆంధ్రపత్రిక, ఆంధ్ర ప్రభ లాంటి వార పత్రికల్లో అనేక కథలు ప్రచురితమయ్యాయి. ఇప్పటి వరకూ తొంభై కథలను రాశారు అవి ఐదు కథా సంపుటాలుగా వెలువడినాయి. అలాగే ఈయన ఐదు నవలలను, ఎనిమిది నాటికలను రాశారు. వాటిలో రెండు నాటికలను ప్రచురించారు. 24 కవితల వరకూ రాశారు. అందులో 17కి పైగా వివిధ పత్రికల్లో వచ్చాయి. అయితే ఇవి పుస్తకంగా ఇంకా రాలేదు. ఇప్పుడు ఒక కవితా సంపుటి, వ్యాస సంకలం ముద్రణలో ఉన్నట్లు తెలుస్తూంది.

ఈయన మధురాంతకం రాజారాం స్మృత్యర్థం 'మధురాంతకం రాజారాం సాహితీ సంస్థ'ను స్థాపించి (1999) దానికి సంచాలకులుగా ఉంటూ ప్రతి ఏటా కథలను ఎంపిక చేసి కథా కోకిల పురస్కారంను బహుమతిగా ఇస్తున్నారు. అలాగే ఆ కథలను కథా వార్షిక పేరుతో సంకలంగా తెస్తున్నారు. ఈయన సాహితీ రంగంలో చేసిన కృషికి గాను అనేక అవార్డులను పొందారు. కథ అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారంతో పాటు మద్రాసు తెలుగు అకాడమీ పురస్కారం, జ్యేష్ట పురస్కారం, ఆటా పురస్కారం, మెక్సికో విశ్వవిద్యాలయ పురస్కారం, కేతు విశ్వనాథరెడ్డి పురస్కారం ఇలా అనేక పురస్కారాలను పొందారు.

ఈయన రాసిన కథలు 'కుంభమేళా' (1999), 'అస్తిత్వానికి అటు ఇటు' (2005), 'రెండేళ్ళ పద్నాలుగు' (2010), 'వెదురు పువ్వు' (2015), 'నాలుగుకాళ్ళ మండపం' (2019) అనే సంపుటాలుగా వెలువడ్డాయి. వీటితో పాటూ రూపాంతరం (2015) అనే ఒక కథ ఒక నాటిక గల పుస్తాకాన్ని, పాఠాంతరం(2015) అనే ఒక కథ నాటిక గల పుస్తకాన్ని వెలువరించారు. నవలలు: 'సహగమనం' (ఇది భారతిలో 1985 – 1986 వరకు సీరియల్ గా వచ్చింది), 'కొండకింద కొత్తూరు' (2015), 'ఆమ్ స్టర్ డాంలో అద్భుతం' (2013), 'భూ చక్రం' (2013), 'మనోధర్మ పరాగం' (2020). వీటితో పాటూ కొన్ని రచనలను తెలుగులో నుండి ఆంగ్లంలోకి, ఆంగ్లం నుండి తెలుగులోకి అనువాదం కూడా చేశారు. అలాగే వీరు రాసిన అనేక కథలు, నాటికలు, కవితలు రేడియో ప్రసారాలలో వచ్చాయి.

3.50. మేర్లపాక మురళి (1957)

చిత్తూరు జిల్లా నుండి పాపులర్ నవలలు రచించిన వారిలో మేర్లపాక మురళి ఒకరు. ఈయన రేణిగుంట మండలం వెదుళ్ళ చెరువు గ్రామంలో 1957 జూలై 2న జన్మించారు. వీరి తండ్రి నారాయణస్వామి, తల్లి రామలక్ష్మమ్మ. మురళి మొదటి కథ 'తెల్ల కిరణం' ఆంధ్రజ్యోతి వీక్లీలో ప్రచురితమైంది. వీరు ఇప్పటివరకు పది కథలు, ఇరవైకి పైగా నవలలు రాశారు. వీరి నవలల్లో ఎక్కువగా శృంగారమే ప్రధానాంశంగా ఉంటుంది. ఒక రకంగా శ్రుతి మించిన శృంగారం అని చెప్పొచ్చు. ఈయన రాసిన నవలలు: శృంగారపురం ఒక కిలోమీటర్, చెక్, కవ్వించకే మనసా, కలగంటినే చెలీ, రంగుల వల, అతడు ఆమెను జయించాడు, ఈ రేయి నీదోయి, ప్రేమించండి ప్లీజ్, పగలే వెన్నెల, నీ మీద మనసాయెరా, రారా మాఇంటి దాకా (1995), అనాథ మహిళా సదన్(రిజిస్టర్డ్), మగ బుద్ధి, జైలు, చీకటికి అవతల, ఇట్లు నీ చిలక (2011), మా వూరి అమ్మాయి ప్రేమకథ, క్యాంపస్ (2009), నీకు నాకు మధ్య, వేళకాని వేళ (2004). రెప్పలేని రాత్రి.

3.51. కె.యం బాలరాజు (1958)

కె.యం. బాలరాజు చిత్తూరు జిల్లా, కుప్పం తాలూకా రాళ్ళబూదుగూరు గ్రామంలో 01.10.1958న జన్మించారు. ఈయన తల్లిదండ్రులు రుక్మిణమ్మ, మునెప్పలు. ఈయన రచించిన 'స్వేచ్ఛ', 'అఆఇఈ', 'కార్గిల్', 'ఎకె 47' అనే కవితలను, 'పూదండ', 'సందీశ్వరం' అనే కథలను, 'శ్రీనివాస రామానుజం', 'సంపంగి', 'తెలుగు గంగ', 'మారింది యువతరం' అనే వ్యాసాలను, 'కాణిపాకం', 'అర్ధగిరి సంజీవరాయుడు', 'శివగంగ' అనే శతకాలను, 'కార్టూన్ నాటిక', 'ఎయిడ్స్ నాటిక' అనే రేడియో నాటికలు పెర్కొనదగినవి.

3.52. మధురాంతకం మహేంద్ర (1959 – 1998)

చిత్తూరు జిల్లా పాకాల మండలంలోని దామల్ చెరువు గ్రామంలో మధురాంతకం మహేంద్ర 16.07.1959న జన్మించాడు. ఈయన తల్లిదండ్రులు నాగభూషణమ్మ, మధురాంతకం రాజారాంలు. ఈయన ప్రాథమిక, హైస్కూల్ విద్య దామల చెరువు ప్రభుత్వ పాఠశాలలో

కొనసాగింది. తర్వాత తిరుపతి యస్.వి. జూనియర్ కళాశాలలో బై.పి.సి.ని, ఆర్ట్స్ కళాశాలలో బి.యస్సీ పూర్తి చేశాడు. ఆ తరువాత ఎమ్మెస్సీ ఫిజిక్స్ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పూర్తి చేశాడు. ఈయన శ్రీ వేంకటేశ్వర గ్రామీణ బ్యాంకులో ఉద్యోగరీత్యా మేనేజర్‌గా స్థిరపడినాడు. ఈయన జూన్ 11–1998లో జ్వరంతో మరణించారు.

స్వర్ణసీమకు స్వాగతం అనే నవలను (1991), పర్యవేలా తరంగాలు అనే కవితా సంపుటాన్ని, కనిపించని కోయిల (1998) అనే కథా సంపుటాన్ని రాశారు.

మహేంద్ర కవి, చిత్రకారుడు, నవలాకారుడు, అంతకు మించి మంచి కథకుడు. అతను రాసిన 'స్వర్ణసీమకు స్వాగతం' నవలను నేషనల్ బుక్ ట్రస్ట్ వారు అత్యుత్తమ భారతీయ నవలగా ఎంపిక చేశారు. ప్రస్తుతం అన్ని భారతీయ భాషల్లోకి అనువాదం చేయబడుతోంది. వారి కథలకు వాళ్లే చిత్రాలు వేసుకుని ప్రచురించేవాళ్లు అరుదుగా ఉంటారు. అలాంటి వారిలో మహేంద్ర కూడా ఒకడు. ఈయన రాసిన కనిపించని కోయిల కథా సంపుటంలోని ప్రతి కథకూ ఒక్కొక్క అందమైన చిత్రాలను వేసి ప్రచురించుకున్నారు.

3.53. పేట శ్రీనివాసులురెడ్డి (పేటశ్రీ) (1959)

పేట శ్రీనివాసులురెడ్డి చిత్తూరు జిల్లా తిరుపతి బండ్ల వీధిలో 10.01.1959న జన్మించారు. ఈయన తల్లిదండ్రులు పేట చెంగమ్మ, పేట నారాయణరెడ్డి. ప్రాథమిక విద్య మొదలు బీ.కాం., ఎం.ఎ., పిహెచ్.డి., పి.జి డిప్లొమా ఇన్ ఫోటోగ్రఫీ, పి.జి డిప్లొమా ఇన్ ఎఫీగ్రఫీ ఇలా వీరి చదువు అంతా తిరుపతిలోనే సాగింది. చిత్తూరుజిల్లా శృంగార జానపద గేయాలు అనే అంశంపైన పరిశోధన చేసి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి పిహెచ్.డి పట్టాను పొందారు. వీరు 1992లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో చేరి 2007లో ప్రొఫెసర్ అయ్యారు. తర్వాత తెలుగు శాఖాధిపతిగా, డీన్‌గా వివిధ హోదాల్లో పనిచేశాను. 2019లో రాష్ట్ర విభజన తరువాత ఏర్పాటైన తెలుగు అకాడమికి తొలి డైరెక్టర్‌గా నియమితులై కొంతకాలం ఈయన సేవలందించారు. ఇటీవల ఆచార్యులుగా శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ నుండి పదవీ విరమణ పొంది తిరుపతిలోనే నివాసముంటున్నారు.

ఈయన రచనలు ఎక్కువగా జానపద సాహిత్యానికి, అందులోనూ తిరుపతి ప్రాచీన చరిత్రకు సంబంధించినవి కనిపిస్తాయి. 'జానపద శృంగార గేయాలు', 'జానపద గేయాల్లో శ్రీ వేంకటేశ్వరుడు', 'చిత్తూరు జిల్లా పల్లె పదాలు', 'చిత్తూరు జిల్లా కోలాటం పాటలు', 'తిరుపతి గంగ జాతర', 'తిరుమల తిరుపతి గ్రామదేవతలు', 'బూతు ఆచారాలు', 'కొండ కథలు', 'రాయలసీమ జానపద కళలు', 'వ్యాస తోరణం', 'తిరువీధులు', 'అంతా జానపదం', 'చిత్తూరు జిల్లా జానపద విజ్ఞానం', 'తెలుగు ఐతిహ్యాలు' ఇలా ఇరవై పుస్తకాలదాకా వీరు రాశారు.

ఈయన రాసిన కథలు ఆంధ్రప్రభ వీక్లీలో బోరుబావి, చినుకులు, అద్దెబిడ్డ, మబ్బులు మూసిన జాబిలి, తిరుపతి స్మశానంలో ఒక రాత్రి, వరుణదేవ–రాజపుత్ర, దేవుడు వరమందిస్తే, ఇంటర్నెట్ పెళ్లి, వ్యాలంటైన్స్ డే, జూ పార్క్, సొగసు చిత్రం వంటి కథలు ప్రచురితం అయ్యాయి.

వాటిని పుస్తకంగా తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. వీరికి తిరుపతి కథలు, కొండ కథలు, గంగ జాతర పుస్తకాలు ఎంతగానో పేరు తెచ్చాయి.

1995లో తిరుపతి గంగ జాతరకు ఆంధ్రప్రదేశ్ జానపద పరిషత్ వారి రామరాజు జానపద విజ్ఞాన అవార్డు, 2004లో బి.ఎన్.శాస్త్రి అవార్డు. 2013లో ఆంధ్రప్రదేశ్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2014లో జానపద కళాపీఠం అవార్డు. 2016లో శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం ఇలా వీరికి ఇప్పటి వరకూ 17 అవార్డులు వచ్చాయి.

3.54. నామినిసుబ్రమణ్యం నాయుడు (1960) :

నామిని చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలం, మిట్టూరులో 10.03.1960న జన్మించాడు. తల్లిదండ్రులు శ్రీమతి చిన్నక్క, నారప్ప నాయుడు. వీళ్ళది వ్యవసాయ ప్రధానమైన కుటుంబం. ప్రాథమిక పాఠశాల నుంచి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎం.ఎస్సీ వరకు చదివారు. చదువైపోగానే ఈనాడు తిరుపతి ఎడిషన్ లో సబ్ ఎడిటర్ గా చేరాడు. అక్కడే ఒకటిన్నర సంవత్సరం పనిచేశాడు. తరువాత దాసరి నారాయణరావు ఉదయం లో చేరి హైదరాబాద్ కు వచ్చేశాడు. 1985లో ఆంధ్రజ్యోతి హైదరాబాద్ సంచిక ప్రారంభించినపుడు ఏబీకే ప్రసాద్ ఆయన్ను అందులోకి రమ్మని ఆహ్వానిస్తే అందులో కొంతకాలం పనిచేసి, తరువాత తిరుపతి జ్యోతి సంచిక ప్రారంభమైనాక హైదరాబాదు నుంచి తిరిగి వచ్చి తిరుపతిలో చేరాడు. ఇలా పని చేస్తూనే రచనా వ్యాసంగం వైపు దృష్టి మళ్ళించి అనేక కథలను, నవలలను రాశాడు. నామిని మొదటి కథ 'మళ్ళీ జన్మించు మహాత్మా' ఆంధ్రప్రభలో ప్రచురితమైంది.

ఈయన పచ్చనాకు సాక్షిగా (1985), సినబ్బ కతలు(1987), మిట్టూరోడి కతలు (1990) అనే కథా సంపుటాలను, పాలపొదుగు (1985), సుందరమ్మ కొడుకులు (1985), మునికన్నడి సేద్యం (1988) అనే నవలలను రాశారు. ఈ ఆరు పుస్తకాలను కలిపి 2009లో ఒక సంపుటిగా తీసుకొచ్చాడు. వీటితో పాటూ మూలింటామె 2014 అనే నవలను, ఇస్కూలు పిలకాయల కత, పిల్లల భాషల్లో ఆల్జీబ్రా, చదువులా? చావులా??, మా అమ్మ చెప్పిన కతలు, పిల్లల్తో మాట్లాడాల్సిన మాటలు అనే ఐదు పుస్తకాలు కలిసిన పుస్తకాన్ని నామిని ఇస్కూలు పుస్తకం (2010) అనే పేరుతో ప్రచురించారు. కొళ్ళో జగ అనే పేరుతో ఈయన కైకట్టిన కథలను పుస్తకంగా వేశారు.

3.55. ఓలేటి నరసింహులు గుప్త (1960):

విలేఖరి (ది-హిందూ, ఈ సంఘం) అయిన వీరు మదనపల్లెకు చెందిన కథకులు. వీరి 'పొడుపు కథ' అనే కథ 06.07.1960 నాటి ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురితమైంది. ఇదే కథ మదనపల్లె రచయితల సంఘం ప్రచురించిన 'మ. ర. సం. కథాగుచ్ఛం'(2008)లో కూడా ప్రచురితమైంది.

3.56. గోపిని కరుణాకర్ (1966):

చిత్తూరు జిల్లా చిన్న గొట్టిగల్లు మండలం యలమంద గ్రామంలో 26.04.1966న వీరు జన్మించారు. వీరి తల్లిదండ్రులు గోపిని హనుమంతునాయుడు, కళ్యాణమ్మ. వీరు ప్రాథమిక విద్యను స్వగ్రామంలోను, హైస్కూల్ విద్యను తలపులలోను, ఇంటర్, డిగ్రీని పీలేరులోను పూర్తి చేశారు. వీరు ప్రస్తుతం టి.వి. సీరియల్స్ కు దర్శకుడుగాను, సినిమాలకు సహాయ దర్శకుడుగాను పని చేస్తున్నారు. వీరి మొదటి కథ వంగిన మొక్క 1991 ఆంధ్ర ప్రభ సచిత్ర వారపత్రికలో అచ్చయ్యింది. వీరి కథలు దీపం చెప్పిన కథలు (ఫీచర్) (నవ్య వారపత్రికలో 19 మే 2004 నుండి 22 నవంబర్ 2004 వరకు ప్రచురితమైనాయి), భారతం బొమ్మలు అనే రెండు సంపుటాలుగా వెలువడ్డాయి. తర్వాత వీటిని ఒకే పుస్తకంగాను వేశారు. వీరి భారతం బొమ్మలు కథలకు మధురాంతకం రాజారాం సాహిత్య సంస్థ వారి కథాకోకిల పురస్కారం లభించింది. వీరు రాసిన అనేక కవితలు వివిధ పత్రికల్లో అచ్చయ్యాయి. అలాగే సాక్షి ఆదివారం అనుబంధంలో 'తిరుపతి కొండ కథలు' ధారావాహికంగా వచ్చాయి.

3.57. జిల్లేళ్ళ బాలాజీ (1966):

వీరు తిరుత్తణిలో 01-05-1966న జన్మించారు. పార్వతి విశ్వనాథం వీరి తల్లిదండ్రులు. వీరి తండ్రి ఉద్యోగ రీత్యా చిత్తూరులో స్థిరపడినారు. వీరు హైస్కూల్ విద్యను గిరింపేటలో, ఇంటర్ కన్నన్ జూనియర్ కళాశాలలో, డిగ్రీ పి.వి. కె.ఎన్ కళాశాలలో. ఎం.ఎ., పిహెచ్.డి. లను శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పూర్తి చేశారు. వీరు తిరుపతిలోని ఒక ప్రైవేటు పాఠశాలలో చాలా కాలంగా తెలుగు, సంస్కృత ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. వీరు యాభైకి పైగా కవితలను, నూట ఇరవై ఐదుకి పైగా స్వతంత్ర, అనువాద కథలను, ఎనిమిది అనువాద నవలలను, కొన్ని వ్యాసాలను రాశారు. సిక్కెంటిక (2013), వొంతు (2016), ఉండు నాయనా, దిష్టి తీస్తా (2019) అనేవి వీరి స్వతంత్ర కథా సంపుటాలు. అలాగే మైత్రీవనం(2013) పేరుతో విభిన్న కథల సంపుటిని పేరూరు బాలసుబ్రమణ్యం, రాచపూటి రమేష్ లతో కలిసి ప్రచురించారు. మాట్లాడే పక్షి వీరి పిల్లల కథల సంపుటి. కల్యాణి, అనుబంధాలు, గంగ ఎక్కడికి వెళుతోంది మహారాజశ్రీ మంత్రి గారు, ఒకటి+ఇకటి=మూడు, ఒక వర్షం కురిసిన రాత్రి, ఎదురు చూపులు, గతించిన కాలాలు అనేవి వీరి అనువాద నవలలు. వీరు ఎక్కువగా తమిళ రచయిత జయకాంతన్ రచనలను తెలుగులోనికి అనువదించారు. 2011లో కల్యాణి నవలకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. వీరి సిక్కెంటిక కథా సంపుటికి గురజాడ కథా పురస్కారం, కుప్పం రెడ్డెమ్మ సాహిత్య పురస్కారం లభించాయి. వీరు రాసిన కొన్ని కథలు తిరుపతి, కడప రేడియో కేంద్రాలల్లో ప్రసారమయ్యాయి.

3.58. రాచపూటి రమేష్ (1967):

వీరు 27-07-1967లో పద్మావతమ్మ, సుబ్బారావులకు తిరుపతిలో పుట్టారు. న్యాయశాస్త్రంలో డిగ్రీ, ఇంగ్లీష్ లో పి.జి. వరకూ చదివిన వీరి విద్యాభ్యాసం మొత్తం తిరుపతిలోనే

సాగింది. వీరు రాష్ట్ర ప్రభుత్వ చేనేత జౌళి శాఖలో సహాయ అభివృద్ధి అధికారిగా ప్రస్తుతం తిరుపతిలో పనిచేస్తూ ఉన్నారు. వీరు ఇప్పటి వరకూ ఐదు కథా సంపుటాలను ప్రచురించారు. అవి: గాలి గోపురం (2007), అందమైన అబద్ధం (2008), నిర్ణయం (2011), వలయం (2013), రాగాల రహస్యం (2017). అలాగే మైత్రీవనం (2013) పేరుతో విభిన్న కథల సంపుటిని జిల్లేళ్ళ బాలాజీ పేరూరు బాలసుబ్రమణ్యంలతో కలిసి ప్రచురించారు. సంపాదకుడిగా మినీ కథా సౌరభం, రమణీయ కథలు, హాస్య కథ అనే సంకలనాలను పలువురితో కలిసి ప్రచురించారు. వీరు మూడు నవలలను రాశారు. అవి: దొంగలు బాబోయ్ జాగ్రత్త (2007) (ఆంధ్రభూమి మంత్లీలో ప్రచురితం), అజ్ఞాత పర్వం (2009) (స్వప్న మంత్లీ సీరియల్), చంద్రహారం (అముద్రితం). ఇంగ్లీష్ నుండి తెలుగులోకి నలభై కథలను, తెలుగు నుండి ఇంగ్లీష్ లోకి ఇరవై కథలను అనువాదం కూడా చేశారు.

3.59. వుజ్జని రవినాయుడు 1967:

రవినాయుడు చిత్తూరు జిల్లా తిరుపతిలో 01.12.1967న జన్మించారు. ఈయన తల్లిదండ్రులు యశోద, దొరస్వామి నాయుడులు. ఈయన రచించిన కథలలో 'ఆడది', 'ఆసుపత్రి', 'ఎయిడ్స్', 'అక్షర తపస్మాన్' అనే కథలు పేర్కొనదగినవి. ఈయన రాసిన వ్యాసాలలో 'కలలపై నేటి పరిస్థితి', 'కళాకారుడు–జీవనగతి' (నాడు–నేడు) వివిధ పత్రికలలో ప్రచురితమైనాయి. ఈయన రాసిన నాటికలలో 'ఒక గీతం', 'ఓ అమ్మాయి కథ', 'ఓ మహిళా మేలుకో', 'ఆశ్చర్యం', 'కలలు' అనే నాటికలు అనేక చోట్ల ప్రదర్శింపబడినవి.

3.60. పేరూరు బాలసుబ్రమణ్యం (1971):

పేరూరు బాలసుబ్రమణ్యం తిరుపతి సమీపంలోని కోరమేనుగుంట గ్రామంలో 20-07-1971న చిన్నమ్మ, వెంకటేశురెడ్డిలకు జన్మించారు. వీరు సప్తగిరి మాసపత్రికలో కాంట్రాక్టు పద్ధతిలో ఎడిటర్ గా పనిచేశారు. ప్రస్తుతం రియలెస్టేట్ వ్యాపారంలో జీవితాన్ని కొనసాగిస్తున్నారు. వీరు ప్రస్తుతం తిరుపతిలోని తెలుగు భాషోద్యమ సమితి ప్రధాన కార్యదర్శిగా, ప్రత్యేక ప్రతిభావంతుల సఘటన్ జిల్లా కన్వీనర్ గా భాద్యతలను నిర్వర్తిస్తున్నారు. వీరు రాసిన కవితలను తొలకరి పేరుతో సంపుటిగా ప్రకటించారు. ఇప్పటి వరకూ వీరు నలభైకి పైగా కథలను రాశారు. అవి వివిధ పత్రికల్లో అచ్చయ్యాయి. జిల్లేళ్ళ బాలాజీ, రాచపూటి రమేష్ లతో కలిసి మైత్రీవనం (2013) అనే పేరుతో ఒక కథా సంకలనాన్ని తీసుకువచ్చారు. ఇందులో వీరివి ఆరు కథలు ఉన్నాయి.

3.61. సుంకోజి దేవేంద్రాచారి (1974):

చిత్తూరు జిల్లా కె.వి. పల్లి మండలం గుడ్రెడ్డిగారిపల్లెలో ఈశ్వరమ్మ రెడ్డెప్పాచారి అనే దంపతులకు 1974 జూలై 22న వీరు జన్మించారు. వీరు ప్రాథమిక విద్యను గుడ్రెడ్డిగారిపల్లెలోను, ఉన్నత విద్యను కె.వి. పల్లిలోను, ఇంటర్ ను పీలేరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలోను పూర్తి చేశారు. ప్రస్తుతం వీరు సాక్షి దినపత్రికలో సీనియర్ సబ్ ఎడిటర్ గా పనిచేస్తున్నారు. వీరు

నూటయాభై కవితలను, ఆరు నవలలను, వందదాకా కథలను, కొన్ని వ్యాసాలను రాశారు. వెన్నెముక (2004), నీరు నేల మనిషి (2005), రెక్కాడినంత కాలం (2008), మిస్సింగ్ (2015), అమ్మానాన్నకు (2015), మనిషి (2016) అనేవి వీరి నవలలు. వీరి నవలల్లో నీరు నేల మనిషి నవలకు తానా పురస్కారం, రెక్కాడినంత కాలం నవలకు రాష్ట్ర సాంస్కృతిక శాఖ పురస్కారం లభించాయి. అన్నం గుడ్డ (2007), దృశ్యాలు మూడు ఒక ఆవిష్కరణ (2011) అనేవి వీరి కథా సంపుటాలు. వీరు రాసిన కథనాలు 'మన మంచి ఆటలు' అనే పేరుతో పుస్తకంగా వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ వారి ఉత్తమ యువరచయిత పురస్కారం, రంగినేని ఎల్లమ్మ సాహితీ పురస్కారం, విశాల సాహితీ బి. ఎస్. రాములు కథా పురస్కారం, భారతీయ భాషా పరిషత్ యువ పురస్కారం అనేవి వీరి ప్రతిభకు దక్కిన పురస్కారాలు.

3.62. పలమనేరు బాలాజీ (1974):

పుట్టిన ఊరిని ఇంటి పేరుగా పెట్టుకొని రచనలు చేస్తున్న వ్యక్తి పలమనేరు బాలాజీ. ఈయన అసలు పేరు కె. ఎన్. బాలాజీ. 19-01-1974లో వీరు జన్మించారు. జయమ్మ, నాగయ్యలు వీరి తల్లిదండ్రులు. వీరు ఎం.ఏ. (ప్రభుత్వ పాలనా శాస్త్రం) వరకూ చదువుకున్నారు. వీరు మొదట చిత్తూరు జిల్లా పెద్ద పంజాణి మండల ఎం.పి.డి.ఒ కార్యాలయంలో పనిచేశారు. ప్రస్తుతం వి. కోట మండల ఎం.పి.డి.ఒ కార్యాలయంలో పని చేస్తున్నారు. కవిత, నవల, కథ, వ్యాసం లాంటి సాహిత్య ప్రక్రియల్లో అభినివేశం ఉన్న సాహిత్యకారుడు.

మాటల్లేని వేళ వీరి కవితా సంపుటి. నేల నవ్వింది వీరు రాసిన ఏకైక నవల. దీనికి చతుర నవలల పోటీలో బహుమతి లభించింది. గదిలోపల గోడ (2009), చిదురించే మనుషులు (2014), ఒక సాయంత్రం త్వరగా ఇల్లు చేరినప్పుడు (2018) అనేవి వీరి కథా సంపుటాలు. మాటల్లేని వేళ కవితా సంపుటానికి స్మైల్ పురస్కారం, నేల నవ్వింది నవలకు కందుకూరి స్మారక పురస్కారం, గదిలోపల గోడ కథా సంపుటికి తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం వీరికి దక్కాయి.

3.63. నక్కల ప్రభాకరరెడ్డి (1977):

చిత్తూరు జిల్లా వెంగంపల్లిలో 5.7.1977న వీరు జన్మించారు. విద్యార్థి దశలో నిరుద్యోగంపై ఉద్యమాలు నిర్వహించారు. వివిధ సామాజిక సమస్యలపై పలు వ్యాసాలు, కథలు రాశారు. తెలుగు భాష పరిరక్షణ కోసం నిరాహార దీక్షలు, పాదయాత్రలు చేశారు. జిల్లా రచయితల సంఘం కార్యదర్శిగా కూడా పనిచేశారు. చైతన్యం, స్ఫూర్తి, నాయకుడి కథ, ర్యాగింగ్ (ఆంధ్రజ్యోతి వారపత్రిక 28.3.1995), వందన మనస్సు (బంగారు భారతం మాస పత్రిక మర్చి 1995) వంటి కథలు రాశారు. రాలని పూవు వీరు రాసిన ఏకైక నవల.

3.64. కంపల్లె రవిచంద్రన్ (1979):

కంపల్లె రవిచంద్రన్ చిత్తూరు జిల్లా పుంగనూరులో 19.03.1979న జన్మించారు. ఈయన తల్లిదండ్రులు గిరిజమ్మ, శివరామయ్యలు. ఈయన రాసిన తొలి కథ 'సారా కావాలి'.

ఇది 1993 ఆంధ్రజ్యోతిలో అచ్చయ్యింది. ఆ తరువాత రాసిన కథల్లో 'కాలం కార్చిన కన్నీరు', 'ముద్ద', 'చీకటి వెలుగు' వంటి కథలు పేర్కొనదగినవి.

3.65. పురాణం త్యాగమూర్తి శర్మ:

వీరు మదనపల్లెకు చెందిన కథకులు. సీనియర్ జర్నలిష్టుగా పనిచేసిన వీరు 'అవ్వ' అనే కథను రాశారు. ఈ కథ 'ఈ సంఘం'అనే పక్ష పత్రికలో 15.09.2008లో ప్రచురితమైంది. ఇదే కథ మదనపల్లె రచయితల సంఘం ప్రచురించిన 'మ. ర. సం. కథాగుచ్ఛం'(2008)లో కూడా ప్రచురితమైంది.

3.66. టి. వెంకట సుబ్బారెడ్డి:

నిమ్మనపల్లె మండలం, రెడ్డివారిపల్లె గ్రామంలో వీరు జన్మించారు. వెంకట రమణారెడ్డి. సరోజమ్మ తల్లిదండ్రులు. వీరి 'నిర్ణయం' కథ ఆగస్టు, 2003 ఆంధ్రభూమి మాసపత్రికలో ప్రచురితమైంది. ఇదే కథ మదనపల్లె రచయితల సంఘం 'కథాగుచ్ఛం'లోనూ ప్రచురితమైంది.

3.67. గార్ల అర్జున:

మదనపల్లెకు చెందిన కథకులు వీరు. వీరి 'సరికొత్త వైద్యం' అనే కథ మదనపల్లె రచయితల సంఘం ప్రచురించిన 'మ. ర. సం. కథాగుచ్ఛం'(2008) అనే సంకలనంలో ప్రచురించబడింది.

3.68. సొదా:

'అపూర్వ పురాణకథలు'ను సొదా రాశారు. 2000 సంవత్సరం నవంబరులో ఈ కథల సంకలనం తీసుకొచ్చారు. బర్బరీకుడు, మహోధన్వుడు, అంచల, మాతంగ, జబాల, చండాలిక, తారక, సూర్పనక, వాలి, భిక్షుతాడిత, తిత్తిరి, ఊర్మిళ, సీత, కొసరు కథలు ఇందులో ఉన్నాయి. 'నల్ల గుర్రపు నాడ' అనే పెద్ద కథను కూడా సొదా రాశారు.

3.69. టేకుమళ్ళ కామేశ్వరరావు:

టేకుమళ్ళ కామేశ్వరరావు 22.03.1907న జన్మించారు. ఈయన తల్లి శ్రీమతి విశాలాక్షి తండ్రి టేకుమళ్ళ అచ్యుతరావు. 1933 నాటికి ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడ్డారు. ఈయన రచించిన మొదటి ఖండకావ్యం 'కలువలు' (1933) అనేది. ఈయన 'కోపదారి మొగుడు' (1937) అనే పేరుతో నాటకాలను రచించారు. కామేశ్వరరావు ఆధ్యాత్మిక శక్తిని గూర్చి పరిశోధించి వ్రాసిన ఆంగ్ల పుస్తకం 'Further life of the soul'. ఈయన 'వాడుక భాషా రచన – కొన్ని నియమాలు' అనే గ్రంథాన్ని కూడా వ్రాశారు. ఈయన రాసిన కథలలో 'రోజా', 'జానకి ప్రేమ' పేర్కొనదగినవి. ఈయన కథలు వివిధ తెలుగు పత్రికలలో ప్రచురించబడ్డాయి. ఈయన పిల్లల కోసం వ్రాసిన పుస్తకాలు 'మిణుగురు పురుగు', 'పాలపిట్ట' అనేవి పేర్కొనదగినవి.

3.70. జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి (1962):

జొన్న విత్తుల శ్రీరామచంద్ర మూర్తి జన్మస్థలం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం తాలూకాలోని కోపల్లె గ్రామం. వీరు 1962 జనవరి 10న పుట్టారు. వీరి తల్లిదండ్రులు

లక్ష్మీనరసమ్మ, రామకృష్ణశర్మ. శ్రీరామచంద్రమూర్తి పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని శ్రీ చింతలపాటి బాపిరాజు మెమోరియల్ స్కూల్ లో 10వ తరగతి చదివాడు. "భీమవరం బిడ్డకు చిత్తూరు జిల్లా మట్టి వాసన పట్టుకోవడమన్నది అంత సులభంగా సాధ్యమయ్యే విషయం కాదు. అయితే శ్రీరామచంద్రమూర్తి అందులో విజయం సాధించారు" (ది డెత్ ఆఫ్ లాస్ట్ ఇండియన్. ముందుమాట). వీరి కథలన్నీ చిత్తూరు జిల్లా ముష్టూరులోనే జీవిస్తాయి. పాపిరెడ్డిగారిపల్లె, పుంగనూరు, కలగడ, మదనపల్లె, పలమనేరు, వాయల్పాడు, తిరుపతి మొదలైన వూర్లలోంచే పుట్టుకొచ్చాయి' అని అంటారు మధురాంతకం నరేంద్ర 'ది డెత్ ఆఫ్ లాస్ట్ ఇండియన్' కథలకు ముందు మాటలో.

చదువు ఒంటబట్టలేదని, తండ్రి మందలించారనే సాకుతో చిత్తూరు జిల్లాకు వచ్చిన ఈయన అక్కడ టమాటా పళ్ళ వ్యాపారంలోకి చేరాడు. 1987 నుండి 1995 వరకు చిత్తూరు జిల్లాలోని పాపిరెడ్డిగారి పల్లె, కోన, కలకడలలో స్వంత పాఠశాల నడిపాడు. అక్కడ ఉన్నప్పుడు అతను విద్యావిధానం గూర్చి రాసిన వ్యాసాలు ప్రముఖ దిన పత్రికలలో ప్రచురితమయ్యాయి. 1998 నుండి 2000 వరకు ఉషాకిరణ్ మూవీస్ ఫిలిమ్స్ డివిజన్ లో సినిమా రచయితగా చేరాడు. 2001 నుండి 2010 వరకు ఈటీవీ కన్నడ వాహినిలో కన్నడ రచయితగా కొన్ని వందల కార్యక్రమాలకి కథ, మాటలు, పాటలు రాశాడు. మరెన్నో కార్యక్రమాలకి దర్శకత్వం వహించాడు. 2011 నుండి స్టార్ మా తెలుగు ఛానెల్లో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గా భాద్యతలు నిర్వర్తిస్తున్నాడు.

వలసదేవర (1998), జంగమదేవర (2013), అంతర్యామి (1998-2000 లో ఆంధ్రభూమి వారపత్రికలో ధారావాహికగా వచ్చింది), సాక్షాత్కారం (2017 ఆంధ్రభూమి నవలల పోటీలో ఎంపికైంది.) అనేవి వీరు రాసిన నవలలు. ది డెత్ ఆఫ్ లాస్ట్ ఇండియన్ (2008), ఈ కథకి శిల్పం లేదు (2014) వీరు రాసిన కథా సంపుటాలు. జొన్నవిత్తుల చదువు కథలు (ప్రచురణలో ఉంది). ఈయన అనువాదాలు: జ్ఞానపీఠ పురస్కార గ్రహీత చంద్రశేఖర కంబార నాటకం 'గుళ్ళకాయజ్జి'ని, కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారం పొందిన బోళువారు మహమ్మద్ కుఞ్ఞి 'పాపుగాంధి-గాంధి బాపు ఆద కథె' ను భలేతాత మన బాపూజీ, పేరుతోను తెలుగులోకి అనువదించాడు. పలమనేరు బాలాజీ కవితలను, పెరుగు రామకృష్ణ కవితలను 'మాతే ఇల్లదాగ' అనే పేరుతో కన్నడంలోకి అనువదించాడు.

'వలసదేవర' నవలకి అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) వారు నిర్వహించిన తొలి నవలల పోటీలో ప్రథమ బహుమతి, జంగమదేవర నవలకి సంయుక్త ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతికశాఖ నిర్వహించిన తొలి నవలల పోటీలో బహుమతి, 'ది డెత్ ఆఫ్ లాస్ట్ ఇండియన్' కథా సంపుటానికి ఆంధ్రసారస్వత సమితి, మచిలీపట్నం వారి ఉత్తమ కథా సంపుటం పురస్కారం, కాకినాడ వారి మాకినీడి సాహిత్య పురస్కారం, ఒంగోలు ఫాతిమా సాహిత్యపీఠం పురస్కారం, 'వంజె' కథకి అప్పాజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ ఉత్తమ కథా పురస్కారం ఇలా వీరి రచనలకు అనేక బహుమతులు, పురస్కారాలు లభించాయి. వీరు రాసిన యాభై కథల్లో ఇరవై నాలుగు

కథలకు అజో విభో, ఆటా, అమెరికా భారతి, కథామహల్, ఆంధ్రప్రదేశ్, రంజని, గురజాడ స్మారక సాహిత్య పురస్కారం వంటి ఉత్తమ కథా పురస్కారాలు లభించాయి.

3.71. తిరుచినాపల్లి రమణారెడ్డి (మదనగోపాల రేవతి):

టి.యం.ఆర్. రమణారెడ్డి కడప పట్టణంలో 01.04.1953న జన్మించాడు. భానుమతి, మదనగోపాలరెడ్డి ఈయన తల్లిదండ్రులు. రమణారెడ్డి బాల్య విద్యాభ్యాసం కడప పట్టణంలో ప్రాథమిక పాఠశాలలో జరిగింది. కడప శారద నిలయం హైస్కూల్‌లో యస్.యస్.సి. పూర్తి చేసినాడు. ఆ తర్వాత రామకృష్ణ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసినాడు. ఈయన బి.ఎ. గవర్నమెంట్ డిగ్రీ కళాశాల కడపలో పూర్తయ్యింది. జ్యోతిష్యం పైన ఎక్కువ మక్కువ. ఈయన వ్రాసిన వ్యాసాలలో 'Muntha in varshaphal' అనేది పేర్కొనదగినది. ఈయన రచించిన 'యోగచంద్రిక జ్యోతిష్య గ్రంథము' ప్రచురితమైంది. ఈయన రచనా వ్యాసంగం కథలు, వ్యాసాలు, ఇతర రచనలు పేర్కొనదగినవి.

3.72. మల్లెల గురవయ్య:

వృత్తి రీత్యా మదనపల్లెలో స్థిరపడిన వీరు నెల్లూరు జిల్లా వెంకటగిరి తాలూకాకు చెందిన పిగిలాం గ్రామంలో 1939 జూలై 2న జన్మించారు. పిహెచ్.డి వరకూ చదివిన వీరి విద్యాభ్యాసం వెంకటగిరి, నెల్లూరు, తిరపతిలో సాగింది. మదనపల్లి బి.టి. కళాశాలలో తెలుగు శాఖాధ్యక్షులుగా పనిచేసిన వీరు శ్రీరామకృష్ణ కర్ణామృతం, శివగీతా ప్రసూన మంజరి, శ్రీ వేంకటేశ్వర విలాసము, ప్రబోధ చంద్రోదయ విమర్శ లాంటి 15 రచనలను రాశారు. వీరు రాసిన 'విధి తీర్పు' అనే కథ మదనపల్లె రచయితల సంఘం ప్రచురించిన 'మ. ర. సం. కథాగుచ్ఛం'(2008) అనే సంకలనంలో ప్రచురించబడింది.

3.73. ముదిపర్తి కొండమాచార్యులు(1922):

ముదివర్తి కొండమాచార్యులు కృష్ణాజిల్లా మైలవరం మండలం కుంటముక్కల గ్రామంలో 02.09.1922న జన్మించాడు. నాట్యం చేయడంపై అభిరుచి ఉన్న వీరు విమర్శనాత్మక, విజ్ఞాన గ్రంథాలు చదవడం, పద్యాలు, కథలు, గేయాలు రాయడం ప్రారంభించాడు. ఈయన పద్య రచనలో 'తెలుగు వెలుగు', 'మోహనరాగం' అనేవి పేర్కొనదగినవి. ఈయన రాసిన గేయ సంపుటాల్లో 'భక్తి గీతాంజలి', 'లలిత గీతాంజలి', 'దేశభక్తి గీతాంజలి', 'ప్రణయ గీతాంజలి', 'దళిత గీతాంజలి' అనే గేయ కవితా సంపుటాలు ప్రచురింపబడినాయి. ఈయన ప్రచురించిన గ్రంథాలలో 'కవితా సౌధం', 'హరి గంగ' అనేవి పేర్కొనదగినవి. ఈయనకు 1992వ సంవత్సరంలో అంబేద్కర్ వెల్‌ఫేర్ అసోసియేషన్ తిరుపతి వారి సౌజన్యంతో 'అంబేద్కర్ రత్న' అనే బిరుదు శ్రీమాన్ ఆర్. చెంగారెడ్డి (మాజీ జౌళి శాఖా మంత్రి) గారిచే ప్రధానం చేశారు. 1999లో చిత్తూరు జిల్లా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ద్వారా లభించింది. ఈయన తిరుపతి సమీపంలోని రామచంద్రాపురంలో 20.04.2005న చనిపోయాడు.

3.74. సి.హెచ్. వెంకటరత్నం (ద్వారకా) (1931):

సి.హెచ్. వెంకటరత్నం గుంటూరు జిల్లా గర్నెపూడి గ్రామంలో 14.04.1931న జన్మించాడు. ఈయన తల్లి శ్రీమతి రాఘవమ్మ, తండ్రి వెంకటప్పయ్యలు. ఈయన ప్రాథమిక విద్యాభ్యాసం గర్నెపూడి గ్రామం వీధి బడిలో కొనసాగింది. ఆ తర్వాత విద్య అంతా గుంటూరులో సాగింది. ఈయన ఉద్యోగరీత్యా చిత్తూరు జిల్లా అరగొండలో గ్రాడ్యుయేట్ టీచర్‌గా స్థిరపడ్డాడు. అప్పటి నుంచి చిత్తూరు జిల్లా వాసులలో పి. రాజగోపాలనాయుడు, కె. సభా, పూతలపట్టు శ్రీరాములు రెడ్డిలతో అవినాభావ సంబంధాన్ని పెంచుకొని తనలోని సృజనాత్మకతను పెంపొందించుకున్నాడు.

ఈయన 1955లో బి.ఈడి. ప్రైవేటుగా పూర్తి చేసి హైస్కూల్ హెడ్‌మాస్టర్‌గా కలగడ, కులబలకోట, అనేక స్కూళ్లలో పనిచేసి ఉత్తమ ప్రధానోపాధ్యాయునిగా సన్మానాలను అందుకుని రిటైర్ అయినాడు. ఈయన 'ద్వారక' అనే కలం పేరుతో రచనా వ్యాసంగాన్ని సాగించాడు. ఈయన రచించిన కథలలో 'సుఖాలతీరం', 'ఆకాశం గుండ్రంగా వుంది', 'భవబంధాలు', 'మేడిపండు' అనే కథలు పేర్కొనదగినవి. (ఆకాశంబుననుండీ (2002) వీరి కథా సంపుటి.)

1989 లో ఆంధ్రప్రభ వారపత్రిక నిర్వహించిన దీపావళి నవలల పోటీలలో ఈయన రాసిన 'పల్లె పిలిచింది'(1993) అనే నవలకు ద్వితీయ బహుమతి లభించింది. ఈయన 'భవబంధాలు' కథకు పులికంటి సాహితీ అవార్డు లభించింది.

3.75.సి. ఎన్. చంద్రశేఖర్ (1958):

సి.ఎన్. చంద్రశేఖర్ నెల్లూరులో 02.09.1958న జన్మించారు. ఈయన తల్లిదండ్రులు కామాక్షిబాయి, నారాయణరావులు. వీరు ప్రాథమిక, హైస్కూల్ చదువులను గిరింపేటలోను, పి. సి. ఆర్. ప్రభుత్వ జూనియర్ కాలేజిలో ఇంటర్ ను, చిత్తూరు ప్రభుత్వ కళాశాలలో బి. ఎస్ సి ని పూర్తి చేశారు. వీరు తంతి తపాలా శాఖలో కొంత కాలం, మెడికల్ రెప్రజెంటేటివ్ గా కొంతకాలం, సిండికేట్ బ్యాంకులో కొంతకాలం పని చేసిన తర్వాత 28సంవత్సరాలుగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు.

వీరి రచనా ప్రస్థానం 'బంద్' అన్న కార్డు కథతో మొదలైంది. ఇది మయూరి వార పత్రికలో 1991లో ప్రచురితమైంది. వీరు ఇప్పటి వరకూ యాభై కవితలను, రెండు నవలలను, 180కి పైగా కథలను రాశారు. నీకోసమే (2004), కనులు మాట్లాడునని (2004), ఊటీలో ఓ సాయంత్రం (2005), నీ మనసు నాకు తెలుసు (2007), మన్నించుమా ప్రియా (2008), స్వాతి ముత్యం (2009). నీరాజనం (2013) అన్నవి వీరి కథా సంపుటాలు. స్రవంతి (2005), అతడే హీరో (2006) అనేవి వీరి నవలలు.

శ్రీ సుద్దపల్లి వెంకయ్య నాయుడు సాహితీ అవార్డు, కుప్పం రెడ్డెమ్మ సాహితీ అవార్డు, చిత్తూరు లయన్స్ క్లబ్ వారి ప్రోత్సాహక పురస్కారం, ప్రజాహిత సేవా సంస్థ చిత్తూరు వారి

అభినందన పురస్కారం, హరివిల్లు సాంస్కృతిక సంస్థ చిత్తూరు వారి అభినందన పురస్కారం, ఘంటసాల సంస్థ అభినందన సన్మానం వీరికి దక్కిన అవార్డులు, పురస్కారాలు.

చిత్తూరు జిల్లా రచయిత్రులు:

3.76. జోలెపాళెం మంగమ్మ (1925):

జోలెపాళెం మంగమ్మ 1925 సెప్టెంబర్ 12 న మదనపల్లిలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు సుబ్బన్న, లక్ష్మమ్మలు. వీరు మదనపల్లె, మద్రాసు ప్రాంతాలల్లో ప్రాథమిక, ఉన్నత విద్యలను అభ్యసించారు. మొదట వీరు భోదనా రంగంలో పది సంవత్సరాలు పనిచేసి, తర్వాత ఢిల్లీలోని ఆల్ ఇండియా రేడియోలో న్యూస్ రీడర్ గా స్థిరపడ్డారు. తొలి తెలుగు మహిళా న్యూస్ రీడర్ గా పేరు తెచ్చుకున్న వీరు కేంద్ర సమాచారశాఖ, విదేశాంగ శాఖలలో కీలకమైన పదవులను నిర్వహించారు. ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మొదలైన సంస్థలలో జీవిత సభ్యురాలుగా, అనిబీసెంట్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఉపాధ్యక్షురాలిగా, గాంధీ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్ మెంట్ అధ్యక్షురాలిగా, లోక్ అదాలత్‌లో సభ్యురాలిగా వివిధ హోదాల్లో సేవలను అందించింది. వృత్తి పట్ల ఆమెకు గల అంకిత భావం, అనుకున్న పనిపట్ల ఆమెకు గల కార్యదీక్ష సామాన్యమైనవి కాదు. అందుకే *"తన విద్య, నిరంతర పరిశోధనలకు ఆటంకం కావచ్చుననే ఉద్దేశ్యంతో వారు వివాహాన్ని గూర్చి కూడా ఆలోచింపకుండా ఒంటరిగానే జీవనయానాన్ని కొనసాగించారు"* (చిత్తూరు జిల్లా – వందేళ్ళ కథాసారథులు, 2013: 17).

న్యూఢిల్లీ తెలుగు అకాడమీ ఉగాది పురస్కారం, కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారం, సిద్ధార్థ కళాపీఠం (విజయవాడ) విశిష్ట అవార్డు మొదలైన సత్కారాలను పొందింది. సరోజినీ నాయుడు అనుయాయిగా ఈమె పేరు గడించింది. ఆంధ్రా నైటింగేల్ అనే బిరుదును సంపాదించింది.

1979లో కథారచనతో ప్రారంభమైన వీరి రచనా వ్యాసంగం అతి కొద్ది కాలంలోనే పరిశోధన గ్రంథాల వైపు మళ్లి విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు, సి.పి. బ్రౌన్ తెలుగువారికి చేసిన సేవలు, అనిబిసెంట్, శ్రీ అరవిందులు, సరోజినీ నాయుడు, ఆంధ్ర దేశానికి క్రైస్తవ మిషనరీలు చేసిన సేవలు, భారత చట్టసభ, తెలుగులో అచ్చయిన తొలి పుస్తకాలు, సీమపాలెగాళ్ళు వంటి గ్రంథాలను ప్రచురించారు. వీటితో పాటు ది రేట్ స్కూల్ ఆఫ్ గోదావరి, బుక్ ప్రింటింగ్ ఇన్ ఇండియా మొదలైన ఆంగ్ల గ్రంథాలను కూడా రాశారు.

జోలెపాళెం మంగమ్మ గారు చిట్టడవిలో భవంతి, స్టేషన్ కు రండి, నాణానికి ఆవలివైపు, విడాకులు మొదలైన కథలను రాశారు. అయితే ప్రస్తుతం వీరు రాసిన స్టేషన్ కు రండి అన్న కథ మాత్రమే లభిస్తూ ఉంది. న్యూఢిల్లీ తెలుగు అకాడమీ ఉగాది పురస్కారం, కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారం, సిద్ధార్థ కళాపీఠం (విజయవాడ) విశిష్ట అవార్డు మొదలైన సత్కారాలను పొందింది. సరోజినీ నాయుడు అనుయాయిగా ఈమె పేరు గడించింది. ఆంధ్రా నైటింగేల్ అనే బిరుదును సంపాదించింది.

3.77. ఆర్. వసుందరాదేవి (1931):

ఆర్. వసుంధరా దేవి ప్రకాశం జిల్లా, పర్చూరు గ్రామంలో 17.12.1931న జన్మించింది. ఈమె తల్లిదండ్రులు పరిపూర్ణమ్మ, పండా సత్యనారాయణ చౌదరి. వేటపాలెంలోని బండ్ల పాపయ్య మిడిల్ స్కూల్‌లో ఎనిమిదవ తరగతి వరకు చదువుకుంది. ఆ తరువాత గుంటూరులోని సెయింట్ జోసఫ్ కాన్వెంటులో ఎస్.ఎస్.ఎల్.సి.ని పూర్తి చేసి, ఆ తరువాత గుంటూరు గవర్నమెంట్ ఉమెన్స్ కాలేజీలో ఇంటర్మీడియట్, విశాఖపట్టణంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బి.యస్సీ. (హోమ్ సైన్స్), ఎం.ఎస్సీ. పూర్తి చేసింది. ఈమెకు 26.02.1953వ సంవత్సరంలో ఆర్.ఎస్. సుదర్శనంతో వివాహం జరిగింది. అప్పటి నుండి చిత్తూరు జిల్లా వారి నివాసంగా మారింది. వసుంధరా దేవి తన 13వ ఏటే తన రచనా వ్యాసంగానికి శ్రీకారం చుట్టింది. ఆ తరువాత ఆర్.యస్. సుదర్శనం రచనలు ఆమెకు కొంత ప్రేరణనిచ్చాయి. మచ్చలు కథతో కథా రచయిత్రిగా రచనా జీవితాన్ని ప్రారంభించిన వసుంధరాదేవి 49 కథలను రాశారు. అవి 'గాలి రథం'(1977), నీడలు(1982) అనే పేరుతో రెండు కథా సంపుటాలను ప్రచురించారు. ఈ రెండు కథా సంపుటాలలోని కథలతో పాటు 28 కథలను కలిపి 2004లో ఆర్. వసుంధరాదేవి కథలు అనే పేరుతో ఒక సంపుటిని వేశారు.

ఈమె కథలతో పాటు 'రెడ్డెమ్మ గుండు'(1985), ఒక పెళ్లికథ అనే నవలలను కూడా రాశారు. వీరి రచనలకు 1969వ సంవత్సరంలో అక్కినేని నాగేశ్వరరావు గారి అవార్డు పొందారు. 1978లో 'గాలి రథం' కథల సంపుటికి నూతలపాటి గంగాధరం అవార్డు, 1978లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు లభించాయి.

3.78. కానాల నాగలక్ష్మి(1939):

కానాల నాగలక్ష్మి 1939 ఆగష్టు 18 న మదనపల్లిలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు లక్ష్మీనరసమ్మ, కృష్ణశర్మలు. వీరి ప్రాథమిక విద్యాభ్యాసం మదనపల్లిలోను, హైస్కూల్ విద్య బీసెంట్ థియోసాఫికల్ ఉన్నత పాఠశాలలోను, ఆ తర్వాత మదనపల్లెలో సెకండరీ గ్రేడ్ టీచర్ ట్రైనింగ్ ఎమర్జెన్సీ కోర్సును పూర్తిచేసి మదనపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయునిగా స్థిరపడ్డారు. వీరి మొదటి కథ 'జంట టెలిగ్రాములు' 1954లో ఆంధ్రప్రభ వార పత్రికలో ప్రచురితమయ్యింది. పంకజం నవ్వింది, సెకండ్ హ్యాండ్, చీకట్లో చిరుదీపాలు, నమ్మకం, కడలికి కోపమొచ్చింది ఇలా 12 కథలను రాశారు. వీరు మొదట్లో అమృత అనే కలం పేరుతో రచనలు చేశారు. కథలతో పాటు కవితలు, వ్యాసాలు కూడా వీరు రాశారు.

3.79. జోలెపాళెం భాగ్యలక్ష్మి (1940):

ఈమె చిత్తూరు జిల్లా మదనపల్లెలో 1940 ఫిబ్రవరి 2 న జన్మించింది. ఈమె ఆంగ్ల సాహిత్యాన్ని అధ్యయనం చేసి కమ్యూనికేషన్‌లో శిక్షణ పొంది, అడ్వాన్స్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ రిలేషన్స్, బుక్ పబ్లిషింగ్ విషయాలలో దేశ విదేశాల డిప్లొమాలను సంపాదించింది. జర్నలిస్టుగా ఢిల్లీలో చాలా కాలం పనిచేశారు . ఈమె ఇండియన్ ఇన్‌ఫర్మేషన్ సర్వీస్ (ఐ.ఐ.ఎస్) ఆఫీసరుగా కేంద్ర

గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖలో మీడియా డైరెక్టరుగా, కేంద్ర సమాచార, ప్రచార మంత్రిత్వశాఖ వారి పత్రిక యోజనకు చీఫ్ ఎడిటర్‌గా, పబ్లికేషన్స్ డివిజన్ ఎడిటర్‌గా, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్‌కమ్యూనికేషన్స్ ప్రచురణల శాఖకు అధిపతిగా వివిధ హోదాలలో పని చేసింది. ఇండియన్ అండ్ ఫారిన్ రివ్యూ, కమ్యూనికేటర్ వంటి పత్రికలకు సంపాదకురాలిగా కూడా పని చేసింది. ఈమె ప్రభుత్వ పత్రినిధిగా, జర్నలిస్టుగా వివిధ అధ్యయనాలకు బంగ్లాదేశ్, జపాన్, శ్రీలంక, చైనా, టిబెట్, భూటాన్, ఈజిప్టు, సిరియా మొదలైన దేశాలలో పర్యటించింది.

రచయిత్రిగా ఇంగ్లీషు తెలుగు భాషలలో ఈమె అరవైకి పైగా పుస్తకాలను రచించింది. తొలి రోజులలో జానకి అనే కలం పేరుతో రచనా వ్యాసంగం సాగించింది. ఈమె ప్రచురణలలో మూడు కథాసంకలనాలు, 12 కవితాసంకలనాలు, సాహిత్య విమర్శ, అనువాదాలు మొదలైనవి ఉన్నాయి. వీరి మొదటి కథ కళ్ళు 1965న ప్రజామాతలో ప్రచురించబడింది. కాదేదీ కవితకనర్హం(1987), మరో మజిలీ(2000), మాదీ స్వతంత్రదేశం(2007) వీరి కథా సంకలనాలు.

రఫీ అహమ్మద్ కిద్వాయి బహుమతి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమరచయిత్రి అవార్డు, జ్యేష్ఠ లిటరరీ అవార్డు, కథా అవార్డు, ఆర్.కె.నారాయణ్ అవార్డు, ఢిల్లీ తెలుగు సంఘం ప్రతిభా పురస్కారం, సిద్ధార్థ కళాపీఠం విశిష్టవ్యక్తి పురస్కారం, గృహలక్ష్మి స్వర్ణకంకణము వీరి ప్రతిభకు దక్కిన బహుమానాలు.

3.80. దండాల మునిరెడ్డి ప్రేమావతి:

చిత్తూరుజిల్లా, గుడిపాల మండలం, నంగమంగళం గ్రామం 11-06-1942. 'ఒంటరిగా లేము మనం' కథను రాశారు.

3.81. తెనాలి సుశీలా దేవి(1945-1987):

తెనాలి సుశీలాదేవి చిత్తూరు జిల్లా గోరంట్ల గ్రామంలో 1945 జూలై 8న జన్మించారు. వీరి మొదటి కథ 'పెళ్ళికోసం' ఆంధ్ర సచిత్ర వార పత్రికలో 25-04-1974లో ప్రచురితమయ్యింది. దావాగ్ని చెప్పిన సత్యం, తిరగబడిన దేవతలు, మెర్సీకిల్లింగ్ లాంటి ముప్పైకి పైగా కథలు రాసిన వీరు 'మనిషి మైనస్ షి' అనే నవలను, కొన్ని వ్యాసాలను కూడా రాశారు. వీరు 05-04-1987లో మరణించారు.

3.82. గల్లా అరుణ కుమారి(1945):

గల్లా అరుణ చిత్తూరు జిల్లా, తవణం పల్లి మండలం, దిగువ మాఘంలో 1945 ఆగష్టు 1వ తేదీన పుట్టారు. వీరి తండ్రి ప్రముఖ రాజకీయ నాయకుడు, నవలా రచయిత, నాటక రచయిత, పరిశోధకుడు అయిన పి. రాజగోపాల నాయుడు. తల్లి అమరావతమ్మ. ఈమె పూర్తి పేరు గల్లా అరుణ కుమారి. ఈమె రాష్ట్ర కాంగ్రెస్ కమిటీకి జనరల్ సెక్రటరీగా వ్యవహరించారు. ఆ తర్వాత చంద్రగిరి నియోజక వర్గం నుండి పలుమార్లు పోటీచేసి ఎం.ఎల్.ఎ.గా విజయాన్ని

సాధించింది. వీరు రాసిన 13 కథలను అరగొండ నుంచీ అమెరికా వరకూ.. అనే కథా సంపుటిగా ప్రచురించారు. ఇందులోని కథలన్నీ తెలుగు అమెరికా అనే పత్రికలో ప్రచురితమైనాయి.

3.83. సి. ఉమాదేవి(1947):

సి. ఉమాదేవి గారు 1947 అక్టోబర్ 3న చిత్తూరు జిల్లా, మదనపల్లిలో జన్మించారు. బి. నారాయణ రెడ్డి, సరస్వతీ దేవిలు వీరి తల్లిదండ్రులు. వీరు ప్రాథమిక విద్యను కలికిరిలోను, ఉన్నత విద్యను విశాఖపట్టణం హైదరాబాదులలోను పూర్తి చేసి విద్యా రంగానికి అంకితమయ్యారు. విన్సెంట్ హై స్కూల్ కోఆర్డినేటర్ గా, వెంకటేశ్వర జూనియర్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ లెక్చరర్ గా, శ్రీనగర్ విద్యానికేతన్ ప్రారంభించి ప్రిన్సిపాల్ గా విధులను నిర్వహించారు.

1968 లో వీరు రచనా వ్యాసంగాన్ని ప్రారంభించి కథ, నవల, కవిత, వ్యాసం, సమీక్ష మొదలైన ప్రక్రియల్లో అనేక రచనలను చేశారు. 'విందులందున ఏ విందు' అనేది వీరి మొదటి కథ. ఇది కలువబాల అనే పత్రికలో ప్రచురితమయ్యింది. ఆ తర్వాత చిన్నిగుండె చప్పుళ్ళు (2001), మాటే మంత్రము అనే రెండు కథా సంపుటాలను; శిలాపుష్పాలు, కేర్ టేకర్, సాగర కెరటం అనే నవలలను; మంచి మాట – మంచి బాట అనే వ్యాస సంపుటిని; ఏ కథలో ఏముందో అనే పుస్తక సమీక్షల పుస్తకాన్ని; అమ్మంటే అనే కవితా సంపుటిని వీరు ప్రచురించారు.

అమృతనం అనే కవితకు పోతుకూచి సాంబశివరావు సాహితీ పురస్కారం, మానవతకు చిరునామా కవితకు ఎక్స్ రే సాహిత్య మాసపత్రిక బహుమానం, మనిషి నిర్వచనం కవితకు ఆంధ్రప్రభ–ఆరాధన సంయుక్తంగా నిర్వహించిన పోటీలో ఉత్తమ కవితగా బహుమతి, అమ్మకు ప్రేమతో కథకు అచ్చంగా తెలుగు అంతర్జాల పత్రిక బహుమతి వీరి ప్రతిభకు దక్కిన బహుమతులు.

3.84. లక్ష్మీ రాఘవ(1948):

లక్ష్మీ రాఘవ మదనపల్లి తాలూకు గట్టు గ్రామంలో 1948 జనవరి 9న జన్మించారు. వీరి తల్లిదండ్రులు అల్లూరి నరసింగరావు, స్వర్ణమ్మలి. వీరి తండ్రి మదనపల్లి నియోజకవర్గం నుండి రెండు సార్లు ఎం.ఎల్.ఎ. గా ఎన్నికయ్యారు. వీరి విద్యాభ్యాసం స్వగ్రామంలో మొదలై హైదరాబాదులో పిహెచ్ డి వరకూ సాగింది. హైదరాబాదులో వనితా మహావిద్యాలయ కాలేజిలో లెక్చరర్ గా, రీడర్ గా ముప్పై సంవత్సరాలు పనిచేసి కుటుంబ బాధ్యతల కారణంగా స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. వీరు మొదట తమ రచనా వ్యాసంగాన్ని అల్లూరి అమ్మణ్ణి అనే పేరుతోను తర్వాత లక్ష్మీరాఘవ అనే పేరుతోను కొనసాగించారు. వీరి అసలు పేరు కె.వి. లక్ష్మి. వీరి మొదటి కథ సరోజ 1966లో ఆంధ్ర సచిత్ర వార పత్రికలో అచ్చయ్యింది. వీరు ఇప్పటి వరకూ నా వాళ్ళు (2014), అపురూపం (2017), స్మార్ట్ జీవితం (2018),అనుబంధాల టెక్నాలజీ (2016), మనసుకు చికిత్స (2020) అనే కథా సంపుటాలను వెలువరించారు. కథలతో పాటు వీరు కవితలు, వ్యాసాలూ కూడా రాశారు.

3.85. ఎం. కె. దేవకి (మహాసముద్రం కోదండ రెడ్డి)(1951):

జానపద సాహిత్యంలో విశేష కృషి చేసిన దేవకి గారు చిత్తూరు జిల్లా వరిగపల్లె గ్రామంలో 1951 జూలై 1న పుట్టారు. వీరి మొదటి కథ 'తరంగం' 2004 ఫిబ్రవరిలో వరంగలు శ్రీలేఖ సాహితీ సంస్థ ప్రచురించిన కథా సంకలనంలో అచ్చయ్యింది. ముళ్ళదోవ, ఇర్ల చెంగి కథలు, మంటల బడిలో అనేవి వీరు ప్రచురించిన కథా సంపుటాలు. జానపద సాహిత్యం పైన పరిశోధన చేసిన వీరు తారంగం తారంగం, గోరుముద్దలు, తెలుగు బాలగేయ సాహిత్యం, తెలుగునాట జానపద వైద్య విధానాలు, జాతిరత్నాలు, తెలుగు జానపద గేయాలు అనే గ్రంథాలను ప్రచురించారు.

3.86. పి. శైలజ (1958):

పి. శైలజ గారు 1958 జూన్ 30న మదనపల్లిలో జన్మించారు. పొగాకు లక్ష్మీపతి, అమ్రుతమ్మలు వీరి తల్లిదండ్రులు. వీరి విద్యాభ్యాసం పదవ తరగతి వరకు మదనపల్లిలోను, ఆ తర్వాత ఎం.ఎ. వరకు తిరుపతిలోనూ సాగింది. చిన్నతనం నుండి సాహిత్యం పట్ల అవగాహన పెంచుకున్నా వీరు ఎక్కువగా స్త్రీల సమస్యల పట్ల సామాజిక స్పృహతో ఎక్కువ రచనలు చేశారు. అమృత హస్తం, విరజాజులు, మానస పుష్పం, ఆటోగ్రాఫ్, అలక, కోరిక, వెన్నెల్లో చీకటి మరకలు, స్నేహం, సిగ్గుపడిన వేళ, థ్రిల్, తోడూ-నీడ, ఖరీదైన ఆదర్శం, తెగింపు, కల, వీడ్కోలు వంటి కథలను రాశారు.

3.87. ఎం. ఆర్. అరుణకుమారి (1960):

ఎం. ఆర్. అరుణకుమారి గారు 1960 మే 28న చిత్తూరు లో జన్మించారు. నాటక రచయితగా, నవలాకారుడుగా, పద్యకవిగా, పేరు పొందిన ఎం. ఆర్. చంద్ర వీరి తండ్రి. అలవేలమ్మ వీరి తల్లి. ప్రాథమిక విద్యాభ్యాసం నుండి టీచర్ ట్రైనింగ్ వరకూ వీరి చదువంతా చిత్తూరులోనే సాగింది. 1983లో ఉపాధ్యాయురాలుగా నియమితులైన వీరు మొదట టి. చవట పల్లె, జోగుల కాలని, బండపల్లెలో పనిచేసి తిమ్మసాని పల్లెలో ప్రస్తుతం ప్రదానోపాధ్యాయురాలుగా పని చేస్తున్నారు.

ఎం. ఆర్. అరుణకుమారి వందకు పైగా కథలను, కవితలను, వ్యాసాలను రాశారు. వీరు రాసిన కథలు వేగుచుక్క(1996), సాగరకోయిల(2003), మన్నులోమన్నె(2006) అనే సంపుటాలుగా వెలువడ్డాయి. వీరు వృత్తి రీత్యా ఉపాధ్యాయురాలిగా, ప్రవృత్తి రీత్యా రచయితగా అనేక బాధ్యతలను నిర్వర్తిస్తూనే చిత్తూరు జిల్లా రచయితల సంఘంలో కూడా చురుకైన వ్యక్తిగా ఉండేవారు. అలాగే కొంతకాలం జిల్లా అధికార భాషా సంఘం సభ్యురాలిగా కూడా పని చేశారు. వీరి ప్రతిభకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, కుప్పం రెడ్డెమ్మ సాహితీ అవార్డు లభించాయి.

3.88. పసుపులేటి గీత (1964):

పసుపులేటి గీత 1964 జూన్ 19న శ్రీకాళహస్తిలో పుట్టారు. వీరి మొదటి కథ 'గజీతగాడు' 4-8-1996 ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం అయ్యింది. 'చమన్' పేరిట

కవితా సంకలనాన్ని వెలువరించారు. ఇస్మత్ చ్ఘ్తాయ్, ఎహూందా అమీచ, మొహమ్మద్ దార్వీష్, కమలాదాస్ మొదలైన దేశ విదేశ కథకుల, కవుల రచనలను తెలుగులోకి అనువదించారు.

3.89. శైలజామిత్ర (1966):

శైలజామిత్ర గారు 1966 జనవరి 15న చిన్నగొట్టిగల్లులో జన్మించారు. తెలికిచెర్ల శేషగిరిరావు, అనసూయాదేవి వీరి తల్లిదండ్రులు. వీరి ప్రాథమిక ఉన్నత విద్యాభ్యాసం చిత్తూరు తిరుపతిలో సాగింది. వివాహానంతరం హైదరాబాదు ఉస్మానియా యూనివర్సిటీ నుండి ఎం.ఎ. తెలుగు పూర్తి చేసి, జర్నలిజంలో పి.జి. డిప్లమాను పొందారు. కర్నాటక సంగీతం, లలిత సంగీతంలో ఐదు సంవత్సరాల ప్రావీణ్యం ఉన్న వీరు మంచి గాయకులు కూడా. అయితే కొన్ని ఆరోగ్య కారణాల వల్ల ఆమె పాటలు పాడడం మానేసింది. ఆ తర్వాత తన ప్రవృత్తిగా ఉన్న రచనా వ్యాసంగాన్నే ప్రవృత్తిగా చేసుకొని అనేక రచనలను సాహితీ లోకానికి అందిస్తున్నారు. వీరి మొదటి కథ ఆదర్శాల అంచులలో 1997లో ఆంధ్రభూమి వీక్లీలో అచ్చయ్యింది. సుమారు 70కి పైగా కథలు రాసిన వీరు తరంగాలు(2005), అడ్డా(2012) అనే రెండు కథా సంపుటాలను ప్రచురించారు. శంఖారావం, మనోనేత్రం, నిశ్శబ్దం, సిల్వర్ లైన్, అంతర్మథన వేళ, అగ్నిపూలు, రాతి చిగుళ్ళు, తడిసి ముద్దయిన కాలం అనే కవితా సంపుటాలను వెలువరించారు. వీటితో పాటు నిశ్శబ్ద పోరాటం, ఈ తప్పెవరిది?(2009), ఆకుపచ్చని జాబిల్లి(2011), ఏ నావది ఏ తీరమో(2012), నీకు నువ్వే, మనిషి అనే నవలలను రాశారు. వందకు పైగా వ్యాసాలను, పది అనువాద రచనలను కూడా చేశారు.

3.90. గండికోట వారిజ (1972):

చిత్తూరు జిల్లా పుంగనూరుకు చెందిన ఈమె 1972 అక్టోబర్ 22న జన్మించారు. వీరి తొలి కథ 'ఒకానొక ఉద్యోగస్తురాలి ఉత్తరం' వార్త దినపత్రికలో 10-08-1998న ప్రచురించబడింది. వీరు ఇప్పటిదాకా పది కథలను, వందకు పైగా కవితలను రాశారు.

3.91. గంజాం భ్రమరాంబ (1973):

గంజాం భ్రమరాంబ గారు 1973 జూలై 2న నగిరిలో జన్మించారు. వీరి మొదటి కథ 'పరువాల తొలిపొద్దు' 2013న ఆంధ్రనాడు కథా సంకలనంలో అచ్చయ్యింది. వీరు వంద దాకా (చిన్నా పెద్ద) కథలు రాశారని తెలుస్తుంది. అలాగే కవితలు, గజల్స్, రుబాయిలు, వ్యాసాలు కూడా రాశారు.

3.92. డేగల అనితాసూరి (1974):

చిత్తూరు జిల్లా మదనపల్లిలో 1974 జూన్ 6 న వీరు జన్మించారు. వీరి మొదటి కథ 'పసి మనసులు' 31-5-1995న ఆంధ్రభూమి సచిత్ర వార పత్రికలో వచ్చింది. సర్వధారి అనే వచన కవితా సంపుటిని, ఆధ్యాత్మిక వ్యాసాలను, కొన్ని పిల్లల కథలను రాశారు.

3.93. ఎండపల్లి భారతి (1981):

ఎండపల్లి భారతి గారు 1981 మార్చ్ 23న మదనపల్లిలో పుట్టారు. వీరి మొదటి కథ 'సావుబియ్యం' 2014లో నవోదయం అనే మహిళా పత్రికలో అచ్చయ్యింది. యాభై కథలదాకా రాసిన వీరు 'ఎడారి బ్రతుకులు' అనే పేరుతో ఒక కథా సంపుటిని వేశారు.

3.94. ఎ. పుష్పాంజలి:

వీరు నెల్లూరు జిల్లాలో పుట్టి ఉద్యోగరీత్యా చిత్తూరు జిల్లాలో స్థిరపడిన వారు. జువాలజీ లెక్చరర్ గా చిత్తూరు జిల్లాలో అనేక చోట్ల పనిచేసి మదనపల్లిలో స్థిరరపడినారు. వీరు పదవీ విరమణ తర్వాత వాళ్ళిద్దరూ... ఇంకా కొందరు! (2007), అమ్యూజింగ్స్ (2010) అనే రెండు కథా సంకలనాలను వేశారు.

పై రచయిత్రులతో పాటు బడబాగ్ని అరుణ కుమారి, పొన్న లీలావతి, మధురాంతకం నాగభూషణమ్మ, హైమావతి భార్గవ్, శివానంద మంజుల, చంద్రకళ, ఎం. విష్ణుప్రియ, కొలకలూరి మధుజ్యోతి, బిరుదవోలు మైథిలి, కాంటూరు శారద, కట్టమంచి కృష్ణవేణి వంటి మరి కొంతమంది రచయిత్రులు చిత్తూరుజిల్లా నుండి కథలు నవలలు రాసిన/రాస్తున్న వారు ఉన్నారు. అయితే వీరిలో కొంత మంది ఉద్యోగ రీత్యా లేదా కుటుంబ బాధ్యతల రీత్యా ఇతర జిల్లాల నుండి వచ్చి చిత్తూరు జిల్లాలో స్థిరపడి ఇక్కడి నుండే తమ రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తున్నారు.

స్థూలంగా చిత్తూరు జిల్లా రచయితలు (నవల, కథానిక) –జీవన రేఖల్ని చూస్తే పై రచయితలతో పాటు చిత్తూరు జిల్లా నుండి నేడు కథారచన చేస్తున్న వారు, అప్పుడప్పుడూ మాత్రమే కథలు రాస్తున్న వారు, కథారచన చేస్తున్నప్పటికీ పెద్దగా గుర్తింపు రాని వారు, అతి తక్కువగా కథలు రాసిన వారు, ఇప్పుడిప్పుడే కథారచన/నవలా రచన మొదలుపెట్టిన వారు, ఇతర జిల్లాల నుండి వచ్చి ఇక్కడ స్థిరపడి రచనలు చేస్తున్న వారు ఇలా చాలామందే ఉన్నారు. వారి వివరాలు చిత్తూరు జిల్లా సాహిత్య చరిత్రలోను (మధురాంతకం రాజారాం), చిత్తూరు జిల్లా శతాబ్ది సాహిత్య ఉత్సవాలు ప్రత్యేక సంచికలోను, చిత్తూరు జిల్లా వందేళ్ళ కథా సారథులులోను (టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి), చిత్తూరు కథ సంకలనంలోనూ (పేరూరు బాలసుబ్రమణ్యం, సంపాదకుడు), తెలుగు కథా కోశం అనే పుస్తకాలలోనూ కొంతవరకు లభిస్తున్నాయి. అయితే వారందరినీ ఇక్కడ పరిచయం చేయడం సాధ్యం కాదు కాబట్టి, అందులోను అధ్యాయ నిడివి కారణంగానూ వారి పేర్లు మాత్రమే ఇక్కడ ప్రస్తావిస్తున్నాను.

చిత్తూరు జిల్లా సాహిత్య చరిత్ర రాసిన మధురాంతకం రాజారాం గారు చిత్తూరు జిల్లాకు చెందిన రచయితలతో పాటు ఇతర జిల్లాల నుండి వచ్చి ఇక్కడ స్థిరపడి కథారచన చేస్తున్న వాళ్ళను కూడా ప్రస్తావించారు. వారు తిరువెంగళ సూరి(శ్రీకాళహస్తి), ముంగర శంకరరాజు(కడప), రాజేంద్ర, శ్రీపనతుల రామచంద్రయ్య, కాసారం కుప్పుస్వామి, మధురాంతకం దొరస్వామి(పదిపుట్ల బయలు), నైనారి చిన్నప్ప(పుంగనూరు), జ్యోతిశ్రీ (టి. శంకరయ్య) (శ్రీకాళహస్తి), సర్వశ్రీ సంతాన గోపాల కృష్ణ(మదనపల్లి), గోటూరు భవానీ

శంకర్(మదనపల్లి), రాయచోటి శ్రీనివాస రావు(మదనపల్లి), రామకృష్ణ(దిగువమాఘం), ఓలేటి కృష్ణ(నేండ్రగుంట), వి. రఘునాథ రెడ్డి, యల్. భాస్కర్, మునిరత్నం నాయుడు (జగదీశ్), టి ఎన్. అనసూయాదేవి. మధురాంతకం రాజారాం గారు పై రచయితల గురించి చెప్పే క్రమంలో వారు కథారచన చేశారని మాత్రమే తెలియజేశారు. మరి కొంత మంది ఒకటి అర కథలు రాసినవారిని కూడా చెప్పారు. అలాగే నవలను రాసినవారు కూడా ఉన్నారు. కాకపోతే పైవారి రచనలు చాలా తక్కువగా దొరుకుతున్నాయి.

అలాగే చిత్తూరు జిల్లాలో స్థిరపడ్డ ఇతర జిల్లా రచయితలు గురించి జక్కంపూరి మునిరత్నం వ్యాసం (చిత్తూరు జిల్లా శతాబ్ది సాహిత్య ఉత్సవాలు ప్రత్యేక సంచిక) రాస్తూ కొంతమంది పేర్లను ప్రస్తావించారు. వారు కోలార్ కృష్ణయ్య (మైసూరు), చక్ర వేణు (కడప జిల్లా), వడ్డెర చండీదాస్ (కృష్ణాజిల్లా), చెరుకుపల్లి జమదగ్ని శర్మ , ఆర్. వసుంధరాదేవి (గుంటూరు జిల్లా), సి. హెచ్. వెంకట రత్నం (ద్వారకా) (గుంటూరు జిల్లా) , జొన్నవిత్తుల శ్రీ రామచంద్రమూర్తి (పశ్చిమ గోదావరి జిల్లా), టేకుమళ్ళ కామేశ్వరరావు (విజయనగరం), ముదివర్తి కొండమాచార్యులు (నెల్లూరు జిల్లా), మల్లెల గురవయ్య (నెల్లూరు జిల్లా), జీరెడ్డి చెన్నారెడ్డి (కడప జిల్లా), పి. నరసింహారెడ్డి (కడప జిల్లా), వేటూరి ప్రభాకర శాస్త్రి (కృష్ణా జిల్లా), మానవల్లి రామకృష్ణ కవి (మద్రాసు), విద్వాన్ విశ్వం (అనంతపురం), మేడవరం వెంకట నారాయణ శర్మ (ప్రకాశం జిల్లా), నెల్లుట్ల వెంకటేశ్వర రావు (వరంగల్), గుండవరం డేవిడ్ హెన్రీ (కర్నూల్). వీరిలో కొంత మంది ఇరవై ముప్పై ఏళ్ళుగా చిత్తూరు జిల్లాలోనే స్థిరపడి ఉండడం కారణంగా వారి రచనలలో చిత్తూరు జిల్లా ప్రాంతపు సమస్యలు, ఇక్కడి భాష వారి వారి రచనల్లో కనిపిస్తాయి. ఉదాహరణకు ఆర్. వసుందరాదేవి, జొన్నవిత్తుల శ్రీ రామచంద్రమూర్తి లాంటివారి రచనలు చూస్తే ఈ విషయం అర్థమవుతుంది.

వీరితో పాటు టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి గారు 'చిత్తూరు జిల్లా వందేళ్ళ కథా సారథులు' అనే పుస్తకంలో ఎ.బి. ఎతిరాజులు. జావీద్ హుసేన్, రమణ జీవి (అనంతపూర్), వి. నాగమణి, అరుణా సహాయ్, పులోమజాదేవి, పసుపులేటి మాణిక్యవీణ, జి.ఆర్. మహర్షి, ఎం.ఆర్. ఉమామహేశ్వరరావు, శ్రీ రావు, లెనిన్ ధనిశెట్టి(నెల్లూరు), కె. చంద్రమౌళి, జయచంద్రారెడ్డి, దుర్గమ్మ, పి.వి. ప్రసాద్, ఆల్దీ రామకృష్ణ, కె. వేణుగోపాల్(సిధూ), డి. రామచంద్ర రాజు ఇలా మరి కొంత మందిని చిత్తూరు జిల్లా రచయితలుగా పరిచయం చేశారు. అయితే వీరిలో చాలా మంది ఇతర జిల్లాల నుండి వచ్చి ఇక్కడ స్థిరపడిన వారు ఉన్నారు.

అలాగే చిత్తూరు జిల్లా కథ అనే పేరుతో పేరూరు బాలసుబ్రమణ్యం ఒక కథా సంకలాన్ని తెచ్చారు. దీని ఆధారంగా మరికొంత మంది రచయితలు ఇక్కడి నుండి రచనలు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందులో కోట పురుషోత్తం(కలకడ), గూళూరు బాలకృష్ణమూర్తి(అప్పలాయగుంట), కె.ఎ. ముని సురేష పిళ్ళై(శ్రీకాళహస్తి), ఆముదాల మురళి(తవణంపల్లి), వివేకాశ్రితుడు(కలికిరి), బడబాగ్ని శంకరరాజు(పీలేరు), వేంపల్లి సికిందర్(కురబలకోట) లాంటి వారు ఉన్నారు. వీరితో

పాటు బడబాగ్ని శంకరరాజు, కాశీరాజు పురుషోత్తం(వడమాల పేట. మం.), చీకోలు సుందరయ్య(కక్కుంబాకం), సంకా వెంకట రమణ, మేడసాని మోహన్, స. వెం. రమేష్, ఆకెళ్ళ వెంకట వేణుగోపాల్, ఆవుల రామచంద్రయ్య, అడ్లూరు రఘురామరాజు, షేక్ మహమ్మద్ షరీఫ్, అరిగే బాలసుబ్రహ్మణ్యం, టి. సతీశ్, అంకిరెడ్డి సునీల్ కుమార్ రెడ్డి, ఖాసీం యూసఫీ, దీవీప్రసాద్ మొదలైన వారు కూడా చిత్తూరు జిల్లా నుండి రచనలు చేసిన/చేస్తున వారు ఉన్నారు.

ఈ అధ్యాయంలో చిత్తూరు జిల్లాలో పుట్టిన రచయితలు రచయిత్రులతో పాటూ ఇతర జిల్లాల నుండి వచ్చి ఇక్కడ స్థిరపడి, ఇక్కడి భాషను, యాసను ఆకళింపు చేసుకొని, ఇక్కడి పరిస్థితులను వారి వారి రచనల్లో (నవలు, కథలు) పొందుపరిచిన వారినికూడా పరిచయం చేశాను.

తర్వాతి అధ్యాయంలో చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యంలో భాగమైన నవలా సాహిత్యంలో గల వస్తు వైవిధ్యాన్ని చెప్పబోతున్నాను.

అధ్యాయం – 4

చిత్తూరు జిల్లా
నవలా సాహిత్యం – వస్తు వైవిధ్యం

4.0. పరిచయం:

చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్య రచయితల (నవల, కథానిక) జీవన రేఖలను గురించి ముందు అధ్యాయంలో వివరించాను. ఈ అధ్యాయంలో విషయ విస్తృతి కారణంగా నవలా వస్తువును ఒక అధ్యాయంలో(ప్రస్తుత అధ్యాయం), కథా వస్తువును తర్వాతి అధ్యాయంలో (ఐదవ అధ్యాయం) తెలియజేస్తున్నాను. ఇక్కడ చిత్తూరు జిల్లా నవలా సాహిత్యంలోని వస్తు వైవిధ్యతను గురించి చెప్పే ముందు, చిత్తూరు జిల్లా నవల పట్ల పూర్వ పరిశోధకుల, విమర్శకుల అభిప్రాయాలను కొంత వరకూ చూసి ఆ తర్వాత నవలాసాహిత్యంలోని వస్తు వైవిధ్యతను వివరించే ప్రయత్నం చేస్తాను.

4.1. చిత్తూరు జిల్లా నవల – పూర్వ పరిశోధకుల, విమర్శకుల అభిప్రాయాలు:

తెలుగులో నవలా సాహిత్యం మొదలై ఇప్పటికి 150 సంవత్సరాలు పూర్తవుతూ ఉంది. ఇప్పటి దాకా నవలపై అనేక పరిశోధనలు, విమర్శలు, సమీక్షలు ఇలా అనేకం వచ్చాయి. అయితే వీటిలో ఎక్కువ శాతం విడివిడి పరిశోధనలు, విమర్శలే. 1872లో మొదలైన నవలా సాహిత్యంపైన వచ్చిన సమగ్రమైన అధ్యయనాలు, పరిశోధనలు తక్కువే అంటే అతిశయోక్తేమీ కాదు. అందులో ప్రధానమైనవి: ఆంధ్ర నవలా పరిణామము (బి.వి.కుటుంబరావు), తెలుగు నవలా సాహిత్య వికాసము (పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు), తెలుగు నవలావికాసము (మొదలి నాగభూషణశర్మ), తెలుగు నవల (అక్కిరాజు రమాపతిరావు), తెలుగు నవలాసాహిత్యంలో మనోవిశ్లేషణ (కోడూరి శ్రీరామమూర్తి), అభ్యుదయ (1980 నవల విశేష సంచిక), సాంఘిక నవల – కథన శిల్పం (సి. మృణాళిని), నవలా శిల్పం (వల్లంపాటి వెంకటసుబ్బయ్య), రాయలసీమలో ఆధునిక సాహిత్యం, సామాజిక సాంస్కృతిక విశ్లేషణ (వల్లంపాటి వెంకటసుబ్బయ్య) మొదలైనవి. వీటిలో ప్రాంతాల వారీగా చూసినప్పుడు రాయలసీమ నవల, అందులో చిత్తూరు జిల్లా నవల గురించి పై గ్రంథాలు ఏమి చెప్పాయో ఒకసారి చూద్దాం.

తెలుగులో నవలా సాహిత్యంపై మొదట సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించి, దానిని గ్రంథంగా **(ఆంధ్ర నవలా పరిణామము)** ప్రకటించిన వారు బి.వి.కుటుంబరావు. వీరు తన సిద్ధాంత గ్రంథం సమర్పించేనాటికి తెలుగులో 19 వేల నవలలు వచ్చినప్పటికీ వాటన్నింటినీ పరిశీలించడం సాధ్యపడని పని అని తెలియచేస్తూ, ప్రధానమైన వాటినే మాత్రమే ఇందులో వివరించడం జరిగింది అని తెలియచేశారు. ఆంధ్ర నవలా పరిణామములో (ప్రథమ భాగం)

వీరు1950 వరకూ వచ్చిన 120 నవలలను పరిశీలించారు. అయితే వీటిలో ఒక్కటైనా చిత్తూరు జిలా నవల లేకపోవడం గమనించవచ్చు. అప్పటికే చిత్తూరు జిల్లా నుండీ 8 నవలలు ప్రచురింతమై ఉన్నాయి.

మధురాంతకం రాజారాం 1967లో **'చిత్తూరు జిల్లా సాహిత్యచరిత్ర'** అనే చిన్న గ్రంథాన్ని రాశారు. ఇందులో కట్టమంచి రామలింగారెడ్డి దగ్గర నుండి ప్రారంభించి దాదాపు 38 మంది రచయితల గురించి ప్రస్తావించారు. ఈ 38 మంది రచయితలలో చాలామంది గురించి నేటికీ సాహిత్యలోకానికి తెలీదు అంటే ఆశ్చర్యపోనవసరంలేదు. వారిలో నవలలు రాసిన వారుగా కింది వారిని తెలియజేశారు.

1. బూదూరు రామానుజులు రెడ్డి – మీరాబాయి (నవల)
2. తిరువెంగళసూరి – తెలుగు వెలుగు (చారిత్రక నవల)
3. కె. సభా – భిక్షుకి (నవల)
4. వల్లంపాటి వెంకటసుబ్బయ్య – ఇంద్రధనుస్సు, దూరతీరాలు
5. ఆర్.యస్. సుదర్శనం – అనుబంధాలు, మళ్ళీవసంతం, అసురసంధ్య
6. రామకృష్ణ – స్వయంకృతం
7. గోపీకృష్ణ – నవలలు రాసినట్లు చెప్పారు. కానీ వాటిని చూడలేదని చెప్పారు

పై వివరాల ప్రకారం చూస్తే 1950కి ముందు చిత్తూరు జిల్లా నుండి నవలా రచన జరగలేదని వల్లంపాటి **(రాయలసీమలో ఆధునిక సాహిత్యం – సామాజిక, సాంస్కృతిక విశ్లేషణ)** లాంటి వారు చెప్తున్న మాట అవాస్తవమని తెలుస్తుంది. ఎలా అంటే బూదూరు రామానుజులు రెడ్డి 'మీరాబాయి' (ప్రస్తుతానికి అలభ్యం) అనే నవలను రాసినట్లు మధురాంతకం రాజారాం చెప్పారు. కానీ ఈ నవల ఎప్పుడొచ్చిందో చెప్పలేదు. అయితే బూదూరు రామానుజులు రెడ్డి 1925లో రత్నాబాయి, 1927లో వీర గాంధర్వము, 1931లో మోహన అనే నవలలు రాశాడని ప్రస్తుతం లభిస్తున్న సమాచారాన్ని బట్టి తెలుస్తూ వుంది. కాబట్టి మీరాబాయి నవల 1940కి ముందే వచ్చి ఉంటుందని చెప్పవచ్చు. అలాగే కె. సభా రాసిన 'భిక్షుకి' నవల 1948లో వచ్చింది. మధురాంతకం రాజారాం తిరువెంగళసూరి రాసిన 'తెలుగువెలుగు' అనే చారిత్రక నవల ఎప్పుడొచ్చిందో చెప్పక పోయినప్పటికీ కె. సభా రాసిన 'భిక్షుకి' నవల కంటే ముందే వచ్చినట్లు చిత్తూరు జిల్లా సాహిత్యచరిత్ర రాసిన క్రమాన్ని బట్టి తెలుస్తూ వుంది.

మొదలి నాగభూషణశర్మ తెలుగు నవలపై ప్రచురించిన గ్రంథం 'తెలుగు నవలా వికాసము'. వీరు ఈ గ్రంథంలో ఆర్.ఎస్. సుదర్శనం రచించిన 'మళ్ళీ వసంతం' అనే ఒక్క నవల గురించి తప్ప మరే ఇతర చిత్తూరు జిల్లా నలలను గానీ, నవలా రచయితలను గానీ ప్రస్తావించలేదు.

పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు తెలుగు నవలపై రాసిన గ్రంథం **'తెలుగు నవలా సాహిత్య వికాసము'**. వీరు చిత్తూరు జిల్లా నవలా సాహిత్య విషయంలో మరే ఇతర నవలా సాహిత్య చరిత్రకారుడూ చెప్పనంత సమాచారాన్ని తన గ్రంథంలో చెప్పారు. వీరు గ్రంథం ప్రకటించే నాటికి తెలుగులో దాదాపు ముప్పైవేలకు చేరువలో నవలలు ఉన్నాయి. వెయ్యి నవలల దాకా పరిశీలించిన వీరు చిత్తూరు జిల్లాలకు సంబంధించి 10 నవలలను తన గ్రంథంలో ప్రస్తావించారు. అందులో ప్రధానంగా చెప్పుకోవలసింది బూదూరు రామానుజుల రెడ్డి రాసిన మూడు నవలలు. అవి రత్నాబాయి (1925), వీర గాంధర్వము (1927), మోహన (1931).

నవలా శిల్పంపై ఒక ప్రామాణిక గ్రంథాన్ని **(నవలా శిల్పం)** సాహిత్యలోకానికి పరిచయం చేసిన విమర్శకులు వల్లంపాటి వెంకట సుబ్బయ్య. 1989లో వచ్చిన ఈ గ్రంథం నవలను అర్థం చేసుకోవడానికి కావాల్సిన భూమికను, నవలను ఏవిధంగా చదివి, అర్థం చేసుకొని, అధ్యయనం చెయ్యాలి అన్న విషయాలను చాలా విపులంగా వివరించింది. ఈ గ్రంథంలో తెలుగులో మొదటి నవల ఏది అనే విషయం పట్ల సుదీర్ఘ చర్చ జరిగింది. తర్వాత నవల ప్రధానాంగాలను, కథాకథనాన్ని చెప్పే క్రమంలో అనేక నవలలను ఉటంకిస్తూ ఈ గ్రంథాన్ని పూర్తి చేశారు. ఈ క్రమంలో చిత్తూరు జిల్లా నవలలైన మళ్ళీ వసంతం (ఆర్. ఎస్. సుదర్శనం), బంగారు నడిచిన బాట (కలువకొలను సదానంద) అనే రెండింటిని మాత్రమే ప్రస్తావించారు తప్ప మరే ఇతర నవలలనూ వీరు ప్రస్తావించలేదు. కోస్తా ప్రాంతంలో నవల ముందుగా ఆవిర్భవించడానికి, రాయలసీమలో నవల ఆలస్యంగా ఆవిర్భవించడానికి గల కారణాలను విపులంగా చెప్పిన వీరు 1950కి ముందు చిత్తూరు జిల్లా నుండి వచ్చిన నవలల గురించి మాట మాత్రమైనా ప్రస్తావించకపోవడం గమనించదగ్గ విషయం. ఇందుకు గల కారణాలు నవలాశిల్పంలో కనిపించక పోయినప్పటికీ వీరు రాసిన 'రాయలసీమలో ఆధునిక సాహిత్యం – సామాజిక, సాంస్కృతిక విశ్లేషణ' అనే గ్రంథంలో కనిపిస్తుంది.

ఈ గ్రంథంలో *"1872లో అచ్చయిన "శ్రీరంగరాజు చరిత్ర" సంప్రదాయం రాయలసీమలో చాలాకాలం కొనసాగలేదు"* (రాయలసీమలో ఆధునిక సాహిత్యం – సామాజిక, సాంస్కృతిక విశ్లేషణ, 2006: 88.) అని తెలియజేశారు. ఇందుకు గల కారణం వీరి దృష్టిలో 1950కి ముందు రాయలసీమ నుండి నవలలు రాలేదని. ఇదే గ్రంథంలో వల్లంపాటి వెంకటసుబ్బయ్య ఇంకొక సందర్భంలో కోస్తా జిల్లాలలో ఉన్నవ(మాలపల్లి), విశ్వనాథ(వేయిపడగలు), బాపిరాజు(నారాయణరావు), ఉప్పల లక్ష్మణరావు(అతడు-ఆమె), చలం(దైవమిచ్చిన భార్య, అరుణ), బుచ్చిబాబు(చివరకు మిగిలేది) మొదలైనవారు నవలను ఉన్నత శిఖరాలకు తీసుకుపోయారు కానీ రాయలసీమ రచయితలు నవలా రచన పట్ల అంత శ్రద్ధ చూపలేదు అన్న అభిప్రాయాన్ని తెలియజేస్తూ ఇలా అంటారు. *"1950 దశకం దాటే వరకూ వీటితో సమానమైన నవలలు కాదుకదా సాధారణ ప్రతిభ ఉన్న నవలలు కూడా రాయలసీమ నుంచి రాలేదు"* (రాయలసీమలో ఆధునిక సాహిత్యం – సామాజిక, సాంస్కృతిక విశ్లేషణ,

2006: 91.). దీనిని బట్టి 1950కి ముందు చిత్తూరు జిల్లా నుండే కాక మొత్తం రాయలసీమ నుండే నవలలు రాలేదని వీరి అభిప్రాయం.

అయితే ఈ గ్రంథంలో చిత్తూరు జిల్లా నుండి వచ్చిన కొన్ని నవలలను వీరు తెలియచేశారు. అవి భిక్షుకి (కె. సభా), ఇంద్రధనుస్సు, దూరతీరాలు, మమతలు–మంచు తెరలు, జానకి పెళ్లి (వల్లంపాటి), ఇన్ క్రెడిబుల్ గాడెస్, మూగవాని పిల్లనగ్రోవి, సిటీ బ్యూటిఫుల్, అతడు అడవిని జయించాడు, రాముడుండాడు–రాజ్జింవుండాది, చివరిగుడిసే (కేశవరెడ్డి), మునికన్నడి సేద్యం (నామిని), స్వర్ణసీమకు స్వాగతం (మధురాంతకం మహేంద్ర), చీకటిరాజ్యం (రాసాని), వలస దేవర (జొన్నవిత్తుల శ్రీరామచంద్ర మూర్తి), ఏటిగట్టు (లంకిపల్లి), పల్లె పిలిచింది (ద్వారక), జేజవ్వ (పి. రాజగోపాలనాయుడు), బంగారు నడిచినబాట, గందరగోళం (కలువకొలను సదానంద), మళ్ళీ వసంతం, సంసార వృక్షం (ఆర్.ఎస్. సుదర్శనం), రెడ్డెమ్మ గుండు (వసుంధరాదేవి).

తర్వాత నవలాసా హిత్యానికి సంబంధించి అనేక కోణాలలలో పరిశోధన చేసిన ఎందరో పరిశోధకులు, విమర్శకులు ఆయా సందర్భాలకు అనుగుణంగా చిత్తూరుజిల్లా నవలలను ప్రస్తావించినప్పటికీ 1950కి ముందు వచ్చిన నవలలను తెలియజేయలేదు.

ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమాల నేపథ్యంలో ఇటీవల ఏ ప్రాంత సాహిత్యాన్ని ఆ ప్రాంత సాహితీకారులు, విమర్శకులు, పరిశోధకులు వెలికితీసే ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగా పొదిలి నాగరాజు 'రాయలసీమ నవల' తొలిదశ–ఒక అధ్యయనం (1872 నుండి 1950 వరకు) అనే అంశం పైన పరిశోధన చేసి పుస్తకంగా ప్రచురించారు. ఇందులో 1950కి ముందు వచ్చిన 24 రాయలసీమ నవలలను విశ్లేసించారు. వీటిలో చిత్తూరు జిల్లాకు సంబంధించిన ఐదు నవలలను వీరు తెలియజేశారు. అవి చాందసుల్తానా, తానీషా, రత్నాబాయి, భానుమతి, పేటికాంతార శవము. పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు చెప్పిన మోహన, వీరగాంధర్వము అనే నవలలు వీరికి లభించినట్లు లేదు. వీటితో పాటూ 1948లో వచ్చిన కె. సభా గారి నవల 'భిక్షుకి' కూడా వీరికి లభించినట్లులేదు. పై మూడు నవలల్లో 1950కి ముందు వచ్చిన మోహన(1931), భిక్షుకి(1948) అనే రెండు నవలలు నాకు లభించాయి.

పైన చెప్పిన నవలా పరిశోధకులు, విమర్శకులు పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు, మధురాంతకం రాజారాం, పొదిలి నాగరాజు మినహా ఎవరూ కూడా 1950కి ముందు చిత్తూరు జిల్లా నుండే కాదు మొత్తం రాయలసీమ నుండి కూడా నవలలు రాలేదనే అభిప్రాయాన్నే తెలియజేశారు.

4.2. చిత్తూరు జిల్లా నవల – వస్తు వైవిధ్యం:

1920లో మొదలైన చిత్తూరు జిల్లా నవలా సాహిత్యం ఇప్పటికి వందసంవత్సరాల కాలాన్ని పూర్తి చేసుకుంది. ఈ వంద సంవత్సరాల కాలంలో చిత్తూరు జిల్లా నుండి నవలా రచన చేపట్టినవారు దాదాపు నలభై ఏడు మందికి పైగానే ఉన్నారు. దూబగుంట వెంకటరమణయ్యతో మొదలు పెడితే బూదూరు రామానుజుల రెడ్డి, యం. వి. పాపన్న గుప్త, కె. సభా, మధురాంతకం

రాజారాం, ఆర్.ఎస్. సుదర్శనం, పాటూరు రాజగోపాలనాయుడు, వల్లంపాటి, నూతలపాటి, కలువకొలను సదానంద, కాణిపాకం లింగన్న, నామిని సుబ్రహ్మణ్యం నాయుడు, పి. కేశవరెడ్డి, నాయుని కృష్ణమూర్తి, రాసాని, మధురాంతకం నరేంద్ర, మధురాంతకం మహేంద్ర, ఆర్. వసుంధరా దేవి లాంటి ఎందరో సీరియస్ రచయితలతో పాటూ కె. ఎస్వీ, శైలకుమార్, వక్కంతం సూర్య నారాయణరావు, మేర్లపాక మురళి లాంటి పాపులర్ రచయితలూ ఈ జిల్లా నుండి నవలా రచనను చేపట్టి చిత్తూరు జిల్లా నవలా సాహిత్యానికి జవసత్వాలను కల్పిస్తూ తెలుగు నవలా సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తూ ఉన్నారు.

లభిస్తున్న సమాచారం మేరకు చూస్తే చిత్తూరు జిల్లా నుండి ఇప్పటి వరకూ 300లకు పైగానే నవలలు వచ్చాయి. అలాగే లభ్యం కాని నవలలు, అసలు ఇంత వరకు దృష్టికే రాని నవలలు కూడా ఉండి ఉండవచ్చు. వీటి విషయం పక్కన పెడితే, లభిస్తున్న వాటిలో దాదాపు సగానికి పైగా పాపులర్ రచయితల నవలలే ఉన్నాయి. ఇవి వ్యాపార దృష్టితోను, యువతను ఆకర్షింపజేసే దృష్టితోను వచ్చినట్లుగా వాటి శీర్షికలను బట్టే కొన్ని అర్థమవుతూ ఉన్నాయి. వీటిల్లో కొన్ని సీరియస్ నవలల జాబితాల్లోకి చేరతగినవి కూడా ఉన్నాయి. మిగిలిన నవలలు చాలా వరకూ సమాజ ప్రతిబింబితంగా, సామాజిక స్పృహతో, దార్శనిక దృష్టితోనూ వచ్చాయి. ఈ విషయాన్ని గురించి (కాలక్షేప లేదా వ్యాపార నవలలు, సామాజిక స్వభావం కలిగిన నవలలు) రాచపాళెం చంద్రశేఖర రెడ్డి తెలియజేస్తూ 'రెక్కాడినంతకాలం' నవలకు రాసిన ముందు మాటలో *"తెలుగు నవలకు 145 ఏళ్ళు (1872-2016) చరిత్ర ఉంది. తెలుగులో ఇప్పటి దాకా ఒక లక్ష నవలలు వచ్చి ఉండడానికి అవకాశముంది. వాటిలో 75 శాతం కాలక్షేప నవలలే, కాకుంటే వ్యాపార తిరోగమనవాద రచనలే. 25 శాతం నవలలు మాత్రమే సామాజిక స్వభావం కలిగినవి ఉంటాయి. వీటిలో కూడా గతాన్ని కీర్తించడానికి 10 శాతం నవలలు కష్టపడి ఉంటాయి. మిగతా 15 శాతం నవలలు వర్తమాన సామాజిక వాస్తవికతను ఆవిష్కరించే ప్రయత్నం చేశాయి. ఈ నవలల్లో కూడా వస్తురీత్యా శక్తివంతమైనవిగా ఉంటూ, నవలా లక్షణాలను సంపూర్ణంగా పుణికిపుచ్చుకున్నవి చాలా తక్కువ. చాలా తెలుగు నవలలు పెద్ద కథలుగా ఉంటాయి. ఎక్కువ మంది తెలుగు కాల్పనిక సాహిత్య రచయితలకు కథాశిల్పం పట్టుబడినంతగా నవలాశిల్పం పట్టుబడలేదు. 'మాలపల్లి', 'వేయిపడగలు', 'అతడు-ఆమె', 'జానకి విముక్తి', 'ఖాకీ బతుకులు', 'కొల్లాయిగట్టితేనేమి', 'నారాయణరావు', 'మట్టిమనిషి', 'రత్తాలు-రాంబాబు', 'రక్తకాసారం' వంటి నవలలు తెలుగులో ఎక్కువ రాలేదు. నవలాశిల్పం పట్టుబడటం అంటే ఎక్కువ పుటలు ఉండటం మాత్రమే కాదు. ఎక్కువ పుటలలో ఎక్కువ జీవితం చిత్రించేది నవల. సమగ్రత అనేదానికి హద్దు లేకపోయినా, నవల సమగ్ర జీవితానికి ప్రతిబింబం అనుకుంటున్నాం. నిర్దిష్ట స్థలకాలాలకు చెందిన సమాజ జీవితంలోని వైవిధ్యభరితమైన మానవ సంబంధాలను సాధ్యమైనంత విస్తృతంగా చిత్రించేది నవల. అలా చిత్రించిన నవలలు తెలుగులో పరిమితంగా వచ్చాయి"* (రెక్కాడినంత కాలం నవల, 2018: 5)అని అంటారు.

ఈ విధంగా చూస్తే చిత్తూరు జిల్లా నుండి వచ్చిన అన్ని నవలలను సేకరించి వస్తు పరంగా, శిల్ప పరంగా విశ్లేసించడం అనేది ఒక్కరి వల్ల సాధ్యమయ్యే పని కాదు. సంస్థాగతంగా చేయతగిన పని. అందుకని నా పరిశోధనా పరిమితుల దృష్ట్యా, నేను పెట్టుకున్న పరిధులకులోబడి ఈ అంశాన్ని 1975సంవత్సరం వరకూ వచ్చిన నవలలను, అందులోనూ సీరియస్ రచయితలు రాసిన నవలలను మాత్రమే నా పరిధిలోకి తీసుకొని, వాటిని మాత్రమే వస్తు పరంగా విశ్లేషించే ప్రయత్నం ఈ అధ్యాయంలో చేస్తున్నాను.

కాలక్షేప లేదా వ్యాపార దృష్టితో రచనలు చేసిన వారి నవలలను మినహాయిస్తే, నాకు లభించిన సమాచారం మేరకు 1920 నుండి 1975వ సంవత్సరం వరకూ 21 నవలలు వచ్చాయి. వీటిలో 4 నవలలు ప్రస్తుతం లభించడం లేదు. వాటి వివరాలను కింద పట్టిక రూపంలో ఇస్తున్నాను.

క్రమ సంఖ్య	నవల పేరు	రచయిత పేరు	ప్రచురణ సంవత్సరం
1.	చాందసుల్తానా	దూబగుంట వెంకటరమణయ్య	1920
2.	తానీషా	దూబగుంట వెంకటరమణయ్య	1925
3.	రత్నాబాయి	బూదూరు రామానుజుల రెడ్డి	1925
4.	భానుమతి	యం.వి. పాపన్న గుప్త	1930
5.	మోహన	బూదూరు రామానుజుల రెడ్డి	1931
6.	భిక్షుకి	కె. సభా	1948
7.	అనుబంధాలు	ఆర్.ఎస్. సుదర్శనం	1958
8.	మళ్ళీవసంతం	ఆర్.ఎస్. సుదర్శనం	1960
9.	మొగిలి	కె. సభా	1960
10.	ఇంద్రధనుస్సు	వల్లంపాటి వెంకటసుబ్బయ్య	1962
11.	దూరతీరాలు	వల్లంపాటి వెంకటసుబ్బయ్య	1965
12.	అసురసంధ్య	ఆర్.ఎస్. సుదర్శనం	1966
13.	రామానుజుని ప్రతిజ్ఞ	పి. రాజగోపాల నాయుడు	1969
14.	త్రిశంఖుడి స్వర్గం	మధురాంతకం రాజారాం	1969
15.	చిన్న ప్రపంచం సిరివాడ	మధురాంతకం రాజారాం	1971
16.	గాడిద బ్రతుకులు	కలువకొలను సదానంద	1972
17.	ఓరుగల్లు పునరాక్రమణ	పి. రాజగోపాల నాయుడు	1972–73(ఆంధ్రప్రదేశ్ మాస పత్రిక)

పై నవలలను వస్తు పరిశీలనా సౌలభ్యం కోసం రెండు విభాగాలుగా విభజించాను. అవి

1. 1920 నుండి 1950 వరకూ వచ్చిన నవలలు
2. 1951 నుండి 1975 వరకూ వచ్చిన నవలలు

4.2.1. 1920 నుండి 1950 వరకకు వచ్చిన నవలలు

1920 నుండి 1950 వరకు ఆరు నవలలు వచ్చాయి. వస్తు వైవిధ్యతా దృష్ట్యా వీటిని చారిత్రక నవలలు, సాంఘిక నవలలు అని రెండు ప్రధాన శీర్షికలుగా విభజించి, సాంఘిక నవలలను మళ్ళీ సంఘ సంస్కరణ నవలలు, వెట్టి చాకిరీ సమస్యను చిత్రించిన నవలలు అనే రెండు ఉపశీర్షికలుగా విభజించి విశ్లేషిస్తున్నాను.

4.2.1.1. చారిత్రిక నవల

నవల అనేది ఎక్కువ శాతం కల్పితమైన విషయాలతో కూడుకొని ఉంటుంది. అలాగే చరిత్ర అనేది యదార్థమైన సంఘటనలతో కూడుకొని ఉంటుంది. ఈ రెండింటి మేళవింపుతో కూడినదే చారిత్రక నవల అని మనం చెప్పుకోవచ్చు. అంటే చరిత్రలో యదార్థంగా జరిగినటువంటి ఒక ప్రాంతానికి సంబంధించిన చరిత్రను గానీ, సంఘటనను గానీ, ఒక వ్యక్తికి సంబంధించిన విషయాన్ని గానీ తీసుకొని దానికి కొంత కల్పనను జోడించి రాసేదే చారిత్రక నవల అని చెప్పవచ్చు. చారిత్రిక నవల గురించి పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు *"జరిగిపోయిన ఒకానొక చారిత్రక సంఘటనను ఆధారంగా గ్రహించి, దానిని ఆత్మగాచేసి దాని చుట్టూ పెక్కు అద్భుత సంఘటనలతో, విచిత్ర సన్నివేశములతో కథాకథన సన్నద్ధతతో రచియించిన మహత్తర గ్రంథమే చారిత్రకనవల"* (తెలుగు నవలా వికాసము, 1971: 38) అని చెప్తూ *"ఇతివృత్తముపూర్తిగా చరిత్రకు సంభందించినదై యుండి, కొన్ని ముఖ్య సన్నివేశములు విశిష్ట, కల్పిత లక్షణములతో చారిత్రక సన్నివేశములకు భంగము వాటిల్లకుండునట్లు పాత్రపోషణము చేయునదియే చారిత్రక నవల"* అని నిర్వచించారు. (తెలుగు నవలా వికాసము, 1971: 38).

అలాగే వల్లంపాటి వెంకటసుబ్బయ్య *"ఒక నిర్దిష్ట చారిత్రక దశలో రాజకీయాల చేత ప్రభావితమైన సమాజాన్నీ, సమాజంలోని వ్యక్తుల్నీ చిత్రించే సాహిత్య ప్రక్రియగా చారిత్రక నవలను అభివర్ణించుకోవచ్చు"* (నవలా శిల్పం, 1989: 117) అని చారిత్రక నవలను నిర్వచించారు. అదే విధంగా ముదిగంటి సుజాతారెడ్డి చారిత్రక నవలను *"చరిత్రనాధారంగా చేసుకున్న ఇతివృత్తం గల నవలలను చారిత్రక నవలలంటారు"* అని నిర్వచించారు. (నవలానుశీలనం, 2017: 186).

చారిత్రక నవలా నిర్వచనాలు అలా ఉంచితే ఈ నవలల ప్రధానోద్దేశం దేశభక్తిని ప్రబోధించడం, దేశాభిమానాన్ని కలుగజేయడం, స్వేచ్ఛా స్వాతంత్ర్యేచ్ఛలను రేకెత్తించడం. అలాగే చరిత్రను సంస్కృతిని తెలియజేస్తూ గత వైభవాన్ని తెలియజేయడం, తద్వారా సాంస్కృతిక పునరుజ్జీవనం పెంపొందించడం.

భారతదేశంలో మొదట సాంఘిక నవల ఏవిధంగా అయితే బెంగాలీ భాషలో మొదలైందో అదే విధంగా చారిత్రక నవల కూడా మొదట బెంగాలీ భాషలోనే మొదలైంది. ఆ తర్వాతే వివిధ భారతీయ భాషలలోకి ప్రవేశించింది. బంకించంద్ర చటర్జీ, రమేష్ చంద్రదత్తు, మెడోస్ టేయిలర్ లాంటి బెంగాల్ చారిత్రక నవలా రచయితల రచనల నుండి స్ఫూర్తి పొంది భారతీయ చారిత్రక నవల తెలుగులోకి ప్రవేశించింది. అందుకే ప్రారంభ రోజుల్లో వీరి నవలలకు అనువాదాలు, అనుకరణలు తెలుగులో ఎక్కువగా పుట్టుకొచ్చాయి. ఇక తెలుగులో మొదటి చారిత్రక నవలా విషయానికి వస్తే 'హేమలత' మొదటిది. దీనిని చిలకమర్తి లక్ష్మీనరసింహం 1896లో రాశారు. ఆ తర్వాత కేతవరపు వెంకటశాస్త్రి, వేలాల సుబ్బారావు, భోగరాజు నారాయణ మూర్తి, వెంకట పార్వతీశ్వర కవులు, అక్కిరాజు ఉమాకాంతం, నోరి నరసింహశాస్త్రి, బాపిరాజు, విశ్వనాథ లాంటి వారు తెలుగులో అనేక చారిత్రక నవలలను రాశారు.

అదే విధంగా చిత్తూరు జిల్లా చారిత్రక నవలల విషయానికి వస్తే, చిత్తూరు జిల్లాలో మొదటి నవల 1920లో ప్రారంభమయ్యింది. ఈ కాలం తెలుగు నవలా సాహిత్య వర్గీకరణలో అనువాద యుగం. ఈ అనువాద యుగంలో ఎక్కువ చారిత్రక నవలలు (అనువాద/స్వతంత్ర) వచ్చాయి. అందుకే ఈ కాలాన్ని చారిత్రక నవలా యుగం అని కూడా అన్నారు. ఈ విధంగా చూస్తే 1920లో చిత్తూరు జిల్లా నవల ప్రారంభమైతే, ఆ ప్రారంభ నవల చారిత్రక నవల కావడం గమనార్హం. 1920 – 1950 మధ్య కాలంలో చిత్తూరు జిల్లా నుండి చాందసుల్తానా (1920), తానీషా (1925) అనే రెండు చారిత్రక నవలలు వచ్చాయి. ఈ రెండు నవలలనూ శ్రీకాళహస్తి ప్రాంతానికి చెందిన దూబగుంట వెంకట రమణయ్య రాశారు.

4.2.1.1.1. చాందసుల్తానా:

నవలా సారాంశం

మహమ్మద్ తుగ్లక్ 14 శతాబ్దంలో డిల్లీని పరిపాలిస్తున్న కాలంలో దక్షిణ దేశంలో సేనానాయకుడుగా ఉన్న 'హసన్ గంగూ' స్వతంత్రుడయ్యాడు. ఇతను మొదట గంగూ అనే బ్రాహ్మణుని వద్ద విధేయుడుగా ఉండేవాడు. అతని విధేయత చూసి ఆ బ్రాహ్మణుడు హసన్ గగూను నవాబు దగ్గరకు తీసుకుపోయి పది వేల గుర్రాలకు ఆధిపత్యాన్ని ఇప్పిస్తాడు. ఆ తర్వాత ఇతను ఢిల్లీ రాజు కోసం అనేక యుద్ధాలు చేసి మంచి పేరు సంపాదించుకుంటాడు. 1347లో అల్లా ఉద్దీన్ షాహాగా పేరు మార్చుకొని దక్షిణ దేశంలో స్వతంత్రుడై రాజుగా ప్రకటించుకుంటాడు. ఇతను రాజు అయ్యాక గంగూ బ్రాహ్మణుని జ్ఞాపకార్థంగా తనకు హసన్ గంగూ అని, తన వంశానికి బహమన వంశం అని పేర్లు పెట్టుకొని బహమనీ రాజ్యాన్ని స్థాపించి పాలిస్తుండేవాడు. ఇతని తర్వాత బహమనీ రాజ్యాన్ని ఎనిమిది మంది రాజులు పరిపాలించారు. బహమనీ రాజులలో ఎనిమిదవ వాడైన మహమ్మద్ షాహా (1482-1528) కాలంలో ఈ రాజ్యం బీదారు(బీదర్), బీరారు, అహమ్మద్ నగర్, బీజాపూర్, గోల్కొండ అనే ఐదు రాజ్యాలుగా ఏర్పడింది. ప్రస్తుత

నవలైన 'చాందసుల్తానా'లో అహమ్మద్ నగర్, బీజాపూర్ రాజ్యాలకు సంబంధించిన చరిత్రలోని కొన్ని ముఖ్యమైన ఘట్టాలను తీసుకొని రచయిత రాశారు.

అహమ్మద్ నగరాన్ని అహమ్మద్ షాహా అనే రాజు 1489 లో స్థాపించాడు. ఇతని తర్వాత బురుహాన్ నిజాం షాహా, హుసేన్ నిజాం షాహాలు పాలించారు. హుసేన్ నిజాం షాహా కూతురే ఈ నవలలోని ప్రధాన పాత్ర అయిన చాందసుల్తానా (చాందబీబీ). ఈమెను హుసేన్ నిజాం షాహా బీజాపూర్ రాజైన అల్లీ ఆదిల్ షాహాకిచ్చి వివాహం చేస్తాడు. అల్లీ ఆదిల్ షాహా అకస్మాత్తుగా చంపబడతాడు. తర్వాత ఇతని తమ్ముని కొడుకు రెండవ ఇబ్రహీం ఆదిల్ షాహా చిన్నవాడవటంతో కమీల్ ఖాన్ అనే మంత్రి సహాయంతో చాందబీబీనే రాజ్య పాలన చేస్తూ ఉండేది. బీజాపూర్లో చాందబీబీ దగ్గర మంత్రి పదవుల కోసం అనేక కొట్లాటలు జరుగుతూ ఉండేవి. ఈ సమయంలో దిలాల్ ఖాన్ అనేక కుట్రలు పన్ని మంత్రి అవుతాడు. ఇతనికి మిక్కిలి రాజ్య కాంక్ష ఉండడంతో చాందబీబీ ఉండగా తన ఆటలేవీ సాగవని తెలిసి ఆమెను ఎలాగైనా అహమ్మద్ నగరానికి పంపించేయాలని అనుకుంటాడు. ఈ కారణంతోనే ఇబ్రహీం ఆదిల్ షాహా చెల్లెలైన ఖుదీజా సుల్తానాను అహమ్మద్ నగర్ రాజైన మీరాన్ హుసేన్ కు ఇచ్చి వివాహం చేయించి ఖుదీజా సుల్తానాకు తోడుగా చాందబీబీని అహమ్మద్ నగరానికి పంపించేస్తాడు. అహమ్మద్ నగరన్ని మీరాన్ హుసేన్ తర్వాత బురానా షాహా, ఇస్మాయిల్ షాహా, ఇబ్రహీం నిజాం షాహాలు పరిపాలిస్తారు. ఇబ్రహీం నిజాం షాహా అనంతరం ఇతని కొడుకు బహదర్ చిన్నవాడవటంతో చాందబీబీ అతని పేర రాజ్యాధికారం చేస్తుండేది. బహదర్ కు షాజీబీబీ అనే అక్క ఉండేది. ఈమె వ్యవహారాలను కూడా చాందబీబీనే చూసుకుంటూ ఉండేది. ఈమె చిన్నప్పటి నుండీ బీజాపూరులో పెరిగినందు వలన ఇబ్రహీం ఆదిల్ షాహా పినతండ్రి కొడుకు ముస్తఫా అంటే ఇష్టపడుతూ ఉండేది. చాందబీబీకి ప్రధాన మంత్రులుగా మాలికాంబారు, హుసేను మీజా, అబ్దుల్ రహిమాను, హమీదు ఖాను ఉండేవారు.

మియర్ మంజు అహమ్మద్ నగరంలో ఒక సర్దారుడుగా ఉండేవాడు. ఇతను దక్కనీ తురకలలో ప్రముఖుడు. ప్రస్తుతం అహమ్మద్ నగర్ కు సామంత రాజ్యంగా ఉన్న శివనేరి దుర్గాన్ని ఆక్రమించుకొని నాయకుడుగా చలామణీ అవుతున్నాడు. ఇతనికి, చాందబీబీకి పడని కారణంగా ఎలాగైనా చాందబీబీని, బహదర్ ను అణచి రాజ్యాన్ని చేజిక్కించుకోవాలని చూస్తున్నాడు. ఇతనికి సహాయంగా ఖాదరు, హైదరు, దస్తగిరి అనే వాళ్ళు మంత్రులుగా ఉండేవాళ్ళు. మియర్ మంజు తను ఆశించిన దాన్ని సఫలం చేసుకోడానికి అక్బర్ సహాయాన్ని అర్థిస్తాడు. అందుకు ప్రతిఫలంగా అహమ్మద్ నగరంలో సగభాగాన్ని ఇస్తానని చెప్తాడు. అక్బర్ దీనికి ఒప్పుకొని తన కొడుకు మురాదును సైన్యంతో పంపడానికి ఒప్పుకుంటాడు. ఈ లోగా మియర్ మంజు అతని మంత్రులు షాజీబీబీ–ముస్తఫాల మధ్య దూరాన్ని పెంచడం, షాజిబీబీని మియర్ మంజు వివాహం చేసుకునేలా సహాయం చేయడం వీలుకాని పక్షంలో అందరినీ హతమార్చడం వంటి ప్లానులో ఉంటారు. ఈలోగా మియర్ మంజు వద్ద ప్రధాన మంత్రిగా ఉన్న ఖాదర్ అహమ్మద్ ఖానుడనే

పేరుతో చాందబీబీ మంత్రివర్గంలో ఒకడుగా ఆపై, ఆమెకు మిక్కిలి నమ్మదగిన వాడుగా తయారవుతాడు.

చాందబీబీని చంపడానికి మియర్ మంజు, ఖాను కలిసి ఒక పథకాన్ని పన్నుతారు. చాందబీబీని జున్నూర్ పట్టణానికి రావాలని మాలికాంబరు చెప్పినట్లుగా ఒక కల్పిత లేఖను తయారు చేసి ఆమెను నమ్మిస్తాడు అహమ్మద్ ఖాను. చాందబీబీ బహదర్ని వెంటపెట్టుకొని ఖానునితో జున్నూరుకు బయలుదేరుతుంది. ఖానుడు వేసిన పథకం ప్రకారం ఆమెను దారి తప్పించి చంపబోతాడు. చాందబీబీ అతని మోసాన్ని గ్రహిస్తుంది. ఈలోగా మాలికాంబరు, హుసేను మారువేషాలతో వచ్చి వారిని కాపాడుతారు. అక్కడున్న వారిలో కొంత మంది బహదరును ఎత్తుకెళ్ళిపోతారు. చాందబీబీ ఖానున్ని కారాగారంలో బంధిస్తుంది. బహాదరును తీసుకువెళ్తున్న దొంగలకు షాజిబీబీని కలుసుకోవడానికి వెళ్తున్న ముస్తఫా ఎదురవుతాడు. విషయాన్ని గ్రహించిన ముస్తఫా వారితో పోరాడి గాయాలపాలై వారికి బందీగా చిక్కుతాడు. మియర్ మంజు బహదరును, ముస్తఫాను బందిస్తాడు.

చాందబీబీకి సామంతుడుగా ఉండడానికి ఇష్టపడని మియర్ మంజు ఆమెపై యుద్ధం చేయడానికి సన్నద్ధుడవుతాడు. అప్పటికే అక్బర్ సహాయాన్ని కోరి ఉండడంతో అతడు మియర్ మంజుకు సహాయంగా అహమ్మద్ నగరాన్ని ఆక్రమించడానికి తన కొడుకైన మురాదును వెళ్ళిరమ్మని కొంత సైన్యాన్నిచ్చి పంపిస్తాడు.

ఇంతలో మాలికాంబరు స్త్రీ వేషంలో శివనేరికి వెళ్లి ముస్తాఫాకు స్త్రీ వేషం వేయించి అతనిని చేరసాల నుండి తప్పిస్తాడు. ముస్తాఫా మీరన్ బీగా పేరు మార్చుకొని తన ప్రేయసి అయిన షాజిబీబీ వద్ద కాలం గడుపుతూ ఉంటాడు. ఇది తెలిసిన మియర్ మంజు కోపించి చాందబీబీని తీసుకురావలసిందిగా కొంత మందిని పంపిస్తాడు. వారు స్త్రీ వేషంలో ఉన్న ముస్తఫాను చాందబీబీ అనుకొని తీసుకెళ్తుండగా మాలికాంబరు ముస్తఫాను రక్షించి అహమ్మదు నగరుకు చేరుస్తాడు.

అహమ్మద్ నగరును ఆక్రమించడానికి మురాద్ తన సైన్యంతో సిద్ధంగా ఉన్నాడన్న సంగతి చాందబీబీకి తెలిసి మాలికాంబరు కోసం ఎదురు చూస్తూ ఉంటుంది. అప్పటికే మారువేషంలో ఉంటూ చాందబీబీకి, ముస్తాఫాను, అహమ్మద్ నగరును కాపాడుకుంటూ వస్తున్న మాలికాంబరు ఎదురవుతాడు. అప్పటికే ప్రమాదాన్ని గ్రహించిన మాలికాంబరు మొగల్ సైన్యంతో పోరాడడానికి బీజాపూర్, గోల్కొండ నవాబుల, సిద్దీ సర్దారుల సహాయాన్ని పొంది ఉంటాడు. యుద్ధం ప్రారంభమవుతుంది. రెండు సైన్యాలు చాలా నష్టపోతారు. ఇక లాభం లేదని తెలిసి మురాదు సంధికి సిద్ధపడతాడు. బహదూరును చాందబీబీకి, అహమ్మదు ఖానును మియర్ మంజుకు అప్పగించేటట్లు సంధి జరుగుతుంది. ఆ తర్వాత చాందబీబీకి, అహమ్మదును అహమ్మద్ నగరానికి పట్టాభిషిక్తుణ్ణి చేస్తుంది. షాజిబీబీ ముస్తాఫాల వివాహాన్ని జరిపిస్తుంది.

చాందబీబీతో సంధి అనంతరం మురాదు బీరారుపైకి దండయాత్రకి వెళ్తాడు. దక్షిణ ప్రాంత రాజులందరూ బీరారుపై తమకు హక్కు కలదని అక్కడున్న మొగల్ సైన్యాలని తరిమి కొట్టడానికి నిర్ణయించుకుంటారు. అందుకోసం చాందబీబీ సహాయాన్ని కోరుతారు. చాందబీబీ అందుకు సహకరిస్తుంది. యుద్ధంలో మురాదు గాయపడడం వల్ల యుద్ధం ఆగిపోతుంది. తర్వాత మురాదు చనిపోతాడు. ఈ విషయం తెలిసిన అక్బర్ దీనికంతటికి చాందబీబీ కారణమని ఆమె పై కోపించి అహమ్మద్ నగరాన్ని ఆక్రమించడానికి సైన్యంతో వస్తాడు. అహమ్మద్ నగర కోటను ముట్టడిస్తాడు. మియర్ మంజు సైన్యం అక్కడికి చేరుకుంటుంది. బీజాపూర్, గోల్కొండ రాజ్య సైన్యాలు చాందబీబీకి సహాయంగా అక్కడికి చేరుకుంటాయి. యుద్ధం భీకరంగా సాగుతూ ఉంటుంది. ఆదిల్ షాహా చేతిలో మియర్ మంజు మరణిస్తాడు. దీనితో మియర్ మంజు కొడుకు చాందబీబీపై పగను పెంచుకుంటాడు. మొగల్ సైన్యంతో కోట సింహద్వారం వద్ద చాందబీబీ ఉగ్రరూపాన్ని ధరించి పోరాడుతూ ఉంటుంది. మాలికాంబరు ఆమెకు సహాయంగా పోరాడుతూ ఉంటాడు. యుద్ధంలో అక్బర్ సేనాని అబుల్ ఫజల్ గాయపడడంతో అక్బర్ మొదటి రోజు యుద్ధాన్ని విరమిస్తాడు.

చాందబీబీ అక్బర్ చక్రవర్తితో పోరాడలేక బహదూరును తీసుకొని జున్నూరుకు పారిపోయిందని ఖాను అతని మనుషులు అహమ్మదు నగరం అంతటా అసత్య ప్రచారాన్ని గావిస్తారు. చాందబీబీపై పగను పెంచుకున్న మియర్ మంజు కొడుకు హసన్ మియ్యా చాందబీబీని అంతఃపురంలోకి చొరబడి చంపేస్తాడు. ఇది తెలిసి మాలికాంబరు, ముస్తాఫా, షాజిబీబీ కలిసి హసన్ మియ్యా అతని అనుచరులతో పోరాడుతారు. హసన్ మియ్యా ముస్తాఫాను చంపుతాడు. అది చూసి భరించలేని షాజిబీబీ హసన్ మియ్యాను చంపి తనను తానే పొడుచుకొని చనిపోతుంది. మాలికాంబరు అక్కడున్న కొంతమంది హసన్ మియ్యాను, అనుచరులను చంపి బహదూరును తీసుకొని అహమ్మదు నగరు నుండి వెళ్ళిపోతాడు. అక్బర్ అహమ్మదు నగరును ఆక్రమిస్తాడు.

నవలా విశ్లేషణ:

1920లో దూబగుంట వెంకటరమణయ్య రాసిన చాందసుల్తానా అనే ఈ నవలలోని కథ క్రీ.శ. 16వ శతాబ్దానికి చెందినది. అహమ్మదు నగర రాజైన హుసేన్ నిజాం షాహా కూతురు చాందబీబీ ధైర్య సాహసాలకు సంబంధించిన కథే ఈ నవలలోని ప్రధాన ఇతివృత్తం. ఈమె మొదట బీజాపూరు యువరాణిగా వెళ్లిన తర్వాత భర్త మరణానంతరం తన మరిది కొడుకు రెండవ ఇబ్రహీం ఆదిల్ షాహా చిన్నవాడవటంతో అతని పేర బీజాపూరు సంరక్షణా బాధ్యతను, అహమ్మద్ నగరకు వెళ్ళిన తర్వాత ఈమె తమ్ముని మనుమడు బహదర్ చిన్నవాడవటంతో అతని పేర అహమ్మద్ నగర సంరక్షణా బాధ్యతను మీద వేసుకొని ఎంతో సమర్థతతో రాజద్రోహుల నుండీ, నమ్మక ద్రోహుల నుండీ మొగల్ సైన్యం నుండీ అహమ్మద్ నగర రాజ్యాన్ని కాపాడిన స్త్రీగా మరో ఝాన్సీరాణి లాగా ఈ నవలలో ఈమె పాత్రను మలిచాడు నవలా రచయిత. ఈమె గొప్పతనాన్ని

తెలుపుతూ నవలకు భూమికను రాసిన చెలికాని లచ్చారావు ఈ విధంగా అంటారు. *"ఈమె రాజకీయ పరిపాలనా కుశలత్వంబును, మొగలాయిలతో బోరునపుడు చూపిన యసమాన శౌర్యోత్సాహంబులును వర్ణనాతీతములు. రణరంగమందు సార్వభౌముడగు అక్బరు చక్రవర్తి సైన్యంబుతో అసమాన ధైర్యోత్సాహంబులతో బోరాడి చెల్లాచెదరుజేసి వెనుకకు మరలించిన వీర వనిత. నేటి వరకును దక్షిణమున స్త్రీల శౌర్యమును గురించి ప్రస్తావన వచ్చినప్పుడు మును నీమే పేరును బేర్కొందురు".* (రాయలసీమ నవల తొలిదశ–ఒక అధ్యయనం, 2015: 104)

ఈ నవలలోని కథ క్రీ.శ. 16వ శతాబ్దానికి చెందినదైనా 19 శతాబ్ద పరిస్థితులకు తగినట్లుగా రచయిత రాశారు. ఈ నవల వచ్చే నాటికి (1920) దేశంలో గాంధీ నాయకత్వం ప్రారంభమై సహాయ నిరాకరణోద్యమం జరుగుతున్నది. దేశ ప్రజలలో స్వాతంత్ర్య కాంక్షలు వెల్లివిరుస్తున్నాయి. ఇటువంటి తరుణంలో ఈ నవల ద్వారా స్వాతంత్ర్య పోరాటాన్ని ప్రజల్లోకి పురికొల్పి తద్వారా ఆంగ్లేయులపై పోరాడాలని రచయిత ఆశించినట్లు తెలుస్తుంది. స్వయంగా రచయిత ఈ నవలను రాయడానికి కారణంగా రాజభక్తి, దేశాభిమానము అని చెప్పుకున్నారు. అందుకే నవలలో అనేక స్వాతంత్ర్యోద్యమ ప్రస్తావనలు చేశారు.

ఇక ఈ నవలలో కల్పిత పాత్రలు, సన్నివేశాల విషయానికి వస్తే మాలికాంబరు పాత్ర కల్పితంమైన పాత్ర. నిజానికి చరిత్రలో చాందసుల్తానా మరణానంతరం మాలికాంబరు అహమ్మదు నగరాన్ని పాలించినట్లు కొమర్రాజు వెంకటలక్ష్మణరావు రాసిన మహమ్మదీయ మహాయుగం ద్వారా తెలుస్తుంది. అలాగే ఈ నవలలో ముస్తఫా షాజిబీబీల మధ్య ప్రేమ కల్పితం. ఈ విషయాన్ని రచయితే స్వయంగా చెప్పారు. *"షాజిబీబీ ముస్తఫాల విషయము చారిత్రక మయినను కాకపోయినను కథాసరళి సొంపుగ నుండుటకై యావిషయమును నేనే కల్పించి వ్రాసితిని"* (రాయలసీమ నవల తొలిదశ–ఒక అధ్యయనం, 2015: 104).

4.2.1.1.2. తానీషా

దూబగుంట వెంకటరమణయ్య రాసిన మరో చారిత్రక నవల ఈ తానీషా. దీనిని 1925లో రాశారు. ఈ నవలకు 'గోలుకొండరాజ్యవినాశము' అని మరోపేరు. తానీషా రాజ్య పరిపాలన, అక్కన్న మాదన్నల స్వామికార్య దురంధరత్వం, రామదాసు భక్తి, మొగల్ రాజైన ఔరంజజేబు గోల్కొండ రాజ్యాన్ని వశపరుచుకొనే విధానం అనే చారిత్రకాంశాలను ప్రధానంగా చేసుకొని రచయిత ఈ నవలను రాశారు.

నవలా సారాంశం

గోల్కొండ సామ్రాజ్యాన్ని అబ్దుల్ హసన్ కుతుబ్ షాహా (1658–1687) పరిపాలిస్తుండేవాడు. ఇతనినే తానీషా అని కూడా పిలిచేవారు. ఇతడు విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి రాజ్యపాలన పట్ల శ్రద్ధ వహించకుండా ఉండేవాడు. అయినప్పటికీ ప్రజలను వారి బిడ్డలలాగా, హిందూ మహమ్మదీయ అనే భేదం లేకుండా అందరినీ సమానంగా చూస్తుండేవాడు.

హిందువులైన బ్రాహ్మణులకు ఉన్నత పదవులనిచ్చి గౌరవించేవాడు. పరిపాలనలో వీరికి సహాయంగా అక్కన్న, మాదన్న అనే మంత్రులు ఉండేవారు.

తానీషా అవలంభిస్తున్న మతాభిమానాన్ని సహించలేక ఇబ్రహీం అనే ఒక మహమ్మదీయుడు తానీషాపైన ఢిల్లీ చక్రవర్తి ఔరంగజేబుకు ఉన్నవి లేనివి కల్పించి ఒక ఉత్తరాన్ని రాసి తన అనుచరుడైన అమీన్ ఖాన్ కు ఇచ్చి పంపిస్తాడు. ఈ విషయాన్ని శివాజీ ద్వారా తెలుసుకున్న తానీషా అతని మంత్రులు అక్కన్న మాదన్నలు కలిసి ఇబ్రహీంను పదవి నుండి తొలగిస్తారు. దీనితో ఇబ్రహీం, తానీషా అక్కన్న మాదన్నల పట్ల వ్యతిరేకతతో ముస్లిం సోదరులందరినీ ఏకం చేసి తిరుగుబాట్లు చేస్తుంటాడు. అలాగే తానే స్వయంగా ఔరంగజేబును కలిసి విషయాన్ని వివరించి గోల్కొండ రాజ్యం పైకి దండెత్తి రావాలని ఆహ్వానిస్తాడు. అందుకు ఔరంగజేబు అంగీకరించి తన కొడుకు అజ్జంను సైన్యంతో పంపిస్తాడు. అజ్జం ఇబ్రహీంతో కలిసి హైదరాబాదు పరిసర ప్రాంతాల్లో ప్రజలపై దౌర్జన్యాలు చేస్తూ ఉంటారు. అక్కన్న మాదన్నలు అజ్జంను, అతని సైన్యాలను తిప్పి కొడతారు.

కొంత కాలానికి భద్రాచలంలో పరిపాలన సక్రమంగా సాగటంలేదని తానీషాకు ఫిర్యాదులు రావడంతో అక్కన్న మాదన్నల సహాయంతో నేలకొండపల్లికి చెందిన కంచెర్ల గోపన్నను అక్కడ తహసీల్దారుగా నియమిస్తాడు. అప్పటినుండీ రామదాసుగా పేరు మార్చుకొని అనేక గొప్ప కార్యక్రమాలు చేపడుతుంటాడు. ఇది నచ్చని అక్కడి ముస్లింలు ఇబ్రహీంతో కలిసి, రామదాసు ప్రభుత్వ ధనాన్ని ప్రజల సంక్షేమానికి కాక తన విలాసాలకు, బ్రాహ్మణ సంతర్పణలకు, హరిజన పోషణకు ఉపయోగిస్తున్నాడని, ఆలయ నిర్మాణం పేరుతో తను దోచుకున్న ఆరు లక్షల రూపాయలు మీకు కట్టవలసి ఉంటుందని, ఇప్పుడు తన దగ్గర అంత డబ్బులేదని ఒక లేఖను రాసి తానీషాకు పంపిస్తారు.

దీనిని విచారించడానికి అక్కన్న మాదన్నల అభిప్రాయం ప్రకారం రామదాసును బందిస్తారు. చెరసాలలో రామదాసును అనేక చిత్రవధలకు గురిచేస్తుంటారు. ఒకరోజు రాత్రి తానీష నిద్రపోతుండగా రామలక్ష్మణులనే పేరుతో ఇద్దరు వచ్చి రామదాసు ఇవ్వవలసిన ఆరు లక్షలను తానీషాకు ఇచ్చి వెళ్ళిపోతారు. ఇది కలగా భావించిన తానీషాకు కళ్ళముందు శ్రీరామ ముద్రతో ఉన్న బంగారు నాణేలను చూసేసరికి ఆశ్చర్యం వేస్తుంది. దీనితో రామదాసును చెరసాల నుండి విడుదల చేస్తాడు.

ఒకపక్క సరైన సమయం కోసం ఎదురుచూస్తున్న ఇబ్రహీం అజ్జంను హైదరాబాదుపైకి దండెత్తి రావాలని పిలుపునిస్తాడు. విషయాన్ని గ్రహించిన తానీషా తన సేనాని అయిన రజాక్ ను సైన్యంతో సిద్ధంగా ఉండాలని ఆదేశిస్తాడు. అలాగే శంభాజీ సహాయాన్ని కూడా కోరుతాడు. అప్పటికే శివాజీ చనిపోయి ఉండడంతో తండ్రికి ఇచ్చిన మాట ప్రకారం తానీషాకు సహాయం చేయడానికి శంభాజీ అంగీకరిస్తాడు. అక్కన్న మాదన్నలు హైదరాబాదు పరిసర ప్రాంతాలలో

ఆక్రమణ ప్రయత్నాలు చేస్తున్న మొగల్ సేనలను తరిమికొడతారు. దీనితో గోల్కొండ నవాబుకు మొగల్ సేనలకు మధ్య యుద్ధం తప్పనిసరౌతుంది.

అక్కన్న, మాదన్నలు దారివెంట వెళ్తుండగా కొంతమంది దుండగులు వచ్చి వారిని చంపేస్తారు. ఈ విషయం తెలిసిన తానీషా చాలా విచారించి, ఇటువంటి సమయంలో యుద్ధం కంటే సంధి ముఖ్యమని తలచి రెండు కోట్ల రూపాయలిచ్చి అజ్జంతో సంధి చేసుకుంటాడు. ఈ విషయం తెలిసిన ఔరంగజేబు ఇలాంటి సమయం మళ్ళీరాదని ఆలోచించి సంధి కుదరదని యుద్ధమే తప్పనిసరని అందుకు సిద్ధంగా ఉండాలని తానీషాను హెచ్చరిస్తాడు. తానీషా చేసేదేమీ లేక శంభాజీ సేనలతో కలిసి మొగల్ సేనలను ఎదుర్కోడానికి ప్రయత్నిస్తాడు. యుద్ధంలో శంభాజీ ఇబ్రహీంను చంపేస్తాడు. శంభాజీ సేనలు మొగలుల సేనలను భయభ్రాంతులకు గురిచేస్తారు. ఇది ఇలానే ఉంటే ప్రమాదమని తలచిన ఔరంగజేబు తానీషా దండనాయకులకు లంచాలిచ్చి తనవైపు తిప్పుకుంటాడు. చివరికి తానీషా ఓడిపోయి బంధీగా పట్టుబడుతాడు. శంభాజీ భయపడి అతని సేనలతో వెనుదిరుగుతాడు. గోల్కొండ సామ్రాజ్యం మొగల్ సామ్రాజ్యంలో విలీనమౌతుంది.

నవలావిశ్లేషణ

తానీషా కాలంలో గోల్కొండ రాజ్యం ఏ విధంగా నాశనం చెంది మొగల్ సామ్రాజ్యంలో కలిసిపోయిందో వివరించడమే ఈ నవలలోని ప్రధానాంశంగా కనిపిస్తుంది. అయితే ఈ నవలలో హిందూ ముస్లింల ఐక్యత కోసం తానీషా, అక్కన్న మాదన్నలు చేసిన కార్యాలను రచయిత చిత్రించిన విధానాన్ని చూస్తే, ఈ ఐక్యత ద్వారా ప్రజలలో జాతీయ భావన పెరిగి తద్వారా శత్రు సంహారాన్ని సులభంగా చేయవచ్చనే అంతర్లీన ఆలోచనతో, 1925కాలం నాటి సమకాలీన పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని హిందూ ముస్లింలు కలిసి ఆంగ్లేయులతో పోరాడాలని రచయిత ఈ నవల ద్వారా సూచించాడని తెలుస్తుంది. అందుకే రచయిత నవలకు రాసిన పీఠికలో *"ఈగ్రంథమించుక దేశాభ్యుదయమునకు దొడ్డుడగలదని యెంచి దానిని ముద్రించి ప్రచురించిన మా.రా.రా.శ్రీ. తమ్మన వెంకటరమణయ్యగారికిని యాతని సోదరులకును నాకృతజ్ఞతావందనము లర్పించుచున్నాడను"* (తానీషా, 1925: 3) అని అంటారు.

సామాజిక సమైక్యత అవసరమని చెప్పడంతో పాటూ రచయిత ఈ నవలలో తానీషా పట్ల అక్కన్న మాదన్నలు కలిగి ఉన్న విశ్వాసాన్ని, పొదిలి లింగన్న విషయంలో ఆంగ్లేయులకు సహాయపడిన వీరి సూరత్వాన్ని, రామరాజు భక్తిని ఇలా అనేక విషయాలను కలిపి రసవంతంగా రాశారు.

4.2.1.2. సాంఘిక నవలలు:

మానవుడు సంఘజీవి. మానవుడు పుట్టినప్పటి నుండి మరణించే దాకా అతని మనుగడ కోసం లేదా లక్ష్యసాధన కోసం సమాజం పైన ఆధారపడే జీవిస్తాడు. ఇటువంటి మనిషి సమాజంలో మనుగడ సాగించడానికి కొన్ని సాంఘిక కట్టుబాట్లను, ఆచార వ్యవహారాలను

నియమించుకొని జీవితాన్ని కొనసాగిస్తూ ఉంటాడు. పుట్టుక, ప్రేమ, పెళ్లి, చావు, ఆర్థిక విషయాలు, రాజకీయ విషయాలు, సంస్కరణాది అనేక విషయాలలో మానవుడు సమాజం పైనే ఆధారపడతాడు. తన కార్యకలాపాలను కొనసాగిస్తూ ఉంటాడు. ఇలా మానవుడు సమాజంతో మమేకమై జరిపే ఏ చర్యనైనా సరే సామాజిక అంశంగానే మనం పరిగణించవలసి ఉంటుంది. ఇలాంటి మానవ జీవితాన్ని ఆధారంగా చేసుకొని అతని జీవితంలో జరిగే ప్రతి విషయాన్ని చిత్రిస్తుంది సాహిత్యం. అందుకే సాహిత్యం సమాజానికి ప్రతిబింబం అంటారు. సాహిత్యంలో కూడా నవలా ప్రక్రియ ఈ పనిని సంపూర్ణంగా చేస్తుంది. ఇలాంటి నవలా ప్రక్రియలో సాంఘిక నవలా విభాగం సమకాలీన మానవుని జీవితానికి సంబంధించిన వ్యవహారాలన్నింటినీ సంపూర్ణంగా పాఠక లోకానికి అందిస్తూ ఉంది.

ఇలాంటి సాంఘిక నవల గురించి పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు *"ప్రస్తుత సంఘమునందలి ఆచార వ్యవహారాలను గమనించి, అందలి లోటుపాటులను సవరించి సంస్కరణ పూర్వకమైన చక్కని భవిష్యత్తును చూపు అపూర్వమైన సాహిత్య సాధనము సాంఘిక నవల"* (తెలుగు నవలా వికాసం, 1971: 32) అని అంటారు.

అలాగే సి. మృణాళిని సాంఘిక నవలను *"సమకాలీన సమాజగత వ్యక్తుల బాహ్యాంతర జీవితాలను విభిన్న దృక్కోణాలనుంచి సాధ్యమైనంత సమగ్రంగా చిత్రించే ప్రక్రియ"* (సాంఘిక నవల కథన శిల్పం, 1988: 26) అని నిర్వచించారు.

తెలుగు నవలా ప్రక్రియ సాంఘిక నవలతోనే ప్రారంభమయ్యింది. తెలుగులో మొదటి నవలలుగా చర్చకు నిలిచిన శ్రీ రంగరాజు చరిత్ర గానీ, రాజశేఖర చరిత్ర గానీ రెండూ కూడా సాంఘిక నవలలే. వీటి తర్వాత తెలుగు నవలా సాహిత్యంలో ఎన్నో సాంఘిక నవలలు వచ్చాయి. చిత్తూరు జిల్లా నుండి 1950కి లోపు వచ్చిన ఆరు నవలలలో నాలుగు సాంఘిక నవలలే. అవి బూదూరు రామానుజుల రెడ్డి రత్నాబాయి (1927), మోహన (1931); యం.వి. పాపన్న గుప్త భానుమతి (1930); కె. సభా భిక్షుకి (1948).

4.2.1.2.1. సంఘ సంస్కరణ నవలలు

నాటి నుండి నేటి వరకు సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలుగా చెప్పబడే కన్యాశుల్క సమస్య, వరకట్న సమస్య, మద్యపాన సమస్య, వేశ్యా సమస్య, బాల్య వివాహ సమస్య, సతీసహగమన సమస్య, మూఢనమ్మకాల వంటి వాటి పట్ల వ్యతిరేకతతో, సమాజం మీద వాటి ప్రభావాన్ని తెలియజేస్తూ, పరిష్కార మార్గాలను చూపుతూ లేదా ఎండుగడుతూ వచ్చిన నవలల్ని సంస్కరణ ప్రభావంకల నవలలుగా పేర్కొనవచ్చు లేదా సంఘసంస్కరణోద్యమ నవలలుగా చెప్పవచ్చు.

తెలుగులో తొలి నవలలుగా చెప్పబడే శ్రీ రంగరాజ చరిత్ర కానీ, రాజశేఖర చరిత్ర కానీ సంఘసంస్కరణే ప్రధాన ధ్యేయంగా పుట్టుకొని వచ్చిన నవలలు అని చెప్పడంలో ఎటువంటి

సందేహం లేదు. అందుకే అక్కిరాజు రమాపతి రావు *"తెలుగు నవల నూటికి నూరుపాళ్ళు సంఘసంస్కరణోద్దేశంతోనే పుట్టింది"* (రజిత రంజని, 1988: 56) అని అంటారు.

4.2.1.2.1.1. రత్నాబాయి

నవలా సారాంశం

గంగానదీ తీరాన రంగాపురమనే గ్రామంలో శ్రీధర్ అనే వీధిలో ఒక పూరి ఇంట్లో రామకిశోరుడనేవాడు ఉండేవాడు. ఇతని తల్లిదండ్రులు చంద్రకిశోరుడు, తారాబాయి. ఇతని తండ్రి చిన్నప్పుడే చనిపోతాడు. రామకిశోరుని పూర్వీకులు ఉన్నవారైనప్పటికి తండ్రి చనిపోయే నాటికి అతని దగ్గర ఉన్నది ఒక ఇల్లు, ఐదువేల రూపాయలు మాత్రమే. కొంతకాలానికి తల్లి అనారోగ్యంతో చనిపోతుంది. తర్వాత రామకిశోరుడు వంటావార్పుకు ఇబ్బంది అవ్వడంతో సరళాబాయిని ఐదువందల రూపాయలిచ్చి పెళ్లి చేసుకుంటాడు. అప్పటికి ఆమె రజస్వల కూడా అయి ఉండదు. ఆరవ ఫారం పూర్తి చేసిన రామకిశోరుడు ముప్పై రూపాయల జీతానికి ఉద్యోగంలో చేరి సంసారాన్ని కొనసాగిస్తూ ఉంటాడు. కొంత కాలానికి వారికి రత్నాబాయి అనే కూతురు, ఆ తర్వాత హరికిశోరుడనే కొడుకు పుడతారు. కూతురుకి 13 సంవత్సరాలు నిండుతాయి. వీరి వంశాచారం ప్రకారం ఆడపిల్లకు పుష్పవతి అయ్యేలోపే పెళ్లి చేయాలి. లేదంటే ఆ కుటుంబాన్ని వారి కులం నుండి బహిష్కరిస్తారు. ఈ కారణంగా రామకిశోరుడు రత్నాబాయికి పెళ్లి చేయాలని వరుడి కోసం ప్రయత్నాలు చేస్తుంటాడు. ఏ సంబంధం చూసినప్పటికి వేలకు వేలు వరకట్నం లేనిదే పెళ్లి చేసుకోమంటూ ఉంటారు. అయితే శ్యామసుందరుడనే వ్యక్తి పెళ్ళికి సమ్మతించి అందుకు కట్నంగా 5000 అడుగుతాడు. ఈ వరకట్నం ఇవ్వలేక తండ్రి పడుతున్న బాధను చూడలేక రత్నాబాయి విషం తాగి ఆత్మహత్య చేసుకుంటుంది.

చిన్నవాడైనప్పటికి తన అక్క చనిపోవడానికి కారణాలను గ్రహించిన హరికిశోరుడు కన్యాశుల్క, వరకట్న సమస్యలను ఏ విధంగా నిర్మూలించాలి అని బాల్యంనుండే ఆలోచిస్తుండేవాడు. హరికిశోరుడు పెరిగి పెద్దవాడై విద్యావంతుడై సమాజాన్ని పట్టి పీడిస్తున్న కన్యాశుల్కం, వరకట్నం లాంటి సమస్యలపై తిరుగుబాటు చేస్తూ వాటిని రూపు మాపటానికి సభలు, సమావేశాలు ఏర్పరుస్తూ తల్లిదండ్రులకు సంతోషాన్ని కలిగిస్తుండేవాడు.

నవలా విశ్లేషణ

బూదూరు రామానుజులరెడ్డి 1925లో రాసిన ఈ నవల ప్రధానంగా కన్యాశుల్క, వరకట్న సమస్యలను చిత్రించిన నవల. నవల అవతారికలో రచయిత *"ఈకథ కొంతవరకు జరిగినదేయైనను మనదేశమందలి కన్యావిక్రేతలకును వరశుల్క ప్రియులకును హితముగరపుటకై కాలానుగుణముగ అందందు నేనుగల్పించి పెంచి నవలగా వ్రాసితిని"* (రత్నాబాయి, 1925: అవతారిక) అని అనడంలో నవల ఉద్దేశాన్ని రచయితకు గల సంస్కరణాభిలాషను ఎంత స్పష్టంగా చెప్పారో తెలుస్తుంది.

"కట్నములగైకొని కన్యాకలవిక్రయించుట పూర్వాచారమా! కాదు. కాదు. ముమ్మాటికినిగాదు. మరి మాంస విక్రయము! పలలవిక్రేతలకును మీకును భేదమేమి!" (రత్నాబాయి, 1925: 29, 30). అనే మాటలు *"శ్యామసుందరునివంటి దురాశాపూరితులును, సంఘవినాశకులును, బవిత్ర చరిత్రయగు భారత మాత గర్భమున జనింపకుందురుగాక! భరతఖండమునందిట్టి శుల్కముల పద్ధతిరూపు మాపుటకును, నాయట్టియబలల మానప్రాణముల గాపాడుటకును దేశమాత సుపుత్రులంగనుగాక!"* (రత్నాబాయి, 1925: 58, 59) లాంటి మాటలను బట్టి చూస్తే రచయిత ఎంత ఘాటుగా ఈ దురాచారాలను ఖండించాడో అర్థమవుతుంది. ఇలాంటి మాటలు నవలలో చాలా ఉన్నాయి.

కన్యాశుల్కం నశించినప్పటికి వరకట్న సమస్య అనేది నేటికి సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యే. 1961లో వరకట్న నిషేద చట్టం వచ్చినప్పటికీ ఈనాటికీ సమాజంలో వరకట్న సమస్య ఎంతో మంది ప్రాణాలను బలి తీసుకుంటూనే ఉంది. ఇలాంటి సమస్యలను ప్రధాన ఇతివృత్తంగా స్వీకరించి సంఘసంస్కరణ ఉద్దేశంతో వచ్చిన ఈ నవల నేటికి సమకాలీనతను కలిగి ఉంది అంటే అతిశయోక్తికాదు.

4.2.1.2.1.2. భానుమతి

నవలా సారాంశం:

మద్రాసు నగరంలో ధర్మపురం అనే గ్రామం ఉంది. అందులో రామశర్మ అనే జమీందారు హైకోర్టులో సబ్ జడ్జి పదవిలో ఉంటూ మద్రాసులోనే నివాసం ఉండేవాడు. సెలవు దినాలలో స్వగ్రామానికి పోయి తన భూముల వ్యవహారం చూసుకునేవాడు. అతని భార్య లీలావతి. వేసవి సెలవులకు స్వగ్రామానికి వెళ్ళిన రామశర్మ ఒక ఇంటి ముందు పదహారేండ్ల అందమైన అమ్మాయిని చూస్తాడు. రామశర్మ ఆమెపై మోహముతో వివాహం చేసుకోవాలని అనుకుంటాడు. అయితే తనకు ఆమె పట్లగల మోహాన్ని మరుగుపరచి తన భార్య లీలావతి దగ్గరికెళ్ళి పుత్రసంతానలేమి కారణం చెప్పి ఆమెను ఒప్పిస్తాడు.

రామశర్మ ఇష్టపడ్డ అమ్మాయి ధర్మపురంలోని సుప్రసిద్ధ డాక్టరైన 'వైకుంఠశర్మ' మేనకోడలు కళావతి. వైకుంఠశర్మ డబ్బుకోసం ఏమైనా చేయగల అసామాన్యుడు. అతని భార్య చనిపోయి ఉంటుంది. అతనికి పన్నెండేండ్ల కొడుకు, ఎనిమిదేండ్ల కూతురు ఉంటారు. కొడుకు నిరక్షరకుక్షి. కన్యాశుల్కం ఆశించి కూతురికి మూడో ఏటనే పెళ్లి చేయడం, నెల దినాలకే భర్త చనిపోవడంతో కూతురు బాలవితంతువుగా ఉంటుంది.

రామశర్మ వైకుంఠశర్మను పిలిపించి తన మనసులోని మాటను తెలియజేస్తాడు. మీ అనంతరం మీ ఆస్తి రెండవ భార్య బిడ్డకు చెందునట్లు వీలుతో పాటూ వైకుంఠశర్మ కోరిన విధంగా అన్నీ సమకూరుస్తూ, ఎవ్వరికీ తెలీకుండా గుట్టుగా వివాహ కార్యక్రమాన్ని ముగించుకుంటాడు. ఇక్కడ నిజానికి వైకుంఠశర్మ కళావతిని ఉంచుకొని ఉంటాడు. రామ శర్మ ఆస్తికోసం కళావతితో కలిసి నాటకం ఆడుతాడు.

కొన్నాళ్ళకి కళావతి ఒక మగ బిడ్డను కంటుంది. అయితే ఈమె గర్భవతిగా ఉన్న సమయంలో లీలావతి కూడా గర్భవతి అవుతుంది. అది మొదలు కళావతి రామశర్మతో కోపాన్ని ప్రకటిస్తూ మీ మొదటి భార్యకు మగబిడ్డ పుడితే వెంటనే చంపెయ్యాలి, ఒకవేళ ఆడబిడ్డ పుడితే పోషించవచ్చు లేదంటే నేను ఇల్లువిడిచి వెళ్లిపోతానంటూ తన సవతి బుద్ధిని నిర్మొహమాటంగా తెలియజేస్తుంది. ప్రసవకాలం దగ్గరపడి లీలావతి కవలలను కంటుంది. ముందు పుట్టిన మగబిడ్డను ఎవ్వరికీ తెలీకుండా వైకుంఠ శర్మతో పంపించేస్తాడు. తర్వాత పుట్టిన ఆడపిల్ల మాత్రమే మనకు పుట్టిందని భార్యను నమ్మిస్తాడు. లీలావతికి అనుమానం వచ్చి, పనిమనిషి ద్వారా విషయాన్ని గ్రహించి తన భర్త మోసం చేశాడనే ఆవేదనతో ఆత్మహత్య చేసుకుంటుంది.

లీలావతికి పుట్టిన మగబిడ్డ గురించి కళావతికి తెలిసి, ఆ బిడ్డను చంపాలని ప్రయత్నిస్తుంది. ఆ ప్రమాదంలో ఎవ్వరికీ ఏమీ జరగలేదని వైకుంఠశర్మ రామశర్మను నమ్మిస్తాడు. కానీ ఇది అబద్ధం నిజానికి రామశర్మ మగబిడ్డ చనిపోయి ఉంటుంది. రామశర్మ తన బిడ్డకోసం నెలనెలా పంపుతున్న డబ్బు ఆశించి అపద్ధం చెప్తాడు, ఈ విషయాన్ని రచయిత చివరి వరకూ చెప్పడు. తర్వాత ఆడబిడ్డను కూడా చంపించే ప్రయత్నం చేసి కళావతి విఫలమవుతుంది. రామశర్మ ఇంత జరిగిన తర్వాత లీలావతి చనిపోతూ రాసిపెట్టిన ఉత్తరం ప్రకారం తన ఆడబిడ్డను మద్రాసు నందు ఉన్న తన బావ సుబ్బశర్మకు అప్పగిస్తాడు. తర్వాత ఆ ప్రాంతాన్ని వదిలి బర్మాలో స్థిరపడతాడు. వైకుంఠ శర్మను మద్రాసులోని తనకున్న భవనాలలో ఏదో ఒక దానిలో ఉండమని మగబిడ్డకు కావలసిన డబ్బును నెలనెలా పంపిస్తుంటాడు.

రామశర్మ బర్మాకు వెళ్ళిన రోజే వైకుంఠశర్మ కూడా ధర్మపురాన్ని వదిలి మద్రాసులో గోవిందప్ప నాయుని వీధిలో నివాసముంటాడు. అతనితో పాటు పెద్దకొడుకు దామోదరుడు, కుమార్తె చంద్రమతి అలాగే వీరితోపాటు భానుమూర్తి, భానుమతి అను ఇద్దరూ ఎడతెగని స్నేహ భావంతో ఉంటారు. అయితే వీరు నలుగురూ అక్కచెల్లెళ్ళు, అన్నదమ్ములుగా రచయిత చెప్తాడు. దీనిని బట్టి వీరు నలుగురూ వైకుంఠశర్మ పిల్లలే అని చెప్పవచ్చు. ఇక్కడ నిజానికి భానుమూర్తి, భానుమతులు వైకుంఠశర్మ పిల్లలు కాదు. ఈ విషయం రచయిత నవల చివరి వరకూ చెప్పని కారణంగా పాఠకులైన మనకు కొన్ని సందేహాలు వస్తాయి. ఇలా రచయిత చెప్పకుండా దాచిన విషయాలను నవల చివరి భాగంలో చెప్పడం కారణంగా ఉన్న సందేహాలు వీడిపోతాయి. వైకుంఠశర్మ మద్రాసు వచ్చినప్పటికీ అక్కడ కూడా అవే నీచమైన పనులను చేస్తూ దురాశాపరుడై ధనాన్ని సంపాదిస్తుంటాడు.

రామశర్మ బావ (లీలావతి అన్న) సుబ్బశర్మ, అతని భార్యా పిల్లలు లేకపోవడంతో రామశర్మ కూతురు 'ప్రమద'కు అన్నీ వారే అయి విద్యాబుద్ధులు నేర్పిస్తూ ఉంటారు. వీరి పక్కనే లక్ష్మణశర్మ అనే గొప్ప న్యాయవాది ఉంటాడు. ఇతని కొడుకు 'వీరశర్మ'. అందగాడు అయిన వీరశర్మ కన్యాశుల్క వరశుల్కాలను రూపుమాపటానికి తన జీవితాన్ని ధారపోయాలని నిర్ణయించుకున్న మంచి వ్యక్తిత్వం కలవాడు. వీరి ఇంటి పక్కనే ఒక బ్రాహ్మణ వితంతు ఉంటుంది. ఈమె ఒక

జమీందారు భార్య. ఈమెకు 'సుందరి' అనే కూతురు ఉంటుంది. సుందరి తండ్రి బ్రతికున్నప్పుడు ఆమెకు వివాహమయ్యే వరకూ సంరక్షణా కర్తలుగా సుబ్బశర్మను, వీరశర్మ తండ్రిని పెట్టినందుకు వారి బాధ్యత వీరే చూసుకుంటూ ఉండేవారు.

రామశర్మకు కళావతికి పుట్టిన వాడు నారాయణుడు(నిజానికి ఇది కూడా అపద్ధమే. నారాయణుడు వైకుంఠశర్మకు కళావతికి పుట్టినవాడు, కళావతి వైకుంఠశర్మకు ఉంపుడుకత్తే. రామశర్మతో పెళ్ళయ్యే నాటికే ఈమె మూడు నెలల గర్భవతి. డబ్బుకోసం రామశర్మని వివాహం చేసుకొని ఉంటుంది). చదువు సంధ్యలు వంటపట్టని కారణంగా అక్కడే ఉంటే చెడిపోతాడని నారాయణున్ని బర్మా నుండి మద్రాసుకు పంపించేస్తాడు రామశర్మ.

నారాయణ శర్మ తన తండ్రి నెలకు పంపించే వంద రూపాయలతోను, అక్కడ వచ్చే బాడుగలతో విలాసాలకు అలవాటు పడి, నీలకంఠం, దామోదరుడు అనే స్నేహితులతో కలిసి కాలం గడుపుతూ ఉంటాడు. ఇతని స్నేహితులు నారాయణుడికంటే పరమ దుర్మార్గులు. తాగుబోతు, వేశ్యాలోలుడైన దామోదరుడు వైకుంఠశర్మ కొడుకు. ఇక నీలకంఠం వేశ్యాలంపటుడై, ఉన్న ఆస్తినంతటినీ పోగొట్టుకొనీ నారాయణుడినే నమ్ముకొని ఉండేవాడు. నీలకంఠం అన్న పిల్లలే భానుమూర్తి, భానుమతులు. నీలకంఠం డబ్బులేని కారణంగా వీరిని చిన్నప్పుడే వైకుంఠశర్మకు అమ్మేసి వుంటాడు, అప్పటి నుండి వైకుంఠ శర్మే అన్నీ చూసుకునేవాడు. ఈ త్రిమూర్తులతో దామోదరుని చెల్లెలు కూడా చేరుతుంది.

సుందరాబాయి అనే ఒకామె పచ్చయప్ప కళాశాలలో పనిచేస్తూ తనతల్లితో కలిసి వైశ్య వర్తకుని ఇంటిలో అద్దెకు ఉంటుంది. సుందరాబాయి రహస్య గర్భవతి. పైగా వితంతువు. ప్రసవవేదన మొదలవ్వడంతో డాక్టరు వైకుంఠశర్మను పిలిపిస్తారు. ఆమె మగబిడ్డను ప్రసవిస్తుంది. ఆ పసిబిడ్డను వారు చంపేయాలని అనుకుంటారు. సుందరాబాయి తల్లి ఆ పసికందుని చంపేసి, ఆ బిడ్డను పాతిపెట్టమని డాక్టరుకు కొంత ధనమిస్తారు. వైకుంఠశర్మ ఆ బిడ్డను పాతిపెడుతూ ఉండగా పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్తాడు. తర్వాత వైకుంఠశర్మ జైలు వార్డెన్ యాకూబ్ ను మోసం చేసి తప్పించుకొని మారువేషంలో బర్మాలోని రామశర్మ, కళావతుల దగ్గర చేరుతాడు.

తండ్రి లేకపోవడంతో కుటుంబ బాధ్యత భానుమూర్తిపై పడుతుంది. దీనికి తోడు అన్న అయిన దామోదరుడు తండ్రి పేర వచ్చే మనియార్డరును తెసుకుని ఖర్చుపెట్టేవాడు. ఇదే అదునని దామోదరుని చెల్లెలు చంద్రమతి నారాయణునితో లేచిపోతుంది. భానుమూర్తి ఒక పక్క తండ్రి కారణంగా సమాజంలో పరువు పోయి, అన్న కారణంగా కుటుంబ పోషణ కష్టమై బాధపడుతున్న సమయంలో అతనికి రెండు ఉత్తరాలు వస్తాయి. అందులో ఒక దానిలో తను పరీక్షల్లో పాసయ్యాడని, మరొకదానిలో నీవు అనేక కష్టాలలో ఉన్నావని తెలుసుకున్నాను. నేను పంపించే మనియార్డరు ఇక నుండి నీ పేరున పంపిస్తాను. అలాగే మైలాపురంలో నా కూతురు ప్రమద సుబ్బశర్మ ఇంటిలో పెరుగుతోంది. ఆమెకు విద్యాబుద్ధులు నేర్పుటకు నీవు వెంటనే వెళ్లి పనిలో ప్రవేశించు అని ఉంటుంది.

భానుమూర్తి ఆ ఉత్తరాన్ని తీసుకొని సుబ్బశర్మ ఇంటికెళ్ళి ప్రమదకు, అలాగే లక్ష్మణ శర్మ కొడుకు వీరశర్మకు, అలాగే సుందరికి ఉపాధ్యాయుడుగా నియమింపబడతాడు. దామోదరుడు మాత్రం నారాయణునితో చేరి తాగుడుకు లోనౌతాడు. దీనితో భానుమూర్తి, భానుమతులు దామోదరునితో వేరుపడతాడు. అది మొదలు దామోదరుడు ఏదోలాగా భానుమూర్తి లేనప్పుడు భానుమతి దగ్గరికి వచ్చి కల్లబొల్లి మాటలతో ఆమెను మోసం చేసి డబ్బు లాగాలని ప్రయత్నించడం, చివరికి నారాయణుడు భానుమతిపై మనసు పడ్డాడని తెలిసి, ఆమెను అతనికి కట్టబెట్టడానికి నానా ప్రయత్నాలు చేస్తూ ఉంటాడు.

కొన్ని రోజులకు భానుమూర్తి, ప్రమదలు ఒకరినొకరు ఇష్టపడి ప్రేమించుకుంటారు. సుందరి, భానుమూర్తిపై ఆశపడి అతనిని ఎలాగైనా పెళ్ళిచేసుకోవాలని ప్రయత్నించి విఫలమవుతుంది. దాంతో అతనిపై కోపంతో భానుమూర్తి తనను మానభంగం చేయబోయాడని నిందవేసి, నలుగురికి అతనంటే అసహ్యం కలిగేలా చేస్తుంది. భానుమూర్తి పథకం ప్రకారం సుందరి నిజస్వరూపాన్ని బయట పెట్టి తనపై ఉన్న నిందను పోగొట్టుకుంటాడు.

వీరశర్మ ఒక రోజు బీచ్ లో భానుమతిని చూసి ఆమె అందానికి ముగ్ధుడై ఆమెను ప్రేమిస్తాడు. భానుమతికి సంభవించు రెండు ప్రమాదాల నుండి ఆమెను యాదృచ్ఛికంగా కాపాడుతాడు. క్రమంగా వీరిద్దరూ ప్రేమలో పడతారు. ఈ విషయం భానుమూర్తికి తెలిసి మొదట్లో కోప్పడ్డా, చెల్లెలిపట్ల ప్రేమతో, తను ప్రేమించింది తన శిష్యుడు వీరశర్మనే అని వారి వివాహానికి ఒప్పుకుంటాడు.

వైకుంఠ శర్మకు కళావతికి గల అక్రమ సంబంధాన్ని రామశర్మ తెలుసుకొని అతనిని ఇంటి నుండి వెల్లగొడతాడు. దీంతో వైకుంఠ శర్మ మళ్ళీ మద్రాసు చేరి సన్యాసిలాగా వేషం మార్చుకొని వైద్య వృత్తికి తోడు జ్యోతిష్యాన్ని అలవరుచుకొని కాలం గడుపుతూ ఉంటాడు. దామోదరుడు నారాయణుడితో కలిసి భానుమతిని బంధించి ఒక భవనంలో ఉంచుతాడు. భానుమూర్తి ఒక సన్యాసి మూలాన భానుమతి నారాయణుని వద్ద బంధీగా ఉందని తెలుసుకొని పోలీసుల సాయంతో అక్కడికి చేరుకుంటారు. అప్పటికే విషయం తెలుసుకున్న నారాయణుడు భానుమతిని తీసుకొని వేరేచోటుకి వెళ్తాడు. బలవంతంగానైనా ఆమెను వివాహం చేసుకోవాలని ప్రయత్నిస్తాడు. చివరికి భానుమతి ఆత్మహత్యా ప్రయత్నం చేస్తుండగా నారాయణుని చేతిలో మోసపోయి బందీగా ఉన్న చంద్రమతి సహాయంతో రక్షించబడి అక్కడనుండీ తప్పించుకుంటుంది. నారాయణుడు భానుమతి అనుకొని తను మోసం చేసి గర్భవతిని చేసిన చంద్రమతిని పెళ్లి చేసుకొని మోసపోతాడు. ఈ విషయం తెలిసి భానుమతిని పట్టుకోడానికి ప్రయత్నిస్తాడు.

ఒక కాపువాని సహాయంతో మగవాని వేషమున భానుమతి రైలు ఎక్కుతుంది. అదే రైలులో ఉన్న నారాయణుడు తనను గుర్తుపట్టి అక్కడే తనను అనుభవించడానికి బలవంతం చేస్తాడు. ఆ సమయంలో రైలు ఒక నదిపైన వెళ్తుండడంతో తను అందులో దూకేస్తుంది. తర్వాత ఆమెను ఒక

బెస్తవాడు చూసి కాపాడతాడు. అక్కడే ఒక ముసలి బ్రాహ్మణ దంపతుల ఇంట్లో మగవాని వేషంలోనే భానుమతి కొన్ని రోజులు గడుపుతుంది.

భానుమతి విషయం అలా ఉండగా, భానుమూర్తి చేత పరాభవించబడిన సుందరి తనను ఎలాగైనా పెళ్లి చేసుకోవాలని, లేదంటే చంపనన్నా చంపేయాలని నిర్ణయించుకుంటుంది. ఆ సమయంలో వృద్ధ జ్యోతిష్కుడి వేషంలో ఉన్న వైకుంఠ శర్మతో కలిసి తన పన్నాగాన్ని నెరవేర్చుకోడానికి ప్రయత్నిస్తుంది. వైకుంఠ శర్మ తన నిజ స్వరూపాన్ని బయటపెట్టక భానుమూర్తిని వివాహానికి ఒప్పించ ప్రయత్నించి విఫలుడౌతాడు. చివరికి భానుమూర్తిని ఆరాత్రికే తన ఇంటి నుండి ఎత్తుకొని పోయి పెళ్లి జరిపించాలని అనుకొని సుందరితో అన్ని ఏర్పాట్లూ చేసుకొమ్మని చెప్తాడు. తీరా భానుమూర్తికి బదులు దామోదరుని ఎత్తుకు రావడం, అతనితో సుందరి పెళ్లి జరిగిపోవడం జరుగుతుంది. ఇక్కడ వైకుంఠశర్మ దామోదరుడు తన కొడుకని చెప్పడు. కారణం సుందరి నుండి ఆశించే ధనం. చివరికి సుందరి మోసపోయిన కారణంగా ఆత్మహత్య చేసుకుంటుంది.

రామశర్మ బర్మా నుండి తన కొడుకు కూతురిని చూడడానికి మద్రాసుకు వస్తాడు. తన బావ అయిన సుబ్బశర్మ ప్రమద యొక్క వివాహ విషయాన్ని రామశర్మతో ప్రస్తావిస్తాడు. ప్రమద తన మనసులోని భానుమూర్తి గురించి సుబ్బశర్మకు, రామశర్మకు అర్థం అయ్యే విధంగా చెబుతుంది. భానుమూర్తి రామశర్మకు కొడుకు కాబట్టి దీనికి రామశర్మ అన్నాచెల్లెళ్ళకు ఏ విధంగా వివాహం జరిపించాలని బాధపడతాడు. అయితే భానుమూర్తి తన కొడుకు అని చెప్తే సుబ్బశర్మ నమ్మడు. పైగా కళావతికి విషయం తెలిసిపోతుందని, ఎలాగైనా సరే ఈ వివాహం జరగకూడదని ప్రమద మనస్సును ఎలాగైనా మార్చాలనుకుంటాడు. నిజానికి రామశర్మ కొడుకు వైకుంఠశర్మ ఇల్లు కాలిపోయినప్పుడే చనిపోయి ఉంటాడు. వైకుంఠశర్మ ఈ విషయాన్ని రహస్యంగా ఉంచుతాడు. కారణం రామశర్మ తన కొడుకు పోషణార్థం పంపే డబ్బుకు ఆశపడి.

కళావతి వైకుంఠశర్మను కలిసి రామశర్మను చంపాలనుకుంటుంది. కారణం వారిద్దరికీ గల అక్రమసంబంధం. తర్వాత భానుమూర్తి తన సవతి కొడుకని కళావతికి తెలిసి ఎలాగైనా సరే అతనిని కూడా చంపాలని నిర్ణయించుకుంటుంది. ఒకరోజు రాత్రి భానుమూర్తి అనుకొని నిద్రపోతున్న దామోదరున్ని నరికి చంపేస్తుంది. రామశర్మ పోలీసులకు ఫిర్యాదు చేస్తాడు. వారు భానుమూర్తికి, దామోదరునికి తగాదాలున్న కారణంగా భానుమూర్తిని అనుమానించి అరెస్టు చేస్తారు. పరారీలో ఉన్న వైకుంఠశర్మను పోలీసులు చూసి అతనిని కూడా అరెస్టు చేస్తారు. ఇంత జరిగిన తర్వాత వైకుంఠశర్మకు పశ్చాత్తాపం మొదలౌతుంది. రామశర్మకు తనుచేసిన పాపపు పనులను, మోసాలను చెప్పాలని, తను బ్రతికుండగానే ఒకసారి కలవమని రామశర్మకు ఉత్తరం రాస్తాడు.

రామశర్మ అప్పటి వరకూ భానుమూర్తికి భానుమతి విషయంలో, ప్రమద విషయంలో సహాయమందించిన సన్యాసితో కలిసి జైలుకు వెళ్తాడు. ఇక్కడే కథకు సంబంధించిన అన్ని

సందేహాలకూ నివృత్తి కలుగుతుంది. వైకుంఠశర్మ నన్ను మన్నించండి అంటూ రామశర్మతో, మీరు ఎవ్వరినైతే ఆశపడి పెళ్లి చేసుకున్నారో ఆ కళావతి నాకు ఉంపుడుకత్తె. మీ వివాహ సమయానికి ఆమె మూడు నెలల గర్భవతి. ఆమెకూ నాకూ పుట్టిన వాడే నారాయణుడు. మీ మొదటి భార్య కన్న మగబిడ్డను నాకు అప్పగించారు. అప్పుడు కళావతి ఆ పసికందును చంపడానికి నా ఇంటికి నిప్పంటించినప్పుడు మీ కుమారుడు చనిపోయాడు. మీతో మాత్రం అబద్దం చెప్పాను. కారణం శిశు పోషణార్థం మీరు పంపించే డబ్బు. ఇక భానుమూర్తి ఎవరని మీరనవచ్చు. నీలకంఠుడు అనే ఒక తాగుబోతు, జూదరి డబ్బుకోసం తన అన్న పిల్లలని నాకు అమ్మేశాడు. పాపం వారి తల్లి వీరిని కని చనిపోవడం, తండ్రి తీర్థయాత్రలకు పోవడంతో, అప్పటి నుండి వారికి నేనే భానుమూర్తి, భానుమతి అని పేర్లుపెట్టి పోషిస్తున్నాను అని చెప్తాడు. అంతేకాదు నారాయణుడు తనకు, కళావతికి పుట్టిన అక్రమ సంతానమని కూడా చెప్తాడు. ఇదంతా వింటున్న సన్యాసి సంతోషంతో ఆ నీలకంఠుడి అన్నను నేనేనని తీర్థయాత్రల అనంతరం వారి జాడ తెలియక ఇలా తయారయ్యానని చెప్తాడు. అందరి సమక్షంలో దామోదరాన్ని హత్యచేసింది కళావతే అని జరిగినదంతా చెప్పడంతో పోలీసులు భానుమూర్తిని విడుదల చేస్తారు. తర్వాత నారాయణుడు తల్లి చేసిన పనులకు కోపంతో ఆమెను చంపి తనూ చనిపోతాడు.

ఇక భానుమతి ఆ ముసలి దంపతుల దగ్గర నుండి ఒక మనిషి సహాయంతో తన ఇల్లు చేరుకోబోతున్న సమయంలో, అంతవరకూ మంచిగా ఉన్న ఆ మనిషి భానుమతి దగ్గరున్న నగలకోసం దాహం తీర్చుకుంటున్న ఆమెను బావిలో తోసేస్తాడు. ఇది గమనించిన సన్యాసి ఆమెను కాపాడి తన విషయాలనన్నింటినీ తెలుసుకొని ఈ భానుమతే తన కూతురని తెలిసి సంతోషపడతాడు. తనని తన అన్న భానుమూర్తి వద్దకు తీసుకుపోతుండగా వీరశర్మ పిచ్చాసుపత్రి నుండి తప్పించుకొని సన్యాసి దగ్గరికి చేరుతాడు. తర్వాత అందరూ కలిసి భానుమతి – వీరశర్మ, ప్రమద – భానుమూర్తుల వివాహాన్ని జరిపిస్తారు. ఇదీ నవలా సారాంశం.

నవలా విశ్లేషణ

యం. వి. పాపన్న గుప్త 1930లో రాసిన ఈ నవల నలభై ప్రకరణాలతో అనేకమైన మలుపులతో సాగే సాంఘిక నవల. నవలలోని సారాంశాన్ని తక్కువ మాటలలో చెప్పలేని విధంగా రచయిత ఈ నవలను రాశారు. కారణం నవలలో అనేక విషయాలను మరుగున పెట్టి కథను ముందుకు నడిపించడం. స్త్రీల సమస్యలను ప్రధానంగా తీసుకొని, సమాజానికి హితకరమైన, హితకరం కాని అనేక విషయాలను ప్రస్తావిస్తూ, కుటుంబంలోని స్వార్థ పరులవల్ల అమాయకులు, నిస్సహాయులు పడే బాధలను, బలైపోయే జీవితాలను కళ్ళకు కట్టినట్టు రచయిత ఈ నవలలో చూపించారు.

సంఘ సంస్కర్త అయిన యం. వి. పాపన్న గుప్త ఈ నవలలో సాంఘిక దురచారాలైన అనేక సమస్యలపైన వ్యతిరేకతను కనపరుస్తూ ఈ నవలను ముందుకు నడిపారు. స్త్రీల అసమానతలపై వ్యతిరేకత, బాల్య వివాహ వ్యవస్థ పట్ల వ్యతిరేకత, వితంతు వివాహ అభిలాష,

శిశుహత్యను వద్దని అభిలాష, విదేశీ అలవాట్లపై నిరసన, వరశుల్క/కన్యాశుల్క సమస్య, మద్యపాన అవస్థలు, శకునాలు, సముద్రయానంపై హిందువులకుగల విశ్వాసాలు లాంటి అంశాలపట్ల ఉచితానుచితాలను తెలియజేస్తూ వచ్చిన చక్కటి సాంఘిక నవల అని ఈ నవలను చెప్పొచ్చు. అలాగే పరోపకారానురక్తి, ఆంగ్ల పాఠశాలల్లో బాలభటుల ప్రస్తావన, స్త్రీ సాహసాలు ఇలా ఎన్నో అంశాలను ఈ నవలలో ప్రస్తావించబడ్డాయి. పై సమస్యలతో పాటూ సంఘసంస్కరనోద్యమ కాలంలో వచ్చిన ఈ నవల ఆనాటి సహాయ నిరాకరణోద్యమం, గ్రామోద్ధరణ మొదలగు అనేక విషయాలను కూడా ప్రస్తావించింది.

బాల్యంలోనే వివాహాలు చేయడం ద్వారా ఈ నవలలో చాలా మంది వితంతువులు కనిపిస్తారు. పైగా వారు కోర్కెలను అణుచుకోలేక, తప్పుడు వ్యసనాలకు లోనై గర్భవతులై అనేక కష్టాలకు గురవుతున్న విధానాలు నవలలో చిత్రించిన విధానాన్ని చూస్తే 1930నాటి సమాజ ధోరణులు మనకర్థమవుతాయి.

4.2.1.2.1.3. మోహన:

నవలా సారాంశం

కృష్ణా మండలం తాడేపల్లిగూడానికి చెందిన అచ్యుతరావు యోగి వంశానికి చెందిన బ్రాహ్మణుడు. ఇతని తండ్రి గోపాలరావు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పదవీ విరమణ చేసిన గోపాలరావు, తన కొడుకును ఆంగ్లవిద్యాకోవిదునిగా చేసి పెద్ద ఉద్యోగంలో చూడాలని ఆశ పడుతుంటాడు. అందుకు తన కొడుకు అచ్యుతరావును మెట్రిక్యులేషన్ తర్వాత చెన్నపురిలోని క్రైస్తవ కళాశాలలో చేర్పిస్తాడు. అచ్యుతరావు ఉజ్వల కర్తవ్య నిష్టాపరుడై అందరితో మర్యాద పూర్వకంగా ఉంటూ తండ్రి పంపిన డబ్బును దుబారాలకు ఖర్చు చేయకుండా విద్యాబుద్ధుల కోసమే వెచ్చిస్తూ చదువుకుంటూ ఉంటాడు.

రాజమహేంద్రవరంలోని ఒక సంపన్న కుటుంబానికి చెందిన కులశేఖర నాయుడు అచ్యుతరావుకు ప్రాణస్నేహితుడు. ఇతడు కూడా క్రైస్తవ కళాశాలలో అచ్యుతరావుతో పాటూ ఇంటర్ పూర్తి చేసి బి.ఎ. సీనియర్ క్లాసులో చదువుతూ ఉంటాడు.

పచ్చని కాపురాలను పాడుచేయడం, విద్యార్థులకు ఏదో ఆశ చూపి తన పొట్ట నింపుకోవడం, వార వనితలకు దాసుడై కామసుఖాలకు, పరుల ధనానికి అలవాటుపడి వేశ్యలకు విటులను సమకూర్చడం వృత్తిగా చేసుకొని తద్వారా ధనార్జనే ధ్యేయంగా పెట్టుకున్న సీతారామ చంద్రుడు, గానకళావిశారదగా శృంగారఖనిగా చెన్నపురిలో పేరు తెచ్చుకున్న మోహన అనే వేశ్యకు తార్పుకాడుగా సీతారామచంద్రుడు ఉంటాడు.

ఆగర్భ శ్రీమంతులను వలలో వేసుకొని వారిని బికారులుగా చేయడమే ధ్యేయంగా ఉన్న మోహన, అచ్యుతరావును తనకు లోబడేటట్టుగా ప్రోత్సహించమని అందుకు తగ్గ ప్రతిఫలం ఇస్తానని సీతారామచంద్రున్ని పురమాయిస్తుంది. అప్పటి నుండి సీతారామచంద్రుడు అచ్యుతరావుతో పరిచయం పెంచుకొని, అతనిలో మోహన పట్ల వ్యామోహం కలిగే విధంగా

మాట్లాడుతూ ఉంటాడు. ఎంతకీ లొంగని అచ్యుతరావు మొహనను చూసిన తరవాత సీతారామ చంద్రుడి మాటలు విన్న తర్వాత, ఆమె వ్యామోహంలో పడిపోతాడు. కొంత కాలానికి అచ్యుతరావు మోహన వ్యామోహంలో పూర్తిగా పడిపోయి తన నివాసాన్ని కూడా మోహన ఇంటికే మార్చేస్తాడు.

కొంత కాలానికి అచ్యుతరావు తండ్రి చనిపోతాడు. ఆ తర్వాత తండ్రి ఆస్తికి ఇతనే సర్వాధికారి కావడంతో మెల్లగా ఉన్న ఆస్తినంతటినీ మొహనకు ధారపోస్తుంటాడు. చివరికి ఉన్న ఒక్క ఇల్లు, రెండెకరాల మాగాణి మాత్రం మిగులుతాయి. తల్లి, చెల్లెలు ఎంత చెప్పినా వినకుండా తన చదువును పక్కనపెట్టి మోహనతో సుఖాలు అనుభవిస్తూ కాలం గడుపుతుంటాడు. చివరికి ఒకరోజు కొంత తెలివి తెచ్చుకొని చెల్లెలి పేర రెండెకరాలు రాసి తన తల్లిని చెల్లెలితో పంపేస్తాడు. వేశ్యా వ్యామోహాన్ని వీడని అచ్యుతరావు ఉన్న ఇల్లును కూడా అమ్ముకొని మోహన చెంత చేరుతాడు. అచ్యుతరావు దగ్గర డబ్బు ఉన్నంత వరకూ అతనిని ఉపయోగించుకొని చివరికి తనను చులకన చేసి వెళ్లగొడుతుంది మోహన. చేతిలో చిల్లిగవ్వలేని అచ్యుతరావు చేసేదేమీలేక మోహనను, తనను నిందించుకుంటూ కొంతకాలం భిక్షమెత్తుకుంటాడు. చివరికి కులశేఖరుడనే తన స్నేహితుడి సహాయంతో సంస్కరించబడి బి.ఎ.బి.ఎల్. పూర్తి చేసి, సంఘసంస్కర్తగా మారి వేశ్యావృత్తి నిర్మూలనకు, తన స్నేహితుడు చేస్తున్న దీక్షకు సహాయపడతాడు.

నవలా విశ్లేషణ

బూదూరు రామానుజులు రెడ్డి 1931లో రాసిన మరో నవల ఈ మోహన. సమాజంలో వేశ్యాప్రవృత్తి ఎంత నీచంగా తయారవుతూ ఉంది, వాటి వలలో పడి సంసారులు కుటుంబాలను ఏ విధంగా చిన్నాభిన్నం చేసుకుంటున్నారు, అన్యంపున్యం ఎరుగని విద్యార్థులు వీరి మాయలోపడి వారి జీవితాలను ఏ విధంగా నాశనం చేసుకుంటున్నారు అనే విషయాలను ఈ నవలలో కళ్ళకు కట్టినట్టు తెలియజేస్తాడు. రచయిత వేశ్యావృత్తిని నశింపజేయాలని దానిపట్ల చైతన్యం కలుగజేయాలని ఈ నవల ద్వారా ఆశించినట్లు తెలుస్తుంది. సంస్కరణాభిలాష కలిగిన రచయిత సంఘసంస్కరణకు కొంతైనా ఈ నవల తోడ్పడాలని అందుకోసమే ఈ నవల రాశానని నవలకు రాసిన అవతారికలో కూడా చెప్పుకుంటాడు. అందుకే ఈ నవలను "సంఘసంస్కరణోద్యమాభివృద్ధికి పాటుపడు సంస్కరణాభిమానుల కెల్లరకు వినయ పూర్వకంగా సమర్పితము" అంటూ సంస్కరణాభిమానులకు అంకితం చేశాడు.

4.2.1.2.2. వెట్టి చాకిరీ సమస్యను చిత్రించిన నవలలు:

సాంఘిక దురాచారాలుగా నేడు మనం చెప్పుకునే బాల్య వివాహాలు, సతీ సహగమనం, కుల వ్యవస్థ, జోగినీ వ్యవస్థ, వరకట్నం, కన్యాశుల్కం, భ్రూణ హత్యలు, స్త్రీ పురుష అసమానతలు ఎలాంటివో అలాంటిదే వెట్టిచాకిరీ విధానం కూడా. వెట్టి చాకిరీ అంటే భూస్వాముల నుండి లేదా కోటీశ్వరుల నుండి లేదా సాహుకార్ల వద్ద నుండి బతుకు భారమైన పేదవాళ్ళు అప్పుగా కొంత డబ్బును తీసుకొని, ఆ డబ్బును తీర్చలేక వారివద్దే జీవితాంతం పని చేసి ఆ అప్పును తీర్చడం.

ఒక్కోసారి అప్పు చేసిన వ్యక్తికి చదువుసంధ్యలు లేకపోవడాన్ని ఆసరాగా తీసుకొని తప్పుడు లెక్కలు కట్టి అప్పుకు వడ్డీ జమచేసి ఆ వడ్డీకి చక్రవడ్డి అని రకరకాలుగా లెక్కలు కట్టి చివరికి వారు జీవితాంతం పని చేసినా తీరనంత అప్పును చూపిస్తారు. దీని కారణంగా ఆ వ్యక్తి బతికినన్నాళ్ళూ జీతభత్యాలు లేని వెట్టి చాకిరీ చేయవలసి వచ్చేది. ఇలాంటి సందర్భాలలో అప్పు తీసుకున్న వ్యక్తి చనిపోతే ఆ కుటుంబంలో తర్వాతి తరం వారు ఆ వెట్టి చాకిరీని కొనసాగించవలసి వచ్చేది. ఇలాంటి వెట్టిచాకిరీ విధానంలో బలైపోయిన ఒక కుటుంబ కథే భిక్షుకి నవల.

4.2.1.2.2.1. భిక్షుకి:

నవల సారాంశం

జాలప్ప అనే వ్యక్తి తన పెళ్ళి కోసం నంజుండప్ప అనే సాహుకారు వద్ద యాభై రూపాయలు అప్పు తీసుకొని ఉంటాడు. ఆ అప్పు తీర్చడం కోసం సాహుకారు ఇంట్లోనే చెప్పిన పని కాదనకుండా చేస్తూ ఉంటాడు. జాలప్ప భార్య మల్లమ్మ. వీరికి బంగారు అనే కూతురు ఉండేది. కూతురును జాలప్ప ఉన్నంతలో ఏ లోటూ లేకుండా చూసుకుంటూ ఉంటాడు. ఒకరోజు జాలప్ప సాహుకారు ఇంట్లో ఎద్దులకు గడ్డి వేస్తుండగా ఎద్దు పొడవడంతో తీవ్రంగా గాయపడతాడు. ఈ విషయం తెలిసి మల్లమ్మ, బంగారు కంగారుపడి అక్కడికి వస్తారు. అప్పటికే జాలప్ప పరిస్థితి విషమించి ఉంటుంది. మంగమ్మ ఎంత ప్రాధేయపడినా జాలప్పను సాహుకారు ఆసుపత్రికి తీసుకెళ్ళడు. జాలప్ప సాహుకారు ఇంటివద్దే చనిపోతే తనపైకి నింద వస్తుందేమో అని 'ఎవరైనా గిట్టనివాళ్ళు మనమే పొడిచామనో, చంపేశామనో చెబితే ఎలా' అని ఎందుకైనా మంచిది ఆ పీనుగును (చనిపోకముందే) వాళ్ళ గుడిసెలో వదిలిరమ్మని తనకు చేదోడు వాదోడుగా ఉన్న కామయ్యను పురమాయిస్తాడు. మల్లమ్మ చేసేది లేక ఆ రాత్రి జాలప్పను కాచుకొని కూర్చుంటుంది. తెల్లవారే సరికి జాలప్ప చనిపోతాడు. సాహుకారుకు ఈ విషయం తెలిసి చాలా విచారిస్తాడు. కారణం జాలప్ప లాంటి పాలేరు దొరకడని, అలాగే తనకివ్వవలసిన అప్పు ఇంతటితో చెల్లేమో అని. కానీ ఏమీ పట్టనట్టు తన పనులకోసం పట్నం వెళ్ళిపోతాడు.

మంగమ్మ మాత్రం సాహుకారే స్వయంగా వచ్చి అందరిని పిలిచి జాలప్పకు జరగవలసిన సంస్కారాలు అన్నీ బాగా చేయిస్తాడని ఎదురు చూస్తూ ఉంటుంది. సాయంత్రం నాలుగవుతూ ఉన్నా సాహుకారు రాకపోవడంతో కూతురుని సాహుకారి భార్య తులసమ్మ దగ్గరికి పంపిస్తుంది. ఇక్కడ కూడా నిరాశే ఎదురవ్వడంతో ఉన్న అంటుపోగుల్ని అమ్మి సాహుకారు పిన్నయ్య కొడుకు కోటయ్య సహాయంతో జరగవలసిన కార్యక్రమాలను జరిపిస్తుంది.

జాలప్ప చనిపోవడంతో 15 రోజులు ఇల్లు విడిచి వెళ్ళకూడదనే నియమం వల్ల మల్లమ్మకు పూట గడవడం కూడా కష్టమైంది. మల్లమ్మ జాలప్పకు జరగాల్సిన ఉత్తర క్రియలకు కావాల్సిన డబ్బు కోసం ఆలోచిస్తూ ఉంటుంది. ఈలోగా మల్లమ్మకు, బంగారుకు ఆసరా అవుతుందనుకొన్న ఒక్క గేదెను సాహూరాకు అప్పుకు జమగా తోలుకు పోతాడు. సాహుకారుకు ఎదురు తిరగలేక చెవిలో ఉన్న కమ్మలను అమ్మి ఉత్తర క్రియలను జరిపిస్తుంది. ఇది తెలిసిన

సాహుకారు మంగమ్మను పిలిచి జాలప్ప చేసిన అప్పు గురించి, కమ్మల గురించి హెచ్చరిస్తాడు. అలాగే వారికి మిగిలి ఉన్న గుడిసె ఉన్న నేలను ఎవరికైనా అమ్మేస్తుందని తన పేర రాసివ్వమంటాడు. లేదంటే చాలా ఇబ్బందులు పడతావని, నీదే ఇల్లు అని తెలిస్తే ఎవరైనా అనామకులు నిన్ను బాధిస్తారని తన పేర రాస్తే దానిజోలికి ఎవరూ రారని, కొంచెం దాపుగా ఉంటుందని చెప్తాడు. దీనితో మంగమ్మ మీ బాకీకి గేదెను చెల్లు చేసుకున్నట్లు ఇల్లును కూడా చెల్లు చేసుకుంటే మాకు ఉండడానికి నీడ కూడా ఉండదని నీట ముంచినా పాల ముంచినా నీవే సామీ అని చెప్పి వెళ్ళిపోతుంది.

పాలవ్యాపారం, ఇళ్ళల్లో పాచి పని చేసుకొంటూ మంగమ్మ, బంగారు వారి జీవితాన్ని కొనసాగిస్తూ ఉంటారు. కొంత కాలానికి మంగమ్మకు కలరా వచ్చి చనిపోతుంది. బంగారు ఒంటరైపోతుంది. ఒకరోజు సాహుకారు నంజుండప్ప బంగారును పిలిచి యోగక్షేమాలు అడిగి దిక్కులేని దానివి ఎలా బ్రతుకుతావు, ఇల్లువాకిలి కూడా లేదు కదా, మా బిడ్డలలో ఒకబిడ్డగా ఉండిపోదువు అని తన ఇంటికి పిలుస్తాడు. అందుకు బంగారు తిరస్కరిస్తుంది. దీనితో సాహుకారు కోప్పడి తండ్రి చేసిన అప్పైనా తీర్చు, లేదంటే చెప్పినట్టు విను అని గట్టిగా అరుస్తాడు. బంగారు భయపడి సాహుకారు ఏమైనా చేయగలడని సాహుకారు ఇంట్లోనే పని మనిషిగా ఉండిపోతుంది.

సాహుకారు ఇంట్లో చెప్పినపని చేస్తూ, అవమానాలను, తిట్లను, హింసలను భరిస్తూ ఆ ఇల్లునే అంటిపెట్టుకొని ఉంటుంది. కొంత కాలానికి బంగారు యవ్వనవతి అవుతుంది. అప్పటి నుండి ఆమె ఇంటిపనితో పాటూ పొలం పనులు కూడా చేయాల్సి వచ్చేది.

యవ్వనవతి అయిన బంగారును చూసి ఆ ఊరి కరణం కొడుకు గోపి ఎలాగైనా ఆమెను లోబరుచుకోవాలని, పోలిగాడి సహాయంతో ప్రయత్నిస్తూనే ఉంటాడు. అలాగే సాహుకారు కొడుకు నారాయణ కూడా బంగారుపై ఆశపడి రత్తమ్మ సహాయంతో ఆమెను పొందాలని చూస్తూ ఉంటాడు. రోజు రోజుకూ గోపి, నారాయణల అరాచకాలు ఎక్కువవుతూ ఉంటాయి.

ఆ గ్రామంలోనే జీవరత్నం కొడుకు నరసింహం చిల్లర వ్యాపారం చేసుకుంటూ ఉండేవాడు. మంచివాడు. బంగారు పరిస్థితి పట్ల సానుభూతి కలిగినవాడు. ఇతనికి బంగారంటే ఇష్టం. తనని పెళ్లి చేసుకోవాలని తల్లిని ఒప్పించి సాహుకారితో మాట్లాడమంటాడు. నరసింహం తల్లి జీవరత్నం వెళ్లి సాహుకారితో మాట్లాడింది. దానికి సాహుకారు అభ్యంతరం చెప్పలేదు కానీ "దాన్ని పెళ్లి చేసుకునేవాడు జాలిగాడి అప్పు తీర్చడానికి సిద్ధంగా ఉండాలి"(భిక్షుకి. పుట: 121) అని చెప్తాడు. అంత స్థోమతలేని నరసింహం, అతని తల్లి జీవరత్నం ఆ ప్రయత్నాన్ని మానుకుంటారు.

బంగారు పట్ల ప్రేమ చావని నరసింహం ఒకరోజు బంగారు అరటి తోటలో ఆకులు కోసుకుంటుండగా వచ్చి అప్పు గురించి మాట్లాడుతాడు. వీరిద్దరూ ఇలా కలుసుకోవడాన్ని చూసిన రత్తమ్మ, పోలిగాడు గోపికి, నారాయణకు ఏదేదో చెప్పడంతో వారిద్దరూ కలిసి నరసింహంపై దాడి

చేస్తారు. సాహుకారు నంజుండప్ప నరసింహాన్ని, అతని తల్లిని బెదిరించి ఊరి నుండి తరిమేసి వారి ఇంటిని కూడా స్వాధీనం చేసుకుంటాడు.

ఆ తర్వాత బంగారుపై గోపి, నారాయణలు విడివిడిగా మానభంగ ప్రయత్నాలు చేస్తారు. చిన్నన్న, చెంచయ్యల సహాయంతో ఆ ఆపదల నుండి బంగారు బయట పడుతుంది. ఈ పరాభవానికి కోపించిన గోపి, నారాయణలు ఇద్దరూ కలిసి నిమ్మాలు సహాయంతో బంగారును రహస్యంగా తీసుకొచ్చి మానభంగం చేసి అడవిలో వదిలేస్తారు. స్పృహ కోల్పోయిన బంగారు తేరుకొని శక్తిని కూడగట్టుకొని లేచి ప్రాణముండగా ఆ ఊరికి వెళ్ళకూడదని నిర్ణయించుకొని పట్నం వైపు దారి పట్టింది. ఆరోగ్యం క్షీణించిన బంగారును చూసి ఆ పట్టణంలో రోడ్లూడ్చే పని చేసే గౌరయ్య అనే తాత వైద్యం చేయించి అతని ఇంట్లో ఆశ్రయమిస్తాడు. బంగారు ఆరోగ్యం కుదుట పడ్డాక గౌరయ్యకు రోడ్లూడ్చే పనిలో సహాయంగా వెళ్తూ ఉంటుంది. ప్రతి రోజూ బంగారును చూస్తున్న ట్రాఫిక్ పోలీసు 'సంజీవి' బంగారును ఇష్టపడి ఇద్దరం కలిసి ఉందామని అడుగుతాడు. అయితే కలిసి ఉండడానికి పెళ్లి అవసరం లేదని, పైగా పెళ్ళికి అనవసరమైన ఖర్చులు ఎందుకని చెప్తాడు.

సంజీవి సుఖాన్నాశించి బంగారును, గౌరయ్యను మాటలతో మాయ చేసి ఒప్పించి వారి గుడిసెలోనే కాపురం పెడతాడు. కొంత కాలం అంతా బాగానే గడిచి బంగారు గర్భవతి అవుతుంది. సుఖానికి అలవాటు పడ్డ సంజీవి కడుపు తీయించాలని అంటాడు. అందుకు బంగారు అడ్డు చెప్తుంది. దీంతో సంజీవి గొడవపడి వెళ్ళిపోతాడు. బంగారు ఒక బిడ్డను ప్రసవిస్తుంది. కానీ ఆ బిడ్డ చనిపోతుంది. కొంతకాలానికి అనారోగ్యంతో తాత కూడా చనిపోతాడు. దీంతో బంగారుకు తాత ఆసరాతో పాటూ, వీధులు ఊడ్చేపని కూడా పోతుంది. ఇలాంటి సమయంలో ఈ కాముక ప్రపంచం బంగారుపై ఒక్కసారిగా విరుచుకు పడుతుంది. బంగారు గుడిసెను వదిలి ఒక హోటల్ లో పనికి చేరుతుంది. అక్కడ యజమాని బలాత్కారం చేయడంతో బంగారు ప్రతిఘటిస్తుంది. ఆ ప్రయత్నంలో యజమాని గాయపడతాడు. హోటల్ యజమాని బంగారుపై దొంగతనం కేసు పురమాయించి జైలుకు పంపిస్తాడు. జైల్లో బంగారుకు నిమ్మాలు కనపడి క్షమించమని అడుగుతాడు. నిమ్మాలు ద్వారా ఊర్లో నారాయణ అరాచకాలన్నింటినీ తెలుసుకుంటుంది. ఒక సంవత్సరం తర్వాత బంగారు జైలు నుండి విడుదలై ఒక మేస్త్రీ దగ్గర పనిలో చేరుతుంది. అక్కడ లింగబోయడు అనే వాడు ఆమెను ఆశపడుతున్నాడని గ్రహించి అతని చేతుల్లో నుండి తప్పించుకొంటుంది.

ఒకరోజు బంగారుకు సంజీవి ఎదురై తనకి మూర్ఛరోగం రావడం, ఉద్యోగం పోవడం ఇలా తన బాధను చెప్పుకొంటాడు. చివరికి వారిద్దరూ మళ్ళీ ఒక్కటై నిజమైన భార్యాభర్తల్లా జీవితాన్ని సాగిస్తారు. బంగారు మళ్ళీ గర్భవతి అయి ఒక బిడ్డకు జన్మనిస్తుంది. ఇలా కొంతకాలం బంగారు జీవితం చాలా ప్రశాంతంగా సాగుతూ ఉంటుంది. మరికొంత కాలానికి సంజీవి హయత్ అనే జట్కా మిత్రులతో కలిసి బలవంతంగా సారాకు అలవాటు పడతాడు. బంగారుకు ఇల్లు

గడవడానికి కూడా కష్టమవుతూ ఉంటుంది. ఒక రోజు సంజీవి ఒక అమ్మాయిని కాపురానికి తెచ్చుకుంటాడు. దీంతో బంగారుకు సంజీవికి పెద్ద గొడవ జరిగి సంజీవి మళ్ళీ ఇంట్లో నుండి వెళ్ళిపోతాడు. దీంతో బంగారుకు మళ్ళీ కష్టాలు మొదలవుతాయి. అద్దె కట్టడానికి డబ్బులేక ఇల్లు ఖాళీ చేస్తుంది. బిడ్డను పోషించడానికి పనిలేక భిక్షమెత్తుకుంటుంది. లాభంలేదని చివరికి రస్తా పనిలో చేరి అక్కడి వారితోనే జీవితాన్ని కొనసాగిస్తూ ఉండేది. ఒకరోజు బిడ్డకు స్ఫోటకం వచ్చి సరైన వైద్యం అందక ఆ బిడ్డ కూడా చనిపోతుంది. దీంతో మళ్ళీ బంగారు జీవితం అగమ్యగోచరంగా మారి జీవితం మీద విరక్తితో ఉంటుంది. తర్వాత రస్తా పనిలో తోడైన తాయారవ్వ సాయంతో ఒక కొత్త ఉత్సాహాన్ని నింపుకొని జీవితాన్ని కొనసాగిస్తూ ఉంటుంది. ఆ కొత్త ఉత్సాహం కూడా ఎన్నో రోజులు నిలవలేదు. తాయారవ్వ కొడుకు మరణంతో వెళ్లిపోతుంది. రస్తా పని ఆగిపోతుంది. ఎక్కడివాళ్లు అక్కడికి వెళ్ళిపోతారు.

బంగారు మళ్ళీ ఒంటరి అవుతుంది. ఏం చెయ్యాలో తోచని స్థితిలో స్వగ్రామం గుర్తుకు వస్తుంది. ఆ నరకంలో బ్రతికుండగా అడుగు పెట్టకూడదనుకుంటూనే చివరికి వెళ్తుంది. అక్కడ తెలిసిన వాళ్ళ ఇంట్లో పనులు చేసుకుంటూ రెండ్రోజులు గడిచిపోతాయి. షాహుకారు నంజుండప్పకు విషయం తెలిసి బంగారును పిలిపించి ఆమెను కట్టేసి చితకబాది ఐదువందల రూపాయలు ఎగవేసి వెళ్తావా అంటూ నానామాటలు అంటాడు. చివరికి కోటయ్యచే రక్షించబడి సాహుకారు ఇంటినుండి బయట పడుతుంది. సాహుకారు కొట్టిన దెబ్బలకు నాలుగు రోజుల తర్వాత తేరుకొని తన జీవితాన్ని, ఈ సాహుకార్ల దురాగతాలను నిందించుకుంటూ చివరికి భిక్షుకి వృత్తిని ఆశ్రయిస్తుంది.

నవలా విశ్లేషణ

కె. సభా 1948లో రాసిన ఈ నవల సాహుకార్ల అమానుషత్వానికి, స్వార్థానికి నిదర్శనం. జీతభత్యాలు లేని పాలేరుల కోసం, వారు చేసిన అప్పు తీరిపోయినప్పటికి లేనిపోని లెక్కలు కట్టిన సాహుకారు నంజుండప్ప చేసిన దుర్మార్గమైన పనికి బలైపోయిన బంగారు జీవితం ఈ నవల. నిరంకుశాధికారాన్ని చలాయిస్తున్న భూస్వాముల దౌర్జన్యాలకు నిదర్శనంగా రచయిత ఈ నవలను రాశారు. అందుకే రచయిత "నాలో స్రవించే పేదరక్తం ప్రజ్వరిల్లి, ధనిక ప్రపంచం చేసే అన్యాయాల్ని ముందు పెట్టడానికి సాహసించాను" అని నవలకు రాసిన తుది పలుకుల్లో అంటారు.

జాలప్ప చనిపోయేటప్పుడు కనీసం మానవత్వాన్ని కూడా చూపకుండా ఇలాంటి పాలేరు మనకు మళ్ళీ దొరకడని నంజుండప్ప బాధపడడం, జాలప్ప చనిపోయాక జరగవలసిన కర్మకాండలకు కావాల్సిన డబ్బుకోసం బంగారు సాహుకారు భార్య తులసమ్మను అడగడానికని వెళ్తే *"ఎందుకొచ్చావు? ఇంకా అక్కడే ఉన్నావు. బయటికెళ్ళి నిల్చొని చెప్పరాదూ నీ రామాయణం? ఇంకేం మీనాన్న బాగానే చేశాడు. ఐదు వందలకూ నీళ్ళొదులుకున్నాం, ఇంకా ఏమైనా వడ్డిబాపత్తు వుంటే రాల్చుకు పోదామని వచ్చావా? అప్పూ తీసుకున్నారు, కుటుంబమంతా*

ఇన్నాళ్ళూ బాగా తిన్నారు, షావుకారు యెద్దు చంపిందనే నిందకూడా ఇప్పుడు అంటగట్టి వెళ్ళాడు" (భిక్షుకి, 1948: 30) అంటూ అనరాని మాటలు అనడం చూస్తే, ఏ మాత్రం జాలీ, దయలేని సాహుకార్ల స్వార్థ బుద్ధి, అమానుషత్వం మనకు అర్థమవుతుంది.

సాహుకార్ల స్వార్థానికి బలైపోయిన కుటుంబంలో పెళ్ళికాని పిల్ల అందులోనూ అనాథగా ఉంటే ఈ పురుషాహంకార, కామ ప్రతిరూపాలు ఆ మనిషిని ఏ విధంగా నంజుకు తింటాయో రచయిత ఈ నవలలో ప్రతిచోటా కళ్ళకు కట్టినట్టు చూపించాడు.

4.2.2. 1951 నుండి 1975 వరకూ వచ్చిన నవలలు

1951 నుండి 1975 వరకూ చిత్తూరు జిల్లా నుండి పదకొండు నవలలు వచ్చాయి. వస్తు వైవిధ్యతా దృష్ట్యా వీటిని సాంఘిక నవలలు, చారిత్రక నవలలు అని రెండు ప్రధాన శీర్షికలుగాను, సాంఘిక నవలలు కింద కరువును చిత్రించిన నవలలు, అస్తిత్వవాద నవలలు, హాస్య, వ్యగ్య నవలలు అనే ఉపశీర్షికలుగా విభజించి విశ్లేషిస్తున్నాను.

4.2.2.1. సాంఘిక నవలలు

ఇతివృత్త పరంగా నవలను సాంఘిక నవల, చారిత్రక నవల, రాజకీయ నవల, మనోవిశ్లేషణాత్మక నవల, హాస్య వ్యంగ్య నవల, డిటెక్టివ్ నవల అని ఎన్ని రకాలుగా విభజించినప్పటికీ ఇందులో ప్రధానమైనవి రెండే రెండు అని, అవి ఒకటి సాంఘిక నవల రెండు చారిత్రిక నవల అని సి. మృణాళిని (సాంఘిక నవల-కథన శిల్పం), ముదిగంటి సుజాతారెడ్డి (తెలుగు నవలానుశీలనం) కొన్ని అభిప్రాయాలను తెలియజేశారు.

"సాంఘిక నవలా స్వభావాన్ని, తత్పరిధిని పరికిస్తే, అది పాశ్చాత్యులు భావించిన దానికంటే విస్తృతమైనదనీ, చారిత్రకం తప్ప వారు పేర్కొన్న ఇతర విభాగాలన్నీ సాంఘిక నవలా విభాగం క్రిందనే పేర్కొనవలసిందని స్పష్టమౌతుంది" (సాంఘిక నవల-కథన శిల్పం,1988: 26) అని చెప్తూ, రాజకీయ పరిణామాలు సగటు మానవుని జీవిత గతిని ప్రభావితం చేసిన తీరును తెలిపే రాజకీయ నవలలను, వ్యక్తి ప్రవర్తనను ఇతరులతో అతనికి గల సంబంధ బాంధవ్యాలను, ఆచార వ్యవహారాలను, మత విశ్వాసాలను చిత్రించే నవలలను (Novel of manners), మనిషి బాహ్య జీవితాన్నే కాక, మానసిక పరిణామాలను, ప్రేరణలను, సంక్షోభ సంఘర్షణలను చిత్రించే మనోవిశ్లేషణాత్మక నవలలను, అలాగే సిద్ధాంత ప్రతిపాదక నవలలను, భావోద్వేగ చిత్రణా నవలలను (Novel of ideas) సాంఘిక నవలల కిందికే వస్తాయని తెలియజేశారు. కారణం వీటన్నింటికీ కూడా సమకాలీన సాంఘిక జీవనమే ప్రధాన భూమిక కాబట్టి.

"అందువల్ల రచయిత వ్యక్తి జీవితంలోని ఏ ప్రత్యేకాంశాన్ని ప్రతిపాదించ దలచుకున్నాడనే విషయాన్ని బట్టి సాంఘిక నవలలే ఎన్నో రీతులలో రూపుదిద్దుకుంటుంది. అతని సాంఘిక జీవితంలోని ఒకే అంశానికి ప్రాధాన్యత ఇచ్చినంత మాత్రాన అందులో సాంఘిక నవలా లక్షణాలు లోపించవు. దీనిని బట్టి అపరాధక పరిశోధకాలు, చారిత్రకాలు, వైజ్ఞానికాలు కాని

నవలలన్నీ సాంఘికాలుగానే చెప్పబడతాయని విశదమౌతుంది" (సాంఘిక నవల–కథన శిల్పం, 1988: 26) అని సి. మృణాళిని అంటారు.

ఇదే అభిప్రాయాన్ని ముదిగంటి సుజాతారెడ్డి 'తెలుగు నవలానుశీలనం'లో చెప్తూ మనోవిశ్లేషణాత్మక నవలలను, హాస్య వ్యంగ్యాత్మక నవలలను, రాజకీయ నవలలను, డిటెక్టివ్ నవలలను సాంఘికాలు గానే చెప్తారు.

సి. మృణాళిని, ముదిగంటి సుజాతారెడ్డి అభిప్రాయాలను చూస్తే నవలా బేధాలలో కనపడే రాజకీయ నవలలు, మనోవిశ్లేషణాత్మక నవలలు, హాస్య వ్యంగ్యాత్మక నవలలు, డిటెక్టివ్ నవలలు, అలాగే అస్తిత్వ వాద ప్రభావం కల నవలలు, తాత్విక చింతన కల నవలలు అన్నీ కూడా సాంఘిక నవలల కిందకే వస్తాయని చెప్పవచ్చు. కారణం ఆయా నవలల్లో ఆయా రచయితలు వారి వారి దృక్కోణాల నుంచి ఏ అంశానికి ప్రాధాన్యత ఇచ్చినప్పటికీ వాటన్నింటిలోనూ సంఘటనలు, సన్నివేశాలు, పాత్రలు సమకాలీన సమాజానికి చెందినవే అయి ఉంటాయి కాబట్టి.

ఈ విధంగా చిత్తూరు జిల్లా నవలా సాహిత్యాన్ని చూసినప్పుడు 1951 నుండి 1975 వరకు వచ్చిన పదకొండు నవలల్లో ఆర్.ఎస్. సుదర్శనం రాసిన మూడు నవలలు కొంత వైవిధ్యతను కలిగి ఉంటాయి. ఎందుకంటే ఆయన నవలలో ఎక్కువగా అస్తిత్వవాదం, తాత్విక చింతన కనిపిస్తాయి కాబట్టి. అలాగే ఈయన నవలల్లో మనోవిశ్లేషణాత్మక నవలా లక్షణాలు కూడా కనిపిస్తాయి. ఈ నవలలను కొంతమంది నవలా విమర్శకులు, నవలా పరిశోధకులు అస్తిత్వవాద నవలలుగా, మనోవిశ్లేషణాత్మక నవలలుగా (ఆర్.ఎస్. సుదర్శనం మళ్ళీ వసంతం, అసుర సంధ్య నవలలను అస్తిత్వవాద నవలలుగా, వల్లంపాటి వెంకటసుబ్బయ్య మళ్ళీవసంతం నవలను అస్తిత్వవాద నవలగా, పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు మళ్ళీ వసంతం, అసుర సంధ్య నవలలను మనోవిశ్లేషణాత్మక నవలలుగా, మొదలి నాగభూషణశర్మ మళ్ళీవసంతం నవలలను మనోవిశ్లేషణాత్మక నవలగా, విద్వేశ్వరి అసుర సంధ్యను మనోవిశ్లేషణాత్మక నవలగా, ముదిగంటి సుజాతారెడ్డి అసుర సంధ్య నవలను మనోవిశ్లేషణాత్మక నవలగా) చెప్పారు.

4.2.2.1.1. అస్తిత్వ వాదప్రభావం కల నవలలు

వ్యక్తి సమాజంలో మనుగడ సాగించాలంటే వ్యవస్థ ఏర్పరిచిన కొన్ని నియమ నిబంధనలను అనుసరిస్తూ జీవించాల్సి ఉంటుంది. అయితే ఇలా కాకుండా వ్యక్తి తనకు నచ్చిన విధంగా స్వేచ్ఛగా వ్యవస్థ ఏర్పరిచిన నియమ నిబంధనలను ఏవీ పాటించకుండా ఉండటం అనేది అస్తిత్వవాదంలో ప్రధానాంశం. అందుకే ఆర్.ఎస్. సుదర్శనం గారు తెలుగు సాహిత్యంలో అస్తిత్వవాదం అనే వ్యాసంలో "వ్యవస్థకంటే వ్యక్తి ధర్మానికి – అంటే వ్యక్తి వైశిష్ట్యానికీ, స్వేచ్ఛకూ, సహజ వికాసానికీ ప్రాధాన్యాన్నిస్తుంది అస్తిత్వవాదం" అంటారు. (సాహిత్య నేపథ్యం,1983: 91).

అలాగే టి.ఎల్. కాంతారావు తెలుగు నవలల్లో చైతన్య స్రవంతి అస్తిత్వవాద భావధోరణులు అనే వ్యాసంలో *"అస్తిత్వవాదంలో ప్రధానాంశం free will. ఇది మనిషి తనలోనికి తను*

చూసుకుంటూ యథేచ్ఛగా తనకు కావలసిన దానికోసం అన్వేషణ ప్రారంభిస్తాడు. ఈ అన్వేషణలో సంప్రదాయాలు, వ్యవస్థాగత ధర్మాలు, నియమాలు పటాపంచలు అవుతాయి. వ్యవస్థా ధర్మం కంటే వ్యక్తి ధర్మం అస్తిత్వవాదంలో ప్రధానమైన విషయం. సాంఘిక స్థాయిని మించిన మనిషిని వ్యవస్థా ధర్మం బంధించలేదు. వ్యక్తి ధర్మానికి, వ్యవస్థ ధర్మానికి మధ్య సంఘర్షణే అస్తిత్వవాదం. సూక్ష్మాంశాల్లో తేడా ఉన్న వ్యక్తివాద ఫలితమే అస్తిత్వవాదంగా చెప్పవచ్చు" (అభ్యుదయ మాస పత్రిక, 1980: 65) అని చెప్పారు.

అలాగే అస్తిత్వవాదానికి మూలపురుషుడు మరియు ప్రాచుర్యం తెచ్చిన కర్క్ గార్డ్, నీట్షే, మార్టిన్, సాత్రే, కేమూ లాంటివారి అభిప్రాయాలను తీసుకుని *"వ్యక్తి వైశిష్ట్యాన్ని గురించి, మానవుల్లో ఒక్కొక్క వ్యవస్థకి అనిర్వచనీయమైన వ్యక్తిత్వం ఉన్నదనీ, దాని అభివ్యక్తి భిన్నంగా ఉండక తప్పదనీ, తద్వారా వ్యక్తి జీవితమూ, ప్రవర్తనా, వ్యవస్థను వ్యతిరేకించినప్పుడు, వ్యక్తి ధర్మాన్ని ఉత్కృష్టమైన విలువగా అంగీకరించి, వ్యక్తినే సమర్థించడం అస్తిత్వవాద దృక్పథంయొక్క సారాంశం"* (సాహిత్య నేపథ్యం,1983:96) అని ఆర్.ఎస్. సుదర్శనం గారు అంటారు.

తెలుగు నవలా సాహిత్యంలో అస్తిత్వవాద దృక్పథం మూడు రకాలుగా కనిపిస్తుందని తెలియజేశారు ఆర్ఎస్ సుదర్శనం గారు. ఒకటి వ్యక్తి వ్యవస్థతో సంఘర్షణ పడి తద్వారా అస్తిత్వ దర్శనం పొందడం. ఈ విధమైన నవలలకు అల్పజీవి, చివరకు మిగిలేది, మెరుపుల మరకలు ఉదాహరణగా చెప్పారు. రెండు, జీవితం, విలువలు, వ్యక్తి – మూడూ వేరు వేరు విషయాలు కావు. జీవించడం నుంచీ విలువలూ, వ్యక్తిత్వమూ సిద్ధిస్తాయి అనే అస్తిత్వవాద దృక్పథం నవల ఎత్తుగడలో, నడకలో, శిల్పంలోనే, ఆవిష్కృతం కావడం. ఈ రకమైన నవల ఒక విస్పష్టమైన వ్యక్తిత్వంతో ప్రారంభం కాదు. జీవితంతో ప్రారంభమౌతుంది. అంటే వ్యవస్థను అంగీకరించడంతోనే ప్రారంభమౌతుంది. అక్కడనించీ, వ్యక్తిత్వమూ, కొత్త విలువలూ జీవితంలోని వివిధ సంఘటనలు కారణంగా ప్రస్ఫుటమౌతూ వచ్చి, చివరకు జీవితంలో 'అస్తిత్వ'మే ప్రధానమైన విలువగా దర్శింపబడుతుంది. అని చెబుతూ మళ్లీ వసంతం, తాగుబోతు, మైనా వీటికి ఉదాహరణలుగా చెప్పారు. అలాగే *"నవలలో ఒక పాత్ర ద్వారా కాకుండా, యిద్దరు ముగ్గురు పాత్రల ద్వారా వారి మనస్తత్వాలకూ, అనుభూతికీ, సాదృశ్యంలో భిన్నత్వం సూచించడంద్వారా, అస్తిత్వవాద దృక్పథాన్ని స్పష్టీకరించడం"* (సాహిత్య నేపథ్యం,1983:108) మూడో పద్ధతి అని చెప్పారు. ఈ రకమైన నవలలుగా అసుర సంధ్య, హిమజ్వాలను ఉదాహరణగా చెప్పారు.

4.2.2.1.1.1. అనుబంధాలు:

నవలా సారాంశం

గోపాలస్వామిది ఒక సాధారణమైన రైతు కుటుంబం. ఆచార వ్యవహారాలను పాటించడం పట్ల నమ్మకమున్న వ్యక్తి. ఇతనికి వ్యవసాయమే జీవనాధారం. కొడుకును చదివించడం కోసం గోపాలస్వామి అప్పటికే ఒక మార్వాడీ దగ్గర కొంత అప్పు చేసి ఉంటాడు. కొడుకు వేదమూర్తి చదువు పూర్తయి కాలేజీ లెక్చరర్ గా పని చేస్తుంటాడు. వేదమూర్తి తనకంటూ

కొన్ని ఆదర్శాలను ఏర్పరుచుకొని వాటిని పాటిస్తూ ఉంటాడు. అటువంటి వాటిలో కట్నం తీసుకొని పెళ్లి చేసుకోకూడదనేది ఒకటి. గోపాల స్వామి కొడుకుకి పెళ్లి చేసి ఆ వచ్చే కట్నం డబ్బులతో అప్పులను తీర్చవచ్చని ఆలోచిస్తుంటాడు. ఇలాంటి సమయంలోనే తండ్రి వేదమూర్తికి పది వేల కట్నం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న ఒక సంబంధాన్ని తెస్తాడు. కానీ వేదమూర్తి కట్నం తీసుకొని పెళ్లి చేసుకోనని చెప్పడంతో గోపాలస్వామి ఎంతో ఆవేదనకు గురి అవుతాడు.

ఈ సమయంలో మార్వాడి తన అప్పు తీర్చమని గోపాలస్వామికి ఉత్తరం రాస్తాడు. దీనితో గోపాలస్వామి ఆ ఊరిలోని ఈశ్వరరెడ్డిని ఆశ్రయిస్తాడు. అప్పటికే గోపాలస్వామి ఈశ్వర రెడ్డి దగ్గర నాలుగు వేలు అప్పు చేసి ఉంటాడు. తనకున్న భూమిని అమ్మడం తప్ప అప్పుతీరే మార్గం వేరే లేదంటాడు ఈశ్వరరెడ్డి. ఆ భూమిని ఈశ్వరరెడ్డే కొనుక్కుంటానని చెప్పడంతో గత్యంతరంలేని గోపాలస్వామి ఉన్న ఐదు ఎకరాలను అమ్మేస్తాడు. పొలం అమ్మిన తర్వాత గోపాలస్వామి మునుపటిలా ఉండలేకపోయాడు. కన్నతల్లితో సమానంగా చూసుకున్న భూమి పోవడంతో అనేక రకాలుగా బాధపడి మానసికంగా దెబ్బతింటాడు. ఒకరోజు వర్షంలో తడవడం వల్ల గోపాలస్వామి మరణిస్తాడు. గోపాలస్వామి మరణానికి వేదమూర్తే కారణమని అందరూ అనుకుంటారు. కానీ వేదమూర్తి తన తండ్రి మరణానికి తాను కారణం కాదనుకుంటాడు.

వేదమూర్తికి తను పనిచేస్తున్న కాలేజీలో సుందరరావుతో స్నేహం కుదురుతుంది. ఒక రోజు కాలేజీలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో విమల ఒక పాట పాడుతుంది. అక్కడున్న విద్యార్థులు మళ్ళీ పాడమని గొడవ చేయడంతో ఒక విద్యార్థిపై వేదమూర్తి చెయ్యి చేసుకుంటాడు. అక్కడ జరిగిన గొడవ వల్ల తన ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్ళిపోతాడు. ఇక్కడ వేదమూర్తికి ఏర్పడిన సంబంధాలు అంతటితో ముగిసిపోతాయి.

తర్వాత మరో ఉద్యోగం కోసం వేదమూర్తి మద్రాసుకు వెళ్తాడు. అక్కడ తన స్టూడెంట్ విమల ఎదురవుతుంది. విమల తల్లి హాస్పిటల్లో ఉండడంతో వేదమూర్తి విమలకు సహాయం చేస్తాడు. వేదమూర్తికి విమల పట్ల ప్రేమ కలిగి పెళ్లి చేసుకుందామని అడుగుతాడు. అందుకు విమల అంగీకరించదు. కారణం పెళ్లి తర్వాత స్త్రీలెవ్వరూ సుఖంగా లేరని తనకున్న నమ్మకం. దీనితో వేదమూర్తి బాధపడతాడు. ఇంతటితో వేదమూర్తికి విమలతో ఉన్న అనుబంధం ముగిసిపోతుంది.

విమల తనతో పెళ్లి కాదనడంతో వేదమూర్తి మద్రాసు వదిలి సుకుమార్ అనే స్నేహితుడి ప్రభావం వల్ల కమ్యూనిష్టు పార్టీలో చేరుతాడు. అక్కడ కొన్ని చెడు అనుభవాలు ఎదురవ్వడంతో పార్టీతో తనకున్న సంబంధాన్ని తెంచుకుంటాడు. అలాగే లీల అనే అమ్మాయితో వేదమూర్తికి ఉన్న అనుబంధం కూడా ఆమె చనిపోవడంతో అంతమవుతుంది.

కొంత కాలం తర్వాత పార్వతి అనే ఆమె ద్వారా వేదమూర్తి విమలను కలుసుకుంటాడు. విమల, వేదమూర్తి ఇద్దరూ విడిపోయిన తర్వాత వారి వారి జీవితాలలో జరిగిన విషయాలను దాపరికాలు లేకుండా పంచుకోవడంతో ఇద్దరి మధ్య ఒక గాఢమైన అనుభందం ఏర్పడి, అది

వివాహానికి దారితీస్తుంది. తర్వాత తన స్వగ్రామానికి వెళ్లి తండ్రి పోగొట్టుకున్న పొలాన్ని విమల దగ్గరున్న డబ్బుతో కొని వ్యవసాయం చేయడం మొదలు పెడతాడు.

నవలా విశ్లేషణ

ఆర్.ఎస్. సుదర్శనం 1958లో రాసిన ఈ నవలలో రచయిత ఒక వ్యక్తి మరొక వ్యక్తితోను, సమాజంతోనూ ఏర్పరుచుకొనే అనుబంధాలను తెలియజేస్తూ, రైతుకు, భూమికి గల అనుబంధాన్ని, తండ్రి కొడుకుల మధ్య గల అనుబంధాన్ని, గురుశిష్యుల అనుబంధాన్ని, ప్రేమ వివాహ బంధాలను చాలా సహజంగా చిత్రించాడు. అలాగే వ్యక్తి తనకు తాను ఏర్పరుచుకున్న ఆదర్శాలను పాటించలేని పరిస్థితులు వచ్చినప్పుడు అవి తెచ్చిపెట్టే సమస్యలు ఏ విధంగా ఉంటాయో కూడా ఈ నవల ద్వారా రచయిత చెప్పాడు. నవల చివర్లో వేదమూర్తి ఒక మాట అంటాడు "చూశావా, మా నాన్న మాటే నెగ్గింది చివరకు. నీ డబ్బుతో మా పొలం మాకు దక్కింది". ఈ మాటలను చూస్తే వేదమూర్తి మొదట్లో ఏ ఆదర్శాలనైతే గట్టిగా నమ్మి కట్నం తీసుకోకూడదని ఆ డబ్బుతో బతక కూడదని తన తండ్రి తెచ్చిన సంబంధాన్ని కాదని చివరికి అదే భార్య తెచ్చిన డబ్బుతోనే పోయిన తన తండ్రి పొలాన్ని తిరిగి కొనుక్కుంటాడు. ఇలా చూస్తే వేదమూర్తి ఆదర్శ భావాలను అంటిపెట్టుకొని ఉన్నప్పటికీ చివరికి తన తండ్రి నమ్మే సాంప్రదాయానికి తలొగ్గాడనిపిస్తుంది.

4.2.2.1.1.2. మళ్ళీ వసంతం

నవలలో ప్రధానమైన పాత్ర ఊర్మిళ. ఊర్మిలది సామాన్యమైన రైతు కుటుంబం. ఈమె ఇంటర్ చదువుతుండగా తండ్రి చనిపోతాడు. తల్లి, ఇద్దరు అక్కయ్యలు వరలక్ష్మి, వనజ, అన్నయ్య గోపాలం ఉంటారు. పెద్ద అక్కయ్యకు వివాహం అయ్యింది. ఈమె భర్త పేరు నాగభూషణం. వ్యాపార నిమిత్తం వీరు బర్మాలో ఉంటారు. వీరి సంతానం మాధవ్. వీరు బర్మాలో ఉన్న కారణంగా మాధవ్ బాధ్యతను ఊర్మిళకే అప్పుజెప్తారు. ఊర్మిల అన్నయ్య గోపాలం పొలం తాకట్టు పెట్టి ఆ డబ్బుతో చెల్లెళ్ళను చదివిస్తూ ఉంటాడు. అందువల్ల ఊర్మిళ తొందరగా చదువు పూర్తి చేసి డాక్టర్ అయ్యి తన కుటుంబానికి సహాయంగా నిలవాలనుకుంటుంది. బర్మా నుండి తిరిగి వచ్చిన భూషణం ఇంటి బాధ్యతల్ని తన చేతుల్లోకి తీసుకోవలసి వస్తుంది. గోపాలం చెల్లెళ్ల చదువు కోసం చేసిన అప్పుల్ని తీర్చి తన పేర ఉన్న సగం ఆస్తిని, ఇల్లును భూషణం రాయించుకుంటాడు.

ఊర్మిళ నాగభూషణం అభిప్రాయాల పట్ల గాఢమైన విశ్వాసాన్ని ఏర్పరచుకుని వాటితో ఏకీభవిస్తూ ఆ అభిప్రాయాలను తన అభిప్రాయాలుగా అనుకుంటూ ఉంటుంది. ఈ కారణంగా భూషణం బావకు వ్యతిరేకమైన వారి పట్ల తనూ వ్యతిరేక వైఖరిని ఏర్పరచుకుంటుంది. భూషణం ఆంతర్యంలో గల స్వార్థాన్ని గ్రహించిన గోపాలం మాత్రం అతని పట్ల విముఖతతో ఉంటాడు.

స్వార్థబుద్ధి, డబ్బు మీద వ్యామోహం, స్త్రీ వాంఛ కలిగిన భూషణం తన భార్య వరలక్ష్మి చనిపోయాక మిగిలిన ఇద్దరి మరదల్లని ఒకరికి తెలీకుండా ఒకరితో తన పొందును పంచుకుంటాడు. వనజను పెళ్లి కాకుండానే తల్లిని చేస్తాడు. కల్లబొల్లి మాటలతో ఊర్మిళను

నమ్మించి తనను వివాహం చేసుకుంటాడు. భూషణం, ఆంతర్యంలో గల స్వార్థ బుద్ధిని గ్రహించిన గోపాలం అతనితో వ్యతిరేకిస్తాడు. చివరకు భూషణం గోపాలం చేసిన రుణాలను తీర్చి ఉన్న ఇల్లును, పొలాన్ని తన పేరు రాయించుకుంటాడు. అలాగే తన కన్న కొడుకు ప్రేమను అర్థం చేసుకోకుండా మూర్ఖంగా ప్రవర్తించడంతో కొడుకు దూరమవుతాడు.

ఊర్మిళ మెడిసిన్ చదువుతున్న సమయంలో ఆమె సహాధ్యాయి చంద్రశేఖరం ఆమెను ప్రేమిస్తాడు. ఆ విషయం ఆమెకు చెప్పినప్పుడు కుటుంబ బాధ్యతలను, అక్క చనిపోయిన తర్వాత బావ పరిస్థితిని, మాధవ్ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కొంత సమయం కావాలంటుంది, ఆ తర్వాత వీరిద్దరి హౌస్ సర్జన్లు పూర్తయి చంద్రశేఖరం యుద్ధంలో పనిచేయటానికి ప్రభుత్వం నియమిస్తున్న డాక్టర్లలో ఒకడుగా వెళ్ళిపోతాడు. తర్వాత 12 ఏళ్లకు వీరిద్దరూ కలుసుకుంటారు. అప్పుడు కూడా శేఖరంకు తన పట్ల గల ప్రేమను గమనించిన ఊర్మిళ, నెల రోజులు సెలవు పెట్టి బెంగళూరుకు వెళ్ళిపోతుంది. అప్పటికే గోపాలానికి, నాగభూషణానికి జరిగిన గొడవలో నాగభూషణం చనిపోయి ఉంటాడు. గోపాలం జైలు శిక్ష అనుభవిస్తుంటాడు. తను ప్రేమించిన రాధ విషయంలో తండ్రి చేసిన పనికి తనపై ద్వేషాన్ని పెంచుకొని ఉన్న మాధవ్, తన తండ్రి చనిపోయాడని తెలిసి చూడడానికి వస్తున్న సమయంలో రైలు ప్రమాదం జరిగి చనిపోయి ఉంటాడు. అప్పటికే గర్భవతిగా ఉన్న మాధవ్ భార్య జానకి కొంత కాలానికి ప్రభ అనే కూతురును కంటుంది. జానకి కూడా కొంతకాలానికి చనిపోవడంతో ప్రభను ఊర్మిళే చూసుకుంటూ ఉంటుంది.

ఒకరోజు ఊర్మిళకు వచ్చిన కలలను విశ్లేషించుకొనే క్రమంలో మాధవ్ డైరీలను తెప్పించుకొని చదువుతుంది. దీనివల్ల మాధవ్ తో పాటూ మిగిలిన వ్యక్తుల స్వభావాలు, గతంలో జరిగిన కొన్ని సంఘటనలు ఆమెకు గుర్తుకు వస్తాయి. వాటిని అవగాహన చేసుకొని తను ఎక్కడెక్కడ పొరపాటు చేసిందో వ్యాఖ్యాన రూపంలో విశ్లేషించుకుంటుంది. అప్పటి వరకూ తను ఏర్పరుచుకున్న బంధాలు అశాశ్వతమైనవని తెలుసుకొని వాటిని దూరం చేసుకొని తన మనస్సును ప్రశాంతంగా, నిర్మలంగా ఉంచుకుంటుంది. చివరికి తను ప్రేమించిన శేఖరంతో జీవితాన్ని పంచుకోవాలనుకుంటుంది.

నవలా విశ్లేషణ

ఆర్.ఎస్. సుదర్శనం 1960లో రాసిన ఈ నవలను ఒక ప్రయోగాత్మక నవలగా చెప్పొచ్చు. ఈ నవలలో ప్రధాన పాత్ర ఊర్మిళ ఆంతరంగిక స్వగతంగా కథ మొత్తం సాగుతుంది. ఊర్మిళ జీవితంలో జరిగిన సంఘటనలను, తనతో సంబంధం ఉన్న వ్యక్తులను, తనకు వచ్చిన రెండు కలల ఆధారంగా చేసుకుని ఆలోచనాపరంగా విశ్లేషించుకుని వ్యక్తి ధర్మానికి, వ్యవస్థ ధర్మానికి మధ్య సమన్వయాన్ని సాధించే దిశగా వ్యక్తి పరిపూర్ణత్వాన్ని పొందటమే ఇందులోని కథా వస్తువు.

నవలలో ప్రధాన పాత్ర అయిన ఊర్మిళ తన గడిచిన జీవితాన్ని ప్రస్తుతానికి సమన్వయించుకుంటూ తన భవిష్యత్తు మార్గాన్ని ఏర్పరుచుకుంటుంది. అందుకే ఈ నవలలో కథ భూత భవిష్యత్తు వర్తమానాలకు సంబంధించిందిగా నడుస్తుంది. ఈ నవలను అస్తిత్వవాద ప్రభావం కలిగిన నవలగా మనం చెప్పొచ్చు. "అస్తిత్వవాదం వ్యక్తిధర్మానికి, వ్యవస్థాధర్మానికి మధ్య వైరుధ్యం ఉంటుంది అని చెబుతుంది. అస్తిత్వవాదం వ్యక్తి ధర్మానికి (స్వధర్మానికి) ప్రాముఖ్యం ఇస్తే వ్యవస్థాధర్మం సంఘం విధించే కట్టుబాట్లకు ప్రాముఖ్యం ఇవ్వాలంటుంది. ఈ రెండింటికి సమన్వయాన్ని సాధించాలనుకుంటుంది ఊర్మిళ. తన స్వేచ్ఛను సాధ్యమైనంత వరకు కాపాడుకుంటూనే వ్యవస్థ సాధించిన కట్టుబాట్లను కూడా ఊర్మిళ పాటిస్తుంది". (ఆర్. ఎస్. సుదర్శనం, 2011:39). అని....

సాధారణంగా వ్యవసాయ కుటుంబంలో పుట్టిన ఊర్మిళను ఆ కుటుంబమే పెంచి పెద్ద చేసి డాక్టర్ని చేస్తుంది. అందుకనే ఆ కుటుంబం పట్ల బాధ్యతతో అనుక్షణం నడుచుకుంటుంది. అలాగే అక్క చనిపోయాక తన బావ మీద సానుభూతితో నాగభూషణాన్ని పెళ్లి చేసుకుంటుంది. తను ప్రేమించిన చంద్రశేఖరాన్ని కాదనుకుంటుంది. నవల చివర్లో చంద్రశేఖరంతో కలిసి జీవించాలని నిర్ణయించుకుంటుంది. అంటే ఇక్కడ ఊర్మిళ స్వధర్మం కోసం బావ నాగభూషణాన్ని పెళ్లి చేసుకోవడం, వ్యవస్థ కోసం చంద్రశేఖరంతో కలిసి జీవించాలని నిర్ణయించుకోవడం చూస్తే ఈమె వ్యక్తి ధర్మానికి, వ్యవస్థ ధర్మానికి మధ్య సమన్వయాన్ని సాధించే దిశగా నిర్ణయాన్ని తీసుకుందని అర్థమవుతుంది.

అలాగే ఈ నవల మనో విశ్లేషణాత్మక నవలగా కూడా మనకు కనిపిస్తుంది. ఇదే విషయాన్ని చాలా మంది చెప్పారు. కాకపోతే ఈ నవలను ఊర్మిళ పాత్ర దృష్ట్యా అనేకులు అనేక రకాలుగా చెప్పారు. కొంతమంది అస్తిత్వవాద నవలగా, మరి కొంత మంది మనో విశ్లేషణాత్మక నవలగా చెప్పారు. ఊర్మిళ తన జీవితంలో ఎదురైన సంఘటనలను, వ్యక్తులను తనకు వచ్చిన రెండు కలలను ఆధారంగా చేసుకుని వాటిని విశ్లేషించుకొని తన భవిష్యత్ మార్గాన్ని వెతుక్కుంటుంది. అంటే ఈ నవల యూంగ్ ప్రతిపాదించిన వ్యక్తి పరిపూర్ణత అనే సిద్ధాంతం ఆధారంగా సాగుతుంది. "యూంగ్ ప్రతిపాదించిన వ్యక్తి పరిపూర్ణత అనే సిద్ధాంతం వ్యక్తిలోని భిన్న ప్రేరణల సమన్వయానికి ప్రాధాన్యం ఇస్తుంది. మనుష్యుల మధ్య గల సంబంధాల్లో ఆత్మధర్మాన్వేషణ ప్రధానమైన ప్రేరణగా పేర్కొంటాడు యూంగ్. సెక్స్ ప్రేరణ ప్రాబల్యం ముఫ్ఫయ్యేళ్ళదాకా. అటుపైన ఆత్మధర్మాన్వేషణ ప్రేరణే ప్రధానమవుతుందని యూంగ్ అంటాడు. "మళ్ళీ వసంతం" నవలలో ఆత్మధర్మాన్వేషణ ప్రాధాన్యం వహించింది. కథానాయిక ఊర్మిళ మనఃప్రపంచంలో తతిమ్మా పాత్రలందరూ మనోధర్మాలకు ప్రతీకలుగా భాసించారు. (ఆర్. ఎస్. సుదర్శనం. 2011పుట:37).

4.2.2.1.1.3. అనురసంధ్య

నవలలో ప్రధాన పాత్ర శ్రీధర్. ఇతనిది వ్యవసాయ కుటుంబం. తండ్రి రామలింగయ్య. తల్లి చిన్నప్పుడే చనిపోయి ఉంటుంది. అప్పటి నుండి అతన్ని వాళ్ళ వదిన రుక్మిణమ్మ తల్లిలా పెంచి పెద్ద చేసి ఉంటుంది. వదిన పట్ల, తన అన్న నరసింహం పట్ల శ్రీధర్ కు విధేయతా భావం ఉండేది. అయితే శ్రీధర్ భార్య తారకు మాత్రం వారి పట్ల అంత సద్భావం ఉండేది కాదు.

బి.ఎస్సి. చదివిన శ్రీధర్ మద్రాసులో సివిల్ సప్లై శాఖలో గుమస్తాగా ఉద్యోగం చేస్తుంటాడు. అది పోయిన తర్వాత బీటి టీచర్ ట్రైనింగ్ చేస్తే ఉద్యోగం వస్తుందని స్నేహితులు చెప్పడంతో అందుకు కావలసిన డబ్బులు ఇంట్లో అడుగుతాడు. తన తండ్రి అంత డబ్బు లేదనడంతో తన భార్య తరపున వారు ఓబయ్య, మంగమ్మ 1500 ఇస్తారు. మద్రాసులో బీటీ చేస్తున్న శ్రీధర్ కు చంద్రావతి అనే వివాహితతో పరిచయం ఏర్పడుతుంది. చంద్రావతి జీవనశైలి, ఆమె భావాలు శ్రీధర్ కు చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. భర్త ఉన్నప్పటికీ ఆమె తనతో సినిమాలకి, బీచ్ లకు రావడాన్ని చూసి ఆశ్చర్యపడతాడు. అయితే వీరి మధ్య కేవలం స్నేహం తప్ప శారీరక సంబంధం ఉండదు. ఒకరోజు కొంత మంది చంద్రావతితో తిరుగుతావా అని అతనిపై దాడి చేస్తారు. దీనితో స్వతహాగా గాంధేయ వాది, ఆదర్శవాది, సాంప్రదాయంపై అభిమానం, నైతిక విలువలు కలిగిన శ్రీధర్ వివాహితతో పరపురుషుడు స్నేహం చేయడం అన్నది వ్యవస్థ విధించిన నియమావళికి వ్యతిరేకమా అని బాధపడతాడు.

బీటీ పూర్తి చేసుకుని స్వగ్రామానికి వచ్చిన శ్రీధర్ కు ఉద్యోగం దొరుకుతుంది. సమిష్టి కుటుంబం పట్ల ఇష్టమైన శ్రీధర్, అన్నా వదినలతో ఉంటాడు. తారను కూడా రమ్మని పిలుస్తాడు. అందుకు తార వ్యతిరేకిస్తుంది. వేరే కాపురం కావాలనుకుంటుంది. దీనికి శ్రీధర్ నిరాకరించడంతో తార తల్లిదండ్రులు తమ వద్ద తీసుకున్న డబ్బు వడ్డీతో సహా ఇవ్వాలంటారు. శ్రీధర్ ఆ డబ్బులు ఇవ్వకపోవడంతో తన కుటుంబానికి యజమాని అయిన తన అన్న నరసింహాన్ని ఇవ్వమని లీగల్ నోటీసులు పంపుతాడు. ఇది తన తమ్ముడే చేసుంటాడని నమ్మిన తన అన్న వదినలు శ్రీధర్ ని అపార్థం చేసుకుంటారు. దీనితో ఆదర్శ కుటుంబ భావన అతనిలో అంతమవుతుంది. ఎంతో నిరాశ నిస్పృహలకు లోనవుతాడు.

ఇలాంటి సమయంలో చలమయ్య అనే మిత్రుడి ద్వారా శ్రీధర్ కు పద్మామణి కలుస్తుంది. విద్యార్థి దశలో ఈమెను శ్రీధర్ ప్రేమించి ఉంటాడు. ఇప్పుడామె శ్రీధర్ జీవితంలోకి రావడంతో వారి మధ్య సంబంధం శారీరక సంబంధం వరకు వెళుతుంది. ఇది తెలిసి శ్రీధర్ భార్య తార అతనికి ఇంకా దూరమవుతుంది. పద్మామణితో తనకున్న సంబంధాన్ని చూసి సంఘం 'ఛీఛీ మంచి వాడివి చెడిపోతున్నావు' అంటుంది. ఇలాంటి తరుణంలో తను ఏర్పరచుకున్న ఆదర్శభావాలకి, తను కోరుకునే ఆనందానికి, అనుభూతులకు మధ్య సంఘర్షణ మొదలవుతుంది. అంతేకాక తన జీవితంలో ఎదురయ్యే ప్రతి సంఘటనలోనూ తను ఏర్పరచుకున్న ఆదర్శాలకు విరుద్ధమైన ఫలితాలను చవిచూడవలసి వస్తుండేది. దీనితో ఈ మానసిక సంఘర్షణను

తొలగించుకోవడానికి సన్యాసం పుచ్చుకొని ఆత్మానంద స్వామిగా మారిపోయిన తన టీచర్ శేషాద్రిని కలుస్తాడు. వీరిద్దరి మధ్య ఆధ్యాత్మిక, తాత్విక విషయాల గురించి చర్చ జరుగుతుంది. తర్వాత ఇతనికి మిత్రుడు నాగరాజు కనిపిస్తాడు, మద్రాసులో వీరు కలిసి చదువుకున్నప్పుడు తన ఆదర్శాలకు విరుద్ధంగా నాగరాజు చేసిన పనిలో తను భాగమైన కారణంగా వీరిద్దరి మధ్య స్నేహం చెడిపోయి ఉంటుంది. ఇతడు అస్తిత్వవాది. ఇతనితో కలిసి అస్తిత్వవాదాన్ని గురించి చర్చిస్తాడు. ఇక్కడ యదార్థ జీవితానికి, ఆదర్శ జీవితానికి పొంతన ఏ మాత్రం లేదని గ్రహిస్తాడు. వీరిద్దరితో జరిగిన సంభాషణ తర్వాత చివరకు శ్రీధర్ తన భార్యను, ఇద్దరు కూతుళ్లను తన దగ్గరకు తెచ్చుకుని అన్నతో భూమిని పంచుకుని వేరుగా కాపురం పెడతాడు.

నవలా విశ్లేషణ

తెలుగులో అస్తిత్వవాద ప్రభావంతో వచ్చిన నవలల్లో ఈ నవల కూడా ఒకటి. గాంధీ హత్య జరిగిన రోజున ప్రారంభమై, చైనా భారతదేశం మీద దాడి చేసిన రోజు ముగిసిన ఈ నవల వార్తాపత్రికల్లో కనిపించే రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సామూహిక పరివర్తన కాదు అంటూ *"సంఘానికి ప్రాతిపదిక అయిన వ్యక్తి జీవితం, వ్యక్తి మనస్తత్వానికి సంబంధించిన పరివర్తన, దాని పరిశీలన ఇందులోని వస్తువు"* (ఆర్.ఎస్. సుదర్శనం, 2012: 45) అంటారు అంపశయ్య నవీన్.

ఆదర్శవాది అయిన శ్రీధర్ అస్తిత్వవాదిగా మారడం, అతని జీవన విధానంలో వచ్చే మార్పులకు సంబంధించిన పరిశీలనే ఈ నవల. తెలుగు సాహిత్యంలో అస్తిత్వవాద దృక్పథం అభివ్యక్తమైన రచనలను పరామర్శించే క్రమంలో ఆర్.ఎస్. సుదర్శనం గారు అవి మూడు రకాలుగా ఉంటాయని తెలియజేశారు. అది ఇదివరకే తెలియజేశాను.

నవలలో ఒక పాత్రద్వారా కాకుండా రెండు మూడు పాత్రల ద్వారా వారి మనస్తత్వాలకు, అనుభూతికి సాదృశ్యంలో భిన్నత్వం సూచించడంద్వారా, అస్తిత్వవాద దృక్పథాన్ని స్పష్టీకరించడం మూడో పద్ధతి అని చెబుతూ, ఈ రకమైన నవలలకి అసురసంధ్య, హిమజ్వాల నవలలను ఉదాహరణగా చెప్పారు ఆర్.ఎస్. సుదర్శనం. అలాగే ఈ నవల గురించి *"'అసుర సంధ్య'లో రెండు పాత్రలున్నాయి. నాగరాజు మొదటినుంచీ ఏ రకమైన వ్యవస్థను అంగీకరించడు. జీవితంతో తాదాత్మ్యం చెంది తద్వారా విలువలను సృష్టించే దృక్పథం అతనిలో మొదటి నుంచీ ఉన్నది. శ్రీధర్ పాత్ర అందుకు భిన్నం. అతడు ఏమో విలువల్నీ, ధర్మాల్నీ, ఆదర్శాల్నీ, ముందు పెట్టుకొని అడుగులు వేయబోయి మాటిమాటికీ తూలుతాడు. క్రమంగా జీవించడంనుంచే వ్యక్తిత్వమూ విలువలూ సిద్ధిస్తాయని గ్రహిస్తాడు"* (సాహిత్య నేపథ్యం, 1983:108) అని చెప్పారు.

ఈ విధంగా చూసినప్పుడు ఈ నవలలో శ్రీధర్ మొదట ఆదర్శవాదిగా ఉంటూ తను ఏర్పరచుకున్న ఆదర్శాలు పాటిస్తూ ఉంటాడు. అయితే అవి అతనిని అడుగడుగునా ఓటమికి, ఆత్మ న్యూనతకు గురిచేస్తూ ఉంటాయి. దీంతో మానసిక వేదనకు, ఆత్మన్యూనతకు గురవుతాడు. వీటిని తొలగించుకోవాలని ఆరాటపడుతుంటాడు. దీనికి శ్రీధర్ కు నాగరాజు, చంద్రావతి,

పద్మామణి, ఆత్మానంద స్వాముల పరిచయాలు తోడ్పడతాయి. వీరి పరిచయాల కారణంగా శ్రీధర్ చివరకు ఆదర్శభావాలను వదిలేసి వాస్తవ జీవితంతో రాజీపడి జీవితాన్ని ముందుకు సాగిస్తాడు.

4.2.2.1.2. కరువును చిత్రించిన నవలలు

సాధారణంగా కరువు అంటే వర్షాలు పడక, పంటలు పండక, మనుషులకు, పశువులకు ఆహారం దొరక్క, తిండిగింజ కోసం నానాయాతనపడే వాతావరణాన్ని కరువు అంటారు. ఇది సామాన్య జనానికి కూడా తెలిసిన మాట. *"శబ్ద ఉత్పత్తి శాస్త్రం ప్రకారం "కరువు", "క్షామము", "కాటకము" అంటే ఆకలి".* (సీమ గుండెచప్పుడు, 2009: 35).

ఒక ప్రాంతంలో సంవత్సరానికి 75 శాతం కన్నా తక్కువ వర్షపాతం నమోదైతే ఆ పరిస్థితిని క్షామము అంటారు. వర్షాభావం, అధిక వర్షపాతం, వరదలు, తుఫాన్లు భయంకరమైన రోగాలు (ప్లేగు, కలరా) వీటి ద్వారా ఏర్పడే పంటనష్టం, దరిద్రం వంటి పరిస్థితులు కరువుకు దారితీస్తాయి. ఇవి ఇలానే కొంత కాలం కొనసాగితే ఆ పరిస్థితిని క్షామం అంటారు. ఇలాంటి పరిస్థితులు ఏర్పడినప్పుడు ప్రజలు బ్రతుకుతెరువు కోసం పొట్టకూటి కోసం ఉన్న ఊరిని వదిలి ఎక్కడికో వలస వెళ్లిపోవడం, కడుపు నింపుకోవడం కోసం ఆకుల్ని అలుముల్ని, ప్రేమగా పెంచుకున్న జంతువుల్ని చంపి తినడం, ఒక్కొక్కసారి చివరికి మనుషులు ఒకరినొకరు చంపుకుని తినే పరిస్థితి కూడా ఏర్పడ్డాయని, పిల్లల్ని తల్లిదండ్రులు అమ్ముకున్నారని, స్త్రీలు తమ శరీరాల్ని అమ్ముకోవలసి వచ్చిందని చరిత్ర చెబుతుంది.

ఇలాంటి కరువు కాటకాలు భారతదేశానికి కానీ, అందులోని రాయలసీమకు కానీ కొత్తేమీ కాదు. ఇలాంటి కరువులు అనేకం సంభవించి స్మశానాన్ని తలపించే విధంగా మారిపోయిన రాయలసీమ ప్రాంతంలో కనపడే బీడు భూములు, బీటలు వారిన చెరువులు, పాడుబడిన ఊర్లు, ప్రజలు వలసలు పోతున్న దృశ్యాలు, రైతులు ఆవేదనలతో చేసుకునే ఆత్మహత్యలు ఇలా అనేకం ఈ ప్రాంతంలో తరచూ జరుగుతూనే ఉంటాయి. ఇలాంటి పరిస్థితులను అదుపు చేయాల్సిన ప్రభుత్వాలు చేపడుతున్న గంజి కేంద్రాల లాంటి కార్యక్రమాలతో పాటు ఉత్తుత్తి వాగ్దానాలను కూడా ఈ ప్రాంతంలో చూడవచ్చు. అలాంటి ఈ ప్రాంతంలోని ప్రజల జీవన విధానం ఎంత దుర్భరంగా ఉందో తెలియజేస్తూ ప్రాచీన కాలం నుండి నేటి వరకు అనేక మంది రచయితలు, కవులు వారి వారి రచనల్లో చిత్రిక పడుతూనే ఉన్నారు.

రాయలసీమ అంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కరువు ప్రాంతంగా పిలవబడుతున్న మాట నిజమే. అయితే ఈ రాయలసీమలోని నాలుగు జిల్లాల నుండి రచనలు చేస్తున్న వారు ఏదో ఒక సందర్భంలో ఈ కరువు పరిస్థితులను వారి రచనల్లో చిత్రించిన వారే. 1950-60 మధ్య కాలంలో వచ్చినటువంటి కరువు పరిస్థితులు ప్రజల జీవన విధానాలు ఏ విధంగా ఉన్నాయో తెలియచేస్తూ కె. సభా గారు రాసిన నవల మొగిలి. 1950 నుండి 75 వరకు వచ్చిన నవలల్లో మొగిలి మాత్రమే కాకుండా దూరతీరాలు, ఇంద్రధనస్సు లాంటి నవలలు కూడా రాయలసీమ కరువు పరిస్థితులను చిత్రించాయి.

4.2.2.1.2.1. మొగిలి

నవలా సారాంశం

నవలలో ప్రధాన పాత్ర అయిన మొగిలప్పది సాధారణ రైతు కుటుంబం. తల్లిదండ్రులు శాంతమ్మ, సుబ్బయ్యలు. మొగిలప్పకు నాగమ్మ అనే చెల్లెలు ఉంటుంది. వీరిది చిత్తూరు సీమలోని మొగిలి గ్రామం. తీవ్రమైన కరువు సంభవించడంతో ఆ ఊర్లోని ఒక్కొక్క కుటుంబం వలస వెళ్లిపోతూ ఉంటారు. *"అందరూ వెళ్ళిపోతున్నారు మనం ఈ ఊర్లో ఉండి మాత్రం ఎలా బ్రతగ్గలం"* (మొగిలి(చేతిరాత ప్రతి) పుట:3) అంటూ సుబ్బయ్య ఉన్న గొడ్డూ గోదా అమ్ముకొని, ఆ వచ్చిన డబ్బులతో ఎక్కడికైనా వెళ్లి పొట్ట పోసుకోవచ్చని అనుకుంటాడు. అయితే కాంతమ్మ, మొగిలప్పలు నారు పోసినవాడు నీరు పోయకుండా ఉంటాడా అన్నట్టుగా అక్కడే ఉండి కరువు కాలం తీరిపోయే వరకు ఎలాగోలా జీవితాన్ని సాగించాలని అనుకుంటారు. ఒకరోజు సుబ్బయ్య ఆవులు తోలుకొని ఈతాకుల కోసకు వెళ్తాడు. అక్కడ ఈత గడ్డ కొట్టే క్రమంలో పాము కాటుకు గురై చనిపోతాడు. అప్పటి నుండి కుటుంబ భారం మొగిలప్ప పైన పడుతుంది.

తండ్రి మరణానంతరం మామ లోకయ్య ఇంట్లో నాలుగు రోజులు ఉన్న తర్వాత మొగిలప్పకి ఒక ఆలోచన వస్తుంది. దీనితో ఎంతకాలం ఇలా ఉండగలం అనుకుని ఇలానే ఉంటే జీవితం ఎలా సాగడం అని ఆలోచించి చెల్లిని మామ ఇంట్లో వదిలి తల్లితో పాటు తన ఊరు చేరుతాడు. తల్లి కాంతమ్మను మునసబు గారి ఇంట్లో గంజి కాచిపోసే పనికి పెట్టి తను ఉత్తరాదికి వెళ్లి ఏదో ఒక ఉద్యోగం సంపాదించి నాలుగు రాళ్లు సంపాదించాలని బయల్దేరుతాడు.

మొగిలి గ్రామం నుండి బయలుదేరిన మొగిలప్ప చిత్తూరు, తిరుపతి, కాళహస్తి, గూడూరు దాటుకొని నెల్లూరు నుండి తెనాలి వైపు గంజి కేంద్రాలను నమ్ముకుంటూ ప్రయాణం చేస్తాడు. తెనాలి వెళ్లే రైల్లో మొగిలప్పకు అమ్మయ్య చౌదరి పరిచయం అవుతాడు. మొగిలి నిజాయితీని గుర్తించి తనకున్న బట్టల షాపులో మూడు పూట్ల అన్నం పెట్టి నెలకు 30 రూపాయల జీతంతో ఉద్యోగంలో చేర్చుకుంటాడు.

గుంటూరులో చదువుకుంటున్న అమ్మయ్య చౌదరి కూతురు లలిత దసరా సెలవులకని ఇంటికి వచ్చి, మొగిలిని చూసి ప్రేమిస్తుంది. లలిత బలవంతంతో మొగిలి కూడా ఆమెను ప్రేమిస్తాడు. అయితే పెద్దల అనుమతి లభిస్తేనే మొగిలి లలితను పెళ్లి చేసుకుంటానని చెప్తాడు.

మొగిలి చెల్లెలికి పెళ్లి కుదరడంతో పెళ్ళికి అవసరమైన డబ్బును అమ్మయ్య చౌదరి దగ్గర తీసుకుని ఊరికి బయలుదేరుతాడు. ఆ ప్రయాణంలో రైల్లో మొగిలికి సులోచన అనే అమ్మాయి పరిచయమౌతుంది. చెల్లెలి పెళ్లి పూర్తి చేసిన మొగిలప్ప తిరిగి అమ్మయ్య చౌదరి ఇంటికి వస్తాడు. అప్పటికే లలిత మొగిలప్పల ప్రేమ గురించి తెలుసుకున్న అమ్మయ్య చౌదరి, తిరిగి వచ్చిన మొగిలప్పతో తెలివిగా మొగిలప్ప విశ్వాసాన్ని దృష్టిలో ఉంచుకొని తరతరాల నుండి వస్తున్న సంప్రదాయాన్ని ఉల్లంఘించే పరిస్థితుల్లో తాము లేమని, ఇలాంటి పరిస్థితుల్లో నువ్వు దూరంగా ఉంటేనే అమ్మాయి మనసు మార్చుకోవడానికి వీలవుతుందని చెప్పి, 2000 రూపాయలు ఇచ్చి

దానితో నీకు నచ్చిన వ్యాపారం ఏదైనా చేసుకో అని, తక్షణమే తన ఊరికి వెళ్ళి పొమ్మంటాడు. దీనితో ఒక్కసారిగా మొగిలప్పకి ఏం చేయాలో అర్థం కాలేదు. మొగిలప్ప *"బాబయ్యా నేను హృదయం విప్పిచెబుతున్నాను. అమ్మాయి నిప్పులాంటి మనిషి ఆమె తొందరపడింది నిజమే. కానీ పార్వతీ పరమేశ్వరులవంటి మీకు అన్యాయం చెయ్యగలనా? మీ అనుమతి లేనిదే వివాహం జరగనేరదని, మీరు అనుమతిస్తేనే నేను అంగీకరిస్తాననీ ఆమెకు చెప్పాను"* (మొగిలి(చేతిరాత ప్రతి) పుట:154) అని చెబుతూ తన నిజాయితీని తెలియజేసి డబ్బులు తీసుకోకుండా చార్జీలకు సరిపడా మాత్రం తీసుకొని తన ఊరికి బయలుదేరుతాడు. అప్పటికే మొగిలీశ్వరుని దయవల్ల వర్షాలు సమృద్ధిగా పడి ఆ ప్రాంతంలో కరువు మచ్చుకైనా లేకుండా పోవడంతో మొగిలప్ప తన స్వగ్రామానికి నిశ్చింతగా వెళ్లే ప్రయత్నం చేస్తాడు.

తన ఊరికి వెళ్తూ వెళ్తూ తిరుపతిలో దిగి తిరుమలకు వెళ్లి శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవాలనుకుంటాడు. ఈ క్రమంలో దర్శనానికి వచ్చిన సులోచన కనపడి తన తండ్రి రామిరెడ్డిని మొగిలప్పకు పరిచయం చేస్తుంది.

ఉద్యోగం పోయిన మొగిలి స్వగ్రామాన్ని చేరుకున్న తర్వాత కిరాణా కొట్టు పెట్టుకొని జీవించాలనుకుంటాడు. తెలిసిన వాళ్ళందరి దగ్గర ఎంత ప్రయత్నించినా డబ్బు దొరక్కపోవడంతో నాలుగు ఆవులు పట్టుకుని వాటి నుంచి వచ్చిన పాలను అమ్ముకుంటూ జీవితాన్ని కొనసాగిస్తూ ఉంటాడు.

ఒకరోజు లలిత రాత్రి ఒంటి గంటకు గూడూరు స్టేషన్లో తనను కలుసుకోవాలని ఉత్తరం రాస్తుంది. గూడూరు స్టేషన్లో మొగిలి లలితను కలుసుకుంటాడు. లలిత తెచ్చిన సూట్ కేసును ఓపెన్ చేసి అందులో ఉన్న 40 వేల రూపాయలు చూపించి మనం ఎక్కడికైనా వెళ్లిపోయి హాయిగా బతుకుదామని తన మనసులోని మాటను తెలియజేస్తుంది. అలాగే తన బావతో జరగాల్సిన పెళ్లిని కూడా నిరాకరించి నిన్నే పెళ్లి చేసుకోవాలని వచ్చానని కూడా చెప్తుంది. మొగిలప్ప అందుకు నిరాకరించి లలితను తన ఇంటివద్ద దిగబెట్టి, వెంటనే బయల్దేరుతాడు.

మొగిలప్ప రైలు ఎక్కి అనేకమైన ఆలోచనలతో అలాగే నిద్రపోతాడు తెల్లవారేసరికి రైలు తిరుపతి చేరుకుంటుంది ఇక్కడ దాకా వచ్చిన మొగిలప్పకు తిరుమలకు వెళ్లి రావాలని స్వామిని దర్శించుకురావాలని అనుకుంటాడు. తిరుమల కోనేరులో స్నానం చేసి బట్టలు మార్చుకోవాలని తన వెంట తెచ్చుకున్న సూట్ కేసును ఓపెన్ చేయడంతో అందులో ఒక్కసారిగా డబ్బును చూసి మొగిలప్ప ఆశ్చర్యపోతాడు. లలితే సూట్ కేసులు మార్చి ఉంటుందని తను ఇంత పని చేస్తుందని అనుకోలేదని అనుకుంటాడు. అయితే పెట్టె ఓపెన్ చేసి చూస్తే అందులో నలభైవేలకు బదులు యాభైవేలు ఉంటాయి. లలిత పిచ్చిది తను యాభైవేలే తెచ్చుంటుందిలే అనుకొని భ్రమ పడతాడు. అయితే అందులో ఒక పెళ్లి పత్రిక ఉండడం చూసి దానిని చదువుతాడు. అది సులోచన పెళ్లి పత్రిక అని తెలుసుకుని అందులో ఉన్న అడ్రస్ ప్రకారం ఆ డబ్బును వారికి చేరవేయాలని వెళ్తాడు. మొగిలప్ప అక్కడికి వెళ్లే సమయానికి కట్నం డబ్బులు ఇవ్వలేదని పెళ్లి కొడుకు గోల చేస్తూ

ఉంటాడు. మొగిలి తెచ్చిన డబ్బును చూసి పెళ్ళికొడుకు పెళ్ళికి సిద్ధపడతాడు. అయితే సులోచన విషయాన్ని గ్రహించి కట్నం కోసం ఆశపడిన వారిని కాదని కష్టకాలంలో ఉన్నప్పటికీ నిజాయితీగా ఆ డబ్బును ఉపయోగించుకోకుండా తీసుకువచ్చిన మొగిలిని పెళ్లి చేసుకోవాలని అనుకుంటుంది. సులోచన తండ్రి రామిరెడ్డి అతనిని పెళ్లికి ఒప్పిస్తాడు. సులోచన మొగిలప్ప పెళ్లి చేసుకుని మొగిలికి వస్తారు.

కొంతకాలానికి అమ్మయ్య చౌదరి మొగిలిని వెతుక్కుంటూ అతని ఇంటికి వస్తాడు. తన కూతురు లలిత మనోవ్యాధితో మంచం పడిందని రేపా మాపా అని రోజులు లెక్కపెట్టుకునే స్థితిలో ఉందని చెప్తాడు. డాక్టరుగా ఉన్న సులోచన లలిత పరిస్థితిని అర్థం చేసుకొని కొన్ని రోజులు లలితకు ప్రేమికుడిగా మొగిలిని నటించమని అడుగుతుంది. లలితకు కొంత కాలానికి వ్యాధి నయమవుతుంది. అయితే తర్వాత నెమ్మదిగా మొగిలి, సులోచనలు భార్యాభర్తలని తెలిసి తట్టుకోలేక లలిత ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నిస్తుంది. లలిత ఇప్పుడు కాకపోయినా ఎప్పటికైనా ఈ ప్రయత్నాన్ని విరమించదని సులోచన అర్థం చేసుకొని మొగిలితో తనను వివాహం చేసుకోవాలని పట్టుబట్టి ఒప్పిస్తుంది. చివరికి అమ్మయ్య చౌదరి, రామిరెడ్డి, సులోచన, లలిత మొగిలిప్పలు అదే గ్రామంలో ఉంటూ రామిరెడ్డి ఆలోచన మేరకు అక్కడ కొంత పొలాన్ని కొని అతడు రైతుగాను సులోచన డాక్టర్ గాను మొగిలప్ప ఆవులు మేపుకుంటూ కాలాన్ని సుఖాంతంగా వెల్లబుచ్చుతుంటారు.

నవలా విశ్లేషణ

రాయలసీమలోని కరువు చిత్రణను ప్రధానాంశంగా చేసుకుని 1969లో కె. సభా రాసిన నవల మొగిలి. కరువు కాలంలో కుటుంబానికి ఆసరాగా నిలవాలని, చెల్లెలి పెళ్లిని తన డబ్బుతో జరిపించాలని, రాయలసీమ అందులోనూ చిత్తూరు ప్రాంతం నుండి తెనాలి వరకు వెళ్లి అక్కడ ఉద్యోగం సంపాదించి, అమ్మయ్య చౌదరి దగ్గర, సులోచన తండ్రి దగ్గర నిజాయితీకి మారుపేరుగా నిలిచి చివరికి సులోచనను, లలితను పెళ్లి చేసుకుని తిరిగి తన ఊర్లోనే ఉంటూ ఆవులను పట్టుకుని మేపుకుంటూ కాలం గడిపే మొగిలప్ప కథే ఈ నవల.

ఈ నవలలో మొగిలప్ప పాత్రను ప్రధాన పాత్రగా చేసుకుని కరువు కాలంలో తన కుటుంబాన్ని పోషించుకోవడం కోసం తాను పడే కష్టాన్నే కాకుండా 1950-60 మధ్య కాలం నాటి రాయలసీమ కరువు పరిస్థితులను రచయిత కళ్ళకు కట్టినట్లు చూపిస్తాడు.

"ఎండ తీక్షణంగా ఉన్నది. మిట్ట మధ్యాహ్నానికంతా యింకా ఎంత తీక్షణమౌతుందో! రచ్చ పైన రావిచెట్టు ఎండిపోయింది. ఆకులు లేని మోడై ఆ గ్రామం శిథిలావస్థను సూచిస్తున్నది. వేప చెట్టు పుటమారిపోయింది. ఊర్లో పచ్చని చెట్టే కనిపించడం లేదు. ఆ పిట్టలన్ని ఏమయినవో! ఊరి మొగదలలో తన విశాల బాహువులతో స్వాగతమిస్తుండిన వటవృక్షం సమస్తమైన అంగములూ ఖండించబడిన వన దేవత వలె విలపిస్తున్నది" (మొగిలి(చేతిరాత ప్రతి) పుట:6) అంటూ కరువు దెబ్బకు రూపాంతరాలే మారిపోయిన గ్రామాలను, పిట్ట అయినా కనిపించని

వాతావరణాన్ని రచయిత చూపిస్తాడు. అలాగే *"మొగిలి కొండ ఎండకు కనకనలాడుతున్నది. పచ్చని కొండ వాలు బూడిద వర్ణంగా కన్పిస్తున్నది. కనుమ క్రింద మామిడి తోట గలగలమంటూ ఆకులను రాల్చివేస్తున్నది. గోవురాతి ప్రక్కనున్న నేరేడు చెట్టులోని చిలుకలు పత్తాలేవు. ఆ పక్కనే పండు ముత్తైదువలే నిండుగా కనిపిస్తుండిన అత్తి చెట్టు వాడి వత్తులైపోయింది".* (మొగిలి(చేతిరాత ప్రతి) పుట:8) అంటూ ఆనాటి కరువు వాతావరణాన్ని చిత్రిస్తాడు.

ఇలాంటి భయంకరమైన కరువు పరిస్థితులకు తట్టుకోలేక ఊర్లకు ఊళ్లే ఖాళీ చేసి వలసలు వెళ్లిపోతుంటే, అలా వలసలు వెళ్లలేని కొంత మంది ఆహారం కోసం పడుతున్న బాధలను కూడా ఈ నవలలో మనం చూడవచ్చు. ఒకరోజు మొగిలప్ప తండ్రి సుబ్బయ్య పడే బాధను రచయిత ఈ విధంగా చూపిస్తాడు. *"అక్కడికి మూడు మైళ్ళలో ఉన్నది ఈతాకుల కోన ఆ కోనలో దాదాపు అన్ని చెట్లు కొట్టి వేశారు. అదృష్టవశాత్తు ఎక్కడో ఒక పిలక ఉండకపోతుందా అని సుబ్బయ్య ఆశ. సుబ్బయ్యకు రోజూ అదే పని ఐపోయింది. దొరికితే ఈత పిలకను కొట్టి ఆ గడ్డను తీసుకురావడం. లేనిచో కత్తాయిగడ్డ కోసం గాలించడం. రెండూ దొరక్కపోతే నిమ్మటాయి గడ్డలు. అది చిలగడదుంపల్లా ఉంటాయి. ఏ బండ అంచుల్లోనో గుండ్ల నేరికల్లోనో దొరుకుతుంటాయి. ఏవీ దొరక్కపోతే ఎలికంజెవులైన దొరికితాయి ఉప్పు కారం వేసి తినవచ్చు"* (మొగిలి(చేతిరాత ప్రతి) పుట:7) అంటూ రచయిత ఆ కరువు కాలంలో తిండి గింజల కోసం పడే బాధలను అలాగే అలా అడవుల్లో దేవదారు చెట్లు కనిపిస్తే ఆ చెట్టు కింద రాలిన ఏ ఆకులనైనా సరే తీసుకువెళ్లి ఉడికించి తినే దుస్థితిని కూడా మన కళ్ళకు కట్టినట్లు చూపిస్తాడు.

ఇలాంటి పరిస్థితులను తట్టుకోలేక వలసలు వెళ్లిపోయే కుటుంబాలకు ఉన్న అరా కొరా భూములను ఆ ఊర్లోని కరణాలు, మునసబులు, శెట్టి గారి లాంటి వ్యాపారులు సొంతం చేసుకోవడం. లేదా గుత్తకని తీసుకుని దాన్ని వారే దక్కించుకోవడం లాంటి స్వార్థ బుద్ధిగల పెద్దమనుషులను ఈ నవలలో రచయిత చూపిస్తాడు

4.2.2.1.3. హాస్య/వ్యంగ్య నవలలు

"హాసము అంటే నవ్వు. ఆ నవ్వు పుట్టించేది హాస్యము. ఇలాంటి హాస్యము *వికృతాకార వాగ్వేష చేష్టాదేర్నర్త కార్భవేత్/హాస్యోహాసః స్థాయీభావః అన్నాడు సాహిత్యదర్పణ కారుడు. దీనివల్ల మన పూర్వులు మూడు రకాల హాస్యం వున్నట్లు చూపారని వ్యక్తంమౌతున్నది: వికృతా కారమూ; వికృతమైన వాక్కు; వికృతమైన చేష్టా హాస్యాన్ని పుట్టిస్తవి. ఆకార చేష్టాదులవల్ల జనించేది బాహిరమైనదనీ, వాక్కువల్ల జనించేది అంతరమైనదని చెప్పుకోవచ్చు. ఈ మూడింటిలోనూ వాక్కువల్ల జనించేది మిగిలిన వానికన్నా గొప్పది. ఆకారమూ చేష్టలవల్ల కలిగే హాస్యం తాత్కాలికమూ; వాక్కువల్ల కలిగేది సార్వకాలికమూ అనవచ్చు"* (తెలుగు నవలా వికాసం1971: 161). అంటే మనం ఉన్న ఆకారం వల్ల గాని, లేదా వేసుకొన్న వేషం వల్ల గానీ, మనం ప్రవర్తించే విధానం ద్వారా కానీ లేదా చేసే పనులవల్ల కానీ, మనం మాట్లాడే భాషవల్ల కానీ

నవ్వు పుడుతుంది అని అర్థం. పై మూడింటిలో భాషవల్ల జనించే హాస్యం తప్ప మిగిలిన హాస్యాలు మనుషుల నుండి అయినా కావచ్చు లేదా ఇతర జడ అజడాల నుండి అయినా జనించవచ్చు.

సాహిత్య విషయానికి వచ్చేసరికి హాస్యం నిత్యజీవితంలో కంటే కొంత తక్కువ అయినప్పటికీ మొదట కావ్యాల్లో కనిపిస్తూ ఆ తర్వాత చాటువుల్లోనూ, ఆ తర్వాత నాటకాల్లో ఎక్కువగా కనిపించేది. తెలుగు నవలల్లో హాస్య విషయానికి వచ్చేసరికి నాటకాలల్లో కంటే నవలల్లో హాస్యం తక్కువనే చెప్పాలి. ఎందుకంటే నవల ప్రదర్శింపలేనిది. అందువల్ల పాఠకుడు చదివి ఆనందించాలి. ఇలాంటి హాస్యాన్ని నవలలో నిర్వహించడం కొంత కష్టతరమే అవుతుంది. అందుకే తెలుగులో ఉన్న హాస్య నవలలు చాలా తక్కువనే చెప్పొచ్చు. ఈ నవలా సాహిత్యంలో (ఉన్నంతలో) హాస్యం రెండు విధాలుగా ఉంటుంది. ఒకటి హాస్యమే ప్రధానంగా ఉన్నవి. రెండోవి హాస్యం అక్కడక్కడ నిర్వహిస్తూ ఉన్నవి. వీటిల్లో మొదటి రకానికంటే రెండవ రకమే చాలావరకు తెలుగు సాహిత్యంలో ఉన్నాయి.

ప్రజా జీవన విధానాన్ని ఆధారంగా చేసుకొని చూస్తే ఈ హాస్యం వారి జీవితాల్లో వెలుగు చూడాలంటే అక్కడి ప్రజలు తిండికి గుడ్డకి ఏ కొదవా లేకుండా ఉంటేనే కలుగుతుంది. అలాంటప్పుడే వారు కాలక్షేపానికి సమయం కేటాయించి సాహిత్యంలోని హాస్యాన్ని చదివి ఆనందించగలరు. అలాగే హాస్య రచనలను చేయగలరు. అయితే ఇలాంటి పరిస్థితులు ఆంధ్రప్రదేశ్ లో మొదట కోస్తాంధ్ర ప్రాంతంలో విరివిగా ఉండటం వల్ల ఆ ప్రాంతం కంటే రాయలసీమ ప్రాంతం కొంత వెనకబడిందని నిర్మొహమాటంగా చెప్పొచ్చు. ఎందుకంటే ఇక్కడ భౌగోళిక పరిస్థితులను చూస్తే కరువులు, కాటకాలు, తగిన నీరులేక వ్యవసాయం కుంటుపడటం, పైగా కక్షలు, తగాదాలు వంటి పరిస్థితుల వల్ల ఈ ప్రాంతాల్లో ఆర్థిక పరిపుష్టి తగ్గి ప్రజలు తిండికోసమే మొదట తాపత్రయపడే వారు. ఇటువంటి వీరి జీవితాల్లో హాస్యం జనించడం అరుదు. అందుకనే ఈ ప్రాంతాల్లో హాస్య రచనలు ఆలస్యంగానే వెలుగు చూశాయి. అయితే ఇక్కడ హాస్యం తొందరగా జనించకపోయినప్పటికీ వ్యంగ్యంతో కూడుకున్నటువంటి హాస్యం అక్కడక్కడ కనిపించేది. రాయలసీమ ప్రజల జీవన విధానాలను తెలియజేస్తూ, అధికారుల చేతగానితనాన్ని ఎత్తిపొడుస్తూ, ధనిక వర్గం పేదవారి పట్ల చూపుతున్న విధానాన్ని నిరసిస్తూ, కడుపు మంటతో, ఆవేదనతో, ఆక్రోశంతో, వ్యంగ్యాన్ని ప్రధానంగా చేసుకొని రచనలు చేశారు. ఇది మితిమీరినప్పుడు కటువుగా ఉంటుంది. అలా కాకుండా సున్నితంగా ఉన్నప్పుడు అది హాస్యాన్ని జనింపజెస్తుంది.

చెప్పదలుచుకున్న విషయాన్ని మరుగున పరచి అదే అర్థాన్ని ప్రస్ఫుటించే విధంగా మరొక మాటను చెప్పడాన్ని వ్యంగ్యం అంటారు. అది హాస్యం పుట్టించేది కావచ్చు, ఎదుటి వ్యక్తిని విమర్శించేది కావచ్చు, లేదా పొగడడానికి కావచ్చు ఇలా ఏ విషయాన్ని అయినా మరుగు పరిచి మాట్లాడడానికి ఈ వ్యంగ్యం బాగా ఉపయోగపడుతుంది.

ఈ వ్యంగ్యాన్ని గురించి ఎస్.ఎస్. నళిని సాహిత్య విమర్శ పదాల డిక్షనరీలో వివరిస్తూ "చెప్పిన దానిలో పైకి కనిపించేదానికీ, అసలు ఉద్దేశించిన అర్థానికీ తేడా ఉండడాన్నీ, దానివల్ల ఏర్పడే హాస్య వాతావరణాన్నీ వ్యంగ్యం అంటారు. పైకి చెప్పినదానికి విరుద్ధమైన అర్థంలో మాట్లాడడం, రాయడం. రచయిత (లేదా పాత్ర) తన వ్యతిరేకతని అలంకారికంగా చెప్పడం. పైకి ఒక విధంగా గొప్ప చేస్తున్నట్టు ఉంటూనే, అంతర్గతంగా అందులోని లోపాల్ని ఎత్తిచూపుతూ, ఎగతాళి చేస్తూ ఉంటుందీ విధానం. ఇందులో వాడే పదాల మామూలు అర్థం ఒకటి కాగా, దానివల్ల ధ్వనించే, వచ్చే ఇతరేతర అర్థం వల్ల వ్యంగ్యం పుడుతుంది". (సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ, 2021:168,169).

నవలలో పూర్తిగా హాస్యాన్ని చిత్రించకపోయినప్పటికీ (ఏ సాహిత్యంలోనైనా హాస్యం నవల ఆసాంతం వుండే నవలలు కొద్దిగానే ఉంటాయి.) అక్కడక్కడ సన్నివేశాల ద్వారా, సంఘటనల ద్వారా హాస్యాన్ని పండిస్తూ దానికి కొంత వ్యంగ్యాన్ని, అధిక్షేపాన్ని, అవహేళననూ చేరుస్తూ చిత్తూరు జిల్లా నుండి 1951-75 మధ్యలో రెండు నవలలు వచ్చాయి. అవి చిన్న ప్రపంచం సిరివాడ, గాడిద బ్రతుకులు.

4.2.2.1.3.1. చిన్న ప్రపంచం సిరివాడ:

సిరివాడ అనే ఒక చిన్న పట్టణంలో రామజోగి హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తుంటాడు. రామజోగికి హైస్కూల్ హెడ్ మాస్టర్ తనను పొగిడితే వినాలని, ఉన్నదానితో సరి పెట్టుకోవడం వల్ల కలిగే సంతృప్తి తన భార్య ముఖంలో చూడాలని, తన కాపురం తను చేసుకుంటూ ఉంటే కూతురు దగ్గరకు వెళ్లి రెండు పూటలా అతిథి మర్యాదలు పొందాలని, ఒక కొత్త వస్త్రాన్ని భుజంపైన వేసుకుని వీధిలో ఎవరైనా అడిగితే అది మా అబ్బాయి కొనిచ్చాడని చెప్పాలని ఆశ పడుతూ ఉంటాడు. ఇలాంటి కొన్ని ఆశలతో పాటూ, కొన్ని ఆశయాలు కూడా రామజోగికి ఉన్నాయి. అవి విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని, మంచి మార్కులతో పాస్ అవ్వాలని, రైళ్లు పడిపోకూడదని, విమానాలు కూలిపోకూడదని, అనావృష్టి వల్ల పైర్లు ఎండిపోకూడదని, అతివృష్టి వల్ల ఊళ్ళు నాళ్ళు తుడిచిపెట్టి పోకూడదని, జనాలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకోవడం రామజోగి ఆశలు. ఇవన్నీ అటు ఉంచితే రామజోగి అబద్ధం చెప్పలేడు. ఎంతగా ప్రయత్నించినా రహస్య గోపనం చేయలేడు. తీయగా మాట్లాడిన ప్రతి వ్యక్తిని మానవోత్తముడుగా అనుకుంటాడు. కళ్ళ ముందర ఏ మాత్రం చెడు జరిగినా కుమిలిపోతాడు. ఇలాంటి రామజోగి పాత్ర ద్వారా సిరివాడలో జరిగే అన్యాయాలను, అక్రమాలను రచయిత ఈ నవలలో దర్శింపజేస్తాడు.

రామజోగి భార్య పేరు రామామణి. వీరికి సుందరం అనే కొడుకు, బాలామణి అనే కూతురు ఉంటారు. రామామణి అన్న వల్లభరావు తన కూతురికి అనవసరమైన కట్నం డబ్బులు దండగ ఎందుకని రామజోగి కొడుకుని సుందరానికిచ్చి పెళ్లి చేస్తాడు. పైగా చెక్ పోస్ట్ లో ఒక ఉద్యోగాన్ని కూడా తన అల్లుడికి చూస్తాడు. రామజోగి తన కూతురు బాలామణికి మంగపతి అనే

వ్యక్తితో పెళ్లి చేస్తాడు. ఇతను ఒక ఉద్యోగస్థుడు. అయితే *"పెళ్ళాన్ని ఒక ఉద్యోగినిగా చేసి ఆమె గుండా నెలనెల కొన్ని వందల రూపాయలు కళ్ళజూడాలన్నదే అతని ధ్యేయం"*గా ఉంటుంది. (చిన్న ప్రపంచం సిరివాడ, 1971: 24). అందుకోసం తన భార్య పరీక్షల్లో పాస్ అయ్యేదాకా కాపురానికి తీసుకుపోయే వీలు లేదని నిర్ణయించుకుంటాడు. దీనితో బాలామణి, రామజోగి ఇంట్లోనే ఉంటూ చదువుకుంటూ ఉంటుంది.

రామజోగికి ఒకరోజు నిద్ర పట్టకపోవడంతో అలా లేచి వీధిలోకి వస్తాడు. సందులు గొందులు పట్టి అలా నడుచుకుంటూ పోతుండగా, కొంత మంది దొంగలు బరువైన మూటలను తీసుకుపోతూ కనిపిస్తారు. వాళ్లు తీసుకెళ్తున్నది ఏమైవుంటుందని వారిని వెంబడిస్తాడు. వాళ్లు బియ్యం బస్తాలను, హార్లిక్స్ డబ్బాలను, గోధుమ రవ్వను, నూనె డబ్బాలను, ఎరువుల మూటలను దొంగతనంగా ఒక లారీకి ఎక్కించడాన్ని చూస్తాడు. ఈ విషయాన్ని సిరివాడ ప్రజలందరికీ చెప్పాలనుకుంటాడు. *"అన్నలారా! తమ్ముల్లారా! సిరివాడ పౌరులారా! వినండహో వినండి! బియ్యం లేకపోతే మీకు తిండిలేదు. చక్కెర లేకపోతే కాఫీ లేదు. ఎరువు లేకపోతే పంటలు ఖాళీ! సంచి భుజాన వేసుకుని బజారుకు వెళ్ళి చౌకబియ్యం దుకాణంలోనూ, కోఆపరేటివ్ స్టోర్ లలోను, ఎరువుల డిపోలోను 'నోస్టాకు' బోర్డును చూసి దిగులు పడి ఇంటికి తిరిగి వెళ్ళడం మీకు అలవాటైపోయింది. బాబులూ! నిద్ర విడవండి! కళ్ళు తెరవండి!..... ఈ గూడుపుఠాణీని అరికట్టండి!"* అంటూ (చిన్న ప్రపంచం సిరివాడ, 1971: 29) అక్కడ చూసిన దృశ్యాలన్నింటినీ వీలైనంత బిగ్గరగా చెప్పాలనుకుంటాడు రామజోగి.

ఈలోగా తెల్లవారడంతో ఈ విషయాన్ని నాగరాజు గారికి చెప్పాలనుకుంటాడు. నాగరాజు ఆ ఊరిలోని హైస్కూల్ కు కట్టించే కొత్త బిల్డింగ్ కమిటీ అధ్యక్షుడు. అంతేకాదు స్థానిక సహకార పరపతి సంఘానికి అధ్యక్షుడు. అలాగే సిరివాడ మేజర్ పంచాయతీ ప్రెసిడెంట్, ఇంకా చెరకు ఉత్పత్తి దారుల సంఘం లాంటి మరెన్నో సంఘాలలో కూడా అతనికి సభ్యత్వాలు ఉన్నాయి. అయితే ఈ అక్రమాలన్నీ చేయించేది నాగరాజు గారే అని రామజోగికి తెలియదు.

ఒకరోజు ఉదయాన్నే నాగరాజు గారిని కలుసుకోవడానికి హైస్కూల్ హెడ్మాస్టర్ శ్రీకంఠం వస్తాడు. హైస్కూల్ హెడ్ మాస్టర్ పిల్లల దగ్గర నుండి స్పెషల్ ఫీజులు అంటూ కొంత డబ్బు వసూలు చేసి ఆ డబ్బును స్కూల్ అవసరాలకు వాడకుండా తన సేవింగ్స్ ఖాతాలోకి జమ చేసుకుంటూ ఉంటాడు. డ్రిల్ మాస్టర్ రంగనాథం అప్పుడప్పుడు జిల్లా పరిషత్ ఆఫీసుకు వెళ్ళొస్తున్నాడండి అంటూ అతని గురించి, అలాగే వెల్ఫేర్ ఆఫీసర్ మీరు ఊర్లోలేని రోజు వచ్చి ఇంత పెద్ద స్కూలుకు హాస్టల్ లేదేమిటి అని బిల్డింగ్ చూపిస్తే వెంటనే హాస్టల్ మంజూరు చేస్తామని అన్నారు అంటూ కొన్ని విషయాలు చెప్తాడు. విషయాన్ని గ్రహించిన నాగరాజు అవన్నీ నేను చూసుకుంటాను, ఇంకేమైనా విశేషాలు ఉన్నాయా అనడంతో శ్రీకంఠం గారు ఎందుకు లేవండి అంటూ ఈమధ్య అభ్యుదయ నాటక మండలి ఒకటి బయలుదేరిందండి. అందులో ఉన్న సభ్యులందరికీ కలిసి ఒక నాటకం దొరికింది. ఆ నాటకం పుస్తకాలు షాపుల్లోనూ,

గ్రంథాలయాల్లోను దొరికింది కాదు. ఈ ఊర్లోనే ఉంటున్న చిరంజీవి అనే రచయిత రాసింది అని చెప్తాడు. అతడు రాసిన నాటకం పేరు 'కాంట్రాక్టు శపథం' అని అందులో నాగరాజు గారు హెడ్మాస్టరు ఇతరత్రా నాయకవర్గం కలిసి ఆ ఊరిలో చేస్తున్న అన్యాయాలన్నింటినీ చేర్చి నాటకంగా వేస్తున్నారని చెప్తాడు. నాగరాజు ఇలాంటి రచయితల వల్ల తమ పరువుకు ఎప్పుడైనా భంగం కలగవచ్చని ఆ రచయితకు ఒక సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని హెడ్మాస్టర్ కి చెప్తాడు. శ్రీకంఠం, నాగరాజు దగ్గర సెలవు తీసుకొని వెళుతుండగా రామజోగి తను చూసిన అక్రమాలను, అన్యాయాలను నాగరాజు గారికి చెప్పడానికి వస్తాడు. తను చూసిన విషయాలన్నింటినీ నాగరాజుకి చెప్తాడు. అయితే నాగరాజు మంచి వాడివి గనుక నేరుగా నా దగ్గరికి వచ్చి చెబుతున్నావు. మరొకరైతే ఈపాటికి ఊరంతా అల్లుకుపోయి ఉండేది. ఆ దొంగలు వాళ్ళ జాగ్రత్తలో వాళ్ళు ఉండిపోయేవారు. ఇప్పుడు అలా జరగదుగా ఇంతటితో నీ బాధ్యత తీరిందనుకో వాళ్లను పట్టి లాకప్పులో పెట్టించే పూచీ నాది అని చెప్తాడు.

వారం రోజులు సెలవు దొరకడంతో రామజోగి కొడుకు సుందరం ఇంటికి వస్తాడు. అలాగే బాలామణి పరీక్షలు దగ్గర పడటంతో ఆమెను సిద్ధం చేయడానికి మంగపతి కూడా లీవ్ పెట్టి వస్తాడు. సిరివాడ హైస్కూల్లో జరిగే పబ్లిక్ పరీక్షలకు డిపార్ట్మెంటల్ ఆఫీసర్ గా వచ్చిన పీతాంబరం రామజోగిని ఆ పరీక్షలకు సూపర్వైజర్ గా వేస్తాడు. ఈసారి పరీక్షలు పగడ్బందీగా జరుగుతున్నాయని తలచిన రామజోగి తన పరీక్ష హాలులోకి ప్రవేశిస్తాడు. అంతా సవ్యంగా జరుగుతుందనుకుంటున్న సమయంలో పిల్లలు తెచ్చుకున్న చీటీలను గమనించి వాటిని లాగేసుకుంటాడు. ఈ విషయాన్ని హెడ్మాస్టర్ గారికి విన్నవిస్తాడు. అయితే హెడ్మాస్టరు ఆ విషయాన్ని చూసీ చూడనట్టు వదిలేస్తాడు. విద్యార్థులు కాపీ కొడుతున్నట్లు, చీటీలు తెచ్చుకొని రాస్తున్నట్లు గమనించిన పీతాంబరం అతని వెంట వచ్చిన ఆఫీసర్లను ప్రతి గదికి పంపించి ఆ చీటీలను తనిఖీ చేయించి హెడ్మాస్టర్ కు తగిన విధంగా శిక్ష వేస్తాడు. చీటీలు తెచ్చుకున్న వారి లిస్టును తయారుచేసి పై ఆఫీసర్ కు పంపిస్తాడు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే అదే స్కూల్లో రామజోగి కూతురు బాలామణి కూడా చీటీలు పెట్టుకుని దొరికిపోతుంది.

ఈ తంతంతా ముగిశాక రామజోగి నేరుగా ఇంటికి వెళ్ళకుండా అలా రోడ్లెమ్మటి వెళ్తుండగా అక్కడ వీధిలోని పిల్లలు చేతిలో ఉన్న ఒక కాగితం పైన మనసు పడి దానిని తీసుకొని చదవసాగుతాడు. అందులో సిరివాడలో జరుగుతున్న అన్యాయాలను ఏకరువు పెట్టి రాసిన హరికథ ఉంటుంది. అది చదివిన రామజోగికి ఊర్లో జరుగుతున్న అన్యాయాలన్నీ అర్థమవుతాయి.

రామజోగి ఇంటికి వెళ్లేసరికి ఇంట్లో ఉన్న వస్తువులంతా రెండు భాగాలుగా చేసి ఉంటుంది. ఏమిటమ్మా ఇదంతా అని కూతురిని అడగగానే రామామణి ఉన్న బాధనంత ఒక్కసారిగా వెళ్ళగక్కుతుంది. దానికి తోడు కొడుకు సుందరం, అల్లుడు మంగపతి కూడా తోడు అవుతారు. కారణం ఆరోజు హైస్కూల్ పబ్లిక్ పరీక్షల్లో జరిగిన నిర్వాకం అని రామజోగికి వారి మాటల్లో అర్థం అవుతుంది. ఆ చీటీలు కొట్టిన వారిలో తన కూతురు కూడా ఉందని తను పాస్

అయిపోతే తన మానాన తను కాపురానికి వెళుతుందని కూడా పట్టించుకోకుండా రామజోగి చేసిన పనికి ఇల్లంతా ఒక్కటై రామామణి కొడుకుతోనూ, బాలామణి అల్లుడుతోను వెళ్లిపోవాలని అనుకుంటారు. బాలామణి తన తండ్రిని తనతో కూడా వచ్చేయి అంటుంది. అయితే రామజోగి అందుకు అంగీకరించడు. ఈ విషయం తర్వాత రామజోగికి ఒకటి రెండు రోజులు బస్టాండ్లో, రైల్వేస్టేషన్లో తెల్లవారుతుంది. ఒకరోజు హైస్కూల్లో పనిచేసే పాపయ్య ద్వారా ఒక లెటర్ అందుతుంది. అందులో రామజోగికి బొగ్గులకుంటకు ట్రాన్స్ఫర్ అయినట్టు లెటర్ తో పాటు రిలీవింగ్ రిపోర్టు కూడా అందులో ఉంటుంది. దీనితో రామజోగి చివరిసారిగా తను పని చేసిన స్కూలును చూసి వద్దామని నిర్ణయించుకుని బొగ్గులకుంటకు ప్రయాణమవుతాడు.

నవలా విశ్లేషణ

రష్యన్ భాషలోకి అనువాదం అయిన ఈ నవలను మధురాంతకం రాజారాం 1971లో రాశారు. ఈ నవలలో రామజోగి చూసిన ప్రజా అవసర సరుకు అక్రమ రవాణాతో పాటు ఆనాటి స్కూళ్ళ పరిస్థితి, పాఠాలు చెప్పకుండా వారి దగ్గర ట్యూషన్ కోసం వస్తున్న విద్యార్థులను పరీక్షలు సరిగా రాయకపోయినప్పటికీ ఉత్తీర్ణులను చేస్తున్న ఉపాధ్యాయుల దుస్థితిని, సంఘంలో పేరు ప్రతిష్ఠలు ఉన్న ఇన్స్పెక్టర్ కోదండపాణి, పంచాయితీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బాబురావు, సిరివాడ పంచాయతీ అధ్యక్షుడు నాగరాజు, తదితర ప్రభుత్వ సంస్థల ఆఫీసర్లు ఆ ఊరిలోని క్రియేషన్ క్లబ్ లో వెలగబెడుతున్న నిర్వాకాలు, పాదపూజకొక రేటు, మంత్రోపదేశానికి ఒక రేటు అంటూ ఆ ఊరిలో ఉన్న ధ్యాన మందిరాన్ని నడిపే మన్నారు దాసు నిర్వాకాలు, విలాసాలకు ఆడంబరాలకు అలవాటు పడి భర్తకు విడాకులు ఇచ్చి అక్క ఇంట్లోనే ఉంటూ నాగరాజుకు అదనపు అలంకరణగా మారిన లీల అనే స్త్రీ యొక్క బుద్ధిని, ముందుగా చెప్పి మరీ దొంగతనాలు చేసి ఆడవాళ్ళను వెంబడించి నడివీధిలో వస్త్రాపహరణం చేసే రౌడీ వీరమల్లు వీరోచిత దుశ్చర్యలు ఒక్కటేమిటి దేశంలో జరుగుతున్న ప్రతి అన్యాయానికి ప్రతీకగా సిరివాడ అనే పట్టణాన్ని తీసుకొని రచయిత ఈ నవల ద్వారా పాఠకుల ముందు ఉంచుతాడు. సింగమనేని నారాయణ ఈ నవల గురించి చెప్తూ మధురాంతకం రాజారాం గారు "ఈ దేశం సువ్యవస్థితంగా ఉండాలని కోరుకుంటారు. దేశం, నగరం, పట్టణం, గ్రామం, పల్లె యిలా అన్నీ సక్రమపద్ధతిలో నడవాలని ఆశిస్తారు. ఇవి సరైన పద్ధతిలో నడవకపోతే ఏమవుతుంది? అన్ని వ్యవస్థలు కలుషితమై పోతాయి. అందుకు ప్రతీకగా సిరివాడ అనే ఒక చిన్న ప్రపంచాన్ని పాఠకుడి ముందు నిలుపుతాడు" (మధురాంతకం రాజారాం, 2013: 88) అని అంటారు.

రచయిత ఈ నవలలోని ప్రతి పాత్రను, ప్రతి సన్నివేశాన్ని, ప్రతి సంఘటనను చిత్రించే క్రమంలో "హాస్యాన్ని, వ్యంగ్యాన్ని జోడించి చెప్పడం ఒక ప్రత్యేకత. అందుకే సింగమనేని నారాయణ గారు హాస్యము, వ్యంగ్యము, అధిక్షేపము, విమర్శా మేళవించిన సెటైర్ లాంటి నవల ఇది!" (మధురాంతకం రాజారాం, 2013: 90) అని అంటారు.

4.2.2.1.3.2. గాడిద బ్రతుకులు

యజమాని పెట్టే బాధలు తట్టుకోలేక గాలిగాడు, చలువ గుర్రం అనే రెండు గాడిదలు కాలువలోకి దూకి ఆత్మహత్య చేసుకుంటాయి. యమలోకంలోని యముడు వీరిని మందలించి *"జన్మ పరిపాకము జెందకనే ఆత్మహత్యకు పూనుకొనుట యన్నచోవిధిని వ్యతిరేకిం! ఇది క్షమింపరాని నేరము. పొండు పొండు! భూలోకమునకు మరలి పొండు! ఇంకను ఎన్నియో ఏండ్ల గాడిదచాకిరీ మీ నొసట వ్రాయంబడియున్నది"* (గాడిద బ్రతుకులు, 1972: 5, 6) అని అంటాడు. అయితే ఆ గాడిదలు మాకు ఈ జన్మ వద్దని 84 లక్షల జీవ జాతుల్లో ఉత్తమమైన మానవ జన్మని ప్రసాదించమంటాయి. రూపంలో తేడానే గాని జీవన విధానంలో తేడా ఉండదు అదే గాడిద చాకిరి పొండి అంటూ యముడు 'తథాస్తు' అంటాడు. ఈ రెండు గాడిదలు రాజశేఖరం, చంద్రశేఖరంగా భూలోకంలో జన్మిస్తాయి.

రాజశేఖరం పంచాయతీ సమితి ఆఫీస్ మేనేజర్ గా ఉద్యోగం చేస్తుంటాడు. అతని భార్య గజలక్ష్మి. గజలక్ష్మి మొగుణ్ణి లెక్క పెట్టక, వచ్చిన జీతాన్ని వారానికే ఖర్చుపెట్టే దుబారా మనిషి. అంతేకాదు అంట్లు తోమడం దగ్గర నుంచి, వంట చేయడం దగ్గర నుంచి ఇంటి పని మొత్తం మొగుడు లేదంటే వీరికి పుట్టిన కొడుకు చేసి పెడితే, కాలు మీద కాలు వేసుకుని దర్జాగా పెత్తనం చలాయించే స్వభావం కలది. వీరికి పుట్టిన కొడుకే చంద్రశేఖరం. చంద్రశేఖరం స్కూల్ ఫైనల్ వరకు చదివి ఆపై చదువులకు వెళ్దాం అనుకుంటాడు. అయితే డబ్బు ఖర్చుతో పాటు పెందలాడే లేచి క్యారియర్లు వండి పెట్టడం తన వల్ల కాదని తల్లి అనడంతో చేసేది లేక అదే ఊర్లో సెకండ్ గ్రేడ్ టీచరుగా ఉద్యోగం చేస్తుంటాడు. ఇంట్లో వంట పని, ఉద్యోగం రెండూ చంద్రశేఖరం పైన పడతాయి. చంద్రశేఖరం చెల్లెలి పేరు వనమోహిని (బేబీ). ఒకరకంగా తల్లి కూతుర్లు ఇద్దరూ గయ్యాళి గంపలు అని చెప్పవచ్చు. ఇంటి పని, వంట పని చేసి పెడుతుందని కొడుక్కి పెళ్లి చేసి కోడల్ని తెచ్చుకోవాలనుకుంటుంది గజలక్ష్మి.

రాజశేఖరం, చంద్రశేఖరం సెలవు పెట్టి కుటుంబంతో సహా పెళ్లి చూపులకు బయలుదేరుతారు. బస్టాండ్లో టిక్కెట్ కోసం నానా కష్టాలు పడి ఎట్టకేలకు మాలపేటలోని ఏడు మేడల ఏకాంబరం గారి ఇంటికి చేరుతారు. అమ్మాయి నచ్చడంతో అబ్బాయికి ఒక సైకిలు, రిస్ట్ వాచ్, రెండువేలు కట్నం, అమ్మాయికి ఏవో నగలతో ఏకాంబరం రెండవ కూతురు మృణాళినితో చంద్రశేఖరానికి పెళ్లి జరుగుతుంది.

స్థానిక ఉన్నత పాఠశాలలో 11వ తరగతి చదువుతున్న వనమోహినికి స్కూల్లో వీడ్కోలు సమావేశం జరుగుతుంది. ఈ సమావేశానికి వెళ్ళిన తండ్రీ కొడుకులు వారి కాలంలో ఉన్నటువంటి పరిస్థితులను ఇప్పుడున్నటువంటి విద్యా వ్యవస్థలోని పరిస్థితులను చెప్పుకుంటూ విద్యా వ్యవస్థ బ్రష్టు పట్టిపోతున్న విధానాన్ని చర్చించుకుంటారు.

ఒకరోజు రాజశేఖరం ఆఫీసులో టైపిస్టుగా పనిచేస్తున్న దండపాణి, అతని భార్యతో గొడవపడి ఆ పరధ్యానంలో టైప్ చేస్తూ స్పెల్లింగ్లు తప్పుగా టైపు చేశాడని అతని పిలిపించి

పరామర్శిస్తాడు. దండపాణి తన పరిస్థితులను చెప్పడంతో పాటు *"రాతుండి తగులుకుంటినమ్మా ఈ రోత మొగుణ్ణి"* (గాడిద బ్రతుకులు, 1972: 41) అని తన భార్య తిట్టిందని బాధపడతాడు. దీనితో రాజశేఖరం దండపాణికి లేనిపోని ఉపదేశాలు ఇస్తాడు. వీలు చూసుకుని మీ ఆవిడ దవడ పగలగొట్టమని దండపాణికి సలహా ఇస్తాడు. పైగా నేను కూడా అలానే చేశాను అంటాడు. తీరా భోజనాల సమయంలో దండపాణి భోజనం చాలా బాగుంది సార్ అనడంతో రాజశేఖరం *"రుచిగా వుండితీరాలోయ్! ఇది ఆడంగులచేతి వంటనుకున్నావేమిటీ?....నా చేతి వంట! అనడంతో దండపాణి వెకిలిగా నవ్వుకుంటాడు"* (గాడిద బ్రతుకులు, 1972: 42).

మృణాళిని అత్తగారింట్లో అన్నీ తానే అయి అన్ని పనులు తనే చూసుకుంటూ ఉండేది. వనమోహిని చదువుతున్న స్కూల్లో జరుగుతున్న వార్షికోత్సవానికి రాజశేఖరం అతని కుటుంబం కలిసి వెళ్తారు. అక్కడ వనమోహిని తన అందాలను ఆరబోసినట్లు డాన్స్ లేస్తుంటే ఆడిటోరియం కిక్కిరిసిపోతుంది. వార్షికోత్సవంలో బహుమతి ప్రధానం చేయడానికి వచ్చిన ఎమ్మెల్యే ఎల్లయ్య వనమోహిని డాన్స్ చూసి ఆమెను పిలిపించి మెచ్చుకొని ఎప్పుడైనా ఏదైనా అవసరం ఉంటే తప్పకుండా కలువు అని చెప్తాడు. వార్షికోత్సవం ముగిసిన తర్వాత అక్కడ జరిగిన నాటకాలు, డాన్సులు, డ్రామాలు, వనమోహిని డాన్స్ ల గురించి తల్లి కూతుర్లు తలచుకొని మురిసిపోతారు. కానీ రాజశేఖరం, చంద్రశేఖరం ఆనాటి పరిస్థితికి సిగ్గుపడుతూ నాటి సంస్కృతి సంప్రదాయాలకు నేటి విద్యా విధానాలకు గల తేడాలను చెప్పుకుంటారు. పిల్లలు చెడిపోవడానికి సమాజం ఏ విధంగా దోహదపడుతుందో మాట్లాడుకుంటూ అప్పటికి వెలువడుతున్న బూతు పత్రికలు, శృతి మించిన శృంగార సినిమాలు, ఉపాధ్యాయులు పిల్లలకు నేర్పవలసిన పాఠాలు ఇలా సమాజాన్ని ఎద్దేవా చేస్తూ మాట్లాడుకుంటారు.

పరీక్షలు దగ్గర పడుతున్నా వనమోహిని భయం భక్తి లేకుండా సినిమాలు షికార్లు అంటూ ఎప్పుడూ తిరుగుతూనే ఉండేది. దీనికి గజలక్ష్మి వత్తాసు పలుకుతుంది. ఎలాగోలా పరీక్షలు రాసి ఊర్లోనే కొత్తగా పడిన కాలేజీలో పి.యు.సి.లో చేరుతుంది. ఒకరోజు వనమోహిని తన స్నేహితురాళ్ళతో కలిసి ఊరికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న శివాలయానికి వెళ్తుంది. మధ్యాహ్నం వరకు తిరిగి అక్కడున్న కొలనులో ఈత కొడతారు. తర్వాత స్నేహితురాళ్ళు వెళ్దామని అనగా వనమోహిని కాసేపాగి వస్తాను మీరు వెళ్ళండి అంటుంది. ఆ తర్వాత అలానే కొలనులో ఈదులాడుకుంటుండగా అక్కడ వీరవెంకటపతి అనే అతను వస్తాడు. ఇద్దరు కొలనులో మైమరిచి చివరకు ఒకరినొకరికి సమర్పించుకుంటారు. తను ఎంతకీ రాకపోవడంతో స్నేహితురాళ్ళు వెతుకుతారు. చివరకు వారిద్దరూ నగ్నంగా గుహలో కనిపిస్తారు. జరిగిన దాన్ని తలుచుకుని ఆ మరుసటి రోజు వనమోహిని కాలేజీకి వెళ్లదు. క్రమంగా వనమోహిని వెంకటపతికి దగ్గరవుతుంది. వెంకటపతి తను లక్షాధికారినని, ప్రతి ఏడూ వారికి లక్షల రూపాయల్లో ఆదాయం వస్తుందని ఏవేవో మాయమాటలు చెప్పి వనమోహినిని వశపరచుకుంటాడు. ఆమె చదువు కాలేజీలను వదిలేసి ప్రతిరోజు వెంకటపతిని గదిలో ఒంటరిగా కలుస్తూ ఉండేది. వెంకటపతి వనమోహిని

కుటుంబానికి కూడా దగ్గరవుతాడు. ప్రతిరోజూ వారి ఇంటికి వస్తూ పోతూ మధ్య మధ్యలో వారిద్దరూ షికార్లకు సినిమాలకు కూడా పోతుంటారు. దీనికి గజలక్ష్మి సానుకూలంగానే ఉండేది. అయితే ఇదంతా రాజశేఖరం, చంద్రశేఖరంకు అంతగా నచ్చేది కాదు. కానీ ఏమీ చేయలేరు.

వెంకటపతి రెండు రోజుల్లో తిరిగి వస్తానని హైదరాబాదుకు వెళ్లి ఇంకా రాకపోవడంతో వనమోహినికి ఏమీ తోచలేదు. దీంతో వెంకటపతి పైన తనకున్న ప్రేమను ఒక రోజు అమ్మకు గాని, వదినకు గాని చెప్పాలని అనుకుంటుంది. అందుకు ధైర్యం సరిపోక తనకు ఇంట్లో బోరు కొడుతుందని వదినని తీసుకుని శివాలయం వరకు వెళ్ళొస్తావని తల్లితో చెప్పి వదినను తీసుకొని గుడికి వెళుతుంది. ఆనాటి పత్రికల ప్రభావం విపరీతంగా ఉన్న వనమోహిని, మతి తప్పిన దానిలా కామ మృగంలా, ఒక మగాడిలాగా మైమరిచి తన వదిన పైన రకరకాల ప్రవర్తనతో విరుచుకుపడుతుంది. మృణాళిని చంప చెల్లుమనిపించడంతో వనమోహిని తేరుకొని వెంకటపతికి, తనకు గల సంబంధాన్ని తెలియజేస్తూ తననే పెళ్లాడుతానని ఈ విషయం అమ్మతో నువ్వే చెప్పాలని వదినను అడుగుతుంది. ఇంట్లో విషయం తెలియడంతో గజలక్ష్మి సమ్మతిస్తుంది. కానీ రాజశేఖరం, చంద్రశేఖరం కొంత అనుమానిస్తారు. అతని కులగోత్రాలు తెలియవు పైగా లక్షాధికారి కొడుకని అంటున్నారు. అతను లక్షాధికారో భిక్షాధికారో ఎవరికి తెలుసు అని అనుమానాలను వ్యక్తం చేస్తారు.

వారం రోజులైనా వెంకటపతి రాకపోవడంతో చేసిన తప్పును తలుచుకుని వెంకటపతిని నిందిస్తూ మానసికంగా కుంగిపోతుంది వనమోహిని. ఒకరోజు వనమోహిని ఒంటరిగా శివాలయం వైపుకు వెళుతుంది. అలసిపోయిన ఆమె అలానే నిద్రపోవడంతో లేచే సమయానికి చీకటి పడిపోతుంది. కంగారుగా లేచి ఇంటి ముఖం పడుతుంది. బస్సులు కూడా ఆపకపోవడంతో అక్కడున్న కొందరు యువకులు ఆమెను ఏడిపిస్తాడు. ఈలోగా ఎమ్మెల్యే ఎల్లయ్య కారు వచ్చి ఆ పక్కన ఆగుతుంది. ఎల్లయ్య ఆమెను కారులో ఎక్కించుకుని ఆమెపై చేతులు వేస్తూ దగ్గరకు లాక్కుంటూ ఇంత రాత్రి వేళ ఇక్కడ ఉండడానికి గల కారణాలను అడుగుతాడు. తర్వాత బంగళా వరకు వదిలి నీకు ఏ అవసరం వచ్చినా ఇక్కడే ఉంటాను వస్తావు కదూ అంటూ చెప్పి వెళ్ళిపోతాడు. వనమోహిని సందులు గొందులు తిరుగుతూ వెంకటపతి ఉన్న గదికి చేరుకుంటుంది. ఇంటికి వేసిన తాళాన్ని చూసి బాధపడుతూ తిరిగి ఇంటికి చేరుతుంది.

ఒకరోజు రాజశేఖరం, చంద్రశేఖరం అలా షికారుకు వెళ్తూ వెంకటపతిని ఇంటికి రానివ్వకూడదని, వనమోహినిని ఇల్లు దాటనివ్వకుండా చేయాలని అందుకు గజలక్ష్మిని మొదటగా అదుపులో పెట్టాలని మాట్లాడుకుంటారు. దీనికి ఉపాయంగా చంద్రశేఖరం తండ్రిని నాడీ ప్రవీణ బసవేశ్వర సిద్ధాంతి దగ్గరకు తీసుకువెళ్తాడు. అక్కడ ఆయన ఇచ్చిన మందు, తాయత్తు వల్ల ఎక్కడలేని ఉత్సాహంతో గజలక్ష్మిని కొట్టాలని ఉందని ఇద్దరూ ఇల్లు చేరుతారు.

రోజురోజుకు వనమోహినికి భయం పెరుగుతుండడంతో ఎమ్మెల్యే సాయం కోసం వెళ్లాలనుకుంటుంది. మధ్యలో తనకు తెలియకుండానే వెంకటపతి ఉన్న గదికి వెళ్తుంది. అక్కడ

అతను ఉండడం చూసి తన మనసులోని బాధనంత వెల్లగక్కుతుంది. అయితే వెంకటపతి తన నిజస్వరూపాన్ని తెలియజేస్తాడు. తను లక్షాధికారి కాదని ఒక బికారినని నన్ను పెళ్లి చేసుకుంటే నువ్వు ఏమి సుఖపడతావు అని చెప్తాడు. దీంతో వనమోహిని తనకు నెల తప్పిందని, తనను పెళ్లి చేసుకొమ్మని ప్రాధేయపడుతుంది. చివరికి వెంకటపతి ఒప్పుకుంటాడు.

తాయత్తు మహిమతో రాజశేఖరం ఒకరోజు తల్లి కూతుర్లను వాయించి వేస్తాడు. వెంకటపతి మాట ఎత్తకూడదని కూతురికి వార్నింగ్ ఇస్తాడు. కూతురు తిరగబడుతుంది. వనమోహిని గర్భవతి అని తెలియడంతో ఒక్కసారిగా కూలిపోతాడు. చివరికి రాజశేఖరం ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా మరునాడు వెంకటపతికి, వనమోహినికి శోభన ఏర్పాట్లు కూడా జరిగిపోతాయి. వెంకటపతి ఇల్లరిక మర్యాదలన్నీ దర్జాగా మహారాజులా అనుభవిస్తుంటాడు. గజలక్ష్మి మొగుడు సంపాదించిన డబ్బంతా అల్లుడి విలాసాలకు ఖర్చు చేస్తూ ఉంటుంది. రాజశేఖరం అగ్గిమీద గుగ్గిలంగా మారి గజలక్ష్మిని చితకబాదుతాడు. అయితే గజలక్ష్మికి రాజశేఖరం ప్రవర్తన అంతు పట్టేది కాదు. చివరికి మృణాళిని ద్వారా ఆ తాయత్తు మందుల గురించి తెలిసి వాటిని సొంతం చేసుకుంటుంది. విషయం తెలిసిన రాజశేఖరం నీరుగారిపోతాడు.

వెంకటపతి స్కూటర్ కావాలనడంతో గజలక్ష్మి కన్ను రాజశేఖరం ప్రావిడెంట్ ఫండ్ పైన పడుతుంది. దీనితో చంద్రశేఖరం అతనికొచ్చిన జీతం ఆరియర్లతో పాటూ, తండ్రి జీతం చిట్ ఫండ్లో కట్టిన చిట్టి డబ్బులు మొత్తం తీసుకుని తండ్రీ కొడుకులు ఒక నాటకం ఆడుతారు. చంద్రశేఖరం జీతం ఎవరో దొంగలు కొట్టేసారని నమ్మిస్తాడు. పైగా ఆ దొంగలు వీరి ఇంట్లో స్వర్ణాభరణాలను కూడా కొట్టేస్తాం అంటూ ఒక లెటర్ వీపున అంటించుకుని నమ్మిస్తాడు, ఈ విషయం పోలీసులకు చెప్తే మీ ప్రాణాలకు ముప్పు అని అందులో ఉంటుంది, వెంకటపతి కచ్చితంగా పోలీసులకు రిపోర్టు ఇవ్వాలనడంతో తండ్రీకొడుకులు రిపోర్టు ఇచ్చినట్టుగా వెళ్లి వస్తారు, ఈ విషయం దొంగలకు తెలిసినట్టుగా ఈసారి రాజశేఖరం వీపు పైన ఒక లెటర్ డ్రామాను ఆడుతారు. దొంగల భయం వల్ల ఉన్న నగలన్నీ చిన్న మొత్తానికి బ్యాంకులో తాకట్టు పెట్టాలన్న రాజశేఖరం మాటలకి అందరూ ఒప్పుకుంటారు.

రాజశేఖరం రిటైర్మెంట్ రోజున ఆఫీస్ దగ్గరికి వచ్చిన గంగన్న చేతికి ఒక కవరు క్యారియర్ ఇచ్చి ఇంట్లో ఇమ్మంటాడు. ఆ కవర్లోని లెటర్ లో *"మేమిద్దరం గంగలో దూకబోతున్నాం. మాకోసం వెతికి లాభం లేదు. ఇట్లు... రాజశేఖరము చంద్రశేఖరము"* (గాడిద బ్రతుకులు, 1972: 239) అని ఉండడంతో గజలక్ష్మి వాటిని కొంటె చేష్టలనుకుంటుంది.

రోజులు గడుస్తున్నా తండ్రీ కొడుకులు ఇంటికి రాకపోవడంతో మొదట్లో ధైర్యంగా ఉన్న గజలక్ష్మి మెల్లగా భయపడుతుంది. ఇల్లు గడవడం కష్టం అవుతుంది. వియ్యంకుడు కూడా చేతులెత్తేస్తాడు. ఇంట్లో ఉన్న ఒక్కొక్క సామాను అమ్మకానికి, తాకట్టుకు వెళ్తుంటాయి. వెంకటపతిని ఇంకా లక్షాధికారే అనుకుంటున్న గజలక్ష్మి వెంకటపతితో ఒకసారి మీ నాన్నగారిని కలవకూడదా అని చెబుతుంది.

ఎన్ని కష్టాలు ఉన్నా వనమోహినికి, వెంకటపతికి ఇంట్లో జరగాల్సిన మర్యాదలన్నీ జరుగుతూనే ఉన్నాయి. మృణాళిని గురించి చెప్పక్కర్లేదు పనిమనిషి కన్నా దారుణం.

ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్న వెంకటపతికి ఇంటర్వ్యూ కార్డు రావడంతో అత్తగారి దగ్గర యాభై రూపాయలు తీసుకుని వెళ్తాడు. అలా వెళ్లిన వెంకటపతిని తలుచుకుని ఉద్యోగం వస్తుందో రాదో అని ఆలోచిస్తున్న వనమోహినికి ఎమ్మెల్యే ఎల్లయ్య గుర్తుకు రావడంతో సాయం కోసం అతన్ని కలుస్తుంది. ఎమ్మెల్యే ఎల్లయ్య అతని కామ వాంఛతో దగ్గరగా చేరి మంచి మాటలు చెబుతూ అతను చూస్తున్న సెక్స్ పుస్తకంలోని నగ్న ఫోటోలను ఆమెకు చూపిస్తాడు. ఇంతలో అతన్ని కలవడానికి ఎవరో రావడంతో నీవు రాత్రికి రా నీకు ఏమి కావాలన్నా చేసి పెడతాను అంటాడు. ఆరోజు రాత్రి మన్మధ బాణం తగిలిన వాడిలా వనమోహిని కోసం పడి కాపులు కాసి కాసి ఎమ్మెల్యే ఎల్లయ్యకు ఏదో అవుతుంది. ఇంతలో వనమోహిని వచ్చి బంగ్లాలో చూడగా ఉలుకు పలుకు లేకుండా ఎమ్మెల్యే పడి ఉండడంతో అక్కడ పనిచేస్తున్న నరసయ్యకు చెప్పి డాక్టర్ని పిలిపించి తను ఉదయం వస్తానని చెప్పి వెళ్ళిపోతుంది.

ఉదయం ఎమ్మెల్యేని చూడడానికి పోయిన వనమోహిని అతనికి రక్తపోటు అని తెలుసుకుంటుంది. భర్త ఉద్యోగం గురించి ప్రస్తావిస్తుంది. ఎల్లయ్య రేపు నా వెంట బెంగళూరుకు రమ్మను ఏదో ఒక ప్రైవేటు కంపెనీలో చూసి పెడతాను అంటాడు. ఈ విషయాన్ని వెంకటపతికి చెప్పడంతో వనమోహినిని అనుమానిస్తాడు. జరిగిన విషయాలన్నీ విడమరిచి ఆలుమగలు చెప్పుకున్నాక ఆ అనుమానాలు తొలగి ఎమ్మెల్యే పై కోపముతో అతన్ని ఊరించి అతని ద్వారానే ఉద్యోగం సంపాదించాలి కానీ అతనికి లాభం చేరనివ్వకూడదని ఒక నిర్ణయానికి వస్తారు.

ఎల్లయ్య వెంట వెళ్లిన వెంకటపతి 10 రోజులు అయినా రాకపోవడంతో వనమోహిని కంగారుతో ఎమ్మెల్యే ఎల్లయ్య బంగళాకు వెళ్లి వాకబు చేస్తుంది. నరసయ్య ఎమ్మెల్యే రావడానికి ఇంకా వారం పట్టొచ్చు అనడంతో తిరుగుముఖం పడుతుంది. అదే రోజు అర్ధరాత్రి వెంకటపతి ఇంటికి వచ్చి తనకు బెంగళూరులో ఉద్యోగం దొరికిందని తక్షణం మనం బయలుదేరాలని భార్యతో చెప్పి, అత్తకు ఉద్యోగ విషయం చెప్పకుండా ఉదయాన్నే వెళ్ళిపోతారు. వెళుతూ వెళుతూ ఉత్తరం రాయడానికని అడ్రస్ ఉన్న ఒక కాగితాన్ని ఇస్తాడు. ఆ కాగితం ముక్క ఇంగ్లీషులో ఉండడంతో ఒక కుర్రవాణ్ణి పిలిపించి చదవమంటుంది. అందులో ఒక ముక్కలో నాకు తల్లిదండ్రులు లేరని మీ నివాసమే నా నివాసం అని ఉంటుంది. దీంతో గజలక్ష్మికి ఒక్కసారిగా మతి తప్పినట్లు అయిపోతుంది.

గజలక్ష్మి, మృణాళినీలు రోజురోజుకు కుమిలిపోతుంటారు. ఇంటి పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. మృణాళిని తన మామ పంపిన ఉత్తరాన్ని చూసి గంగలో దూకడం అంటే ఏమిటి అని అత్తను అడుగుతుంది. ఇలా వారినే తలుచుకుని బాధపడుతుంటారు. మరుసటి రోజు పాత పేపర్లు అమ్ముతుండగా రెండు నెలల కిందటి పత్రిక కత్తిరించి ఉండటం గమనించి దానిని

తెప్పించుకుని చూస్తుంది మృణాళిని. దీనితో మృణాళినికి మామగారు తన మొగుడు ఎక్కడికో వెళ్ళలేదని వీరాంజనేయ యాత్రకు వెళ్లారని తెలుస్తుంది.

మృణాళిని పేపర్లో భర్త కనిపిస్తాడని పక్కింటికి వెళ్లి రోజూ పేపరు చదువుతుంటుంది. అందులో గంగానదిలో పడవ ప్రమాదం, హరిద్వార్లో మంచు పర్వత ప్రమాదం, రైలు ప్రమాదం ఇలా నాలుగు రోజులు నాలుగు విషయాలు వల్ల వారు బాగా కలత చెందుతారు. రాను రాను ఇల్లు గడవక వారి పరిస్థితి మరీ దారుణంగా తయారవుతుంది. ఉన్న వస్తువులన్నీ తాకట్టుకు వెళ్ళిపోతాయి. చుట్టుపక్కల వారు సాయం చేయడం మానేస్తారు. అయితే సుకుమార్ అనే కుర్రవాడు వారికి అప్పుడప్పుడు కొంత ఆర్థికంగా సాయపడుతూ ఉంటాడు. దీనికి కారణం అతనికి మృణాళిని పైన ఉన్న ఆశ. ఒకరోజు గజలక్ష్మి అతని దగ్గర పది రూపాయలు అప్పు తీసుకుని బజారుకు వెళ్లి వస్తుండగా, అతడు మృణాళిని బలాత్కారం చేస్తుంటాడు. ఇంతలో గజలక్ష్మి ఇల్లు చేరుకుని అతన్ని కొట్టి తిట్టి అతని ద్వారా తెచ్చుకున్న సరుకులు అతని ముఖాన కొట్టి పడేస్తుంది.

గజలక్ష్మి, మృణాళినిని ఓదార్చడం పోయి తిట్టడంతో మృణాళిని ఒక్కసారిగా ఆవేశంతో అత్తపైన తిరగబడి *"అలా వులికిపడతావెందుకత్తయ్యా? ఉన్న మాటే అంటున్నాను మొగుణ్ణి, కొడుకునీ కీలుబొమ్మలుజేసి ఆడించింది నువ్వు. కూతుర్ని కోసంగిలా పెంచి, దాని పరువు తీసింది నువ్వు! దారినపోయే దానయ్యనేవన్నో ఇంటికి తీసుకొచ్చి ఇల్లంతా వాడికి దోచిపెట్టింది నువ్వు. తలెత్తుకు తిరగలేక మగాళ్లిద్దరూ సంసారం వదిలి పారిపోవడానికి కారణం నువ్వు!.....పచ్చగా ఉండవలసిన కాపురం నీవల్లే సర్వనాశనమైపోయింది. నువ్వు సిగ్గుపడవేమత్తయ్యా?"* (గాడిద బ్రతుకులు, 1972: 297) అంటుంది. తనను ఎదిరించిందని గజలక్ష్మి కోడలిపై చేయి చేసుకుంటుంది. చివరగా ఒకరినొకరు ఓదార్చుకుంటారు. ఇంతలో ఎవరో తలుపుతట్టగా అప్పుల వారని భయపడతారు. తీరా చూస్తే రాజశేఖరం, చంద్రశేఖరం. వీరు వచ్చారని తెలిసి ఆనందంతో గంతు వేస్తారు. గజలక్ష్మి తన తప్పులను తెలుసుకొని రాత్రంతా భర్తతో మాట్లాడుతూనే ఉంటుంది. ఇలా రెండు జంటలు పశ్చాత్తాపంతో వారి కష్టాలను పంచుకుంటారు.

మరుసటి రోజు వనమోహిని నుండి ఉత్తరం రావడంతో అందరూ సంతోషిస్తారు. తిరిగి వారికి ఉత్తరం రాయాలని గజలక్ష్మి రాజశేఖరంని అడుగుతుంది. రాజశేఖరం ఉత్తరాన్ని పూర్తి చేసి తన కొడుకు చంద్రశేఖరం ద్వారా పోస్ట్ చేయమని పంపుతాడు. అయితే పొరపాటున చంద్రశేఖరం తను రాస్తున్న గాడిద కథలు అనే కథకు రాసిన భరత వాక్యంను పోస్టులో ఉంచి పంపేస్తాడు. అది తెలిసి అందరూ విస్తుపోతారు. అందులో *"గాలిగాడు, చలువగుర్రం/గంగలో మునిగాయిరా!/మునిగి లేచిన వేల మంచిది,/మనుషులై నిలిచాయిరా!"* (గాడిద బ్రతుకులు1972: 312) అని ఉంటుంది.

నవలా విశ్లేషణ

గాలిగాడు, చలువగుర్రం అనే రెండు గాడిదలు యజమాని చేతుల్లో పడుతున్న కష్టాలను తట్టుకోలేక, మనుషుల క్రూరత్వాన్ని భరించలేక ఆత్మహత్య చేసుకుని యముని ఆజ్ఞ మేరకు రూపంలో తప్ప జీవన విధానంలో మార్పు ఉండదని చివరకు గంగలో మునిగిన తర్వాత గాని నిజమైన మానవ జీవన విధానం మీకు లభించదన్న షరతు ప్రకారం మానవ జన్మ నెత్తి గయ్యాళిగంపల చేతుల్లో పడి నలిగి సతమతమై చివరకు మానవులుగా మారిన తండ్రీ కొడుకుల కథే ఈ నవలలోని ప్రధాన కథ.

కలువకొలను సదానంద ఈ నవలలో చక్కని హాస్యాన్ని, అవహేళనను మేళవించి రాశారు. జంతువుల పట్ల మనుషులకు ఉన్న క్రూరత్వాన్ని, మునిసిపాలిటీ పరిపాలన విధానాన్ని, పాఠశాలల పరిస్థితిని, అందులోని విద్యార్థుల అవకతవక చేష్టలను, బూతు పత్రికలు వారిపై చూపుతున్న ప్రభావాన్ని, వాటి వ్యామోహంలో పడి విద్యార్థులు చెడిపోతున్న వైనాన్ని, శృతిమించిన శృంగారం కలిగిన సినిమాలను, రాజకీయ నాయకులకు స్త్రీల పట్ల గల నీచమైన అభిప్రాయాలను వ్యంగంగా ఎద్దేవా చేస్తూ ఈ వ్యవస్థలో గల కొన్ని లోపాలను ఎత్తి చూపించారు.

అదేవిధంగా ఈ నవలలో రచయిత అవహేళనపరమైన వ్యంగ్య ధోరణి మాత్రమే కాకుండా పాత్రల పరిచయాల దగ్గర నుండి వారి అలవాట్ల దగ్గర నుండి వివిధ సన్నివేశాలలో వారి సంభాషణల్లో హాస్యాన్ని జోడించి నవ్వు పుట్టించే విధంగా చక్కని హాస్య నవలగా దీనిని మనకు అందించారు.

4.2.2.1.4. ఇతరాలు

చిత్తూరు జిల్లా నవలా సాహిత్యంలో కొన్ని నవలలను ఇతరాల కింద పెట్టి విశ్లేషించాను. వాటిని కింద చూద్దాం.

4.2.2.1.4.1. ఇంద్రధనుస్సు

చుట్టుపక్కల గ్రామాల్లో పేరుపొందిన బ్రాహ్మణ కుటుంబం సుబ్బావధానులది. యజ్ఞాలు, యాగాలు చేయకపోయినా వేదాలు, శాస్త్రాలు క్షుణ్ణంగా అధ్యయనం చేసిన వారు వీరు. వీరి కొడుకు రామనాధయ్య. వీరి కాలంలో వారింట్లో శాస్త్రాధ్యయనం మూల పడిపోతుంది. కారణం శాస్త్ర అధ్యయనం కన్నా గ్రామ రాజకీయాల పట్ల, కక్షల పట్ల రామనాధయ్యకు ఎక్కువ మక్కువ ఉండడం. వృత్తి చేత బ్రాహ్మణులైనప్పటికీ వీరికి వ్యవసాయమే ప్రధాన వృత్తి అయ్యింది. రామనాథయ్య కొడుకు విశ్వనాథం. బాగా చదువుకుని లాయరై కుటుంబాన్ని ఉద్ధరిస్తాడు అనుకున్న విశ్వనాథం కాలేజీ వాతావరణం, విద్యార్థుల ఆలోచన పద్ధతి, నాటి బ్రిటీష్ ప్రభుత్వ విధానం అతనిలో మార్పును తీసుకువస్తాయి. దేశ స్వాతంత్ర్య పోరాటంలో పడి చదువును, ఇంటిని పట్టించుకోడు. పెళ్లి చేస్తే ఇంటిపట్టున ఉంటాడని తండ్రి రామనాథయ్య తన కొడుకు విశ్వనాథానికి సుందరమ్మతో పెళ్లి చేస్తాడు. అయినా లాభం లేకపోయింది. పది పదిహేనేళ్ళల్లో విశ్వనాథయ్య పాల్గొనని సభలు, చేయని హార్తాల్లు, కలవని నాయకులు లేరు. ఇలా చిత్తూరు జిల్లా

రాజకీయాలలో ప్రముఖుడుగా తయారవుతాడు. విశ్వనాథం జైల్లో ఉండగానే తండ్రి రామనాధయ్య మరణిస్తాడు. నాలుగు నెలల తర్వాత ఇంటికి వచ్చిన విశ్వనాథం కుటుంబ పరిస్థితిని చూసి తల్లడిల్లిపోతాడు. స్వాతంత్యం వచ్చాక విశ్వనాథం స్నేహితులకు పనికిరాని వాడౌతాడు. వారి పదవులు, స్వార్థం తప్ప విశ్వనాథం వాళ్లకు కనపడడు. ఈ విషయాన్ని అర్థం చేసుకున్న విశ్వనాథం రాజకీయాలకు, ఊరి పెత్తనాలకు స్వస్తి చెప్పి ఉన్న పొలాన్ని బాగు చేసుకొని వ్యవసాయంలోకి దిగుతాడు.

విశ్వనాథయ్య చెల్లెలు రత్నమ్మ భర్త చనిపోవడంతో పన్నెండేళ్ళ కూతురుతో విశ్వనాథయ్య ఇల్లు చేరుతుంది. కొడుకు చదువులే సమస్యగా మారిన విశ్వనాథంకు చెల్లెలి కూతురి(శారద) పెళ్లి మరో సమస్యగా మారుతుంది. విశ్వనాథంకు ఉన్నవి రెండు కోరికలు. అవి *"తన కొడుకు ఉమాపతి బియ్యే పాసయి ఏదో ఒక ఉద్యోగంలో చేరాలి. శారదను ప్రకాశానికిచ్చి పెళ్లి చేయాలి"* (ఇంద్రధనుస్సు, 2009:14). ప్రకాశం కాస్తోకూస్తో చదువుకున్నవాడు. నిదానస్తుడు. అన్నింటినీ మించి నలుగురి బాగే తనబాగనుకున్నవాడు. అందుకనే ప్రకాశానికి శారదనిచ్చి పెళ్లి చేయాలనుకుంటాడు విశ్వనాథయ్య. ఉమాపతి స్త్రీ పురుషులకు సెక్స్ స్వాతంత్ర్యం ఉండాలని వాదిస్తూ మద్రాసులో విమల అనే మెడికల్ స్టూడెంట్ తో సహజీవనం సాగిస్తూ చదువు పేరిట ఇంటి నుండి వచ్చే డబ్బులు విలాసాలకు ఖర్చు పెడుతుంటాడు. సెలవుల్లో ఊరికి వచ్చిన ఉమాపతి మేనత్త కూతురైన శారదను అత్యాచారం చేస్తాడు. శారద తల్లి రత్నమ్మకు శారదను ఉమాపతికిచ్చి పెళ్లి చేసి ఆ ఇంటిపై పెత్తనం చెలాయించాలనుకుంటుంది. ఈ విషయాన్ని దాచి విశ్వనాథం, ప్రకాశాన్ని శారదను పెళ్లి చేసుకోవడానికి ఒప్పిస్తాడు. ఈ విషయం తెలిసిన రత్నమ్మ ఎలాగైనా దీనిని చెడగొట్టాలని శారద గర్భవతిగా ఉందని అబద్ధం చెబుతుంది. శీలం పోగొట్టుకొని, పైగా కడుపుతో ఉన్న కారణంగా శారద ప్రకాశంతో పెళ్లికి నిరాకరిస్తుంది. చివరికి కారణం తెలుసుకున్న ప్రకాశం శారదను ఓదార్చి పెళ్ళికి ఒప్పిస్తాడు.

పరోపకారమే ప్రధాన ధ్యేయంగా ఉన్న ప్రకాశం ప్రతి పనికి అడ్డు తగులుతున్నాడని జగన్నాథం తన కూతురు ఇందిరను ప్రకాశానికిచ్చి పెళ్లి చేయాలనుకుని ప్రయత్నించి విఫలుడౌతాడు. ఇందిర తన క్లాస్మేట్, ఆ ఊరికి బడిపంతులుగా రాబోయే భానుమూర్తిని ప్రేమించి ఉంటుంది. ఎలాగైనా అతన్ని పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటుంది.

ఆర్థిక ఇబ్బందుల కారణంగా, (ఉమాపతి దగ్గర డబ్బు అయిపోవడం) పెళ్లి పట్ల సదభిప్రాయం విమలకు లేకపోవడంతో ఉమాపతి, విమల విడిపోతారు. జరిగిన దానికి పశ్చాత్తాప పడి సారధి దగ్గర తలదాచుకున్న ఉమాపతి తిరిగి ఊరికి వచ్చినా అతని పాత అలవాట్లు పోగొట్టుకోలేక ఇంట్లో డబ్బును దొంగలించి మద్రాసుకు పారిపోతాడు. మద్రాసులో చక్రవర్తి, సునందల జంటను చూసిన ఉమాపతి తన జీవితంలో పోగొట్టుకున్నదేంటో తెలుసుకొని శారదను పెళ్లి చేసుకుంటానని ఇంటికి ఉత్తరం రాస్తాడు. దీంతో కొంత గందరగోళం మొదలవుతుంది. టైఫాయిడ్తో బాధపడుతున్న ఉమాపతి, చక్రవర్తి ఆసుపత్రిలో చేరుతాడు. అక్కడ

నర్సుగా పనిచేస్తున్న విమలను చూసి జరిగిన వాటిని నెమరు వేసుకొని చివరికి వాళ్ళిద్దరూ పెళ్లి చేసుకోవాలనుకుంటారు. చివరకు తిరుపతిలో ఇందిరా భానుమూర్తుల వివాహం, ఊళ్లో ప్రకాశం శారద వివాహం జరగడంతో నవల ముగుస్తుంది.

నవలా విశ్లేషణ

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక నిర్వహించిన శుభకృతు ఉగాది నవలల పోటీలో రెండో బహుమతి పొంది, 20-6-1962 నుండి 8-8-1962 వరకు సీరియల్ గా ప్రచురితమైన ఈ నవలలో రచయిత ప్రకాశం, సారథి, ఉమాపతి, భానుమూర్తి జీవితాలను జీవిత చతుర్భుజంలోని నాలుగు కోణాలుగా తెలియజేస్తూ, ఈ నాలుగు కోణాలు సమానమైనవిగా ఉండవని ఒక్కొక్కరి జీవితం ఒక్కొక్క విధంగా ఉంటుందని తెలియజేశారు. నవలలో ఉమాపతి జీవితంలో పోరాడి చెడిపోతే, సారథి ఆదర్శాలను ఉత్తమ అభిరుచుల్ని వదిలి జీవితంతో రాజీపడతాడు. భానుమూర్తిని జీవిత ఒడిదుడుకులు తెలిసినవాడుగా, వాటిని ఎలా తప్పించుకోవాలో, ఎలా అధిగమించాలో తెలిసినవాడిగా చిత్రిస్తే ప్రకాశాన్ని జీవితాన్ని పూర్తిగా జయించిన వాడిగా చిత్రించాడు రచయిత. అలాగే వీరి నలుగురితో పాటు విమల, ఇందిరా, శారద వీరికి సరిపోయిన వాళ్ళుగా వీరందరూ కలిసి జీవితమనే ఆకాశంలో ఇంద్రధనస్సులా ఉంటారని రచయిత అభిప్రాయంగా పై పాత్రలను బట్టి తెలుస్తుంది.

ఈ నవలలో రచయిత స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న మధ్యతరగతి జీవితాలు స్వాతంత్ర్యానంతరం ఏ విధంగా ఉన్నాయో విశ్వనాథం పాత్ర ద్వారా చూపించారు. స్వాతంత్ర్య పోరాట కాలంలో డబ్బు, పలుకుబడి ఉన్నవాళ్ల త్యాగానికే గుర్తింపు ఉండేది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పదవులు, అధికారం, నాయకత్వం వారినే వెతుక్కుంటూ వచ్చేవి. స్వాతంత్రోద్యమంలో దిగిన మధ్యతరగతి వాళ్లు అన్నీ పోగొట్టుకొని దరిద్రులుగా మిగిలిపోతారు. వారి త్యాగాలను ఎవరూ పట్టించుకోరు అన్న సంగతిని ఈ నవలలో విశ్వనాథం పాత్ర ద్వారా చూడవచ్చు.

4.2.2.1.4.2. దూరతీరాలు

గ్రామోద్ధరణలో భాగంగా సత్యమూర్తి ముందుండి ప్రజాసేవకే కంకణం కట్టుకొని ఊరిలో ఒక ఆసుపత్రిని కట్టించాలనుకుంటాడు. అలాగే హరిజన హాస్టల్ నడుపుతూ దానికి కావలసిన వసతులన్నీ తనే స్వయంగా ఏర్పాటు చేస్తూ ఉంటాడు. సత్యమూర్తికి కాలేజీలో చదువుకుంటున్న రోజుల్లో రాయలసీమలో ఏర్పడిన కరువు కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఏర్పడి ఫీజులు కట్టలేని పరిస్థితి ఏర్పడుతుంది. అలాంటి సమయంలో అతనంటే ఇష్టం ఉన్న లేదా అభిమానం ఉన్న జానకి సహాయం చేస్తుంది. కరువు వల్ల కుటుంబం చితికి పోవడంతో సత్యమూర్తి చదువు మానేసి ఇంటికి వచ్చేస్తాడు. సత్యమూర్తి చెల్లెలు ట్రైనింగ్ పూర్తి చేసి పంచాయతీ స్కూల్లో టీచర్ గా చేరుతుంది. లతే కుటుంబాన్ని ఆదుకుంటుంది. సత్యమూర్తి ప్రజాసేవకై చేస్తున్న పనుల వల్ల అతని పలుకుబడి పెరుగుతూ ఉంటుంది. ఇది జయరాంకు నచ్చదు. జయరాం వాళ్ళ నాన్నగారి తర్వాత పంచాయతీ బోర్డు అధ్యక్షుడిగా ఉంటాడు. శంకరనారాయణ, సూర్యం సత్యమూర్తికి మంచి

స్నేహితులు. రచయిత అయిన శంకరనారాయణ భార్య మరణించడంతో కృంగిపోయి రచనలకు దూరంగా ఒంటరితనాన్ని అనుభవిస్తూ ఉంటాడు. సూర్యం అభ్యుదయ భావాలు కలిగిన కార్యకర్త. కమ్యూనిస్టు పార్టీతో సంబంధాలు కలవాడు.

జయరాం ఎప్పుడూ సత్యమూర్తి చేసే మంచి పనులకు కనపడకుండా అడ్డు తగులుతుంటాడు. ఆసుపత్రి నిర్మాణ విషయంలో శివాలయం పునరుద్ధరణ విషయాన్ని ప్రస్తావిస్తాడు. అలాగే సత్యమూర్తి నడిపే హరిజన హాస్టల్ కు ప్రభుత్వ గ్రాంట్ కూడా రానివ్వకుండా అడ్డుపడతాడు. లైబ్రరీ కట్టడం కోసం వసూలు చేసిన డబ్బును సత్యమూర్తి ఇంట్లో నుంచి దొంగలింప చేస్తాడు. ఇలా ఏదోరకంగా సత్యమూర్తి పనులకు అడ్డు తగులుతూనే ఉంటాడు. జానకి డాక్టర్ అయి సత్యమూర్తి ఊరిలోని ఆసుపత్రికి డాక్టర్ గా వస్తుంది. జానకి సత్యమూర్తి పాత ప్రేయసి అని తెలిసి జయరాం భరించలేకపోతాడు. జానకిని అల్లరి పెట్టడానికి ప్రయత్నిస్తాడు. అలాగే లతతో ఉన్న అక్రమ సంబంధంతో ఆమెను కొట్టి అవమానిస్తాడు. అంతేకాకుండా ఆమెను వ్యభిచారిణిగా సత్యమూర్తికి తెలిసే విధంగా అందరి ముందు తెలియజేస్తాడు. ఇక్కడ ఒక విషయం గమనించాలి అందుకు కారణం లత, శంకర నారాయణ, సూర్యంల పొందుకై ఆశపడి ఉంటుంది. దీనితో లత మానసిక సంఘర్షణకు లోనై ఆత్మహత్యకు పాల్పడుతుంది. అది ఫలించకపోవడంతో తీవ్ర అశాంతికి లోనై నిద్రలో నడిచే అలవాటు ఏర్పడుతుంది. ఒకరోజు ఈ అలవాటు కారణంగానే బావిలో పడి చనిపోతుంది దీనితో సత్యమూర్తి తీవ్ర ఆందోళనకు గురవుతాడు.

రోజురోజుకు సత్యమూర్తి చేసే పనుల వల్ల అతనికి ప్రజల్లో మంచి పేరు వస్తూ ఉంటుంది. దీనికి తోడు కమ్యూనిస్టు పార్టీ నాయకులు సత్యమూర్తిని ఎం.ఎల్.ఏ. గా నిలబడాలని అడుగుతారు. వారు ఎంత బ్రతిమలాడినా సత్యమూర్తి నిరాకరించడంతో జయరామ్ సంతోషిస్తాడు. కారణం జయరాం ఎమ్మెల్యే పదవి కోసం ప్రయత్నిస్తుండడం. అయితే జయరాం తన భార్య సీత పుట్టింట్లో చనిపోవడం, లత మరణం వల్ల కుంగిపోతాడు. ఆత్మహత్య చేసుకుంటాడు. అంతకు ముందే జయరాం ద్వారా ఉత్తరం అందుకున్న జానకి అన్నయ్య ఆమెను మద్రాసుకి తీసుకొనిపోతాడు. లత అంత్యక్రియలకు వచ్చిన సూర్యంతో కలిసి సత్యమూర్తి కొత్త జీవితాన్ని వెతుక్కుంటూ మద్రాస్ కు వెళ్ళిపోతాడు.

నవల విశ్లేషణ

వల్లంపాటి వెంకటసుబ్బయ్య 1965లో నేరుగా ప్రచురించిన ఈ నవలలో సత్యమూర్తి, జయరాం, లత, శంకర నారాయణ, సూర్యం, జానకి ఇలా అందరూ వారు కోరుకున్న జీవితం వారికి లభించకపోవడంతో కొందరు పశ్చాత్తాపంతో, మరికొందరు కొత్త జీవితాన్ని వెతుక్కుంటూ, మరి కొందరు వారి పయనం ఎక్కడికో తెలియని దూరతీరాలకే అన్నట్టుగా నవల ముగుస్తుంది. గ్రామోద్ధరణ కోసం అన్నీ పోగొట్టుకుని సత్యమూర్తి, ఆస్తికోసం, పదవి కోసం అందరిని వేధించి చివరికి పశ్చాత్తాపంతో ఆత్మహత్య చేసుకున్న జయరాం, శరీర వాంఛలను

తీర్చుకోవడం కోసం తన జీవితాన్ని నాశనం చేసుకున్న లత, భార్యవియోగంతో శంకరనారాయణ, చేసిన తప్పుకు అపరాధ భావంతో సూర్యం, ప్రేమించిన వ్యక్తికి చేరువకాలేని జానకి ఇలా నవలలోని ప్రతి పాత్రా జీవితంలో ఆశించిన దానికి చేరుకోలేక వారి వారి జీవితాలను అద్వానంగా మార్చుకున్నట్లు కనిపిస్తుంది. చేసిన తప్పుకు పశ్చాత్తాపమే పెద్ద శిక్షగా రచయిత ఈ నవలను ముగిస్తాడు.

ఇంకా ఈ నవలలో కరువు కాలంలో పట్నం నుండి సత్యమూర్తి ఇంటికి వచ్చాడని అతనికి వరి అన్నం పెట్టాలని వారికున్న ఆవును కసాయి వాళ్లకు అమ్మేయడం, గంజి కేంద్రం వద్ద జరుగుతున్న గందరగోళం లాంటి ఆనాటి రాయలసీమ కరువు పరిస్థితులను కూడా చాలా చక్కగా రచయిత వర్ణించడం చూడవచ్చు.

ఈ నవలలో లత పాత్ర అసహజంగా ఉందని చాలామంది అన్నారని రచయితే చెప్పాడు. అయితే దీనికి సమాధానంగా *"సహజత్వం అన్నది చాలా చిక్కు సమస్య. చాలా వైయ్యక్తికమైన భావం. 'లత' లాంటి పాత్ర సహజంగా ఉండవలసిన అవసరం నాకు అంతగా కనిపించటం లేదు. ఇలాంటి సమస్యలను ప్రతిపాదించటానికి ఆల్డస్ హక్లీస్ సృష్టించిన పాత్రలను పరిశీలిస్తే ఈ మాటలో సత్యం కొద్దిగానైనా కనిపించవచ్చు... అందుకు కారణం 'లత' ఒక భావానికి ఏర్పాటు చేసిన పాత్ర మాత్రమే"* (వల్లంపాటి నవలలు, 2009: 97) అని అంటారు.

అయితే లత పాత్ర గురించి చెప్తూ కె.పి. అశోక్ కుమార్ *"ఎటొచ్చి సత్యమూర్తి చెల్లెలు లతను కాముకిగా చిత్రించడం వెనుక బలమైన కారణం ఏదీ కనిపించదు. బహుశా అదంతా ఫ్రీలవ్ సొసైటీ ప్రభావం కావచ్చు. లేదా మనోవైజ్ఞానిక కోణం నుంచి నవలని నడపాలనే ఉద్దేశంతో కావాలని రచయిత ప్రయోగపూర్వకంగా సృష్టించిన పాత్ర కావచ్చు"* (తెలుగు నవల ప్రయోగ వైవిధ్యం,2019: 69) అని అంటారు. ఇది ఒకరకంగా నిజమే అనిపిస్తుంది. ఈ పాత్రను చూస్తే చలం గారి నవలల్లోని స్త్రీ స్వేచ్ఛను లత కోరుకుందేమో అనిపిస్తుంది. అందుకే ఈ పాత్రను సహజంగా లేదని కొందరు అని ఉండవచ్చు. ఒకవైపు తన అన్న ప్రజా సేవకై పడరాని పాట్లు పడుతూ ఉంటే ఆ పనులకు అండగా ఉన్న జయరాం లాంటి వారితోను, తన అన్నకు సహాయం చేస్తున్న శంకర నారాయణనుతోనూ, తన అన్నయ్య కోసం వచ్చిన సూర్యున్ని తన అందంతో కవ్వించి అతనిని బలహీనున్ని చేసి తన సంతోషాన్ని తీర్చుకుంటుంది. ఇవి చూస్తే ఈ పాత్ర ఒక రకంగా అసహజంగానే కనిపిస్తుంది.

4.2.2.1.4.3. త్రిశంకుడి స్వర్గం

శేఖరం ఒక చిన్న ఆఫీసులో గుమాస్తాగా పనిచేస్తూ ఉంటాడు. కొత్తగా ఆఫీసులో చేరిన రంగశాయి అనే యువకుడికి రూము దొరకకపోవడంతో తన గదిలో చోటిస్తాడు శేఖరం. గదిలో చేరిన కొన్ని రోజులకే రంగశాయికి తీవ్ర జ్వరం రావడంతో ప్రథమ ప్రయత్నాలు చేసిన నాలుగు రోజుల తర్వాత జ్వరం తీవ్రతను గుర్తించిన శేఖరం, అదే పట్టణంలోని ఒక పేరుగాంచిన డాక్టర్ విజయరత్నం గారిని తన గదికి తీసుకొస్తాడు. డబ్బు తీసుకోనిదే చెయ్యయినా పట్టుకోని

విజయరత్నం, రంగశాయిని పరీక్షించి జబ్బు తీవ్రంగా ఉందని తనే స్వయంగా టాక్సీ ఏర్పాటు చేసి తన హాస్పిటల్లో ఉంచుకొని మెరుగైన వైద్యాన్ని అందిస్తాడు. ఖర్చు గురించి శేఖరం ఒకపక్క భయపడుతూనే ఉన్నాడు. అదేం పట్టించుకోకుండా విజయరత్నం తన సొంత ఖర్చులతోనే అన్నీ చూసుకుంటాడు. ఇదంతా గమనిస్తున్న కాంపౌండర్ వీరాస్వామికి గాని విజయరత్నం భార్య మరకతం పినతండ్రి పరాంకుశానికి గాని ఏమీ అర్థం కాదు.

పది రోజులకి రంగశాయి జబ్బు నుండి కోలుకుంటాడు. అయితే డాక్టర్ విజయరత్నం రెండు నెలల సిక్కు లీవు రెకమెండ్ చేసి రంగశాయిని తన దగ్గరే ఉంచుకుంటాడు. రెండు నెలలు ఆఫీసు మానివేయాల్సిన అవసరం లేదని శేఖరానికి, రంగశాయికి అనిపించినా డాక్టర్ విజయరత్నం ఒప్పుకోడు. డాక్టర్ విజయరత్నం రోజుకి రెండుసార్లు రంగశాయిని కలిసి ఆరోగ్య పరిస్థితిని చూస్తూ తనతో ముచ్చటించిపోవటం చూస్తుంటే రంగశాయికి అదోలా అనిపిస్తూ ఉండేది. పైగా చిరాకు పడేవాడు కూడా. ఒక వారం గడిచేటప్పటికీ రంగశాయి ఆ భూత గృహలో పిశాచుల్లా సంచరించే వ్యక్తుల మధ్య ఉండలేక ఎవరికీ చెప్పకుండా ఆఫీసులో చేరిపోతాడు. ప్రాణం పోయినా డాక్టర్ గారి ముఖం చూడకూడదనుకుంటాడు. ఫిట్ నెస్ సర్టిఫికెట్ తేస్తే గాని తిరిగి ఉద్యోగంలో చేర్చుకోనని ఆఫీసర్ చెప్పడంతో రంగశాయి తప్పనిసరిగా దానికోసం శేఖరాన్ని బ్రతిమలాడి డాక్టర్ విజయరత్నం గారి దగ్గరికి పంపించి తెప్పించుకుంటాడు. డాక్టర్ విజయరత్నం రంగశాయిని కలవాలని ఎన్ని సార్లు ప్రయత్నించినా అతడు మొహం చాటేస్తూ ఉంటాడు. అయితే డాక్టర్ శేఖరాన్ని మాత్రం వదల్లేదు. అప్పుడప్పుడు కలుస్తూ రంగశాయిని గురించి, అతని ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకుంటూనే ఉంటాడు. అయితే కొద్ది రోజుల తర్వాత డాక్టర్ విజయరత్నంలో వచ్చిన మార్పుల్ని గమనించిన శేఖరానికి అతని జీవితంలో ఏదో మిస్టరీ ఉందనిపిస్తుంది. నేరుగా డాక్టర్ని అడగలేక అతని స్నేహితుల సాయంతో ఆ మిస్టరీని తెలుసుకునే ప్రయత్నం చేస్తూ ఉంటాడు. ఈ నవలలో రచయిత ఈ విజయరత్నం ఎవరు? అతని మిస్టరీ ఏమిటి? రంగశాయికి, విజయరత్నానికి గల సంబంధం ఏమిటి అని చివరి వరకు చెప్పడు.

విజయరత్నం అసలు పేరు కోదండం. ఇతని చిన్నప్పుడే తండ్రి చనిపోయి ఉంటాడు. కోదండం తాత ఇతన్ని ఇంగ్లీషు చదువులు చదివించి గొప్ప వాణ్ణి చేయాలనుకుంటాడు. అయితే ఇతనికి చదువు ఒంటపట్టదు. ఇతని అన్నలు వేరే కాపురాలు పెట్టుకోవడంతో కోదండాన్ని ఒక ఇంటి వాణ్ణి చేయాలనుకుంటారు. సమీప బస్తీలోని ఒక అమ్మాయిని చూసి పెళ్లి చేస్తారు. ఉన్న కొద్దిపాటి పొలాన్ని సేద్యం చేయటానికి ఇతని వల్ల కాదు. దీనితో ఇతని బావలు ఆ పొలాన్ని అమ్మి వచ్చిన డబ్బుతో ఏదైనా వ్యాపారం పెట్టించాలని బస్తీకి తీసుకువెళ్తారు. వ్యాపారం కూడా అతని వల్ల కాకపోవటం, పొలం అమ్మిన డబ్బు కొద్దిరోజుల్లోనే అయిపోవడంతో చేతిలో పని లేక, ఉన్న డబ్బూ అయిపోయి ఇలానే బావల ఇంట్లో ఉండటం ఇతనికి, ఇతని భార్య రాజేశ్వరికి కష్టమవుతుంది. ఏదైనా దూర ప్రాంతాలకు వెళ్లి పని సంపాదించుకొని డబ్బుతో తిరిగి వస్తానని భార్యకు చెప్పి కోదండం వెళ్ళిపోతాడు. అప్పటికే కోదండానికి రెండేళ్ల కొడుకు ఉంటాడు.

కోదండం వందమైళ్ళ దూరంలోని ఒక బస్తీకి చేరుకుని ఒక డాక్టర్ని ఆశ్రయిస్తాడు. ఆ డాక్టర్ ఇంట్లో పనిచేసుకుంటూ, అప్పుడప్పుడు డాక్టర్ కి కాంపౌండర్ గా సహాయం చేస్తూ కాంపౌండర్ పనిని నేర్చుకుంటాడు. డాక్టర్ భార్య పేరు మరకతం. వీరికి ఇద్దరు కొడుకులు ఉంటారు. క్రమంగా కోదండం మరకతానికి దగ్గరవుతాడు. ఆమెతో అక్రమ సంబంధాన్ని ఏర్పరుచుకుంటాడు. కొంత కాలానికి విజయరత్నం మరణిస్తాడు. అప్పటి వరకు డాక్టర్ సంపాదనతో జీవిస్తున్న ఆ కుటుంబం ఒక్కసారిగా దిక్కు తోచని పరిస్థితుల్లో పడుతుంది. అలాంటి పరిస్థితుల్లో మరకతం పిన తండ్రి పరాంకుశం సహాయంతో ఆ బస్తీకి వందమైళ్ళ దూరంలో ఉన్న మరో చోటికి మకాం మారుస్తారు. అక్కడ కోదండమే డాక్టర్ విజయరత్నంగా మారతాడు. అప్పటి నుండి మరకతానికి డాక్టర్ విజయరత్నం అలియాస్ కోదండం మొగుడుగా కూడా మారతాడు. విజయరత్నంగా మారిన కోదండం ఒక భూతగృహం లాంటి పెద్ద ఇంట్లో ఉంటూ ప్రాక్టీస్ చేస్తూ ఉంటాడు. పగలంతా రోగులతో సందడిగా ఉండే ఆ ఇల్లు రాత్రి అయితే ప్రేతంలా ఉండేది. విజయరత్నం, పరాంకుశం, కాంపౌండర్ వీరాస్వామి తప్ప ఆ ఇంట్లో ఎవరూ ఉండేవారు కారు. డాక్టర్ విజయరత్నం మంచి డాక్టర్ అని అందరికీ తెలుసు కానీ అతని గురించి, అతని గతాన్ని గురించి ఎవరికీ తెలియదు.

విజయరత్నానికి బంధువులు, స్నేహితులు ఎవరూ లేరు. ఉన్నదల్లా భార్య మరకతం, ఇద్దరు మగ పిల్లలు. వీరు డాక్టర్ దగ్గర ఉండక పక్కనున్న నగరంలో ఉంటారు. వీళ్లు విజయరత్నాన్ని అడిగే అవసరం లేకుండా ఎప్పటికప్పుడు డబ్బు పంపుతుండేవాడు డాక్టర్ విజయరత్నం. ఎవరితోనూ ఎక్కువ మాట్లాడేవాడు కాదు. కాంపౌండర్ గా ఉండటం వల్ల అబ్బిన వైద్యానికి తోడు హస్తవాసి మంచిదని పేరు పొందడం కారణంగా డబ్బుకు కొదవ ఉండేది కాదు. ఇలా కోదండం డాక్టర్ విజయరత్నంగా మారిన తర్వాత అతనికి డబ్బు సంపాదనే పరమావధి అవుతుంది. డబ్బుకు తోడు సుఖాలను అందించే మరకతం అతనికి దక్కడంతో తన భార్య రాజేశ్వరి, అతని కొడుకు కనిపించక పూర్తిగా మరిచిపోతాడు.

ఇలాంటి పరిస్థితుల్లోనే శేఖరంతో రంగశాయికి వైద్యం చేయడానికి వెళ్తాడు విజయరత్నం. అక్కడ రంగశాయి తల్లి ఫోటోను చూడడంతో ఆ ఫోటోలో ఉన్నది రాజేశ్వరిని అని, ఆమె మరణించింది అని, రంగశాయి తన కొడుకేనని డాక్టర్ విజయరత్నానికి తెలుస్తుంది. రంగశాయిని తన కొడుకుగా చెప్పుకోలేక సతమతమవుతుంటాడు. తానెన్ని తప్పులు చేశాను అని విజయరత్నంలో పశ్చాత్తాపం మొదలవుతుంది. రాను రాను వృత్తి పట్ల ఆసక్తి తగ్గుతుంది. ఆదాయం తగ్గుతుంది. భార్య మరకతానికి డబ్బు పంపించడం మానేస్తాడు. మానసికంగా చాలా కృంగిపోతాడు. ఈ కుంగుబాటుకు గల కారణం మరకతానికి అర్థమైపోతుంది.

అతన్ని ఎలాగైనా గుప్పెట్లోనే పెట్టుకోవాలనుకుంటుంది. కట్టుదిట్టం చేస్తుంది. డబ్బు పంపకపోవడంతో మరకతం పిల్లలు డాక్టర్ పై హడావిడి చేస్తారు. పరాంకుశం కూడా విజయరత్నంపై చాలా ఒత్తిడి చేస్తాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఒకరోజు డాక్టర్ గారి తలపై బలంగా

దెబ్బ తగులుతుంది. అది ఎవరైనా కావాలని చేశారా లేదా అనేది తెలియదు. దురదృష్టవశాత్తు డాక్టర్ ఆ ప్రమాదం నుండి బయటపడతాడు. అప్పటి నుండి డాక్టర్ చేస్తున్న పిచ్చిపిచ్చి ప్రవర్తనల వల్ల ఆయనకు మతి చలించిందేమో అని కొందరు అనుకుంటారు.

చివరికి డాక్టర్ విజయరత్నం ప్రాక్టీసు మానేసి, అందరినీ పనిలో నుంచి మాన్పించేస్తాడు. ఇంట్లో సామానంత అమ్మేసి ఆ వచ్చిన డబ్బులో సగం వీరాస్వామికి ఇచ్చి ఒకరోజు సాయంత్రం ఊరు విడిచి ఎక్కడికో వెళ్లిపోవాలని రైలు ఎక్కుతాడు. ఇలాంటిదేదో జరుగుతుందని అనుమానించిన శేఖరం రైలు కదులుతున్న చివరి క్షణాల్లో డాక్టర్ విజయరత్నాన్ని కలుసుకుంటాడు. అప్పటికే తన జీవిత చరిత్రనంతా రాసి పెట్టుకున్న ఒక కవర్ ను అందిస్తూ *"దీన్ని రేపు నీకు పోస్టుచేసి వుండేవాణ్ణి. కనిపించావు గనుక స్వయంగానే యిచ్చుకో గలుగుతున్నాను..."* అని అంటాడు. (త్రిశంకుడి స్వర్గం. 1969: 182,183). శేఖరానికి అన్ని విషయాలు కవర్ చదవడం వల్ల తెలుస్తాయి.

నవలా విశ్లేషణ

మధురాంతకం రాజారాం 1969 లో రాసిన ఈ నవలలో కుటుంబాన్ని పోషించలేని కోదండం డాక్టర్ విజయరత్నంగా మారిన తర్వాత కోరుకున్న డబ్బు, కావాల్సిన సుఖం రెండూ దొరకడంతో తనను తాను మరిచిపోయి కట్టుకున్న భార్యను, కొడుకును పూర్తిగా వదిలేస్తాడు. చివరికి వైద్య నిమిత్తం వచ్చిన కొడుకును చూసి, తనని గుర్తించి, కొడుకని చెప్పలేక బాధకు గురవుతాడు. తన పరిస్థితికి తానే చింతిస్తాడు. మానసిక వేదనకు గురవుతాడు. డబ్బు సంపాదనే పరమావధిగా పెట్టుకున్న కోదండం తన జీవితంలో కోల్పోయిన దానిని గుర్తు చేసుకొని బాధపడతాడు. దీనిని చూస్తే రచయిత ఈ నవలలో మనిషి నిజాయితీగా జీవితాన్ని గడపడం పట్ల ఉన్న ఆనందాన్ని డబ్బు సంపాదన తెచ్చి పెట్టే సుఖాల గురించి విజయరత్నం (కోదండం) అనే పాత్ర ద్వారా కళ్ళకు కట్టినట్టు చెప్పాడు.

సింగమనేని నారాయణ గారు ఈ నవల గురించి చెప్తూ *"మధ్య తరగతి జీవితాలకూ, మనస్తత్వాలకూ ప్రతీక లాంటిది "త్రిశంకుడి స్వర్గం" అన్న పదబంధం. అటు పైకీ ఎగబ్రాకలేక, కొందకీ దిగజారలేక, ఉన్నచోటులోనూ ఉండలేక, అలమటించే మధ్యతరగతి మానవుడిని లక్ష్యంగా చేసుకొని రాసిన నవల ఇది. మధ్యతరగతి మానవుడు తన జీవిక కోసం తనను తాను ఎలా వంచించుకోవటానికి సిద్ధపడతాడో ఈ నవల చెబుతుంది"* (మధురాంతకం రాజారాం, 2013: 84) అని అంటారు.

డాక్టర్ విజయరత్నం గతాన్ని గురించి రచయిత చివరి వరకు చెప్పకపోవడం వల్ల ఈ నవలని చదువుతున్నంతసేపు ఒక ఉత్కంఠత మనలో ఉంటుంది. అదే రాజారాం ప్రత్యేకతగా ఈ నవల గురించి ఈ నవలలోని శిల్పం గురించి చెప్పేటప్పుడు చెప్పవచ్చు.

4.2.2.2. చారిత్రక నవలలు

చారిత్రక నవల అంటే ఏమిటి అనే విషయాన్ని ఇది వరకే చెప్పాను. ఇక్కడ పునరుక్తి కారణంగా చెప్పడంలేదు.

4.2.2.2.1. రామానుజుని ప్రతిజ్ఞ

ఆదిశంకరాచార్యులు ప్రతిపాదించి ప్రచారం చేసిన అద్వైత మతమే పరమమతంగా కొనసాగుతున్న రోజుల్లో, ఒకరోజు రామానుజుడు దీర్ఘాలోచనలో పడతాడు. అద్వైత మతంలో కూడా లోపాలు ఉన్నాయని ఆ మతాన్ని అంగీకరించలేక తన గురువైన యాదవ ప్రకాశకున్ని ఆశ్రయిస్తాడు. కానీ అతడు తన సందేహాలను తీర్చకపోవడంపోగా చెప్పిన దానిని వినాలని ఎదురు ప్రశ్నించడం తప్పని చెప్తూ తప్పుపడతాడు. ప్రశ్నించకుండా విజ్ఞానం ఎలా కలుగుతుందని, ఏ మతానికైనా ప్రశ్నలన్నింటికీ సమాధానం ఇవ్వగల శక్తి ఉండాలని, యమునాచార్యుడు బ్రతికి ఉన్నట్లయితే అతని ప్రశ్నలకు సమాధానం దొరికేదని అనుకుంటాడు. అయితే అప్పటికే యమునాచార్యుడు మరణించి ఉండడంతో తనకున్న జ్ఞానంతోనే తన సందేహాలను నివృత్తి చేసుకోవాలని అనుకుంటాడు. పరిపరి విధాల ఆలోచించిన రామానుజుడు చివరకు యమునాచార్యుని ప్రధాన శిష్యుడైన గోష్ఠీపూర్ణున్ని ఆశ్రయిస్తాడు. అతడు రామానుజుని రేపు రమ్మని, తర్వాత రమ్మని ఇలా ప్రతిరోజు పరీక్షిస్తూనే ఉంటాడు. అయితే ఒకరోజు గోష్టిపూర్ణుని దగ్గర నుండి తిరుమంత్రోపదేశాన్ని పొందుతాడు. రామానుజుడు ఆ తిరుమంత్రోపదేశాన్ని పొందిన తర్వాత తిరుక్కోట్టియూరులోని దేవాలయ గోపురాన్నెక్కి ఆ మంత్రాన్ని చుట్టుపక్కల ఉన్న పంచములకు కూడా వినబడేటట్లు అందరికీ చెప్పేస్తాడు.

రామానుజుడు తిరుమంత్రాన్ని అందరికీ చెప్పేశాడన్న వార్త శ్రీరంగం అంతా పాకుతుంది. ప్రజలందరూ అతన్ని దేవుడుగా కొలుస్తారు. అయితే శ్రీరంగంలోని వైష్ణవులందరికీ రామానుజులపై కోపం వస్తుంది. కారణం ఎవరికీ చెప్పకూడని ఆ మంత్రాన్ని పంచములకు సైతం చెప్పడం. దీనికి తోడు శ్రీరంగ దేవాలయంలో అర్చన విధానానికి సంబంధించి బృంగాచార్యులతో వివాదాలు ఏర్పడడం. క్రమంగా బృంగాచార్యుల వాదం తగ్గి రామానుజుని వాదం పైన అందరికీ అభిమానం పెరుగుతుంది. ఇది సహించలేని ఆలయ అర్చకులలో ఒకడైన శేషాచార్యుడు బృంగాచార్యులతో కలిసి రామానుజున్ని చంపాలనుకుంటారు. శేషాచార్యుడు అతని భార్య తిరుక్కొచ్చిచే రామానుజునికి విషం పెట్టిన అన్నాన్ని పెట్టించే ప్రయత్నం చేస్తాడు. ఈ ప్రమాదం నుండి తప్పించుకున్న తర్వాత రామానుజుని ప్రాభవం మరింత పెరుగుతుంది. అతని శిష్య బృందం కూడా పెరుగుతుంది. వారిలో కూరేశుడు, దాశరథి, గోవింద మిత్రుడు ప్రధానమైన వారు, రామానుజుడు తన శిష్య బృందంతో కలిసి యమునాచార్యుని మూడు కోరికలను పూర్తి చేసే పనిలో ఉంటాడు. బ్రహ్మ సూత్రాలకు విశిష్టాద్వైత తత్త్వపరంగా భాష్యాలను రాస్తున్నాడు. అలాగే యమునాచార్యుడు కలలుగన్న విశిష్టాద్వైత తత్త్వానికి రూపకల్పన చేసి ఆ తత్త్వాన్ని దేశమంతా ప్రచారం చేస్తున్నాడు. ఇలాంటి సమయంలో యజ్ఞమూర్తి అనే శైవుడు కాశీకి వెళ్లి

అక్కడి నుండి రామేశ్వరానికి వెళ్తూ అతడు అడుగుపెట్టిన చోటల్లా ఇతర మతస్తులందరినీ తన వాదనలతో ఓడించి అన్ని మతాల వారికి సవాళ్లు విసరసాగాడు. అద్వైతంలో దిట్ట అయిన యజ్ఞమూర్తి శ్రీరంగంలోని రామానుజునితో కొన్ని షరతులకు లోబడి చర్చకు ఉపక్రమిస్తాడు. ఐదు రోజుల చర్చ తర్వాత యజ్ఞమూర్తి ఓటమిని అంగీకరిస్తాడు.

ఇదిలా ఉండగా యాదవ ప్రకాశకుడు అద్వైతమత కర్తగా ఉన్నప్పుడు కాంచీపురాన్ని వీర రాజేంద్రచోళుడు పరిపాలిస్తుండేవాడు. ఇతడు అద్వైతుడు కాబట్టి ఆ ప్రాంతమంతా అద్వైత మత ప్రాబల్యంలోనే ఉండేది. ఆదిశంకరాచార్యుల కాలం నుండి దక్షిణాపథంలో అద్వైతమే ప్రధానంగా కొనసాగుతుంది. దీనిని ప్రశ్నించే ధైర్యం ఎవరికీ ఉండేది కాదు. అయితే శ్రీరంగంలో యమునాచార్యుడు మాయావద ఖండన అనే గ్రంథాన్ని రచించడంతో అద్వైతానికి సవాలు ఏర్పడుతుంది. ఇతను మరణించే నాటికి అతని సూత్రాలు ఒక సిద్ధాంతాన్ని గాని, ఒక మతాన్ని గాని ప్రతిపాదించలేక పోతాయి. అయినప్పటికీ అవి అద్వైతాన్ని విమర్శించడానికి బాగా ఉపయోగపడేవి. కాంచీపురంలో యాదవ ప్రకాశకుడు ఎంత ప్రతిభ కనబరిచినా యమునాచార్యుని ప్రాబల్యం తలెత్తకుండా ఉండలేదు. అతని శిష్యుడైన రామానుజుడు అతని వాదాన్ని తప్పుపడతాడు. దీంతో అతన్ని కాంచీపురం నుండి తరిమేస్తాడు. అప్పటినుండి కాంచీపురంలోని ప్రముఖులకు రామానుజుని పైన విశ్వాసం పెరుగుతుంది. యాదవ ప్రకాశకుని మీద కోపం వస్తుంది. అలా వచ్చిన వారిలో వీర రాజేంద్రుని సేనాని సోమదేవుడు ఒకడు. సోమదేవుని ప్రవర్తన వీర రాజేంద్రుని మంత్రి అయిన త్రిపురాంతకునికి నచ్చేది కాదు. కారణం సోమదేవునికి శైవమతం అన్నా, అద్వైత మతం అన్నా గిట్టకపోవడం. వీరిద్దరి మధ్య అభిప్రాయ బేధాలు పెరుగుతాయి. దీంతో త్రిపురాంతకుడు క్రమంగా సైనికోద్యోగుల విషయంలో వైష్ణవులను శైవులుగా మారమని నిర్బంధిస్తాడు. ఈ విషయం తెలిసిన వీరరాజేంద్రుడు మంత్రిని ఏమీ అనడు. కొంతకాలానికి వీర రాజేంద్రుడు జబ్బు పడటంతో సోమదేవుని మాటమీద అతని కొడుకు అధిరాజేంద్రుని యువరాజుగా ప్రకటిస్తాడు. అధిరాజేంద్రునికి సోమదేవుడు అంటే ఎక్కువ అభిమానం ఉండేది. ఇది త్రిపురాంతకునికి నచ్చేది కాదు. అందుకనే అతనిపైన మతం పేరిట ఏవో ఒక అభియోగాలను మోపుతూ ఉండేవాడు. శైవ మతం పైన వీర మతాభిమానం ఉన్న త్రిపురాంతకుడి మాటలను అధిరాజేంద్రుడు పట్టించుకునేవాడు కాదు. దీనితో త్రిపురాంతకుడు ఇలాగే ఉంటే కష్టమని ఎలాగైనా అధిరాజేంద్రుని అంతు చూడాలనుకుంటాడు. కారణం వైష్ణవుడైన సోమదేవుని మాటలు యువరాజు వినడం వల్ల రాజ్యంలో శైవం నశిస్తుందని.

మరొకపక్క వేంగీ చాళుక్య రాజు రాజేంద్రుడు రాజవగానే చక్రకూటం పైకి దండెత్తి వెళ్తూ అతని పినతండ్రి అయిన విజయాదిత్యుణ్ణి రాజ్యానికి తాత్కాలిక అధిపతిగా ఉంచి వెళ్తాడు. రాజేంద్రుడు చక్రకూటాన్ని జయించి తిరిగి వచ్చే సమయానికి విజయాదిత్యుడు తనను రాజుగా ప్రకటించుకుని రాజేంద్రున్ని రాజ్యంలోకి రానివ్వకుండా చేస్తాడు.

దీనితో రాజేంద్రుడు చోళ రాజైన వీరరాజేంద్రుని సాయమడగడానికని తన సైన్యాధిపతి నారనదేవున్ని పంపిస్తాడు. విషయం తెలుసుకున్న వీరరాజేంద్రుడు నారనదేవున్ని యువరాజైన అధిరాజేంద్రుని దగ్గరకు పంపుతాడు. అధిరాజేంద్రుడికి ఒకరు మామ, ఒకరు బావమరిది కావడంతో ఎటూ తేల్చలేక తటస్థంగా ఉంటాడు. దీనితో నారన చేసేదేమీ లేక వెళ్ళిపోతాడు. అయితే ఈ సమయంలో అధిరాజేంద్రుని ప్రవర్తన నచ్చని త్రిపురాంతకుడు ఒక పన్నాగాన్ని పన్నుతాడు.

అధిరాజేంద్రుని కాలంలో శైవమత ప్రాబల్యం తగ్గి వైష్ణవ మత ప్రాబల్యం పెరుగుతుంది. ఇది సహించలేని త్రిపురాంతకుడు శైవ మతాభిమాని అయిన రాజేంద్ర చాళుక్యున్ని అధిరాజేంద్రుని మీదికి యుద్ధానికి ఆహ్వానిస్తాడు. ఈ యుద్ధంలో అధిరాజేంద్రుడు చంపబడగా సోమదేవుడు బంధించబడతాడు. సాయంగా వచ్చిన విజయాదిత్యుని సైన్యాన్ని రాజేంద్రుడు తిప్పి కొడతాడు. దీనితో కాంచీపురం చాళుక్యుల హస్తగతం అవుతుంది. ఆ తర్వాత రాజేంద్రుడు కులోత్తుంగ చోళుడుగా పేరు మార్చుకొని పరిపాలన చేస్తాడు. అయితే అతనికి వేంగీ రాజ్యం పట్ల అసంతృప్తి ఉండేది. దానిని ఎలాగైనా హస్తగతం చేసుకోవాలని నారనదేవుడు, త్రిపురాంతకుడు, త్రిలింగమూర్తి సహాయంతో విజయాదిత్యునితో సంధి చేసుకుంటాడు. దీనితో దక్షిణాపథమంతా చోళ రాజ్యం కిందకి వస్తుంది.

త్రిపురాంతకుడు తాను అనుకున్న పని నెరవేరడంతో చాలా సంతోషపడి ఇక మిగిలినది ఒకటే అని అది శైవ మతాన్ని పెంపొందించడం మాత్రమే అని అనుకుంటాడు. అయితే సోమదేవుడు బందీగా ప్రాణాలతో ఉన్నంతవరకూ ఆ పనికి ప్రమాదం జరగవచ్చును అతనిని అంతమొందించాలని రాజుని ఒప్పిస్తాడు. అయితే ఒక అవకాశం ఇచ్చి చూడాలని త్రిపురాంతకుడు అనుకుంటాడు దానికి సోమదేవుడు అంగీకరించడు.

చిదంబరంలోని వారాంగన అయిన తిల్య ఒక రోజు రామానుజుని గొప్పతనాన్ని విని అతనిని కలిసి తన వృత్తాంతాన్ని చెప్పి ఉపదేశాన్ని కోరుతుంది. రామానుజుడు ఆమె గురించి విని ఆశ్చర్యపోయి చిదంబరంలో వైష్ణవులను చేరదీసి వారిని సేవిస్తూ ఉండమని, అది వైష్ణవ మత వ్యాప్తికి తోడ్పడుతుందని సెలవిస్తాడు. దీనితో తిల్య చిదంబరంలో ఒక వైష్ణవ సంఘాన్ని ఏర్పాటు చేసి వైష్ణవులందరినీ సేవిస్తూ ఉంటుంది.

రామానుజుడు తను ప్రతిపాదించిన విశిష్టాద్వైతాన్ని దేశమంతటా ప్రచారం చేయాలనుకుంటాడు. అందులో భాగంగానే కుంభకోణం, కేరళ, ద్వారక, మధురాపురం, పాల గ్రామం, సాకేతనగరం, కాశీ, శ్రీకూర్మం, సింహాచలం ఇలా అనేక ప్రాంతాలకు వెళ్లి అక్కడ ఉన్న శైవులను ఓడిస్తూ శైవాలయాలను, వైష్ణవాలయాలుగా మారుస్తూ దేశమంతటా దిగ్విజయాత్రలు చేస్తూ ఉంటాడు. ఇలాంటి సమయంలోనే తిరుమలలో శైవులకు, వైష్ణవులకు మధ్య వాగ్వివాదాలు ఏర్పడతాయి. శ్రీశైల పూర్ణుని ఆహ్వానంతో రామానుజుడు తిరుమలకు వచ్చి అక్కడ ఉన్న శైవపెద్ద శివజ్ఞాన పెరుమాళ్ళుతో వాదించి తిరుమలను వైష్ణవాలయంగా మారుస్తాడు. ఈ దిగ్విజయాత్రలో

భాగంగానే రామానుజుడు కాంచీపురానికి కూడా వెళ్లాలనుకుంటాడు. అయితే అప్పటికే రాజేంద్రుడు కాంచీపురాన్ని స్వాధీనం చేసుకొని ఉండడంతో నగరం అంతా యుద్ధ వాతావరణం నెలకొని ఉంటుంది కాబట్టి రామానుజుడు కాంచీపురానికి వెళ్లడు.

ఈ విధంగా ఒకపక్క రామానుజుడు విశిష్టాద్వైతాన్ని ప్రతిపాదిస్తూ దేశమంతటా తన తత్వాన్ని బోధిస్తూ శైవులనే కాక శాక్తేయ, జైన, బౌద్ధ మొదలైన వారందరితోనూ వాదిస్తూ అనేక శైవాలయాలను వైష్ణవాలయాలుగా మారుస్తూ ఉంటాడు. మరోపక్క రాజేంద్రుడు తన రాజ్యంలో శైవులు మాత్రమే ఉండాలని మరే మతస్థులు ఉండకూడదని అందరినీ శైవులుగా మారుస్తూ జీర్ణ దేవాలయోద్ధరణ పేరుతో శైవాలయాలను మాత్రమే పునరుద్ధరిస్తూ ఉంటాడు. శివార్పరతరం నాస్తి అనే పేరుతో *"శివుడు తప్ప అన్య దైవం లేదు"* (రామానుజుని ప్రతిజ్ఞ. 2012: 102) అని అందరి చేత సంతకాలు పెట్టించడం మొదలుపెడతాడు. మొదట ప్రభుత్వ శాఖలను, ఆ తర్వాత సామాన్య ప్రజల చేత సంతకాలు చేయించడం ప్రారంభిస్తాడు. అయితే శ్రీరంగం, చిదంబరంలో మాత్రం కొంత ప్రతిఘటన మొదలవుతుంది. అక్కడ రామానుజుని మాటమేరకు వైష్ణవులందరూ ఎదురు తిరుగుతారు. దీనిని ఇంతటితో అణచకపోతే ప్రమాదం ఏర్పడుతుందని రామానుజుని బంధించి తెమ్మని కులోత్తుంగుడు ఆదేశిస్తాడు.

మహాపూర్ణుడి ద్వారా ఈ విషయం తెలుసుకున్న కూరేశుడు, రామానుజుని వేషంలో కాంచీపురానికి బందీగా వెళతాడు. అక్కడ కులోత్తుంగునికి, కూరేశునికి జరిగిన సంభాషణలో రాజు ఆగ్రహించి అతని కళ్ళు పీకించేయాలని ఆజ్ఞాపిస్తాడు. దీనితో కూరేశుడు ఈ పాపిష్టి కళ్ళతో నా గురువును చూడలేనని తన కళ్ళను తనే పీకేసుకుంటాడు. దీనితో రామానుజుడు తప్పించుకున్నాడని తెలిసి మహాపూర్ణుడి కళ్ళు కూడా పీకేయించి రామానుజున్ని తక్షణం ఎక్కడున్నా బంధించి తేవాలని కులోత్తుంగుడు ఆజ్ఞాపిస్తాడు.

ఈ విషయం రామానుజునికి తెలుస్తుంది. రానున్న ప్రమాదాన్ని గ్రహించి శిష్యుల కోరిక మేరకు రామానుజుడు మైసూరు ప్రాంతానికి గోవిందమిశ్రునితో కలిసి బయలుదేరుతాడు. కులోత్తుంగుడు రామానుజుని కోసం చోళ దేశమంతటా వెతికించసాగుతాడు. అతని జాడ తెలియనప్పటికీ అతడు కొంగుపిరాట్టు దగ్గర తలదాచుకకొని అక్కడ నుండి వహ్నీ పుష్కరిణి, సాలగ్రామాన్ని చేరుకున్నాడని ఆ తర్వాత జైనరాజ్యమైన విఠల దేవరాయలు పాలిస్తున్న మైసూరు రాజ్యం చేరుకున్నాడని అక్కడ ప్రజలందరినీ వైష్ణవులుగా మారుస్తున్నారని తెలుసుకుంటాడు. ఆ తర్వాత మైసూర్ నుండి అరణ్యాల ద్వారా తొండనూరు చేరుకుని అక్కడున్న శైవ, బౌద్ధ, జైనులందరినీ తన శిష్యులుగా చేసుకున్నాడని కులోత్తుంగునికి తెలుస్తుంది. దీనితో రామానుజుని ఎలా పట్టుకోవాలో తెలియక సతమతం అవుతూ ఉంటాడు.

కులోత్తుంగుడు కాంచీపురంలోని వరదరాజస్వామి దేవాలయాన్ని కూల్చివేసి చిదంబరంలోని గోవిందరాజస్వామి దేవాలయాన్ని నేలమట్టం చేయడానికి బయలుదేరుతాడు. ఈ విషయం తెలిసిన తిల్య, ఇతర వైష్ణవులు ఆశ్చర్యపోతారు. గోవిందరాజస్వామి ఉత్సవ విగ్రహాలను

తీసుకొని శ్రీరంగం దాటుకుని వెళ్ళండి, ఈలోగా సైన్యాలను దేవాలయం వద్దనే నేను ఆపుతానని తిల్య చెప్పడంతో కొందరు వైష్ణవులు ఆ పనికి ఉపక్రమిస్తారు. ఈ విషయాన్ని గ్రహించిన రాజు ఉత్సవ విగ్రహాల కోసం ఎంత వెతికించిన లాభం లేకపోతుంది. రాజు కోపగించి గుడిని నేలమట్టం చేసి విగ్రహాలను కనిపెట్టి తీసుకురమ్మని కాంచీపురానికి వెళ్లిపోతాడు.

ఈ విధంగా కులోత్తుంగుడు అనేక గోర ప్రయత్నాలు చేస్తూ చివరగా శ్రీరంగనాథ ఆలయాన్ని నాశనం చేస్తే అతని ఆశయం నెరవేరుతుందని ఆ తర్వాత నెమ్మదిగా తిరుపతిని నిర్మూలించవచ్చని భావిస్తాడు. కులోత్తుంగుడు శ్రీరంగంపై దాడి చేయాలనుకుంటుండగానే అతని గొంతులో నొప్పి మొదలై అది రోజు రోజుకు పెరుగుతూ ఉంటుంది. అది పెరిగి పెద్దదై వ్రనంగా మారి అతని శరీరాన్నంతటిని బలహీనపరుస్తుంది దీనితో కులోత్తుంగునికి పశ్చాత్తాపం మొదలై చేసిన పాపాలు ఒక్కసారిగా గుర్తొస్తాయి. తర్వాత బందీలుగా ఉన్న వైష్ణవులందరిని వదలమని, వారికి మతస్వాతంత్రాన్ని ప్రకటించమని రామానుజున్ని వెతికించవద్దని ఆజ్ఞలు జారీ చేస్తాడు. చివరగా తిల్యని పిలిపించి గోవిందరాజు స్వామి పై పాట పాడించుకుని ప్రాణాలను వదులుతాడు.

తర్వాత రాజ్యాధికారం చేపట్టిన విక్రమ చోళుడు శైవ వైష్ణవ మతాల మధ్య ఎలాంటి వివక్షత చూపని పరిపాలన చేస్తాడు. రామానుజుడు యాదగిరిలో విష్ణు దేవాలయాన్ని నిర్మించి తిరుపతి వైష్ణవుల కోరిక మేరకు తిల్యచే రక్షించబడిన ఉత్సవ విగ్రహాలకు తిరుపతిలో విగ్రహ ప్రతిష్ట చేస్తాడు. ఈ విధంగా యమునాచార్యుల ఆశయాలను రామానుజుడు పూర్తి చేయగలుగుతాడు.

నవలా విశ్లేషణ

రాజగోపాల నాయుడు 1965లో రచించిన రామానుజుని ప్రతిజ్ఞ నవల ఒక గొప్ప చారిత్రక నవల. శైవులకు, వైష్ణవులకు మతం పేరిట విభేదాలు నెలకొన్న తరుణంలో ఒక పక్క పరిపాలనాపరంగా శైవమే పరమమతంగా నిలపాలని చోళరాజు మారణహోమాన్ని తలపెడుతున్న తరుణంలో యమునాచార్యులు కలలో గన్న విశిష్టాద్వైత మత వ్యాప్తి చేయడం కోసం రామానుజుడు ఎన్ని కష్టాలకు గురయ్యాడు, చివరకు ఎలా విజయాన్ని సాధించాడు అన్నదే ఈ నవల ఇతివృత్తం.

ఈ నవలలో రామానుజుడు యమునాచార్యుని కలలైన మూడు అంశాలను పూర్తి చేయడం ఆయన కలలు కన్న విశిష్టాద్వైతాన్ని నిర్వహించి దాని ప్రచారమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని ఎన్ని కష్టాలను ఎదుర్కొన్నాడు అనేది ఈ నవలలో రచయిత చాలా చక్కగా చూపించాడు. నిరంకుశ చోళ రాజ దమన విధానాన్ని తట్టుకొని వైష్ణవాన్ని రామానుజుడు కాపాడిన విధానాన్ని ఈ నవలలో మనం చూడవచ్చు.

"మతాల మధ్య అనుమానాలు పెరుగుతున్న ఈ కాలంలో, మతం పేరిట దేశం విడిపోయిన ఈ కాలంలో ప్రాంతాల పేరిట హింసాకాండ చలరేగుతున్న ఈ కాలంలో వ్యక్తులు అలవరుచుకోవలసిన సంయమన, సహన దృక్కోణం, ప్రభుత్వం అనుసరించవలసిన

సమన్యాయధర్మం గుర్తు చేయడానికి ఇటువంటి రచన ఎంతో అవసరం. నాలుగు దశాబ్దాలకిందటే కాదు ఈనాడు కూడా ఈ నవలకు ప్రాసంగికత ఉంది. బహుశా మన ఆలోచనా ధోరణిలో విప్లవాత్మకమైన మార్పేమీ రాకపోయినట్లయితే మరో శతాబ్దం తర్వాత కూడా దీని ఆవశ్యకత ఉంటుంది" (రామానుజుని ప్రతిజ్ఞ, 2012: ముందుమాట) అని ఈ నవలకు ముందుమాట రాసిన డి. చంద్రశేఖర్ రెడ్డి మాటలు ముమ్మాటికీ నిజమే.

4.2.2.2.2. ఓరుగల్లు పునరాక్రమణ

14వ శతాబ్దం ప్రారంభ దశలో మహమ్మదీయులు దక్షిణ భారతదేశంలోని హైందవ రాజ్యాలన్నింటిని వశపరచుకుంటున్నారు. ఈ సమయంలో దక్షిణాపథంలో ప్రధానమైన నాలుగు రాజ్యాలు ఉండేవి. అవి ఒకటి యాదవుల పరిపాలనలో ఉన్న దేవగిరి రాజ్యం. రెండవది కాకతీయుల ఆధిపత్యంలో ఉన్న ఓరుగల్లు రాజ్యం. మూడవది ద్వార సముద్రాన్ని రాజధానిగా చేసుకుని పాలిస్తున్న హోయసలుల రాజ్యం. నాలుగోది కాంచీపురం ప్రధాన నగరమైన చోళ రాజ్యం. ఈ నాలుగు రాజ్యాల రాజులు ఎప్పుడూ ఒకటిగా ఉండేవారు కాదు. పైగా వారి మధ్య విద్వేషాలు పెరిగి యుద్ధాలు తరచూ సంభవిస్తూ ఉండేవి. ఇలాంటి సమయంలోనే అల్లా ఉద్దీన్ సేనాయకుడైన మాలిక్ కాఫర్ దేవగిరిని ముట్టడించి రామచంద్ర దేవున్ని ఓడించి దేవగిరిపై ఢిల్లీ సుల్తానుల పతాకాన్ని ఎగరవేస్తారు. ఇది గమనిస్తున్న కాకతీయ రాజులు పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తించక ఆనందపడతారు. మాలిక్ కాఫర్ ఆ తర్వాత ఓరుగల్లుపై దండయాత్ర చేయడంతో కాకతీయులు వారిని తిప్పికొడతారు. అయితే ఆ తర్వాత వచ్చిన తుగ్లక్ దండయాత్రను మాత్రం ఆపలేకపోతారు. వీరికి దేవగిరి యాదవులు సహాయం చేయడంతో ఓరుగల్లు రాజ్యం కూడా మహమ్మదీయుల వశం అయిపోతుంది. ఆ తర్వాత మిగిలి ఉన్న దక్షిణాపథంలో హోయసల, చోళ రాజ్యలు కూడా వీరి వశం అయిపోతాయి.

"మహమ్మదీయులు హిందువుల రాజ్యాలనాక్రమించుకోవడానికి మాత్రమే రాలేదు. కాక ధనదాన్యాలను వజ్ర వైడూర్యాలను స్వాధీనపరచుకోవడానికి మాత్రమే దండయాత్రలు జరపలేదు. హైందవ మతాన్ని నిర్మూలించి మహమ్మదీయ మతాన్ని నెలకొల్పడానికి వచ్చారు. అందువల్ల వారు హిందూ దేవాలయాలను నేలమట్టం గావించారు. పూజారుల తలలు తరిగించారు. వేలాదిమంది హిందువులను మహమ్మదీయులుగా మార్పించారు. హిందూ మత గ్రంథాలను భస్మపటలం చేశారు" (ఓరుగల్లు పునరాక్రమణ నవల. ఆంధ్రప్రదేశ్ మాస పత్రిక, జనవరి, 1972: 36).

ఇటువంటి సమయంలో ఆదిశంకరాచార్యుడు ఏర్పాటుచేసిన శృంగేరి పీఠానికి ఆచార్యత్వం వహిస్తున్న శ్రీమాధవ విద్యారణ్యయతీంద్రుడి దగ్గరికి తన సోదరుడు సాయనుడు తను రాసిన భాష్యాన్ని తీసుకువచ్చి తన అభిప్రాయాన్ని తెలుసుకోవాలనుకుంటాడు. శ్రీమాధవ విద్యారణ్యయతీంద్రుడు శృంగేరిపీఠ గురుపరంపరలో ఆదిశంకరాచార్యుని తర్వాత అంతటి మేధావి ప్రతిభావంతుడుగా పేరు తెచ్చుకున్నవాడు. శ్రీమాధవ విద్యారణ్యయతీంద్రుడు ఆ భాష్యాన్ని

చదివిన దానిని అపూర్వమైనదిగా చెప్తాడు. ఆచంద్రార్కం ఉండి తీరుతుంది అని కూడా చెబుతాడు అయితే సాయనుడు *"హైందవ మతాన్నే తుడిచిపెడుతున్న మహమ్మదీయులు ఈ పీఠాలను, ఈ గ్రంథాలను ఈ భాష్యాలను వుండనిస్తారా"* (ఓరుగల్లు పునరాక్రమణ నవల. ఆంధ్రప్రదేశ్ మాస పత్రిక, జనవరి, 1972: 35) అని ఒక నిట్టూర్పు విడుస్తాడు. విషయాన్ని గ్రహించిన విద్యారణ్యయతీంద్రుడు హైందవ మతోద్ధరణ కోసం అవసరమైతే ప్రాణత్యాగం చేయడానికైనా సిద్ధంగా ఉన్న వీరుడుగా ఆత్మవిశ్వాసంతో పూర్వం రాక్షసులు మహర్షిని బాధలు పెట్టి యజ్ఞయాగాదులను నాశనం చేస్తున్నప్పుడు వాటి రక్షణ కోసం బయలుదేరిన విశ్వామిత్రుని చరిత్రను గుర్తు చేసుకుని *"ఆనాడు విశ్వామిత్రుడేమిచేశాడో దానిని మనం నిర్వర్తింపవలసి ఉన్నది"* (ఓరుగల్లు పునరాక్రమణ నవల. ఆంధ్రప్రదేశ్ మాస పత్రిక, జనవరి, 1972: 35) అని అంటాడు. విశ్వామిత్రుడికి దొరికిన రామలక్ష్మణుల లాంటి వారికోసం యత్నించాలి. అప్పుడు ముస్లిం సార్వభౌముల సేనావాహినులను ఎదిరించడం అంత కష్టమైన పనేమీ కాదు అని చెప్తాడు.

తుగ్లక్ సేనలచే బంధించబడిన ప్రతాపరుద్రుడి గురించి అనేక వదంతులు రావడంతో వాటిలో ఏది నిజం ఏది అబద్ధం అని తెలియక అన్నమంత్రి, కోలని రుద్రదేవుడు సింగనాయకుడు, ప్రోలయ్య నాయకుడు, కాపయ్య నాయకుడు, గణపతి నాయకుడు, పెద్ద కోమటి వేమారెడ్డి మొదలైన ఎనభై మంది యువకులు కలిసి చక్రవర్తి ఏమైనప్పటికీ ఢిల్లీ సుల్తానుల మీద ప్రతిఘటించి ఎలాగైనా పగ తీర్చుకొని ఓరుగల్లును శత్రుహస్తాల నుండి విడిపించాలని మాల్యవంతం అనే ఒక ప్రాంతంలో రహస్య సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని మాట్లాడుకుంటూ ఉంటారు. ఈ పనికి అధ్యక్షుడిగా పోలయ్య నాయకుడిని ఎన్నుకుంటారు. వీరు మొదట మహమ్మదీయ సైన్యాలు లేని తీరాంధ్ర ప్రాంతాన్ని ఆక్రమించి అక్కడ ఒక సైన్యాన్ని ఏర్పాటు చేసి ఒక నగరాన్ని కూడా నిర్మించాలని తీర్మానించుకుంటారు.

అనేగొందిని పాలిస్తున్న సోమదేవ రాజును కలవాలని విద్యారణ్యయతీంద్రుడి తమ్ముడైన సాయనుడు వస్తాడు. తుగ్లక్ అనేగొందిపై దండెత్తి వచ్చే రోజుకి సోమదేవరాజు చిన్నవాడు. అప్పటి నుండి తన చెల్లెలు అన్నమాంబ తను మారువేషంలో తిరుగుతూ ఎప్పటికైనా మహమ్మదీయులపై పోరాడి కీర్తి ప్రతిష్టల్ని సంపాదించాలని చూస్తుంటారు. మహమ్మదీయుల వల్ల జరుగుతున్న అనర్థాలు మీకు తెలిసే ఉంటాయి. వారు హైందవమత నాశనానికి పాల్పడుతున్నారు. అందువల్ల ఆ మతోద్ధరణకు విద్యారణ్యయతీంద్రులు ప్రయత్నం చేయాలనుకున్నారు. అందుకు మీ సాయం కావాలని సాయనుడు సోమదేవరాజును అడుగుతాడు. దీనికి సోమదేవరాజు సమ్మతిస్తాడు.

ప్రోలయ్య, కాపయ్యలు సైనికులను, నగరాన్ని ఏర్పాటు చేసే పనిలో ఉంటారు. నగరానికి ప్రతాపరుద్ర నగరం అని పేరు పెట్టాలనుకుంటారు. కాపయ్య, వేమారెడ్డి ప్రతాపరుద్ర చక్రవర్తి బ్రతికే ఉన్నాడని అతను ఢిల్లీ సుల్తానుల బంధాల నుండి తప్పించుకొని సరైన సమయానికి వచ్చి తన సైన్యాన్ని ముందుకు నడిపిస్తారని ప్రజల్లో ప్రచారాన్ని కావిస్తుంటారు. ఈలోగా ఢిల్లీ సుల్తాను ఘయాజుద్దీన్ మరణిస్తాడు. అతని కొడుకు ఉలూఘ్ ఖాన్ సుల్తాన్ అవుతాడు. దీనితో ప్రోలయ్య

నాయకుడు మొదలైన ఆంధ్ర అభిమాన నాయకులు ఓరుగల్లును సులభంగా దక్కించుకోవచ్చు అని అనుకుంటారు.

అనేగొందెరాజు సోమదేవరాజు ఒకరోజు విద్యారణ్యయతీంద్రున్ని కలుస్తాడు. అక్కడ విద్యారణ్యుడు ఢిల్లీ సుల్తాన్ మరణ వార్త తదుపరి జరగబోవు కార్యాలను సోమదేవరాజుకు తెలియజేస్తాడు. దానికి మొదట తీరాంధ్ర ప్రాంతంలో కాపయ్య వేమారెడ్డి చేస్తున్న పనిని తెలియజేస్తూ వారిని కలిసి వారితో కూడి సుల్తానులకు వ్యతిరేకంగా పోరాడమంటాడు. దానికంటే ముందు కృష్ణ, తుంగభద్ర మధ్య ఉన్న ప్రాంతాలన్నింటినీ నీవు వశపరుచుకోవడం మంచిదని చెప్తాడు.

ఢిల్లీ సుల్తాను మరణించడంతో అతని కొడుకు ఉలూఘ్ ఖాన్ పట్టాభిషేక మహోత్సవాన్ని జరుపుకుంటూ ఉంటాడు. అదే సమయంలో ఆంధ్ర భూమండలాధ్యక్షుడుగా పోలయ్య తీరాంధ్ర ప్రాంతంలో స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకోవాలని పథకం వేస్తారు. ఢిల్లీలో పట్టాభిషేకం ప్రతాపరుద్ర నగరంలో స్వాతంత్ర్య ప్రకటన రెండూ ఒకేసారి జరుగుతాయి. ఈ విషయం తెలియగానే ఢిల్లీ సుల్తాను ఆ తిరుగుబాటును అణిచివేయాలని వజీర్ మాలిక్ కు ఆదేశాలిస్తాడు.

అప్పటికే ఢిల్లీ సుల్తానుల వశమైపోయిన ఓరుగల్లు సైన్యానికి అబ్దుల్ రజాక్, దేవగిరి సైన్యాలకు హిదయతుల్లా ఆధిపత్యం వహించి వారు ప్రోలయ్య, కాపయ్య సేనలపై పడతారు. కాపయ్య హిదయయతుల్లా సైన్యంతో పోరాడితే, ప్రోలయ్య ఓరుగల్లు సైన్యం అబ్దుల్ రజాక్ తో పోరాడుతాడు. పోరాటం అతి కష్టంగా జరుగుతుండగా వేమారెడ్డి సైన్యంతో రావడంతో ఆనాడు ఆంధ్రులు సుల్తానులపై ప్రథమ విజయాన్ని సాధిస్తారు.

ఢిల్లీ సుల్తానుకు వ్యతిరేకంగా సాగించిన ప్రథమ పోరాటంలో విజయం సాధించారని తెలిసి అనెగొందె రాజు సోమదేవరాజు తమకు సాయంగా ఉండాలని తద్వారా మహమ్మదీయులకు వ్యతిరేకంగా మీతో కలిసి పోరాడాలని కోరుతూ తన సోదరుడైన అన్నమదేవున్ని ప్రోలయ నాయకుడి దగ్గరకు రాయబారిగా పంపుతాడు.

వీరి మధ్య చర్చలు అనంతరం ఒక పథకం ప్రకారం మహమ్మదీయులను దెబ్బతీయాలని అందుకు ఒకరికి ఒకరు సహాయంగా ఉండాలని చర్చలు జరుగుతాయి. సుల్తాన్ కు వ్యతిరేకంగా మేము కూడా ఎదురు తిరగాలనుకుంటున్నాం అయితే మాది చిన్న రాజ్యం కాబట్టి మీ సహాయం కోసం వచ్చామని అన్నమ దేవుడు చెబుతాడు. తప్పకుండా సాయం అందిస్తామని అయితే మొదట దేవగిరిలోని కోటలపై తిరుగుబాటు చేస్తూ మీ శక్తిని పెంచుకోనని వీరికి వేమారెడ్డి సహాయంగా ఉంటాడని పోలయ్య నాయకుడు చెప్తాడు.

మీరు దేవగిరి, కంపలి కోటలపై దాడి చేస్తుండగా సుల్తాను దృష్టి తుంగభద్రపై పడుతుందని, అప్పుడు ఓరుగల్లువైపు వెళ్ళొచ్చని అదే సమయంలో హోయసలులు కూడా తిరుగుబాటు చేస్తే సుల్తానుకు ఏమి చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడుతుందని చెబుతూ అందుకు హోయసలుల సహాయం కోరడానికి కాపయ్యను వెళ్ళమని ఆదేశిస్తాడు.

ఓరుగల్లుపై పట్టు సాధించడానికి ప్రోలయ్య, అన్నమంత్రి, కాపయ్య, వేమారెడ్డి ఒకపక్క. వీరికి సాయంగా మహమ్మదీయులను అణచి హైందవాన్ని ఉద్ధరించాలని సోమదేవరాజు అతని సోదరుడు కలిసి దేవగిరి కంపలిలో తిరుగుబాటు చేస్తుండగా అదే సమయంలో హోయసలులు కూడా తిరుగుబాటు చేస్తే తమ పని సులభం అవుతుంది. అందుకు కాపయ్య అన్నమదేవునితో కలిసి ద్వారసముద్రంకు వెళ్లి హోయసలుల సహాయాన్ని అడగడం తద్వారా వీరి కార్యాన్ని సుఖము చేసుకోవడం వీరి పథకం. హోయసల రాజు మూడవ బల్లాలుడు వీరితో అంగీకరిస్తాడు. అవసరమైతే సుల్తానుకు వ్యతిరేకంగా పోరాడడానికి కూడా సహాయం చేస్తా అంటాడు.

కాపయ్య హోయసలుల సాయం అడిగి తిరిగి వచ్చేసరికి పోలయ్య గుండెపోటుతో మరణిస్తాడు. ఆ తర్వాత కాపయ్య ఆంధ్ర భూమండలాధ్యక్షుడిగా నియమించబడతాడు. ఈలోగా ఓరుగల్లులో నుండి మహమ్మదీయ సైన్యాలు వీరి పైకి వస్తున్నాయని తెలిసి సోమదేవరాజుకు సాయంగా వేమారెడ్డిని పంపాలని అలా చేస్తే దేవగిరి, కంపలి సైన్యాలు మన పైకి రాకుండా ఉంటాయని చెప్తాడు. అప్పుడు కేవలం ఓరుగల్లు సైన్యాలను మాత్రం ఎదుర్కొంటే సరిపోతుందని పథకం వేస్తాడు. సోమదేవరాజు వేమారెడ్డి సాయంతో కృష్ణ, తుంగభద్ర అంతర్వేదిలోని ముసలిమడుగు, పాతాని కోట, కందనవోలు, కల్వకొలను, రాచూరు, గంగినేని కోటలను జయించారు. ఈ విషయం తెలిసిన దేవగిరిలోని వజీర్ మాలిక్ వారిపైకి కొంత సైన్యాన్ని పంపుతాడు. ఈలోగా ఓరుగల్లు సైన్యం కాపయ్య చేతి దాటికి ఆగలేక వెనుకంజ వేస్తున్నాయని తెలిసి వజీర్ మాలిక్ అక్కడికి కూడా కొంత సైన్యాన్ని పంపుతాడు.

సోమదేవరాజుకు అద్దంకి నుండి సహాయంగా కొంత సైన్యం వచ్చిందని తెలియగానే వజీర్ మాలిక్ కంపలి నుండి మాలిక్ నబిని వెళ్లి అనేగొందిని ఆక్రమించమంటాడు. అప్పటికే అనేగొందిలో సిద్ధంగా ఉన్న అన్నమదేవుడు కాపలిసేనలను ఓడించి మాలిక్ నబిని బంధిస్తారు. కంపలి సైన్యాలు ఓడిపోయాయని దేవగిరిలో వజీర్ మాలిక్కి తెలియడంతో అతను అనేగొందికి కొంత సైన్యాన్ని పంపిస్తాడు. ఇది ముందే ఊహించినప్పటికీ అన్నమ దేవునికి ఏమి చేయాలో అర్థం కాదు. అయితే ఆ సమయానికి ద్వార సముద్రం నుండి హోయసలుల సాయం అందడంతో ఒక పథకం ప్రకారం వారిపై దాడి చేసి విజయాన్ని సాధిస్తారు.

ఇలా సోమదేవరాజు, వేమారెడ్డి సాయంతో కోటలను ఆక్రమించుకోవడం. అదే సమయంలో అన్నమదేవుడు ద్వారా సముద్రపు సైన్యాల సహాయంతో వజీర్ మాలిక్ సైన్యాన్ని ఓడించడం. అలాగే కాపయ్య ఓరుగల్లుపై వచ్చిన సైన్యాన్ని చిత్తు చేయడం జరుగుతుంది.

ఢిల్లీ సుల్తాన్ ఉలుఘ్ ఖాన్ సుల్తాన్ మహమ్మద్ బీన్ తుగ్లక్ గా మారిన తర్వాత దక్షిణాపథాన జరుగుతున్న తిరుగుబాట్ల కారణంగా కలత చెందుతాడు. తీరాంధ్ర ప్రాంతమంతా పోలయ్య వశమైపోయిందని అతడు మరణించినా కాపయ్య నాయకుడు ఒక ఉపద్రవంలా మారాడని. ఇదిలా ఉందనుకుంటే తుంగభద్రా నది తీరాన ఉన్న సోమదేవుడు ఆ ప్రాంత కోటలను

ఆక్రమించాడని దేవగిరి, కంపలి ఓరుగల్లులో చాలా భాగం వారి వశమయ్యాయని బాధపడుతూ ఈ తిరుగుబాట్లను అణిచివేయాలని లేదంటే పెద్ద ప్రమాదం సంభవిస్తుందని అనుకుంటాడు.

అనుకున్నదే తడవుగా కంపలిపై దండయాత్ర చేసే సమయంలో బందీలుగా తీసుకువచ్చి మహామ్మదీయులుగా మార్చబడిన హరిహర రాయలు(ఖాసిం), బుక్కరాయలను(అబ్దుల్లా) ఒప్పించి *"మీరు దక్షిణపథానికి వెళ్ళాలి అచ్చట మీ రాజ్యమైన కంపలిని ముందుగా పట్టుకోవాలి. ఆ తరువాత హోయసలుల్ని బెదిరించి వారు మీకు పూర్తిగా లొంగేటట్లు చూసుకోవాలి. ఆ తర్వాత తుంగభద్ర ప్రాంతాన్ని, తీరాంధ్ర ప్రాంతాన్ని జయించాలి. అలా జయిస్తే ఆ ప్రాంతానికి మిమ్మల్నే మా ప్రతినిధుల్ని గావిస్తాము"* (ఓరుగల్లు పునరాక్రమణ నవల. ఆంధ్రప్రదేశ్ మాస పత్రిక, డిసెంబర్, 1972: 35) అని ఒక పథకాన్ని వేస్తాడు.

ఢిల్లీ సేనలో హరిహర బుక్కరాయల ఆధిపత్యంలో దేవగిరికి చేరుకుంటాయి. ఆరోజు రాత్రి హరిహర రాయలకు నిద్ర పట్టకపోవడంతో ప్రాణాల కోసం తను మతాన్ని విడిచి మహమ్మదీయున్ని అయ్యాను. ఇప్పుడు పదవికోసం తనవారినే నాశనం చేయడానికి సమ్మతించాను. అని ఆలోచిస్తూ సోమదేవరాజుతో సంధి చేసుకోవాలనుకుంటాడు. రాయబారం పంపుతాడు. రాయబారం విఫలమవడంతో ఇరు వర్గాల మధ్య యుద్ధం మొదలవుతుంది. మొదటిరోజు యుద్ధం ఘోరంగా జరుగుతుంది. ఖాసిం (హరిహరరాయలు) హిందూ సైనికుల తెగువను చూసి ఆశ్చర్యపోతాడు. ఆరోజు రాత్రి విద్యారణ్యయతీంద్రుడు రహస్యంగా కాసింఖాన్ ను కలిసి అక్కడున్నది హరిహర రాయలని తెలుసుకొని హైందవానికి మహమ్మదీయులు చేస్తున్న కీడుని ఇతరత్రా చెడు పనులను చెప్పి వారిని హైందవసేనలో కలిసిపోవాలని అతనికి ఉపదేశాన్ని ఇస్తాడు.

హరిహర బుక్కరాయలు విద్యారణయతీంద్రుడు చెప్పినట్లు మరుసటినాడు రణరంగంలో ముస్లిం సైనికులకు అవకతవక ఆదేశాలు ఇవ్వడంతో హిందూ సైన్యం రెచ్చిపోయి ముస్లిం సేనలపై విరుచుకుపడతాయి. ముస్లింసేనలు చివరికి పారిపోతాయి. అదే సమయంలో జై ఆంధ్ర అంటూ హరిహర బుక్కరాయలు ఆంధ్ర సైన్యంలో కలిసిపోతారు. దీనితో వారికి ఆ యుద్ధంలో విజయం చేకూరుతుంది. ఆ తర్వాత విద్యారణ్యయతీంద్రుడు, హరిహర బుక్కరాయలు, సోమదేవరాజు, అన్నమదేవుడు, కాపయ్య, వేమారెడ్డి కలిసి తర్వాత జరగవలసిన దానిని గురించి చర్చించుకుంటారు. ఈ చర్చలో భాగంగా ఢిల్లీ సుల్తాను ఎలా ఎదుర్కోవాలో ఒక పథకం ప్రకారం మాట్లాడుకుంటారు. ఇదే సమయంలో హరిహర, బుక్కరాయలు చేసిన మేలుకి సోమదేవరాజు జయించిన కోటలను అతని అనేగొంది రాజ్యాన్ని బహుమతిగా ఇస్తాడు. అయితే ఆ తర్వాత విద్యారణ్య సలహా ప్రకారం అనేగొంది అంత సురక్షిత ప్రాంతంగా లేదని ఒక కొత్త రాజధాని నగరాన్ని ఏర్పాటు చేసుకోవాలని దానికోసం ఋష్యమూక పర్వతం వద్ద నిర్మిస్తే బాగుంటుందని నిర్ణయించుకుంటారు.

హరిహర బుక్కరాయలు అనేగొంది పాలన స్వీకరించాక సోమదేవరాజు, అన్నదేవరాజులను నిజమైన రాజులుగా భావించి వారిని సలహాదారుడిగా సైన్యాధిపతిగా చేసుకొని రాజ్యంలో అనేక సంస్కరణలను చేస్తారు. తర్వాత ఒక శుభ ముహూర్తాన విద్యారణ్యయతీంద్రుల చేతుల మీదుగా విజయనగరం అనే నగరానికి పునాది పడుతుంది.

కాసిం అబ్దుల్లాలు(హరిహర బుక్కరాయలు) సుల్తాను మోసం చేశారని అందుకు శృంగేరి పీఠాధిపతి కుట్ర కూడా ఉందని తెలుసుకుని వారిపై చాలా కోప్పడతాడు. తిరుగుబాటుకు సంసిద్ధం చేసుకుంటాడు. అయితే మొదట బలంగా ఉన్న తీరాంధ్ర ప్రాంతాన్ని చేపట్టి ఆ తర్వాత ఇతరులను అణచాలనుకుంటాడు. ఢిల్లీ సుల్తాన్ ఓరుగల్లు చేరుకొనే సమయానికి ఆ ప్రాంతం అంతా ఒక భయంకరమైన వ్యాధితో హడలిపోతూ ఉంటుంది. ఆ మహమ్మారి వేలాది మంది ప్రాణాలను బలిగొంటుంది. చివరికి సుల్తాను కూడా ఆ మహమ్మారి బారిన పడి ఎలాగోలా బ్రతికి బయటపడతాడు. సుల్తాన్ ఆ వ్యాధితో బలహీన పడిపోవడంతో ఓరుగల్లుపై దండయాత్ర అనే ఆలోచనకు స్వస్తి చెప్పి ఢిల్లీకి వెళ్లిపోతాడు.

సుల్తానును ఎదుర్కోవడానికి అన్నీ సిద్ధంగా ఉంచుకున్న కాపయ్యకు ఈ విషయం తెలియడంతో ఆనందపడతాడు. ఆ తర్వాత మహమ్మారి పూర్తిగా నిర్మూలించింది అని తెలిసి ఇదే మంచి సమయం అనుకుని కాపయ్య తీరాంధ్ర సేనలతో ఓరుగల్లు పైకి దానిని ఆక్రమించుకోవాలని బయలుదేరుతాడు. ముందే అనుకున్నట్లు ఆ సమయానికి అనేగొంది సైన్యాలు, హోయసలుల సైన్యాలు అతనికి తోడుగా వస్తాయి. అయితే ఓరుగల్లు నగరాన్ని ఆ కోటను ఆక్రమించడం అంత సులువు కాదని అన్న మంత్రి సహాయంతో ఒక పథకం ప్రకారం అక్కడున్న సైన్యాలతో పోరాడి చివరికి దాన్ని చేజిక్కించుకుంటాడు కాపయ్య.

నవలా విశ్లేషణ

పి. రాజగోపాల నాయుడు రాసిన రెండవ చారిత్రక నవల 'ఓరుగల్లు పునరాక్రమణ'. ఇందులోని కథ 14వ శతాబ్దం నాటిది. ఈ నవల 1972-73 లో ఆంధ్రప్రదేశ్ మాసపత్రికలో ప్రచురితమైంది. మహమ్మదీయ రాజులు దక్షిణాపథంలో ఉన్న హైందవ రాజ్యాలైన దేవగిరి, ఓరుగల్లు, హోయసల, చోళ రాజ్యాలపైకి దండెత్తి వారిని దోచుకుంటూ క్రమంగా హైందవమతాన్ని నిర్మూలించి మహమ్మదీయ మతాన్ని నెలకొల్పాలని చూస్తారు. అయితే ఈ క్రమంలో ఓరుగల్లు చక్రవర్తి ప్రతాపరుద్రుడు బంధించబడి ఢిల్లీకి బందీగా పోయినప్పటికీ ఓరుగల్లు రాజ్యాన్ని ఎలాగైనా తిరిగి సంపాదించాలని అన్నమంత్రి, కోలని రుద్రదేవుడు, సింగనాయకుడు, పోలయ్య నాయకుడు, కాపయ్య నాయకుడు, గణపతి నాయకుడు, పెదకోమటి వేమారెడ్డి కలిసి ఒక సైన్యాన్ని, నగరాన్ని ఏర్పరచుకొని వారితో పోరాడి ఏ విధంగా విజయాన్ని సాధిస్తారు అన్నదే ఇందులోని ప్రధాన కథ. ఈ క్రమంలో విద్యారణ్యయతీంద్రుడు మాట మేరకు అనెగొంది రాజులు వీరికి తోడవడంతో ఓరుగల్లు పునరాక్రమణ ఇంకా సులభం అవుతుంది.

ఈ నవలలో హైందవమతం నిలబడాలని ఆంధ్రులందరూ ఒకటై ధైర్యంతో, సాహసంతో ఒకరికొకరు సాయం చేసుకుంటూ పోరాడిన వైనాన్ని రచయిత చాలా చక్కగా చూపించారు. ఆంధ్ర భూమండల అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రోలయ్య చనిపోయిన తర్వాత ఆ నాయకత్వాన్ని కాపయ్య తీసుకొని వేమారెడ్డి, అనెగొంది, హోయసల రాజులు సహాయంతో మహమ్మదీయులను పథకం ప్రకారం ఓడించిన విధానాన్ని ఈ నవలలో మనం చూడవచ్చు.

విజయనగర సామ్రాజ్య నిర్మాతలైన హరిహర బుక్కరాయలు ఢిల్లీ సుల్తానుల చేతుల్లో బంధించబడి ముస్లింలుగా మార్చబడి ఆ తర్వాత వారికి సాయంగా వారి సైన్యాలకు సైన్యాధ్యక్షుడిగా దక్షిణ భారతదేశంలోని హైందవ రాజ్యాలపైకి దండెత్తి వచ్చి చివరికి విద్యారణ్యయతీంద్రుని ఉపదేశం మేరకు ఏ విధంగా ఆంధ్రులకు సాయం గావించారో ఈ నవల మనకు తెలియజేస్తుంది. ఆ తర్వాతే అనెగొంది రాజులు వీరికి ఆ రాజ్యాన్ని బహుమతిగా ఇవ్వడంతో విద్యానగరమనే మారుపేరు గల విజయనగర సామ్రాజ్యం ఏర్పడిన విధానం కూడా ఈ నవల ద్వారా మనకు తెలుస్తుంది.

ఈ విధంగా 1975 వరకూ వచ్చిన చిత్తూరు జిల్లా నవలా సాహిత్యంలో దేశాభిమానాన్ని కలుగజేస్తూ, స్వేచ్ఛా స్వాతంత్ర్యేచ్ఛలను రేకెత్తింస్తూ, చరిత్రను సంస్కృతిని తెలియజేస్తూ చాందసుల్తానా, తానీషా, రామానుజుని ప్రతిజ్ఞ, ఓరుగల్లు పునరాక్రమణ అనే నాలుగు చారిత్రక నవలలు; సంఘసంస్కరణ దృక్పథంతో సమాజంలోని సాంఘిక దురాచారాలైన బాల్య వివాహ వ్యవస్థ పట్ల, స్త్రీల అసమానతల పట్ల, వరశుల్క/ కన్యాశుల్క సమస్యల పట్ల, మద్యపాన అవస్థలు, శకునాలు, సముద్రయానంపై హిందువులకుగల విశ్వాసాల పట్ల, వేశ్యావృత్తి పట్ల, వెట్టి చాకిరీ పట్ల వ్యతిరేకలను, ఉచితానుచితాలను తెలియజేస్తూ, వితంతు వివాహ అభిలాషను తెలుపుతూ రత్నాబాయి, భానుమతి, మోహన, భిక్షుకి వంటి నవలలు; అస్తిత్వవాద దృక్పథాన్ని తెలియజేస్తూ అనుబంధాలు, మళ్ళీ వసంతం, అసురసంధ్య వంటి నవలలు; రాయలసీమలో దాపురించిన భయంకర కరువును చిత్రిస్తూ మొగిలి నవల; సమాజంలో జరుగుతున్న అన్యాయాలను వ్యంగ్యంగా ఎత్తిపోడుస్తూ, స్త్రీల పెత్తన్నాన్ని ఎత్తి చూపుతూ చిన్న ప్రపంచం సిరివాడ, గాడిద బ్రతుకులు నవలలు; డబ్బు మీద అత్యాశగల మధ్యతరగతి జీవితాన్ని తెలియజేస్తూ త్రిశంకుడి స్వర్గం అనే నవల; జీవితంలో మనిషికి ఎదురయ్యే ఉత్తాన పతన్నాలకు, తనకు తను చేసుకొనే కొన్ని పొరపాట్లకు బలైపోయే జీవితాలను, నిజాయితీగల వ్యక్తిత్వాలను తెలియజేస్తూ ఇంద్రధనుస్సు, దూరతీరాలు అనే నవలలు ఇలా అనేక రకాల వస్తు వైవిధ్యంతో నవలలు వచ్చాయి.

పైన చెప్పిన వాటినన్నింటినీ ఈ అధ్యాయంలో సోదాహరణంగా వివరించాను. తర్వాతి అధ్యాయంలో చిత్తూరు జిల్లా కథా సాహిత్యానికి సంబంధించిన వస్తు వైవిధ్యాన్ని చెప్పబోతున్నాను.

అధ్యాయం – 5

చిత్తూరు జిల్లా
కథాసాహిత్యం – వస్తు వైవిధ్యం

5.0. పరిచయం:

ముందు అధ్యాయంలో చిత్తూరు జిల్లా నవల పట్ల పూర్వ పరిశోధకుల, విమర్శకుల, అభిప్రాయాలను, అలాగే చిత్తూరు జిల్లా నవలా సాహిత్యంలోని వస్తు వైవిధ్యతను తెలుసుకున్నాం. ఈ అధ్యాయంలో చిత్తూరు జిల్లా కథా సాహిత్యంలోని వస్తు వైవిధ్యతను గురించి చెప్పే ముందు, చిత్తూరు జిల్లా కథానిక పట్ల పరిశోధకుల, విమర్శకుల అభిప్రాయాలను కొంత వరకూ చూసి ఆ తర్వాత వస్తు వైవిధ్యతను వివరించే ప్రయత్నం చేస్తాను.

5.1. చిత్తూరు జిల్లా కథానిక – పూర్వ పరిశోధకుల, విమర్శకుల అభిప్రాయాలు:

తెలుగు నవలాసాహిత్యం పైన ఏవిధంగానైతే పరిశోధన గ్రంథాలు, విమర్శా గ్రంథాలు వెలువడ్డాయో అదే విధంగా కథానికా సాహిత్యం పైన కూడా అనేక గ్రంథాలు వెలువడ్డాయి. వీటిలో చిత్తూరుజిల్లా కథానికకు ప్రాధాన్యతనిచ్చిన గ్రంథాలను, రచయితల అభిప్రాయాలను మాత్రమే ఇక్కడ ప్రస్తావిస్తాను.

మధురాంతకం రాజారాం 1967లో **"చిత్తూరు జిల్లా సాహిత్యచరిత్ర"** అనే చిన్న గ్రంథాన్ని రాశారని ముందే చెప్పాను. ఇందులో వీరు ప్రస్తావించిన రచయితలలో కథలు రాసిన వారి వివరాలు ఇలా ఉన్నాయి–

1. పూతలపట్టు శ్రీరాములు రెడ్డి– వీరి పద్య రచనలు, అనువాద రచల గురించి మాత్రమే తెలియజేశారు. అప్పటికే భారత కథానిధిలో(1928 సెప్టెంబర్) వీరి కథ (ఒక ఆదియాంధ్రభక్తుని జీవిత చరిత్ర) ఒకటి ప్రచురించబడింది. ఈ విషయం రాజారాం గారికి తెలీయకపోయి ఉండవచ్చు.

2. తాళ్ళూరు ఆర్కుగంపిళ్ళె – వీరు రాసిన కథల వివరాలు చెప్పకపోయినప్పటికీ చిత్తూరు జిల్లా నుండీ "తెలుగు తల్లి" అన్న మాస పత్రిక వెలువడుతూ ఉండేదని, ఈ పత్రిక సంపాదకులలో ఒకరైన తాళ్ళూరు ఆర్కుగంపిళ్ళె కథలు అందులో వచ్చాయని తెలియజేశారు. (పై వీరిద్దరి కథలను ఇటీవల అప్పిరెడ్డి హరినాథ రెడ్డి , తవ్వా

వెంకతయ్యలు వెలుగులోకి తెచ్చిన విషయం అందరికీ తెలిసినదే).

3. పి. రాజగోపాలనాయుడు – వీరు కథలు రాశారన్న మాట తప్ప మరే వివరాలూ చెప్పలేదు.

4. రాజేంద్ర – గొడుగులాంటి మనిషి, పిల్ల మెచ్చిన వాడు (కథలు)

5. కలువకొలను సదానంద – ఛత్రపతి, రక్తయజ్ఞం, దానవులు(సదానందకి మంచి పేరుతెచ్చిన వ్యంగ్య కథలుగా వీటినిచెప్పారు)

6. ఆర్.యస్. సుదర్శనం – కథల పేర్లు చెప్పకపోయినప్పటికీ 'తెలుగు కథానికా వికాసానికి ఎంతో పుష్టిని చేకూర్చినవి సుదర్శనం గారి కథలు' అని చెప్పారు.

7. సి. వేణు – నవ్విన ధాన్యరాశి (కథ)

8. ముంగర సంకర రాజు – రహీం కూతురు(కథా సంపుటి)

9. కాసారం కుప్పుస్వామి – బతుకు బరువు (కథ)

10. ఇరువారం లోకనాథం – మరీచిక (కథల సంపుటి)

తర్వాత మధురాంతకం దొరస్వామి, నైనారి చిన్నప్ప, కాశీనాథ విశ్వం, పులికంటి కృష్ణారెడ్డి, కాణిపాకం లింగన్న, ఓలేటి కృష్ణ, వి. రఘునాథ రెడ్డి, సనగరం పార్థసారధి లాంటి వారు కథలు రాశారని, వాటిలో కొన్ని పత్రికలలో వెలుగు చూశాయని మాత్రం చెప్పారు. మధురాంతకం రాజారాం పైన తెలిపిన కథా రచయితలలో చాలా మంది గురించి సాహిత్యలోకానికి తెలీదు అంటే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. దానికి కారణం వీరు ఎప్పుడో ఒకప్పుడు కొన్ని రచనలు చేసి, ఆ తర్వాత స్తబ్దంగా వుండిపోయి, ఆ రాసిన రచనలనైనా వెలుగులోకి తీసుకు రాకపోవడం. అందుకే వీరు మరుగున పడిపోయారు.

మధురాంతకం రాజారాం కె. సభా గురించి వ్యాసం రాస్తూ(తెలుగు కథకులు కథన రీతులు) రాయలసీమలో ఆధునిక సాహిత్య సంచలనం బాగా ఆలస్యంగా ప్రారంభమైందని అందుకు గల కారణాలుగా రాయలసీమ వాస్తవ్యుల తెలుగు భాష, రాయలసీమ పండిత కవులు వీరగ్రాంథిక భాషావాదులు కావడం, రాయలసీమ జన సమూహాల్లో వినియోగమవుతున్న సజీవ భాషనే ఎందుకు ఎన్నుకోకూడదు అని చెప్పే భాషావేత్తలు ఇక్కడ లేకపోవడం, రాయలసీమ ప్రజలకు, వారి భాషకు, వారి సమస్యలకు ప్రాధాన్యతనిచ్చే పత్రికలు లేకపోవడం వంటి నాలుగు అంశాలను తెలియజేశారు. అలాగే *"ఉత్తరాంధ్రలో చింతా దీక్షితులు, చలం, కుటుంబరావు, గోపీచంద్, బుచ్చిబాబు, పద్మరాజు లాంటి వీరు మిగిలిన రచయితలు విరివిగా సాహిత్య కేంద్రాలను పండించే (1945-50) నాటికి రాయలసీమలో చెప్పుకోదగ్గ రచయితలు ఒక్కరైనా*

లేదు. అట్టి పరిస్థితుల్లో రెండు బండల మధ్యగల నేరియలో నుంచి అంకురించి, తన ఉనికికోసం, మనిషి కోసం ప్రకృతితో పోరాడే రావి మొక్కలా ఎదిగి, శాఖోపశాఖల మహావృక్షంగా విస్తరిల్లిన రచయిత కె. సభాగారు" (తెలుగు కథకులు కథన రీతులు, 1998: 187) అని అంటారు. ఇక్కడ చిత్తూరు జిల్లా నుండే కాదు రాయలసీమ నుండి కథా రచన చేపట్టిన వారిలో మొదటివారు సభా అన్నది వీరి అభిప్రాయం.

అయితే ఇక్కడొక విషయం గుర్తించాలి, సభా కంటే ముందు తాళ్ళూరు ఆర్కుగంపిళ్ళె గారి కథలు "తెలుగుతల్లి" పత్రికలో వచ్చాయని తెలుస్తున్నప్పటికీ మధురాంతకం రాజారాం గారు చిత్తూరు జిల్లా కథానికకు సభానే ఆద్యుడని చెప్పడం.

వల్లంపాటి వెంకట సుబ్బయ్య 'చిత్తూరు జిల్లాలో కథా వికాసం' గురించి వ్యాసం రాస్తూ... తెలుగు కథ పుట్టేనాటికి చిత్తూరు జిల్లాయే లేదు అని చెప్తూ... జిల్లా ఏర్పడిన విధానాన్ని, దాని నైసర్గిక స్వరూపాన్ని అక్కడ గల ప్రతికూల పరిస్థితులనూ తెలియజేస్తూ..."ఇలాంటి వ్యతిరేఖ, నిరాశామయ వాతావరణంలో నుంచీ ఆశ్చర్యకరంగా పుట్టుకొచ్చిన రచయిత సభా" అని అన్నారు. చిత్తూరు జిల్లాలో కథానికకు ఆద్యుడు సభా అని వీరు అభిప్రాయంపడ్డారు.

వల్లంపాటి వెంకటసుబ్బయ్య 'రాయలసీమలో ఆధునిక సాహిత్యం సామాజిక సాంస్కృతిక విశ్లేషణ' అనే పుస్తకంలో సభాను మొదటి రాయలసీమ కథారచయితగా చెప్తూ ఇలా అన్నారు. "ఇంత వరకూ విమర్శకలోకంలో చిత్తూరుజిల్లాకు చెందిన కె. సభాను మొదటి కథారచయితగా పేర్కొనే ఆనవాయితీ ఉండేది. మధురాంతకం రాజారాం, నేనూ, సింగమనేని నారాయణ అనేక సందర్భాలలో కె. సభానే మొదటి రాయలసీమ కథారచయితగా పేర్కొన్నాము. అతడు రాసిన మొదటి కథ "కడగండ్లు" 1944 ఏప్రెల్ నెలలో "చిత్రగుప్త" పత్రికలో ప్రచురించబడింది. ఈ కథతో పోల్చినప్పుడు రామకృష్ణ రాసిన మొదటి కథ "చిరంజీవి" దానికంటే మూడు సంవత్సరాల క్రితమే ప్రచురించబడింది. కాలక్రమం ఆధారంగా మాత్రమే ఆలోచిస్తే తొలి రాయలసీమ కథారచయిత అన్న గౌరవం జి. రామకృష్ణకే దక్కుతుంది".

జి. రామకృష్ణ 1941 నుంచి 1995 వరకూ వేసిన ప్రభావం ఏమీ లేదని, సభా 1944 నుండి 1980 వరకూ వివిధ ప్రక్రియల్లో చేసిన రచనలు, వారి సాహితీ కృషి ప్రత్యక్షంగానో పరోక్షంగానో ప్రసరించని తొలితరం కథారచయిత చిత్తూరు జిల్లాలో లేరని వీరు అభిప్రాయ పడుతూ, ఆ కారణంగా సభాను రాయలసీమ మొదటి కథా రచయితగా గుర్తించారు. ఇదే అభిప్రాయాన్ని వీరు కథాశిల్పంలోకూడా చెప్పారు.

రాయలసీమ కథపైన పరిశోధన చేసిన వేంపల్లి గంగాధరం చిత్తూరు జిల్లాలో తొలి కథకుడుగా సభాను పేర్కొన్నారు.

రాచమల్లు రామచంద్రారెడ్డి, శాంతి నారాయణ, కె. లక్ష్మీనారాయణ, కేతు విశ్వనాథ రెడ్డి, రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, శశిశ్రీ మొదలైనవారు ఆయా సందర్భాలలో ఆధునిక సాహిత్యంలో రాయలసీమ వెనుకుబాటుకు గల కారణాలను, రాయలసీమలో తొలి కథా రచయిత ఎవరు అనే

విషయాల పట్ల చర్చించారు కానీ ప్రత్యేకంగా చిత్తూరు జిల్లా తొలి కథారచయిత ఎవరు అనే విషయం పట్ల చర్చ చేయలేదు అందుకే వీరి అభిప్రాయాలను ఇక్కడ ప్రస్తావించలేదు.

5.2. చిత్తూరు జిల్లా కథానిక – వస్తు వైవిధ్యం:

1920లో చిత్తూరు జిల్లాలో నవలా సాహిత్యం ప్రారంభమైతే, 1927లో కథాసాహిత్యం మొదలైంది. వంద సంవత్సరాలు పూర్తి చేసుకోవడానికి దగ్గరలో ఉన్న చిత్తూరు జిల్లా కథాసాహిత్యాన్ని సుసంపన్న చేసిన, చేస్తున్న కథకులు యం.వి. పాపన్న గుప్తతో మొదలు పెడితే దాదాపు 120 మందికి పైగానే ఉన్నారు. వీరిలో నవలలు రాసినవారు కూడా చాలా మందే ఉన్నారు.

లభిస్తున్న సమాచారం మేరకు చూస్తే చిత్తూరు జిల్లా నుండి ఇప్పటి వరకూ 3000లకు పైగానే కథానికలు వచ్చి ఉండవచ్చని నా అంచనా. అలాగే లభ్యం కాని కథానికలు, అసలు ఇంత వరకూ దృష్టికే రాని కథానికలు కూడా ఉండి ఉండవచ్చు.

ఈవిధంగా చూస్తే చిత్తూరు జిల్లా నుండి వచ్చిన అన్ని కథానికలను సేకరించి వస్తు పరంగా, శిల్ప పరంగా విశ్లేషించడం అనేది ఒక్కరివల్ల సాధ్యమయ్యే పని కాదు. సంస్థాగతంగా చేయదగిన పని. అందుకని నా పరిశోధనా పరిమితుల దృష్ట్యా నేను పెట్టుకున్న పరిధులకులోబడి ఈ అంశాన్ని 1975వ సంవత్సరం వరకూ వచ్చిన కథానికలను మాత్రమే తీసుకొని, ఆ కథానికలను మాత్రమే వస్తు పరంగా విశ్లేషించే ప్రయత్నం ఈ అధ్యాయంలో చేస్తున్నాను.

1927 – 75 వరకూ చిత్తూరు జిల్లా నుండి దాదాపు మూడు వందలకు పైగానేకథలు వచ్చాయి. వాటిని వస్తు పరిశీలనా సౌలభ్యం కోసం రెండు విభాగాలుగా విభజించాను. అవి;

1. 1927 నుండి 1950 వరకూ వచ్చిన కథానికలు
2. 1951 నుండి 1975 వరకూ వచ్చిన కథానికలు

5.2. 1927 నుండి1950 వరకూ వచ్చిన చిత్తూరు జిల్లా కథానికలు:

1927 నుండి 1950 వరకు మొత్తం 20 కథానికలు వచ్చాయి. వివిధ రకాల వస్తు వైవిధ్యంతో కూడుకున్న ఈ ఇరవై కథలను పదమూడు అంశాలుగా విభజించి విశ్లేషించే ప్రయత్నం చేశాను.

5.2.1. మూఢవిశ్వాసాలకులకు సంబంధించిన కథలు:

నాటి నుండి నేటి వరకూ సమాజంలో మూఢ విశ్వాసాలు ప్రాధాన్యత చాలానే ఉందని చెప్పవచ్చు. శాస్త్ర పరిజ్ఞానం పెరుగుతున్న ఈ రోజుల్లో ఇంకా మూఢ నమ్మకాలను పాటించేవారు పల్లెటూర్లల్లో ఆ మాటకొస్తే అక్కడక్కడా పట్టణాలలో కూడా ఇంకా ఉన్నారు. ఇలాంటి మూఢ విశ్వాసాలపై వచ్చిన కథ శారద.

5.2.1.1. శారద: (యం. వి. పాపన్న గుప్త)

మూఢ విశ్వాసాలు, పూర్వ సంప్రదాయాలు ఒక నిండు ప్రాణాన్ని (కృష్ణారావు ప్రాణాన్ని) ఎలా బలి తీసుకుంటాయో తెలిపేదే ఈ కథలో వస్తువు.

కాంత లక్ష్మమ్మకు శారద ఒకటే కూతురు. తండ్రి చనిపోయాడు. శారద తండ్రి తాలూకా ఆఫీస్‌లో అటెండెంట్‌గా పనిచేస్తూ పైరు పంటల కాలంలో తిరిపెమెత్తుకొని వచ్చిన దానిని, జీతంతో కలిపి కాలం గడుపుతూ ఉంటాడు. బీదవాడయినా నలుగురిచే మంచి వాడనిపించుకుంటాడు. ఇలాగే నలుగురినీ ఆశ్రయించి చనిపోక ముందే శారదకు కృష్ణారావు కొడుకు ప్రసాదరావుతో పెళ్ళి చేసి ఉంటాడు.

ప్రసాదరావు చురుకు బుద్ధి గలవాడటం వల్ల ఆ కాలంలో ఆంగ్ల విద్యను అభ్యసించి ప్రథమ సంవత్సరం ప్రథమ పరీక్షలో ఉత్తీర్ణులైన అతి తక్కువ మందిలో ఒకడు. కొంత కాలానికి ఊరికి దూరంగా వేరే ఊరిలో తహసీల్దార్ ఉద్యోగం వస్తుంది. తండ్రి కృష్ణారావు పూర్వాచార పరాయణుడవడం వల్ల రజస్వల అయిన కోడలిని చెడ్డ నక్షత్రంలో కాపురానికి తీసుకురాకూడదని మరొక్క సంవత్సరం ఆగాలి అంటాడు. ప్రసాదరావును సంవత్సరం నుండి అత్తవారింటికి కూడా పంపడు. ప్రసాదరావు పెళ్ళై రెండు సంవత్సరాలైనా తండ్రి మాటకు లోబడి భార్యను కాపురానికి తెచ్చుకోడు. సంఘసంస్కార ప్రియుడు, మూఢ నమ్మకాలు నమ్మని ప్రసాదరావు భార్యకు దూరంగా ఉద్యోగం చేసుకుంటూ అక్కడి వారందరిచే మంచివాడని పేరు తెచ్చుకుంటాడు. ఇలా కొంత కాలం గడిచిపోతుంది. ప్రసాదరావుకు శారద పైనే ఎప్పుడూ ధ్యాస. ఎప్పుడెప్పుడు తన భార్యను తన దగ్గరికి తెచ్చుకుందామా అని ఆలోచిస్తూ ఉంటాడు. ఇలా కొంత కాలానికి ఎలాగైనా సరే తన భార్యను కాపురానికి తెచ్చుకోవాలని అత్తగారైన కాంతలక్ష్మమ్మ గారింటికి వెళ్తాడు. అత్తగారితో తన భార్యను పంపించాలని అడుగుతాడు. దీనికి కాంతలక్ష్మమ్మ *"చెడ్డ నక్షత్రమగుటచే రెండు సంవత్సరము లాగవలసి యుండేను. ఇంకనూ పది మాసములుండెనే. ఇప్పుడు శారదను బంపిన లోక నిందరాదా?"* (రాయలసీమ తొలితరం కథలు, 2015: 58) అని అనగా ప్రసాదరావు నేను అలాంటివన్నీ పట్టించుకోనని చెప్తాడు. కాంత లక్ష్మమ్మ చేసేదేమీలేక నీ ఇష్టం అని చెప్తుంది. దాంతో ప్రసాదరావు తన భార్యను తీసుకెళ్ళి సుఖంగా ఉంటారు.

ఇంతలో పిడుగులాగా శారదను తన అనుమతి లేకుండా, శాస్త్రవిరుద్ధంగా కాపురానికి తీసుకొచ్చాడని తెలిసిన తండ్రి దగ్గర నుండి కోపంగా రాసిన ఒక ఉత్తరం వస్తుంది. ఆ ఉత్తరంలో *"తనయా! లేక లేక కలిగిన వాడవే యయినను దుష్కర్ముడవగుటచే నిన్ను విసర్జించుకున్నాడను. ఇక నీ గతి నీది. నా గతి నాది. లోక నింద పడజాలను. గాన నేను పాషాణమును గొని యీలోకమును బాయుచున్నాడను"* (రాయలసీమ తొలితరం కథలు. 2015: 59) అని రాసి ఇంకా నీతల్లి నీదగ్గరకు రాకుండా ఉండాలని మాట తీసుకున్నానని రాస్తూ పిల్లలు పుట్టకుండా వంశక్షయమవ్వాలని ఆశీస్సులు ఇస్తున్నాను. ఇక నీ పాప కార్యములు నీవి అని రాసి ఆత్మహత్య చేసుకుంటాడు.

ఈ విధంగా రచయిత మూఢ విశ్వాసాలను ప్రోత్సహించే వారికి ప్రతినిధిగా కృష్ణారావు పాత్రను, వాటికి వ్యతిరేకంగా సమాజాన్ని మూఢ విశ్వాసాలు నుండి ముందుకు తీసుకుపోయే

వారికి ప్రతినిధిగా ప్రసాదరావు పాత్రను చిత్రీకరిస్తూ, మూఢ విశ్వాసాలపై తిరుగుబాటుతో రచయిత ఈ కథను రాశారు.

5.2.2. భోగపు మేళానికి సంబంధించిన కథలు:

భోగపుమేళాల పరిస్థితి ఇప్పటి సమాజంలో ఎలా ఉన్నా, పూర్వం మాత్రం భూస్వాములు, కాస్త డబ్బున్న వారు, వారి వారి ఇళ్ళల్లో జరిగే కొన్ని సుభకార్యాలకు ఇలాంటివి ఆనవాయితీగా పెట్టుకొనేవారు. వాటికి బానిసై కొంతమంది కుటుంబాలను కూడా వాడులుకునేవారు. అటువంటి పరిస్థితిని తెలిపే కథే కింది కథ.

5.2.2.1. భోగపు మేళములు: (సి. యస్. నీలకంఠయ్యర్)

భోగపు మేళముల వల్ల సమాజం ఏవిధంగా చెడిపోతుందో సోమసుందరుని కొడుకు జగన్నాథం పాత్ర ద్వారా తెలియజేయడమే ఇందులోని ఇతివృత్తం.

'భోగపు మేళములు' అనే కథలో భోగపు మేళములు లేని పెళ్ళి ఒక పెళ్ళేనా అని ఖచ్చితంగా పెళ్ళిలో భోగపు మేళములు ఉండాలని ఉత్తరం రాసిన బావ సోమసుందరుడికి ఏమని బదులు రాయాలి అని సత్యసాధనుడు కాగితం, పెన్ను తీసుకొని ఆలోచిస్తూ ఉంటాడు. *"ఒకవైపు సంఘ సంస్కరణమునకుఁ జేయూత నొసంగు వారును, మరియొక వైపు పాత పద్ధతుల ప్రోత్సహించుచు వైవారిని ప్రతిఘటించువారును ప్రపంచమున నున్నాను"* (రాయలసీమ తొలితరం కథలు. 2015: 162) అని ఆలోచిస్తూ ఇంకా ఎంత చెడ్డ ఆచారాలైనా వదలమని ఉన్నవారికి నవీన పద్ధతులు పనికిరావని, వేశ్యావృత్తి ఉన్నంతకాలం భోగపు మేళములను ఆపలేమని, సంస్కర్తలు ఒకవైపు పడుపు వృత్తిని మానుకోమని సుఖంగా కాపురం చేసుకోమని ప్రతి వేశ్య ఇంటికి పోయి హితోపదేశం చేస్తున్నారు. ఇలా సంఘ సంస్కర్తలు చాలా రకాలుగా ప్రయత్నించి చేసేదేమీలేక ఆలోచనల్లో పడ్డారు. ఏదైతే ఏమి వారి ప్రయత్నం మాత్రం హర్షించతగ్గది అని ఇలా ఆలోచిస్తూ జాబులో ఏమి రాయాలో అర్థం కాక తనే స్వయంగా వెళ్ళి మాట్లాడి రావడం మంచిదనుకొని బావగారి ఊరికి వెళ్తాడు. భోజనానంతరం వారి ఇద్దరి మధ్య పెళ్లిలో భోగపు మేళములు ఒకరు వద్దని, ఒకరు కావాలని, దానివల్ల ఏమీ నష్టం లేదని ఇలా కొంత సంభాషణ జరుగుతుంది. ఇంతలో సోమసుందరుని మిత్రుడు రావడంతో ఆ సంభాషణ అక్కడితో ఆగిపోతుంది.

చివరికి ఎంత చెప్పినా సోమసుందరుడు వినకపోయేసరికి పెళ్ళిలో భోగపు మేళములు పెట్టించవలసి వస్తుంది. చివరికి సోమసుందరుని కొడకు జగన్నాథం వేశ్యల బారినపడి భార్యను మర్చిపోయి తండ్రి ఆస్తులన్నీ వేశ్యలకే పెట్టేస్తాడు.

ఈ విధంగా రచయిత ఈ కథలో సమాజంలో భోగపు మేళములను ప్రోత్సహించేవారు చివరికి ఏమైపోతారో ఈ కథ ద్వారా తెలియజేశాడు.

5.2.3. స్త్రీ సమస్యలకు సంబంధించినకథలు:

సమాజంలో స్త్రీలు అనేక రకాలు సమస్యలకు గురవుతూ ఉంటారు. అటువంటి వాటిల్లో ఒంటరి స్త్రీ సమస్య ఒకటి. ఇలాంటి వారిపట్ల పురుషుల ప్రవర్తన కొంత నీచంగా ఉంటుంది. అలాంటి సమస్యను చిత్రించే కథే నా చిట్టితల్లి.

5.2.3.1. నా చిట్టితల్లి: (టి. కె. రంగస్వామి అయ్యంగార్)

బాల్యంలోనే భర్త చనిపోయిన స్త్రీలను పురుషులు ఏవిధంగా చూస్తారు, వారిపట్ల పురుషులు ఏ భావనలతో మసులుకుంటారు అనేది ఇందులో కథాంశం. ఈ కథలో రచయిత సమాజంలో బాల వితంతు సమస్యకు బాల్య వివాహాలే కారణమని కూడా తెలియజేశాడు.

నా చిట్టితల్లి కథలో చిత్తూరు నుండి షోళింగరుకు పోయే కార్ల యజమానులు , మోటారు బస్సుల యజమానులు ప్రయాణికుల కోసం కొట్లాడుతూ ఉంటారు. పోటాపోటీగా చార్జీలను కూడా పెంచుతూ ఉంటారు. నా కారులో ఎక్కు అంటే నా బస్సులో ఎక్కు అని ప్రయాణీకుల సామాన్లను లాక్కునే ప్రయత్నం చేస్తారు. అయితే, షోళింగరు పోవలసిన ఒక సన్యాసి కారులో ఎక్కుతాడు. దానిలో అప్పటికే ఒకామె కూర్చోని ఉంటుంది. ఎంతసేపటికి కారు పోకపోవడంతో ఆమె వేరే దాన్లో పోతామని చెప్తుంది. దానితో డ్రైవర్ ఆ ఇద్దరి ప్రయాణీకులతోనే బయలుదేరుతాడు. కారులోని సన్యాసి ఆమెతో సుందరీ నీది చిత్తురా, షోళింగరులో బంధువులున్నారా, ఒంటరిగా పోతున్నావే, మీ వాళ్ళెవ్వరూ లేరా, ఏమి చేస్తున్నావు ఇలా చాలా ప్రశ్నలను అడుగుతాడు. దానికి ఆమె మాది చిత్తూరేనని, పెద్దతల్లి దగ్గరకు పోతున్నానని తనకు ఎవ్వరూ లేరని, భర్త చనిపోయినప్పటినుండి గర్ల్స్ స్కూల్‌లో పనిచేస్తున్నానని, తనకు బిడ్డలు లేరని చెపుతుంది. నీ తల్లిదండ్రులూ అని సన్యాసి అడగగా నన్ను అడగవద్దు అని సుందరి చెపుతుంది. ఆ తరువాత సన్యాసి పాపం చిన్న వయస్సులోనే నీకు ఎన్ని అగచాట్లు వచ్చాయి, నీ రాత అలాంటిది అంటాడు. అందుకు ఆమె నా రాత కాదు, చిన్న వయసులోనే పెండ్లి చేయడం వల్లె ఇలా అని వారిద్దరి మధ్య బాల వితంతు సమస్యకు బాల్య వివాహాలే కారణమని ఈ విషయమై కొంత చర్చ సాగుతుంది.

బ్రాహ్మణులలో, కోమటి వాళ్లలో ఉన్నంత మంది వితంతువులు కాపు వారిలో ఉండరు. అందుకు కారణం చిన్నప్పుడే పెళ్ళి చేయడం అని, పడమట దేశంలో ఇలాంటివి జరగవు కాబట్టి అక్కడివారు దేశానికి కీర్తి తెస్తున్నారు అంటూ సంభాషణ జరుగుతుంది. ఇంతలో షోళింగరు రావడంతో ఇద్దరూ దిగుతారు. తరువాత ఆమె సన్యాసిని మీరు ఎక్కడుంటారు అని అడుగుతుంది. దానికి ఆ సన్యాసి నన్ను ఎవరు పిలిస్తే వారింటికి వెళ్తాను అంటాడు. దానితో మా పెద్ద తల్లి ఇంటికి రండి ఆమె పిలవవచ్చును? అంటుంది. దానికి సన్యాసి సందేహంగా అయితే నేను రాను అని అంటాడు.

తరువాత సుందరిని మళ్ళీ నీ తిరుగు ప్రయాణం ఎప్పుడు అని సన్యాసి అడగగా రేపు సాయంత్రం అని అంటుంది. అయితే నేనూ నీతో వస్తాను కలిసి పొదాం అంటాడు. చివరికి ఎలాగో అలాగా ఆమె పెద్దతల్లి ఇంటికి చేరుతాడు. అయితే సన్యాసి ఆమెను మోహిస్తూ ఉంటాడు.

ఆ రాత్రి సన్యాసి పాలుత్రాగి పడుకుంటాడు. కానీ టపాకాయల శబ్దానికి అతనికి నిద్రపట్టదు. ఇంతలో సుందరి వచ్చి అయ్యా పాలు తాగార అని అడగగా అప్పటికే ఆలోచనలలో ఉన్న సన్యాసి 'ఆ' అని, నీవు శేషాద్రి భార్యవా, నీ తండ్రి శంకరప్పా అని అడుగుతాడు. దానితో సుందరి 'తండ్రి జాడ తెలీకనే అవస్థ పడుతున్నాను. మా ఆయన మద్రాసులో ఉండగా ఒకరోజు పాము కరిచి చనిపోయాడు. తర్వాత మా తండ్రి కోసం ఊరెళ్తే, ఆయన నేను పంపిన తంతి సమాచారం పట్టుకొని మద్రాసుకు వెళ్ళారని తెలిసింది. వారి గురించి తెలిస్తే చెప్పండి. చనిపోయే వరకు మిమ్మల్ని గుర్తుపెట్టుకుంటానని చెబుతుంది. ఇలా సుందరి జరిగిన సంగతంతా చెప్పడంతో సన్యాసి లేచి నా చిట్టితల్లి అని ఆమెను ముద్దుపెట్టుకుంటాడు. చివరికి సన్యాసే ఆమె తండ్రి అని కూతురు కనపడకనే సన్యాసి అయ్యాడని తెలుస్తుంది. ఇక్కడితో కథ ముగిసినప్పటికీ రచయిత సన్యాసులందరూ మంచివారు కారని కపట సన్యాసులుంటారని ఈ సన్యాసి కుడా అలాంటివాడేనని ఆమెను చెరప చూశాడని ఇలా చెడ్డ మనసుతో ఉన్నప్పటికీ ఆమె సన్యాసిని పూజించవలెనని మంద బుద్ధితో ఉండడం చెప్తూ స్త్రీల గొప్పతనాన్ని పురుషుల చంచల మనస్సును చెప్పాడు. ఈ విధంగా రచయిత సమాజంలో బాలవితంతు సమస్యకు కారణాలను చెప్పుతూ, భర్తలేని స్త్రీలను పురుషులు లైంగికంగా లొంగదీసుకోవాలని ప్రయత్నించే తీరును ఈ కథ ద్వారా తెలిపాడు.

5.2.4. ప్రేమకు సంబంధించిన కథలు:

5.2.4.1. సావిత్రి: (యం.వి. పాపన్న గుప్త)

సత్యనారాయణుడు, సావిత్రి బావామరదళ్ళు. చిన్నప్పటి నుండి ఒకే కంచంలో తింటూ, ఒకే మంచంలో పాడుకుంటూ, ఒకే పాఠశాలకు వెళ్తూ విడదీయరాని స్నేహభావంతో ఉండేవారు. రోజులు మారే కొద్దీ వీరిద్దరి మధ్య స్నేహం ప్రేమగా మారుతుంది. వీరి వివాహానికి సత్యనారాయణుని తండ్రి నిరాకరిస్తాడు. కారణం పేదింటి అమ్మాయిని చేసుకోవడం నచ్చక. తల్లిదండ్రుల అనుమతి లేకుండా సత్యనారాయణుడు కూడా సావిత్రిని పెళ్లి చేసుకోననడంతో సావిత్రి బాధపడుతుంది. కొన్నిరోజులకు సావిత్రికి ధనవంతుడు, జమీందారు వంటి వాడు, నలుగురు బిడ్డల తండ్రితో వివాహం నిశ్చయం అవుతుంది. ఈవార్త తెలిసిన సత్యనారాయణుడు సావిత్రిని కలుస్తాడు. సావిత్రి కోపంతో అతని ప్రేమను నిరాకరిస్తుంది. అప్పటి నుండి మనోవేదనతో కుమిలిపోతాడు. కొద్దిరోజులకు సావిత్రికి వివాహం అవుతుంది. సావిత్రి భర్త ముసలివాడే కాకుండా వాయురోగంతో కూర్చుంటే లేవలేడు, లేస్తే కూర్చోలేడు. ఇలాంటి ముసలి వానికి జీవితాంతం సేవలు చేస్తూ ఉండాలిసిందే అని విలపిస్తుంది. తనను బతిమలాడిన

సత్యనారాయణుని ప్రేమను నిరాకరించినందుకు భాధపడుతుంది. అతని దగ్గరకు వెళ్ళిపోవాలనుకుంటుంది. అయితే తనకు చదువు నేర్పిన సంస్కారం తనను ఆపుతుంది.

మద్రాసులో చదువుకుంటున్న సత్యనారాయణుడు తలిదండ్రులు చనిపోవడంతో ఊరిలోని పొలాలనన్నీ అమ్మేసి ఆ డబ్బును తీసుకొని చదువుకు స్వస్తి చెప్పి, హోటలు యజమాని భార్యతో అక్రమ సంబంధాన్ని ఏర్పరుచుకుంటాడు. తన దగ్గరున్న డబ్బు అయిపోవడంతో ఆమె దగ్గరికి రానివ్వదు. ఒకరోజు హోటలు యజమాని భార్య ఇంటికి వెళ్ళిన సత్యనారాయణున్ని ఇద్దరూ కలిసి కొట్టి కాలువలో పడేస్తారు. కొన ప్రాణాలతో పడి ఉన్న సత్యనారాయణుడు ఒక బండివాడి సాయంతో ఆవడి అనే గ్రామాన్ని చేరుకుంటాడు. ఆ గ్రామం సావిత్రి వాళ్ళ అత్తగారి ఊరు. బండివాడు గ్రామాన్ని చేరేలోపే సత్యనారాయణుడు చనిపోయి ఉంటాడు. ఈ విషయాన్ని గ్రహించిన బండివాడు సత్యనారాయణున్ని అక్కడే వదిలేసి వెళ్ళిపోతాడు. సావిత్రి రోజూలానే తలుపులు మూయడానికి వచ్చి అక్కడ ఎవరో ఉన్నారని గ్రహించి వెళ్లి చూస్తుంది. చిన్న దీపం తీసుకెళ్ళి సత్యనారాయణుని చూసి ఎవరని అడుగుతుంది. ప్రత్యుత్తరం రాకపోయేసరికి కొంత ముందుకెళ్ళి చూడగా సత్యనారాయణుని ముఖం పైన ఉన్న చేతిరుమాలును చూసి ఆశ్చర్యపోతుంది. సత్యా అని నేల కూలపడిపోతుంది.

చక్కటి ప్రేమ కథగా మొదలైన ఈ కథలో రచయిత (యం. వి పాపన్న గుప్త) మనుధర్మ శాస్త్రం స్త్రీల పట్ల విధించిన ఆంక్షల పట్ల వ్యతిరేకత ప్రకటిస్తూ, అనాదిగా సాగుతున్న సాంప్రదాయానికి కట్టుబడో లేక వరకట్నం ఆశించో అప్పుడే యవ్వనంలోకి ప్రవేశించిన స్త్రీలను వృద్ధాప్యం మీదపడి కాటికి కాళ్ళు చాచుకున్న వాళ్లకు ఇచ్చి పెళ్ళి చేసి వారి జీవితాన్ని నరక ప్రాయం చేసే విధానాన్ని ఎత్తి చూపారు.

'చంద్రికా మోహనులు' అనే కథ కూడా ప్రేమను తెలియజేసే కథే. ఈ కథలో చంద్రిక తండ్రి కూతురి ఇష్టాయిష్టాలను తెలుసుకోకుండా, తను ప్రేమించిన వాడితో కాకుండా, కన్యాశుల్కం తీసుకొని కూతురిని మూఢ శిఖామణికిచ్చి పెళ్ళి చేయాలనుకుంటాడు. ఆ బాధతో చంద్రిక ఆరోగ్యం క్షీణిస్తుంది. మోహనుడు వైద్యుడిలా మారువేషంలో వచ్చి తన రోగాన్ని నయం చేసి, చివరికి తనను పెళ్లి చేసుకుంటాడు. ఈ కథ చంద్రికా మోహనుల మధ్య ఉన్న ప్రేమనే కాకుండా ఆనాటి సమాజంలోని వివాహ వ్యవస్థను మరియు డబ్బుకి గల ప్రాధాన్యతను తెలియజేస్తుంది.

5.2.5. మద్యపాన సమస్యకు సంబంధించిన కథలు:

5.2.5.1. కల్లుముంత: (కె. సభా)

మద్యపాన నిషేధ చట్టం అమలులోకి వచ్చాక బాగుపడిన మాలగూడెంలోని కుటుంబాలల్లో పొట్టేలుగాడి కుటుంబం ఒకటి. ఆ ఊరి నాయుడుగారు ఏపని చెప్పినా నిమిషాల్లో చేసుకొచ్చేవాడు. కొద్దోగొప్పో వెనకేసుకొని కొడుకు ద్రోణాచలం పెళ్లిని నలుగురూ చెప్పుకొనేలా చేస్తాడు. కొంతకాలానికి మద్యపాన చట్టం ఉపసంహరించబడడంతో కల్లుదుకాణాలు

తెరుచుకుంటాయి. పొట్టేలుగాడు తాగడం మొదలుపెడతాడు. రామమ్మ అనే వితంతువుతో అక్రమ సంబంధం పెట్టుకుంటాడు. ఒకరోజు కోడలి నగను తీసుకెళ్ళి రామమ్మ దగ్గరుంచి తనిచ్చిన ఐదు రూపాయలతో తాగినంత తాగి మిగిలిన దానితో సారా కాచడం మొదలుపెడతాడు. పొట్టేలుగాడికి ఐతేపల్లి తోడవుతాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న ద్రోణాచలం తండ్రిని నిలదీస్తాడు. ఇద్దరూ గొడవపడతారు. నాయుడుగారికి ఈ విషయం తెలిసి చెరొక పది రూపాయలు జరిమానా వేస్తాడు. పొట్టేలుగాడు రామమ్మ దగ్గర పది రూపాయలు తీసుకొని నాయుడుగారింటికి వెళ్తుంటే ఐతేపల్లి అడ్డుపడి *"మనం యీ పది రూపాయలు పట్టి సారా కాచితే నలభై రూపాయలు సంపాదించవచ్చు. అపరాధం రేపు కట్టేద్దాం"* (కె. సభా ఉత్తమ కథలు, 2010: 2,3) అంటాడు. పొట్టేలుగాడు, ఐతేపల్లి సారా కాచడం వల్ల తన దుకాణాలకు నష్టం వస్తుందని నాయుడుగారు కళ్ళుదొరకు రిపోర్టు చేస్తాడు. కల్లుదొర, పొట్టేలుగాడు, ఐతేపల్లి కల్లుకాచే దగ్గరికెళ్ళి పొట్టేలుగాన్ని ఒకతన్ను తంతాడు. దాంతో చిర్రెత్తిన పొట్టేలుగాడు కల్లుదొరను సీసాతో కొట్టడంతో కిందపడిపోతాడు. ఆ గొడవలో పొట్టేలుగాడు దొరికిపోతాడు. ఐతేపల్లి పారిపోతాడు. కల్లుదొర పొట్టేలుగాడిపై కేసు పెట్టడంతో పొట్టేలుగాడికి నాలుగేళ్ళు శిక్షపడుతుంది. ద్రోణాచలం తండ్రిని విడిపించే క్రమంలో నాయుడు గారికి వందరూపాయలు అప్పు అవుతాడు. దీనితో నాయుడిగారి వద్ద జీవితాంతం పాలేరుగా చేరుతాడు. కొడుకు గెంటేయడంతో పొట్టేలుగాడి పెళ్ళాం కూలిపని చేయడానికి శక్తిలేక *"శూద్ర స్త్రీ అయివుంటే ఏ కామందు యింట్లోనైనా పనికత్తెగా ప్రవేశించి ఉండేది. మాలదాన్ని ఎవరు చేరుస్తారు?"* (కె. సభా ఉత్తమ కథలు, 2010: 4). అనుకుంటూ పల్లెలెంట బిక్షమెత్తుకుంటూ కల్లుదుకానాల గురించి తలుచుకుంటూ బాధపడుతుంది.

మద్యపాన నిషేధ చట్టం అమలులోకి వచ్చి ఏర్పడ్డ ప్రశాంతత తిరిగి ఆ చట్టం ఉపసంహరించబడ్డాక మాలగూడాలల్లో నెలకొన్న విపరీత పరిస్థితులను తెలియజేయడానికి ఈ కథ మంచి ఉదాహరణ. ఈ క్రమంలో ఊరిలోని నాయుడు గార్లు ఏ విధంగా బాగుపడుతున్నారు, పొట్టేలుగాడిని నమ్ముకున్న తన భార్య దళిత స్త్రీ చివరకు ఏ ఆదరువూ లేక భిక్షమెత్తుకొనే స్థితిని, తండ్రిని విడిపించే క్రమంలో నాయుడు గారికి వందరూపాయలు అప్పు పడి నాయుడిగారి వద్ద జీవితాంతం పాలేరుగా మారిపోయిన ద్రోణాచలం దుస్థితిని కళ్ళకు కట్టినట్టు చూపుతుంది ఈ కథ.

5.2.6. సావుకార్ల దురాగతాలకు/భూస్వామ్య వ్యవస్థకు సంబంధించిన కథలు:

5.2.6.1. కడగండ్లు: (కె. సభా)

సాహుకారులు చేసే దుండగాలను ఎత్తిచూపుతూ, తత్ఫలితంగా బీదవాళ్లు పడే కష్టాలను ఈ కథ వివరిస్తుంది.

సాహుకారు ఇంట్లో పనిచేసే ఎంకన్న ఒకరోజు కపిల తోలుతుండగా దరువు దొర్లుకుంటుంది. చావుతప్పి కన్ను లొట్టపోయినట్టు ఎంకన్న తీవ్ర గాయాలతో బయటపడతాడు. బావిలోపడి ఈదుకుంటున్న ఒక ఎద్దును పైకి లేపుతారు. కానీ ఇంకొక ఎద్దు దరువు కిందపడి

చనిపోతుంది. జరిగిన నష్టానికి సాహుకారు పంచాయితీ పెడతాడు. ఎద్దు ఎంకన్న మూలానే చనిపోయిందని, దానికి బాధ్యుడు అతనేనని, ఆ ఎద్దుకు ఖరీదు కట్టాలని లేదా దానికి సరిపడా చాకిరీ చేయాలని ఆ పంచాయతీలో తీర్మానించబడుతుంది. ఎంకన్న ఆ తప్పు నాది కాదని ఎంత బ్రతిమలాడినా సాహుకారు కనికరించడు. పైగా రేపు సాయంత్రంలోగా మూయిస్తానంటాడు. ఆ పంచాయతీలో అందరూ ఎంకన్నకు హితోపదేశం చేసే వారే కానీ తను నిర్దోషని ఒకరు కూడా చెప్పే పెద్దమనిషి ఉండరు.

ఎంకన్నకు మిగిలింది గుడిసె, రెండు ఎకరాల పొలం. ఎంకన్న భార్య సుబ్బి కూడా ఆ సాహుకారింట్లో నెలకు రెండు రూపాయలకు చాకిరీ చేస్తూ ఉంటుంది. గాయాల దెబ్బకు ఎంకన్నకు తీవ్ర జ్వరం వస్తుంది. చేయని తప్పుకు అపరాధం కట్టాలని భయం ఒకపక్క, తీవ్ర గాయాల చేత చలి జ్వరం ఎక్కువై వైద్యం కూడా చేయించుకోలేని బీద స్థితి ఒకపక్క. చివరికి ప్రాణాలు పోగొట్టుకోవడంతో ఈ కథ సాహుకారు చేతుల్లో పేదవారు పడే కష్టాలను కళ్ళకు కట్టినట్లు చూపుతుంది.

జీవితాంతం షావుకారు ఇళ్లల్లో పని చేయడానికి జీవితాన్ని వెచ్చించే పేదవారి బ్రతుకుల పట్ల కనికరం కూడా లేని సాహుకారి పెత్తనాన్ని, దౌర్జన్యాన్ని, నిరంకుశత్వాన్ని ఎత్తిచూపుతుంది ఈ కథ.

5.2.6.2. అస్తిపంజరం నవ్వింది: (కె. సభా)

అఖండ భారతావని స్వాతంత్ర్యదినం జరుపుకుంటున్న రోజు ఒక ఊరిలో ఊరేగుతున్న నాయకున్ని చూసి, వీధి చివర మురుగు కాలువ పక్కలో మూలుగుతున్న ఒక అస్తిపంజరం లాంటి శరీరం, ఆ నాయకుడు చేసిన దురాగతాలను గుర్తు చేసుకుంటూ *"అతడు నాయకుడో, వినాయకుడో, కాముకుడో, కులతత్వ విషబీజకారకుడో, స్వార్థ సంకుచిత స్వభావ మానవ రక్కసుడో ప్రజలెరుగుదురు"* (కథాంజలి. దీపావళి సంచిక.1947-11-1: 49) అంటూ... *"ఆ మానవ రాక్షసుడెందరి జీవితాలను బలితీసుకున్నాడో... ఎందరి అమాయక రైతులపొలాన్ని కాజేశేడో ఎందరి కూలీల రక్తాన్ని త్రాగేడో ఎందరి నిరుపేదల మాంసాన్ని నంజుకున్నాడో"* (కథాంజలి. దీపావళి సంచిక.1947-11-1: 50) తనకు తెలిసినట్టుగా ఆకలి చావుకు దగ్గరగా ఉన్న ఆ అస్తిపంజరం లాంటి శరీరం ఒక నవ్వు నవ్వుతుంది.

సామాన్య ప్రజలపై పెత్తనాన్ని, దౌర్జన్యాన్ని, నిరంకుశత్వాన్ని ప్రదర్శించిన భూస్వాములు నాయకులుగా ఎదిగిన విధానాన్ని ప్రశ్నిస్తూ, స్వాతంత్ర్యదినం జరుపుకుంటున్న రోజు ప్రపంచంలో పీడిత మానవుడు ఒక్కడున్నా అది వాస్తవిక స్వాతంత్ర్యం కాదని తెలియజేస్తుందీ కథ.

5.2.6.3. తొలి బలి: (కె. సభా)

కామయ్య పది ఎకరాల పొలంతో, పాడిపంటలతో, పుత్రకళత్రాలతో బాగా ఉంటాడు. కొద్ది రోజులకు పక్షవాతంతో మరణిస్తాడు. కుటుంబానికి ఏ కొదవా లేకుండా హాయిగా బతుకుతున్న కామయ్య కుటుంబాన్ని చూసి ఆ ఊరి సాహుకారు ఓర్చుకోలేక పోతాడు. కామయ్య

సంపదను దోచుకోవాలని కరణంతో కలిసి, తన యావదాస్తినీ సాహుకారుకు విక్రయం చేసినట్లు రాసిపెట్టిన పత్రంలో కామయ్య శవాన్ని పైకితీసి ఎడమ చేతి బొటనవ్రేలి ముద్రను వేయించుకుంటాడు. కామయ్య ఉత్తరక్రియల అనంతరం, తన వద్ద మూడువేల రూపాయలు తీసుకున్నాడని సాహుకారు ఒక రోజు రాత్రి పంచాయితీ పెడతాడు. కామయ్య భార్య కాంతమ్మకు కాపురం ఉండడానికి ఇల్లు మాత్రం విడిచిపెట్టి మిగిలిన పొలాలను సాహుకారు స్వాధీనం చేసుకునే విధంగా ఆ పంచాయతీలో తీర్మానించబడుతుంది. చివరికి కాంతమ్మ పొట్టకూటి కోసం తన పొలంలోనే కూలీగా మారుతుంది. కొంత కాలానికి కాంతమ్మ ఉంటున్న ఇంటిని కూడా ఖాళీ చేయాలని సాహుకారు ఆదేశిస్తాడు. గత్యంతరం లేక ఆమె ఆ ఊరిని విడిచి దగ్గరలో ఉన్న పట్టణానికి వెళ్లి చిన్న అంగడి పెట్టుకుని బతుకుతుంది. ఆమెకున్న ఇద్దరు కొడుకుల్లో ఒకడు మిలిటరీలో చేరిపోతాడు. ఇంకొకడు మిల్లులో పనిచేస్తుంటాడు. షాహుకారి భవనానికి పక్కన మొండి గోడలతో శిథిలావస్థకు చేరువైన కామయ్య ఇల్లు ఒక్కటే కాకుండా ఆ వీధిలో అలా కనపడే గృహాలన్నీ సాహుకారి దుండగాలకు నిదర్శనాలే.

5.2.7. రాజకీయ కథలు:

5.2.7.1. సమాధి: (కె. సభా)

జాతీయ కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం చేస్తున్న ప్రచారాలు, గాంధీ నిర్వహించిన సత్యాగ్రహాలు, గాంధీని జైల్లో బంధించిన తర్వాత అతనికి మద్ధతుగా జరిగిన నిరసనలకు జైలుపాలైన ఒక భగ్న ప్రేమికుడి కథే 'సమాధి'.

స్వాతంత్రోద్యమం ఆనాటి యువతపై బాగానే ప్రభావం చూపింది. స్వాతంత్ర్య సాధన కోసం జరిగే సభల్లో, సమావేశాల్లో, నిరసనల్లో, యువతను బాగా పాల్గొనే విధంగా చేసింది. అలాంటి జాతీయ ఉద్యమ కాలంలో గాంధీని జైల్లో ఉంచిన దానికి నిరసనలు తెలిపి జైలు పాలైన రాము తన పదేళ్ల నాటి నుండి ఇష్టపడుతున్న పుష్పను తలుచుకుంటూ, వారి జీవితంలో జరిగిన సంఘటనను నెమరు వేసుకుంటూ ఈ కథ ముందుకు నడుస్తుంది.

రాము, పుష్ప బడిలో చదువుకునే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం నిర్వహిస్తున్న ప్రచారాన్ని, ఆ పార్టీ విజయం సాధించిన విధానాన్ని గుర్తు చేసుకుంటాడు రాము. ఆ తర్వాత మెట్రిక్యులేషన్ కోసం పట్టణంలో చదువుతున్న రోజుల్లో పుష్ప నాన్న సత్యాగ్రహం చేశాడని జైల్లో పెట్టించారని తెలిసి పుష్ప ఇంటికి వెళుతుంది. దసరా సెలవుల్లో రాము కూడా ఇంటికి వెళ్లి పుష్ప పరిస్థితులను కనుక్కుంటాడు. పక్కింటిలోనే ఉండే సోము ద్వారా వారిద్దరూ ఒకరికొకరు ఉత్తరాలు అందించుకుంటూ ఉంటారు.

పుష్ప నాన్న జైలు నుండి విడుదలయ్యాక ఒకరోజు పుష్పను పెళ్లి చేసుకోమని కోరుతూ రాముకు ఉత్తరం రాస్తాడు. పుష్ప రాసిన ఉత్తరం కూడా సోము ద్వారా రాముకు చేరుతుంది. ఈలోగా పరిస్థితులు తారుమారవుతాయి. గాంధీజీని జైల్లో ఉంచిన బ్రిటిష్ వారిని వ్యతిరేకించినందుకు రామును జైల్లో ఉంచుతారు. రాము జైల్లో ఉండగానే సోముకు, పుష్పకు

వివాహం అవుతుంది. ఇది అతని గతం. అతను నెమరు వేసుకుంటున్న జ్ఞాపకాలు. మూడు మాసాలకు ముందు జైలు నుండి విడుదలైన రాము ఊరికి వెళ్తాడు. అక్కడ పుష్ప ఎదురై స్వాగతం పలుకుతుందనుకున్నాడు. కానీ రాముకి పుష్ప చనిపోయి కనిపిస్తుంది. ఆ తర్వాత ప్రతిరోజూ ఆ సమాధి దగ్గరికి వచ్చి బాధపడుతూ ఉంటాడు.

5.2.8. ఆర్థిక సమస్యలకు సంబంధించిన కథలు:

5.2.8.1. హైమావతి: (యం. వి. పాపన్నగుప్త)

అప్పులవారు పెట్టే బాధలకు నిరుపేదలైన తల్లిదండ్రులు ఏడవడం చూసిన కూతురు వారికి ఎలాగైనా మనశ్శాంతిని కలిగించాలని ప్రాణ త్యాగానికి సిద్ధపడడం ఈ కథలోని ఇతివృత్తం.

నిరుపేద అయిన శ్యామారావు, తను సంపాదించిన కొంతలోనే ముగ్గురు ఆడబిడ్డలలో ఇద్దరికి పెళ్ళిళ్ళు చేస్తాడు. మూడవ బిడ్డ హైమావతి (హైమ). హైమకు ఎలాగైనా పెళ్లిచేయాలని తహతహలాడుతుంటాడు. అప్పులవారు పెట్టే బాధలకు తల్లిదండ్రులు ఏడుస్తుంటే, హైమా కుడా బాధపడుతూ ఉంటుంది. రాజుగారికి కలలో గంగాదేవి కనిపించి చెరువు ఉప్పొంగుతుందని దానికి శాంతి చేయాలని, ఎవరైనా తమ మూడవ కాన్పును బలిగా ఇస్తే అలా జరగదని చెప్పిందంట. అందుకని రాజుగారు ఎవరైనా తమ మూడవ కాన్పును బలిగా ఇస్తే ఇరవై వేల రూపాయలు ఇస్తాడని చాటింపు కూడా వేయించారని పక్కింటి యశోద చెప్తుండగా హైమ వింటుంది. దీనితో హైమకు ఎలాగైనా తల్లిదండ్రులను ఉద్ధరించాలని మనసులో ఆలోచన మొదలౌతుంది. శనివారం చెరువు ఉప్పొంగుతుందని అందరూ భయపడుతూ ఉంటారు. రాజు ఎవరైనా బలి ఇస్తారా అని ఎదురు చూస్తుంటాడు. హైమ ఎవరికీ చెప్పకుండా రాజుగారికి తన నిశ్చయమును చెపుతుంది. అందుకు రాజు తల్లిదండ్రులకు తెలియకుండా, వారు అంగీకరించకుండా ఈ పని వద్దంటాడు. తీరా హైమ ఏమీ చేయలేక చెరువు గట్టుకు పోయి నీటిలో దూకేస్తుంది. అది చూసిన బోయవాడు ఆమెను బయటికి తెస్తాడు. విషయం అందరికి తెలిసి అక్కడికి వస్తారు. ఇంతలో గంగ శాంతించిందని బ్రాహ్మణులు చెప్తారు. హైమ సాహసానికి అందరూ మెచ్చుకుంటారు. రాజు వారి దారిద్ర్యానికి జాలిపడి ఇస్తానన్న డబ్బులతో పాటు కొన్ని వస్త్రాలు కూడా ఇచ్చి హైమను మెచ్చుకుంటాడు.

వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైన రాఘవేంద్రరావుకి కూతురు పెళ్లి చేయడానికి 500రూపాయలు అవసరమవుతాయి. దానికోసం అతనుపడే అవస్థను తెలియజేస్తూ వచ్చిన మరొక్క కథ 'రాఘవేంద్రరావుగారి రాజీనామా'.

5.2.9. మతం ముసుగులో జరిగే అన్యాయాన్ని ఎత్తి చూపే కథ:

5.2.9.1. పాపిచావు:

'పాపి చావు' కథలో మత ప్రచారం కోసం ఇంగ్లాండు నుండి భారతదేశం వచ్చిన ఒక ఫాదరీ తన చుట్టూ ఉన్న ప్రజలకు ఉపన్యాసాలిస్తూ, తన దగ్గరికి వచ్చే రోగులకు మందు

ఇవ్వకుండా మందక్కరలేదు మతం పుచ్చుకో అది నేరుగా స్వర్గానికి చేరుస్తుంది అంటూ మత మార్పిడికి ప్రయత్నిస్తూ, అప్పటి వరకూ అణచి పెట్టుకున్న కోరికల్ని తన దగ్గరికి వచ్చే స్త్రీలను చూసినప్పుడు వారిపట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ కోరిక తీర్చుకోవడానికి ప్రయత్నించి చివరికి ప్రాణాలు కోల్పోవడం అనేది ఈ కథలో చూడవచ్చు.

5.2.10. దేశభక్తి:

5.2.10.1. విప్లవాంగన: (కె. సభా)

స్వాతంత్ర్య సాధనలో జరుగుతున్న యుద్ధాన్ని తన ప్రేయసి సుమతికి చూపుతూ ఆ భీభత్సాన్ని చూసి ఆగలేక ఆ కథనసీమకు తనూ వెళ్ళాలంటాడు రణదేవుడు. *"వలపు మధువులలో గరళాన్ని చిలికించి వెడతావా? వెన్నెల తేటలో మబ్బు దొంతరల్ని పేర్చి వెడతావా"* (కథాంజలి, దీపావళి సంచిక, 1946: 28) అని సుమతి అంటుంది. కానీ రణదేవుడు *"లేదు... పొరబడుతున్నావు.....సోదరాప్రజానీకాన్ని నిరంకుశ రక్కసి నలిమి క్రింగుతుంటే ఎక్కడి వలపు...? వేదల హృదయసీమల్లో గాడాంధకారం అల్లుకుపోతుంటే వెన్నెల తేట ఎక్కడుంది? అంతా భ్రమ... నేను వలపుల మధువుల్లో గరళాన్ని చిలికించడం లేదు. విప్లవ రుధిరాన్ని చిలికిస్తున్నా. వెన్నెల తేటలో సమరాగ్నిని జ్వలింపచేస్తున్నా... సుమతీ తప్పదు"* (కథాంజలి, దీపావళి సంచిక, 1946: 28) అని చెప్పి కదనరంగంలోకి ప్రవేశిస్తాడు. తన వీరత్వాన్ని ప్రదర్శించి అనేకమంది ప్రాణ మానాల్ని కాపాడి తుపాకీ గుండ్ల దెబ్బకి చనిపోతాడు. ఇది చూసి ఆగలేని సుమతి కూడా సింహం పిల్లలా దూకి సమరసీమను చేరుతుంది. శక్తిస్వరూపిణిగా విజృంభిస్తుంది. ఓటమి భారత వీరుల చరిత్రలో లేదని ఎలుగెత్తి మాతృభూమి విముక్తి కోసం యుద్ధం చేయండి లేదంటే చావండి అని సందేశాన్నిస్తుంది. చివరికి ఆ నిరంకుశ పెంపుడు కుక్కలకు పట్టుబడుతుంది. వారు తన మానాల్ని హరించనున్నారని గ్రహించి తనకు తానే పొడుచుకొని చనిపోతుంది.

భారతదేశానికి స్వాతంత్ర్యం రావడానికి సమయం దగ్గరపడుతున్న తరుణంలో ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని నింపటానికి, అవసరమైతే వీరోచితంగా శత్రు సైన్యాలకు ఎదురొడ్డి నిలబడాలని, మహిళలు సైతం తమ తెగువను చూపాలని, అప్పటికే దేశం కోసం ప్రాణాలర్పించిన వారితోనే ఇది అంతం కాదని అది తుఫానై భారతావనికి స్వేచ్ఛా వాయువును అందిస్తుందని సంకల్పించి, ఆశించి రాసిన కథగా విప్లవాంగన కథ కనిపిస్తుంది.

5.2.12. ఇతరాలు:

5.2.12.1. వేయి రూపాయలు: (కె. సభా)

రామయ్య అనే నిరుపేద రైతు ఏడాది కాలంగా పడ్డ కష్టానికి దక్కిన ప్రతిఫలం 1000 రూపాయలతో ఒకజత ఎద్దులు కొనుక్కుంటే సజావుగా వ్యవసాయం చేసుకోవచ్చని నిర్ణయించుకుంటాడు. శాస్త్రిని కలిసి ఒక ముహూర్తాన్ని నిర్ణయించుకుని బయలుదేరుతాడు. అవి చీకటి రోజులు కావడంతో దారి కనబడక సామయ్య ఉన్న గ్రామంలోని ఆగవలసి వచ్చింది

రామయ్యకు. ఈ విషయాన్ని గ్రహించిన సామయ్య రామప్పను ఇంటికి ఆహ్వానించి భోజనం పెట్టి ఆ రాత్రి వేళ తన ఇంటిలోనే పడుకోవడానికి ఏర్పాటు చేస్తాడు. రామయ్య దగ్గరున్న డబ్బులు లాక్కుంటే రెండేళ్లు హాయిగా జీవించవచ్చు, లేదంటే అంగడి పెడితే ఎంత లాభం లేదా సారాయి కాస్తే ఐదువేలు దాకా వస్తాయి అని మల్లుగాడిని సాయంగా తీసుకుని ఆ డబ్బును కాచేయాలనుకుంటాడు.

రామయ్య తన భార్య చెప్పిన జాగ్రత్త జాగ్రత్త అన్న మాటలను పదే పదే జ్ఞప్తికి తెచ్చుకుంటూ, సామయ్య వెళ్లి అరగంటైనా రాకపోవడంతో అనుమానం వచ్చి ఒక దగ్గర దాక్కుంటాడు. సామయ్య మల్లుగాడితో కలిసి ఆ చుట్టుపక్కలంతా వెతుకుతారు. చివరికి రామయ్య పడుకున్న ప్రదేశంలో సామయ్య అల్లుడు నాటకం చూసి వచ్చి పడుకొని ఉండగా రామయ్య అనుకుని సామయ్య అల్లున్ని కొట్టిస్తాడు. ఇది చూసిన సామయ్య కూతురు రత్నమ్మ ఆశ్చర్యపోతుంది. ఆ చిత్రాన్ని కూతురు చూడడంతో సామయ్య కూతురి పాదాలు పట్టుకుంటాడు. చివరికి ఇదంతా చూసిన రామయ్య "భవిష్యత్తు ఎవరికి తెలుసు ఎడ్లు పట్టాక ఏదైనా రోగం వచ్చి చనిపోతే ఎవరిస్తారు ఈ డబ్బు శాశ్వతమా" అని ఆ వెయ్యి రూపాయలు సామయ్యకు ఇచ్చేసి వెళ్ళిపోతాడు. ఇంట్లో ఎడ్లు రేపు వస్తాయని అబద్ధం చెప్తాడు. అయితే సాంబయ్య నిజంగా మరునాడే సంతకు వెళ్లి 1200 రూపాయలు పెట్టి ఎడ్లను కొనుక్కొని రామయ్యకు ఇస్తాడు.

ఒక పేద రైతు డబ్బుకు ఆశపడి పొరపాటున అల్లున్ని చంపుకొనే పరిస్థితిని తెచ్చుకున్న దొంగ బుద్ధిని తెలియజేసే కథ ఇది.

అలాగే ప్రసూతి అయిన విమల ప్రసవ వేదనను తెలుపుతూ ఆ సమయంలో స్త్రీలు ఓర్చుకునే బాధకు సానుభూతిని తెలియజేస్తూ, అబలల్లో వైరాగ్యం ప్రసూతికి తిలోదకాలు ఇవ్వడమే కదా అని చెప్పే కథ వైరాగ్యం.

ఒకరికి తెలీకుండా ఒకరికి పంపిన సినిమా టికెట్ల విషయంలో రెండు కుటుంబాలు ఒకరికొకరు అబద్ధాలు చెప్పుకొని ఆ సినిమాకి వెళ్ళే క్రమంలో జరిగిన చమత్కార సంభాషణే 'బిక్కిరింత పిదప వెక్కిరింత' అనే కథ. ఒక అగ్రహారాన్ని ఆశ్రయించుకొని ఉన్న మాలపల్లెలో నల్లయ్య అనే అమాయకపు దళితుడు పుట్టినప్పటి నుండి మరణించే వరకూ చేసే అమాయకపు పనులు తెలియజేసే కథే 'ఒక ఆదియాంధ్ర భక్తుని జీవిత చరిత్ర'.

పచ్చి విషాన్ని కక్కే త్రాచు పాములను కూడా పూజించే సంప్రదాయం ఉన్న దేశం మనది. అలాంటి మనదేశానికి వెన్నెముకైన రైతన్నకు కుడిభుజమైన పశుసంపదను కూడా కామధేనువుగా పూజించే సంప్రదాయం మనది. అలాంటి పశుసంపద పైన పెంచుకున్న ప్రేమను (జంతు ప్రేమ) తెలిపే కథ 'సమాధి' (ఇదే పేరుతో మరొక కథ కూడా ఉంది). చిరు మామిళ్ళ పార్వతమ్మ ఎంతో ప్రేమగా పెంచుకొనే కోడెదూడ(రాము) చనిపోవడంతో, దానిమీద ప్రేమతో ఒక సమాధి కట్టి, ఒక విగ్రహాన్ని ఏర్పాటు చేసి, పూజలు చేసి, కొబ్బరికాయలు కొట్టి ప్రసాదాలు పంచేంతటి జంతు ప్రేమను తెలుపుతుంది ఈ కథ.

5.3. 1951 నుండి 1975 వరకూ వచ్చిన చిత్తూరు జిల్లా కథానికలు:

5.3.1. మూఢ విశ్వాసాలు:

5.3.1.1.పునర్జన్మ:

రాజారావు ఒక స్కూల్ టీచరు. అతని పెద్ద కూతురు లీల. లీల, లీల భర్త శ్యామారావు ఇద్దరూ కలకత్తాలో ఉంటారు. ఒకరోజు రాజారావుకు ఒక పోస్టు వస్తుంది. అందులో "లీలా ఎక్స్ పయర్డ్ ఆన్ టెన్త్ మార్నింగ్" అని ఉండడంతో రాజారావు అతని కుటుంబ సభ్యులు విలపిస్తారు. కానీ రాజారావుకు కూతురు చనిపోయిందంటే నమ్మబుద్ధి కాక కొడుకు నిరంజన్ రావుకు కార్డు రాస్తాడు. కొడుకు మీకందినట్లే నాకూ కార్డు అందింది. లీల చనిపోయిందన్న విషయాన్ని నేను నమ్మలేకపోతున్నాను అని ప్రత్యుత్తరం ఇస్తాడు. దీనితో రాజారావు అయోమయ స్థితిలో పడతాడు. తర్వాత ఒకరోజు మరొక కార్డు వస్తుంది. అందులో *"మహారాజ రాజశ్రీ మామగారికి నమస్కారాలు చేసి అల్లుడు శ్యామారావు వ్రాయులేఖ. గత బుధవారం నాడు లీల కాకుల జంటను చూడ్డం వల్ల ఆ దోష పరిహారార్థం ఆమె చనిపోయినట్లు ఆత్మబంధువులకు జాబు వ్రాయమని పెద్దలు చెప్పారు. అంచేత మీకు కార్డు వ్రాశాను. లీలకేమీ భయం లేదు. ఆమె ఆరోగ్యంగానే ఉన్నది. అక్కడందరి క్షేమాలు తెలుపుతూ జాబు వ్రాయగోరెదను"* (పాతాళగంగ, 1969: 98,99) అని ఉత్తరంలో ఉండడంతో ఒకసారిగా ఊపిరి పీల్చుకుంటాడు.

ఈ కథలో రాజారావు స్నేహితుడైన కథకుడు *"లక్ష పిడుగుల కంటే బలీయమైన, కోటి అణ్వస్త్రముల కంటే శక్తివంతమైన చావు కబురు సత్యమైనప్పుడే అందివ్వాలి గాని ఏదో సనాతన ఆచారాలు మూఢ నమ్మకాలూ ఆధారంగా ఎందుకు కల్పించాలి!"* (పాతాళగంగ, 1969: 99.) అని ఈ మూఢ విశ్వాసాలు పట్ల వ్యతిరేకతను తెలుపుతూ విజ్ఞాన యుగంలో కూడా ఇలాంటి నమ్మకాలు ఏంటి అని ప్రశ్నిస్తాడు రచయిత ఆ పాత్ర ద్వారా.

5.3.1.2. దెయ్యాల కనుమ:

కమ్మపల్లె పాఠశాలలో ఏకోపాధ్యాయుడిగా గౌరీపతికి ఉద్యోగం వస్తుంది. ఆ ఊరి చుట్టుపక్కల ఉన్న రెండు మూడు గ్రామాల్లో అద్దెకు ఇల్లు దొరకక పోవడంతో ఆ ఊర్లోని రావి నాయుడు పంపు షెడ్డు గౌరీపతికి గతవుతుంది. రావి నాయుడు కూతురు పార్వతి, గౌరీపతి ఒకరినొకరు ఇష్టపడతారు. పట్నంలో పుట్టి పెరగడం చేత వారానికి ఒకసారి అయినా బస్తీకి వెళ్లి రావడం మనసుకు ఆరోగ్యం అని గౌరీపతి ఒకరోజు బస్తీకి వెళ్లి తిరిగి వస్తూ ఉంటాడు. అప్పటికే పొద్దుపోయి ఉంటుంది. కమ్మపల్లెకు, బస్తీకి నడుమ ఒక కనుమ ఉంది. దానినే దెయ్యాల కనుమ అని అంటారు. అది దెయ్యాల కనుమని తెలియక ముందు ఆదారింటీ ఏ భయం లేకుండా వెళ్లి వచ్చిన గౌరీపతికి అది దెయ్యాల కనుమని తెలిశాక ఆ కనుమ దాటడానికి విపరీతంగా భయపడతాడు. *"పక్కన చింతచెట్లో గుడ్లగూబ గుబ గుబ లాడుతున్నది. దూరంగా చెరుకు తోటల్లో గుంటనక్కలు వూళ పెడ్తున్నాయి... గౌరీపతి గుండె గభిల్లుమంది... వెనుక ఎవరో*

నడిచివస్తూన్న చప్పుడు!... తిరిగి చూసే ధైర్యం లేకపోయింది... చెవులు రిక్కించాడు గౌరీపతి అలికిడి లేదు. మరికొంతసేపటికి... మళ్ళీ సవ్వడి...అది...అది... దెయ్యమేనా?..." (రక్త యజ్ఞం, 1965: 57) ఇలా రకరకాలుగా భయపడుతూ గౌరీపతి చివరికి కనుమ దాటుకుంటాడు. ఇక భయం లేదనుకుని వెళ్తున్న గౌరీపతికి అల్లంత దూరంలో ఒక భయంకరాకారం అతని ముందు నిలబడి తల విరబోసుకుని కదలక మెదలక అలాగే ఉండడం చూసిన గౌరీపతి ఒక్కసారిగా కూలబడిపోతాడు. తర్వాత గౌరీపతి కళ్ళు తెరిచి చూసేసరికి రావి నాయుడు ఇంట్లో ఉంటాడు. ఆ దయ్యంలా వచ్చింది పార్వతే అని తెలుసుకుంటాడు. ఇది జరిగిన రెండు నెలల తర్వాత బస్తీకి వెళ్లి కొంత ఆలస్యంగా ఇంటికి చేరుకుంటాడు. అయితే పార్వతి ఇంత ఆలస్యం ఎందుకు అయిందని, ఇంత రాత్రివేళ ఆ దావ మంచిది కాదని చెప్పడంతో చిరునవ్వు నవ్వుతూ *"పార్వతీ! ఎందుకా ఆదుర్దా?... అనుభవ పూర్వకంగా నేను తెలుసుకున్న దేమిటంటే– సృష్టిలో అసలు దయ్యమనేదే ఉంటే– దానికి నివాస స్థలం పిరికివాడి గుండె"* (రక్తయజ్ఞం, 1965: 61) అని చెప్తాడు.

అనవసరమైన మూఢ విశ్వాసాలతో లేని దయ్యాలను తెచ్చిపెట్టుకునే గ్రామీణ ప్రజల మాటలు ఎంతవరకు నిజం అని తెలియజేస్తూ దయ్యాలన్నవి కేవలం భ్రమ మాత్రమే అని అలాంటి మూఢ విశ్వాసాలను నమ్మకూడదని రచయిత ఈ కథలో చెప్పినట్లు తెలుస్తుంది.

5.3.1.3. వికృత వాణి:

మధిర, మదవతి, జూదం లాంటి వ్యసనాలకు లోనైన శాంతిసాగర్ పల్లె నుంచి బస్తీకి వచ్చి చిన్న ఇంట్లో చేరుతాడు. నల్లులు మొదలైన వాటికి భయపడడు కానీ అక్కడ మనుషులకు ఎదురు వచ్చే వెధవను, కాళ్ళ సందులో దూరే పిల్లిని, దర్జీవాడి కూతురు తుమ్మడం వంటి వాటికి భయపడతాడు. వాటివల్ల తన జీవితం అంతా నాశనం అయిపోయిందని నమ్ముతాడు. సోమరితనం ఎక్కువగా ఉండటం వల్ల ఉద్యోగం తనని వెతుక్కుంటూ వస్తుందని ఆశపడేవాడు. అక్కడి వాతావరణం నచ్చక వేరే ఇల్లుకి మారుతాడు. అది శిథిలావస్థలో ఉంటుంది. అది చూశాక అతనిలో అశాంతి మరింతగా విజృంభిస్తుంది. మనసు స్థిమితంగా ఉండదు. ఒకరోజు వర్షం పడుతూ ఉంటే చెట్టు కింద చేరుతాడు పైనుంచి కొమ్మ విరిగి మీద పడుతుంది. బతుకుతాడనే నమ్మకం కూడా నశిస్తుంది. చివరికి ఉద్యోగం వచ్చిందని ఉత్తరం వస్తుంది. కానీ నరకాన్ని అంతా ఇక్కడే అనుభవించేశాడు ఆఖరి క్షణంలో కూడా దర్జీ వాడి కూతురు తుమ్ముతుంది. అది విన్న శాంతిసాగర్ అశాంతి కౌగిలిలో కన్నుమూస్తాడు. అక్కడ కూడా సులభంగా ప్రాణం పోదు.

రచయిత ఈ కథలో తుమ్ములు, విధవ ఎదురవడం, పిల్లి అడ్డంగా రావడం వంటి శకునాలను నమ్మి చేస్తున్న పనులు కూడా వదిలి వెళ్లే ఈనాటి సమాజం ఎంత తిరోగమనం వైపు సాగుతుందో తెలియజేస్తూ అలాంటి వాటి పట్ల విశ్వాసాలు ఉండకూడదని తెలియజేస్తాడు.

మూఢవిశ్వాసాలకు సంబంధించిన కథలే కాకుండా కొన్ని సాంప్రదాయాలను తెలియజేస్తూ పల్లెల్లో ప్రతి చిన్నదానికి వారాలు, తిథులు, నక్షత్రాలు, కార్తులు ఇలా అన్నీ చూడడం గురించి, పండుగల సమయంలో కొన్ని సంప్రదాయాల గురించి, కూతురిని అత్తారింటికి

పంపేటప్పుడు పెట్టే పెట్టుపోతలగురించి తెలియజేస్తూ ఉగాదులు ఉషస్సులు, సంక్రాంతి శంఖ, మిథునలగ్నం, ఉగాది సాంగ్యం వంటి కథలు కూడా చిత్తూరు జిల్లా నుండి వచ్చాయి.

5.3.2. సామాజిక రుగ్మతలకు సంబంధించిన కథలు:

5.3.2.1. ఏకాంతం (ధూమపానం):

భర్త ఆనందరావు ఆరోగ్యం దృష్టిలో పెట్టుకొని తనని సిగరెట్ మానేయాలని చెప్తుంది కమల. ఇది భర్త వినడు. ఆ అలవాటు మాన్పించడానికి వీరి మధ్య జరిగిన సంభాషణే ఏకాంతం కథ.

ఆనందరావు సిగరెట్ వెలిగించి అగ్గిపుల్లను జాగ్రత్తగా కిటికీలో గుండా పడేసి తన పనిలో నిమగ్నమయ్యుంటాడు. ఇది గమనించిన అతని భార్య కమల మళ్లీ ప్రారంభించారా, దొంగ చాటుగా ఈ పని ఏంటి అని ప్రశ్నిస్తుంది. ఆ సిగరెట్ మానేయమని చెప్తుంది. దాచిపెట్టిన సిగరెట్లు ఏమైనా ఉంటే ఇలా ఇచ్చేయమని చెప్తుంది. మీతో చర్చలు చేసి నచ్చజెప్పి లాభం లేదు మీకేమన్నా తెలియకపోతే కదా నచ్చ చెప్పటం. అన్నీ తెలుసు. కథ మాత్రం మళ్లీ మొదటికే వస్తుంది. *"నిన్న రాత్రి దగ్గుతుంటే, ఏమో వేడి చేసింది కాబోలు అనుకున్నానుగాని, ఈ పని మళ్ళీ మొదలు పెట్టారనే రహస్యం తట్టనేలేదు! ఎందుకు చెప్పండీ, బాధను కోరికోరి తెచ్చుకోవటం? మిమ్మల్ని ప్రతిక్షణం కనిపెట్టి ఉండాలంటే నాతరమా?"* (ఆర్.ఎస్. సుదర్శనం కథలు, 2018: 150) అంటూ వాదిస్తుంది. చివరికి ఇంకెప్పుడూ నా పర్మిషన్ లేకుండా సిగరెట్ కాల్చనని ఒట్టెయ్యండి.అప్పుడు ఆ బాధ్యత కాస్తా నా మీద వేసినట్లుగా మీ మనసు తేలికపడుతుంది. ఎప్పుడైనా మీకు కోరిక కలిగితే ఆరోగ్యం బాగుంటే కాల్చుకోవడానికి పర్మిషన్ ఇస్తాను అంటుంది. దీనికి ఆనందరావు సరేలే, చూద్దాంలే, ఆలోచిద్దాంలే అన్న సమాధానాలతో ఆ సంభాషణని దూరం చేస్తాడు. ఇలా ఈ సిగరెట్ విషయమై వీరిద్దరి మధ్య కొంత సంభాషణ ఈ కథలో జరుగుతుంది. ఒకరోజు ఆనందరావు క్లబ్ నుంచి రాగానే అతని మంచం అతను పనిచేసుకునే గదికి మార్చబడి ఉంటుంది. కారణం భర్తకు దగ్గు తగ్గేదాకా ఆ గదిలోనే ఉండాలని, అలా చేస్తే తను సిగరెట్ తాగడం మానేస్తాడని.

5.3.2.2. ధర్మ హాని (ధూమపానం):

ప్రేమానందం ధూమపానం పట్ల వ్యసనపరుడు. ఒక బంట్రోతుగా ఉద్యోగం చేస్తూ ఉంటాడు. జీతం డబ్బులు రాకపోవడంతో ఒక బీడీకి కూడా డబ్బు లేని తన ఉద్యోగాన్ని, తనను నిందించుకుంటాడు. ప్రేమానందాన్ని తన కొడుకు ఒక అణా ఇవ్వమని గొడవ చేస్తాడు. ప్రేమానందం దగ్గర లేకపోవడంతో రెండు చివాట్లు పెట్టి తన్నుతాడు. ఇంట్లో భార్యను అణాకాని, నయాపైసా కానీ ఉన్నాయా అని అడుగుతాడు. అవి లేకనే పక్కింట్లో అరపడి ఉప్పు అప్పు తీసుకున్నానని చెప్తుంది. ప్రేమానందం తన్ను తానే అసహ్యించుకుంటాడు. *"ఈ వెధవ బంట్రోతు జన్మానికన్నా – బీడీఫ్యాక్టరీ ముందు బిక్షగాడిగానైనా పుట్టకపోయాను అనుకున్నాడు"* (రక్తయజ్ఞం, 1965: 119). నిరాశగా నిట్టూర్చి తన ఆనందాన్ని వెతుక్కుంటూ వీధిలోకి వెళ్తాడు. గోపికి

ఆరోజు బీడీ పారిశ్రామికుల ప్రచారం చేసినందుకు నాలుగు బీడీ కట్టలు ఇచ్చి ఉంటారు. వాటిని డబ్బు రూపంలో లెక్కపెట్టి ఆరు అణాలు వస్తాయని హాయిగా నిద్రపోతాడు. ఈలోగా బీడీ కోసం పిచ్చి పట్టి వీధులు తిరిగి వచ్చిన ప్రేమానందానికి అవి కనపడటంతో వాటిని తీసుకుంటాడు.

ధూమపానం ఒక వ్యసనంగా మారిన ప్రేమానందం, ఒక బీడీ కోసం పడే తాపత్రయాన్ని అలాగే పిల్లల్ని కూడా ధూమపానానికి ప్రోత్సహించి తమ వ్యాపారాన్ని పటిష్టం చేసుకోవాలని ఆశించే బీడీ పారిశ్రామిక ప్రకటన వర్తకుల వ్యాపార బుద్ధిని రచయిత ఈ కథలో చూపిస్తూ ధూమపానం చేయకూడదని ఒక సందేశాన్ని ఇచ్చినట్లుగా తెలుస్తుంది.

5.3.2.3. చక్రం (జూదం):

సింహాద్రి బట్టలు కొట్టులో పాతబాకీ తీర్చి, రాత్రికి భారతం(నాటకం) చూసి రావాలని పాకాలకు తొందరగా భోంచేసి బయలుదేరుతాడు. ముందు భారతం దగ్గరికి వెళ్తాడు. అక్కడ ధర్మరాజు జూదంలో ఓడిపోయి రాజ్యం పోగొట్టుకోవడం, దుశ్శాసనుడు ద్రౌపదిని అవమానించడం అన్నది ఆటగా జరుగుతూ ఉంటుంది. ధర్మరాజు జూదంలో మొత్తం పోగొట్టుకోవడంతో జూదాన్ని దుమ్మెత్తి పోస్తూ "పాడుజూదం. మాయదారి జూదం. ధర్మరాజంతటి వాడిచేత దాసోహమనిపించింది. అందుకే గాబోలు ఆడది, సారా, జూదం తగవన్నాడు మా తాత!". (పైరుగాలి, 1967: 103) అని అనుకుంటాడు.

చాలాసేపు చూడడంతో ఆట బోర్ కొట్టి అలా కొంచెం దూరంగా వెళ్తాడు. అక్కడ ఒక వారాంగన కనపడటంతో తన దగ్గర ఉన్న డబ్బును గుర్తు చేసుకుని మళ్లీ ఆట దగ్గరికి వెళ్తాడు. అక్కడికి కొంత దూరంలో ఒక గుంపును చూస్తాడు. పెట్రోమాక్స్ లైట్ కాంతిలో నిర్భయంగా జూదం జరుగుతూ ఉంటుంది. మొదట్లో ఆ జూదం సింహాద్రికి ఏమి అర్థం కాకపోయినా నెమ్మదిగా అర్థం అయిన తర్వాత ఆగలేకపోతాడు. జూదంలోకి దిగి తన దగ్గర ఉన్న 130 రూపాయలు మొత్తం పోగొట్టుకుంటాడు. చివరికి ఒక 30 రూపాయలు ఇవ్వమని బ్రతిమాలుతాడు. కారణం గుడ్డల వాడికి ఇవ్వాలని. లాభం లేకపోయింది. ఆట యజమాని చౌదరి జాలిపడి పోనీలే అని ఐదు రూపాయలు ఇస్తాడు. ఆ ఐదు రూపాయలతో వెళ్ళిపోకుండా తిరిగి మళ్లీ జూదం ఆడుతాడు. ఎలాగోలా తను పోగొట్టుకున్నదంతా సంపాదించుకుంటాడు. ఇంతలో వర్షం పడడంతో ఎక్కడి వాళ్ళు అక్కడ వెళ్లిపోతారు. రెండు గంటల తర్వాత వర్షం ఆగుతుంది. సింహాద్రి తన దగ్గర ఉన్న డబ్బు చూసుకొని వర్షం పడకపోయి ఉంటే మరింత డబ్బు వచ్చేది అని దురాశతో ఆలోచిస్తాడు. ఒకవేళ అలా ఆడినట్లయితే ఉన్న డబ్బు కూడా పోయింటుందేమో చెప్పలేము. సింహాద్రి ఆ డబ్బును జోబులో దాచుకుంటూ అదృష్టము, దురదృష్టము ఇవి ఒక చక్రంలోని రెండు భాగాలు. మనిషి పట్ల ఆ చక్రం ప్రభావం ఎప్పుడు ఏ విధంగా ఉంటుందో ఎవరికి తెలుసు అనుకుంటాడు.

జూదంలో సర్వస్వాన్ని కోల్పోయి రోడ్డున పడిన వాళ్ళని నేటికీ మనం చూస్తూనే ఉన్నాం. అలాంటి జూదం ఒక వ్యసనంగా మారితే ఎలాంటి విపరీతాలకు దారితీస్తాయో కూడా మనం

చూస్తున్నాం. అలాంటి వ్యసనాలకు లోను కాకపోవడమే మంచిదనే ఒక సందేశాన్ని ఇచ్చినట్లు ఈ కథ ద్వారా రచయిత తెలియజేస్తాడు.

5.3.3. కుటుంబ సంబంధ కథలు/ అనుబందాలకు సంబంధించిన కథలు:

5.3.3.1.భార్యా భర్తలకు (దాంపత్య) సంబంధించిన కథలు:

5.3.3.1.1. సర్వీసు రిజిస్టరు:

కుటుంబ జీవితం సుఖంగా ఉండాలంటే భార్య ప్రవర్తన ముఖ్యమని చెప్తూనే, అలాకాని పరిస్థితులను కల్పించుకున్న ఇల్లాలు తన కూతురు విషయం దగ్గరికి వచ్చేసరికి ఆ బాధ ఎలా ఉంటుందో తెలియజేసే కథే ఈ కథ

ఒక గవర్నమెంట్ ఆఫీసులో సామాన్య గుమస్తాగా పనిచేస్తున్న సుదర్శనం భార్య లీలావతి. ఈమె కోడలుగా అడుగుపెట్టిన మరుసటి రోజుకే వేరే కాపురం పెట్టాలనుకుంటుంది. సుదర్శనం అక్క, చెల్లెలు ఇంటికి వస్తే లీలావతికి అదోలా అనిపిస్తుంది. ఈమె వాలకాన్ని చూసి సుదర్శనం చెల్లెళ్లు పుట్టింటికి రావడమే మానేస్తారు. భార్య మాట జవదాటని సుదర్శనం ఆ విషయం పట్టించుకోడు. తర్వాత లీలావతి కూతురు పెళ్లి ఈడుకి వచ్చాక ఆమెకు కుటుంబ విలువ తెలుస్తాయి. విశ్వం అనే అబ్బాయితో తన కూతురు పెళ్లి చేయాలని నిర్ణయిస్తారు. అయితే విశ్వం సుదర్శనం, లీలావతికి షాక్ ఇస్తాడు. మీలాంటివారు ఆశలు పెట్టుకోవడానికి నేను తగనేమోనన్న అభిప్రాయం నాకు ఆది నుంచి ఉంది అంటూ తనది సాధారణమైన కుటుంబం అని, నాన్న, బాబాయ్, నలుగురు చెల్లెల్లు, ఇద్దరు తమ్ముళ్లు, మేనత్తలతో కలిసి పెద్ద కుటుంబమని వారందరూ తన చదువు కోసం ఎన్నో బాధలు పడ్డారని వారందరి బాధ్యత నాపైనే ఉందని చెప్తాడు. *"ఇలాంటి బాధ్యతలను భుజానమోస్తు నేను నా జీవితంలోకి రాబోతున్న అర్ధాంగిని ఏమాత్రం సుఖ పెట్టగలనో తెలియదు. ముచ్చటైన బంగళాలో చిన్న స్టా మీద వంటచేసి పెట్టడం మినహా మరొక అదనపు బరువును స్వీకరించ నొల్లని ఇల్లాలు లభ్యమైతే – మా కుటుంబం సంగతి వెన్న పడుతుండగా పగిలిపోయిన బాన చందమౌతుంది. అలాగని నేను మావాళ్ళ కేదో పెన్నిధిని తవ్వి తలకెత్తబోతున్నానని గాదు. సిరిసంపదలకన్నా భోగభాగ్యాలకన్నా మమకారాలను ఆత్మీయతలను ప్రాణప్రదంగా చూసుకోగలిగితే చాలు"* (మధురాంతకం రాజారాం కథలు రెండవ సంపుటి, 1994: 85) అంటూ వారి సంబంధాన్ని వద్దని చెప్తాడు.

ఈ కథలో రాజారాం గారు దాంపత్య జీవితంలో భార్యాభర్తల మధ్య ఉండవలసిన అన్యోన్యతని, కోడలుగా ఇంట్లో అడుగు పెట్టిన తర్వాత ఆ ఇల్లాలు సక్రమమైన మార్గంలో ఉంటేనే ఆ కుటుంబం మంచిగా ఉంటుందనే సత్యాన్ని తెలియజేశారు.

5.3.3.1.2. పశ్చాత్తప్త చిత్తుడు: (శ్రీనివాసపురం రామాచార్యులు)

బాగా చదువుకున్నవాడు, మంచి ఆశయాలు, ఉత్తమ సంస్కారం గల రమేష్ తనకు రాబోయే భార్య ఎలా ఉండాలో తన ఊహల్లో కొన్ని ఆలోచనలు ఈ విధంగా ఉంటాయి. *"తన భార్య అందాల రాణి అవ్వాలి. బాగా చదువుకున్నదయి వుండాలి. తన భార్యని చూసి అనుకూల*

దాంపత్యమేమిటో లోకు లర్థంచేసుకోవాలి" (ఆంధ్ర మహిళ పక్షపత్రిక 1955.12.1: 58). ఇలా మరెన్నో ఆశలు పెట్టుకున్న రమేష్ కు తల్లిదండ్రుల నిర్బంధం వల్ల రమతో వివాహం జరిగిపోతుంది. రమ అందమైనది. మూర్ఖురాలు కాదు. ఎంతో కొంత చదువుకుంది. ఇతరుల మనస్తత్వాన్ని అర్థం చేసుకోగలదు. ఈర్షా ద్వేషాలు ఆమెలో ఉండేవి కాదు. భర్తే తన సర్వస్వం అనుకుంటూ అందుకు అనుగుణంగా ప్రవర్తిస్తుంటుంది. కానీ రమేష్ మాత్రం తను ఊహించుకున్నట్టు తన జీవితం ఉండదేమో అని నిరాశ నిస్పృహలతో తన కోరికలు నెరవేరడం భ్రమే అనుకుంటూ ఉంటాడు. దీనివల్ల రమేష్ తన భార్యతో సంతోషంగా, ఆప్యాయంగా ఒక రోజైన మాట్లాడేవాడుకాదు. ఆమె మీద పూర్తిగా నిరాశ నిస్పృహలను చూపిస్తాడు. రమ హృదయాన్ని అర్థం చేసుకోలేకపోతాడు. రమ కూడా తనలాగే జీవితం పట్ల ఎన్నో ఆశలను పెట్టుకొని ఉంటుందని గ్రహించలేక పోతాడు.

ఇలా ఉన్న వీరి జీవితంలో ఒకరోజు రమ తండ్రి దగ్గర నుండి ఉత్తరం రావడంతో పుట్టింటికి వెళ్తుంది. ఆ తర్వాత రమేష్ భార్య రాసిపెట్టిన ఉత్తరాన్ని చదువుతాడు. అందులో రమ అనుభవిస్తున్న బాధను అంతా మాటల రూపంలో వ్యక్తీకరించి ఉంటుంది. చివరగా భర్త సుఖం కోరని భార్య బ్రతికి ప్రయోజనం లేదని మీ సుఖాన్ని కోరే మా అమ్మతో కూడా పుట్టింటికి వెళ్లి పోతున్నాను ఇక రాను. బహుశా రాదలుచుకోలేదు కూడా నేనిలా చేయటం తప్పనిపిస్తే క్షమించండి అని రాయడంతో రమేష్ జరిగిన దానిని తలుచుకొని పశ్చాత్తాప పడి రమను చూడడానికి బయలుదేరుతాడు. రమేష్ అత్తగారింటికి చేరుకునే సమయానికి రమ ఆత్మహత్య చేసుకుని ఉంటుంది.

రచయిత ఈ కథలో భార్యాభర్తల మధ్య అనురాగం, ఆప్యాయతలు ఒకరినొకరు అర్థం చేసుకునే మనస్తత్వం ఉండాలని, కలల లోకంలో ఊహించుకున్న ఆశలు ఎదుటి వ్యక్తిలో దొరకవేమో అని ఒక పిచ్చి ఆలోచనలతో సుఖమయమైన దాంపత్య జీవితాన్ని పాడు చేసుకోకూడదని అలా చేసుకున్న రమేష్ జీవితాన్ని ఉదాహరణగా చెబుతూ కథను ముగిస్తాడు.

5.3.3.1.3. వర్ష రాత్రి:

సుధాకర్ తల్లిదండ్రులు బాల్యంలోనే చనిపోయి ఉంటారు. స్వయంకృషితో చదువుకొని, స్వయంకృషితోనే ఒక ఉద్యోగం సంపాదించుకోగలుగుతాడు. తన కష్టాలన్నీ గట్టెక్కిన తర్వాత తనకి బంధువులు ఉన్నారంటూ కొంతమంది వచ్చి తన సౌజన్యాన్ని, సౌశీల్యాన్ని, సత్ప్రవర్తనను చూసి పిల్లని ఇస్తామని ముందుకు వస్తారు. శశిరేఖతో వివాహమవుతుంది. అయితే ఒక రోజు వర్షం పడుతూ ఉంటే వారి పూరి గుడిసె పైకప్పు నుండి చినుకులు రాలుతూ ఉంటాయి. ఆ పైకప్పు చూస్తే ఆకాశం కూడా బ్రహ్మాండంగా కనిపిస్తుంది. పెళ్లికి ముందే ఆ పైకప్పును బాగు చేయించాలనుకున్నాడు కానీ కుదరలేదు. ఆ వర్షపు రాత్రి కొత్తగా పెళ్లయిన దంపతుల మధ్య అన్యోన్యతను తెలియజేస్తూ ఈ కథ దాంపత్య జీవితంలోని ఒక మాధుర్య ఘట్టానికి నిదర్శనంగా రచయిత మలుస్తాడు. వర్షం వెలిసిన తర్వాత ఆ మరుసటి రోజు ఆ ఇంటి పై కప్పు మార్చడానికి

పనివాళ్ళు వస్తారు. అప్పుడు సుధాకర్ శశికళ ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూసుకుంటూ *"ఇల్లు యథాప్రకారం వుంటే ఎంత బాగుండేది! వర్షం మరోసారి...మరోసారి...ఆ జడివాన...చలిగాలి... ఉరుములు...మెరుపులు...తడి గుడ్డలు...వెచ్చటి చేతులు...కళ్ళలో ఎరుపు...కళ్ళు కూరుకుపోయే నిద్ర మత్తు...నిద్రపోనివ్వకుండా గుండెల్ని గిల్లిపెట్టే కోరికలు...చీకటి...భయం...వెచ్చని కౌగిట్లో స్వర్గపు తూగుటయ్యాలా....."* (ఆంధ్రసచిత్ర వారపత్రిక 10-08-1973: 26) అనుకుంటూ ఆ మధుర క్షణాలను తలుచుకుంటారు.

రచయిత ఈ కథ కొత్తగా పెళ్లయిన భార్యాభర్తల మధ్య అనురాగానికి, సర్దుకుపోయే గుణానికి మనస్తత్వానికి ప్రతీకగా చెప్పారు.

వీటితో పాటూ చెక్కుటద్దం, రక్త యజ్ఞం, వింతరైలు, దేవీపూజ, సబల, ఆడవాళ్ళ అంతరంగం వంటి కథల్లో భార్యాభర్తల మధ్య ఉండాల్సిన అనురాగాలను, ఆప్యాయతలను అలాగే ఆడవారి విపరీత మనస్తత్వాలను, సర్దుకుపోలేని విధానాలను, దాంపత్య జీవితంలోని ఓడిదుడుకులను చిత్రించిన కథలుగా కనిపిస్తాయి.

5.3.3.2. తల్లీ బిడ్డలకు సంబంధించిన కథలు:

5.3.3.2.1. అనుబంధాలు:

పేదరికంలో మగ్గుతున్న అనసూయమ్మ, అవధానికి నలుగురు పిల్లలు. దశరథ రామయ్య, అవధాని కొడుకును (బాబిగాడు) దత్తత అడుగుతాడు. పేదరికంలో అవస్థలు పడడం కంటే తన కొడుకు కళ్ళముందే సుఖిస్తూ ఉంటే తనకదే పదివేలు అనుకుంటూ తల్లి సరేనంటుంది. అవధాని మాత్రం దశరథ రామయ్య తదనంతరం వచ్చే ఆస్తి, అధికారం కోసం ఆశిస్తుంటాడు. దత్తత స్వీకారం అంగరంగ వైభవంగా జరిగిపోతుంది. దత్తత అనంతరం అనసూయమ్మ మనసంతా బాబు పైనే ఉంటుంది. ఒకరోజు బాబుని చూడాలని దశరథ రామయ్య ఇంటికి వెళ్తుంది. అయితే వారు ఇకమీదట బిడ్డను చూడడానికి రావడం వీల్లేదని తేల్చి చెప్తాడు. అవధానికి ఈ విషయం అవమానంగా తోచడంతో భార్యకు గట్టిగా చెప్తాడు. దీనితో దిగులు పెట్టుకొని అనసూయమ్మ నీరసించి చివరికి గుండెను రాయి చేసుకుంటుంది.

ఒకరోజు బాబుకి మసూచి సోకిందని దశరథ రామయ్య చెప్పి అనసూయమ్మను ఆ మసూచి తగ్గేంత వరకు బాబుని చూసుకోవడానికి రమ్మంటాడు. దశరథ రామయ్య భార్య మహాలక్ష్మి మసూచి అంటువ్యాధికి భయపడి బాబుని చూసుకోదు. ఆ కారణంగా అనసూయమ్మని రమ్మంటాడు. కన్నతల్లి ప్రేమ బాబుకి మసూచి సోకిందని తల్లడిల్లి, అది అంటువ్యాధని తెలిసినప్పటికీ అనసూయమ్మ బాబుకి మసూచి తగ్గేంత వరకు తన దగ్గరే ఉంటుంది. తర్వాత ఆ బిడ్డ తన వద్ద అలవాటు పడిపోతాడేమో అని తీసుకుని మహాలక్ష్మమ్మకు ఇస్తుంది. దీంతో దశరథ రామయ్య భరించలేక *"అనుబంధంలేని బంధం మాకెందుకమ్మా! బాబు నీవాడే! కన్నదానివి! పెంచినదానివి! బిడ్డ కోసం ప్రాణం లెక్కచేయని మాతృత్వం నీలోవుంది. అది ఉన్నచోటే బిడ్డ ఉండాలి! నీవే బాబుని తీసుకెళ్లమ్మా!"* (వల్లంపాటి కథలు, 2009: 296). అంటూ బాబుని

ఇచ్చేస్తాడు. బాబుకి మసూచి తగ్గిన తర్వాత అనసూయమ్మకు సోకుతుంది. అయినా బాబుకు తగ్గిందని సంతోషిస్తుంది చివరికి అవధాని పశ్చాత్తాప పడతాడు. రచయిత ఈ కథలో కల్మషం లేని తల్లి ప్రేమకు ఏదీ సాటిరాదనే సత్యాన్ని తెలియజేస్తాడు.

5.3.3.2.2. సూత్రధారి:

కుళ్ళు కంపుకొట్టే మురుగు కాలువ పక్కన భరించలేకపోతున్నప్పటికీ పెరుగుతున్న బాడుగలు కట్టలేక, శక్తికి మించిన ఆవాసాల్లో ఉండలేక, అక్కడే ఉంటున్న వారిలో సుభద్ర ఒకటి ఆమె భర్తను పనికి సాగనంపి తన పది నెలల బిడ్డను చంకనెత్తుకొని వీధిలోకి వచ్చి నిలబడుతుంది. ఒకరోజు ఇంటి ముందర గంగాబాయి కొడుకు గోపి, జానకమ్మ కొడుకు జగ్గు బంతాట ఆడుకుంటూ ఉండగా ఆ బంతి జారి మురుగు కాలువలో పడిపోతుంది. ఆ కంపులోని బంతిని తీసుకోలేక పిల్లలు వెళ్లిపోతారు. అంతవరకు తన పిల్లవాడు పెద్దయి అలా ఎప్పుడు ఆడుకుంటాడని కలలు కంటున్న సుభద్ర ఇక ఆ బంతిని వారు ముట్టుకోరు అని తెలిసి అది ఎలాగైనా తీసి దాచి పిల్లవాడు పెద్ద అయినాక ఇవ్వచ్చని కాలువలోకి దిగి బంతిని తీసుకొని దాస్తుంది. ఇంతలో గంగబాయి తన కొడుకును కొట్టుకుంటూ కాలువ దగ్గరకు వచ్చి బంతి కోసం చూడడం, తీరా కనపడకపోవడంతో పొరుగు వారందరినీ నోటికొచ్చినట్లు ఆడిపోసుకోవడం చేస్తుంది. ఆ తిట్లు తన కొడుక్కి తగులుతాయని బాధపడ్డ సుభద్ర అరగంట తర్వాత పిండి జల్లెడ తీసుకొని గంగాబాయి ఇంటికి వెళ్లి ఇందాక ఏదో బంతి పోయిందని హడావిడి చేస్తున్నారే, ఏదో బంతి లాంటిదేదో కాలువలో ఉంది అని చెప్తుంది. దాంతో గంగాబాయి కాలువ దగ్గరికి వెళ్లి బంతిని తీసుకొని నా *"నాలుక తెగిపోను తొందరపడి ఇరుగు పొరుగు వాళ్ళ అందరిని అనరాని మాటలు అన్నానే అయ్యయో ఎంత పని జరిగిపోయింది"* (పైరుగాలి, 1967: 29) అని అనుకుంటుంది. దీంతో సుభద్ర మనసు తేలికబడి సంతోషంగా కొడుకుని ఎత్తుకొని ముద్దాడుతుంది.

ఈ కథలో రచయిత పేదరికంలో మగ్గుతున్న తల్లి బిడ్డ కోసం ఆలోచించే విధానం చిత్రించబడింది.

వగపేటికి చల్ల చిందినన్, వికారాలు మమకారాలు వంటి కథల్లో తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను ఉన్నత చదువులను చదివిస్తే అటువంటి పిల్లలు పెద్దయ్యాక ఉద్యోగాలు వచ్చాక, కట్నాలిచ్చే అత్తమామలు వచ్చాక తల్లిదండ్రులను పట్టించుకోని విధానం చూడవచ్చు. అదే విధంగా బేతాళ కథలో మితిమీరిన తల్లి దండ్రుల ప్రేమల వల్ల కొడుకులు నాశనమయ్యే విధానాన్ని చూడవచ్చు

5.3.3.3. తండ్రీ కొడుకులకు సంబంధించిన కథలు:

5.3.3.3.1. మమకారం:

నారప్పకు ఒకడే కొడుకు. తల్లి చనిపోవడంతో ఆ లోటు తెలియకుండా పెంచి పెద్ద చేసి ఉన్నత చదువుల కోసం పట్నానికి పంపిస్తాడు. ఉన్న ఒకటిన్నర ఎకరా పొలాన్ని కూడా తన

కొడుకు నారాయణ చదువు కోసం అమ్మేస్తాడు. నాలుగు మేకలని మేపుకుంటూ కూలీనాలి చేసుకుంటూ అన్నీ పోగా మిగిలి ఉన్న ఆ పూరి గుడిలోనే కాపురం ఉంటాడు. ముసలితనంలో తండ్రికి చేదోడుగా ఉండకపోగా కనీసం సరైన పరామర్శలు కూడా చేసేవాడు కాదు నారాయణ. అయినా నారప్పకు కొడుకు మీద మమకారం ఏ మాత్రం తగ్గదు. జబ్బుతో బాధపడుతున్న నారప్పకు ఒకరోజు కొడుకు పెళ్ళని తెలుస్తుంది. అందుకు ఎంతో సంతోషిస్తాడు. కదలలేని పరిస్థితిలో కూడా కొడుకు పెళ్లికి వెళ్లాలనుకుంటాడు.

ఈ కథలో రచయిత ఉన్నత చదువుల కోసం పట్నం వెళ్లిన నారాయణ, తండ్రిని కూడా మరిచిపోయేటంతటి ఘనకార్యాలను, నిర్వాకాలను ఇందులో చూపిస్తాడు.

5.3.3.3.2. రంగయ్య స్వర్గం:

రంగయ్య బడిలో తోటమాలిగా, వాచ్ మెన్ గా పనిచేస్తూ ఉంటాడు. *"కూలో నాలో చేసి ఇన్నాళ్ళూ పెంచాము. ఇప్పుడు వాళ్లకూ రెక్కలోచ్చేసాయి ఇంకా ఎందుకు ఆ చాకిరి"* (ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 22-5-1974: 31)అని రంగయ్య పెళ్ళాం అంటుంది. అయితే రంగయ్య వినడు. కొడుకులు తండ్రిని ఏ పని చేయొద్దు మేము సాకుతాము అన్నా కూడా ఒంట్లో సత్తువ ఉన్నంతవరకు కష్టపడాలని తన పని తను చేసుకుంటూ ఉంటాడు. ఒకరోజు బడిలో కాలుజారి రంగయ్య కింద పడిపోతాడు. కాలికి పెద్ద దెబ్బే తగులుతుంది. రెండు నెలలు సెలవు పెట్టిస్తారు కొడుకులు. ఒక నెలకే కాలు బాగవుతుంది. రెండవ నెల లీవ్ ఎందుకని బాధపడుతూ ఉంటాడు. అయితే కొడుకులు తను ఉద్యోగం చేయాల్సిన అవసరం లేదని మేము చూసుకుంటామని అంటూ ఉండడంతో ఒకరి మీద ఆధారపడకూడదని హెడ్మాష్టర్ దగ్గరికి వెళ్లి కొడుకులకు తెలియకుండా దూరంగా ట్రాన్స్ఫర్ చేయించుకుని వెళ్ళిపోతాడు.

పిల్లల పట్ల బాధ్యతతో ఉన్న తండ్రి తన బాధ్యతను నిర్వర్తించాక కొడుకులు ఒక స్థాయికి వచ్చాక విశ్రాంతి తీసుకోకుండా ఒంట్లో సత్తువ ఉన్నంతవరకు ఏదో ఒక పని చేసి బతకాలని ఒక నిశ్చయం కలిగిన తండ్రి కథను రచయిత చాలా చక్కగా వివరించాడు.

5.3.3.4. అవ్వ మనవడు సంబంధించిన కథలు:

5.3.3.4.1. ఏకాకి:

చిన్నప్పుడే తల్లిదండ్రులను పోగొట్టుకున్న మనవడిని కామాక్షమ్మ అవమానాల నుండి కాపాడి పెంచి పెద్ద చేసింది. ప్రయోజకున్ని చేసింది. కానీ చివరికి అదే మనవడితో పనిమనిషిగా పరిచయం చేయబడుతుంది.

5.3.3.5. తాత మనవళ్ళకు సంబంధించిన కథలు:

5.3.3.5.1. సంకల్ప సిద్ధి:

జయరామయ్య మనవడు మధుమూర్తి. బి.ఎ. పూర్తి చేయగానే తండ్రి రాజారావు ఇంకా పై చదువులు చదవాలని చెప్తాడు. అయితే ఇది మధుమూర్తికి నచ్చదు. తండ్రి అంత కష్టంగా

ఉంటే బి.ఎల్. తీసుకో *"బృందావన్ గార్డెన్ లో షికారులా వైలా పచ్చీసుగా గడిచిపోతుంది"* (రక్త యజ్ఞం, 1965: 13) అంటాడు.

ఎటూ తేల్చుకోలేని మధుమూర్తి ఒక పది రోజులు తాత దగ్గర గడుపుదామని ముత్యాలపల్లికి వెళ్తాడు. తండ్రి చదువు ఆపోద్దంటున్నాడని తాతతో చెప్పి తన సలహాని అడుగుతాడు. దానికి తాత జయరామయ్య *"చదివేమి చదువురా యింకా?... నాకు పదిహేనో ఏటనే పెళ్లయిపోయింది...చదువుకు స్వస్తిజెప్పి పెండ్లి జేసుకుని పొలం పనులు చూసుకుంటూ ఇక్కడే ఉండిపో కోటి విద్యలు కొండ్రకు లోకువ! నా మాట విను బాగుపడతావు"* అంటాడు (రక్తయజ్ఞం, 1965: 103 104). తరువాత అదే ఊర్లోనే మాలతిని, మధుమూర్తి ఇష్టపడుతున్నాడని తెలిసి జయరామయ్య వారిద్దరికీ పెళ్లి చేస్తాడు. ఈ కథలో తాత మనవళ్ళ మధ్య సంబంధాన్ని అక్కడక్కడా తెలియజేస్తాడు రచయిత.

5.3.3.6. అన్నా తమ్ముళ్లకు సంబంధించిన కథలు:

5.3.3.6.1. పుట్టగొడుగు:

జాగీర్దారు పరమేశ్వరయ్య ఆ ఊరిలో బాగా డబ్బున్న వ్యక్తి. అతని భార్య కౌసల్య. వీరికి పుట్టిన వాడే సాంబశివం. వీరి ఇంట్లో నాలుగేళ్లుగా పనిచేస్తున్న పనిమనిషి బుచ్చి. ఈమెకు పుట్టిన కొడుకు మల్లుగాడు. ఈ మల్లుగాడు పరమేశ్వరయ్యకు బుచ్చికి పుట్టిన అక్రమ సంతానం. ఈ విషయం ఎవరికీ తెలియదు. సాంబశివం, మల్లుగాడు ఒకే తండ్రికి పుట్టినప్పటికీ ఒకరు కట్టుకున్న ఆవిడకి, ఒకరు ఉంచుకున్నామెకి పుట్టిన వారు కావడంతో ఈ విషయం ఎవరికీ చెప్పలేక మల్లుగాడి జీవితాన్ని చూస్తూ అప్పుడప్పుడు బాధపడుతుంటాడు పరమేశ్వరయ్య. కొన్నాళ్లకి పరమేశ్వరయ్య మరణిస్తాడు. అయితే అతను రాసిన వీలునామాలో సగం ఆస్తి మల్లుగాడి పేరుమీద రాసినట్లుగా ప్లీడర్ చెప్పడంతో సాంబశివం ఒక్కసారిగా తుళ్ళిపడతాడు. కారణం కౌసల్యకు తెలిసే ఉంటుంది. కౌసల్య మల్లుగాడికి సగమాస్తి ఇవ్వకపోయినప్పటికీ పాతిక ఎకరాలు ఇవ్వడానికి సమ్మతిస్తుంది. సాంబశివం కొంత విముకంగానే ఉంటాడు. అయితే ఈ ఆస్తి మల్లుగాడికి చేరే సమయానికి కుక్కకాటుతో తీవ్ర గాయాలపాలైన మల్లుగాడు చచ్చిపోయి ఉంటాడు.

రచయిత ఈ కథ రాసేనాటికే కాకుండా, ఈనాటికీ కూడా సమాజంలో అన్నదమ్ముల మధ్య సఖ్యత అనేది కరువవుతూనే ఉండదని మనం గమనించవచ్చు. ఈ కథలో మల్లుగాడు దగాపడ్డ తమ్ముడు గానే మిగిలిపోతాడు.

5.3.3.6.2. మెత్తని పులి:

"ఇంట్లో చండశాసనుడిగా, ఉద్యోగ జీవితంలో సుగ్రీవుడిగా, వూళ్ళో సర్వ సమర్థుడుగా బలరామయ్య కెలాటి పేరైతే ఉందో అతని తమ్ముడు గోపాలానికి అగస్త్యబ్రాతగా అంతటి ప్రఖ్యాతి ఉంది" (కమ్మ తెమ్మెర, 1968: 56).

బలరామయ్య సంఘంలో మంచి పేరు పలుకుబడి ఉన్నవాడు. కారణం అతని వాక్చాతుర్యం. తమ్ముడు గోపాలం మంచివాడు, పైగా ఉద్యోగస్తుడు. అయినప్పటికీ అన్న మాటకు ఎదురు చెప్పకుండా కుక్కిన పేనులా భయపడుతూ ఉండేవాడు. గోపాలానికి పెళ్లయినప్పటికీ తమ్ముని బలరామయ్య మామూలుగానే చూసేవాడు. దీంతో గోపాలం బాధపడుతూ ఉండేవాడు. పాతికేళ్ల జీవితంలో తను ఏ పని చేసిన అన్న కోసమే అని ఇప్పుడు తన భార్య చీర కొనిమ్మంటే కొనలేని తన అసమర్థతకి, అసహాయతకి బాధపడతాడు. ట్రాన్స్ఫర్ పెట్టుకుని అన్నకు దూరంగా వెళ్లాలనుకుంటాడు. రంగనాథం ద్వారా ఆస్తిలో వాటా కావాలని అన్నను అడిగిస్తాడు. విషయం తెలిసి బలరామయ్య తన గొంతులో ప్రాణం ఉండగా ఆ పనిచేయనని అంటాడు. ఆడిదేదో నన్నే నేరుగా అడగొచ్చు కదా గోపాలాన్ని అడుగుతాడు. అయితే గోపాలం ఆస్తి అడగలేదని వేరుగా ఉండాలని ఉందని చెప్తాడు. దీంతో బలరామయ్య 'నువ్వు ఇంకా ఒక్క క్షణం కూడా ఇంట్లో ఉండడానికి వీలులేదని వెళ్లిపొమ్మంటాడు'. దీనితో గోపాలం ఓ రక్తం పంచుకు పుట్టిన అన్నాదమ్ములు కొన్నాళ్ళపాటు కలిసి వుండి ఏవో యిబ్బందుల మూలంగా వేరుపడడం సమిష్టి కుటుంబాల్లో జరిగే మామూలు సంఘటనే. అన్నదమ్ములన్న తర్వాత ఎన్నాళ్లు కలిసి ఉన్నా ఎప్పటికైనా వేరుబాటు తప్పదు. ఈ మాత్రం పరిజ్ఞానం లేకుండా ఈయన తనపై మండిపడతాడెందుకు ఆస్తిలో వాటా అడగడం మహాపరాధమా! అంతమాటా అడగకముందే ఈయన తనను ఇంట్లోనుంచీ వెళ్ళిపోమ్మంటాడా? అదీ స్వంత ఇల్లయినా కాదు. అద్దె కొంప" (కమ్మతెమ్మెర, 1968: 67, 68) ఈ కథలో రచయిత తమ్ముడు పట్ల అన్నకు గల దారుణమైన మనస్తత్వాన్ని చిత్రించాడు.

5.3.3.7. అక్కా తమ్ముళ్ళకు సంబంధించిన కథలు:

5.3.3.7.1. పరిస్థితులు పరిణామాలు:

ఇంట్లో ఒక్క నిమిషం కూడా ఉండడని, వీధి వీధి తిరుగుతాడని, ఒక పనీ చేతకాదని అన్నయ్య భాస్కరాన్ని తిట్టడంతో భాస్కర్ కోప్పడి నేరుగా వాళ్ళ అక్క ఇంటికి వెళ్లిపోతాడు. అక్కయ్య అంటే పెద్దమ్మ కూతురు. ఈమె భర్త బడిపంతులు. ఆరుగురు పిల్లలు కలవాడు. అక్క ఇంట్లో కొద్దిరోజులు గడిపిన భాస్కరానికి కొంత విసుగు, చికాకు పుడుతుంది. ప్రతి పనీ తనకే చెప్పడం, పిల్లలు విసిగించడం లాంటి వాటి వల్ల భాస్కరము ఆ ఇంట్లో ప్రశాంతంగా ఉండలేక పోతాడు. " ఈ యింట్లో తాను పరాయివాడు. మాట్లాడాలంటే బిడియం, తినాలంటే బిడియం". (ఆంధ్రసచిత్ర వారపత్రిక. 25-11-1959:11). తన ఊరు వెళ్ళిపోవాలనుకుంటాడు. అయితే ఆత్మాభిమానం అడ్డు వచ్చి ఎలా అని ఆలోచిస్తూ ఉంటాడు. ఇంతలో తన అన్నయ్య వచ్చి తనని పిలుచుకొని వెళ్తాడు. మూడేళ్ల తర్వాత రైల్వేలో ఉద్యోగం సంపాదించి వెళుతుండగా అక్క ఇంటికి వెళ్తాడు. అంతకు ముందు లేని గౌరవ మర్యాదలను అక్కడ చూసి ఆశ్చర్యపడతాడు.

రచయిత ఈ కథలో ఏమీ లేనప్పుడు బంధువులు చూసుకునే విధానానికి (సొంత అక్కయినా సరే) ఉద్యోగం, గౌరవం, ప్రతిష్టలు వచ్చిన తర్వాత సొంతవారు చూసుకునే విధానానికి గల తేడాలను రచయిత చాలా చక్కగా చూపిస్తాడు.

5.3.3.8. బావ మరదళ్ళకు సంబంధించిన కథలు:

5.3.3.8.1.పైరుగాలి:

పచ్చటి పొలాలు, పైరుగాలులు, మామిడి తోపుల మధ్య ఉన్న మాలపల్లిలో అందమైన కుందనపు బొమ్మ రాధమ్మ. వాళ్ళ కులంలో బాగా చదువుకున్న అమ్మాయి ఎవరైనా ఉన్నారంటే అది రాధ. రాధకు పైరుగాలి అంటే చాలా ఇష్టం. మాలపల్లెకు, టౌన్ కు మధ్య ఒకటిన్నర ఫర్ లాంగ్ ఉన్న చెరువు కట్టపై ప్రతిరోజూ బడికి వెళ్లి చదువుకునేది. తండ్రి సూరయ్య తనని తహసీల్దారికి ఇచ్చి పెళ్లి చేయాలనుకుంటాడు. కానీ తల్లి మంగమ్మ, తన తమ్ముడు రాముడికి ఇచ్చి పెళ్లి చేయాలనుకుంటుంది. రాముడు, కామయ్య గారి పొలాల్లో పాలేరు పని చేస్తూ ముసలి తల్లితో అక్కడే గుడిసెలో నివసిస్తూ ఉంటాడు. పల్లెటూరి పరిహాసపు ధోరణి కల రాధ బడికి వెళ్తూ, వస్తూ ఉన్న సమయాల్లో రాముడు కనపడినప్పుడల్లా వారి మధ్య పలకరింపులు, చదువుకు సంబంధించిన సంభాషణలు జరిగేవి. రాముడికి చదువు లేకపోయినా హృదయ సంస్కారం ఉండడంతో తన బావ పట్ల ఇష్టాన్ని చెప్పకనే చెబుతుంది రాధ. చివరకు వీరిద్దరికీ వివాహం నిశ్చయం అవుతుంది.

ఈ కథలో పచ్చని పొలాలు, పైరు పంటలు, బావామరదళ్ళ అనుబంధాలు చక్కగా వర్ణించబడ్డాయి.

5.3.3.9. ఇతరాలు:

కుటుంబ వ్యవస్థలోని వివిధ బంధాలను తెలియజేస్తూ, అందులో గల ప్రేమలను, ఆప్యాయతలను, అనురాగాలను, ఈర్ష, అసూయ, ద్వేషాలను ఇలా రకరకాల అంశాలను కథా వస్తువులుగా తీసుకొని రాయబడిన కథలే కాకుండా కుటుంబ విచ్ఛిన్నానికి కారణమయ్యే పరిస్థితులు, వాటి నుండి బయటపడడానికి కావాల్సిన ఆదర్శాలతోపాటు అత్యంత ఆప్తులైన అక్క, చెల్లి, తమ్ముళ్ళ మధ్య ప్రేమ, ద్వేష భావాలు, ఈర్ష భావాలు, మోసగించబడే వ్యక్తిత్వాలు మొదలైన అంశాలతో కూడా కథలు వచ్చాయి. వాటిని అన్నింటినీ ఇక్కడ వివరించలేము కాబట్టి పేర్లు మాత్రమే ప్రస్తావిస్తున్నాను.

ఆడబిడ్డను ఎంత అల్లారు ముద్దుగా పెంచినా, ఏనాటికో ఒకనాటికి ఒకరి చేతిలో పెట్టాలి కదా అని ఏరి కోరి మగ బిడ్డ కావాలని ఆశించిన తల్లిదండ్రులకు ఆ మగ బిడ్డ అంత కూడెయ్యని పరిస్థితిని తెలుపుతూ 'మగపురుగు'; కృతజ్ఞత భావంతో తన అన్న బిడ్డ లలిత కోసం జగదీశం భార్య, కూతుర్ని వదిలి వచ్చిన చిన్నాన్న. తన చిన్నాన్న కూతురి కోసం భర్త దగ్గర ప్రాధేయపడి కుదరదని తనకొక సంబంధం చూసి ఆస్తి నంతటిని చెల్లెలు పేరున రాసి వెళ్ళిపోయే కృతజ్ఞతా పూర్వక ప్రేమలు తెలియజేసే 'కృతజ్ఞత'; పేదరికం అనుభవిస్తున్న కుటుంబం లోకులకు ఒక

వినోద ప్రదర్శనగా కనిపిస్తుందని రంగయ్య పాత్ర ద్వారా తెలియజేసే 'వినోద ప్రదర్శన'; తల్లి పోయిన తర్వాత తండ్రికి అన్నం పెట్టే విషయంలో ఒక ఒప్పందానికి రాలేని అన్నదమ్ముల పరిస్థితిని తెలుపుతూ 'రంగయ్య కొడుకులు'; అలాగే నడుమంత్రపు సిరి అనుబంధాలను ఏ విధంగా చంపుతుందో తెలుపుతూ 'చీమలు పెట్టిన పుట్టలు'; చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోయిన రామకృష్ణ వారాలు చేసుకుని చదివి పైకి వచ్చి ఉద్యోగం చేస్తూ పెళ్లి చేసుకుని భార్యతో కలిసి తను వారాలు చేసుకున్న ఏడుగురు తల్లుల్లాంటి వారి ఇంటికి వెళ్లి వారితో గల అనుబంధాలను గుర్తు చేసుకుంటూ వారిలో గల మాతృభావనను తెలియజేసే 'మాతృసప్తకం'; ఇంకా సబల సాక్షాత్కారం, సవతి బిడ్డలు వంటి కథలు కుటుంబ వ్యవస్థలోని ఏదో ఒక కోణాన్ని తీసుకొని రాయబడిన కథలే.

5.3.4. స్త్రీ సమస్యలను చిత్రించిన కథలు:

5.3.4.1 వరకట్న సంబంధ కథలు:

5.3.4.1.1. మూగ భావాలు:

వరకట్న విధానాన్ని వ్యతిరేకిస్తూ వరకట్నాన్ని ఆశించే వారిని పశువుల కంటే హీనమైన వారుగా తెలియజేస్తూ వ్యంగ్యంగా సెటైర్ లాగా రాసిన కథ ఇది.

మాధవయ్య తన కూతురు నీలాంబరిని ఇరవైనాలుగువేల రూపాయల కట్నం ఇచ్చి రాజమాణిక్యంతో వివాహం జరిపిస్తాడు. ఆ రాజమాణిక్యాన్ని గురించి 'చుక్క', 'నల్లగుండు' అనే ఆవులు ఎద్దేవా చేసుకుంటూ మాట్లాడుకోవడమే ఈ కథ. చుక్క ఒకరోజు నల్లగుండుతో *"మిత్రమా! నీకు గొప్ప ఆశ్చర్యకరమైన వార్త చెబుతున్నాను. ఉదయాది సాయం సమయం వరకూ రక్తాన్ని జార్చి పరిశ్రమించే నీకు విలువ కట్టిందీ లోకం. ధర పాతిక రూపాయలు. ఈ ఇరవై ఐదు రూపాయలకే నిన్ను మాధవయ్య పట్టుక వచ్చాడు. కానీ ఈ వరండాలో ఉన్న మానవుని ధర ఎంతో తెలుసుకుంటే అతని ముందు మనం ఏపాటి వారమో అర్థమవుతుంది"* (మూగ భావాలు కథ. ఆంధ్రసచిత్ర వారపత్రిక 1955. 09.14: 26) అని మాట్లాడుతూ ఇరవై ఐదు రూపాయలకే మనం ఉదయం నుంచి సాయంత్రం వరకు జీవితాంతం పనిచేస్తాం. అలాగే ఈ ఇంట్లో పని చేసే అమ్మయ్య (పాలేరు) ఏడాదికి ఇరవై ఐదు రూపాయలు చొప్పున కోడి కూత మొదలు జాములాత్రి దాకా పనిచేస్తాడు. అలాంటిది ఇరవైనాలుగు వేలు తీసుకున్న రాజమాణిక్యం ఎంత పని చేస్తాడో చూడాలనుకుంటాయి. ఆవులైన మనం రోజుకు ఒక బాణ కుడితి, ఒక మోపు గడ్డి తింటే రాజమాణిక్యం రోజుకు కడవ కాఫీ, దినానికి చట్టి అన్నం తింటూ ఏ పని చేయకుండా ఉండడాన్ని గమనిస్తాయి. వృథాగా ఒక రూపాయి కూడా ఖర్చు పెట్టని తన యజమాని అంత డబ్బు పెట్టి ఇతన్ని ఎలా కొన్నాడు అని ఆలోచిస్తాయి. ఆ తర్వాత ఆ ఇంట్లో రాజమాణిక్యం రాజభోగాలను వ్యంగ్యంగా మాట్లాడుకుంటూ, ఈ సమాజంలో ప్రతి స్త్రీకి ఒక జత కావాలి. అందుకని పురుషున్ని ఎంత డబ్బు అయినా పోసి కొంటారు ఐదువేలు ఏందీ రంగు, రూపు, చదువు మొదలైన వాటి భేదాల వల్ల లక్ష వరకు పురుషుడి విలువ ఉంటుంది. అంటూ మాట్లాడుకుంటాయి. ఇంతలో

నల్లగుండు మన యజమాని ఈ మానవున్ని కొనడంలో చాలా నష్టపడ్డాడు అనుకుంటాను. ఈ ఇరవై ఐదువేల రూపాయలు ఎలా సంపాదించగలరు అంటూ అడుగుతుంది. దానికి చుక్క *"అతనికేం? ఇంట్లో మరో దూడకాయను మేపుతున్నాడు. వాడికి ముక్కూ కళ్ళూ సరిగ్గానే ఉన్నాయి. ఇప్పటి మార్కెట్ ధరను బట్టి నలభై వేలు రావచ్చు. కానీ ఆ చదువులో ఇంకో తరగతి దాటితే అరవై వేలకు అమ్ముకోవచ్చు అని పెంచుకుంటున్నాడు"* (మూగ భావాలు కథ. ఆంధ్రసచిత్ర వారపత్రిక 1955. 09.14:27) అని ఉంటుంది. చివరికి వాడికి నలభైవేల కట్నంతో పెళ్లి కుదరడంతో "చూశావు! నలభైవేలకు కుదిరింది భేరం. నన్నడిగితే ఇది చాలా చౌకభేరం. కృష్ణా తీరాల్లో అయితే మరో పదివేలు ఎక్కువే తగిలేది. పెన్నా ప్రాంతాల్లో కూడా మంచి ధర పలుకుతుంది. మనిషి ముక్కు, ముఖం సరిగ్గా ఉండి కొంచెం చదువుంటే చాలు మంచిగిరాకీ ఉంటుంది" అంటూ చుక్క చెప్తుంది.

అన్నీ బాగున్న పశువు మార్కెట్లో ఏ విధంగా అయితే అధిక ధర పలుకుతుందో అదే విధంగా అన్నీ బాగున్న పురుషుడు కూడా మంచి రేటు పలుకుతాడు అంటూ, ఈ కథలో రచయిత వరకట్నాన్ని ఆశించే వారిని పశువులతో సమానమని ఇంకా ఎక్కువ మాట్లాడితే పశువులు కన్నా హీనమని వ్యంగ్యంగా చెప్తాడు.

5.3.4.1.2. సంధ్యా సమస్యలు:

రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గా పని చేసిన రాఘవేంద్రరావు దగ్గరికి ఒక రోజు నీలకంఠం వస్తాడు. నీలకంఠం స్వయానా రాఘవేంద్రరావు పెద్ద తండ్రి కొడుకు. ఎనిమిది మంది బిడ్డలతో చిన్న వకీలు గుమస్తాగా పనిచేస్తూ కుటుంబ భారాన్ని మోయలేక సతమతమైపోతూ ఉంటాడు. రాఘవేంద్రరావుతో *"అదికాదు రాఘవేంద్రం నువ్వు ఉద్యోగం నుంచీ రిటయిరైనమాట నిజమే! కాదనను. కానీ ప్రాపంచిక వ్యవహారాలేవీ పట్టించుకోకుండా తామరాకు మీద నీటిబొట్టులా కూచోడానికి ముందు నువ్వు స్వార్థంగానూ, పరార్థంగానూ చేయవలసిన పనులు కొన్ని వున్నాయి. నా మటుకు నా విషయాన్ని చూడు! ఈడొచ్చిన అమ్మాయిలిద్దరు యింట్లోవున్నారు. తీరామారా వీళ్ళకు సంబంధాలు కుదిరి పెళ్లి జరిగేలోపల కడగొట్టుపిల్లలకు కూడా వయసొచ్చేస్తుంది. పరిస్థితి ఇలా వుందా! పిల్ల కావాలంటూ కడపతోక్కివచ్చి అడిగే నాథుడుమాత్రం కనిపించడంలేదు. ఆడబిడ్డల్ను కన్ననేరానికి యిక మాయింట్లో అమ్మాయిలున్నారండోయ్ అని బాకావూదుతూ తిరగాలంటే అది నాబోటివాడికి సాధ్యమయ్యే పని కాదు, ఏం చేయమంటావు! రాత్రంతా నిద్రపట్టకపోతే తెల్లవారకముందే లేచి నిన్ను సలహా అడుగుదామని ఇలా పరుగెత్తివచ్చేశాను"* (మధురాంతకం రాజారాం కథలు6, 2013:300) అని అంటాడు. దీనితో రాఘవేంద్రరావు కొంత బాధ్యత వహించి నాతో చెప్పావు కదా ఇక నేను చూసుకుంటాలే అంటాడు. అలా నీలకంఠంతో పాటు ఆరోజు ఒకరిద్దరు పెళ్లి సంబంధాల గురించి అడగడంతో విసిగిపోయిన రాఘవేంద్రరావు ఒకరోజు, తన కొడుకులైన సూర్యనారాయణ, సుధాకరంను పిలిచి, ఇదిగో సూర్యం నువ్వు ఆఫీసుకు వెళ్ళగానే ఓ కాగితం తీసుకుని అక్కడ పనిచేస్తున్న పెళ్లి కానీ అబ్బాయిల

పేర్లన్నీ చిరునామాలతో సహా రాయి. సాయంకాలం లోపల తీరిక అయినప్పుడు అలాగే డి.ఈ.ఓ ఆఫీస్, డిస్ట్రిక్టుబోర్డు ఆఫీసుకు వెళ్లి జాబితా పూర్తిచేయాలి. సుధాకరం డిస్ట్రిక్టు కోర్టు, మున్సిపల్ ఆఫీసు మిగిలిన కార్యాలయాలన్నీ నీవే చూసుకోవాలి. రేపీపాటికి జాబితాలు నా చేతిలో ఉండాలి అని చెప్పి పురమాయిస్తాడు. కొడుకుల ద్వారా వచ్చిన జాబితాకు వివాహితుడి సంజాయిషీ పత్రం అని అందులో వివాహేతుడి పేరు, తండ్రి పేరు, చిరునామా, పెళ్లి చేసుకునే ఉద్దేశం ఉన్నదా లేదా, ఇప్పుడు నువ్వు పెళ్లి చేసుకోవడానికి ఉన్న అభ్యంతరాలు ఏమిటి అనే ప్రశ్నలతో కూడిన ఒక ఫారాన్ని జత చేసి వారికి పంపించి, ప్రత్యుత్తరం కోసం ఎదురుచూస్తూ ఉంటాడు.

వారం రోజుల తర్వాత రాఘవేంద్రరావు పోస్ట్ ద్వారా వచ్చిన అవివాహితుల సంజాయిషీ పత్రాలను పరిశీలిస్తాడు. అందులో చాలావరకు అబ్బాయిలు పెళ్లి కావాల్సిన అక్కాచెల్లెళ్లు ఉన్నారని వారి పెళ్లి తర్వాతే తాము పెళ్లి చేసుకుంటామని రాసి ఉంటుంది. అయితే వచ్చిన సమస్యల్లా ఒకటే. ఆడబిడ్డకు పెళ్లి కావాలంటే కట్నాలు కావాలి, కానుకలు కావాలి, పెళ్లి కుమారుడు తల్లికి తోబుట్టువులకు మర్యాదలు జరపాలి ఇవన్నీ జరగాలంటే డబ్బు కావాలి. ఈ డబ్బంటే గాని చెల్లెలికి పెళ్లి కాదు చెల్లెలికి పెళ్లి అయితే గాని అన్నయ్యకు పెళ్లి కాదు ఇలా ఉంటుంది.

ఇలాంటి సమస్యలను ఎలా పరిష్కరించాలి అనుకుంటూ రాఘవేంద్రరావు మరో ఉత్తరం చూస్తాడు. ఆ ఉత్తరం ఎవరివో కాదు వారి కొడుకులు రాసినవే.

ఆడపిల్లల పెళ్లి విషయం పద్మవ్యూహం లాంటి సమస్యని, అందులో చిక్కుముళ్లను విడదీయడానికి తమలాంటి అనుభవజ్ఞులు కలుగజేసుకోవడం సంతోషదాయకమని విన్నవిస్తూ, వారు గమనించిన విషయాలను ఈ విధంగా చెప్తారు. పెళ్లి అనే సాంఘిక ఆచారం ఆడపిల్లలకు ఎంత అవసరమో అబ్బాయిలకూ అంతే అవసరం. అయితే వయసు విషయంలో అబ్బాయి కంటే అమ్మాయికి త్వరగా పెళ్లి చేయాలని తల్లిదండ్రులు ఆశించడం. మరొకటి డబ్బున్న వాళ్ళు, శ్రీమంతులు ఎంత విచ్చలవిడిగా అయినా సరే పెళ్లిళ్లు చేయగలరు, కానీ పేదవాళ్లు అలా కాకుండా ఉన్నంతలో తూతూ మంత్రంలా చేసేస్తున్నారు. కొందరు మధ్యతరగతి వాళ్ళు మాత్రం ఈ సమస్యను పెద్ద సమస్యగానే ఎదుర్కొంటున్నారు. అయితే అలా ఎదుర్కొంటున్న వారే మన దేశంలో ఎక్కువగా ఉన్నారని ఇలా ఆడపిల్లల విషయాలు కట్నకానుకలని వగైరా వగైరా అని పేద తల్లిదండ్రులు పడుతున్న బాధలను తెలియజేస్తూ అలాంటి సమస్య సమూలంగా పోవాలంటే కట్నాలను సమూలంగా నాశనం చేయాలన్న ఆలోచన తెలియజేస్తారు. దానికి ఒక ఉపాయంగా *"కట్నం 'డిమాండ్' చేయడానికి అన్ని అర్హతలు కలిగివున్నా, దానిని నిరాకరించి, నలుగురికి ఆదర్శ ప్రాయంగా కార్యాచరణ చేసి చూపెట్టడానికి మీవంటి విజ్ఞులు ముందుకురావాలి"* (మధురాంతకం రాజారాం కథలు6, 2013:308) అని చెప్తూనే కట్నాలు ఇవ్వలేని పరిస్థితుల్లో ఉన్న రాఘవేంద్రరావు గారి చెల్లెలి కూతుళ్లను మాకు ఇచ్చి పెళ్లి చేసి ఆ మహోద్యమానికి మీరే అంకురార్పన చేయాలని చెప్తారు.

రచయిత ఈ కథలో వరకట్న దురాచారాన్ని మూలం నుండే నాశనం చేయాలని అందుకు విజ్ఞులైన పెద్దలు, యువతరం, ప్రభుత్వ శాఖల్లోని మంచి ఉద్యోగులు తోడ్పడాలని ఒక సందేశాన్ని ఈ కథ ద్వారా ఇస్తారు.

5.3.4. 1.3. కన్నె చెర:

చిన్న ఉద్యోగి అయిన వెంకట్రావు తన మిత్రుడు సుందర రామయ్యతో వేలకు వేలు కట్నాలు తెచ్చి తన కూతురికి పెళ్లి చేయలేని తన దీనస్థితిని ఇలా చెప్పుకుంటూ ఉంటాడు. *"ఈడొచ్చిన ఆడబిడ్డను ఇంట్లో వుంచుకొనడం నిప్పును ఒడిలో మూట గట్టుగొనటమేనంటారు! మూడేళ్ల నుంచీ ఒకటే ప్రయత్నం! అనంతం పంతుల్ని ఎరుగుదురా, అతడేమో పెళ్ళిళ్ళ పేరయ్య! మూడేళ్ళలో ఏడు సంబంధాలు తీసుకొచ్చాడు. కొన్ని మాకు, కొన్ని వాళ్లకు నచ్చక ఆ సంబంధాలు వీగిపోయాయి. మొన్న తెచ్చింది ఎనిమిదో సంబంధం. దూరా భారమునైనా ఎంచక రెండు వందల మైళ్ళదూరం వెళ్ళొచ్చాము తీరా వెళ్ళి మాట్లాడేస్తే వాళ్ళ రేటు ఇరవై వేలని తెలిసింది. ఎక్కడి నా బ్రతుకు, ఎక్కడి ఇరవైవేలు! నా జీవిత కాలంలో నేను సంపాదించినదంతా కలిపినా ఇరవై వేలు ఉండదు"* (మధురాంతకం రాజారాం కథలు 2. 1994: 374) అని తన పరిస్థితిని చెప్పుకుంటాడు.

అలాగే ఈ రోజుల్లో ఆడపిల్లల్ని కనడమే పెద్ద నేరంలా ఉంది. ఆ నేరానికి విధింపబడుతున్న శిక్షలు కూడా చాలా దారుణంగా ఉన్నాయి...అంటూ ప్రస్తుత సమాజంలోని ఆడపిల్ల తల్లిదండ్రులు పెళ్లి చేయడానికి పడుతున్న బాధలను వెళ్ళబోసుకుంటాడు. ఇలా వెంకటరావు తన బాధలను చెప్పుకుంటుంటే సుందర రామయ్య తన కొడుకు కృష్ణమూర్తి గురించి బాధపడుతుంటాడు. ఒకరిది కూతురి పెళ్లి బాధ అయితే, మరొకరిది కొడుకు ఉద్యోగ బాధ. తన కొడుకుకి ఉద్యోగం దొరకకపోవడంతో పెళ్లి కుదరక వెంకటరావు కూతుర్ని చేసుకోవాలి అనుకుంటాడు సుందరరామయ్య. ఒకరోజు ఉద్యోగ ప్రయత్నం కోసం హైదరాబాద్ వెళ్ళిన కృష్ణమూర్తి తనకు పరిచయమైన మిత్రుడు చెల్లెల్ని పెళ్లి చేసుకుంటున్నానని ఉత్తరం రాస్తాడు. అయితే కృష్ణమూర్తి స్నేహితుడు భాస్కరరావని అతడు వెంకట్రావు వదిన గారి కొడుకుని సుందరరామయ్యకు తెలియదు. రెండోది కృష్ణమూర్తి పెళ్లి చేసుకోబోతున్నది వైదేహిని అని కూడా తెలియదు.

ఈ కథలో రచయిత పేదవారైన ఆడపిల్లల తల్లిదండ్రులు వేలకు వేలు వరకట్నాలు సమర్పించుకుని పెళ్లి చేయలేని దీనస్థితిని వివరించడంతో పాటు, మరొక పక్కన మగ పిల్లల తల్లిదండ్రులు కొడుకుల చదువులని, ఉద్యోగాలని ఉన్న ఆస్తులు నమ్ముకొని బాధపడుతున్న పరిస్థితులను కూడా తెలియజేస్తాడు.

5.3.4.2. వేశ్య సంబంధ కథలు:

5.3.4. 2.1. పంకజం:

పంకజాన్ని గతిలేక వాళ్ళ తల్లిదండ్రులు ముసలాడికిచ్చి పెళ్లి చేస్తారు. వాడి హింసలు తట్టుకోలేక లారీ వెంకయ్యతో పారిపోతుంది. వెంకయ్య నమ్మించి వేశ్య గృహానికి అమ్మేస్తాడు. అప్పటి నుంచి తన బ్రతుకు ఒక యమలోకపు చిత్రవధలాగా ఉందని తెలిపే ఈ కథ, వేశ్య జీవితాన్ని కళ్ళకు కట్టినట్టు చూపిస్తుంది. జ్వరంతో బాధపడుతున్న పంకజం ఒకరోజు తనకొచ్చిన కల గురించి లోకమ్మతో ఈ విధంగా చెప్తుంది. భయంకరమైన యమలోకం అని 'భూలోకంలో అంత పాపం చేశావు ఎందుకు' అని యముడు నన్ను గద్దిస్తుండగా *"ఇందులో నా తప్పేమీ లేదు స్వామి! నన్ను ముసలాడికిచ్చి చేసింది మా అమ్మ. గతిలేక.. వాడు నానా హింసా పెట్టాడు... అప్పుడు లారీ వెంకయ్యతో పారిపోయాను... అంటే అది నా తలరాత, బ్రహ్మదేవుడలా రాసి పెట్టాడు, నేనేం చేసేది? వాడు మాత్రం– వెంకయ్య– నమ్మించి గొంతుకోశాడే, వాడికి లేదా శిక్ష?... వాన్ని వెయ్యండి నరకంలో! నాకు బ్రతికేదానికింకో మార్గమే లేదాయే! వహీదాబేగం నన్నేం ఊరికే కూర్చోబెట్టి మేపుతుందా! నేనై సంపాదించాలి, బ్రతకాలి!... నాలాంటి వాళ్ళు ఎంతమందో ఈ వృత్తిలో!... నేనున్న చోటే ఆరుమంది ఉన్నాం... రోజు బేరాలు తగులుతూనే ఉన్నాయి... ఆ వచ్చేవాళ్ళు సంగటేమిటి? వాళ్లకు శిక్ష వేయ్యండి, నా కెందుకు? రిక్షా వాళ్లకు, టాక్సీ వాళ్లకు, వహీదాబేగం, హుస్సేన్, రంగయ్య– వీళ్ళందరికీ మా సంపాదనే... తీరా మాకు మిగిలేది తిండి ఖర్చులు పోను బేరానికి రూపాయి; డాన్సు ఉంటే ఇంకో రూపాయి... నా తప్పేముంది ఇందులో నా తప్పేమీ లేదు! అంటూ వివరంగా చెప్పాను"* (ఆర్.ఎస్. సుదర్శనం కథలు, 2018: 77).

వేశ్యాగృహంలో యమలోకపు బాధలను భరించలేనని పంకజం లోకమ్మతో అంటుంది. దానికి లోకమ్మ *"చేతనైతే ఎవడైనా డబ్బున్నవాణ్ణి ఒకణ్ణి ఖాయం చేసుకోవాలి... అప్పు డిక్కడ్నుంచి వెళ్లొచ్చు! సుఖంగా బ్రతకవచ్చు..."* (ఆర్.ఎస్. సుదర్శన్ కథలు 2018: 79) అని చెప్తుంది. ఇలా గతిలేక వేశ్యాగృహంలో బతుకుతున్న పంకజానికి ఒక రోజు ఆఫీసరు తగులుతాడు. తనను ఇక్కడి నుంచి తీసుకెళతాను వస్తావా? అని అడుగుతాడు. అయితే అందుకు తను ఒప్పుకోదు రెండు నెలల తర్వాత వస్తాను అప్పటికి ఆలోచించి చెప్పు అని వెళ్ళిపోతాడు. ఆ తర్వాత ఊర్లోకి వచ్చిన కొత్త పోలీస్ ఆఫీసర్ పంకజాన్ని కోరుకోవడంతో అతనికి సుఖాన్ని పంచి పెట్టడానికి వెళుతుంది. ఆ పోలీస్ పైశాచికత్వాన్ని ప్రదర్శించి తన సుఖాన్ని తీర్చుకున్న తర్వాత ఆమెను వదిలిపెడతాడు. అదే సమయంలో ఆఫీసర్ తన కోసం వచ్చి వెళ్లినట్టుగా లోకము ద్వారా తెలుసుకుంటుంది పంకజం.

కొందరు డబ్బుకోసం ఆశపడి వేశ్యావృత్తిలోకి దిగితే మరికొందరు విధిలేక దిగుతారు. తమ కడుపు నింపుకోవడానికో లేక కుటుంబ పోషణ కోసమో ఆ వృత్తిలోకి దిగుతారు.

మరికొందరైతే ఇతరుల బలవంతంమీద లేక దౌర్జన్యం మీద ఆ వృత్తిలోకి ప్రవేశిస్తారు. అలా ప్రవేశించిన వారి జీవితాలు ఎంత దుర్భరంగా ఉంటాయో తెలిపే ఒకానొక కథే ఇది.

5.3.4.2.2. పువ్వులు నలగని రాత్రి:

తండ్రికి బాగాలేదని బుచ్చిబాబు భార్య శోభ పుట్టింటికి వెళ్లింటుంది. అదే అదునుగా భావించిన బుచ్చిబాబు నాగరత్నం కోసం రోడ్డు మీదకి వస్తాడు. నాగరత్నం ఒక వేశ్య. ప్రతిరోజు కాలక్షేపాన్ని పంచే మిత్రులు తారసపడడంతో వారిని తప్పించుకొని ఎదురుచూస్తూ ఉంటాడు. ఎంతకీ నాగరత్నం రాకపోవడంతో ఇంటికి వెళ్తాడు. అదే రోజు రాత్రి మూడింటికి తన భార్య ఇంటికి వస్తుంది. వక్రమార్గంలో ప్రారంభమైన నిన్నటి దినచర్య రాజమార్గంలో ముగిసినందుకు ఒక రకంగా సిగ్గుపడుతూ ఓ రకంగా సంతోషపడతాడు. ఆ మరుసటి రోజు రాత్రి నాగరత్నం కనపడటంతో నిన్న కనిపించలేదు నాగరత్నం ఎక్కడికి వెళ్లావు అని ప్రశ్నిస్తాడు. బుచ్చిబాబు లాంటి వాడు తనను పలకరించడమే గొప్ప అనుకుంటూ *"కారణం చెప్పమంటావా, నాయుడూ? నిన్న రాత్రి తలలో మల్లెలు ముడుచుకుని వీధిలోకి వచ్చాను. ఇంటి ముందరే రోడ్డు మీద మడతపెట్టిన కాగితం కనిపించింది. మడత విప్పి చూద్దునుగదా, అందులో మూడు రూపాయలున్నాయి. ఇంకెందుకు రావాలని నేను? ఇంటికే వెళ్ళిపోయాను. పూవ్వుల దండ తీసి గూట్లో పెట్టాను. ఈరోజు గడిచిపోయింది. రేపటి కెట్లా? గూట్లోని పువ్వులు తీసి తలలో ముడుచుకుని. ఇప్పుడు ఇలా వస్తున్నాను"* అని సమాధానం ఇస్తుంది. (నవ్వే పెదవులు ఏడ్చే కళ్ళు, 1975: 93) ఆమె వెళ్ళిపోతుంటే అతని దృష్టి ఆ పువ్వుల మీద పడి అవి పవిత్రతలోనూ, పరిమళంలోనూ ఆ పూలు దేవుడు సిగ మీద పెట్టిన తాజా పువ్వులకు తీసిపోవాలనిపించింది అతనికి.

ఈ కథలో రచయిత నలిగిపోతున్న నీతికి, స్త్రీత్వానికి, పవిత్రతకు, సన్మార్గానికి, సౌశీల్యానికి ప్రతిరూపాలు నాగరత్నం సిగలోని పువ్వులు అని చెబుతూ, ఆ రోజు రాత్రి పువ్వులు నలగని రాత్రిగా రచయిత చెప్తాడు.

5.3.4.3. ఇతరాలు:

5.3.4.3.1. కూనలమ్మ కోన:

నాగరత్నం ఏడవ ఏటనే తన తల్లి చనిపోతుంది. తండ్రి తాగుడు, తిరుగుళ్ళ కారణంగా నాగరత్నం తండ్రి ప్రేమను ఎప్పుడూ చూసి ఎరగడు. ఆ తర్వాత కాలం కలిసొచ్చి తండ్రి ప్రేమకు దగ్గరవుతున్న సమయానికి నరసయ్యను తీసుకువెళ్లి కటకటాల్లో పడేస్తారు. కారణం రంగనాథం కొత్తగా కొన్న కారును నేర్చుకుంటుండగా చేసిన యాక్సిడెంట్.

నరసయ్య జైలుకు పోతూ పోతూ కూతుర్ని రంగనాథానికి అప్పజెప్పి వెళ్తాడు. అప్పటి నుండి నాగరత్నం ఆ ఇంట్లోనే పెరిగి పెద్దవుతుంది. ఒకరోజు నాగరత్నానికి రంగనాథం భార్య వరలక్ష్మి జడలు వేస్తుండగా (రంగనాథం వయసు విషయమై జరిగిన సంభాషణలో) పరిహాసానికో, నిజానికో ఎవరో ఎందుకు నాగరత్నాన్ని పెళ్లి చేసుకోండి అని అంటుంది.

ఈ సంఘటన అనంతరం వరలక్ష్మి ఒక రోజు ఏమిటి నాగరత్నం నీ ఇష్టం ఏమిటో చెప్పనేలేదు మరి నీకు ఇష్టమైతే ఆ శుభకార్యం కాస్త జరిగిపోతే నాకు ఎంతో హాయిగా ఉంటుంది. ఎలాగో నాకు బిడ్డలు లేకపోయారు నీ కడుపున ఒక కాయ కాస్తే అంటూ అడుగుతుంది. ఈ విషయం నాగరత్నాన్ని కాదు రంగనాథాన్ని అడగాలని తనకి బాగా తెలుసు. ఇది జరిగిన రెండేళ్ల తర్వాత వరలక్ష్మి చనిపోతుంది. అంత్యక్రియల అనంతరం రంగనాథాన్ని మిత్రులందరూ ఇంకో పెళ్లి చేసుకోమని ప్రోత్సహిస్తారు.

అయితే ఒక రోజు నాగరత్నం చెత్త తోస్తుండగా రంగనాథం తనని గట్టిగా అదిమి పట్టుకుంటాడు విడిచి పెట్టు మామయ్య ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు అంటుంది. రంగనాథం ఆడదానికి అన్యాయం చేయదలుచుకుంటే అది ఎంతసేపు నా ఉద్దేశం అది కాదు. అందులోనూ నీకా అని అనడంతో నాగరత్నం అతని చేతిలో ఆట వస్తువు అవుతుంది.

కొంతకాలానికి రంగనాథానికి పెళ్ళని తెలిసి నాగరత్నం నిలదీస్తుంది. నాకు పెళ్లయితే నీకైనట్టు కాదా అంటూ తాత, తండ్రి చేసిన నిర్వాకాన్ని చెప్తూ ఉంచుకున్న వాళ్లకు వారెప్పుడూ అన్యాయం చేయలేదు. నేను అంతేనన్నట్లు చెబుతాడు. నాగరత్నం తను బతికుండగా రెండో పెళ్లి చేసుకొనివ్వనని గట్టిగా అరుస్తుంది. తర్వాత ఒక కేసు విచారణ కోసం వచ్చిన ఇన్స్పెక్టర్ కు తన బాధ చెప్పుకొంటుంది. లాభం లేకుండా పోతుంది. చివరికి మెడపట్టి గెంటి వేయడంతో తల పగులుతుంది.

రంగనాథాన్ని నమ్మి తన సర్వస్వాన్ని సమర్పించి చివరకు ఉంపుడుగత్తెగా ముద్ర వేయించుకున్న నాగరత్నం జీవితాన్ని రచయిత కళ్ళకు కట్టినట్టు చూపిస్తాడు.

5.3.4.3.2. లచ్చి బ్రతుకు: (మధురాంతకం దొరస్వామి)

లచ్చి గ్రామ సమీపంలోని ఏటి నుండి నీరు తీసుకుపోతుండగా ఒకరోజు కిష్టాయ్ అనే వడ్డివాడు వేళాకోళం చేస్తాడు. గడుసు పిల్లైన లచ్చి వారి మీద ఉమ్మేస్తుంది. అలానే మరొక రోజు తిన్న గిన్నె కడిగి ఆ నీళ్లను వీధిలో పారబోస్తుండగా అటుగా వచ్చిన కిష్టాయ్ పైన పడతాయి. దీంతో నీ పొగరు మోతుతనం ఇలా ఉందా? ఏం చేస్తానో చూడు అని కిష్టాయ్ లచ్చిని పట్టుకొని నోరు నొక్కి పెట్టి ఎడాపెడా రెండు చెంప దెబ్బలు వాయిస్తాడు. తర్వాత పెద్ద పంచాయతీ జరుగుతుంది. కొంతకాలం కిష్టాయ్ అజ్ఞాతంలోకి వెళ్ళిపోతాడు. పెద్దలు అసలు ఏమీ లేనిదే కిష్టాయ్ లచ్చిని ఎందుకు కొడతాడు. ఎన్నాళ్ళ సంబంధమో ఇది. ఎదిగిన పిల్లలకు సిగ్గులేదు అంటారు. ఇంత జరిగాక తన కూతుర్ని ఎవరు చేసుకుంటారని లచ్చిని భార్య చనిపోయి పెళ్లీడుకొచ్చిన కూతురు ఉన్న నలభైఐదేళ్ళ ముసలి వాడికిచ్చి పెళ్లి చేస్తాడు.

తెలిసో తెలియకో ఒక స్త్రీ చేసిన తప్పుకు సంఘం చేత, పరిస్థితుల చేత పరాభవించబడి తన జీవితాన్ని, యవ్వనాన్ని కాటికి కాలు చాచుకున్న ముసలివాడి పాద సేవకు అంకితం ఇవ్వబడే విధానాన్ని ఈ కథలో రచయిత చిత్రించాడు.

5.3.4.3.3. సభల:

విశాల, రామారావుది ప్రేమ వివాహం. వారిది అన్యోన్య దాంపత్యం. విశాల తన పాప పుట్టినరోజు పార్టీలో తన తండ్రి మరణ వార్త విని, పార్టీ అనంతరం తన భర్తతో తన గత జీవితాన్ని తలుచుకోవడం ఇందులోని కథ. ఈ కథలో గయ్యాళి గంప లాంటి సవతి తల్లి నిరాదరణలు, సవితి తల్లి బిడ్డల పోరు, పెళ్లయిన ఆరు నెలలకే వితంతువుగా మారిన స్త్రీ దుస్థితి, ఆ తర్వాత సంఘం తనని చూసే విధానం చిత్రించబడతాయి.

విశాల తల్లి చిన్నప్పుడే చనిపోవడంతో తండ్రి మరొక పెళ్లి చేసుకుంటాడు. సవతి తల్లి విశాలను రోగిష్టి వాడికిచ్చి పెళ్లి చేస్తుంది. అతను చనిపోవడంతో విశాల భర్త ఆస్తి కోసం తండ్రి సవతి తల్లి తన చేత ఒక కేసు వేయిస్తారు. ఆ కేసు వాదించే లాయరు ఆస్తి కాజేయొచ్చని తనని పెళ్లి చేసుకోవాలని చూస్తాడు. ఈలోగా విశాల మామతో ఒక ఒప్పందం జరిగి కొంత ఆస్తిని స్వీకరించి కేసును ఉపసంహరించుకుంటుంది. అయితే తనకు ముట్టిన దానికి తన తండ్రి, సవతి తల్లి ఆశించిన దానికి పొంతన లేకపోవడంతో ఈమెపై కారాలు మిరియాలు నూరి తమతో సంబంధ బాంధవ్యాలు లేవని తరిమేస్తారు.

ఆ తర్వాత హాస్టల్లో ఉంటూ చదువుకుంటుంది. అక్కడ సమాజంలో ఉన్న ఒంటరి ఆడవాళ్ళ కష్టం కొంత చవిచూస్తుంది. ఒకరోజు జీవితంపై విరక్తితో నదిలో దూకుతుంది. అప్పుడు రామారావు తనను చూసి కాపాడి తర్వాత పెళ్లి చేసుకుంటాడు. ఇది తన పూర్వ చరిత్ర. అయితే విశాల తన కూతురు పుట్టిన రోజు పార్టీ అనంతరం భర్తతో తన బాధను చెప్పుకుంటుంది, ఏనాటికైనా తండ్రి తనను అర్థం చేసుకొని పలకరిస్తాడని ఆశతో ఉన్న శారదకు తన తండ్రి మరణ వార్తను కూడా వారం రోజులు ఆలస్యంగా చెప్పి కడచూపుకు కూడా నోచుకోనీయకుండా చేసిన సవతి తల్లి నిర్వాకానికి బాధపడుతుంది.

5.3.4.3.4. అగంతుక:

సుశీల ఒక హాస్పిటల్లో నర్సుగా పనిచేస్తున్న సమయంలో డాక్టర్ భాస్కరరావుతో రిజిస్టర్ మ్యారేజ్ అవుతుంది. వీరిద్దరికీ ఒక బాబు కూడా పుడతాడు. ఇంతలో భాస్కర్ రావుకు విశాఖపట్నం బదిలీ అవడంతో అక్కడికి వెళ్తాడు. ఎంతకీ తిరిగి రాడు. సుశీల అతని కోసం ఎదురుచూస్తూ ఉంటుంది. సుశీల ఉద్యోగ బాధ్యతల నిర్వహణలో ఉండగా (నర్సు), ఒకరోజు ప్రసవం కోసం సరోజ అనే అమ్మాయి ఆసుపత్రికి వస్తుంది. ఆమె భర్త పేరు కూడా భాస్కరరావు అని తెలిసి సుశీల బాధపడుతుంది. ఒకరోజు సెలవు తీసుకొని మరుసటి రోజు ఉదయం తిరిగి హాస్పిటల్ కి వెళ్ళగానే సరోజ మగబిడ్డను ప్రసాదించి మరణించి ఉంటుంది. అయితే ఆమె బెడ్ కింద రాసిపెట్టిన ఒక ఉత్తరాన్ని సుశీల చూస్తుంది. అందులో *"నేను భాస్కరరావుగారి మొదటి భార్యను! అంటే నీ కాశ్చర్యంగా ఉండవచ్చు. అంటే మీ రిజిస్టర్ మ్యారేజ్ కి పూర్వం వారు వివాహితులు. ఈ మాట నిజం. నువ్వు నమ్మాలి. ఎవరు నమ్మినా ఎవరు నమ్మకపోయినా నిజం నిజమే"* (వల్లంపాటి కథలు, 2009: 307) అని ఉంటుంది. ఇంకా ఈ ఉత్తరంలో భాస్కర్ రావు

యొక్క పూర్వ వృత్తాంతం కూడా ఉంటుంది. ఈ కథలో రచయిత పురుషుని స్వార్థానికి బలైపోయిన స్త్రీ జీవితాన్ని చిత్రించారు.

ఇవే కాకుండా స్త్రీల పట్ల చూపించే శాడిజాన్ని కథా వస్తువుగా తీసుకొని రాసిన 'పురుషులకు ప్రత్యేకం', రాజకీయ లబ్ధికోసం తన కన్న కూతురు జీవితాన్ని పణంగా పెట్టే కథ 'గాయపడిన దేవత'. అవివాహితగా పల్లెటూర్లో పనిచేస్తూ శకుంతల టీచర్ ఎదుర్కొన్న సమస్యలతో 'వ్యవస్థ' కథ. నిస్సహాయురాలైన గృహిణి ఆర్థిక పరిస్థితిని తెలిపే 'వెలుగు సముద్రంలో చీకటి దీవి' కథ. మాతృత్వం కోల్పోయిన స్త్రీ బాధను తెలిపే 'దీపో పునర్జ్వలతి' కథ. క్షణికానందానికి ఆశపడి పచ్చని కాపురాన్ని నాశనం చేసుకున్న స్త్రీ కథను తెలియజేసే 'కర్త కర్మ క్రియ' ఇలా ప్రతి కథ స్త్రీకి సమాజంలో, కుటుంబంలో, వ్యవస్థలో ఎదురయ్యే ఏదో ఒక సమస్యను పట్టి చిత్రించి చూపించిన కథలే.

5.3.5. ప్రేమకథలు:

5.3.5.1. ముక్కుదాడు:

కథకుడైన మాస్టారు గారింటికి ఒక రోజు నరసయ్య తన కొడుకుతో వచ్చి, కుర్రాడికి హైస్కూల్ చదువు పూర్తయిపోయింది. కాలేజీలో సీటు వచ్చింది. భోజనం ఏర్పాట్లు అయితే ఏ హోటల్ లోనో ఏర్పాటు చెయ్యొచ్చు. కానీ ఎవరో ఒకరు నిశితంగా నిఘా వేసి ఉంచితే చెడు తిరుగుళ్ల పాలు కాడని అందుకోసం వీడిని ఇక్కడే ఉంచుదామనుకుంటున్నాను. ఇక వీడు నీ బిడ్డ అనుకోవాలి. నాకేంతెలీదు నెల నెలా డబ్బు పంపిస్తుంటాను. వాడి చదువుకు ప్రవర్తనకు మీదే పూచి అని చెప్తాడు.

మాస్టారు, తన భార్య రుక్మిణి కలిసి కుర్రాడికి వీధివైపున గదిని ఖాళీ చేయించి హోటల్లో భోజనాలు ఏర్పాటు చేస్తారు. అప్పటి నుంచి రాజారత్నం శ్రద్ధగా చదువుకుంటూ ఉంటాడు. తర్వాత కొద్ది రోజులకు అతడు చెడు తిరుగుళ్ళకు, చెడు సాహిత్యానికి అలవాటు పడతాడు. అబ్బాయి ఇలా చెడిపోతున్నాడని మాస్టారు గ్రహిస్తాడు. ఈ లోగా ఎదురింటి రాజశేఖరం గారి అమ్మాయి లతను రాజారత్నం ప్రేమిస్తాడు. లత కూడా అతనిని ప్రేమిస్తుంది. ఈ విషయం రాజశేఖరం గారి నలుగురు కొడుకులకు తెలిసి ఒకరోజు రాజారత్నం కాళ్లు చేతులు విరచాలని వస్తారు. రుక్మిణి మిగిలిన పెద్దలు ఏదోలా సర్ది చెప్పి ఆపుతారు. ఆ మరుసటి రోజే రాజశేఖర్ గారి అమ్మాయి రాజరత్నం ఇద్దరూ లేచిపోతారు.

కొన్నాళ్ళకి మాస్టారు నెల్లూరు వెళ్తున్నానని ఎవరితో అయినా మాట్లాడి రావాలనా అని రాజశేఖరం గారిని అడగగా అవసరం లేదంటాడు. అలా వెళ్లిన మాస్టర్ గారికి ఒక వర్షపు రాత్రి హోటల్లో రాజారత్నం కనిపిస్తాడు. హడావిడిగా ఇది సమయం కాదని, పనిమీద వెళుతున్నాను అని జండా మాను వీధిలో 64 నెంబర్ ఇల్లు అక్కడికి రండి మాట్లాడుకుందాం అని చెప్పి వెళ్ళిపోతాడు. మాస్టారు అక్కడికి వెళ్లి లతను పలకరిస్తాడు. వారి సంసార బాధలను అడిగి

తెలుసుకుంటాడు. రాజారత్నం మారిపోయాడని, ఉద్యోగం చేస్తున్నాడని, తను కూడా మిషన్ కుట్టుకుంటుందని చెప్తుంది లత. రాజారత్నంలో వచ్చిన ఈ మార్పుకు మాస్టారు ఆశ్చర్యపడతాడు.

ఈ కథలో రచయిత ప్రేమించి, లేచిపోయి ధైర్యంగా పెళ్లి చేసుకుని చెడిపోయిన వాళ్ళే కాదు ధైర్యంగా జీవితాన్ని ముందుకు నెట్టుకు వెళ్లే వాళ్లు కూడా ఉంటారని చెప్తాడు.

5.3.5.2. ప్రియ బాంధవి:

సత్యమూర్తి అనే ఉపాధ్యాయుడు జమీందారు వెంకటాద్రి కూతురు పంకజాన్ని ప్రేమిస్తాడు. కొద్దిరోజుల తర్వాత వెంకటాద్రికి వీరి విషయం తెలిసిపోతుంది. దీనితో సత్యమూర్తిని భయపెట్టి పాలేరు నరసింహులు సహాయంతో బలవంతంగా ఇంటిని ఖాళీ చేయించి, వారి బండిలోనే సరుకులను ఎక్కించి స్టేషన్ వరకు వదులుతారు. ఆ రాత్రి సత్యమూర్తి స్టేషన్ కి వెళ్లేసరికి అక్కడ పంకజం ఉంటుంది. అప్పటికే పంకజానికి తన తండ్రి ఏదో చేయబోతున్నాడని తెలిసి దాన్ని చూస్తూ ఒక బండిలో దాక్కొని ఉంటుంది. తీరా నరసింహులు ఆ బండినే వేసుకొని నరసింహులు ఇంటిని ఖాళీ చేయించి సామానంత ఆ బండిలోనే సర్ది నర్సింహుల్ని తీసుకొని స్టేషన్ కి వెళ్తాడు. తర్వాత వాళ్ళిద్దరూ కలిసి వెళ్ళిపోతారు. గ్రామీణ వాతావరణంలో కులమతాల పట్టింపుల వల్ల ప్రేమ పెళ్లిళ్లకు జమీందారులు కానీ, డబ్బున్నవారు కానీ తమ అంగీకారాన్ని తెలిపేవారు కారు. ఎన్నోరకాలుగా భయపెడతారు. అవసరమైతే హత్యలు కూడా చేయిస్తారు. వీటికి భయపడి కొంతమంది వెనుకంజ వేయరు. వీరిని కలపడానికి ఒక్కోసారి విధి కూడా వారికి సహాయం చేస్తుంది. ఎందుకంటే ప్రేమ శక్తివంతమైనది కాబట్టి. అలాంటి ఒక కథే ఇది.

5.3.5.3. మారెమ్మ గుడి:

ధర్మారెడ్డి ఇంటి పాలేరు మల్లన్న. ధర్మారెడ్డి కొడుకు రాఘవులు. రంగయ్య ధర్మారెడ్డి భూములు సాగు చేసే కవులుదారు. ఇతని కూతురే గంగు. మల్లన్న, గంగు ఇద్దరు ఒకరినొకరు ఇష్టపడతారు. రాఘవులు పట్టణంలో పై చదువులు చదువుకుంటూ ప్రతిసారి పరీక్షలు తప్పుతూ ఉండడంతో ధర్మారెడ్డి కొడుక్కి డబ్బులు పంపడం ఆపేస్తాడు. దాంతో రాఘవులు వారం తిరక్కుండానే పల్లెటూరికి వచ్చేస్తాడు. అక్కడ గంగును చూసి ఆమెను ఎలాగైనా అనుభవించాలనుకుంటాడు. ఒకరోజు మల్లన్న గంగును మారెమ్మ గుడి దగ్గరకు రమ్మని చెప్తాడు. అదే రోజు రాత్రి ధర్మారెడ్డి మల్లన్నను కళ్ళంలలో ఉన్న ధాన్యానికి కాపలాగా ఉండమని పంపిస్తాడు. అంతకు ముందే ధర్మారెడ్డి రంగయ్యను కలిసి గంగుకు, మల్లన్నకు పెళ్లి నిశ్చయం చేసి ఉంటాడు. కొంత పొలం కూడా వారి పేర రాస్తానని చెప్తాడు. ఈ విషయం చెప్పడానికి మల్లన్న గంగను మారెమ్మ గుడి దగ్గరకు రమ్మని చెప్తాడు. మల్లన్న చెప్పినట్లుగానే గంగు మారెమ్మ గుడి దగ్గరికి వచ్చి గంగు కోసం ఎదురు చూస్తూ ఉంటుంది. ఆ కటిక చీకట్లో గంగుపై మనసుపడ్డ దుర్మార్గుడు రాఘవులు మారెమ్మ గుడి దగ్గరకు వచ్చి గంగును పట్టుకుంటాడు. గంగు అతని పాదాలను పట్టుకుని వేడుకుంటుంది. రాఘవులు తన పైశాచికత్వాన్ని ప్రదర్శిస్తాడు. గంగు నిస్సహాయురాలై పడిపోతుంది. *"కొంతసేపటికి గంగుకు స్మృతి కలిగింది. తన మానం*

మంటగలిసింది. కన్యత్వము కలుషితమైంది. తిని పారేసిన "పులివిస్తరాకు"లా ఆ ముగుదకన్నెను నేలపాలుచేసి ఆ పశుప్రవృత్తి గల కర్కోటకుడు చీకటిలో ఎప్పుడో జారుకున్నాడు". (నవ్వినధాన్యరాశి. పుట: 83). ఆ రాత్రి తెల్లవారగానే రాఘవులు పెట్టా బేడా సర్దుకుని పెద్ద పరీక్షలు రాయడానికి పట్నం బయలుదేరుతాడు. గంగు తడి లేని బావిలో దూకి చనిపోతుంది. కళ్ళం నుండి ఊర్లోకి వచ్చిన మల్లన్నకు గంగు కనపడటం లేదన్న వార్త చెవినబడుతుంది. అనుమానంతో మారెమ్మ గుడి దగ్గర చూచి లేదని బావి దగ్గరికి వెళ్తాడు. బావిలో రాతి గుండ్ల మధ్య విగతజీవిగా పడి ఉన్న గంగను చూసి గుండెలు బాదుకుంటాడు. చివరికి తను కూడా బావిలోకి వాలిపోతాడు.

డబ్బులున్నవారి అహంభావానికి బలైపోయిన పేద ప్రేమికుల విషాదకథగా ఈ కథ మనకు కన్పిస్తుంది. *"ఈ కథ వ్రాతప్రతిగా ఉన్నప్పుడు ఆ కథ విన్న వేణు గారి చిన్నాన్న వెంకటరామిరెడ్డి గారు అందులో విషాదాన్ని భరించలేక కన్నీరు కారుస్తూ కథను సుఖాంతం చేయవలసిందిగా ప్రాధేయపడ్డారట"* (చిత్తూరు జిల్లా వందేళ్ళ కథా సారధులు2013: 109, 110).

5.3.5.4. నవ్వినధాన్యరాశి:

సి. వేణు రాసిన మరొక ప్రేమ కథ నవ్వినధాన్యరాశి. ఈ కథలో నల్లపురెడ్డి, మల్లి ఇద్దరూ ఒకరినొకరు ఇష్టపడతారు. వాళ్ళిద్దరూ రాత్రి సమయాలలో ఎవరికంటా పడకుండా రహస్యంగా కలుసుకునేవారు. ఈ విషయం తెలుసుకున్న మల్లి తండ్రి, నల్లపరెడ్డికి సంబంధించిన గడ్డివాములను, నిమ్మ చెట్లను, అరటిమాకులను నాశనం చేస్తాడు. ఈ పని చేస్తుంది తన తండ్రే అని గ్రహించిన మల్లి తన బావ నల్లపరెడ్డికి చెప్పాలని ఆరోజు రాత్రి పొలం దగ్గరికి వెళుతుంది. మల్లి వెళ్ళేసరికే తన తండ్రి నల్లపురెడ్డిని బాకుతో పొడిచి పారిపోతుంటాడు. అలా పారిపోతున్న మళ్లీ తండ్రిని నలపరెడ్డి తుపాకితో కాల్చేస్తాడు. మల్లి పొలంలోకి వెళ్తూ చనిపోయిన తండ్రిని చూసి నల్లపరెడ్డి దగ్గరికి వెళ్తుంది. అతను కూడా చావు బతుకుల్లో కొట్టుమిట్టాడుతూ చివరికి మల్లి ఒడిలో వాలిపోతాడు. ఇది చూసిన మల్లి *""బావా! నీవు ఒంటరిగా వెళ్ళలేవు. నేనూ నీ జంట బాయలేను. కాస్త ఆగు బావా! వస్తున్నా" అంటూ మళ్ళీ కూడా బలంగా గుండెల్లోకి చాకు గుచ్చుకొంది".* (నవ్వినధాన్యరాశి. పుట: 43). సి వేణు రాసిన పై రెండు కథలు కూడా భగ్న ప్రేమ కథలే.

అవశేషం, కార్టూన్ మొదలైన కథలో కూడా రాజారాం గారు ప్రేమ యొక్క మధురానుభూతిని తెలియజేశారు. శ్రీనివాసపురం రామాచార్యులు రాసిన కథ 'అనుకున్నట్టే అయింది'లో రాజారావు రైల్లో పరిచయమైన ఒక అమ్మాయిని చూసి ఇష్టపడతాడు ఆ తర్వాత ఆమె తలుపుల్లోనే ఎన్నో రాత్రులు గడుపుతాడు. వాళ్ళ నాన్న కొడుకు పెళ్లి చెయ్యాలని ఒక సంబంధం చూస్తాడు. ఆ అమ్మాయిని చూసి రావడం కోసం తండ్రితో కలిసి రాజారావు కూడా వెళ్తాడు. అయితే అక్కడ తను ప్రేమించిన అమ్మాయి ఉండటం చూసి సంతోషంగా వస్తాడు.

5.3.6. పెళ్లి సంబంధ కథలు:

కుటుంబ వ్యవస్థ స్థిరంగా ఉండాలంటే ముందుగా జరగవలసింది పెళ్లి. అటువంటి పెళ్లి (వివాహం) విషయంలో లేనిపోని అపోహలతో గాని, అతి జాగ్రత్తలతో గానీ, చాదస్తంతో గానీ, తొందరపాటుతో గానీ, అనవసరమైన జాప్యం వల్ల గాని, అవగాహన లోపం వల్ల గానీ మరే ఇతర కారణాలతో గానీ ఏ వయసులో జరగాల్సిన ముచ్చట ఆ వయసులో జరగకపోవడం అనేది మంచిది కాదని తెలియజేస్తూనే వివాహ వ్యవస్థ పట్ల కొన్ని సదభిప్రాయాలను తెలియజేసే కథలు ఈ ప్రాంతం నుండి వచ్చాయి. వాటిలో కొన్ని క్రింద వివరిస్తున్నాను.

5.3.6.1. గ్రూప్ ఫోటో:

ఈ కథలో కోదండం మొదట్లో ఒంటరితనాన్ని ఇష్టపడేవాడు. ఇతరులు అందరూ స్వార్థపరులని ప్రతివారు ఏదో ఒక లాభాన్ని ఆశించి బంధుత్వాలు పెంచుకుంటారని అతని విశ్వాసం. తల్లిదండ్రుల ప్రేమను విశ్వసించడం. పెళ్లికి కూడా సుముఖుడుగా ఉండడు. చివరికి ఒక ప్రమాదంలో గాయపడి ఆ తర్వాత తనకు ఒక తోడుగా స్త్రీ ఉంటే బాగుంటుందని అనిపించడంతో వివాహం పట్ల మొగ్గు చూపుతాడు. జీవితంలో మనిషి కొన్ని ఆటుపోట్లకు గురైనప్పుడు ఒక తోడు నీడ ఉండడం మంచిదని తెలియచెప్పే కథే ఇది.

5.3.6.2. వ్రత భంగం:

వ్రతభంగం కథలో సాంబయ్య కుటుంబం పట్టుదలకు పర్యాయపదం లాంటిది. సాంబయ్యకు గల నలుగురు బిడ్డల్లో ప్రకాశం పెద్దవాడు. ఉద్యోగం వచ్చిన తర్వాత పెళ్లి చేసుకోవాలి అనుకుంటాడు ప్రకాశం. తీరా ఉద్యోగం వచ్చిన తర్వాత తండ్రి బాగా సంపాదించు. పెళ్ళికి అప్పుడే ఏం తొందర మంచి డబ్బు ఉన్న వాళ్ళు వస్తే పెళ్లి చేస్తాం అంటాడు. ఇలాంటి పరిస్థితుల్లో కథకుడు సాంబయ్యతో చూడు బాబాయ్ *"బెండకాయగాని బ్రహ్మచారిగాని ముదిరిపోకూడదంటారు. ప్రకాశం నాకంటే ఒకటి రెండేళ్లు పెద్దవాడు. పెళ్లయివుంటే వాడూ ఈపాటికి బిడ్డల తండ్రై ఉండేవాడు. నేనిలా చెబుతున్నందుకు నువ్వు మరొకవిధంగా భావించవద్దు. నీ కర్తవ్యం నీకు తెలియనిదనిగాదు. కానీ ఒక సారి జ్ఞప్తికి తేవడం బాగుంటుందని భావ్యమని...."* అంటాడు (పునర్నవం, 1968: 199).

మనిషికి సంపాదన ఉన్నప్పుడే పెళ్లి చేసుకోవాలనుకోవడం సహజమే. అయితే ఏ వయసులో జరగాల్సిన ముచ్చట ఆ వయసులో జరగాలి. అలా కాదని డబ్బు సంపాదించాక పెళ్లి చేసుకోవచ్చనుకుంటే వయసు కాస్త ఐపోతుంది. అందుకని ఎప్పటి ముచ్చట అప్పుడు జరగాలని ఈ కథ ద్వారా రచయిత తెలియజేస్తాడు.

5.3.6.3. ఎదురుగాలి:

రంగనాథానికి ఐదుగురు మగ బిడ్డల తర్వాత కలిగిన కూతురు లీల. ఒకరోజు శేఖరంను పిలిచి అమ్మాయికి వీలైనంత త్వరగా పెళ్లి చేయాలనుకుంటున్నాను తగిన సంబంధం కావాలి అని అడుగుతాడు. నిజానికి ఇక్కడ రంగనాథం ఎప్పుడూ ఒకరి సహాయం తీసుకున్నవాడు

కాదు. విచిత్రమైన ఆలోచనలతో సాధారణ మానవుని ఆలోచన ఎక్కడైతే ఆగిపోతుందో అక్కడ ఆలోచన మొదలు పెట్టేవాడు. పెళ్ళికొడుకుని వెతకడంలో మంచి తెలివితేటలను ప్రదర్శిస్తాడు. చివరికి రఘుపతి అనే అబ్బాయిని నిర్ణయిస్తాడు. రఘుపతి ఒక రోజు తన కూతుర్ని చూసుకోవడానికి వచ్చి, తనకు సమ్మతమని చెప్పి వెళ్ళిపోతాడు.

నాలుగు మాసాలు గడిచినా రంగనాథం ఏ విషయం చెప్పడు. కారణం అబ్బాయి అమ్మాయిని చూడడానికి వచ్చినప్పుడు ఏదో జబ్బు ఉంటుందని తన ఫోటో, ఎక్స్ రే, మెడికల్ సర్టిఫికెట్స్ ఇవన్నీ చూసి గాని అబ్బాయిని ఓకే చేయడు. ఇలా ఈ కథలో తల్లిదండ్రులు పెళ్ళికొడుకు విషయంలో తీసుకునే అతి జాగ్రత్తలను, తద్వారా మంచి వారిని కూడా అనుమానించాల్సిన పరిస్థితులు ఎలా ఉంటాయో రచయిత తెలియజేశాడు.

5.3.6.4. కమ్మ తెమ్మెర:

పెళ్లిరోజు ఎంతో ఉత్సాహంతో శేషాద్రి తనకు రాబోయే భార్యను గురించి కలలు కంటూ ఉంటాడు. ఆమె తనకు నచ్చినట్లు ఉంటుందా ఉండదా అనుకుంటూ ఉంటాడు. కారణం అమ్మాయిని తను చూడకపోవడం. తల్లి బాగుందనడంతో పెళ్లికి ఒప్పుకొని ఉంటాడు. శేషాద్రి రాబోయే భార్యపట్ల *"అర్ధాంగి అనుకూలవతి అయితే సంసారం స్వర్గ సుఖాలకు ఆవాసమవుతుంది. కానైతే అందుకు ప్రతికూలంగా జరగదని మాత్రం పూచి ఏముంది? అందుకే మరి ఏనాడో లోకజ్ఞుడు వివాహాన్ని లాటరీతో ఉపమించాడు"* (కమ్మ తెమ్మెర, 1968: 3) అనే అభిప్రాయాన్ని కలిగి ఉంటారు.

అలా శేషాద్రి పెళ్లిని వర్ణిస్తూ, జీవితంలో వివాహం ఒక మజిలీ అని చెప్తూ సమాజంలో వివాహానికి ఉన్న ఉన్నతమైన స్థానాన్ని విలువను ఈ కథలో వర్ణిస్తాడు.

పై కథలే కాకుండా ఎక్కవలసిన రైలు, అక్కయ్య అంతరంగం వంటి కథల్లో కూడా వివాహ వ్యవస్థను గురించి, వివాహాల గొప్పతనాన్ని గురించి, వివాహం పట్ల సరైన అవగాహన లేని వ్యక్తుల గురించి, అది తెలుసుకొని వివాహం పట్ల మొగ్గు చూపుతున్న వ్యక్తులు గురించి చిత్రించిన విధానాన్ని మనం చూడవచ్చు

5.3.7. ఉపాధ్యాయ, ఇతర ఉద్యోగ సంబంధ కథలు:

5.3.7.1. బడిపంతులు:

బడి పంతులు జీవితం ఒక బడబానల ప్రవేశం వంటిదని తన తండ్రి చెబుతున్నప్పటికీ వినకుండా బ్రహ్మయ్య ఉపాధ్యాయ వృత్తి మీద మోజుతో *"విద్యాదానం చేసి దేశాన్ని ఉద్ధరించాలనుకుంటాడు. చిగురుటాకులవంటి చిత్తములతో మహాత్ములను సృష్టించాలని ఉవ్విళ్ళూరుతాడు"*. (ఆంధ్రప్రభ 1954.1.17: 5). మొదట్లో అతని జీవితం చాలా సాఫీగా సాగుతుండేది. భార్య సరస్వతి కూడా చాలా అనుకూలవతిగానే ఉండేది. బ్రహ్మయ్య ఆదాయం తక్కువే అయినప్పటికీ అది పల్లెటూరు కనుక సరిపోతుండేది. అక్షరాభ్యాసం చేయించే ప్రతి రైతు

కొంత ధనాన్ని ఇస్తూ ఉండేవారు. శిష్యవర్గం నుండి ఉడుతాభక్తిగా కూరగాయలు, బియ్యం ఇలా ఇంటికి సరిపడా వస్తువులు బ్రహ్మయ్యకు ఉచితంగా లభించేవి.

కొంత కాలానికి బ్రహ్మయ్య ఎలిమెంటరీ స్కూల్ నుండి ఉన్నత పాఠశాలకు మార్చబడడంతో కుటుంబాన్ని కూడా పల్లె నుండి తాలూకాకు మారుస్తాడు. మొదట్లో అక్కడ కూడా జీవితం సాఫీగానే నడిచేది. ఇంతలో విద్యా విధానంలో మార్పులు, పని భారం ఎక్కువ అవడంతో కుటుంబ భారం పెరుగుతుంది. కుటుంబ అవసరాలకు జీతం సరిపోక అప్పుడప్పుడు అప్పులు కూడా చేసేవాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధ్యాయులకు జీతం పదహైదవ తేదీ వరకు రాదని తెలుస్తుంది. అయితే మూడు నెలల వరకు కూడా జీతం రాదు. దీంతో బ్రహ్మయ్యకు అసలైన కష్టకాలం మొదలవుతుంది. బ్రహ్మయ్య ఇంటి యజమానిని, పాలవానిని, బియ్యం అమ్మే శెట్టిని బ్రతిమాలుకుంటాడు. తన ఏకాగ్రత అంతా కుటుంబ అవసరాలు తీర్చడంపైనే మళ్లుతుంది. తన పెళ్లి నాటి ఉంగరం ముప్పై రూపాయలకు అమ్మేస్తాడు. బియ్యం అమ్మే శెట్టి నిలదీయడంతో ఆ ముప్పై రూపాయలు తను తీసుకున్న అప్పుకు సరిపోతుంది. ఎంత బతిమిలాడినా ఇవ్వడు. బ్రహ్మయ్యకు నిరాశ అధికమవుతుంది. భార్య వండడానికి ఎసురు పెట్టి ఎదురుచూస్తూ ఉంటుంది. కానీ బ్రహ్మయ్య రిక్త హస్తాలతో వస్తాడు. బ్రహ్మయ్య అక్క విస్తర్లు కుట్టగా వచ్చే డబ్బును ఇంటి ఖర్చులకు పెడుతుంది. దాంతో గంజి కాచుకుని తలా కొంత తాగితే ఆ రాత్రి గడుస్తుంది. బ్రహ్మయ్య టీచింగ్ నోట్స్ రాసుకోవడానికి దీపంలో కిరోసిన్ కూడా ఉండదు. ఎవరైనా రూపాయో అర్ధరూపాయో ఇస్తే ఏపూటకాపూట గడుస్తుంది. లేకుంటే పస్తులే. ఒకరోజు బ్రహ్మయ్య కొడుకు గణపతి ఆహారం లేని కారణంగా ప్రార్థనా సమయంలో కళ్ళు తిరిగి పడిపోతాడు. తన స్నేహితుడు డబ్బు ఇవ్వటంతో ఆ పూట గడుస్తుంది. ఇలా దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్న బ్రహ్మయ్య ఇంటి అవసరాల కోసం తన పుస్తకాలను అమ్మేస్తాడు. సరస్వతి కమ్మలు అమ్మి ఇంటి అద్దె కడతాడు. ఇలాంటి బాధలతో కృంగిపోయి బ్రహ్మయ్య ఒకరోజు తన తుదిశ్వాసను వదిలేస్తాడు.

చాలీచాలని జీతాలతో శ్రమకు తగ్గ వేతనం లభించక, లభించే ఆ తక్కువ వేతనం కూడా సకాలంలో అందక, అప్పుల బారిన పడి ఆర్థికంగా కృంగిపోయిన ఉపాధ్యాయుల పరిస్థితిని రచయిత చాలా వాస్తవికంగా ఈ కథలో చిత్రిస్తాడు.

5.3.7.2. బ్రతుకు బరువు: (కాసారం కుప్పుస్వామి)

రామయ్య పంతులు ఒక సాధారణ బడిపంతులు. తల్లిదండ్రుల బలవంతంతో పెళ్లి జరిగిన తర్వాత ఒక మగ పిల్లవాడు కూడా పుడతాడు. తర్వాత తల్లిదండ్రులు చనిపోవడం, సొంత ఊర్లో ఉన్న భూములు వేలానికి వెళ్లిపోవడం కూడా జరుగుతుంది. ఆ తర్వాత పుట్టిన ఐదు మంది పిల్లలతో కుటుంబ భారం కష్టంగా తయారవుతుంది. ఇలాంటి సమయంలో తనతో పాటు టీచర్ ట్రైనింగ్ చేసిన రంగనాథం తనని కలుసుకోవాలని వస్తాడు. అతనికి ఒక పూట భోజనం పెట్టడానికి రామయ్య పడే అవస్థలు చూస్తే, సాధారణ బడిపంతుళ్ళ జీవనం ఏ విధంగా ఉంటుందో అర్థమవుతుంది. ఎన్నో స్కూళ్ళల్లో పనిచేసినప్పటికీ తను సాధించింది, మిగిలింది ఏమీ

లేదు *"కంగుందిలో కాబోలు పూలమాలవేశారు. పోయినది పోగా నా చేత పునరార్జితమైన యావదాస్తిని గంజి కేంద్రానికి వినియోగించాలని ఆ త్యాగానికి ఒక పూలమాల విలువ కట్టారు".* (బ్రతుకు బరువు కథ. భారతి 1958 డిసెంబర్: 69) అని తన పూర్వ దుస్థితిని గుర్తు చేసుకుంటాడు.

తన మిత్రునికి భోజనం పెట్టాలని ఇంట్లో బియ్యం కోసం ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ నిరాశే ఎదురవుతుంది. చివరికి తన మిత్రుడి పర్సు నుండే పది రూపాయలు తీసుకుని, అన్ని తగిన ఏర్పాట్లు చేస్తాడు. భోజనానంతరం చివరి ప్రయత్నంగా సేట్ జీని కలిసి డబ్బు తీసుకొని మిత్రునికి తెలియకుండా తన పర్స్ లో పెట్టాలని వెళ్తాడు. అక్కడ కూడా నిరాశ ఎదురవడంతో చేసేది లేక ఊరుకుంటాడు. తన పరిస్థితికి బాధపడుతూ ఉంటాడు. ఇంతలో రంగనాథానికి విషయం తెలిసి పోవడంతో చాలా బాధపడతాడు. బడిపంతులు జీవితం ఎంత దైన్యంగా ఉందో తెలియజేసే కథే ఇది.

5.3.7.3. అల్ప సంతోషులు:

శ్రీనివాసయ్య తన స్వగ్రామమైన వెంకటాపురంలో టీచరుగా రాకముందు ఆ బడిలో కుర్చీలు, బల్లలు మాత్రమే ఉండేవి. తను ఆ ఊరికి ఉపాధ్యాయుడుగా వచ్చాక తనకేగాక మరొక టీచర్ కి సరిపడే పిల్లల్ని కూడా చేరుస్తాడు. కారణం తనకింద ఒక అసిస్టెంట్ టీచర్ వస్తే తను బడికి రాకపోయినా పర్వాలేదని, స్కూలు మూతపడదని ఒక ఆశతో. "కానీ టీచర్ల గోత్రాలు జిల్లా బోర్డుకు బాగా తెలుసు. అందుకే టీచరొకటి తలిస్తే జిల్లా బోర్డొకటి తలుస్తుందన్నారు కొందరు రిటైర్ ఉపాధ్యాయ మేధావులు. ఈ ఆర్యోక్తి నిజం చేయడానికి కాబోలు నరసింహయ్య అనే టీచర్ని వెంకటాపురం బడికి హెడ్మాస్టరుగా వేసింది జిల్లాబోర్డు". (వల్లంపాటి కథలు,2009: 97)

దీనితో నిరాశ చెందని శ్రీనివాసయ్య, అది తన స్వగ్రామమే అని, తనకు స్థానబలం ఉందని అనుకుంటాడు. అలాగే శ్రీనివాసయ్య తనకింద అసిస్టెంట్ అని, తనకు అధికార బలం ఉందని నరసింహయ్య అనుకుంటాడు. ఇలా వీరి మధ్య ఒక కురుక్షేత్రం మొదలవుతుంది.

ఒకరోజు నరసింహయ్య తన కూతుర్ని అత్తారింటి నుంచి పిలుచుకు రావడానికి సెలవు మీద వెళ్తాడు. అదే రోజు శ్రీనివాసయ్య కూడా ఏదో అవసరం మీద బయటికి వెళ్తాడు. దీంతో స్కూలు మూతపడుతుంది. అదే రోజు స్కూల్ ఇన్స్పెక్టర్ వచ్చి స్కూల్ ని చూస్తాడు. ప్రెసిడెంట్ ధర్మయ్యను పిలిపిస్తాడు. స్కూల్ మూతపడ్డానికి కారణమైన వారి చేత ఒక స్టేట్మెంట్ తీసుకుంటాడు. విచారణకు ఏర్పాటు చేస్తాడు. ఈలోగా నరసింహయ్య, శ్రీనివాసయ్యలు ఒకరి గురించి ఒకరు తప్పులను, వ్యతిరేక సాక్షులను సేకరించుకుంటారు. చివరికి వెంకటాపురం బడిని ఏకోపాధ్యాయ పాఠశాలగా మారుస్తారు. నరసింహయ్యను ఒక అడవి కొంపకు అసిస్టెంటుగా, శ్రీనివాసయ్యను ఆరు మైళ్ళ వ్యాసార్ధంలో బస్సు రూట్ లేని ఒక తేనె తెట్టు లాంటి పల్లె పట్టులో కొత్తబడిని ప్రారంభించమంటారు. కృష్ణమూర్తి అనే కొత్త టీచరుని వెంకటాపురానికి బదిలీ చేస్తారు.

శ్రీనివాసయ్యను స్వగ్రామం నుండి బదిలీ చేయించినందుకు నరసింహయ్య, నరసింహయ్యను హెడ్మాస్టర్ గిరి నుండి దింపించినందుకు శ్రీనివాసయ్య ఆనందంతో తబ్బి ఉబ్బిపోతారు రెండు నెలల తర్వాత వరకట్నం కింద ఉద్యోగాన్ని జమ కట్టుకొని మిగిలిన లాంఛనాలతో కొత్త టీచర్ కృష్ణమూర్తికి ధర్మయ్య కూతురు మంగతాయారుకు ఆరు నెల్లనాడు నిశ్చయమైన పెళ్లి వైభవంగా జరుగుతుంది.

ఇద్దరు కొట్టుకుంటుండగా మూడో వాడికి లాభం చేకూర్చినట్లు ఈ కథలో వృత్తిపట్ల గౌరవం లేని ఇద్దరు ఉపాధ్యాయులు చేసిన పనికి ధర్మయ్య లాభపడిన విధానాన్ని చూడవచ్చు.

5.3.7.4. తాను వెలిగించిన దీపాలు:

కానగ నూతన కృష్ణశర్మ ఒక రిటైర్డ్ బడిపంతులు. తన కూతురును తమిళ దేశంలో ఇచ్చి ఉంటాడు. అల్లుడు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి. భార్య చనిపోయిన తర్వాత అల్లుడు దగ్గరే ఉంటాడు. అల్లుడు జబ్బు చేసి చనిపోవడంతో కుటుంబ బాధ్యత తన మీద పడుతుంది. ఇలాంటి నిస్సహాయ పరిస్థితుల్లో తాను పనిచేసిన రంగసముద్రం పాఠశాల మీద అభిమానంతో సహాయము లభిస్తుందని వెళ్తాడు. అప్పటికి అక్కడ పరిస్థితులు చాలా మారిపోయి ఉంటాయి. ఎలిమెంటరీ స్కూల్ కాసస్తా హై స్కూలై ఉంటుంది. పాత పరిచయస్థులు ఎవరూ లేకపోవడంతో కృష్ణశర్మ ఒక యాచకుడు లాగా అక్కడివారికి కనిపిస్తాడు. ఆత్మాభిమానం దెబ్బతిన్న కృష్ణశర్మ ఊర్లోకి కూడా వెళ్లకుండా రైలుకి తిరుగు ప్రయాణం అవుతాడు. టిక్కెట్టు లేని కారణంగా రైల్వే వాళ్లు తుమ్మలకోనలో దింపేస్తారు. స్టేషన్ మాస్టర్ శర్మ గారి పూర్వ విద్యార్థి కావడంతో మొదట్లో తనని గుర్తించకపోయినప్పటికీ తర్వాత గుర్తుపట్టి తన పేరు గోపాలమని, తమ క్రమశిక్షణ నన్ను ఇంతటి వాడిని చేసిందని తగిన గౌరవ మర్యాదలు చేస్తాడు.

చివరకు ఇల్లు చేరుకున్న కృష్ణ శర్మ మనవరాలిని పిలిచి దగ్గర కూర్చోబెట్టుకుని *"చూడు తల్లి! నీకు ఇప్పుడు పదిహేడేళ్లు. నీ పెళ్లి కిప్పుడు మించిపోయిందేమీలేదు. ఇంత చిన్న వయసులో నువ్వు సంసారభారాన్ని మోయలేవు. ఈ రోజే నేను అప్లికేషన్ వ్రాసి పడేస్తున్నాను. నువ్వు ట్రెయినింగు స్కూల్లో చేరు. పిల్లలు భగవత్స్వరూపులు. వాళ్ల మధ్యన వుండటమే భగవత్సన్నిధానంలో ఉన్నట్టు. అంతకంటే ఆనందకరమైన వ్యాసంగం మరొకటి లేదు"* అంటారు. (తాను వెలిగించిన దీపాలు, 1968: 15).

రంగసముద్రంలో దొరకని గౌరవ మర్యాదలు తన శిష్యుని కారణంగా తుమ్మలకోనలో లభించినందుకు ఆనందపడుతూ శిష్యుల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోవడం కంటే ఉపాధ్యాయులకు కావాల్సిందేముంటుంది అనే ఒక సందేశాన్ని ఈ కథ ద్వారా తెలియజేస్తాడు రచయిత.

5.3.7.5. బాలామణి:

సుందరాచారి ఎస్.ఎస్.సి దాకా చదువుకొని సెకండరీ గ్రేడ్ ట్రైనింగ్ చేసి రెండేళ్ల పాటు ఒకటి రెండు స్కూళ్లలో పనిచేసి, నెమలికోనకు సింగిల్ టీచరుగా బదిలీ అవుతాడు. తన

మేనమామ కూతురు బాలామణిని పెళ్లి చేసుకొని నెమలికోనలో నివాసం ఉంటాడు. ఆ ఊరి ధనవంతుడైన అబ్బా నాయుడు దృష్టి బాలామణిపై పడుతుంది. తన కోరిక తీర్చమని అడుగుతాడు. బాలామణి నిరాకరిస్తుంది. దీనితో సుందరాచారి తన దగ్గర తీసుకున్న డబ్బును తక్షణం ఇమ్మంటాడు. తన దగ్గర లేకపోయేసరికి జీతం రాగానే ఇస్తానంటాడు. అప్పు తీర్చలేని వాడికి అంత అందమైన పెళ్ళాం ఎందుకంటాడు. ఈ అవమానాన్ని భరించలేక బాలామణి ఉరివేసుకుని చనిపోతుంది. దీంతో సుందరాచార్య బాధకు అవధులు లేకుండా పోతాయి.

కుటుంబాన్ని పోషించడానికి కూడా సరిపోని ఈ బడిపంతులు జీతాలు తద్వారా ఎదురయ్యే కష్టాలు ఈ కథలో చూడవచ్చు.

5.3.7.6. సమర్థుడు:

రాఘవయ్య ఇరవై ఏళ్ల అనుభవం ఉన్న ఉపాధ్యాయుడు. పరీక్షలు తప్పిన వారికి ప్రత్యేక ట్యూషన్ పెట్టుకొని వారి కోసం జైత్రయాత్ర చేసి మార్కులు వేయించి సులభంగా పాస్ చేయించే వ్యక్తి. అపజయాన్నైనా, లోటుపాట్లనైనా లౌక్యంతో ముందుకు నెట్టుకుపోగల సమర్థుడు. ప్రమోషన్ కోసం ఎదురు చూస్తూ ఉంటాడు. ఎదురుచూసిన ప్రమోషన్ ఎంతకీ రాకపోవడంతో మనోవ్యధతో పక్షవాతానికి గురవుతాడు.

వృత్తి పట్ల గౌరవం లేని ఉపాధ్యాయుడు లేనిపోని డాబులకు పోయి, ఎదురుచూసిన ప్రమోషన్ రాకపోవడంతో పక్షవాతానికి గురై ఆరోగ్యాన్ని పాడు చేసుకున్న ఉపాధ్యాయుని కథ ఇది.

పై కథలే కాకుండా నవ్వే పెదాలు ఏడ్చే కళ్ళు, అడ్డదారి, పిచ్చి వెంకటరావు, మసిమరక, మంచివాడికి సన్మానం, అంగరక్షకుడు, హోలీకులూ కుశలమా, అందని పళ్ళు, బెరామీటరు, రామారావు చతుర్లోకాలు, రంగయ్య స్వర్గం, అడిగిరాని వరాలు, ప్రజాపతి మొదలైన కథల్లో ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారి ఆర్థిక పరిస్థితులు, వృత్తి పట్ల వారు చూపే ఆదర్శాలు, నిజాయితీ లేని ఉపాధ్యాయుల మనస్తత్వాలే కాకుండా, వాచ్ మెన్, అటెండరు ఇతరేతర ఉద్యోగస్తుల జీవితాలలోని పరిస్థితులను తెలియజేశాయి.

5.3.8. రచయితలకు సంబంధించిన కథలు:

5.3.8.1. ఎడారి పువ్వు:

కవిగా పేరుపొందిన ప్రభాకరం ఆంధ్రదేశంలో పేరుపొందిన రచయిత. పుట్టు దరిద్రుడు. డబ్బు కోసం నానాయాతన పడుతుంటాడు. ఎన్నో కథలు రాశాడు. ప్రచారంలో ఉన్న అనేక పత్రికలు ఆయన రచనలను ప్రచురించాయి. కానీ ఎవరో ఒకరిద్దరు తప్ప నాలుగు రూపాయలు ఇచ్చినవారు లేరు. ప్రభాకరానికి నలుగురు పిల్లలు, తల్లి, తండ్రి ఇలా పెద్ద సంసారం. కుటుంబాన్ని పోషించడానికి ఏవో నాలుగు ట్యూషన్లు చెప్పుకునేవాడు. ఆ చుట్టుపక్కల ధనికులు, కుబేరులు, కోటీశ్వరులు ఉన్నప్పటికీ వారికి ఎవరికీ కళాభిమానం లేకపోవడంతో ప్రభాకరం పరిస్థితి ఎడారిలో పూసిన పువ్వులా ఉండేది.

ఒకరోజు వెంకటరావు ప్రభాకరాన్ని ఒక సమావేశానికి తప్పకుండా హాజరు కావాలి అని పిలుస్తాడు. అయితే చార్జీల విషయం మర్చిపోయానని బాధపడతాడు. తీరా వెంకట్రావు వెళ్లిన నాలుగు రోజులకి ప్రభాకరంకి మనియార్డర్ వస్తుంది. అదే సమయానికి అప్పుల వాళ్ళు వచ్చి ఆ డబ్బుని లాక్కుపోతారు. సమావేశం ముందు నాటికి ఎలాగోలా డబ్బు సర్దుకోవచ్చు అనుకుంటాడు. కానీ కథ అడ్డం తిరుగుతుంది. ఉన్న ఒక్క జత బట్టలు ముసురు పట్టి ఉండడం వల్ల చాకలామె తెచ్చివ్వదు. మాసిపోయినప్పటికీ వేసుకున్న జుబ్బాతో పోదాం అనుకుంటే అది చినిగిపోయి ఉంటుంది. ఇలా బట్టలు ఉండవు. క్షవరం కూడా లేదు. బండికి సమయం కూడా కావస్తుంటుంది. ప్రభాకరానికి ఏం చేయాలో అర్థం కాకపోవడంతో ఇంట్లో ఉన్న ఒక బిందెను పది రూపాయలకి తాకట్టుపెట్టి, ట్యూషన్ డబ్బులుగా రెండు రూపాయలు తీసుకొని ప్రయాణం అవుతాడు. పదకొండు ముప్పావు రూపాయలు టికెట్టుకి సరిపోతుంది. ఎలాగోలాగా సమావేశం వెళ్లి ముగించుకుంటాడు. భోజనాల సమయంలో తన ముందు పంచభక్ష పరమాన్నాలు ఉన్నప్పటికీ, ఇంట్లో పిల్లలు, తల్లీదండ్రి, భార్య తినడానికి బియ్యం కూడా లేని పరిస్థితిలో ఉన్నారని గుర్తు వచ్చి నాలుగు మెతుకులు కూడా తినలేక పోతాడు. ఆ రాత్రి అక్కడే పడుకుని ఉదయం ప్రయాణం అవుతాడు. వెంకట్రావే స్టేషన్ కి వచ్చి టికెట్ కొనిస్తాడు. దారి ఖర్చులకి అడగడం సభ్యత కాదనుకున్నాడు ప్రభాకరం. దారి ఖర్చులకి ఇవ్వడం మర్యాద కాదనుకుంటాడు వెంకటరావు.

చివరికి ప్రభాకరానికి మిగిలింది ఫ్రేమ్ కట్టించి ఇచ్చిన పంచరత్నాల పటం. ఆ రత్నాలు కానీ రత్నాలు ఇస్తే గుక్కెడు కాఫీనైనా లభిస్తుందా అని కవిగారు చెవులు మూసుకుని మూడువందల మైళ్ళు ప్రయాణం చేసి ప్రాణాలతో ఇల్లు చేరుకున్నాడు.

నాటి సమాజంలో రచయితల ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో ఈ కథ మనకు చెప్తుంది. నాటి పరిస్థితే కాదు నేటి వరకు కూడా తెలుగు సాహిత్యంలో పేరు మోసిన చాలామంది చివరి దశలో తిండికి దిక్కులేక అలమటించిన వారు ఉన్నారు. ఈ కథలో ప్రభాకరం ఆంధ్రప్రదేశ్ లో పేరు ప్రతిష్ఠలు ఉన్న రచయిత అయినా, తను ఎవరో తెలియని వారు లేనంత ప్రచారంలో ఉన్నా, అన్ని పత్రికలూ ఆయన రచనలు అచ్చు వేస్తున్నా ఏ పూటకాపూట తిండికి గడవలేని పరిస్థితి ఈ కథలో చూడవచ్చు.

5.3.8.2. కథా వస్తువు:

తుకారామని సుప్రసిద్ధ కథకులు. ఒక సభలో కథా సాహిత్యం గురించి ఉపన్యసిస్తూ *"ఈమధ్య వెలువడుతున్న కథా సాహిత్యాన్ని అత్యంత శ్రద్ధతో పరిశీలిస్తున్న వారిలో నేనూ ఒక్కణ్ణి. తెలుగు సారస్వతంలో కథలు విరివిగా వెలువడుతున్నాయని చెప్పడానికి నాకెంతో గర్వంగా ఉంది. కానీ ఆ కథలలో విభిన్న రుచులు ఎక్కువగా కనిపించకపోవడంతో కొంత విచారకర మనక తప్పదు"* (కె.సభ ఉత్తమ కథలు. 2010: 74) అని చెప్తూ, తన జీవితంలో జరిగిన పెళ్లినాటి ఒక సంఘటనను ఉదహరిస్తాడు. అది కూడా ఒక కథా వస్తువే అని చెప్పి *"ఇలాంటి*

కథా వస్తువులు ప్రతి వ్యక్తి జీవితంలోనూ వందలాదిగా వుండవచ్చు. అయినప్పుడు కథా వస్తువులు కరువైనట్లు ఎప్పుడూ ఒకే విధమైన సంఘటనలను, ఒకే రకమైన పాత్రలను చిత్రించడాన్ని వదిలి కొత్త పుంతలు తొక్కగలరని ఆశిస్తాను" (కె.సభ ఉత్తమ కథలు. 2010: 78) అంటూ ఉపన్యాసాన్ని ముగిస్తాడు. ఉపన్యాసానంతరం ఆ సభలోని వారు ఇది నిజంగా మీ అనుభవంలో జరిగిందనుకుంటాను అనడంతో ఆయన నవ్వుతూ నేను బ్రహ్మచారిని అని చెప్తాడు. రచయితలు స్వీకరిస్తున్న వస్తువుల పట్ల రచయిత నిరసనను తెలుపుతూ, కొత్త వస్తువులను స్వీకరించడంలో రచనలు చేస్తున్న వారికి ఒక నిర్దేశాన్ని ఇచ్చినట్టుగా ఈ కథ కనిపిస్తుంది.

5.3.8.3. జీవన విపణి:

ఈ కథలో ప్రధాన పాత్ర రచయిత. ఆ రచయిత తన జీవితంలో మూడేళ్ల క్రితం జరిగిన సంఘటనను జీవన విపణి అనే నవలగా రాస్తాడు. *"తన జీవన విపణిలో అతి చౌకగా లభ్యమయ్యే యౌవనాన్ని శరీర సుఖాన్ని కొనమని నన్నానాడు ఆహ్వానించిన అభాగినే యీ నవలలో నాయిక! ఆనాడు నాకు పరిచితమైన ఆవిడకు లభించిన "చ్యుతి"*కి నేనూహించుకున్నదే యీ నవలలోని యితి వృత్తం" (వల్లంపాట కథలు, 2009:161). అని ఆనందిస్తాడు. తను ఎప్పుడు కథలను రాసి పంపించే 'సాహితి' పత్రికకే ఆ నవలను ఇవ్వాలనుకుంటాడు. ఆ పత్రిక సంపాదకుడు సాహితీకి ఒక నవల ఎంపికైంది. చేతనలో ప్రచురించడానికి మీకు అభ్యంతరం లేకపోతే అందులో ప్రచురిస్తాం అని చెప్తాడు. అప్పటికే చెల్లెలి పెళ్లి విషయమై డబ్బు అవసరం ఉన్న రచయిత సరే అంటాడు. నవల అచ్చయి రచయితకు మంచి పేరు వస్తుంది. కానీ అందుకు తగ్గ ప్రతిఫలం మాత్రం రచయితకు అనుకున్న సమయానికి అందదు. సాహిత్య అభిమానులు తన నవలను ఆస్వాదిస్తున్నారు అది చాలు అని భార్యతో చెప్తాడు. ఆమెకు కోపం వస్తుంది. ఈలోగా తండ్రి దగ్గర నుంచి ఐదువందల రూపాయలు తీసి పెట్టమని ఉత్తరం వస్తుంది. దీంతో చేతన పత్రిక ఆఫీసుకు బయలుదేరుతాడు. అక్కడున్న వ్యక్తి ద్వారా పత్రిక ఎడిటర్ మాధవరావు ఆ డబ్బు తినేసి ఉంటాడని, మా పత్రికను నమ్మినందుకు రెండు వందల రూపాయలు తీసుకోండి. నవలను పుస్తకంగా వేసి ఇస్తాను అని అంటాడు. తర్వాత మాధవరావు అడ్రస్ కనుక్కొని అతని దగ్గరికి వెళ్లి విషయాన్ని చెప్పగా ఆ పత్రిక వాడు ఒట్టి వ్యాపారని అందుకే నచ్చక నేను జనతా పత్రికకు వచ్చేశానని అందులో తన తప్పేమీ లేదని చెప్తూ మరో రెండువందల రూపాయలు ఇచ్చి పుస్తకాన్ని అచ్చువేసి ఇస్తానని చెప్తాడు. ఈలోగా ఒక అతను కనపడి జీవన విపణి నవల రాసింది మీరే కదా అని అందులోని విషయాలను ముచ్చటించుకుంటారు. కథ చివర మార్చమంటాడు ఆవ్యక్తి. దానికి రచయిత కుదరదంటాడు. చెల్లెలు వివాహం, నాన్నగారు గుర్తుకు రావడంతో ఇంటి ముఖం పడతాడు. రచయిత బస్సు ఎక్కి కూర్చోగానే బాబూ ధర్మమంటూ ఒక స్త్రీ తనను అడుగుతుంది. ఆవిడ ఎవరో కాదు తను రాసిన నవల లోని నాయికి. ఆ స్త్రీ దుస్థితిని గమనించి తన చేతిలో ఒక ఐదు రూపాయలు పెడతాడు. చివరగా రచయిత కథలు రాశాను, నవలలు రాశాను జీవితాన్ని

నిర్వచించాను, జీవితం మీద వ్యాఖ్యానాలు చేశాను, చివరకు జీవన విపణి రాశాను. కానీ ఈ జీవనవిపణిలో జీవించలేకపోయాను అనుకుంటూ బయలుదేరుతాడు.

జీవన విపణి నవలలో ఆ స్త్రీ పతితగా మారడానికి ఏ విధంగా పరిస్థితులు కారణమయ్యాయో అలాంటి ఆర్థిక పరిస్థితులు ఇప్పుడు తనకు ఎదురయ్యాయి అని కథలోని ప్రధాన పాత్ర రచయిత తెలుసుకున్నట్లుగా, జీవితం ఒక వ్యాపారమయం అనే సందేశాన్ని రచయిత ఈ కథ ద్వారా ఇస్తాడు.

5.3.8.4. కామ దహనం:

ఈ కథలో చలపతి చాలా బుద్ధిమంతుడిగా, సంఘంలో మంచివాడిగా చలామణి అవుతూ ఉంటాడు. అయితే అతని ఊహా లోకంలో ఒక బూతు ప్రపంచం సృష్టించుకకొని ఆనందిస్తూ ఉంటాడు. అతని ఆలోచనలన్నీ కూడా దానికి తగ్గట్టుగానే ఉంటాయి. ఆ ఆలోచనలకు అక్షర రూపం కల్పించి కామవర్ధన్ అనే పేరుతో బూతు కథలు రాస్తూ ఉంటాడు. వాటిని శృంగార పత్రికల్లో ప్రచురిస్తాడు కూడా. ఈ రంగంలో అతనికి మంచి పేరు కూడా వస్తుంది. అయితే ఈ విషయాలు అన్నీ గోప్యంగా ఉంటాయి. చలపతికి పెళ్లి అయిన తర్వాత తన భార్య ఈ విషయాలన్నీ గమనిస్తుంది. ఆ పత్రికల్లో ప్రచురించబడిన కథలన్నింటినీ బాయిలర్లో వేసి కాల్చి అదే నీటితో భర్తకి స్నానం చేయిస్తుంది. అప్పటి నుండి చలపతి ఆ బూతు సాహిత్యాన్ని రాయడం మానుకుంటాడు.

రచయితలు తమ రచనల ద్వారా సమాజానికి పట్టిన జాడ్యాల్ని వదిలిస్తూ ప్రజలను చైతన్య పరుస్తూ ఉంటారు. అయితే వ్యాపార దృష్టితో లేదా కీర్తి కోసం అక్కడక్కడ ఇలాంటి వారు కూడా తటస్థ పడుతూ ఉంటారని దీని ద్వారా సాహిత్య విలువ పడిపోతుందని రచయిత ఈ కథ ద్వారా తెలియజేస్తాడు.

5.3.8.5. ధర్మగ్లాని:

వ్యాసమూర్తి అనే రచయిత ఒక ఊర్లో ఉపన్యాసం చేయడానికి వెళ్తాడు. అప్పుడు రాధాపతి అనే యువకుడు తాను వ్యాసమూర్తి అభిమాన పాఠకున్నని పరిచయం చేసుకుంటాడు. రాధాపతి కూడా రచనలు చేస్తూ ఉంటాడు. అయితే అందులో సాహిత్య విలువలు ఉండవు. అందులో కొన్ని మార్పులను చూచిస్తాడు వ్యాసమూర్తి. అయితే అది వినకుండా రాధాపతి తన రచనలను యథావిధిగా అచ్చు వేస్తూ ఉంటాడు. దురదృష్టం ఏంటంటే అవి బాగా అమ్ముడుపోతాయి. దీంతో వ్యాసమూర్తి సాహిత్య విలువలు పడిపోతున్నాయని సమాజంలో సాహిత్యం మూడో తరగతి పాఠకున్ని ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తోందని, సాహిత్యం వ్యాపార మయమవుతుందని బాధపడుతూ రాధాపతికి ఉత్తరం రాస్తాడు. ఈ ఉత్తరాల్లో రాధాపతికి సాహిత్య నిర్దేశం చేస్తాడు.

పై కథ మాదిరే ఈ కథలో కూడా రచయిత వ్యాపార దృష్టితో రాసే రచనల ద్వారా లేదా యువతను ఆకట్టుకోవాలని చేసే రచనల ద్వారా సాహిత్య విలువ పడిపోవడమే కాకుండా సమాజ శ్రేయస్సుకు హాని చేసే వారమౌతామని ఒక బాధ ఈ కథలో వ్యక్తం చేస్తాడు రచయిత.

పై కథలే కాకుండా జారుడుమెట్లు, చేదు నిజం వంటి కథల్లో కూడా సాహిత్యం చేయవలసిన పనిని లేదా సాహిత్యంలో దొర్లుతున్న తప్పులను ఎత్తిచూపుతూ, సమాజంలో అడ్డదారుల ద్వారా రచయితలుగా ఎదిగే వారిని ఎత్తి చూపుతూ రాసిన కథలే.

5.3.9. కరువు సంబంధ కథలు:

5.3.9.1. ఇక్కడ మేమంతా క్షామం:

వీరయ్య నలుగురు బిడ్డల తండ్రి. ఆ పిల్లలను పెంచడానికి ఇది అది అని తేడా లేకుండా దొరికిన పనులు చేసి వారిని పోషిస్తుంటాడు. కరువు పరిస్థితులను తట్టుకోలేక పొట్టకూటి కోసం ఎక్కడి వారు అక్కడికి వెళ్ళిపోతున్న పరిస్థితుల్లో, వీరయ్య పెద్దకొడుకు తన పెళ్ళాంతో వెళ్లిపోయి ఆరు నెలలు అయ్యుంటుంది. ఎక్కడికి వెళ్ళాడో కూడా తెలీదు. రెండో కొడుకు మిలిటరీలో చేరుతానని వెళ్లి ఏమయ్యాడో కూడా తెలీదు. కూతురు, అల్లుడు కూడా జరుగుబాటులేక ఉత్తరాదికి వెళ్ళిపోయి ఉంటారు. ఇలాంటి పరిస్థితుల్లో వీరయ్య భార్య జబ్బుపడి బిడ్డలని చూడాలా బిడ్డలను చూడాలంటూ కలవరిస్తూ ఉంటుంది. వెంకట నరసయ్య ద్వారా పెద్దకొడుకు అడ్రస్ తెలిసి ఒక ఉత్తరం రాయాలని తను పూర్వం పనిచేసిన ఇంటికి వెళ్లి చినబాబును అడుగుతాడు వీరయ్య. ఈ క్రమంలో చినబాబు అవ్వ, చిన్న బాబు తండ్రి గురించి మాట్లాడుతూ వ్యవసాయం సక్రంగా జరిగితేనే తమలాంటి వాళ్లకు పని దొరుకుతుందని, వ్యవసాయం సరిగా జరగాలంటే వర్షాలు బాగా పడాలని అప్పుడే మాలాంటి వాళ్ళు పొట్ట పోసుకోగలరని, ప్రస్తుతం అవి లేకనే కరువు పరిస్థితులను అనుభవిస్తున్నామని పూర్వం అనుభవించిన దాతు కరువు పరిస్థితులను ప్రస్తుతం అనుభవిస్తున్న కరువు పరిస్థితులను తెలియజేస్తాడు వీరయ్య.

"ఇక్కడ పరిస్థితి జూడబోతే నానాటికి దిగజారి పోతావుంది. తెల్లారిందంటే భయం. ఎండముఖం జూడకుండా యింట్లో కూసుంటేనే బతికినాము. మద్యాణ్ణమయేటప్పటికి కాకులు కూడా కనపడవు" (మధురాంతకం రాజారాం కథలు ఐదవ సంపుటి, 2008: 51) అంటూ బోరింగ్ బావిలో కూడా తాగడానికి నీళ్లు లేని పరిస్థితిని, వరి మల్లు, చెరుకు తోటలు ఎండిపోతున్న పరిస్థితులను, గడ్డిపోచ కూడా మిగలక పోవడంతో పశువులు చిక్కి సగం అవుతున్న పరిస్థితులను తెలియజేస్తూ తన పెద్ద కొడుక్కి ఒక ఉత్తరం రాస్తాడు వీరయ్య. *"ఒరే నాయనా, మీరేమో రెక్కలొచ్చిన పచ్చులైపోతిరి. తలా ఒక మూలకు ఎగిరిపోతిరి. మాకే మీ పెట్టిపోతలక్కర్లేదు. ఒకసారోచ్చి నువ్వు మీ అమ్మను జూచిపోతే చాలు. అదే పదేలు. బతికినంత కాలం బతకదు. ఈ జాబును తంతిగా ఎంచి, ఇదందగానే బయల్దేరి రావాల. అంతే సంగతులు"* (మధురాంతకం రాజారాం కథలు ఐదవ సంపుటి, 2008: 52) అని ఉత్తరం రాస్తాడు వీరయ్య.

ఈ కథలో కరువు పరిస్థితులు ఎంత హృదయ విదారకరంగా ఉన్నాయో చెప్పడమే కాకుండా, అలాంటి పరిస్థితుల్లో చూసుకోవాల్సిన కొడుకులు కనీసం దగ్గరైనా లేరని ఒక తండ్రి పడే ఆవేదనను ఎంతో సహజంగా చిత్రిక పట్టి చూపిస్తాడు రచయిత.

5.3.9.2. అంతరంగం:

ఆనందరావనే వ్యక్తి ఒక రొట్టె ముక్కను తర్వాత తినొచ్చని ఒక బల్లమీద పెడతాడు. కొంత సమయం తర్వాత ఆ రొట్టెను తింటున్న ఎలుకను చూసి దాన్ని కొడతాడు. దాని కాలువిరిగి, రక్తం కారడం చూసి చలించి ఒక కావ్యాన్ని రాస్తాడు. అదే ఈ కథ. ఈకథను ఎలుక వింటున్నట్టుగా ఆనందరావు ఇలా చెప్తాడు. *"ఆ కుగ్రామంలో ఒక రైతు కుటుంబం. చాలా తక్కువ పొలం. ఆ పొలం కూడా మెట్ట. దానికి ఏటి నీరు ఎక్కదు. కుంట నీళ్ళు అందదు. భావి తవ్వితే బండ అడ్డువచ్చింది. అంతకంటే లోతుకు రాతిని చీల్చి బోరింగు పెట్టడానికి కావాల్సినంత పైకం లేదు. కనుక ఆ పొలానికి వర్షంనీరే ఆధారం. అనుక్షణమూ ఆకసంవంక చూస్తున్న ఆ రైతు నేద్యం లంక మేతకూ గోదావరి ఈతకూ సరిపోయినంత గానైనా సరిపోదు కాడి గిత్తలకు గడ్డికూడా కరువే. పేరునకు నేద్యం కానీ అందులో వచ్చే ఆదాయం ఆ కుటుంబానికి ఏడాదిలో మూడు మాసాలకైనా చాలదు. అందుకే ఇల్లాదులూ కూలి చేసేవారు. ఈ కూలిఎల్ల కాలమూ దొరకదు. కూడూ ఎప్పుడు దొరకదు. కోతకాలం ఊడ్పుల కాలం తొలకరిలో మాత్రం ఓ పక్షం రోజులపాటూ దొరుకుతుండేవాపసులు".* (పాతాళగంగ.1968: 9,10.)

అలాంటి పరిస్థితిలో బతుకుతున్న ఆ కుటుంబానికి మంచి కాలంలోనే కూడు గుడ్డ చాలదు. ఉన్నట్టుండి కరువు రాక్షసి ప్రవేశిస్తుంది. అది భయంకర ఆకృతిని దాల్చి నేల మీద తేమంతా పీల్చేసి జలాశయాలలోని నీటినంత త్రాగేసి పచ్చని వృక్షాలను అంతా చప్పరించి పిప్పి పిప్పిగా ఉమ్మివేసింది. అడవులలో పడి సంపదనంతా స్వాహా చేసింది. చివరికి పశుగణాలను వారించింది అవి ఎముకల ప్రోవులైన వాటి సెల్యాలను చూర్ణం చేసి వదిలిపెట్టింది. ఇంత భయంకరమైన కరువులో ఆ రైతు కుటుంబం ఎదుర్కొన్న కడగండ్లు చివరికి ఆత్మాహుతిగా మారుతుంది.

ఆ కరువు కాలంలో,ఆ రైతు ఒకరోజు గొట్టిగడ్డలు కోసం తిరుగుతున్నప్పుడు అడవిలో ఒక గుడారం కనిపిస్తుంది. ఆ గుడారం వేటకు వచ్చిన జమీందారుది. ఆ గుడారంలో నౌకర్లు నిద్రపోతుండడం చూసి అక్కడున్న ఆహార పదార్థాలన్నింటినీ ఎత్తుకొని వెళ్తుండగా గమనించిన నౌకలలో ఒకడు అతన్ని వెంబడిస్తాడు. రైతు పారిపోతున్న సమయంలో బొటనవేలికి దెబ్బ తగిలి నాలుగు మట్ల లోతులోకి పడిపోతాడు. ఎదురు పొదల్లో చిక్కుకుంటాడు. చివరికి చనిపోతూ చనిపోతూ ఆ నౌకరుతో ఒక కోరికను కోరతాడు. ఇక్కడికి రెండు కిలోమీటర్ల దూరంలో చెరువు దగ్గర ఒక గుడిసె ఉందని అక్కడ ఇద్దరు పిల్లలు ఆకలితో చచ్చిపోయే పరిస్థితిలో ఉన్నారని వారికి ఆ మూట ఇవ్వాలని చెప్తాడు. నౌకరు కూడా పేదవాడు కావడంతో అతని హృదయం ద్రవించి దాన్ని తీసుకుని వెళ్లే సమయానికి అక్కడ ఇద్దరు పిల్లలు కూడా చనిపోయి ఉంటారు.

కరువు కాలంలో ఆకలి ప్రాధాన్యతను చెప్పాలన్నదే ఈ కథలోని సారాంశంగా కనిపిస్తుంది. కరువులో ఒక పూట కడుపు నింపుకోవడం కోసం, తన కుటుంబాన్ని పోషించుకోవడం కోసం ఒక పేద రైతు తన ప్రాణాలను సైతం పణంగాపెట్టే హృదయ విదారకరమైన దృశ్యం మనం ఈ కథలో చూడవచ్చు.

5.3.10. రాజకీయ కథలు:

5.3.10.1. కామందుల వారు:

బాగా డబ్బు, ఆస్తి ఉన్న కామందులవారు ఎమ్మెల్యే కావాలనుకుంటాడు. పాండవులకు శకుని లాగా వీరికి వేదాంతం తోడవుతాడు. ముందుగా కారు కొనడం నుండి ప్రారంభించి, ఖాదీ వస్త్రధారణ నుండి మొదలుపెట్టి, కాంగ్రెస్ పార్టీ నాయకులతోను, ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీ నాయకులతో, సోషలిస్ట్ పార్టీ నాయకులతోను ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నిస్తారు. చివరికి సీటు దొరక్కపోవడంతో ఇండిపెండెంటుగా నిలబడతాడు. ఆ తర్వాత ఆ పార్టీకి అవసరమైన ఒక పత్రికను, దానికి ఒక ఎడిటర్ను, అరడజన్ బుర్రకథ దళారులను, భాగవతం వాళ్లను, పెట్రోమాక్స్ లైట్లు, సైకిళ్లు, రెండు వందల మంది వాలంటీర్లు ఇలా వారి ప్రయత్నం కొనసాగుతుంది. ఇందుకుగాను కామందుల వారు పది లక్షల వరకు ఖర్చు పెడతారు. చివరికి ఇల్లును కూడా తాకట్టు పెడతాడు. ప్రచారం బ్రహ్మాండంగా జరుగుతుంది. పత్రికల్లో ఎక్కడ చూసినా కామందుల వారి పేర్లే. కామందుల వారి పార్టీ గుర్తుగా ఎన్నుకున్న గుమ్మడికాయ గుర్తు ప్రజల్లో బాగా చేరింది. ఇంటింటికి గుమ్మడికాయలు. గుమ్మడికాయ ఆకారంలో తట్టలు, బుట్టలు ఇలా ప్రచారం ముమ్మరంగా జరుగుతుంది. ఎన్నికలు దగ్గర పడతాయి. పోలింగ్ జరుగుతుంది. ఎదురుచూసిన ఫలితాలు రానే వస్తాయి. గెలుస్తారని ముందుగానే విజయోత్సవం మొదలవుతుంది. చివరికి ఓడిపోయారని వార్త తెలియడంతో కామందుల వారు ఒక్కసారిగా కూలిపోతాడు.

బాగా డబ్బున్న వాళ్ళు ప్రజా సేవ చేస్తే సమాజం బాగుపడుతుంది కానీ అందుకు విరుద్ధంగా డబ్బున్న ప్రతి వ్యక్తి రాజకీయాల్లోకి రావాలని, పరపతి పెంచుకోవాలని చూస్తారు. దాని కోసం తాపత్రయపడే వ్యక్తి పార్టీ పెట్టడం దగ్గర నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నిలవడం దగ్గర నుంచి వాళ్లకు కావాల్సిన సరంజామా సిద్ధం చేసుకోవడం వరకూ ఈ కథలో కళ్లకు కట్టినట్లు చూపిస్తాడు రచయిత.

5.3.10.2. తాత దిగిపోయిన బండి:

గ్రామపంచాయతి నుండి ఉత్తర్వు రావడంతో ప్రతి ఏడూ బడిలో జరిగే గాంధీ జయంతి ఉత్సవం ఆ ఏడు పంచాయతీ ఆఫీస్ ప్రాంగణంలో జరుగుతుంది. ఈ సభకు పంచాయతీ పరిధిలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, బడి పిల్లలు హాజరవుతారు. సమావేశానికి ఏర్పాటుచేసిన ప్రాంగణం గురించి, అతిథులుగా చెప్పుకొనే నాయకుల గురించి ఉపాధ్యాయులు రకరకాలుగా మాట్లాడుకుంటారు. సమావేశం మొదలై ఉపన్యాసాలు ముగుస్తాయి. గాంధీ జయంతి కోసం చెత్తను మోసుకెళ్లే బండిని కడిగి అలంకరించి గాంధీ పటం పెట్టి ఊరేగిస్తారు.

అదే బండిలో మరుసటి రోజు చెత్తాచెదారం ఉంటుంది. గాంధీ పుట్టిన రోజు కాబట్టి బండిలో తాత కూర్చున్నాడు. అందరూ అతని అడుగుజాడల్లో నడిచారు. ఇప్పుడు తాత లేడు. ఆ బండి ప్రతిష్ట తాతతోనే పోయింది. గాంధీ జన్మదిన వేడుక జరుపుకుంటూ గాంధీ సూత్రాలను విస్మరించిన పరిస్థితి, మహాత్ముల అభిప్రాయాల్ని, సిద్ధాంతాలను గౌరవించకుండా ప్రజల మెప్పుకోసం మొక్కుబడి చెల్లించినట్లుగా గాంధీ జయంతి రోజు గాంధీ జన్మదిన వేడుకలు, స్వాతంత్ర్య దినోత్సవం నాడు జెండా ఎగరవేయడం చేస్తారు. ప్రజల కష్టసుఖాలను ఎవరూ పట్టించుకోరు. అని తెలుపుతూ ఈ విధమైన పరిస్థితికి రచయిత ఆవేదన వ్యక్తం చేయడం ఈ కథలో చూడవచ్చు.

5.3.11. ఆర్థిక సంబంధ కథలు:

5.3.11.1. బంగారు:

సొంత భూమి లేకపోయినా కవులుకు వ్యవసాయం చేసే రత్నయ్య కూతురు బంగారు. బంగారు పుష్పవతి అయిన సందర్భంలో తండ్రి యాభై రూపాయలు ఖర్చుపెట్టి అన్ని కార్యక్రమాలు చేస్తాడు. ఈ సందర్భంలో చుట్టుపక్కల వాళ్ళు ఆ సమయంలో వారికి ఉన్న ఆభరణాలను అలంకరించి మళ్లీ తీసుకోవడం పల్లెటూరిలో జరిగే సర్వసాధారణ విషయం. కానీ ఆ ఊరికి కొత్తగా వచ్చిన కోడలు సక్కుబాయి మాత్రం తన ఎర్రరాళ్ల కమ్మలని ఇవ్వనంటుంది.

ఆరోజు బంగారు ఎలాగైనా ఎర్రరాళ్ల కమ్మలు ఒక జత కొనుక్కోవాలి అనుకుంటుంది. ఆ ఏడు తండ్రి చెరుకు పంట వేస్తాడు. అందులో ఆదాయం రాకపోగా అప్పులు తీర్చడానికి ఉన్న గిత్తల్ని కూడా అమ్ముకోవాల్సి వస్తుంది. సక్కుబాయి అన్నలు ఇద్దరు చాలా కాలంగా బంగారు గనులలో పని చేస్తున్నారని అందుకే తనకు ఒంటి నిండా బంగారం ఉందని తలచి బంగారు గనుల్లో పనిచేయడానికి ఉన్న ఇంటిని కూడా అమ్మేసి రత్నయ్య, బంగారు వెళ్తారు. మూడేళ్లు బాగా పని చేసి రెండువందల రూపాయల్ని జమ చేసుకుంటారు. ఒక వంద రూపాయలతో కమ్మలు కట్టించి, ఒక వంద రూపాయలతో బంగారు పెళ్లి జరిపిస్తే చాలు అనుకుంటాడు రత్నయ్య. ఈ లోగా రత్నయ్యకు తీవ్ర కడుపునొప్పి, జ్వరం, మలేరియా, అజీర్తి రావడంతో వంద రూపాయలు ఖర్చు అయిపోతాయి. బంగారుకు కమ్మల మీద ఆశ పోతుంది. తండ్రి బంగారాన్ని ముత్యాలుకిచ్చి పెళ్లి చేస్తాడు. పెళ్లి కోసమని ముత్యాలు ఐదు రోజులు బాడుగకు ఎర్రరాళ్ల కమ్మలు తెచ్చాడని తెలిసి బంగారు బాధపడుతుంది. ఆ తర్వాత బంగారుకు పిల్లలు పుడతారు అయినా బంగారుకు ఎర్రరాళ్ల కమ్మలపైన మోజు తగ్గదు. ఆ తర్వాత సంపాదించింది కూడా పిల్లల కోసం ఖర్చుపెడతారు. ఒకనాడు ముత్యాలు *"మనం ఇంతవరకు ఈ గనిలోనుండి ఎంత బంగారాన్ని తవ్వి బయటకు తెచ్చామో లెక్కలేదు, కానీ నీ ఒంటి మీద గురిగింజంత బంగారు లేకపోయింది"* అంటాడు. (బంగారు. 1963: 28). బంగారు నవ్వుతూ అన్నది నేనే బంగారం నాకెందుకు బంగారం. నాకున్న ముత్యాలే చాలు.

జీవితాంతం బంగారుగనుల్లో పనిచేసినా తను ఆశపడిన రవ్వంత ఎర్రరాళ్ల కమ్మలు చేయించుకోలేక పోయిన బంగారు జీవిత కథ ఈ కథ.

5.3.11.2. అప్పిచ్చువాడు:

తప్పనిసరిగా వెళ్లాల్సిన పెళ్లి నిమిత్తం సన్యాసిరావుకు యాభై రూపాయలు అప్పు చేయవలసి వస్తుంది. ఆ ఊర్లో లక్షాధికారుల్లో ఒకడైన ముకుందరావుని అడగాలనుకుంటాడు. అతడు తనకి బాల్యమిత్రుడు, సుపరిచితుడు, సహాధ్యాయి కూడా. తనకోసం వెళ్లి డబ్బులు అడుగుతాడు. ఈరోజు లేవు వెంకటేష్ ఇవ్వాల్సి ఉంది. సాయంత్రంరా అని అంటాడు. ఆ తర్వాత ముకుందరావు వెంకటేశాన్ని డబ్బు కోసం చితకబాదుతాడు. ఇది చూసి సన్యాసిరావుకు భయం పుట్టి ఇలాంటి గతే తనకూ పడుతుందని, డబ్బు లేకపోయినా పర్వాలేదు ఆత్మాభిమానం, ప్రాణం ఉంటే చాలు అనుకుంటాడు. ముకుందరావు దగ్గరకు వెళ్ళడు. అయితే ముకుందరావే ఇంటికి వచ్చి డబ్బు ఇవ్వడంతో తప్పనిసరిగా ఆ పెళ్లికి వెళ్లాల్సి వస్తుంది

ఈ కథలో అప్పు తీసుకొని దాన్ని తీర్చలేక అవమానాల పాలు కావడం కంటే అప్పు తీసుకోకుండా ఆత్మాభిమానం నిలుపుకోవడం మేలని ఈ కథ తెలియజేస్తుంది.

5.3.11.3. వాన:

రంగయ్య గుర్రపు బండి తోలుకొని జీవనం సాగిస్తూ ఉంటాడు. ప్రతి ఆదివారం వడ్డీ కంపెనీలో కట్టవలసిన ఇరవై రూపాయలు గుర్తొస్తుంది. ఖాదర్ భాషా వద్ద తీసుకున్న డబ్బు కట్టాలన్న సంగతి గుర్తుకు రాగానే వణికిపోతాడు. ఆ వారం అంతా సంపాదించిన పది రూపాయలు తన కొడుకు పుస్తకాల కోసం ఖర్చయిపోతాయి. సినిమాల నుంచి ఆఫీస్ నుంచి వచ్చే వాళ్ళని బాడుగ కావాలా అని అడుగుతూ ఉంటాడు. తన కొడుకు పుస్తకాల కోసం ఖర్చు చేసిన పది రూపాయలని గురించి తన స్నేహితుడు పుస్తకాలు, చదువులు షావుకార్లకు మనకెందుకు అన్నా అంటాడు. దీనికి 'అట్లనోద్దన్నా మా వాడికి బాగా చదువు వస్తోంది. బళ్ళో ఎప్పుడూ మా వాడే ఫస్ట్. 'మొన్న పెద్దయ్య వారు కనిపించి రంగయ్యా నీ కొడుకు భలే తెలివైనవాడురా బాగా చదివించు ఆఫీసర్ అయిపోతాడు' అని అన్నాడని చెప్తాడు. ఎంతకీ గిరాకీలు తగలకపోవడంతో ఖాదర్ భాషాకి ఇవ్వాల్సిన ఇరవై రూపాయల కోసం బాధపడుతూ ఉంటాడు. ఇంతలో ఒక హాస్పిటల్ దగ్గర నుండి శవాన్ని తీసుకువెళ్లాలని ఒక బాడుగ వస్తుంది. ఇరవై రూపాయలు వస్తాయని రంగయ్య ఆశ పడతాడు. అక్కడ బేరం కుదరకపోయేసరికి వెనుదిరుగుతూ ఉంటాడు. ఈలోగా హాస్పిటల్ గేటు దగ్గర ఖాదర్ బాషా తన భార్య ఎదురవుతారు. తన భార్య ఏడుస్తూ ఎదురవుతుంది. పుస్తకాల కోసం బజారుకుపోయిన నీ కొడుకు కారు కింద పడిపోయాడు, ఆసుపత్రిలో ఉన్నాడంట ఎన్ని దెబ్బలు తగిలినాయో ఏమో బస్టాండ్ కాడ చూస్తే నువ్వు కనిపించలా అనడంతో రంగయ్య కుప్పకూలిపోతాడు.

గుర్రం బండి తోలుకుంటూ ఏ పూటకాపుట కడుపు నింపుకునే వారి జీవితాల్లో ఎదురయ్యే కష్టాలు, వారి పిల్లల చదువుల కోసం అప్పులు చేసి వాటికి వడ్డీ కట్టలేక ఎలాంటి బాధలు పడుతున్నారు ఈ కథలో మనం చూడవచ్చు.

పై కథలే కాదు మధురాంతకం రాజారాం రాసిన ప్రతి కథలోనూ మధ్యతరగతి మానవుడు అడుగడుగునా ఎదుర్కొనే ఆర్థిక సమస్యల చిత్రణ కనిపిస్తూనే ఉంటుంది. అలాగే మిగిలిన రచయితల రచనల్లో కూడా ఇది చూడొచ్చు. చిత్తూరు జిల్లా నుండి వచ్చిన కథలు స్త్రీ సమస్యను చిత్రించినా, ఉద్యోగ సమస్యలు చిత్రించినా, రచయితల జీవితాలను చిత్రించినా, రైతు జీవితాలను చిత్రించినా ఇలా ఏ సమస్యను చిత్రించినా ప్రతి కథలోనూ ఆర్థికపరమైన ఇక్కట్లు కనిపిస్తూనే ఉంటాయి.

5.3.12. రైతు కథలు:

5.3.12.1. పాతాళ గంగ:

బేటప్ప ఒక మధ్యతరగతి సాధారణ రైతు. భార్య చెంగమ్మ. బేటప్పకు ఒకడే కొడుకు. పేరు ఆనందం(అబ్బోడు). కొడుకు ఇంట్లో చెప్పకుండా మిలటరీలో చేరిపోతాడు. చంగమ్మ అన్న కూతురు కస్తూరి తల్లిదండ్రులు లేకపోవడంతో వీరి ఇంట్లోనే పెరుగుతూ ఉంటుంది. నీటి వసతి పెంచుకొని వ్యవసాయం చేసుకోవాలని ఆశపడతాడు. అందుకోసం బావి తవ్వించడం మొదలుపెడతాడు.

శనక్కాయలు అమ్మిన డబ్బుతో మొదలెట్టి భార్య గజ్జెలడ్డిగను, కోడెద్దుల్ని, నాలుగు ఆవులు, ఇరవైరెండు మేకలు, చెంగమ్మ చెవుల్లోని రత్నపూలు, గుబావర్లు, నోముముళ్ళు అమ్మేస్తాడు. అవి కూడా చాలా కోపంతో కస్తూరి తెల్ల రాళ్ల కమ్మలు, నీలాల తొంగటాలు కూడా అమ్ముతాడు. అప్పటికీ నీళ్ళు పడకపోవడంతో మట్టుకుమట్టు మట్టుకు మట్టు అనుకుంటూ బావి తవ్విస్తూనే వెళ్తుంటాడు. తీరా చెంగమ్మ మాటీలు, కమ్మలు కూడా కొదవకుపోతాయి. తొమ్మిదో మట్టిలోనైనా గంగను చూడాలన్న విశ్వాసంతో ఉన్న అయిదంకణాల పూరికొట్టాన్ని, ఎద్దుల బండి, పన్నెండు తాటి చెట్లు ఇలా తన సర్వస్వాన్ని అమ్ముకొని ఇరవై అవిసులతో తాటి మట్టల గుడిసె వేసుకొని బావి దగ్గరే ఉంటాడు. చివరికి బేటప్ప ఆశ ఫలించి బావిలో నీళ్ళు పడతాయి. అదే సమయానికి బావిగడ్డ విరిగి అందులో పడి చనిపోతాడు. అదే సమయంలో కొడుకు సయ్యాలకోట యుద్ధంలో మరణిస్తాడు. ఇలా ఒక పేద రైతు సేద్యం చేసుకోవడానికి కొంత నీటి వసతిని ఏర్పాటు చేసుకోవాలని బావి తవ్వించే క్రమంలో తన సర్వస్వాన్నీ పోగొట్టుకున్నా ఆశ మాత్రం చావదు. నీటి కోసం ప్రయత్నిస్తూనే ఉంటాడు. నిజానికి రాయలసీమలోని చాలా మంది రైతుల పరిస్థితి నేటికీ ఇలానే ఉంది. ఇలాంటి పరిస్థితులను రచయిత చాలా వాస్తవికంగా కథలో చిత్రించాడు.

5.3.13. ఇతరాలు:

5.3.13.1. జంతు ప్రేమ/పశువులపై ప్రీతి:

5.3.13.1.1.అమూల్యం:

కథలో ప్రధాన పాత్ర కవి గారు. కవి గారితో మాట్లాడాలని వచ్చిన కథకుడు వారి ఇంటి దగ్గర ఒక కుక్కని చూసి భలే కుక్కని సంపాదించారే ఎక్కడ పట్టుకొచ్చారు అని అడుగుతాడు. దానికి కవి గారు ఆ కుక్కని తను తీసుకోలేదంటూ అది తన ఇంటికి వచ్చిన విధానాన్ని చెప్తాడు.

"భలే మెలకువైంది చీమ చిటుక్కుమంటే చాలు తెలుసుకుంటుంది. మనం మనిషి ముఖాన్ని చూసి కూడా అతని స్వభావాన్ని కనిపెట్టలేం. ఇది పాదాలను చూచి అతని హృదయాన్ని తెలుసుకుంటుంది. నిజంగానే చెబుతున్నాను. ఇది మా ఇంటికి వచ్చినప్పటినుండీ నా కెందుకో చాలా సంతృప్తిగా వుంది. చెప్పరాదు గానీ నాకు మానవుల మీద విశ్వాసం నశించింది. దానికి బోలెడు కారణాలున్నవనుకో" (బంగారు. 1963: 10) అంటూ ఒకరోజు కాట్పాడి రైల్వే స్టేషన్ లో కుక్క చలికి, ఆకలికి బాధపడుతుంటే ఒక ప్యాకెట్ పెరుగన్నం తీసుకొని దానికి వేస్తాడు. ఆ విశ్వాసంతో ఆ కుక్క తన వెంబడే తన ఇంటికి వస్తుంది. అప్పటినుంచి దాన్ని పెంచుకుంటాడు. కుక్క మనుషుల మీద చూపించే విశ్వాసాన్ని గురించి, మనుషులు కంటే ఈ జంతువులే నయం అని ఈ కథలో రచయిత చెప్పాడు.

5.3.13.1.2. పిల్లనగ్రోవి:

పాల లక్ష్మయ్య ఇంట్లో పడుకుని ఉండగా ఒక రోజు ఫకీరు ఇనుప రేకులు, ఇత్తడి గజ్జలతో శబ్దం చేసుకుంటూ పాట పాడుకుంటూ వస్తుంటాడు. ఇది విని జడుచుకున్న కోడెదూడ గొలుసులు తెంచుకొని లక్ష్మయ్యను తొక్కేస్తుంది. లక్ష్మయ్య చేతికి అయిన గాయం రోజు రోజుకు పెరుగుతూ బాధ ఎక్కువై అరచేయి కుళ్ళిపోతుంది. జనరల్ హాస్పిటల్లో నెల రోజులు ఉంటాడు. *"జయమ్మకు ఆ కోడెదూడపైన మమకారం మాయమైపోయి, చిరాకూ కోపమూ పుట్టుకొచ్చాయి. చీటికీ మాటికీ... పట్టరాని ద్వేషంతో దాన్ని తెగబాదుతూ ఉండేది".* (పైరుగాలి. 1967: 97). లక్ష్మయ్య హాస్పిటల్ నుంచి వచ్చిన తర్వాత కూడా జయమ్మ ఆ కోడెదూడపైన అలానే తన కోపాన్ని చూపుతూ ఉండేది. ఒక రోజు లక్ష్మయ్య చెబితే నీకు కాదు *"నోరులేని పశువు- అది నిన్నేం చేసిందని? రాక్షసిలా అస్తమానమూ దాన్ని అలా చిత్రహింస చేయందే క్షణం బతక లేవూ?"* (పైరుగాలి. 1967: 99) అంటూ జయమ్మను కొడతాడు.

రాయలసీమలోని ప్రజలు పశువులను తమ ఇంట్లోని వ్యక్తులుగా భావిస్తారు. ఎందుకంటే ఇక్కడ వ్యవసాయం, పాల ఉత్పత్తి పైన ఆధారపడి బతికే కుటుంబాలు ఎక్కువ. వీటికి ఆలవాలమైనది పశుసంపదే కాబట్టి అటువంటి పశువుల పైన ప్రజలకు విపరీతమైన ప్రేమ ఉంటుంది. బ్రతకలేక వాటిని అమ్మవలిసి వస్తే రైతు కళ్ళల్లో నీళ్లు పుట్టుకొస్తాయి. అంతటి ప్రేమను తెలియజేసే కథే ఈ పిల్లనగ్రోవి. మూగజీవి వల్ల తన చెయ్యి పాడైపోయినా జంతు ప్రేమతో దానిని ఆదరిస్తాడు లక్ష్మయ్య.

5.3.13.2. డిటెక్టివ్ కథ/అపరాధ పరిశోధక కథ:

5.3.13.2.1. కొత్త కథ:

కొండారెడ్డి తలంటుకుంటూ వసారాలోని కిటికీ దగ్గర పెట్టిన ఉంగరం కనబడకుండా పోతుంది. దాన్ని చూసిన చిక్కయ్య, మహాలక్ష్మమ్మలపై అనుమానాన్ని వ్యక్తం చేస్తాడు. అయితే మహాలక్ష్మమ్మ తన ఇంటి ఇల్లాలు కాబట్టి ఆమెపై అనుమానం ఉండదు. చిక్కడే తీసి ఉంటాడు. అనుకుని అనుమానిస్తాడు. అప్పుడే వచ్చిన కరణం పరిష్కార మార్గంగా పోలీసులకు కబురు

చేయడమే మంచిదని చెప్తాడు. ఆ ఉంగరాన్ని ఎవరు ఎత్తుకుపోయి ఉంటారని ఎస్.ఐ చేసే ఎంక్వయిరీ చాలా హాస్యంగా ఉంటుంది. చిక్కన్ని అనుమానించి అరెస్టు చేయాలని నిర్ణయిస్తాడు. ఇంతలో ఆ ఇంటి దాసి నల్లక్క కలుగజేసుకుని ఉంగరం ఎక్కడుందో కనిపెడుతుంది. అందరూ నల్లక్కని డిటెక్టివ్ నల్లక్కగా పొగుడుతారు. విషయం ఏమిరా అంటే ఆ ఉంగరాన్ని ఒక కోడి మింగేసి ఉంటుంది.

ఉంగరం ఎంక్వయిరీ చేసే విధానంలో అక్కడక్కడ ఈ కథలో హాస్యం చోటు చేసుకుంటుంది. చివరికి నల్లక్కా ఒక డిటెక్టివ్ లాగా ఆ ఉంగరాన్ని కనిపెడుతుంది.

5.3.13.3. కళాకారులకు సంబంధించిన కథలు:

5.3.13.3.1. అర్జున విషాద యోగం:

యోగానందం దాదాపు పదిహేను సంవత్సరాలుగా కళోద్ధారక నాట్యమండలిని నడుపుతూ చుట్టుపక్కలున్న యువతీ యువకులను ఆ మండలిలో చేరమని, తద్వారా గొప్ప భవిష్యత్తును నిర్మించుకోమని చెప్తూ ఉంటాడు. ఈ క్రమంలోనే అర్జునరావు అతని మిత్రులను కలిసి ఒక నాటకం వేయడానికి ఒప్పిస్తాడు. పట్టణంలో జరిగే నాటక పోటీల్లో పాల్గొంటారు. వీళ్ళు ప్రదర్శించిన నాటకానికి రెండవ బహుమతి వస్తుంది. అయితే యోగానందం నిర్లక్ష్యం చూసి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడతాడు. ఆ పట్టణంలో యువకులు తిప్పలు పడి ఊరికి వస్తారు. కొన్నాళ్ల తర్వాత మళ్లీ నాటకం వేద్దామని యోగానందం అర్జునరావును అడుగుతాడు. అయితే ఈసారి అతని బారి నుండి తప్పించుకోవాలని *"ఈ వేసంగిలో నేను బెంగళూరు వెళుతున్నానండి! అక్కడ మా మామయ్య ఏదో ఉద్యోగంలో అనుస్తానన్నాడు"* అని తప్పించుకుంటాడు. (ఆంధ్రసచిత్ర వారపత్రిక, 11- 9- 1964: 61). ఎంతకీ వదలడని నిర్ణయించుకున్న అర్జునరావు తన గురువుకి ఒక ఉత్తరం రాస్తాడు అందులో *"నా పరిస్థితులు బాగు పడనంత వరకు నాటకములలో ప్రవేశించరాదని చాలా రోజుల క్రిందటనే తీర్మానించుకున్నాను. మదియగురువులైన తమరు నా ఈ తీర్మానమునకు భంగము వాటిల్లకుండనట్లు ఆశీర్వదింపవలెననిదీనముగా ప్రార్థించుచున్నాను. ఇట్లు తమ శిష్య పరమాణువు అర్జునరావు"* (ఆంధ్రసచిత్ర వారపత్రిక, 11- 9- 1964: 61) అని రాస్తాడు.

కళాకారుల జీవితాలు, అందులోని విలువలు, వారి ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నాయో ఈ కథలో తెలియజేస్తూ, అటువంటి నాటక రంగంలో మోసాలు ఎలా జరుగుతున్నాయో తెలుపుతూ ఈ కథను రచయిత మన ముందు ఉంచుతాడు.

5.3.13.3.2. సర్కస్ డేరా:

ఒక రోజు సర్కస్ ని చూడడానికి కథకుడు వెళ్తాడు. నాగుల ద్వారా టికెట్టు సంపాదించుకొని లోపలికి వెళ్లి కూర్చుంటాడు కథకుడు. *"చుట్టపు చూపులాగా వచ్చిన సాటిరాజు ఎదుట మర్యాద కోసం జరిగే చతురంగ బల ప్రదర్శనంలాగా"* (మధురాంతకం రాజారాం కథలు, 1991: 9) అక్కడ ఏనుగులు, ఒంటెలు, గుర్రాలు ఇలా ఎన్నో, అంతలో మహాకారుడు

ప్రదర్శించిన విన్యాసాలు, రొమ్ముపైన పలకనానించి పలకపైన ఏనుగును ఎక్కించడం, కళ్ళకు గంతులు కట్టుకున్న యువకుడు అందమైన యువతపై విసిరే కత్తులు, ఉయ్యాలల విన్యాసాలు, పులి ప్రదర్శనలు, సింహం ప్రదర్శనలు ఇలా ఒక్కటేమిటి ఎన్నో ఎన్నో చూస్తాడు. అయితే ఇవన్నీ చూపులకు ఒక వినోద దృశ్యంగా కనపడొచ్చు కానీ ఆ సర్కస్ చేసే వాళ్ళ బాధలు ఎలా ఉంటాయో తెలుపుతూ రచయిత ఈ కథలో ఇలా అంటాడు *"సోదరులారా మీరు మా అందచందాలని మాత్రమే చూస్తారు. ఈ అందచందాల వెనక మమ్మల్ని కత్తులు ఎదుట నిలబెట్టి, ఒంటిచక్రాల సైకిల్లెక్కించి మంటల మధ్య పరుగులు తీయించే కడుపు కక్కుర్తిని మీరు చూడరు".* (మధురాంతకం రాజారాం కథలు, 1991 పుట: 11) అంటూ సర్కస్ వాళ్ళు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని చేసే విన్యాసాలను, వారి కళా నైపుణ్యాలను, వారు ప్రదర్శించే విధానాలను కళ్ళకు కట్టినట్లు చూపిస్తాడు రచయిత.

చిత్తూరు జిల్లా కథా సాహిత్యంలో నాటకకారులు, సర్కస్ వేసే వాళ్ళ బాధలే కాకుండా ముగ్గురత్తగార్లు అనే కథలో హరిదాసుల మాటకారితనాన్ని, లొక్యాన్ని కూడా చూడవచ్చు.

ఇలా చిత్తూరు జిల్లా కథా సాహిత్యంలో వివిధ రకాలైన వస్తువులతో కూడిన కథలు వచ్చాయి.

5.4. చిత్తూరు జిల్లా కల్పనాసాహిత్యం (నవల, కథానిక) – వస్తు పరిణామం:

చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యంలో నవల, కథానికల వస్తు పరిణామాలను గమనించినట్లయితే 1975 వరకూ మొత్తం పదిహేడు నవలలు, మూడు వందల యాభై కథలు వచ్చాయి. (లభిస్తున్న సమాచారాన్ని బట్టి). ఇవికాక మరెన్నో నవలలు కథలు వచ్చి ఉండొచ్చని కచ్చితంగా చెప్పొచ్చు. పూర్వ పరిశోధకుల అభిప్రాయాలను క్రోడీకరించుకొని నేను ఈ అభిప్రాయానికి వచ్చాను. ఈ రచనలన్నింటిని అధ్యయనం చేస్తే తెలిసిన విషయం ఏమిటంటే స్వాతంత్ర్యానికి ముందు వచ్చిన ఎనిమిది నవలల్లో కాని, పంతొమ్మిది కథలలోగాని వివిధ రకాలైన వస్తు వైవిధ్యతలు చోటుచేసుకున్నాయి.

మొదట నవలా విషయానికి వస్తే, స్వాతంత్ర్యానికి ముందు వచ్చిన ఆరు నవలల్లో రెండు చారిత్రక నవలలు, మూడు సంఘసంస్కరణోద్యమ నవలలు, ఒక వెట్టి చాకిరీని చిత్రించిన నవల ఉన్నాయి. తెలుగు సాహిత్యంలో స్వాతంత్ర్యోద్యమ కాలంలో వచ్చిన ప్రతి రచన కూడా చాలా వరకూ ప్రజల్లో దేశభక్తిని, దేశాభిమానాన్ని, స్వాతంత్ర్యేచ్ఛను, చరిత్ర, సంస్కృతికి సంబంధించిన గత వైభవాన్ని తెలియజేసినవే (వీటికి మినహాయింపు కూడా ఉండవచ్చు). అలాగే ప్రజల్లో పేరుకుపోయిన జాడ్యాలను పారద్రోలడానికి లేదా అన్యాయాలను, అక్రమాలను ఎండుగట్టడానికి వచ్చినవిగా కనిపిస్తాయి.

ఈ విధంగా చూసినప్పుడు చిత్తూరు జిల్లా నుండి వచ్చిన చాందసుల్తానా, తానీషా అనే రెండు చారిత్రక నవలలు వచ్చే నాటికి భారత దేశంలో గాంధీ నాయకత్వం ప్రారంభమై సహాయ నిరాకరణోద్యమం జరుగుతోంది. దేశ ప్రజలలో స్వాతంత్ర్య కాంక్షలు వెల్లివిరుస్తున్నాయి.

ఇటువంటి తరుణంలో ఈ నవల ద్వారా స్వాతంత్ర్య పోరాటాన్ని ప్రజల్లోకి పురికొల్పి తద్వారా ఆంగ్లేయులపై పోరాడాలని ఒక స్ఫూర్తి ఇచ్చినట్లు చెప్పొచ్చు. స్వయంగా రచయితే ఈ నవలలను రాయడానికి రాజభక్తి, దేశాభిమానము కారణమని చెప్పుకున్నాడు కూడా. అందుకే నవలల్లో అనేక స్వాతంత్ర్యోద్యమ ప్రస్తావనలు ఉన్నాయి. అందువల్ల ఇవి చారిత్రక నవలల ఉద్దేశాన్ని కూడా సాధించాయని చెప్పొచ్చు. అలాగే రత్నాబాయి, భానుమతి, మోహన అనే నవలలు సాంఘిక నవలలే అయినప్పటికీ వీటిల్లో సంఘసంస్కరణ భావాలు ఎక్కువగా ఉన్నాయి. అందుకే ఈ నవలల్లో సాంఘిక దురాచారాలను ఎక్కువగా ఎత్తి చూపారు. ఒక రకంగా అవి సమాజాభ్యుదయానికి ప్రతిబంధకాలు అని ఆయా నవలల ద్వారా తెలియజేశారు. అలాగే వెట్టి చాకిరీని చిత్రించిన భిక్షుకి నవలను చూస్తే, వెట్టిచాకిరీ పేరుతో ఎవ్వరూ బందీలుగా ఉండకూడదని వారికి కూడా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కావాలని కోరుకున్నట్లు తెలుస్తుంది. ఈ నవలలో ఆ ఆచారం పట్ల ప్రతిఘటన కనబడక పోయినప్పటికీ, ఆ విధానంలో గల అన్యాయాలను మనకు చూపుతూ ప్రజల దీన స్థితిని తెలియజేశారు.

కథా విషయానికి వచ్చేసరికి స్వాతంత్ర్యానికి పూర్వం చిత్తూరు జిల్లా నుండి పందొమ్మిది కథలు వచ్చాయి. ఈ పందొమ్మిది కథలూ కూడా వివిధ రకాలైన వస్తు వైవిధ్యతలను ప్రదర్శించిన కథలే. మూఢనమ్మకాల దగ్గర నుండి, స్త్రీ సమస్యల దగ్గర నుండి (వరకట్నం, కన్యాశుల్కం), సాహుకార్ల దురాగతాల దగ్గర నుండి, ఆర్థిక, రాజకీయ, దేశభక్తి మొదలైన అనేక విషయాలను స్పృశిస్తూ కథలు వచ్చాయి.

చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యం సర్కారు ప్రాంతాల కంటే ఆలస్యంగా వచ్చిందని చెప్తున్నప్పటికీ (ప్రస్తుతం లభిస్తున్న సమాచారాన్ని బట్టి ఈ అభిప్రాయాన్ని కొంత సవరించుకోవచ్చు) ప్రారంభం నుండీ పరిశీలిస్తే 1947కి ముందు ఎటువంటి సాహిత్యమైతే కల్పనా సాహిత్యానికి అవసరమో అటువంటి సాహిత్యాన్ని ఇది ప్రతిఫలింప చేసిందని చెప్పొచ్చు.

స్వాతంత్ర్యానంతరం వచ్చిన (1975లోపు) చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యాన్ని పరిశీలించినట్లయితే, 1950 తర్వాత తెలుగు సాహిత్యంలో, అందులోనూ కల్పనా సాహిత్యంలో అనేక మార్పులు వచ్చాయి. వస్తు స్వీకరణలో అయితేనేమి, భావ వ్యక్తీకరణలో అయితేనేమి అనేకమైన మార్పులు సంభవించాయి. కారణం ఆంగ్ల సాహిత్య సంపర్కం. అప్పటికే నవలా సాహిత్యం సాంప్రదాయిక పద్ధతిని దాటి ఉద్యమాల ప్రభావానికి లోనుకావడం మొదలు పెట్టింది. మనిషికి సమాజానికి గల సంబంధ అంతరాలతో పాటూ మనిషికి మనిషికి గల సంబంధ అంతరాలను కూడా వివరించే దశకు కల్పనా సాహిత్యం వచ్చింది. కథాసాహిత్యం కూడా. ఈ మార్పులన్నింటినీ చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యం కూడా స్వాగతించింది. ఆ ప్రభావంతోనే ఈ ప్రాంతం నుండి అనేక నవలలు, కథలు వచ్చాయి.

అనుబంధాలు, మళ్ళీ వసంతం, అసుర సంధ్య వంటి అస్తిత్వ ప్రభావం కల నవలలు; మొగిలి, ఇంద్రధనుస్సు, దూరతీరాలు, త్రిశంకుడి స్వర్గం వంటి సాంఘిక నవలలు; చిన్న

ప్రపంచం సిరివాడ, గాడిద బ్రతుకులు లాంటి వ్యంగ్య (కొంత హాస్యం కూడా) నవలలు;రామానుజుని ప్రతిజ్ఞ, ఓరుగల్లు పునరాక్రమణ వంటి చారిత్రక నవలలు చిత్తూరు జిల్లా నుండి వచ్చాయి. అదేవిధంగా కథా సాహిత్యాన్ని చూస్తే, 1950–1975 మధ్య కాలంలో కె. సభా దగ్గర నుండి చూస్తే మధురాంతకం రాజారాం, పూతలపట్టు శ్రీరాములు రెడ్డి, నూతలపాటి గంగాధరం, వల్లంపాటి వెంకట సుబ్బయ్య, కలువకొలను సదానంద, శ్రీనివాసపురం రామాచార్యులు, మధురాంతకం దొరస్వామి, కె.ఆర్. రెడ్డి, కాసారం కుప్పుస్వామి, కాశీనాథ విశ్వం, ఆర్.ఎస్. సుదర్శనం, సి. వేణు, పులికంటి కృష్ణారెడ్డి మొదలైనవాళ్ళు రచనలు చేశారు. (1950–1975 మధ్య కాలంలో రచనలు చేశారని తెలుస్తున్నా వారి రచనలు లభించని కారణంగా కొంతమంది పేర్లు ఇక్కడ రాయట్లేదు). వీరి కథల్లో మూఢనమ్మకాలు, సామాజిక రుగ్మతలు, కుటుంబ సంబంధాలు, ప్రేమలు, పెళ్ళిళ్ళు, స్త్రీ సమస్యలు, వ్యవసాయ సమస్యలు కరువు సమస్యలు, ఉద్యోగ సమస్యలు, వాపార సమస్యలు, ఆర్థిక సమస్యలు, రాజకీయ సమస్యలు, కళాకారుల జీవితాలు, జంతు ప్రేమలు ఇవే కాకుండా మధ్యతరగతి జీవితాల్లో తారసపడే ప్రతి అంశాన్ని వస్తువుగా తీసుకొని కథలను రాశారు.

ఈ అధ్యాయంలో చిత్తూరు జిల్లా కథా సాహిత్యంలో వచ్చిన వస్తువైవిధ్యాలనన్నింటినీ ఇక్కడ వివరించాను. అలాగే చివర్లో చిత్తూరు జిల్లా నవల కథా సాహిత్యంలోని వస్తు పరిణామ విధానాన్ని వివరించాను.

తర్వాత అధ్యాయంలో చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యంలో గల శిల్ప వైవిధ్యాలను వివరించబోతున్నాను.

అధ్యాయం – 6

చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యం
(నవల, కథానిక)– రూప (శిల్ప) వైవిధ్యం

6.0. శిల్పం:

ముందు అధ్యాయంలో చిత్తూరు జిల్లా కథా సాహిత్యానికి సంబంధించిన వస్తు వైవిధ్యాన్ని తెలియజేశాను. ఈ అధ్యాయంలో జిల్లాకు చెందిన నవల, కథానికలలో ఆయా రచయితలు ప్రదర్శించిన శిల్ప వైవిధ్యాన్ని వివరించే ప్రయత్నం చేస్తాను.

రచయిత ఏమి చెప్పాడన్నది వస్తువు అయితే, ఎలా చెప్పాడన్నదే శిల్పం అవుతుంది. రచయిత తన అనుభవం నుండి గాని, సమాజం నుండి గాని, ఒక సంఘటనను గాని, సన్నివేశాన్ని గాని, ఒక పాత్రను గాని, ఒక భావాన్ని గాని, వస్తువుగా గ్రహించి దానిని రచనా నైపుణ్యంతో ఒక అద్భుతమైన రచనగా (నవలగా లేదా కథగా) మలిచే విధానమే శిల్పం. ఈ విధంగా వస్తువుని కథా రూపంలో పాఠకునికి చేరవేసేదే శిల్పం. బంగారాన్ని ఒక ఆభరణంగా తయారుచేసే స్వర్ణకారుడు తన హస్త నైపుణ్యంతో ఎలా అయితే ఆభరణాన్ని అందంగా తయారుచేస్తాడో అలానే రచయిత కూడా ముడిసరుకు లాంటి వస్తువును తన రచనా నైపుణ్యంతో ఒక నవలగా, కథగా మారుస్తాడు.

తెలుగులో 'శిల్పం' అనే మాటను ఆంగ్లంలోని Technique అనే పదానికి సమానార్థకంలో ఉపయోగిస్తున్నాం. సాధారణంగా ఈ పదానికి *"రాతితో చెక్కిన బొమ్మ అని అర్థం"* (కథానిక స్వరూప స్వభావాలు, 1988: 396). సాధారణ అర్థంలోని శిల్పానికి రచనలో (నవల, కథ) నిర్వహించబడే శిల్పానికి గల సంబంధాన్ని చూస్తే స్వర్ణకారుడు – ఆభరణంలాగే , నవలలో కాని, కథలో కాని వస్తువు తప్ప మిగిలినదంతా, అంటే ఎత్తుగడ నుండి ముగింపు వరకూ, కథను నడిపే క్రమంలో పాత్రల దగ్గర నుండి కథనం వరకూ గల అంశాలనన్నింటినీ శిల్పంగా చెప్పొచ్చు.

కథానికను త్రిమితీయ విశ్లేషణాత్మకంగా (వస్తుగత విశ్లేషణ, రూపగత విశ్లేషణ, సంవిధాన విశ్లేషణ) వివరించిన పోరంకి దక్షిణామూర్తిగారు వస్తు విన్యాసం, పాత్రచిత్రణ, సంఘటన/సంవిధానం, సంఘర్షణ, సన్నివేశ కల్పన, కథనం, వర్ణన, ఎత్తుగడ, శీర్షికలను కథానిక ప్రక్రియలో అభివ్యక్తమయ్యే రచనా శిల్ప విశేషాలుగా చెప్పారు. అలాగే శిల్పం గురించి వల్లంపాటి వెంకటసుబ్బయ్య *"కథా రూపాన్ని పాత్రలు, ప్లాట్ (plot), వాతావరణం (setting), దృష్టికోణం (point of view), కంఠ స్వరం (tone), కథన పద్ధతి (mode of narration) అన్న ఆరు అంశాలుగా భాగించి అర్థం చేసుకోవచ్చు. ఈ ఆరు అంశాలను కలిపి స్థూలంగా 'శిల్పం' అన్న పేరుతో కూడా వ్యవహరించడం జరుగుతూ ఉంటుంది"* (అనుశీలన (సాహిత్య

వ్యాసాలు), 1985: 37) అని అంటారు. పై విషయాలు కథానికకు అన్వయించి చెప్పినా లేదా నవలకు అన్వయించి చెప్పినా ఒక్కటే.

ఎస్.ఎస్. నళిని సాహిత్య విమర్శ పదాల డిక్షనరీలో శిల్పం అనే మాటకి అర్థంగా *"తీసుకున్న కథా వస్తువుని అందించే విధానం. రచనలో కథావస్తువును వదిలేస్తే మిగిలినదంతా శిల్పమే. అంటే రచయిత ఎన్నుకున్న విషయాన్ని ఎలా చెప్పాడన్నది శిల్పం కిందికి వస్తుంది"* అని అన్నారు. (సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ, 2021: 173)

ఈ అధ్యాయంలో శిల్పం, రూపం అనే మాటలను ఒకే అర్థంలో వాడుతున్నాను. నిజానికి రూపం అనేది భౌతిక నిర్మాణానికి సంబంధించినది. శిల్పం అలా కాదు. అయితే కథానిక, నవలా విమర్శకులైన వల్లంపాటి వెంకట సుబ్బయ్య, రాచపాళెం చంద్రశేఖరరెడ్డి లాంటి వారు రూపం అనే మాటను శిల్పం అనే అర్థంలోనే వాడారు. అలాగే పోరంకి దక్షిణామూర్తి కూడా కథానికను త్రిమితీయ విశ్లేషణాత్మకంగా వివరిస్తూ రూపగత విశ్లేషణ కింద శిల్పంలోని అంశాలను ప్రస్తావించారు. దీనిని బట్టి చూస్తే రూపం, శిల్పం అనే పదాలకు వేరు వేరు అర్థాలు ఉన్నప్పటికీ ప్రస్తుతం ఒకే అర్థంలో వాడుతున్నారు అని చెప్పొచ్చు. అలాగే రూపవాదుల విమర్శలో కూడా శిల్పానికి సంబంధించిన విషయాలే ఎక్కువగా ఉంటాయి. అందుకే ఈ రెండు పదాలనూ ఒకే అర్థంలో నేను ఉపయోగిస్తున్నాను. శిల్పానికి సంబంధించి లేదా రూపానికి సంబంధించి పైన చెప్పిన అంశాలు పూర్తిగా వైయక్తికమైనవి. ఒక రచయిత తన రచనలో చూపిన నైపుణ్యానికి, మరో రచయిత తన రచనలో చూపిన నైపుణ్యానికి తేడా ఉండొచ్చు. ఈ విషయాలు చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యంలో (నవల, కథానిక) ఏ విధంగా ఉన్నాయో పరిశీలించడమే ఈ అధ్యాయంలోని ప్రధాన విషయం.

విషయ విస్తృతి కారణంగా చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యంలో గల వస్తు వైవిధ్యతలను విడివిడిగా రెండు అధ్యాయాలలో (నాలుగవ అధ్యాయం, ఐదవ అధ్యాయం) తెలియజేశాను. శిల్పానికి సంబంధించి నవలకు గాని, కథానికకు గానీ చాలావరకూ ఒకే రకంగా ఉండడం కారణంగా రెండింటినీ కలిపి ఒకే అధ్యాయంలో చెప్పే ప్రయత్నం చేస్తున్నాను.

6.1. చిత్తూరు జిల్లా నవలా సాహిత్యం – రూప (శిల్పం) వైవిధ్యం:

చిత్తూరు జిల్లా నవలా సాహిత్యంలోని శిల్పాంశాలలో పాత్రచిత్రణ, కథాకథనం/దృష్టికోణం, భాషాంశాలు (సామెతలు, మాండలిక పదాలు, అన్యదేశ పదాలు, ధ్వన్యనుకరణ పదాలు, జంటపదాలు), శైలికి సంబంధించిన అంశాలను మాత్రమే ఇక్కడ చర్చిస్తున్నాను.

6.1.1. పాత్ర చిత్రణ:

"కథను నడిపించేవారూ, కథా వస్తువును భరించేవారూ, కథాంశాన్ని సూచించేవారూ పాత్రలు". (కథాశిల్పం, 2016: 24). ఇటువంటి పాత్రలను రచయిత కథా వస్తువును నిర్ధారించుకున్న తర్వాత ఆ వస్తువును కథా రూపంలోకి మార్చే క్రమంలో సృష్టిస్తాడు. ఎందుకంటే

పాత్రలు లేనిదే కథ ముందుకు సాగదు కనుక. ఈ పాత్రలు సమాజంలోని మనుషులకు ప్రతిబింబాలు. ప్రపంచంలో మనిషి జీవితం కన్నా విశిష్టమైనది మరొకటి లేదు. ఆ జీవితంలో సుఖదుఃఖాలు, కష్టానష్టాలు ఇలా ఎన్నో ఉంటాయి. ఇవి మనిషికి ఎదురైనప్పుడు ఆయా సందర్భాలలో ఏ విధంగా ప్రవర్తిస్తాడు, ఎలా ప్రతిస్పందిస్తాడు అనేదే అతని వ్యక్తిత్వం. రచయిత ఒక వ్యక్తి జీవితాన్ని, లేదా అతనికి ఎదురయ్యే సంఘటనలను తీసుకొని కథగా మార్చే క్రమంలో ఆ వ్యక్తి యొక్క వ్యక్తిత్వాన్ని మానసికావస్థను కథలో ఒక పాత్ర ద్వారా పాఠకుడికి కళ్ళకు కట్టినట్టు చూపించే నైపుణ్యమే పాత్ర చిత్రణ.

ఈ పాత్రల గురించి పాత్ర చిత్రణ గురించి మాదిరాజు రంగారావు *"అక్షరరూపంలో జీవించే వ్యక్తిత్వరూపాలే నవలల్లో పాత్రలు. బహిర్ అంతర్ వ్యక్తిత్వ దర్శనమే పాత్రచిత్రణ"* అని అంటాడు. (నవల స్వరూప సమాలోచనం, 1984: 33).

ఇటువంటి పాత్రలను ఇ.ఎమ్. ఫార్ స్టర్ ఫ్లాట్ క్యారెక్టర్స్, రౌండ్ క్యారెక్టర్స్ అని రెండు రకాలుగా విభజించారు. వీటిని క్లిష్టత లేని పాత్రలు, క్లిష్టత ఉన్న పాత్రలు అని వల్లంపాటి వెంకట సుబ్బయ్య చెప్పారు. మొదటి నుండి చివరి వరకూ ఒకే విధమైన మనస్తత్వం కలిగిన పాత్రలను ఫ్లాట్ క్యారెక్టర్స్ (క్లిష్టతలేని పాత్రలు) అని, వీటికి భిన్నమైనవి రౌండ్ క్యారెక్టర్స్ (క్లిష్టత ఉన్న పాత్రలు) అని అంటారు. ఇలాంటి పాత్రలు భిన్న మనస్తత్వాలను కలిగి ఉంటాయి.

వల్లంపాటి వెంకట సుబ్బయ్య నవలల్లోని పాత్రలకు, కథల్లోని పాత్రలకు తేడాని చెప్తూ ఇలా అంటారు. *"నవలలోని పాత్రల్లో కనిపించే విశాలత్వమూ, లోతూ కథల్లోని పాత్రల్లో కనిపించవు. నవలల్లో అనేక పాత్రలు ఉంటాయి. కాబట్టి విభిన్న మానవ వ్యక్తిత్వాలను ఒక దాంతో ఒకటి పోల్చి చూపవచ్చు. కథలో అలాంటి అవకాశం చాలా తక్కువ. నవలలోని పాత్ర పాఠకుని మనుసులో రూపొందుతుంది. అంటే నవలా రచయిత ఒక పాత్రకు సంబంధించిన అనేక ముఖాలను పాఠకుని ముందుంచితే పాఠకుడు వాటి సహాయంతో ఆ పాత్ర వ్యక్తిత్వాన్ని తన మనసులో నిర్మించుకుంటాడు. కథలో అలా కాకుండా రచయిత మనస్సులో రూపొందిన పాత్ర పాఠకుని ముందుకొస్తుంది. కథలోని పాత్ర కూడా సాధారణంగా మానవుడే కాబట్టి అతడికి అనేక ముఖాలూ, అతనిలోనూ అనేక విభిన్న లక్షణాలూ ఉండవచ్చు. కథా రచయిత వాటిలోంచే కథాంశానికి దోహదం చేసే లక్షణాన్నో, లక్షణాల్నో మాత్రమే ఎన్నుకోవలసి ఉంటుంది. ఈ ఎన్నికలో కథా రచయిత జీవితానుభవమూ, శిల్ప సామర్థ్యమూ వ్యక్తమౌతాయి".* (కథాశిల్పం, 2016: 24,25)

నవల గానీ, కథ గానీ ముఖ్యంగా వాస్తవికత మీద ఆధారపడ్డ సాహిత్య ప్రక్రియలు. కాబట్టి పాత్రపోషణ కూడా అందుకు తగ్గట్టుగానే జరగాలి. రచయిత కథా కాలానికి సంబంధించిన పాత్రల్ని, కథా వాతావరణానికి సంబంధం ఉన్న పాత్రల్ని ఎన్నుకోకపోతే కథ చెప్పడంలో సఫలీకృతుడు కాలేడు.

చిత్తూరు జిల్లా నవలా సాహిత్యంలో విభిన్నమైన పాత్రలను మనం చూడవచ్చు. చారిత్రక పాత్రల దగ్గర నుండి సామాన్య మానవుని వరకూ అనేక రకాలైన పాత్రలు చిత్తూరుజిల్లా నవలా సాహిత్యంలో చోటుచేసుకున్నాయి. డబ్బు అహంకారం కల సాహుకారు పాత్రలు, తిండికి గతిలేని పేదల పాత్రలు, వృత్తి పట్ల గౌరవం లేని పాత్రలు, నిజాయితీకి నిలువుటద్దమైన పాత్రలు, అమాయకపు పాత్రలు, వేశ్యా పాత్రలు, సంఘ సంస్కరణ భావాలు కలిగిన పాత్రలు, నిస్సహాయులైన పాత్రలు, తను నమ్మిన ఆదర్శాలను చివరి వరకూ పాటించలేక జీవితంతో రాజీ పడిన పాత్రలు ఇలా అనేకరకాలైన పాత్రలను ఈ ప్రాంతం నుండి వచ్చిన నవలా సాహిత్యంలో చూడవచ్చు.

6.1.1.1. చాందసుల్తానా:

'చాందసుల్తానా' నవలలో చాందసుల్తానా అనే పాత్ర ధైర్య సాహసాలను పుణికి పుచ్చుకున్న వీర వనితగా కనిపిస్తుంది. ఈమె మొదట అహమ్మద్ నగరం నుండి బీజాపూరు యువరాణిగా వెళ్లిన తర్వాత భర్త మరణానంతరం తన మరిది కొడుకు రెండవ ఇబ్రహీం ఆదిల్ షాహా రాజవుతాడు. అయితే ఇతను చిన్నవాడవటంతో అతని పేర బీజాపూరు సంరక్షణా బాధ్యతను, అహమ్మద్ నగరుకు వెళ్ళిన తర్వాత ఈమె తమ్ముని మనుమడు బహాదర్ చిన్నవాడవటంతో అతని పేర అహమ్మద్ నగర సంరక్షణా బాధ్యతను మీద వేసుకొని ఎంతో సమర్ధతతో రాజద్రోహుల నుండీ, నమ్మక ద్రోహుల నుండీ, మొగల్ సైన్యం నుండీ అహమ్మదు నగర రాజ్యాన్ని కాపాడిన స్త్రీగా మరో ఝాన్సీరాణిలాగా ఈ నవలలో ఈమె పాత్రను మలిచాడు నవలా రచయిత. ఈమె గొప్పతనాన్ని తెలుపుతూ నవలకు భూమికను రాసిన చెలికాని లచ్చారావు ఈవిధంగా అంటారు. *"ఈమె రాజకీయ పరిపాలనా కుశలత్వంబును, మొగలాయిలతో బోరునపుడు చూపిన యసమాన శౌర్యోత్సాహంబులును వర్ణనాతీతములు. రణ రంగమందు సార్వభౌముడగు అక్బరు చక్రవర్తి సైన్యంబుతో అసమాన ధైర్యోత్సాహంబులతో బోరాడి చెల్లాచెదరుజేసి వెనుకకు మరలించిన వీర వనిత. నేటి వరకును దక్షిణమున స్త్రీల శౌర్యమును గురించి ప్రస్తావన వచ్చినప్పుడు మును నీమె పేరును బేర్కొందురు".* (రాయలసీమ నవల తొలిదశ–ఒక అధ్యయనం, 2015: 104)

6.1.1.2. అక్కన్న మాదన్నలు:

అబ్దుల్ హసన్ కుతుబ్ షా గోల్కొండ నవాబుగా ఉన్న కాలంలో అక్కన్న మాదన్నలు మంత్రులుగా ఉండేవారు. అక్కన్న మదన్నలు తానీషా పట్ల గౌరవంతో ఉండేవారు అలాగే తానీషా కూడా అక్కన్న మాదన్నలపట్ల విశ్వాసంగా ఉండేవారు. రసికుడు, విలాసవంతుడు అయిన తానీషా రాజ్య సంబంధ విషయాలను పట్టించుకునేవాడు కాదు. ఇలాంటి సమయంలో అక్కన్న మాదన్నలు ఇద్దరూ సర్వాధికారాలను వహించి పక్షపాత బుద్ధి లేకుండా రాజభక్తితో గోల్కొండ రాజ్య సంరక్షణా బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించారు. గోల్కొండలోని ముస్లిములంతా ఒక్కటై అక్కన్న మాదన్నలకు వ్యతిరేకంగా తానీషాకు చెబుతున్నప్పటికీ వీరు వాటిని పట్టించుకోకుండా

హిందూ ముస్లింల ఐక్యత కోసం పాటుపడిన పాత్రలుగా ఈ నవలలో (తానీషా) కనిపిస్తారు. హిందూ ముస్లింల ఐక్యతే కాదు ధైర్య సాహసవంతులుగా రచయిత ఈ రెండు పాత్రలను చిత్రించారు. అందుకే మొగలులు వీరు చనిపోయిన తర్వాతనే గోల్కొండను వశపరచుకోగలిగారంటే వీరి సాహసాలను మనం అర్థం చేసుకోవచ్చు.

6.1.1.3. హరికిషోరుడు:

రత్నాబాయి అనే నవలలో హరికిషోరుడనే పాత్రను సంఘసంస్కరణ భావాలు కలిగిన పాత్రగా రచయిత చిత్రించాడు. తన అక్క రత్నాబాయి, తన పెళ్లి కోసం వరుడుకి ఇవ్వాల్సిన కట్నం కోసం తల్లిదండ్రుల బాధలను చూసి భరించలేక విషం తాగి ఆత్మహత్య చేసుకుంటుంది. ఇలా తన అక్క చనిపోవడానికి గల కారణాలను చిన్నప్పటి నుండి గ్రహించిన హరికిశోరుడు కన్యాశుల్కం, వరశుల్కం వంటి సమస్యలను ఎలాగైనా నిర్మూలించాలని బాల్యం నుంచే ఆలోచించేవాడు. హరికిషోరుడు పెద్దైన తర్వాత ఈ సమాజాన్ని పట్టి పీడిస్తున్న కన్యాశుల్కం, వరశుల్కం లాంటి సమస్యలపై తిరుగుబాటు చేస్తూ, వాటిని సమూలంగా రూపుమాపడానికి సభలు, సమావేశాలు ఏర్పరుస్తూ ప్రజల్లో కొంత చైతన్యాన్ని తేవడం కోసం పాటుపడుతుంటాడు.

6.1.1.4. వైకుంఠ శర్మ:

భానుమతి నవలలో వైకుంఠశర్మ సుప్రసిద్ధ డాక్టర్. డబ్బు కోసం ఏ పనైనా చేయగల విశ్వాస ఘాతకుడు. వేశ్యాగృహంలో ఉన్న స్త్రీల రహస్య గర్భాలను తీయించగల సమర్థుడు. అలా పుట్టిన బిడ్డలలో అందమైన వారిని పెంచుకొని డబ్బులకు అమ్మేసేవాడు కూడా. ఆస్తి కోసం ఆశపడి అప్పటికే తన మేనకోడలుతో అక్రమ సంబంధం ఉన్నప్పటికీ తనని రామశర్మ అనే జమీందారుకు కట్టబెట్టిన దుర్మార్గుడు. ఇలా ఒక్కటేమిటి ప్రతి కీలకమైన సంఘటనలోనూ, సన్నివేశంలోనూ ఇతని పాత్ర లేనిదే నవల ముందుకు సాగదు.

6.1.1.5. కళావతి:

భానుమతి నవలలో రామశర్మ రెండవ భార్య కళావతి. రామశర్మను పెళ్లి చేసుకునే సమయానికి అతనితో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకొని ఉంటుంది. తనకు పుట్టబోయే బిడ్డలకు రామ శర్మ ఆస్తినంతటినీ రాసి ఇవ్వాలని. అయితే రామశర్మ మొదటి భార్య లీలావతి కూడా ఇద్దరు పిల్లల్ని కనడంతో తన సవితి తల్లి బుద్ధిని చూపించుకుంటుంది. ఈ నవలలో ఆ పిల్లలను చంపడానికి కూడా వెనుకాడదు. చివరికి భర్తను కూడా చంపే ప్రయత్నం చేస్తుంది. ఈ నవలలో కళావతి పాత్రను చూస్తే మాతృ హృదయం లేని ఒక స్త్రీగా కనిపిస్తుంది.

6.1.1.6. మోహన:

మోహన అనే నవలలో ప్రధాన పాత్ర మోహన ఒక వేశ్య. నగరంలో ఉన్న ధనవంతులను, అధికారులను పసిగట్టి ఒక పథకం ప్రకారం వారిని తన వైపుకు తిప్పుకొని వారి దగ్గర ఉన్నటువంటి ఆస్తినంతటినీ లాక్కొనగలిగే వేశ్యగా ఈ పాత్ర కనిపిస్తుంది. ఆనాటి సమాజంలో వేశ్యాప్రవృత్తి ఎంత నీచంగా ఉందో ఈ పాత్ర ద్వారా మనకు అర్థమవుతుంది

6.1.1.7. నంజుండప్ప:

భిక్షుకి అనే నవలలో నంజుండప్ప ఒక షావుకారు. ఈ పాత్రను భూస్వామ్య వ్యవస్థకు ప్రతీకగా, అధికారం, డబ్బు, అహంకారానికి నిలువెత్తు నిదర్శనంగా చెప్పవచ్చు. తన ఇంటి పాలేరైన జాలప్పను తన ఇంటి ఎద్దే పొడవడంతో చనిపోతాడు. జీవితాంతం వారింట్లోనే పాలేరుగా పని చేస్తున్నప్పటికీ కనీసం ఆసుపత్రికి కూడా తీసుకెళ్ళడు. జాలప్ప కొన ఊపిరితో ఉండగానే ఆ పీనుగును అక్కడి నుండి తీసేయమంటాడు. కారణం షావుకారు ఇంటివద్ద అతడు చనిపోతే ఆ నింద తన పైకి వస్తుందని. జాలప్ప చనిపోతే కనీసం దహన సంస్కారాలకు కూడా చెయ్యి విదిలించని దుర్మార్గుడు. పైగా అలాంటి పాలేరు మళ్లీ దొరకడని, తను అప్పుగా తీసుకున్న డబ్బు ఇంతటితో స్వాహా అని బాధపడతాడు. ఈ పరిస్థితులను చూస్తే షావుకారుల దయలేని హృదయం కనిపిస్తుంది.

6.1.1.8. బంగారు:

భిక్షుకి నవలలో బంగారు ఒక నిస్సహాయ పాత్రగా షావుకారు నిరంకుశత్వానికి బలైపోయిన పాతగా కనిపిస్తుంది. కామంతో కళ్ళు మూసుకుపోయిన మృగాల చేతుల్లో బలైపోయిన స్త్రీగా ఈ పాత్రను చూడవచ్చు. తన తండ్రి చేసిన అప్పుకు జీవితాంతం వెట్టి చాకిరీ చేస్తూ షావుకారు ఇంట్లో అవమానాలను, హింసలను భరిస్తూ, గోపి, నారాయణల చేత మానభంగం చేయబడి అక్కడి నుండి ఊరు వదిలి పారిపోయి తలదాచుకున్న అభాగ్యురాలు.

6.1.1.9. వేదమూర్తి:

అనుబంధాలు అనే నవలలో ప్రధాన పాత్ర అయిన వేదమూర్తి కొన్ని నిర్దిష్టమైన ఆదర్శాలను కలిగి ఉన్న పాత్ర. కట్నం తీసుకొని పెళ్లి చేసుకోకూడదని, తద్వారా వచ్చే డబ్బుతో కుటుంబాన్ని పోషించకూడదని భావించే వ్యక్తి. అయితే తను నమ్మిన ఆదర్శాలకు సమాజంలో ఎదురయ్యే పరిస్థితులకు పొంతన కుదరకపోవడంతో కొంత సతమతమవుతాడు. చివరికి ఏ ఆదర్శాలనైతే పాటిస్తూ ఉంటాడో అవే ఆదర్శాలను వదిలేసి జీవితంతో రాజీ పడతాడు. అస్తిత్వవాద ఛాయలు వేదమూర్తి పాత్రలో చూడవచ్చు.

6.1.1.10. ఊర్మిళ:

మళ్ళీ వసంతం అనే నవలలో ఊర్మిళ వ్యక్తి ధర్మానికి, వ్యవస్థా ధర్మానికి మధ్య ఊగిసలాడే పాత్రగా కనిపిస్తుంది. ఊర్మిళను అస్తిత్వవాద మనస్తత్వం గల పాత్రగా రచయిత మలిచారనడంలో ఎటువంటి సందేహం లేదు. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన ఊర్మిళను ఆ కుటుంబమే పెంచి పెద్ద చేసి డాక్టర్ని చేస్తుంది. అందుకనే ఆ కుటుంబం పట్ల బాధ్యతతో అనుక్షణం నడుచుకుంటుంది. అక్క చనిపోయాక తన భావం మీద సానుభూతితో నాగభూషణాన్ని పెళ్లి చేసుకుంటుంది. తను ప్రేమించిన చంద్రశేఖరాన్ని కాదనుకుంటుంది. నవల చివర్లో చంద్రశేఖరంతో కలిసి జీవించాలని నిర్ణయించుకుంటుంది. అంటే ఇక్కడ ఊర్మిళ స్వధర్మం

కోసం బావ నాగభూషణాన్ని పెళ్లి చేసుకోవడం, వ్యవస్థ కోసం చంద్రశేఖరంతో కలిసి జీవించాలని నిర్ణయించుకోవడం చూస్తే ఈమె వ్యక్తి ధర్మానికి వ్యవస్థ ధర్మానికి మధ్య సమన్వయాన్ని సాధించే దిశగా నిర్ణయాన్ని తీసుకుందని అర్థమవుతుంది.

6.1.1.11. శ్రీధర్:

అసుర సంధ్య నవలలో శ్రీధర్ మొదట ఆదర్శవాదిగా ఉంటూ తను ఏర్పరచుకున్న ఆదర్శాలు పాటిస్తూ ఉంటాడు. అయితే అవి అతనిని అడుగడుగునా ఓటమికి, ఆత్మ న్యూనతకు గురిచేస్తూ ఉంటాయి. దీంతో మానసిక వేదనకు, ఆత్మన్యూనతకు గురవుతాడు. వీటిని తొలగించుకోవాలని ఆరాటపడుతుంటాడు. దీనికి శ్రీధర్ కు నాగరాజు, చంద్రావతి, పద్మామణి, ఆత్మానంద స్వాముల పరిచయాలు తోడ్పడతాయి. వీరి పరిచయాల కారణంగా శ్రీధర్ చివరకు ఆదర్శభావాలను వదిలేసి వాస్తవ జీవితంతో రాజీపడి జీవితాన్ని ముందుకు సాగిస్తాడు.

అనుబంధాలు, మళ్ళీవసంతం, అసురసంధ్య అనే మూడు నవలలూ అస్తిత్వ ప్రభావం కలిగిన నవలలు. అందుకే ఆ నవలల్లోని ప్రధాన పాత్రలు (వేదమూర్తి, ఊర్మిళ, శ్రీధర్) అందుకు అనుగుణంగానే ప్రవర్తిస్తుంటాయి.

6.1.1.12. మొగిలప్ప:

మొగిలి నవలలో మొగిలప్ప పాత్ర నిజాయితీ గలిగిన పాత్రగా కనిపిస్తుంది. కరువు పరిస్థితులను తట్టుకోలేక జీవనోపాధి కోసం పరాయి ప్రాంతానికి వెళ్తాడు. అక్కడ అమ్మయ్య చౌదరి దగ్గర తన నిజాయితీని ప్రదర్శించి, ఉద్యోగాన్ని సంపాదించుకొంటాడు. అమ్మయ్య చౌదరి కూతురు తనను ప్రేమించినప్పటికీ తనకి జీవనోపాధిని చూపించిన అమ్మయ్య చౌదరికి ద్రోహం చెయ్యడు. వారి అనుమతి లేనిదే పెళ్లి చేసుకోనంటాడు. అమ్మయ్య కూతురు లలిత నలభైవేల రూపాయలు తీసుకొని వచ్చి ఎక్కడికైనా వెళ్లిపోదామని వచ్చినప్పటికీ వద్దని ఆమె మనసును మార్చి డబ్బుతో సహా ఆమెను తన ఇంటి వద్ద వదులుతాడు. అలాగే తనకు దొరికిన యాభైవేల రూపాయలు ఉన్న సూట్ కేసును, కష్ట పరిస్థితుల్లో ఉన్నప్పటికీ ఆ డబ్బుకు ఆశ పడకుండా తనది కాదని నిజాయితీగా అందులో ఉన్న అడ్రస్ ప్రకారం తీసుకెళ్లి వారి డబ్బును వారికి అప్పజెప్పేస్తాడు.

6.1.1.13. రామజోగి:

చిన్న ప్రపంచం సిరివాడ అనే నవలలో రామజోగి పాత్ర అమాయకపు పాత్రగా కనిపిస్తుంది. రామజోగికి హైస్కూల్ హెడ్ మాస్టర్ తనను పొగిడితే వినాలని, ఉన్నదానితో సరి పెట్టుకోవడం వల్ల కలిగే సంతృప్తి తన భార్య ముఖంలో చూడాలని, తన కాపురం తను చేసుకుంటూ ఉంటే కూతురు దగ్గరకు వెళ్లి రెండు పూటలా అతిథి మర్యాదలు పొందాలని, ఒక కొత్త వస్త్రాన్ని భుజంపైన వేసుకుని వీధిలో ఎవరైనా అడిగితే అది మా అబ్బాయి కొనిచ్చాడని చెప్పాలని ఆశ పడుతూ ఉంటాడు. ఇలాంటి కొన్ని ఆశలతో పాటు, కొన్ని ఆశయాలు కూడా రామజోగికి ఉంటాయి. అవి విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని మంచి మార్కులతో పాస్ అవ్వాలని,

రైళ్లు పడిపోకూడదని, విమానాలు కూలిపోకూడదని, అనావృష్టి వల్ల వైర్లు ఎండిపోకూడదని, అతివృష్టి వల్ల ఊళ్ళు తుడిచిపెట్టుకొని పోకూడదని, జనాలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకోవడం. రామజోగి ఆశలు ఆశయాలు అటు ఉంచితే అబద్ధం చెప్పలేడు. ఎంతగా ప్రయత్నించినా రహస్య గోపనం చేయలేడు తీయగా మాట్లాడిన ప్రతి వ్యక్తిని మానవోత్తముడు అనుకుంటాడు. కళ్ళ ముందర ఏ మాత్రం చెడు జరిగినా కుమిలిపోతాడు. అంత సున్నితమైన మనస్సు ఇతనిది.

6.1.1.14. రాజశేఖరం, చంద్రశేఖరం:

గాడిద బ్రతుకులు నవలలో ఈ రెండు పాత్రలు ప్రతీకాత్మక పాత్రలుగా కనిపిస్తాయి.. సమాజంలో గొడ్డు చాకిరీ విధానానికి, గయ్యాళిగంపల చేతుల్లో పడి సతమతమై నలిగిపోయే పురుషుల జీవితాలకు ఈ పాత్రలు ప్రతీకగా నిలుస్తాయి. రాజశేఖరం, చంద్రశేఖరం తండ్రీ కొడుకులు. రాజశేఖరం భార్య ఒక గయ్యాళి. ఏ పనీ చేయదు. చివరికి భర్తకు కాఫీ కూడా పెట్టదు. ఇంటి పని, వంట పని, ఆఫీస్ పని ఇలా అన్నీ కూడా వీరిద్దరే చేస్తారు. చివరికి కూతురు పెళ్లి విషయంలో కూడా వీరి మాటలు చెల్లవు. అటువంటి వీరు, వారికి (భార్యకు) బుద్ధి చెప్పాలని జీతంతో సహా ఇంట్లో ఇవ్వకుండా తీర్థయాత్రలకని వెళ్ళిపోతారు. ఒక రకంగా ఈ పాత్రలు మొదటి నుంచి ఒకే రకమైన మనస్తత్వంతో ఉన్నప్పటికీ ఆ గయ్యాళిగంపల విధానానికి విసిగిపోయి చివరికి ధైర్యం చేసిన పాత్రలుగా కనిపిస్తాయి.

6.1.1.15. గజలక్ష్మి:

గాడిద బ్రతుకులు నవలలో గజలక్ష్మి పాత్ర ఒక గయ్యాళి గంప లాంటిది. ఇంట్లో ఏ పనీ చేయదు. సినిమాలు షికార్లు అంటూ తన కూతుర్ని వెంటబెట్టుకొని తిరుగుతూ ఉంటుంది. నెల తిరగక ముందే జీతం అంతా ఊడ్చేసి భర్తను డబ్బులో డబ్బులో అంటూ వేధిస్తూ ఉంటుంది. కొడుకు పైచదువులకి పట్నం వెళ్లాలంటే, పెందలాడే లేచి క్యారియర్లు చేయడం తన వల్ల కాదంటుంది. ఈ నవలలో ఈ పాత్రను చూస్తే ఇల్లాలిగా తన బాధ్యతను, తల్లిగా తన కర్తవ్యాన్ని మరిచి పోయిన పాత్రగా కూడా కనిపిస్తుంది.

6.1.1.16. వన మోహిని:

గాడిద బ్రతుకులు నవలలో వనమోహిని పాత్ర యువతరంలో యువతి యువకులు వ్యసనాలకు లోనై జీవితాన్ని నాశనం చేసుకునే వారికి ఉదాహరణగా ఈ పాత్రను చెప్పొచ్చు. గయ్యాళి గంప లాంటి తల్లి చాటు బిడ్డగా ఎదిగి, అన్నను లెక్కచేయకుండా సినీ వార పత్రికల వ్యామోహంతో, శృతి మించిన శృంగార పత్రికల వ్యామోహంలో పడి, వెంకటపతి అనే వ్యక్తి చేత మోసగించబడి చివరికి గర్భవతిగా మారి తనని తాను నిందించుకుంటుంది.

6.1.1.17. విశ్వనాధయ్య:

ఇంద్రధనస్సు నవలలో విశ్వనాధయ్య పాత్ర ఆదర్శవంతమైన పాత్రగా కనిపిస్తుంది. విశ్వనాథయ్య తండ్రి, కొడుకు బాగా చదువుకొని లాయరై కుటుంబాన్ని ఉద్ధరిస్తాడు

అనుకుంటాడు. కానీ కాలేజీ వాతావరణం, విద్యార్థుల ఆలోచన పద్ధతి, నాటి బ్రిటీష్ ప్రభుత్వ విధానం విశ్వనాధంలో మార్పులు తీసుకొస్తాయి. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని రాజకీయవాదిగా తయారవుతాడు. దేశ స్వాతంత్రం వచ్చిన తర్వాత విశ్వనాధయ్య కృషి ఎవరికీ కనిపించదు. స్వార్థం, రాజకీయ ఎత్తుగడలు తెలియని విశ్వనాధయ్య రాజకీయాల్లో ఇమడలేక వ్యవసాయంలోకి దిగుతాడు. కొడుకు దుర్మార్గుడని తెలిసి కొడుకు పట్ల కొంత కఠినత్వాన్ని ప్రదర్శిస్తాడు. కొడుకు చేసిన తప్పుకి ప్రకాశాన్ని బలి తీసుకోవడం ఇష్టం లేక శారద విషయంలో జరిగిన విషయాలను నిజాయితీగా చెప్పాలనుకుంటాడు. ఇలా ప్రతి విషయంలోనూ తన నిజాయితీని ప్రదర్శిస్తూ ఆదర్శవంతంగా ఉంటాడు.

6.1.1.18. ప్రకాశం:

ఇంద్రధనస్సు నవలలో ప్రకాశం పాత్ర నీతికి, నిజాయితీకి, క్రమశిక్షణకు నిలువుటద్దంగా కనిపిస్తుంది. బి.ఎ. వరకు చదువుకొని, స్వగ్రామంపై అభిమానంతో తల్లి కోసం, చెల్లి కోసం ఊర్లో వ్యవసాయం చేసుకుంటూ నలుగురిలో గౌరవంగా ఉంటాడు. తను మనస్ఫూర్తిగా ప్రేమించిన శారదను ఉమాపతి మానభంగం చేశాడని తెలిసినప్పటికీ స్వచ్ఛమైన ప్రేమకు మనసుతో పనిగాని శరీరంతో పనిలేదని ఆమెను పెళ్లి చేసుకోవడానికి ఇష్టపడతాడు.

వ్యాపార లబ్ధి కోసం జగన్నాధం ఎన్ని ఆశలు చూపించినప్పటికీ ప్రకాశం లొంగడు. తను చేసుకోబోయే అమ్మాయికి అన్యాయం చేసిన ఉమాపతిని కూడా మార్చడానికి ప్రయత్నిస్తాడు. అలాగే జగన్నాధం కూతురు ఇందిర ప్రేమ, పెళ్లి విషయంలో కూడా సహాయాన్ని అందిస్తాడు. ఈ విధంగా ప్రతి విషయంలోనూ ఈ పాత్ర ఆదర్శవంతంగానే ముందుకు నడుస్తుంది.

6.1.1.19. రత్నమ్మ:

ఇంద్రధనస్సు నవలలో విశ్వనాధయ్య చెల్లెలు రత్నమ్మ. భర్త చనిపోవడంతో అన్న ఇంట్లోనే ఉంటూ పెత్తనం చెలాయించాలని ఒక ఆశతో ఉంటుంది. తన కూతురు శారదను ఉమాపతికిచ్చి పెళ్లి చేయాలనుకుంటుంది. అది జరగదు అని తెలిసి ప్రకాశంతో తన కూతురు పెళ్లి జరగకూడదని విశ్వ ప్రయత్నాలు చేస్తుంది. ఉమాపతి చేతుల్లో బలైపోయిన శారద గర్భవతి అని లేనిపోని అభాండాలు తన కన్న కూతురు పైన వేస్తుంది. చివరికి తన ఎత్తుగడలేవి సాగకపోవడంతో తన అన్న గారి ఇంటి పైన పెత్తనం చెలాయించలేకపోయానే అని బాధపడుతుంది.

6.1.1.20. శారద:

ఇంద్రధనస్సు నవలలలో శారద విశ్వనాధయ్య చెల్లెలి కుమార్తె. ఈమెను పల్లెటూరి అమాయకపు ఆడపిల్లనచ్చు. తన బావ ఉమాపతి తనపై చేసిన అఘాయిత్యాన్ని మరుగునపరిచి ప్రకాశంతో పెళ్లికి ఒప్పుకోలేక పోతుంది. మంచి వ్యక్తి, నలుగురు బాగు కోరుకునే ప్రకాశంకి శీలం పోగొట్టుకున్న తనలాంటి ఆడది కరెక్ట్ కాదని పెళ్లికి నిరాకరిస్తుంది. ప్రకాశానికి అన్యాయం

చేయలేక తనను ఏమనుకున్నా పర్వాలేదని ధైర్యంగా వెళ్లి తనకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకుంటుంది

6.1.1.21. డాక్టర్ విజయరత్నం:

త్రిశంకుడి స్వర్గం నవలలో కుటుంబాన్ని పోషించలేని కోదండం డాక్టర్ విజయరత్నంగా మారిన తర్వాత కోరుకున్న డబ్బు, కావాల్సిన సుఖం రెండూ దొరకడంతో తనను తాను మరిచిపోయి కట్టుకున్న భార్యను రెండేళ్ల కొడుకును కూడా పూర్తిగా మర్చిపోతాడు. చివరికి రంగశాయి అనే వ్యక్తికి వైద్యం చేయడానికి వెళ్లి అతడు తన కొడుకని తెలిసి బాధపడతాడు. నలుగురికీ చెప్పుకోలేక సతమతం అవుతాడు. చివరికి అక్కడి నుంచి పారిపోతాడు. బతకడం కోసం డబ్బు కానీ డబ్బే జీవితం కాదు అని ఈ పాత్ర ద్వారా రచయిత చెప్పినట్లు తెలుస్తుంది. మధ్య తరగతి మానవుడు తన జీవితం కోసం డబ్బు సంపాదన అనే ఒక మత్తులో పడి తన జీవితాన్ని తనే ఎలా వంచించుకుంటాడో ఈ పాత్రను చూస్తే తెలుస్తుంది.

6.1.1.22. రామానుజుడు:

రామానుజుని ప్రతిజ్ఞ నవలలో తను నమ్మిన సత్యానికి కట్టుబడి వైష్ణవమత వ్యాప్తికి తన జీవితం దాసోహం అనే విధంగా కృషిచేసిన మహానుభావుడుగా రచయిత ఈ పాత్రను తీర్చిదిద్దాడు. శైవులకు, వైష్ణవులకు మతం పేరిట విభేదాలు నెలకొన్న తరుణంలో చోళరాజు వైష్ణవుల పట్ల తలపెడుతున్న మారణహోమాన్ని తట్టుకొని నిలబడి యమునాచార్యులు కలలుగన్న విశిష్టాద్వైత మత వ్యాప్తిని చేసిన గొప్ప వ్యక్తి రామానుజుడు. అంతేకాక భారతదేశంలోని ఎన్నో పుణ్యక్షేత్రాల్లో శైవమత పెద్దలను ఓడించి వారిని వైష్ణవులుగాను, అనేక శైవ దేవాలయాలను వైష్ణవాలయాలుగా మారుస్తూ తన మతాన్ని వ్యాప్తి చేసిన గొప్ప వ్యక్తి. బ్రాహ్మణులకు తప్ప మరొకరికి తెలియడానికి వీలు లేని తిరుమంత్రాన్ని పంచములకు సైతం చెప్పి వారికి కూడా వైకుంఠ మార్గాన్ని చూపించిన వ్యక్తిగా ఈ పాత్రను రచయిత మలుస్తాడు. అలాగే వారికి శ్రీ వైష్ణవులని నామకరణం కూడా చేస్తాడు. ఇలా పంచములనే కాదు వారాంగనలైనా తిల్య లాంటి వాళ్లకు కూడా తన మత ప్రబోధాలను నిస్సంకోచంగా చెప్పగల గొప్ప వ్యక్తి.

6.1.1.23. కులోత్తుంగ చోళుడు:

రామానుజుని ప్రతిజ్ఞ నవలలో వేంగి చాళుక్యరాజైన రాజేంద్రుడు కాంచీపురాన్ని హస్తగతం చేసుకున్న తర్వాత కులోత్తుంగ చోళుడుగా మారి వైష్ణవుల పట్ల కఠినంగా ప్రవర్తిస్తూ 'శివార్పరతరం నాస్తి' అనే పేరుతో శివుడు తప్ప మరో దైవం లేదని ప్రజలందరి చేత సంతకాలు చేయిస్తూ, వైష్ణవ దేవాలయాలను శిథిలం చేస్తూ, తన దమన విధానాన్ని కొనసాగిస్తూ వెళ్లే ఒక క్రూర పాత్ర.

6.1.1.24. త్రిపురాంతకుడు:

రామానుజుని ప్రతిజ్ఞ అనే నవలలో త్రిపురాంతకుడు శైవ మతాభిమాని. చోళరాజు అధి రాజేంద్రుడు దగ్గర మంత్రిగా పనిచేస్తుంటాడు. ఇతని అనంతరం వీర రాజేంద్రుడు రాజవుతాడు.

ఇతని కాలంలో శైవమత ప్రాబల్యం తగ్గి వైష్ణవ మత ప్రాబల్యం పెరుగుతూ ఉంటుంది. ఇటువంటి సమయంలో తన మాట చెల్లుబడి కాలేదన్న కోపంతో తన రాజుపైకి వేంగి చాళుక్య రాజులను యుద్ధానికి ఆహ్వానించే అంతటి దుర్మార్గుడు. సైనిక ఉద్యోగులలో ఉన్న వైష్ణవులను శైవులుగా మారాలని నిర్బంధించేటంతటి మత పిచ్చి కలిగిన పాత్రగా చెప్పొచ్చు.

6.1.1.25. విద్యారణ్యయతీంద్రుడు:

మహమ్మదీయులు హైందవ రాజ్యాల పైన, హైందవ మతం పైన జరుపుతున్న దమనకాండకు బాధపడి హైందవ మతోద్ధరణకు అవసరమైతే ప్రాణత్యాగానికైనా వెనకాడకూడదని చెప్పే వ్యక్తిగా ఉంటాడు. ఇందుకోసం ఢిల్లీ సుల్తానులకు ఓరుగల్లు సైన్యాలకు మధ్య జరుగుతున్న ఒక యుద్ధంలో ఢిల్లీ సుల్తానుల పక్షం వచ్చిన సైన్యాధికారులైన హరిహరరాయలు బుక్కరాయలు దగ్గరికి వెళ్లి వారికి హితబోధ చేసి హైందవ రాజ్యాల వైపు తిరిగే విధంగా చేస్తాడు

6.1.1.26. హరిహరరాయలు బుక్కరాయలు:

చరిత్రలో ఈ పాత్రను విజయనగర సామ్రాజ్య స్థాపకులుగా, దక్షిణ భారతదేశం అంతటిని ఏకచక్రాధిపత్యాన పాలించిన రాజులుగా మాత్రమే ఎక్కువగా వినుంటాం. అయితే ఈ ఓరుగల్లు పునరాక్రమణ నవలలో విజయనగర సామ్రాజ్య స్థాపనకు ముందు హరిహరరాయలు బుక్కరాయలు హైందవమతోద్ధరణకు లేదా హైందవరాజ్య స్థాపనకు ఏ విధంగా పాటుపడ్డారు లేదా ఏ విధంగా సహాయపడ్డారు అనేది ఈ నవలలో చూడవచ్చు.

ఢిల్లీ సుల్తానులు కంపల్లిపై దండయాత్ర చేసిన సమయంలో హరిహరరాయలు బుక్కరాయలు బందీలుగా చిక్కి, ముస్లింలుగా మార్చబడి (కాసిం, అబ్దుల్లా) జైలు జీవితాన్ని అనుభవిస్తూ ఉంటారు. అయితే కాకతీయ సామ్రాజ్యాధిపతి ప్రతాపరుద్రుడు ఢిల్లీ సుల్తానుల చేతుల్లో ఓడిపోయి బందీగా చిక్కిన తర్వాత ఎలాగైనా ఓరుగల్లును చేజిక్కించుకోవాలని తాపత్రయపడే ఒక సమూహానికి వ్యతిరేకంగా ఢిల్లీ సుల్తాను పోరాడాల్సి వచ్చినప్పుడు హరిహరరాయలను బుక్కరాయలను వారి వైపు తిప్పుకొని ముస్లిం సేనలకు సైన్యాధ్యక్షత వహించి వారితో వ్యతిరేకంగా పోరాడమంటారు.

ఎంతైనా హిందువులే కాబట్టి మొదట్లో తమని నమ్మిన ఢిల్లీ సుల్తానులకు సాయంగానే యుద్ధం ప్రారంభిస్తారు. ఆ తర్వాత విద్యారణ్యయతీంద్రుని హితబోధ వల్ల మారి హైందవమత పునరుద్ధరణ కోసం ఢిల్లీ సైన్యాలకు అవకతవక ఆదేశాలిచ్చి హిందూ రాజ్యాలు గెలిచే విధంగా సహాయపడతారు.

పైన చెప్పిన పాత్రలే కాకుండా మరెన్నో ప్రధాన, అప్రధాన పాత్రలు చిత్తూరు జిల్లా నవలల్లో ఉన్నాయి. వాటినన్నింటినీ విశ్లేషించడం కష్టసాధ్యమైనపనిగా ఎంచి ప్రధాన పాత్రలను మాత్రమే ఇక్కడ పరిచయం చేశాను.

6.1.2. కథాకథనం/దృష్టికోణం:

కథ చెప్పే పద్ధతినే కథనం అంటారు. రచయిత ఎంచుకున్న కథా వస్తువుకు మనస్సులో ఒక స్వరూపం ఏర్పడ్డ తరువాత కథను ఎవరు చెప్పాలి అన్న ప్రశ్న ఎదురవుతుంది. అయితే కథను రచయితయినా చెప్పవచ్చు లేదా పాత్రల చేతైనా చెప్పించవచ్చు. ఇలా ఎవరు చెప్పినా కథా వస్తువుకు తగ్గట్టుగా ఎవరు చెప్పితే పాఠకుని మనస్సులో కథ ముద్ర వేసుకుంటుందో, ఏ కోణంలో నుంచి కథను పాఠకుడికి పరిచయం చేస్తే బాగుంటుందో కథకుడు ఆలోచించి ప్రణాళికా బద్ధంగా చెప్పాలి. ఈ విధంగా కథ చెప్పడానికి ఏర్పరుచుకున్న పద్ధతిని 'దృష్టికోణం' అని కూడా అంటారు.

'కథను ఎవరు చెప్పాలి అన్న ప్రశ్నకు ఎలా చెప్పాలి? అన్నది అనుబంధ ప్రశ్న. కథను ఎలా చెప్పాలి? అన్న ప్రశ్నను రచయిత వేసుకుంటే వచ్చే సమాధానం కథాకథనం'. తెలుగు నవలా సాహిత్యంలోను కథా సాహిత్యంలోనూ ప్రధానంగా రెండు కథన పద్ధతులు కనిపిస్తాయి. ఒకటి ప్రథమ పురుష దృష్టికోణం (సర్వసాక్షి దృష్టికోణం) ఉత్తమపురుష దృష్టికోణం. వీటితో పాటు నాటకీయ దృష్టికోణం కూడా ఉంది.

6.1.2.1. ప్రథమ పురుష దృష్టికోణం (సర్వసాక్షీ దృష్టికోణం):

ప్రథమ పురుష దృష్టికోణాన్నే రచయిత దృష్టికోణం అని కూడా అంటారు. ఈ దృష్టికోణంలో రచయిత సర్వాన్తర్యామిగా ఉంటాడు. *"రచయిత కథలోని అన్ని సంఘటనలకూ సాక్షి. అంటే కథ జరిగే అన్ని స్థలాల్లోనూ తానూ ఉన్నట్టుగా, పాత్రల మాటల్ని వింటున్నట్టుగా ఊహించుకుంటాడు. అంతేకాదు పాత్రల మనస్తత్వాన్ని గురించి కూడా ఇతనికి క్షుణ్ణంగా తెలుసు. పాత్రల ఆలోచనల్ని తాను ఊహించగలడు. పాత్రల భావోద్రేకాలను గురించి మనకు చెప్పగలడు. కథకుడు పాత్రలను 'అతడు', 'ఆమె' అని ప్రథమ పురుషలో సంబోధిస్తూ ఉండడం చేత ఈ దృష్టికోణాన్ని ప్రథమ పురుష దృష్టికోణం అని అంటారు".* (కథా శిల్పం, 2016: 39)

1975లోపు చిత్తూరు జిల్లా నుండి వచ్చిన పదిహేడు నవలల్లో రెండు నవలలు మినహా మిగిలినవన్నీ కూడా ప్రథమ పురుష దృష్టికోణంలో (సర్వసాక్షీ దృష్టికోణం) నడిచినవే. అవి చాందసుల్తానా, తానీషా, రత్నబాయి, భానుమతి, మోహన, భిక్షుకి, అనుబంధాలు, మొగిలి, ఇంద్రధనుస్సు, దూరతీరాలు, అసురసంధ్య, చిన్నప్రపంచం సిరివాడ, గాడిద బ్రతుకులు, రామానుజుని ప్రతిజ్ఞ, ఓరుగల్లు పునరాక్రమణ.

6.1.2.2. ఉత్తమపురుష దృష్టికోణం:

రచయిత ఒక పాత్రలోకి ప్రవేశించి అతని ద్వారా కథను చెప్పే పద్ధతే ఉత్తమ పురుష దృష్టికోణం. *"కథలో పాత్ర అయినవాడు తన ఉనికి తెలిసేటట్లుగా చెప్పే కథనం ఉత్తమ పురుష కథనం. దీంట్లో తరచుగా 'నేను/మేము' అన్న ప్రస్థావన సాగుతూ ఉంటుంది. ఆ పాత్ర భావాలు అతని మాటల్లోనే వెలువడుతూ ఉంటాయి".* (కథానికా స్వరూప స్వభావాలు, 1988: 370). ఈ విధమైన కథనంలో రచయిత కథను చెప్పడానికి ఒక కథకుణ్ణి సృష్టించుకుంటాడు. ఆ కథకుడు కథలోని ప్రధాన పాత్రైనా కావచ్చు లేదా అప్రధాన పాత్రైనా కావచ్చు.

1975 లోపు చిత్తూరు జిల్లా నుండి వచ్చిన పదిహేడు నవలల్లో మళ్ళీ వసంతం, త్రిశంకుడిస్వర్గం అనే నవలలు మాత్రమే ఉత్తమపురుష దృష్టికోణంలో సాగినవి.

6.1.3. భాష:

మానవుడు తన మనస్సులోని అభిప్రాయాలను బహిర్గతం చేయడానికి నోటి ద్వారా చేసే ధ్వనులే భాష. మనకు తెలియని భాష ఒకరు మాట్లాడుతున్నప్పుడు మనం వినేవి ఆ వ్యక్తి నోటి ద్వారా చేసే రకరకాల ధ్వనులే. ఆ భాష తెలిసినవారికి ఆ ధ్వనుల అర్థం బోధపడుతుంది. తెలియని వారికి వాటి అర్థం బోధపడదు. కాబట్టి భాషంటే కొన్ని ధ్వనుల సముదాయమేనని నేతి అనంత రామశాస్త్రిగారు తెలిపారు.

ఇటువంటి భాష సాహిత్యంలోకి వచ్చేసరికి రచయిత చిత్రించాలనుకున్న రచనా వస్తువుకు, అందులోని పాత్రలకు తగ్గట్టుగా ఉండాలి. ప్రజలకు దగ్గరగా ఉండే వ్యవహారిక భాషలోకాని, మాండలిక పదాలతోకాని, అందరికీ అర్థమయ్యేలా ప్రామాణిక భాషలో కాని ఉండాలి. అలాగే ఆ రచనలో, సమాజంలోని ఆచార వ్యవహారాలు, సామెతలు, పలుకుబళ్ళు చోటుచేసుకుంటే ఆ రచన పాఠకుని మనస్సును మెప్పించేలా ఉంటుంది.

చిత్తూరు జిల్లా నవలా సాహిత్యంలో సామెతలు, పలుకుబళ్ళు, ఉపమానాలు, జాతీయాలు, ధ్వన్యనుకరణ పదాలు, అన్యదేశ పదాలు, మాండలిక పదాలు ఇలా అనేక భాషాంశాలు చోటుచేసుకున్నాయి.

6.1.3.1. సామెతలు:

1. రొట్టె విరిగి నేతిలో బడినట్లాయను (చాందసుల్తానా. పుట: 65)
2. ఆలస్యం మమృతం విషమ్మనున్యాయ మసత్యమవునా (తానీషా, 1925: 47)
3. ముందఱగిన నూయి వెనుకగొయ్యి యనినట్లు (తానీషా, 1925: 48)
4. కాలుగాలిన పిల్లుల వలె (తానీషా, 1925: 51)
5. బూడిదలో బన్నీరు పోసినట్లు (తానీషా, 1925: 54)
6. మూలుగు నక్కపై దాటిపండు పడ్డట్లు (తానీషా, 1925: 89)
7. యూపిరియున్న నుప్పమ్ముకొని బ్రతకవచ్చు (తానీషా, 1925: 140)
8. మేక వన్నె పులులై (మోహన, 1931: 53)
9. నింటికి నిల్లాలు దొంతికి గడవయు గాని (మోహన, 1931: 53)
10. తాను ఒకటి తలచిన దైవమొకటి తలచును (మోహన, 1931: 81)
11. కుందేటి కొమ్ము (చిన్న ప్రపంచం సిరివాడ. 1971: 99)
12. అంగడిలో నన్నియునున్నవి; అల్లుని నోటిలో శనియున్నదనట్లు. (భానుమతి, 1930: 3)
13. దినగండం వేయేండ్లాయుస్సు (భానుమతి, 1930: 47, 297)
14. రోటియందు తల దూర్చి రోకటి పోటుకు వెరచిన ఎట్ల (భానుమతి, 1930: 48)

15. గురువుగారు కల్లు త్రావచుండ శిష్యుడు పాలు ద్రావనేర్చునా (భానుమతి, 1930: 87)
16. అల్పుని కధికారమోసంగిన యర్ధరాత్రమున గొడుగు బట్టుమను (భానుమతి, 1930: 172)
17. పాపి చిరాయువు అన్నట్లు (భానుమతి, 1930: 307)
18. గంతకు తగిన బొంత (భిక్షుకి, 1948: 113)
19. పిచ్చుకపై బ్రహ్మాస్త్రం (భిక్షుకి, 1948: 167)
20. కందకులేని దురద చేమ కెందుకంటారు (త్రిశంకుడిస్వర్గం, 1969: 1)
21. ఇచ్చే వాళ్లకు పుచ్చుకునే వాళ్ళు లోకువ (త్రిశంకుడిస్వర్గం, 1969: 15)
22. గోటబోయేదానికి గొడ్డలి తెచ్చావురా బాబు (త్రిశంకుడిస్వర్గం, 1969: 22)
23. పిట్ట కొంచెమైనా కూత ఘనమే (త్రిశంకుడిస్వర్గం, 1969: 22)
24. అంగట్లో అన్ని ఉండగా అల్లుడినోట్లో శని (త్రిశంకుడిస్వర్గం, 1969: 32)
25. కుక్క కాటుకు చెప్పు దెబ్బ (త్రిశంకుడిస్వర్గం, 1969: 68)
26. రెక్కాడితే గాని డొక్కాడని (త్రిశంకుడిస్వర్గం, 1969: 82)
27. పులి మీద పుట్రలా (త్రిశంకుడిస్వర్గం, 1969: 117)
28. గోరుచుట్టు మీద రోకటి పోటుగా (త్రిశంకుడిస్వర్గం, 1969: 187)
29. బావి తవ్వితే భూతం బయట పడిందని (త్రిశంకుడిస్వర్గం, 1969: 215)
30. మొగుణ్ణి తన్ని మగసాలకు కెక్కిందట ఎవతో (గాడిదబ్రతుకులు, 1972: 11)
31. తిరిగి కుందేటి కొమ్ము సాధించవచ్చు (గాడిదబ్రతుకులు, 1972: 12)
32. తాతకు దగ్గులు నేర్పడంలా (గాడిదబ్రతుకులు, 1972: 36)
33. రాతుండి తగులుకుంటినమ్మా ఈ రోత మొగుణ్ణి (గాడిదబ్రతుకులు, 1972: 41)
34. నక్క ఎక్కడ? నాకలోక మెక్కడ? (గాడిదబ్రతుకులు, 1972: 81)
35. ఉన్న మాటంటే ఉలుకెక్కువ (గాడిదబ్రతుకులు, 1972: 92)
36. అడగందే అమ్మయినా పెడుతుందా(గాడిదబ్రతుకులు, 1972: 143)
37. ఇంత బతుకూ బతికి ఇంటి వెనక చచ్చినట్లు (గాడిదబ్రతుకులు, 1972: 166)
38. బుద్ధి రాజ్యమేళాలనుకుంటే కర్మ గాడిదలు కాయలంటుంది (గాడిదబ్రతుకులు, 1972: 195)
39. మొరిగే కుక్కలు ఎప్పుడూ కరవ్వు (గాడిదబ్రతుకులు, 1972: 230)
40. బాపన సేద్యం – బెత్తం చేటు (ఇంద్రధనుస్సు, 1962: 11)
41. ఉత్తర చూసీ-ఎత్తర గంప (ఇంద్రధనుస్సు, 1962: 11)
42. ఈనగాచి నక్కల పాలన్నట్లు (ఇంద్రధనుస్సు, 1962: 19)
43. కోతపుండును బ్రహ్మరాక్షసిని చేశారు (దూరతీరాలు, 1962: 139)

6.1.3.2. మాండలిక పదాలు:

పాలుమాలిక (భిక్షుకి, 1948: 2)

మొట్టు (మెట్టు) (భిక్షుకి, 1948: 145)

తవ్వలు (భిక్షుకి, 1948: 111)

కూడు (భిక్షుకి, 1948: 99)

వసారా (భిక్షుకి, 1948: 107)

తేరకు (భిక్షుకి, 1948: 123)

పమిట (భిక్షుకి, 1948: 135)

గలభా (భిక్షుకి, 1948: 134)

బేలింపు (భిక్షుకి, 1948: 147)

దణ్ణం (భిక్షుకి, 1948: 167)

కైపు (భిక్షుకి, 1948: 169)

సాగబారు (భిక్షుకి, 1948: 169)

పుట్టగోచలం పెట్టుకొని (చాందసుల్తానా, 1920: 64)

పుస్తె (భానుమతి, 1930: 29)

సజ్జ చొప్ప (ఇంద్రధనస్సు, 1962: 19)

మట్టు మట్టున్నర (ఇంద్రధనస్సు, 1962: 46)

నడవ (త్రిశంకుడి స్వర్గం, 1969: 34)

పోలకువ (త్రిశంకుడి స్వర్గం, 1969: 35)

పంట్లాము (త్రిశంకుడి స్వర్గం, 1969: 35)

సాలు (త్రిశంకుడి స్వర్గం, 1969: 37)

నోటి వట్టం (త్రిశంకుడి స్వర్గం, 1969: 41)

తిత్తి (త్రిశంకుడి స్వర్గం, 1969: 65)

తురిమింది (త్రిశంకుడి స్వర్గం, 1969: 223)

సలీసు (త్రిశంకుడి స్వర్గం, 1969: 217)

కబిల (త్రిశంకుడి స్వర్గం, 1969: 191)

అడుసు మళ్ళు (త్రిశంకుడి స్వర్గం, 1969: 191)

'చిమిడి'పోతున్న అన్నం(త్రిశంకుడి స్వర్గం, 1969: 131)

పొద్దు వాటారి (త్రిశంకుడి స్వర్గం, 1969: 109)

కొంప (గాడిద బ్రతుకులు, 1972: 297)

చీకిపొద (గాడిద బ్రతుకులు, 1972: 134)

గోము (గాడిద బ్రతుకులు, 1972: 119)

మొగదల (మొగిలి, 1960: 6)

కనికెడు (మొగిలి, 1960: 10)

పట్టెడు (మొగిలి, 1960: 12)

సంజ (మొగిలి, 1960: 16)

తూరుపు పటం (మొగిలి, 1960: 23)

కొట్టం (మొగిలి, 1960: 189)

వడిసెల రాయి (చిన్న ప్రపంచం సిరివాడ. 1971: 55)

6.1.3.3. అన్యదేశ పదాలు:

మూల భాష నుండి వచ్చినవి మినహా మిగిలినవన్నీ అన్యదేశాలుగానే చెప్పొచ్చు. ఒక భాషలోకి కొత్తపదాలు చేరడానికి అక్కడి భౌగోళిక పరిస్థితులు, సాంఘిక, రాజకీయ, మత, సాంస్కృతిక, వాణిజ్య సంబంధాలు దోహదం చేస్తాయి. ఒక భాషలో ఒక వస్తువును చెప్పాలనుకున్నప్పుడు తగిన పదం లేకపోతే ఇతర భాషలలోని పదాలను వాడుకుంటాం. ఈవిధంగా చూసినప్పుడు తెలుగులోకి మొదట తత్సమ, తద్భవ పదాలు ఎక్కువగా చేరాయి. ఆ తర్వాతే అరబిక్, పర్షియన్, పోర్చుగీసు, ఇంగ్లీషు పదాలు తెలుగులోకి వచ్చాయి.

చిత్తూరు జిల్లా నవలా సాహిత్యంలో అన్యదేశాలను గమనించినట్లయితే మాండలిక పదాల తర్వాత ఎక్కువగా ఆంగ్ల పదాలు కనిపిస్తాయి. ఆ తర్వాతే పర్షియన్, అరబిక్, ఉర్దూ మొదలిన పదాలు కనిపిస్తాయి.

6.1.3.3.1. ఆంగ్ల పదాలు:

కాఫీ, ఇంజనీరు, ఆఫీస్, డార్లింగ్, అడ్రస్, స్టవ్, నెక్లెస్, లాయర్, కోర్టు, డిస్పెన్సరీ, హోటల్, రన్నింగ్ రేస్, హై స్కూలు, పేషంటు, ప్రెసిడెంట్, లాడ్జి, బిజీ, టార్చ్, ఫోకస్, ఫస్ట్ పీరియడ్, సిగరెట్. బుష్ కోటు, టూత్ పేస్ట్, టేబుల్, క్లాసికల్, డిటెక్టివ్, లైబ్రరీ, ప్రోగ్రాం, ప్లాస్క్ ఇలా ఎన్నో ఆంగ్ల పదాలు చిత్తూరు జిల్లా నవలా సాహిత్యంలో కనిపిస్తాయి.

6.1.3.3.2. పర్సియన్, అరబిక్, ఉర్దూ పదాలు:

షావుకారు (బిక్షుకి, 1948: 2)

ఖాళీ (బిక్షుకి, 1948: 133)

ఫకీరు (చాందసుల్తానా,1920: 2)

గులాము (చాందసుల్తానా,1920: 53)

రస్తా (చాందసుల్తానా,1920: 67)

బీరువా (చాందసుల్తానా,1920: 90)

ఫిరంగులు (చాందసుల్తానా,1920: 100)

తుపాకులు (చాందసుల్తానా,1920: 100)

డేరా (చాందసుల్తానా,1920: 100)

తురకలు (చాందసుల్తానా,1920: 108)

తానీషా (తానీషా, 1925: 12)

కప్పము (తానీషా, 1925: 45)

బరాకులు (తానీషా, 1925: 53)

ఫల్మానా (తానీషా, 1925: 66)

ఖర్చు (తానీషా, 1925: 89)

ఖజానా (తానీషా, 1925: 89)

జిబ్రిల్ (తానీషా, 1925: 97)

మొకాయిల్ (తానీషా, 1925: 97)

ఇజ్రాయిల్ (తానీషా, 1925: 97)

దివానము (తానీషా, 1925: 144)

షికారు (అసురసంధ్య, 1966:43)

జట్కా (అసురసంధ్య, 1966: 42)

బురకా (అసురసంధ్య, 1966: 53)

భోగట్టా (అసురసంధ్య, 1966: 56)

హుకూము (త్రిశంకుడి స్వర్గం, 1969: 12)

జారీ (త్రిశంకుడి స్వర్గం, 1969: 12)

హమేషా (త్రిశంకుడి స్వర్గం, 1969: 192)

6.1.3.4. ధ్వన్యనుకరణ పదాలు:

బుర్రు బుర్రు (మోహన, 1931: 5)

గప్ప గప్ప (మోహన, 1931: 5)

బిర బిర (మోహన, 1931: 7)

గుడ గుడ (ఇంద్రధనస్సు, పుట: 20)

గట గట (ఇంద్రధనస్సు, పుట: 23)

దబ దబ (ఇంద్రధనస్సు, పుట: 37)

చిర చిర (త్రిశంకుడి స్వర్గం, 1969: 24)

టక టక (త్రిశంకుడి స్వర్గం, 1969: 35

కిర్రు కిర్రు (త్రిశంకుడి స్వర్గం, 1969: 40)

కీచు కీచు (త్రిశంకుడి స్వర్గం, 1969: 40)

క్యారు క్యారు (త్రిశంకుడి స్వర్గం, 1969: 43)

జొట జొట (త్రిశంకుడి స్వర్గం, 1969: 199)

కణ కణ (త్రిశంకుడి స్వర్గం, 1969: 20)

బొట బొట (చిన్న ప్రపంచం సిరివాడ. 1971: 104)

గబ గబ (భిక్షుకి, 1948: 141)

చర చర (భిక్షుకి, 1948: 147)

కిల కిల (భిక్షుకి, 1948: 166)

విల విల (భిక్షుకి, 1948: 168)

రుస రుస (గాడిద బ్రతుకులు, 1972: 113)

మొట్ట మొట (గాడిద బ్రతుకులు, 1972: 246)

బిల బిల (గాడిద బ్రతుకులు, 1972: 204)

జల జల (మొగిలి, 1960: 1)

ఘుణ ఘుణ (మొగిలి, 1960: 16)

6.1.3.5. జంట పదాలు:

కూలో నాలో (మొగిలి, 1960: 4)

గొడ్డు గోదా (మొగిలి, 1960: 15)

బిడ్డ పాప (మొగిలి, 1960: 15)

పనీ పాట (భిక్షుకి, 1948: 186)

దుడ్డు దుగ్గాని (భిక్షుకి, 1948: 185)

జంకు గొంకు (గాడిద బ్రతుకులు, 1972: 124)

6.1.4. శైలి:

"మాట్లాడేటప్పుడు కాని, రాసేటప్పుడు కాని భాషాభివ్యక్తి (linguistic expression)లో కనబడే తీరును శైలి అంటాం" (కథానిక స్వరూప స్వభావాలు. పుట: 386).

శిల్పంలో శైలి అనేది ఒక భాగం. రచయిత రచనలో ఉపయోగించే భాషా సంబంధమైన నేర్పునే శైలి అంటారు. అందరు రచయితలూ ఒకే రకంగా భాషను ఉపయోగించరు. ఒక్కొక్కరు ఒక్కొక్క రకంగా ఉపయోగిస్తారు. విషయాన్ని బట్టి, సందర్భాన్ని బట్టి, శ్రోతను బట్టి భాష మారుతూ ఉంటుంది. ఇలాంటప్పుడు రచయిత ఉపయోగించే భాషా పద్ధతినే శైలి అని చెప్పవచ్చు.

"శైలి రచనకు ప్రాణం వంటిది. రచన పాఠకాదరణ పొందడం, పొందక పోవడం అనేది ఆ రచనలో శైలి మీద ఆధారపడి ఉంటుంది. అంటే శైలికి చదివించే గుణం ఉంటుంది. పాఠకుడి ప్రతిస్పందన కూడా శైలిని బట్టే ఉంటుంది. రచయిత, జీవితం పట్ల గల దృక్పథమూ, ఆలోచనా సరళీ, సాహిత్య సంస్కారమూ, జీవితానుభవమూ, అభిరుచి అతని శైలిని నిర్ణయిస్తాయి" అని తుమ్మల రామకృష్ణ అంటారు. రచయితకు సాహిత్యలోకంలో స్థానం కల్పించడంలోనూ, వైయుక్తిక ముద్రను ఏర్పరచడంలోనూ శైలి ప్రాముఖ్యత అధికంగా ఉంటుంది.

రచయితను బట్టి ప్రాచీన వచన శైలి, సరళ శైలి, గ్రాంథిక శైలి, వ్యవహార శైలి, ప్రామాణిక శైలి, మాండలిక శైలి, నాటకీయశైలి, వర్ణనాత్మక శైలి, వ్యంగ్యాత్మక శైలి ఇలా అనేక శైలులు కనిపిస్తాయి.

చిత్తూరు జిల్లా నవలా సాహిత్యాన్ని పరిశీలిస్తే 1950కి ముందు వచ్చిన ఆరు నవలల్లో ఒక్క 'భిక్షుకి' నవల తప్పనిచ్చి మిగిలిన నవలల్లో సరళ గ్రాంథిక శైలి కనిపిస్తుంది. వీటిల్లో అక్కడక్కడా గ్రాంథిక శైలి కూడా చూడవచ్చు. నవల పూర్తిగా వచన సాహిత్య ప్రక్రియ అయినప్పటికీ ప్రారంభదినాల్లో పద్య సాహిత్య వాసనలు పూర్తిగా పోగొట్టుకోలేక ఆయా రచయితలు అక్కడక్కడా సందర్భానుసారంగా పద్యాలు కూడా రాశారు. ఈ విధమైన శైలిని ఎక్కువగా తానీషా, రత్నాబాయి, మోహన వంటి నవలల్లో చూడవచ్చు.

"ఓక మలాప్తయోవరద యోప్రతిపక్షవిపక్ష దూరయో
హూకవి యోగివంద్యసుగునోత్తమ యోశరణాగాతామరా
నోకహయోమునీశ్వర మనోహర యో విమలప్రభావారా
వేకరుణింపవేతలపవే శరనార్థిని నన్నుగావనే"(తానీష, 1925: 1)ఇలా నవల ప్రారంభంలో ఒక పాత్ర ఆపద పరిస్థితిలో దేవుణ్ణి వేడుకొనే విధానాన్ని చూస్తే ఈ నవలా రచయిత పాటించిన శైలి మనకర్థమవుతుంది.

అదే విధంగా వచన విషయానికొస్తే *"మాధవపాద సముద్భూతమైన, కలుషవిధ్వంసినియై, యభంగాభ్రభోత్తుంగ తరంగమై, మర్మరధ్వాన నర్మాలాపంబులాడుచు, నాధుండగు నదీసుచెంతకుజూడ్కులకు వేడ్క నింపు మంద మందగమనంబుల బోవుచున్నదోయన ప్రవహించుచుండు గంగా స్రవంతినీ తీరంబున 'రంగాపూర'ను పురంబొండుగలదు"* (రత్నాబాయి,1925: 1) అంటూ సాగే ఈ వాక్యాలు ఎంత గ్రాంథిక పద్ధతిలో నడిచాయో చూడొచ్చు. దీర్ఘ సమాసాలతో, అలంకారాలతో సామాన్య పాఠకుడికి అర్థంకాని విధంగా ఉంటుంది. అయితే నవలంతా ఇదే విధంగా సాగదు. పోను పోను కొంత సరళంగానే ఉంటుంది.

"సాయంసమయమగుచుండెను. మందపవనమానందదాయకముగా వీవదోడంగెను. వినీలాభ్రపథ ప్రతిబింబమోయనదారంగాసంకలితసాగర మతిమనోహరముగ దృశ్యమగుచుండెను. తత్తీరస్థ విమల పులిన ప్రదేసమున కరుదెంచి ప్రకృతి విచిత్రవిలీనహృదయములగు వారిజన్మములు ధన్యతమము లగునట్లు ప్రకృతిసోభిల్లుచుండేను" (మోహన, 1931: 1) ఈ విధంగా మోహన నవల మొదలవుతుంది. పైన చెప్పిన మూడు ఉదాహరణలు చూస్తే చిత్తూరు జిల్లా నవలా ప్రారంభ దినాలల్లో రచయితలు గ్రాంథిక భాషకు ఎంత ప్రాధాన్యతను ఇచ్చారో తెలుస్తుంది.

నవల ప్రారంభంలో పైన చెప్పిన మూడు ఉదాహరణలలో లాగా గ్రాంథిక పద్ధతిలో నవలలు నడిచినప్పటికీ అవి పోను పోను సరళ గ్రాంథిక శైలిలో నడిచాయనడానికి ఈ క్రింది ఉదాహరణలు చూస్తే తెలుస్తుంది.

"ఆనాడు చక్రవర్తిగారి జన్మదినము. చన్నపట్టణంలోని ప్రాథమిక పాఠశాల మొదలున్నతకళాశాల వరకనీయు మూయబడియుండెను. విద్యార్థులందరును విచ్చలవిడిగా నుల్లములలర నాడుకొనుచుండిరి. మరికొందరు జట్లుజట్లుగా గూడి కాఫీహోటళ్ళ కాశ్రితులగుచుండిరి". (మోహన, 1931: 13)

"తారాబాయి యీరెలుగుతో మూల్గుచుమంచముపై బరుండీయుండెను. రామకిషోరుడును డాక్టరుతో గూడ నామెను సమీపింపగానే ఆమె కనులవిప్పి వారి వంక దృష్టుల బరపి మరల నయనములు మూసుకొనెను". (రత్నాబాయి, 1925: 14)

"ఈ సత్రము చాల విశాలమైన దగుటచే నందు బాటసారులచే నిండి నివిడీకృతములగు పెక్కుగదులు గలవు. ఆ గదులకు ముందు భాగమున నొక విశాలమైన యరుగు గలదు. ఆ యరుగుమీద నొక రిద్దర బైరాగులను నొక పకీరును బవ్వలించి యుండిరి". (చాందసుల్తానా, 1920: 8)

"ధర్మపురమును గ్రామము మద్రాసు రాజధానియందు పేరెన్నికగన్న పురంబులలో నొకటి. ఈ గ్రామము సముద్రమట్టమునకన్న నాలుగువేలడుగుల నెత్తుననుండుటవలనను, శీతోష్ణములంత యెక్కువగా లేకుండుటచేతను చాలామంది యాత్రికుల నాకర్షించుచున్నది". (భానుమతి, 1930: 1)

సరళ శైలి ఏ పాఠకున్నయినా ఆకట్టుకుంటుంది. ఈ శైలిలో వ్యాకరణ సూత్రాలు, పెద్దపెద్ద వాక్యాలు, అలంకారాలు లాంటివి ఉండవు. సరళంగా ఎక్కువ భాగం సమాపక క్రియలతో, సంక్లిష్ట వాక్యాలు లేకుండా క్లుప్తంగా అర్థవంతంగా ఉంటుంది.

చిత్తూరు జిల్లా నవలా సాహిత్యంలో 1950 తర్వాత వచ్చిన అనుబంధాలు, మళ్లీ వసంతం, మొగిలి, ఇంద్రధనస్సు, దూరతీరాలు, అసురసంధ్య, త్రిశంకుడి స్వర్గం, చిన్న ప్రపంచం సిరివాడ, గాడిద బ్రతుకులు, రామానుజుని ప్రతిజ్ఞ, ఓరుగల్లు పునరాక్రమణ, వంటి నవలలన్నీ సరళ శైలిలో నడిచిన నవలలే. ఈ నవలలో శైలి ఏ విధంగా నడిచిందో కింద చూడవచ్చు.

"అమాయకుడు జాలప్ప నెత్తురులో స్నానం చేశాడు. అతని జీవితంలో ఇంతటి దారుణాన్ని యెన్నడూ అనుభవించి యెరుగడు. ఆ నడిరేయిలో గడ్డివామి కెందుకెళ్ళాలి? వెళ్లాడు కదూ కాస్త దూరంలో నిలబడి గడ్డి ఎదిరించాలి కదూ? ఎందుకు ముందుగానే నిలవాలీ? ఇంతకు గ్రహచారం! బాగా కుమ్మింది డొక్కా చీలిపోయింది పేగులు కనబడుతున్నై. ఆ జీవన్మరణ సమస్యలు అతడి కెవరు సాయం చేస్తారు?" (భిక్షుకి, 1948: 1).

"ఇవ్వేళ ప్రభ పుట్టినరోజు. దానికి అయిదో ఏడు వెళ్ళింది. అతిథులైన డాక్టర్లు, నర్సులు సమావేశమైన పార్టీలో శేఖరం అన్నాడు "అమృతమూర్తి ఆనందమూర్తి అయినా చిట్టి ప్రభకు తల్లివైనందుకు అభినందనలు!" అని" (మళ్లీ వసంతం, 1960: 1).

"విశ్వనాధయ్యగారి కుటుంబానికి రొంపిచర్ల ప్రాంతంలో ఏడేడు పద్నాలుగు గ్రామాల్లో పేరుంది. విశ్వనాధయ్యగారి తాత సుబ్బావధానులుగారు యాగం చెయ్యకపోయినా వేదాలూ, శాస్త్రాలు క్షుణ్ణంగా చదువుకున్నవారు. వారికి వాక్సుద్ధి ఉందని, వారి తిట్టు శాపంగా తగులుతుందని ఆ కాలంలో అనుకునేవారు. వారి కాలంలో వారి పెరటిలోని భావినీళ్లు దివిటీకి కూడా వెలిగాయి" (వల్లంపాటి నవలలు, 2009: 11).

"బస్టాండులో జనం గిజగిజ లాడిపోతున్నారు. ప్రతిబస్సు దగ్గిరా టికెట్లకోసం ఒకర్నొకరు తోసుకుంటూ మూడింట రెండు వంతుల మంది టికెట్లు దొరక్క తెల్ల మొహాలు వేస్తున్నారు" (గాడిద బ్రతుకులు, 1972: 21).

"డాక్టరుగారు రోగి కప్పుకున్న దుప్పటిని అవతలికి లాగేశారు. షర్టు గుండీలు ఊడదీసేశారు. ముంగురులు సవరించారు. కేవలం తన చూపులతోనే రోగికి స్పృహ తెప్పించడానికి ప్రయత్నిస్తున్నట్టుగా రోగి పైకి వంగి అతడి ముఖంలోకి చూస్తున్నారు" (త్రిశంకుడి స్వర్గం, 1969: 9).

"ఏమిటో కడుపులో నొప్పిగా ఉందండీ ఈపూట.... ఇవాల్టికి మీరు షికారు వెళ్లకపోతే నేం? సమయానికి మీరు దగ్గరుండకపోతే నాకు భయం వెయ్యదూ? అన్నది శ్రీధర్ భార్య తార ఆ సాయంత్రం అతను షికారు బయలుదేరుతుండగా. ఆమెకు ప్రసవించే రోజులు. ఆమె కోసమే పది రోజులు సెలవుతీసుకొని, ఉద్యోగం చేస్తున్న మద్రాసునుంచీ బందరు వచ్చాడు శ్రీధర్" (అసుర సంధ్య నవల. భారతి పత్రిక 1965 జూన్: 30).

"రామజోగి కాస్త తటపటాయించాడు. చిమ్మ చీకటిలో సందు గొందుల వెంటబడిపోవడం మంచిది కాదు. దొంగ, దొంగ అంటూ ఎవరైనా వెంటపడినా పడవచ్చు. చుట్టూ దారి అయినా రోడ్డుపైన వెళ్లడమే క్షేమం. రామ జోగి నిల్చున్న చోటికి రోడ్డుకు మధ్య దూరం ఎంత లేదన్న ఒక ఫర్లాంగ్ దూరం ఉంటుంది" (చిన్న ప్రపంచం సిరివాడ, 1971: 26).

"మహాపురుషులందరూ సత్యం కోసమే అన్వేషించారు. మహర్షులు కూడా ఆ సత్యం కోసమే తపస్సు గావించారు. తాము నమ్మిన దానిని వారు ప్రచారం గావించారు. ఇదే సత్యమని వారు ఎన్నడూ చెప్పి ఉండలేదు. కానీ తన గురువైన యాదవ ప్రకాశకుడు మాత్రం ఆదిశంకరుడు చెప్పిన అద్వైతాన్నే ఉన్నదున్నట్లుగా నమ్మమంటాడు. నమ్మనంటే కోపగించుకుంటాడు. అది రామానుజునికే మాత్రం ఇష్టం లేదు" (రామానుజుని ప్రతిజ్ఞ, 1969: 9).

పై ఉదాహరణలలోని వాక్యాలు చూస్తే అక్షర జ్ఞానం ఉన్న ప్రతి పాఠకుడు చదువుకునే విధంగా సరళంగా ఉన్నాయి. ఇలా ఉండడమే సరళ శైలి యొక్క ప్రధాన లక్షణం. 1975 వరకు వచ్చిన చిత్తూరు జిల్లా నవలల్లో ఏ నవలను చూసినప్పటికీ ఇదే విధంగా దీర్ఘ సమాసాలు, తత్సమ

తద్భవాల లాంటి పదాలు, అలంకారాలు లాంటివి లేకుండా అందరికీ అర్థమయ్యే విధంగా సరళ శైలిలోనే నడిచాయి. చిత్తూరు జిల్లా నవలా రచయితలు అందరూ సరళ శైలి నవలలు రాసినప్పటికీ అక్కడక్కడా పాత్రల సంభాషణల్లో మాండలిక పదాలు కూడా వాడారు.

6.2. చిత్తూరు జిల్లా కథా సాహిత్యం – రూప (శిల్ప) వైవిధ్యం:

'రచయిత ఏమి చెప్పాడన్నది వస్తువు అయితే ఎలా చెప్పాడన్నదే శిల్పం అవుతుంద'ని చిత్తూరు జిల్లా నవలా సాహిత్యం – రూప (శిల్పం) వైవిధ్యం అనే ఉపశీర్షికలో ఇదివరకే చెప్పాను. అంతే కాకుండా శిల్పానికి సంబంధించిన కొన్ని వివరణలు, పలువురి అభిప్రాయాలు, దాని ప్రాధాన్యతను కూడా చెప్పాను. అవన్నీ నవలకే కాదు కథానికకు కూడా వర్తిస్తాయి. అందుకని పునరుక్తి కారణంగా మళ్ళీ ఇక్కడ ప్రస్తావించట్లేదు.

"వస్తువును ఇతివృత్తంగా మలిచే క్రమంలో రచయిత కనబరిచే పనితనమే శిల్పం. కథను ఎక్కడ ప్రారంభించాలి? ఎలా నడపాలి? ఎంతవరకు చెప్పాలి? ఏ స్వరంతో చెప్పాలి? ఏయే సన్నివేశాలను పరచాలి? అక్కడ ఏయే సంఘటనలను చొప్పించాలి? ఎన్ని పాత్రలను, ఎలాంటి పాత్రలను ఎంపిక చేసుకోవాలి? వారి సంభాషణలు ఏ భాషలో, ఏ యాసలో ఉండాలి? శైలి ఎలా ఉండాలి? కథను ఎక్కడ ముగించాలి? ఇందుకోసం రచయిత పథకం ఎలా ఉండాలి? ఆ పథకం పాఠకుడు పసిగట్టకుండా రచయిత ఎలా జాగ్రత్త పడాలి? – ఇలాంటివన్నీ కలిపి శిల్పం అవుతుంది. ఇవన్నీ శిల్పంలోని అంగాలే. శిల్పానికి సంబంధించిన అంశాలే" (కథానికా – పాఠాలు2016: 72,73).

పై చెప్పిన శిల్పవిశేషాలన్నీ 1975కి ముందు చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యంలో భాగమైన కథానిక (కథ)లో ఏవిధంగా చోటు చేసుకున్నాయో కింద విశ్లేషించే ప్రయత్నాన్ని చేశాను.

6.2.1. శీర్షిక:

సృష్టిలో ప్రతి వ్యక్తికి, ప్రతి వస్తువుకి, చెట్టుకి, పుట్టకి ఏదో ఒక పేరు అనేది ఉంటుంది. ఆ పేరుతోనే వాటిని గుర్తించడం జరుగుతుంది. అదే విధంగా సాహిత్య రంగంలో కూడా ప్రతి రచనకు ఒక పేరు అనేది ఉంటుంది. దానినే శీర్షిక అంటారు. ఈ శీర్షిక పెట్టడంలో ప్రతి రచయిత కొన్ని జాగ్రత్తలను తీసుకుంటారడు. *"శీర్షికలో కథావస్తు స్వభావం అలుముకొని ఉండాలి. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ కథా వస్తువు వాచ్యం కాకూడదు. కథానిక శీర్షిక పాఠకునిలో ఆసక్తిని కలిగించాలి. కథ లోనికి ఆహ్వానించగలగాలి. కేవలం వస్తువుకో, ఇతివృత్తానికో కాక; కథలోని పాత్రతోనో, సన్నివేశంతోనో, సంఘటనతోనో కూడా శీర్షికకు సంబంధం ఉండవచ్చు. అయితే కథను ముగించిన పాఠకుడు కథకూ, శీర్షికకూ ఎలాంటి సంబంధం లేదని ఎట్టి పరిస్థితుల్లోనూ పెదవి విరవకూడదు"* (కథానిక పాఠాలు,2016: 73).

రచయిత పై విధమైన జాగ్రత్తలు తీసుకొని రచనకు మంచి పేరును పెట్టినప్పుడే ఆ శీర్షిక పాఠకున్ని ఆకర్షించి, ఆ రచనను చదివించడానికి ప్రేరేపిస్తుంది. అందుకే ఇంతటి ప్రాధాన్యత ఉన్న

శీర్షికను గురించి పోరంకి దక్షిణామూర్తి *"సుందరమైన విగ్రహానికి నోసటి తిలకంలాగే చక్కటి కథకు మరింత చక్కదనం చేకూర్చేది వేరు"* (కథానిక స్వరూప స్వభావం, 1988: 413) అని అంటారు.

రచయిత రచనకు పెట్టే శీర్షికకు, అందులోని అంశాలకు మధ్య సంబంధం లేకపోతే లేదా సమన్వయం కుదరకపోతే ఆ రచన పాఠకులను అంతగా ఆకర్షించదు. కథానికా శిల్పంలో ఇంతటి ప్రాధాన్యం ఉన్న శీర్షికను పెట్టడంలో చిత్తూరు జిల్లా కథా రచయితలు వారి వారి నైపుణ్యాలను బాగానే ప్రదర్శించారు. చిత్తూరు జిల్లా కథా రచయితలు వారు రాసిన కథలకు, కథా వస్తువుని బట్టి లేదా సన్నివేశ ప్రాధాన్యతను బట్టి లేదా సంఘటన ప్రాధాన్యతను బట్టి లేదా ప్రధాన పాత్రను బట్టి రకరకాల పేర్లను పెట్టారు. అవి ఎలా ఉన్నాయో మచ్చుకు కొన్ని ఉదాహరణలు ఇస్తున్నాను.

ప్రధాన పాత్రలను కథా శీర్షికలుగా పెట్టిన కథలు: శారద, హైమావతి, సావిత్రి, చంద్రికా మోహనులు, బంగారు, కామందుల వారు, మా సుందరమ్మక్క, పంకజం, లచ్చి బతుకు, బాలామణి, అర్జున విషాదయోగం, రంగయ్య స్వరం.

కథా వస్తువుని బట్టి శీర్షికలు పెటిన కథలు: భోగపుమేలములు, విప్లవాంగన, వేయి రూపాయలు, తోలిబలి, ఎడారిపువ్వు, అమూల్యం, పురిటినొప్పులు, అంతరంగం, కొత్తకథ, మగపురుగు, బడిపంతులు, ఏకాకి, మమతలు మమకారాలు, వ్రతభంగం, మాతృసప్తకం, సబల, హోలీకులు కుశలమా, కన్నెచెర, వ్యవస్థ, పురుషులకు ప్రత్యేకం, కామదహనం, సవతిబిడ్డలు, కర్త కర్మ క్రియ, పులిగుండు, గాయపడిన దేవత, అల్పసంతోషులు, అనుబంధాలు, ఆగంతుక, కాలంతెచ్చిన మార్పు, సమర్థుడు, అబలలూ అనుమానాలు, మొగ్గతొడిగిన మొరడు కొమ్మ, నిరపరాధులు, పశ్చాత్తప్త చిత్తుడు, నవ్వే పెదాలు ఏడ్చే కళ్ళు, తాత దిగిపోయిన బండి, పువ్వులు నలగని రాత్రి, దేవీపూజ, అప్పిచ్చువాడు, అన్నదాత, దెయ్యాల కనుమ, ధర్మహాని, పరిస్థితులు పరిణామాలు, వర్ష రాత్రి. ఇలా ఇవే కాకుండా మరెన్నో వస్తువుకు తగ్గ శీర్షికలు పెట్టిన కథలు ఉన్నాయి.

6.2.2. ఎత్తుగడ:

ఎత్తుగడ అనేది కథానిక శిల్పంలో చాలా ప్రధానమైన విషయం. రచయిత కథను ఎక్కడ ప్రారంభించాలి అనే ప్రశ్నకు సమాధానమే ఎత్తుగడ అని చెప్పొచ్చు. దీనినే 'ఆరంభం' అని కూడా అంటారు. ఈ ఎత్తుగడ (ఆరంభం) మంచిగా లేకపోతే పాఠకుడు ఆ రచనను చదవడానికి ఉపక్రమించడు. *"మనసులో ఏర్పరచుకున్న ఇతివృత్తాన్ని ఆవిష్కరించే ప్రక్రియలో రచయిత (లేదా, కథకుడు), మొట్టమొదట ఏ అంశాన్ని ఎత్తుకుంటాడో ఆ రచన (కథ) లో అదే ఎత్తుగడ అవుతుంది"* (కథానిక స్వరూప స్వభావాలు1988: 289) అని పోరంకి దక్షిణామూర్తి అంటారు.

రచయిత శీర్షిక పెట్టడంలో ఎటువంటి జాగ్రత్తలు అయితే పాటిస్తాడో అటువంటి జాగ్రత్తలనే ఎత్తుగడ విషయంలో కూడా పాటిస్తాడు. ఎందుకంటే ఎత్తుగడ బాగా లేకపోతే కథలో

ఎంత మంచి విషయం ఉన్నప్పటికీ పాఠకుడు రచనలోకి వెళ్లడు. కాబట్టి ఎత్తుగడ కథానిక శిల్పంలో చాలా ముఖ్యమైన అంశం. ఈ ఎత్తుగడ అనేది వర్ణనాత్మక ఎత్తుగడ, సంఘటనాత్మక ఎత్తుగడ, సంభాషణాత్మక ఎత్తుగడ, సామెతలు, సాదృశ్యాత్మక ఎత్తుగడ, పాత్రల స్వభావాన్ని తెలుపుతూ మొదలయ్యే ఎత్తుగడ, పాత్ర వర్ణనతో మొదలయ్యే ఎత్తుగడ, వ్యాఖ్యానంతో మొదలయ్యే ఎత్తుగడ, సాధారణ/నేరుగా కథను ప్రారంభించే ఎత్తుగడ ఇలా అనేక రకాల ఎత్తుగడలతో కథలు ప్రారంభమవుతాయి. చిత్తూరు జిల్లా కథా సాహిత్యంలో అనేక రకాల ఎత్తుగడలు అనిపిస్తాయి. వాటిలో కొన్ని ప్రధానమైనవి మాత్రం ఇక్కడ ప్రస్తావిస్తున్నాను.

6.2.2.1. సాధారణ ఎత్తుగడ/నేరుగా కథను ప్రారంభించే ఎత్తుగడ:

రచయిత ఎటువంటి వర్ణనలు చేయకుండా నేరుగా కథను ప్రారంభించడం సాధారణ ఎత్తుగడ. దీనినే నేరుగా కథను ప్రారంభించే ఎత్తుగడ అనవచ్చు. చిత్తూరు జిల్లా కథలలో ఈ రకమైన ఎత్తుగడతో ప్రారంభమయ్యే కథలే చాలా ఉన్నాయి. ఉదాహరణకు హైమావతి కథ *"శ్యామరావు నిరుపేద. పిత్రార్జితము లేదు. ఏదో కొంత సంపాదించి యుండెను. అతనికి ముగ్గురు ఆడబిడ్డలు"* (రాయలసీమ తొలితరం కథలు,2015: 129) ఇలా సాధారణ ఎత్తుగడతో మొదలవుతుంది.

"పూర్వము కనకపురియను పట్టణముండెను. అందొకు సాహుకారు ముణుల వ్యాపారమున విశేష ధనమును గడించి నూతనముగా ఏడంతరవులు మేడను గట్టించెను" (మొదటి తరం రాయలసీమ కథలు, 2015: 129) అంటూ మొదలవుతుంది.

కె. సభా రాసిన ఎడారి పువ్వు కథ *"మీరు తప్పనిసరిగా ఈ సమావేశానికి హాజరు కావాలి, గత సంవత్సరం కూడా ఆహ్వానించాను అప్పుడు రాలేకపోయారు అన్నాడు వెంకటరావు కవిగారితో"* (బంగారు, 1963: 5) ఇలా మొదలవుతుంది.

రాజారాం రాసిన మానవుడి విజయం కథ *"మిట్ట మధ్యాహ్నం గదిలో పడుకుని ఏదో పుస్తకం చదువుకుంటున్నాను. మొదట వీధి తలుపు తెరచిన సవ్వడి, వెను వెంటనే గొంతు సవరించుకున్న శబ్దమూ వినిపించాయి"* (వర్షించిన మేఘం, 1961:26) ఇలా మొదలవుతుంది.

మధురాంతకం దొరస్వామి రాసిన లచ్చి బతుకు కథ *""ఏం? ఎండిపోతున్నావు లచ్చీ?" రామ్మూర్తి పరువు పైన కూర్చుంటూ ప్రశ్నించాడు"* (లచ్చి బతుకు కథ. ఆనందవాణి 1962.1.1: 81) ఇలా సాధారణంగా మొదలవుతుంది.

శ్రీనివాసపురం రామాచార్యులు రాసిన పశ్చాత్తప్త చిత్తుడు కథ *"ఇదిగో ! ఈ ఉత్తరాన్ని మీ వాళ్ళు రాశారు; చదువుకో! అని జేబులో నుంచి ఒక కవరును తీసి రమముఖాని కేసి కొట్టాడు రమేష్"* (ఆంధ్ర మహిళ పక్షపత్రిక. 1955. 12. 01: 58). అంటూ సాధారణంగా మొదలవుతుంది.

కలువకొలను సదానంద రాసిన నవ్వే పెదాలు ఏడ్చే కళ్ళు కూడా ఇలా సాధారణంగా మొదలవుతుంది. *"మహాపచారం అంటూ ముక్కున వేలే వేసుకున్నాడు వెంకటాచలం. అతనికి*

మహోపచారమనిపించిన దృశ్యమే నా కంటికి సముచితమైనది గాను, విద్దూరంగాను కనిపించింది" (నవ్వే పెదవులు ఏడ్చే కళ్ళు, 1975: 36)

ఇలా చెప్పుకుంటూ పోతే చిత్తూరు జిల్లా కథాసాహిత్యంలో చాలావరకు సాధారణంగా లేక నేరుగా ప్రారంభమైన కథలే ఎక్కువగా కనిపిస్తాయి. కాబట్టి వాటి పేర్లను మాత్రమే ఇక్కడ రాస్తావిస్తున్నాను. సభా రాసిన అంతరంగం, ఒకనాడు, ప్రజాసేవకుడు, ఎడారి పువ్వు, కృతజ్ఞత, కొత్త కథ, పాతాళగంగ, పునర్జన్మ, పుట్టగొడుగు కథలు; మధురాంతకం రాజారాం రాసిన మానవుడి విజయం, విధివిలాసం, ప్రాప్తి, మాతృసప్తకం, కాటుక కంటి నీరు, హోలీకులు కుశలమా, సభల, కమ్మతెమ్మర, మెత్తని పులి, రామారావు చతుర్లోకాలు, ప్రియభాందవి, ఎదురుగాలి, వ్రత భంగం, రేపటి ప్రపంచం, పొద్దుచాలని మనిషి, కోరిన కోనలో కురవని వాన వంటి కథలు; వల్లంపటి వెంకటసుబ్బయ్య రాసిన జాలరి బాల, తెచ్చుకున్న ముప్పు, అల్ప సంతోషులు, గాయపడిన దేవత మొదలైన కథలు; ఆర్.ఎస్. సుదర్శనం రాసిన మొగిలి పువ్వు, ఆత్మజ్ఞానం, నీరు పళ్ళ మెరుగు, పంకజం, ఏకాంతం, మొదలైన కథలు; కె.ఆర్. రెడ్డి రాసిన జ్ఞానోదయం, నిరపరాధులు, సైజు వారి అధికారాలు, అంతరాత్మలో ఆమె, మొదలైన కథలు; సి వేణు రాసిన తెలియని జవాబు, లక్ష రూపాయలు మొదలైన కథలు; పులికంటి కృష్ణారెడ్డి రాసిన రైట్స్ ఆఫ్ అడ్మిషన్; కాశీనాథ విశ్వం రాసిన అత్తింటి కోడలు, తీరని అప్పు, త్రైలోక్యం వశ్యాకరం, లాంటి కథలు ఎటువంటి ఆడంబరాలు లేకుండా నేరుగా సాధారణ ఎత్తుగడతో ప్రారంభమయ్యాయి.

6.2.2.2. సంభాషణాత్మక ఎత్తుగడ:

రెండు పాత్రల మధ్య సంభాషణతో కథ మొదలైతే దానిని సంభాషణాత్మక ఎత్తుగడ అంటారు. చిత్తూరు జిల్లా మొదటి కథైన 'శారద' కథ

"శారదా! శారదా! ఎన్ని మారులు పిలవ వలయునే?"

"ఏమ్మా! ప్రక్కయింటిలోని కమల పూలు కోయుటకు తోటకు రమ్మని పిలువగా పోయి యుంటిని",

"చాలులే! పని పాటలు చేయవు. చిన్నదానవా? అత్తవారింట మాకేమి యపకీర్తి తెచ్చెదవో? అని సంభాషణాత్మక ఎత్తుగడతో ప్రారంభమవుతుంది" (రాయలసీమ తొలితరం కథలు,2015:).

మధురాంతకం రాజారాం రాసిన కుంపట్లో కుసుమ కథ *"ఏమిటోయ్ అహమ్మద్! ఈ వేళ ఎంతకు బండి స్పీడ్ అందుకోవడం లేదే! అవతల నాకు బోలెడన్ని పనులు ఉన్నాయి అన్నాడు వెనుక సీటుకు చేరగిలబడి సిగరెట్ కాల్చుకుంటున్న వజ్రపాణి*

ఎక్కడో మిషన్ కొంచెం చెడిపోయినట్టుంది అయినా ఇంకెంత దూరం దరిదాపుకు వచ్చేసాము అన్నాడు డ్రయివర్" (ప్రాణదాత, 1962: 91) ఇలా ఇద్దరు వ్యక్తుల మధ్య సంభాషణతో కథ మొదలవుతుంది.

అలాగే సర్వీసు రిజిస్టర్ కథలో *"ఇదిగో రామన్నా! బుద్ధుందా నీకు? నేను చెప్పింది ఏమిటి? చేసింది ఏమిటి?*

మీరు చెప్పిందేనండమ్మగారూ! పరుపులు తీసి ఎండలో వేయమన్నారు. వేయబోతుండగా మళ్లీ వేసుకోవచ్చు గాని బజారుకెళ్ళి తల నూనె బుడ్డి తీసుకురమ్మన్నారు" (కమ్మతెమ్మెర, 1968: 94) అంటూ మొదలవుతుంది.

అలాగే ఆర్.ఎస్. సుదర్శనం రాసిన సమర్థుడు; కాశీనాథ్ విశ్వం రాసిన నరహరి నిజాయితీ మొదలైన కథలు సంభాషణతో మొదలవుతాయి

6.2.2.3. వర్ణనాత్మక ఎత్తుగడ:

ఏదైనా ఒక వస్తువుని గాని, ఒక వ్యక్తిని గాని, సంఘటనను గాని, సన్నివేశాన్ని గాని వర్ణిస్తూ కథ మొదలు పెట్టడాన్ని వర్ణనాత్మక ఎత్తుగడ అనవచ్చు. ఈ విధమైన ఎత్తుగడతో చిత్తూరు జిల్లా నుండి చాలా కథలే వచ్చాయి. ఉదాహరణకు కె. సభా రాసిన విప్లవాంగన కథ *"రుధిరకడలిలో విప్లవతరంగాల కదలికలో సమర నౌకతాండవం చేస్తోంది. నలుదిక్కుల ప్రళయభేరీ నినాదాలు వాయుతరంగాల్ని చీల్చుకుంటూ వెళుతున్నై. అంతరిక్షంలో మబ్బుతున్నలతో మంతనాలు సాగించే స్వాతంత్ర్యపతాకం ప్రజాహృదయాలలో కరుడుగట్టిన బానిస భావపరంపరని చెదరగొడుతోంది"* (కథాంజలి. దీపావళి సంచిక,1946: 28) అంటూ మొదలవుతుంది.

అలాగే రాజారాం రాసిన ప్రాణదాత కథ *"రాత్రి పది గంటల సమయం. బయట చలిగాలి వీస్తున్నా గదిలోపల వెచ్చగావుంది. నల్లటి నాపరాళ్లపైన, తెల్లటి గోడలమధ్య నీలిరంగు కాగితంతో ఆచ్ఛాదింపబడిన చిన్న బల్బు నుంచి స్రవిస్తున్న కాంతిలో ఆగది చిన్న సముద్రంలా వుంది. గోడపక్కగా నవారు మంచం. మంచంపైన మల్లె పువ్వు లాంటి దూది పరుపు"* (ప్రాణదాత, 1962: 5) అంటూ ఇలా ఆ వాతావరణాన్ని వర్ణిస్తూ మొదలవుతుంది.

సదానంద గారి బాలమణి కథ ఇలా మొదలవుతుంది *"నెమలి కోన. కొండకోనల పరదాల్లో, గుబురుతడవుల కౌగిట్లో– కొత్త పెండ్లి కూతురివలె ఒదిగి కూర్చున్న చిన్న పల్లె! అక్కడ పచ్చిక చేలన్నీ, పచ్చని చెట్లను చూస్తే పురి విప్పిన నెమళ్ళు జ్ఞాపకానికొస్తాయి"* (నవ్వే పెదాలు ఏడ్చే కళ్ళు, 1975: 94).

"ఒకటీ... రెండు... మూడు

ఒకదాని తర్వాత ఒకటి అన్నీ మిలమిలా మెరిసే తెల్లని పది నయాపైసల కాసులు కుడిచేతి నుండి ఎడమ చేతికి జారి పడుతూంటే, తూర్పు దిక్కున సూర్య భగవానుడు పైకెక్కేకొద్దీ విచ్చి వికసించే అరవిందంలా వెలిగిపోతూ ఉంది బోయిన గుర్రప్ప తాత ముఖం!" (పులికంటి కథావాహిని, 2003: 1) అంటూ పులి కంటి కృష్ణారెడ్డి రాసిన గుడ్ కోసం గువ్వలు కథ వర్ణణాత్మక ఎత్తుగడతో మొదలవుతుంది.

సి. వేణు నవ్విన ధాన్యరాశి కథ *"బాణావరం కోటకొమ్మంచుల చీర సింగారించుకుంది. నుదిటిపై చెందిరపు బొట్టు, గంగిరేనిపువ్వుకై నేసిన జుట్టు అందాన్ని అందిస్తూ ఉన్నవి. 'పెసులు కాయల్లాంటి పలుచని పెదాలు, నాణ్యమైన నాసిక, జిలిబిలి చూపులు, విరిసిన ఇంద్రచాపంలా చిరు దరహాసం' ఎవరో ఈ చిన్నది మిన్నున మెరిసిన మెరుపు చెమక్కు"* (నవ్విన ధాన్యరాశి, 2014: 29) అంటూ, కె.ఆర్. రెడ్డి రాసిన కెరటాలు కథ *"సాయంకాలం – సముద్రతీరం. హోరుగాలి ఉవ్వెత్తున వీస్తోంది. ఉత్తుంగ తరంగాలు పెనుగొండలుగా గట్టుమీద దాడి తీస్తున్నాయి. అవి సవానలభైవేలు సవాలుచేసినాగాని బెదరకుండా ఎదిరిస్తుంది తీరభూమి. హతాశతో నిర్వీర్యాలై వెనువదిరిగిపోతున్న కెరటాల మూలంగా శత్రువును భేదించే మర్మమేదో తెలిసికొన్నలాగా మరీ ఉధృతంగా మీద దూకుతున్నాయి క్రొత్త క్రొత్త తరంగాలు. ఆ సంకుల సమరంలో కూలిపోతూన్న కెరటాల కుటుంబాల్లో కోటి గొంతులు బావురుమన్నట్లుంది అక్కడి సముద్రఘోష"* (అబలలూ – అనుమానాలు,1967: 56) అంటూ వర్ణనలతో మొదలవుతాయి.

ఇవే కాక వైరాగ్యం, బడిపంతులు, విప్లవాంగన, అస్తిపంజరం నవ్వింది, తొలి బలి, సంక్రాంతి కోడె అనే కె. సభా కథలు; మర్రిచెట్టు, సర్కస్ డేరా, వ్యవస్థ, బ్రతుకు బాట, ఏకాకి మొదలైన రాజారాం గారి కథలు; మొగ్గ తొడిగిన మొరడు కొమ్మ, అబలలూ అనుమానాలు, బెడిసి కొట్టిన జాలి గుండె, మొదలైన కె.ఆర్. రెడ్డి కథలు; మనసులోని మల్లెలు, ప్రణయసేతువు, అన్యథాశరణం నాస్తి అనే వల్లంపాటి కథలు; గూడు చేరిన పిట్ట, లోకం నవ్వింది, గూడు కోసం గువ్వలు వంటి పులికంటి కృష్ణారెడ్డి కథలు;. అమృతుడు, ఎరుపు వంటి ఆర్.ఎస్. సుదర్శనం కథలు వర్ణనాత్మక ఎత్తుగడలతో మొదలవుతాయి.

పై మూడు రకాల ఎత్తుగడలతోనే కాకుండా మానసిక సంఘర్షణ చిత్రిస్తూ మొదలయ్యే కథలు, సామెతలతో లేదా సూక్తులతో మొదలయ్యే కథలు, సాదృశ్యాలతో మొదలయ్యే కథలు, ఉత్తరాలతో మొదలయ్యే కథలు చిత్తూరు జిల్లా కథా సాహిత్యంలో చూడవచ్చు.

6.2.3. కథాకథనం/దృష్టికోణం:

కథాకథనం లేదా దృష్టికోణం అనే విషయాన్ని గురించి చిత్తూరు జిల్లా నవలా సాహిత్యం – రూప (శిల్పం) వైవిధ్యం అనే ఉపశీర్షికలో ఇదివరకే చెప్పాను. అవన్నీ నవలకే కాదు కథానికకు కూడా వర్తిస్తాయి. అందుకని పునరుక్తి కారణంగా మళ్ళీ ఇక్కడ ప్రస్తావించట్లేదు. 1975 లోపు వచ్చిన చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యంలో భాగమైన కథా సాహిత్యంలో ప్రధానంగా రెండు రకాల కథల పద్ధతులు (దృష్టికోణం) కనిపిస్తాయి. అవి ఒకటి ప్రథమపురుష దృష్టికోణం (సర్వసాక్షి దృష్టికోణం). రెండు ఉత్తమపురుష దృష్టికోణం.

6.2.3.1. ప్రథమపురుష దృష్టికోణం (సర్వసాక్షి దృష్టికోణం):

కె. సభా రాసిన అంతరంగం, మిధునలగ్నం, పాతాళగం,గ ప్రజాసేవకుడు, కొత్త కథ, పుట్టగొడుగు, నెత్తురు సంబంధం, ఎండమావిల్లో తిమింగలాల వేట, ఎడారి పువ్వు, బంగారు, వేదాంతి, పురిటి నొప్పులు, కృతజ్ఞత; మధురాంతకం రాజారాం రాసిన అంగరక్షకుడు, అడ్డదారి,

అజ్ఞాతవాసం, అడిగిరాని వరాలు, ఇంకా బయట, ఏకాకి, కన్నేచెర, కాటుక కంటి నీరు, కార్టూన్, కూనలమ్మ కోన, మర్రిచెట్టు, విధివిలాసం, ప్రాప్తి, మాతృసప్తకం, ప్రాణదాత, కుంపట్లో కుసుమం, తాను వెలిగించిన దీపాలు, సబల, కమ్మ తెమ్మెర, మెత్తని పులి, ప్రియ బాంధవి, వ్రత భంగం, సంధ్యా సమస్యలు, బెరామీటరు వంటి కథలు; సి. వేణు రాసిన నవ్విన ధాన్యరాశి, గూడు చేరిన పిట్ట, తెలియని జవాబు, మారెమ్మ గుడి, లక్ష రూపాయలు వంటి కథలు; పులి కంటి కృష్ణారెడ్డి గూడు కోసం గువ్వలు, లోకం నవ్వింది, కర్త కర్మ క్రియ, పులిగుండు వంటి కథలు; ఆర్.ఎస్. సుదర్శనం రాసిన కాలం తెచ్చిన మార్పు, మొగిలి పువ్వు, అమృతుడు, నీరు పళ్ళ మెరుగు, పంకజం, ఎరుపు, కన్నుల వెలుగు, ఏకాంతం వంటి కథలు; కలువకొలను సదానంద రాసిన రక్త యజ్ఞం, వికృతవాణి, చత్రపతి, సంకల్ప శుద్ధి, ధర్మహాని, పైరుగాలి, సూత్రధారి, అప్పిచ్చువాడు, వింత రైలు, అన్నదాత, ఉన్నమాట, పిల్లనగ్రోవి, చక్రం, తాత దిగిపోయిన బండి, మాల మనిషి, పువ్వులు నలగని రాత్రి, బాలామణి, రామదాసు చెర, దేవి పూజ వంటి కథలు; కె.ఆర్. రెడ్డి రాసిన అబలలూ అనుమానాలు, మొగ్గ తొడిగిన మరుడు కొమ్మ, జ్ఞానోదయం, నిరపరాధులు, సైజువారీ అధికారాలు, కెరటాలు, రైలుబండి, మగతలో మమకారాలు వంటి కథలు; మధురాంతకం దొరసస్వామి రాసిన లచ్చి బతుకు; శ్రీనివాసపురం రామాచార్యులు రాసిన అనుకున్నట్టే అయ్యింది, అశ్రువర్ణం, పశ్చాత్తప్త చిత్తుడు, వంటి కథలు; కాశీనాథ విశ్వం రాసిన అత్తింటి కోడలు, తీరని అప్పు, త్రైలోక్యం వశ్యాకరం వంటి కథలు; వల్లంపాటి వెంకటసుబ్బయ్య రాసిన జాలరి బాల, వాన, అల్ప సంతోషులు, గాయపడిన దేవత, అన్యధాశరణం నాస్తి వంటి కథలు ప్రథమ పురుష కథనంలో రాయబడిన కథలు.

6.2.3.2. ఉత్తమపురుష దృష్టికోణం:

కె. సభా రాసిన అమూల్యం, పునర్జన్మ, మగ పురుగు వంటి కథలు; మధురాంతకం రాజారాం రాసిన మానవుడి విజయం, సర్కస్ దేరా, మిస్ మరీచిక, హోలీకులు కుశలమా, బతక నేర్చిన మనిషి, అప్పుల నరసయ్య, కళ్యాణ కింకిణి, అక్కయ్య అంతరంగం, ఎదురుగాలి, రేపటి ప్రపంచం, పొద్దుచాలని మనిషి, వెలుగు సముద్రంలో చీకటి దీవి, కోరిన కోనలో కురవని వాన, ఎక్కవలసిన రైలు, ట్రంప్ చీటీ, ఒకపేటికి చల్ల చిందినన్, వ్యవస్థ వంటి కథలు; పులి కంటి కృష్ణారెడ్డి రాసిన రైట్స్ ఆఫ్ అడ్మిషన్, మరపురాని మా ఊరు, అరికకూడు వంటి కథలు; ఆర్.ఎస్. సుదర్శనం రాసిన ఆత్మజ్ఞానం వంటి కథలు; కలువకొలను సదానంద రాసిన ఆదర్శం, బేతాళ కథ, ఇస్ ఝుండేకే నీచే, నవ్వే పెదాలు ఏడ్చే కళ్ళు వంటి కథలు; కె.ఆర్. రెడ్డి రాసిన బెడిసి కొట్టిన జాలిగుండె, అంతరాత్మలో ఆమె వంటి కథలు; వల్లంపాటి వెంకటసుబ్బయ్య రాసిన తెచ్చుకున్న ముప్పు, మనసులోని మల్లెలు, విద్యాబింబం వంటి కథలు ఉత్తమ పురుష కథనంలో నడిచినవి.

6.2.4. పాత్ర చిత్రణ:

పాత్ర చిత్రణ అంటే ఏమిటి? అది రచనకు ఎంత వరకు అవసరం. పాత్రలు ఎన్ని రకాలుగా ఉంటాయి అనే విషయాన్ని చిత్తూరు జిల్లా నవలా శిల్ప వైవిధ్యం చెప్పే క్రమంలో

పరిచయం చేశాను. ఆ విషయాలన్నీ కథానిక పాత్రచిత్రణకు కూడా వర్తిస్తాయి. 1975 లోపు వచ్చిన చిత్తూరు జిల్లా కథా సాహిత్యాన్ని చూస్తే మూడు వందల కథల వరకు వచ్చాయి. ఈ కథలలోని పాత్రలన్నింటినీ ఇక్కడ పరిచయం చేసి, ఆయా కథల్లో రచయితలు చూపిన పాత్రచిత్రణా వైవిధ్యాన్ని సంపూర్ణంగా తెలియజేయడం కష్టసాధ్యమైన పని. అందుకని స్థూలంగా వివరించేపని చేశాను.

1951కి ముందు వచ్చిన చిత్తూరు జిల్లా కథాసాహిత్యాన్ని గమనిస్తే విభిన్న మనస్తత్వాలు గల పాత్రను చూడవచ్చు.

పూర్వాచార పరాయణత్వానికి, సంప్రదాయాలకు, మూఢనమ్మకాలకు ప్రతినిధులు లాంటి కృష్ణారావు (శారద) లాంటి పాత్రలను; మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా సమాజాన్ని ముందుకు తీసుకుపోయే భావాలు కలిగిన వారికి ప్రతినిధిగా ప్రసాదరావు(శారద) లాంటి పాత్రలను; తన పెళ్లి కోసం (వరుడుకి ఇవ్వవలసిన డబ్బు కోసం) తల్లిదండ్రులు పడుతున్న బాధలను చూడలేక వారికి మనశ్శాంతిని కలిగించాలని ఆత్మహత్య చేసుకునే అబలలు (హైమావతి); పెళ్లిలో తప్పనిసరిగా భోగపుమేళాలు కావాలని పట్టుబట్టి పెట్టించుకునే సోమసుందరుడి లాంటి వారు, (భోగపుమేళములు) అలాంటి వ్యసనాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకున్న జగన్నాథం (భోగపుమేళములు) లాంటి పాత్రలు; తల్లిదండ్రుల మాటలు విని ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకోలేక మానసికంగా కృశించి వ్యసనాలకు లోనై చివరికి చనిపోయిన నారాయణ (సావిత్రి) లాంటి పాత్రలు; దేశ స్వతంత్ర పోరాటంలో పాలుపంచుకుని ఇతరత్రా వారి జీవిత సుఖాలకు దూరమయ్యే దేశభక్తి గల రామూ (సమాధి), సుమతి (విప్లవంగన) లాంటి వారు; భూస్వాముల చేతుల్లో, సాహూకారుల చేతుల్లో బలైపోయే ఎంకన్న, సుబ్బి (కడగండ్లు), కాంతమ్మ (తొలి బలి) లాంటి పేదలు; మతం ముసుగులో స్త్రీల పట్ల అసభ్యంగా ప్రవర్తించే ఫాదరీలు (పాపి చావు); సంవత్సరం పొడుగునా కష్టపడి పోగేసుకున్న చిన్న రైతు డబ్బును కాజేయాలని చూసే దొంగబుద్ధి గల సామయ్య(వెయ్యి రూపాయలు) లాంటి వారు; సారా కాంట్రాక్టర్ల చేతుల్లో బలైపోయి, కుటుంబం చిన్నాభిన్నమై, కొడుకు పట్టించుకోక దారుణమైన పరిస్థితులను చూసే దళిత స్త్రీ (కల్లుముంత) ఇలా ఎందరో 1950 కి ముందు కథల్లో కనిపిస్తారు.

అలాగే 1950 నుండి 1975 వరకు చిత్తూరు జిల్లా కథలో మూఢనమ్మకాలను, శకున పక్షులను నమ్మే శ్యామారావు (పునర్జన్మ) లాంటి పాత్రలు, తుమ్ములు, పిల్లులు, విధవలు ఎదురవడం వల్ల తన జీవితం నాశనం అయిపోతుందని నమ్మే శాంతిసాగర్ (వికృత వాణి) లాంటి పాత్రలు; సామాజిక రుగ్మతులైన ధూమపానం, జూదం, మద్యం, వంటి వ్యసనాలకు లోనైన ఆనందరావు (ఏకాంతం), ప్రేమానందం (ధర్మహాని), సింహాద్రి (చక్రం) వంటి పాత్రలు; దాంపత్య జీవితంలోని సుఖసంతోషాలను అనుభవించే సుధాకర్, శశిరేఖ (వర్ష రాత్రి) లాంటి పాత్రలు; దాంపత్య జీవితంలో కొత్తగా వచ్చిన ఇల్లాలు ఎలా ఉండకూడదో తెలియజేసే లీలావతి

(సర్వీసు రిజిస్టరు) లాంటి పాత్రలు; రాబోయే జీవిత భాగస్వామి పట్ల ఊహల్లో ఏర్పరచుకున్న ఊహలు ఎక్కడ నెరవేరవేమోనని వచ్చిన భాగస్వామిని ఆదరించకుండా తన చావుకు కారణం అయిన రమేష్(పశ్చాత్తప్త చిత్తుడు) లాంటి పాత్రలు; తన బిడ్డను దత్తత ఇచ్చేసి తద్వారా వచ్చే ధనానికి ఆశపడే అవధాని(అనుబంధాలు) వంటి పాత్రలు; దత్తత ఇచ్చిన బిడ్డను వదలలేక తల్లి ఆవేదనను పట్టి చూపించే అనసూయమ్మ(అనుబంధాలు) లాంటి పాత్రలు; దత్తత తీసుకున్న బిడ్డకు మసూచి వస్తే ఆ బిడ్డను చేరదీయలేని దత్త తల్లి(అనుబంధాలు) వంటి పాత్రలు; తన బిడ్డ కోసం మురుగు కాలువలో పడిన ఇతరులు బంతిని దాచిపెట్టిన తల్లి, ఆ ఇతరుల తిట్లు తన బిడ్డకు ఎక్కడ తగులుతాయో అని బంతిని తిరిగి ఇచ్చే అమాయకపు పేద తల్లి(సూత్రధారి); ఉన్నత చదువుల కోసం పట్నం వెళ్ళిన యువతీ యువకులు తమ తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను మరిచిపోయే కృతజ్ఞత లేని పిల్లలు, అటువంటి పిల్లల కోసం కన్న ప్రేమను చంపుకోలేని తల్లిదండ్రులు (అనామకుడు, మమకారం, వగపేటికి చల్లచిందినన్, వికారాలు మమకారాలు, సుడిగుండం); ప్రయోజకులైన పిల్లలు వద్దంటున్నా ఒంట్లో సత్తువ ఉన్నంతవరకు పనిచేయాలనే మనస్తత్వంగల రంగయ్య (రంగయ్య స్వర్గం) వంటి పాత్రలు; తల్లీదండ్రీ చనిపోయిన మనుమడికి అన్నీ తానే అయి పెంచి పెద్దచేసిన అవ్వ, చివరికి ఆ మనవడి చేతే పనిమనిషిగా పరిచయం కాబడే కామాక్షమ్మ(ఏకాకి) లాంటి పాత్రలు; ఉంచుకున్న దానికి పుట్టిన కొడుకుని సొంత కొడుకుగా చెప్పుకోలేక చేసిన తప్పును నలుగురికీ చెప్పుకోలేక బాధపడే పరమేశ్వరయ్య(పుట్టగొడుగులు) లాంటి పాత్రలు; సొంత తమ్ముడికి లేదా తండ్రి చేసిన నిర్వాకానికి పుట్టుకొచ్చిన తమ్ముడికి ఆస్తిలో వాటా ఇవ్వలేని సాంబశివం (పుట్టగొడుగు), బలరామయ్య (మెత్తనిపులి) వంటి అన్నలు; ఏమీ లేనప్పుడు బంధువులను చూసే విధానానికి ఉద్యోగం, గౌరవం, ప్రతిష్టలు వచ్చాక వారిని చూసే విధానానికి గల తేడాలను చూపించే పాత్రలు (పరిస్థితులు పరిణామాలు); ఆడబిడ్డలను ఏనాటికో ఒకనాటికి ఒకరి చేతిలో పెట్టాలి కదా అన్న కారణంగా మగబిడ్డే కావాలని ఆశించే తల్లిదండ్రులు, అటువంటి తల్లిదండ్రులకు చివరి దశలో అంత అన్నం కూడా పెట్టని కొడుకులు (మగపురుగు); కట్న కానుకలను తీసుకునే వారిని ఎద్దేవా చేసి మాట్లాడే చుక్క, నల్లగుండు (మూగభావాలు) లాంటి జంతు పాత్రలు; కట్నం తీసుకోవడానికి అన్ని అర్హతలూ ఉన్నా, నలుగురికీ ఆదర్శంగా నిలవాలని కట్నం లేని పెళ్లిళ్లు చేసుకోవడానికి సిద్ధపడే ఆదర్శ భావాలు ఉన్న సూర్యనారాయణ సుధాకర్ (సంధ్యా సమస్యలు) లాంటి పాత్రలు; ఆడబిడ్డలను కనడమే ఒక నేరంగా భావించి (ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా) వారికి పెళ్లిళ్లు చేయడానికి నానా అవస్థలు పడే వెంకట్రావు (కన్నెచెర), నీలకంఠం (సంధ్యా సమస్యలు) వంటి పాత్రలు; విధిలేక వేశాగృహంలో పడి బాధలు అనుభవించే పంకజం (పంకజం) లాంటి పాత్రలు; ఏపూటకాపుట ఒళ్ళు అమ్ముకొని బ్రతికే నాగరత్నం(పువ్వులు నలగని రాత్రి) లాంటి వేశ్యలు; భార్య ఊరెళితే ఆ సమయంలో చెడు పనులు చేయడానికి వేశ్యాగృహాల వైపు పారజూసే బుచ్చిబాబు (పువ్వులు నలగని రాత్రి) లాంటి పాత్రలు; నమ్మినవారికి తన సర్వస్వాన్ని అర్పించి చివరకు ఉంపుడుగత్తెగా ముద్ర వేయించుకున్న

నాగరత్నం (కూనలమ్మ కోన) లాంటి అమాయకపు ఆడవాళ్లు; తెలిసో తెలీకో చేసిన తప్పుకు శిక్షగా సంఘం చేత, పరిస్థితుల చేత పరాభవించబడి జీవితాన్ని, యవనాన్ని కాటికి కాలు చాచుకున్న ముసలివాడికి ధారపోసిన లచ్చి (లచ్చి బ్రతుకు) లాంటి పాత్రలు; కులమతాల పట్టింపు వల్ల, డబ్బు అహంకారం వల్ల ప్రేమ వివాహాలకు అడ్డుపడే వెంకటాద్రి (ప్రియభాందవి), ధర్మారెడ్డి (మారెమ్మ గుడి) వంటి పాత్రలు; చాలీచాలని జీతాలతో శ్రమకు తగ్గ వేతనం లభించక, ఆ లభించే జీతం కూడా సకాలంలో అందక కుటుంబాన్ని పోషించడానికి నానా అవస్థలు పడే బడిపంతుళ్ళు బ్రహ్మయ్య (బడిపంతులు), రామయ్య (బ్రతుకు బరువు) సుందరాచారి (బాలామణి) వంటి పాత్రలు; గౌరవనీయమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ వృత్తి పట్ల గౌరవం లేని శ్రీనివాసయ్య, నరసింహయ్య (అల్పసంతోషులు), రాఘవయ్య (సమర్థుడు) వంటి పాత్రలు; శిష్యుల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోవడం కంటే ఉపాధ్యాయులకు కావాల్సిందేముందని తృప్తిపడే రిటైర్డ్ టీచర్ కృష్ణశర్మ(తాను వెలిగించిన దీపాలు) వంటి పాత్రలు; కవిగా రచయితగా ఎంతో పేరు ప్రఖ్యాతలు ఉన్నప్పటికీ ఒక్క పూట తిండికి గడవని ప్రభాకరం (ఎడారి పువ్వు) లాంటి పాత్రలు; కొత్తగా రచనలు చేస్తున్న రచయితలకు కథావస్తువుని ఎన్నుకోవడంలో మెలకువలను తెలిపే తుకారాం (కథా వస్తువు) లాంటి పాత్రలు; వ్యాపార దృష్టితో కీర్తి కోసం సాహిత్య విలువలు లేని అశ్లీల సాహిత్యాన్ని రాసే చలపతి(కామదహనం) వంటి పాత్రలు; ఇటువంటి వారికి మార్గ నిర్దేశం చేసే వ్యాసమూర్తి (ధర్మగ్లాని) వంటి పాత్రలు ఇక్కడి కథా సాహిత్యంలో చూడవచ్చు

అలాగే కరువు పరిస్థితులు మనిషి ఆర్థిక పరిస్థితులను దెబ్బతీస్తుంటే అటువంటి తరుణంలో చూసుకోవాల్సిన కొడుకులు కనీసం దగ్గరైనా లేరని ఆవేదం వ్యక్తంచేసే వీరయ్య(ఇక్కడ మేమంతా క్షామం) లాంటి పాత్రలు; కరువు కాలంలో కుటుంబాన్ని పోషించడం కోసం తన ప్రాణాలను కూడా లెక్క చేయని పేద రైతు(అంతరంగం); డబ్బు, పలుకుబడి, ఆస్తి ఉన్నా అధికారం పదవులు కావాలని తాపత్రయపడే కామందుల (కామందుల వారు) వారి పాత్రలు చిత్తూరు జిల్లా కథల్లో కనిపిస్తారు.

అలాగే జీవితాంతం బంగారు గనుల్లో పనిచేసినా చివరికి తను ఇష్టపడ్డ రవ్వంత ఎర్రరాళ్ల కమ్మలను చేయించుకోలేని బంగారు(బంగారు) లాంటి పాత్రలు; అప్పు తీసుకుని తీర్చలేక ఇబ్బందులు అవమానాల పాలు కావడం కంటే అప్పు తీసుకోకుండా ఆత్మాభిమానాన్ని నిలుపుకోవడం మేలని భావించే సన్యాసిరావు లాంటి పాత్రలు; వారం వారం చేసిన అప్పులకు వడ్డీ కట్టడానికి, పిల్లల చదువులకు, పుస్తకాలకు డబ్బు లేక బాధపడే రంగయ్య (వాన) వంటి పాత్రలు; వ్యవసాయం చేసుకోవడానికి కొంత నీటి వసతిని ఏర్పాటు చేసుకోవాలని బావిని తవ్వించే క్రమంలో తన సర్వస్వాన్ని, భార్యను, చివరికి తన ప్రాణాలను కూడా కోల్పోయిన పేద రైతు బేటప్ప (పాతాళగంగ) లాంటి పాత్రలు; భర్తకు తన చెల్లెలికి మధ్య ఏదో సంబంధం ఉందని అపోహపడి మానసిక వేదనకు గురై ఆరోగ్యాన్ని పాడు చేసుకునే శ్యామల(అబలలూ అనుమానాలు) వంటి

పాత్రలు; మానసిక వైకల్యం కలిగిన ఆడవాళ్లను మాయమాటలు చెప్పి గర్భవతిని చేసే దుర్మార్గులు, అటువంటి మతిస్థిమితం లేని ఆడపిల్లలు అందరి చేత ఛీ కొట్టబడి చివరికి తల్లి చేత కూడా ఛీ కొట్టబడే అమాయకపు సీత (మొగ్గ తొడిగిన మరుడు కొమ్మ) లాంటి పాత్రలు; భర్త చనిపోయిన తర్వాత కుటుంబానికి ఆసరాగా నిలిచిన దూరపు బంధువు కూతురితో తన కొడుక్కు పెళ్లి నిశ్చయమైనా, కట్నం కోసం ఆశపడి కొడుకు జీవితాన్ని, తన పెద్దరికాన్ని పాడు చేసుకున్న జానకమ్మ (నిరపరాధులు) లాంటి పాత్రలు ఇలా ఎందరో ఎందరెందరో చిత్తూరు జిల్లా కథాసాహిత్యంలో సాక్షాత్కరిస్తారు.

6.2.5. వర్ణనలు:

ప్రాచీన సాహిత్యంలో కనపడే సుదీర్ఘ వర్ణనలలాగా కథానికలో వర్ణనలు ఉండవు. కారణం సంక్షిప్తత కథానికకు ప్రధాన లక్షణం కనుక. అయితే కథానికా ప్రక్రియలో కథను ముందుకు నడిపించడం కోసం లేదా కథను వేగవంతంగా నడపడం కోసం రచయిత అక్కడక్కడా వర్ణనలనేటివి చేస్తూ ఉంటాడు. "ఉద్దిష్ట విషయాన్ని కాని, వ్యక్తుల ఆకారవికారాలనుకాని, మానసిక స్థితినికాని, జరిగే సంఘటననుకాని, ఏర్పడే సన్నివేశాన్నికాని, కనబడే దృశ్యాన్నికాని, ఇంద్రియగోచరమయ్యే విధంగా చిత్రించడం వర్ణన (description)". (కథానిక స్వరూప స్వభావాలు1988: 376,377). కథలో ప్రకృతి వర్ణనలు, సన్నివేశాల వర్ణనలు, పాత్రల వర్ణనలు, వాతావరణ వర్ణనలు చూడవచ్చు. ఈ వర్ణనలు చిత్తూరు జిల్లా కథా సాహిత్యంలో ఏ విధంగా కటుచేసుకున్నాయో కింది ఉదాహరణలను చూస్తే తెలుస్తుంది.

కె. సభా పురిటినొప్పులు కథలో సూర్యోదయ వాతావరణాన్ని *"బారెడు పొద్దెక్కింది. అంతవరకు మంచి దుప్పట్లను ముసుగు దాన్ని పడుకున్నట్లు కనిపించిన కొండల వరుసలు పైకి లేచి ఆవలిస్తున్నట్లుగా ఆ శిఖరాలపై పొగ మంచుల వలయాలు మేఘాలలో కలిసిపోతున్నాయి"* (బంగారు, 1963: 49) అంటూ వర్ణిస్తాడు.

అలాగే కె. సభా అస్తిపంజరం నవ్వింది కథలో *"ఆ మహాపట్నంలో సువిశాల పురవీధుల్లో, అనంతాకాశంలోని స్వాతంత్ర్య జ్యోతిర్మయలతికలతోరణాల వెండి వెలుగుల్లో విజయ పవన వీచీతరంగ డోలికల కదలికలో శృంగార ప్రపూర్ణ సౌందర్య సమ్మిళిత పసిడి కాంతులను చిమ్ముతూ, మంగళాన్వితమైన జేగీయ మానంగా ఎగురుతున్నది నవపతా"* (కథాంజలి 1947. 11.1: 49) అంటూ జాతీయ పతాకాన్ని వర్ణిస్తాడు.

మధురాంతకం రాజారాం ఏకాకి కథలో వెన్నెలను ఈ విధంగా వర్ణిస్తాడు *"దూరాన కొండలపై నుంచీ, ఊరి చుట్టూ టెంకాయ తోటలపై నుంచీ, కోనేటి కెరటాలపై నుంచీ మందమారుతం చల్లగా వీస్తూ ఏడు కొండలెక్కి అలసిపోయిన యాత్రికులకు హాయి కలుగజేస్తుంది. బంగారు కోనేటి మధ్య నాలుగు కాళ్ల మండపంలోనూ, కోనేటి కట్టువైపున రావి చెట్టు రెమ్మల్లోనూ, ఇటు దేవాలయ గోపురంలోనూ విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి.*

పాలారబోసినట్టు నింగి నుండి నేలకు వ్యాపించిన వెన్నెల, విద్యుద్దీపాల వెలుగు ముందు తెల్లబోతోంది" (కళ్యాణ కింకిణి1968: 104).

మర్రిచెట్టు గురించి మధురాంతకం రాజారాం *"హేమంతంలో మంచు నీటి తానమాడి, శిశిరంలో ప్రాబీరవూడ్చివేసి, వసంతంలో కొత్తచీర కైనేసి, గ్రీష్మంలో మాతృమూర్తుల మార్గాయాసంలో డస్సిన ప్రాంథుమలను తన ఒడిలోకి తీసుకునే స్వేదం తుడిచి సేదతీర్చే చల్లగా అతిథ్యాన్ని నెరపే మర్రిచెట్టు!"* (వర్షించినమేఘం, 1961:47) అంటూ వర్ణిస్తాడు.

కె. సభా సంక్రాంతి కోడె కథలో ఎద్దుని వర్ణిస్తూ *"మైలవన్నతో మెరుగులేని భైరవుని సాక్షాత్ వృషభేశ్వరునిలాగా అలంకరించాడు చెంగయ్య. ఉదారంగు తోలు పట్టెడకు పుట్టిన వెండి మువ్వలు గలగలమని నవ్వుతున్నాయి. కొమ్ములకు వేసిన బంగారుపూతలకుప్పెలకొనల్లో వంకాయ గజ్జలు నృత్యంచేస్తున్నాయి. మెడలో పచ్చార్లు పూలసరాల్లా వేలాడుతుంటే భైరవుడు ప్రయాణమయ్యాడు"* (ఆంధ్ర మహిళ 1955 08.01: 66).

కరువు గురించి కె. సభా అంతరంగం కథలో వర్ణిస్తూ ఈ విధంగా అంటాడు. *"ఉన్నట్టుండి కాకుండా మెల్ల మెల్ల గానే ప్రవేశించింది కరువు రక్కసి. అది ఈ మారు చాల భయంక రాకృతినిదాల్చింది. నేల మీద తేమంతా పీల్చివేసింది. జలాశయాలలోని నీటినంతా త్రాగివేసింది. పచ్చని వృక్షాలను అంతా చప్పరించి పిప్పి పిప్పిగా ఉమ్మి వేసింది. అడవులలోబడి సంపదనంతా స్వాహా చేసింది. చివరికి పశుగణాలను భావించింది. అవి ఎముకల ప్రోవులైనా వాటి సెల్యాలను చూర్ణం చేసి వదిలిపెట్టింది"* (పాతాళగంగ,1969: 10).

పాత్రను వర్ణించే క్రమంలో కె. సభా *"డిటెక్టివ్ నల్లక్క నిరాడంబర మనిషి, అతి నిరాడంబరమైన స్త్రీ. ఆమె కాళహస్తి నేత చీర కట్టుకున్నది. కార్వేటినగరం రవికతొడుక్కున్నది. కానీ వెడల్పు కుంకుమ పెట్టింది. కొండంత కొప్పు పెట్టింది. ఆ కొప్పులో చేరెడు చేమంతి పూలు ముడుచుకొన్నది"* (పాతాళగంగ,1969: 37)

బక్క పల్చని ఆకారాన్ని కలిగి ఉన్న ఆకారాన్ని పులికంటి కృష్ణారెడ్డి గూడుకోసం గువ్వలు కథలో *"బలపరాతి విగ్రహం లాంటి రూపు...ఎప్పుడూ ఏదో వెదుకులాడే చూపు...అనుభవంతో పండిన శిరోభారాన్ని నుదుటిని వేరు చేస్తూ దట్టంగా మూడు విభూది పట్టెలు...వాటి మధ్య పెద్ద కుంకుమ బొట్టూ...మెడలో రుద్రాక్ష మాలలు...బూడిద గుమ్మడికాయ అంత తలగుడ్డ...చంపాలనందుకు చేరదేసి కన్నులు గాదు – గుబురు మీసాలు – గుర్రప్ప తాతను చూస్తే ఏదో గురుదరమైన భావం కలిగి మంత్రం ముద్దులై ఎదుట నిలబడి పోవాల్సిందే!"* (పులికంటి కథావాహిని, 2003: 2) అంటూ వర్ణిస్తాడు.

నదికన్యకు, సాగరునికి గల సంబంధాన్ని వర్ణిస్తూ వల్లంపాటి వెంకటసుబ్బయ్య ప్రణయ సేతువు కథలో ఈ విధంగా వర్ణిస్తాడు. *"సాగర సాగరగామినుల ప్రేమ ఈనాటిది కాదు. ఏనాటిదో ఎవరికీ తెలియదు. ఈ లోకాన జీవరాశి ఊపిరి తీసుకునేందుకు ముందే నదికన్య కడలిరాజు కౌగిలిలో స్వర్గాన్ని చూసింది. కొమ్మల మీద కోయిల. ఆషాఢ జలదచ్ఛాయలలో నెమలి*

మొదటిసారిగా పులకరించిపోక ముందే సాగరుని హోరు విని నిలువెల్ల పులకలై, మనసెల్ల మమతలై కనులెల్ల కాంక్షలై పరవశించిపోయింది. ఏదో పర్వత శిఖరాగ్రాహన ఊటగా తనువెత్తిన తాను, మిన్నేటి తేటలా తోటలలో, వనాలలో సాగుతూ వేగాన్ని, ఆ వేగాన్ని పెంచుకొని తూగుతూ వెళ్లి సాగరునిలో ఐక్యమయ్యే వరకు ఆగేది కాదు నదికన్య!" (వల్లంపాటి కథలు, 2009: 85).

వర్షం పడ్డ తర్వాత చెట్లమీద ఉన్న నీటి బిందువుల్లో సూర్య కాంతి ఏవిధంగా ఉందో వర్ణిస్తూ వల్లంపాటి ఇలా వర్ణిస్తాడు. *"భారత స్త్రీ లలాటంలో మెరిసే కుంకుమలా అరుణారుణ మయిన సాంధ్యశ్రీ ఫాల భాగంలో సూర్యుడు భాషిస్తున్నాడు. అప్పుడే వచ్చి వెలసిన వానవల్ల చెట్ల ఆకుల మీద నీటి బిందువు లలాగే వున్నాయి. వాటి ద్వారా ప్రకాశించే సూర్యకిరణాలు వర్ణ విశ్లేషణం పొందుతున్నాయి"* (వల్లంపాటి కథలు, 2009: 141).

"పండుటాకు సవ్వడి చేయకుండా రాలి క్రిందపడింది. ఓదార్చటాని కన్నట్లు చిటారు కొమ్మను చివురుటాకు ఉదయాతపంలో మిలమిల లాడింది మనిషిలాంటి రావిచెట్టు. ఒక్కో ఆశ రాలిపోతూంటే క్రొత్త ఆశకు మోసులు వేలార్చే చిన్న ఓదార్పుచాలు... మనిషి విరిగిపోతూనే ఉంటాడు. బ్రతుకు సాగుతూనే ఉంటుంది. అలా పెరిగి పెరిగే పెద్దదై పచ్చని ఆకుల గుబురులతో నిండుగా నిలబడి వుంది రావిచెట్టు" (నవ్వే పెదవులు ఏడ్చేకళ్ళు, 1975: 25). అంటూ ఆకులు రాలిపోతున్న చెట్టుకి మనిషిలోని ఆశలకు మధ్య ఒక సమన్వయాన్ని చేస్తూ కలువకొలను సదానంద ఇలా వర్ణిస్తాడు.

కలువకొలను సదానంద నెమలికోన అనే చిన్న పల్లెను దాని అందాల్ని ఇలా వర్ణిస్తాడు. *"నెమలికోన! కొండకోనల పరదాల్లో, గుబురుతడవుల కౌగిట్లో – కొత్త పెండ్లి కూతురివలె ఒదిగి కూర్చున్న చిన్నపల్లె! అక్కడి పచ్చిక చేలల్ని, పచ్చని చెట్లను చూస్తే పురివిప్పిన నెమలి జ్ఞాపకానికొస్తాయి"* (నవ్వే పెదవులు ఏడ్చేకళ్ళు, 1975: 25).

"సూర్యాస్తమయ సమయంలో గుడి గోపురాన్ని గుడి వాతావరణాన్ని కె.ఆర్. రెడ్డి ఇలా వర్ణిస్తాడు. సూర్యుడు ఆలయం వెనకాల అరుణారుణంగా వికసించిన ఎర్రగన్నేర్లలో అస్తమిస్తున్నాడు. గోపురంమీద కంచుశిఖరం పసిడికిరణాలకు దేదీప్యమానంగా మెరుస్తున్నది. గుడిగంటలు అవిరామంగా మ్రోగుతున్నాయి. వృద్ధ పూజారి గోవిందయ్య శ్రావ్యంగా శ్లోకాలు పఠిస్తూ కర్పూరం వెలిగించాడు చెన్నకేశవరెడ్డి ముందు. గర్భగుడిలో ధూపధూమము తెలిమబ్బుల్లా సుళ్ళు తిరిగి మిణుకుమిణుకుమని వెలుగుతున్న జ్యోతులను నక్షత్రాల్లా అవలింపజేస్తున్నది" (అబలలూ– అనుమానాలు, 1967: 5).

సముద్ర అలలు ఎలా ఉన్నాయో వర్ణిస్తూ *"సాయంకాలం – సముద్రతీరం. హోరుగాలి ఉవ్వెత్తున వేస్తోంది. ఉత్తుంగ తరంగాలు పెనుగొండలుగా గట్టుమీద దాడి తీస్తున్నాయి. అవి నవానలభైవేలు సవాలుచేసినాగానీ బెదరకుండా ఎదురిస్తూంది తీరభూమి. హతాశతో నిర్వీర్యాలై వెనుదిరిగిపోతూన్న కెరటాల మూలంగా శత్రువును భేదించే మర్మ మేదో తెలిసికొన్నలాగా మరీ ఉధృతంగా మీద దూకుతున్నాయి కొత్త కొత్త తరంగాలు. ఆ సంకుల సమరంలో కూలిపోతున్న*

కెరటాల కుటుంబాల్లో కోటిగొంతుకలు బావురుమన్నట్లుంది అక్కడి సముద్రఘోష" (అబలలూ అనుమానాలు, 1967: 56). అని కె.ఆర్. రెడ్డి వర్ణిస్తాడు.

6.2.6. భాష:

నవలకు భాష, శైలులు ఎంత ముఖ్యమో కథానికకు కూడా అంతే ముఖ్యం. సాహిత్య లోకంలో రచయిత యొక్క ప్రత్యేకతను ఈ రెండే నిర్ణయిస్తాయి. ఇటువంటి భాషా ప్రాముఖ్యత గురించి ఇదివరకే చెప్పాను. పునరుక్తి కారణంగా ఇక్కడ చెప్పట్లేదు. చిత్తూరు జిల్లా కథా సాహిత్యంలో సామెతలు, మాండలిక పదాలు, జాతీయాలు, ధ్వన్యనుకరణ పదాలు, జంటపదాలు, ఇతరభాషా పదాలు ఇలా ఎన్నో ఉన్నాయి. వాటిలో కొన్ని ఉదాహరణకు మాత్రం ప్రస్తావిస్తున్నాను.

6.2.6.1. సామెతలు:

1. గంతకు తగిన బొంత (మధురంతకం రాజారాం కథలు ఐదవ సంపటం, 2008: 50)
2. రాతుండి తగులుకొంటినమ్మా ఈ రోత మొగుణ్ణి (నవ్వే పెదవులు ఏడ్చేకళ్ళు, 1975: 123 124)
3. ఆడలేనమ్మ మద్దెలకు తాళం వేసినట్లు (నవ్వే పెదవులు ఏడ్చేకళ్ళు, 1975: 137)
4. చిక్కి బిక్కరించడం కంటే పారిపోయి వెక్కిరించడం మంచిది (కూసలమ్మ కోన, 1995: 94)
5. గోటితో తీరేపనికి గొడ్డలి పట్టుక రమ్మంటుంది (అబలలూ – అనుమానాలు, 1967: 31)
6. ఉట్టికి ఎక్కలేని అమ్మ స్వర్గానికి నిచ్చెన వేసినట్లు (అబలలూ – అనుమానాలు, 1967: 39)
7. కత్తి వాటుకు నెత్తురు చుక్క లేకుండా అయిపోయింది (అబలలూ – అనుమానాలు, 1967: 41)
8. చల్లకు వచ్చి ముంత దాచుకుంటామా (కమ్మ తెమ్మెర, 1968: 40)
9. తల్లి పుట్టినిల్లు మేనమామకు తెలియదా (కళ్యాణ కింకిణి, 1968: 88)
10. ఎద్దు పుండు కాకికి నొప్పా (కళ్యాణ కింకిణి, 1968: 167)
11. దీపమున్నప్పుడే యిల్లు దిద్దుకోవడం మంచిది (వర్షించిన మేఘం, 1961: 28)
12. ముల్లు వచ్చి అరిటాకు పైన పడినా, అరిటాకు ఎగిరి ముల్లు మీద పడినా చిరిగేది అరిటాకే (తాను వెలిగించిన దీపాలు, 1968: 159)
13. బతికుంటే బలసాకు తిని బతకచ్చు (పులికంటి కథావాహిని, 2003: 7)
14. వెతకబోయిన తీగ కాలికే తగిలింది (వల్లంపాటి కథలు, 2009: 105)
15. కతికితే అతకదట వల్లంపాటి (వల్లంపాటి కథలు, 2009: 131)
16. చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్నట్లు (వల్లంపాటి కథలు, 2009: 144)
17. ఏడ్చి ముఖం కడుక్కున్నట్లు (వల్లంపాటి కథలు, 2009: 248)

18. కోటి విద్యలు కొండ్రకులోకువ (రక్తయజ్ఞం. పుట: 103, 104)

29. పెద్దవారి మాట చద్ది మూట (రక్తయజ్ఞం. పుట: 63)

20. మనిషికి ఒక మాట గొడ్డుకు ఒక దెబ్బ (నవ్వే పెదవులు ఏడ్చేకళ్ళు, 1975: 45)

21. ఇంటగెలిచి రచ్చ గెలువు (అర్జున విషాద యోగం. ఆంధ్రసచిర వార పత్రిక. 1964.9.11: 61)

6.2.6.2. మాండలిక పదాలు:

మడక (పాతాళగంగ, 1969: 79)

కట్టా కుడువా (పాతాళగంగ, 1969: 79)

తట్టెడు (పాతాళగంగ, 1969: 82)

చక్కా(పాతాళగంగ, 1969: 22)

గమనానికి (పాతాళగంగ, 1969: 28)

అత్తిరసాల హండా (పాతాళగంగ, 1969: 28)

గోనే (పాతాళగంగ, 1969: 69)

కూటినీళ్లు (పాతాళగంగ, 1969: 69)

నిరుడు (పాతాళగంగ, 1969: 122)

ఎన్నిద్రలు (సంక్రాంతి కోడె ఆంధ్ర మహిళ. 1955. 8.1: 66)

బుడుంగున (కళ్యాణ కింకిణి, 1968: 56)

గిన్నె (కళ్యాణ కింకిణి, 1968: 59)

వసారా (కళ్యాణ కింకిణి, 1968: 62)

కబిల (కళ్యాణ కింకిణి, 1968: 65)

పొరపొచ్చాలు (కళ్యాణ కింకిణి, 1968: 88)

బాట (కళ్యాణ కింకిణి, 1968: 92)

అయిపులేకుండా (కళ్యాణ కింకిణి, 1968: 93)

ఆరడీ (కళ్యాణ కింకిణి, 1968: 127)

కూసానికి (కళ్యాణ కింకిణి, 1968: 128)

పచ్చిక జొంపాలు (కళ్యాణ కింకిణి, 1968: 162)

కందెన (కళ్యాణ కింకిణి, 1968: 173)

మునిమాపువేళ (కళ్యాణ కింకిణి, 1968: 191)

గుబురు (కళ్యాణ కింకిణి, 1968: 91)

గాడి (కమ్మ తెమ్మెర, 1968: 139)

కసువు (కమ్మ తెమ్మెర, 1968: 139)

ముసారా (కమ్మ తెమ్మెర, 1968: 139)

తెపలు తెపలు(కమ్మ తెమ్మెర, 1968: 139)
కొట్టం (కమ్మ తెమ్మెర, 1968: 140)
బిళ్ళు (వర్షించిన మేఘం, 1961: 46)
బోద దుబ్బులు (వర్షించిన మేఘం, 1961: 46)
రేణు గంపలు (వర్షించిన మేఘం, 1961: 46)
చిట్టీత చెట్లు (వర్షించిన మేఘం, 1961: 46)
చావడి (వర్షించిన మేఘం, 1961: 89)
రంపు (వర్షించిన మేఘం, 1961: 106)
గుయ్యారంలా (ప్రాణదాత, 1962: 13)
ఓపినంత (తాను వెలిగించిన దీపాలు, 1968: 1)
నొగ (తాను వెలిగించిన దీపాలు, 1968: 150)
కొంప (పునర్నవం, 1968: 41)
తుండు గుడ్డ (పులికంటి కథావాహిని, 2003: 3)
లుంగీ (పులికంటి కథావాహిని, 2003: 3)
చిగర చెట్టు (పులికంటి కథావాహిని, 2003: 4)
కలమాగి (పులికంటి కథావాహిని, 2003: 4)
పోరకపుల్ల (పులికంటి కథావాహిని, 2003: 5)
సందేల (పులికంటి కథావాహిని, 2003: 6)
బలసాకు (పులికంటి కథావాహిని, 2003: 7)
చెరికాస్త (పులికంటి కథావాహిని, 2003: 8)
గానిగెద్దు (పులికంటి కథావాహిని, 2003: 14)
వడిసెల (వల్లంపాటి కథలు, 2009: 35)
సెనగ్గింజలు (వల్లంపాటి కథలు, 2009: 58)
మక్కెలు (వల్లంపాటి కథలు, 2009: 69)
మబ్బుతునక (వల్లంపాటి కథలు, 2009: 85)
వడసాల (వల్లంపాటి కథలు, 2009: 129)
వాటారి (వల్లంపాటి కథలు, 2009: 131)
చెందిరపు బొట్టు (నవ్విన ధాన్యరాశి, 2014: 29)
దౌడు (నవ్విన ధాన్యరాశి, 2014: 30)
అదును (నవ్విన ధాన్యరాశి, 2014: 31)
దూక్కి (నవ్విన ధాన్యరాశి, 2014: 31)
మంగకంప (నవ్విన ధాన్యరాశి, 2014: 32)

బలసకంప (నవ్విన ధాన్యరాశి, 2014: 32)

డోకోస్తోంది (ఆర్.ఎస్. సుదర్శనం కథలు, 2018: 76)

వమనం (ఆర్.ఎస్. సుదర్శనం కథలు, 2018: 84)

ముసురు (ఆర్.ఎస్. సుదర్శనం కథలు, 2018: 125)

రొష్టు పెట్టకు (ఆర్.ఎస్. సుదర్శనం కథలు, 2018: 147)

కాడెద్దులు (రక్త యజ్ఞం, 1965: 57)

కబిల (రక్త యజ్ఞం, 1965: 57)

దరి (రక్త యజ్ఞం, 1965: 57)

చెక్కుడుపార (రక్త యజ్ఞం, 1965: 59)

బీట్లోకి (రక్త యజ్ఞం, 1965: 60)

బండిబాట(రక్త యజ్ఞం, 1965: 94)

బిరాన (రక్త యజ్ఞం, 1965: 96)

నడవ (పైరుగాలి, 1967: 48)

కూకలేయ్యి (పైరుగాలి, 1967: 48)

తూము (పైరుగాలి, 1967: 49)

చీకి పోద (పైరుగాలి, 1967: 66)

6.2.6.3. ధ్వన్యనుకరణ పదాలు:

గల గల (సంక్రాంతి కోడె ఆంధ్ర మహిళ. 1955. 8.1: 66)

బిర బిర (సంక్రాంతి కోడె ఆంధ్ర మహిళ. 1955. 8.1: 66)

కొస కొస (సంక్రాంతి కోడె ఆంధ్ర మహిళ. 1955. 8.1: 67)

ధన ధన (సంక్రాంతి కోడె ఆంధ్ర మహిళ. 1955. 8.1: 68)

గబ గబ (పాతాళగంగ, 1969: 22)

జల జల (పాతాళగంగ, 1969: 22)

దడ దడ (కమ్మ తెమ్మెర, 1968: 73)

గర గర (వర్షించిన మేఘం, 1961: 46)

బర బర (కళ్యాణకినకిణి, 1968: 94)

టిక్కు టిక్కు (ప్రాణదాత, 1962: 14)

బిర బిర (ప్రాణదాత, 1962: 99)

గడ గడ (తాను వెలిగించిన దీపాలు, 1968: 159)

గుస గుస (పునర్నవం, 1968: 34)

గణ గణ (పులికంటి కథావాహిని, 2003: 6)

సర సర (వల్లంపాటి కథలు, 2009: 59)

6.2.6.4. జంటపదాలు:

ఇరుగుపొరుగు (పాతాళగంగ, 1969: 133)

ఆదరూ బెదురూ (వర్షించిన మేఘం, 1961: 46)

పనీ పాటా (వర్షించిన మేఘం, 1961: 49)

కూరా నారా (కళ్యాణ కినకిణి, 1968: 182)

చీకూ చింత (కళ్యాణ కినకిణి, 1968: 183)

మందో మాకో (ప్రాణ దాత, 1962: 10)

సూదో గీదో (ప్రాణ దాత, 1962: 10)

రాత్తో రప్పతో (వల్లంపాటి కథలు, 2009: 38)

చెత్తాచెదారం (వల్లంపాటి కథలు, 2009: 39)

ఆకూ అలుమూ (వల్లంపాటి కథలు, 2009: 39)

గడ్డీ గాదం (వల్లంపాటి కథలు, 2009: 58)

ఇలా పైన చెప్పిన సామెతలు, మాండలిక పదాలు, ధ్వన్యనుకరణ పదాలు, జంటపదాలు లాంటివే కాకుండా మరెన్నో ఉదాహరణలే చిత్తూరు జిల్లా కథలో ఉన్నాయి. ఇంకా అన్యదేశ పదాలు, జాతీయాలు, ఉపమానాలు, సాదృస్యాలు, లోకోక్తులు కూడా చిత్తూరు జిల్లా కథల్లో ఉన్నాయి.

6.2.7. శైలి:

శైలి శిల్పంలో ఒక భాగమని, రచనకు శైలి ప్రాణం వంటిదని చిత్తూరు జిల్లా నవలా శైలిని గురించి చెప్పే క్రమంలో చెప్పాను. 1950 ముందు సరళ గ్రాంథిక శైలి, సరళ శైలి అనే రెండు శైలులు చిత్తూరు జిల్లా కథా సాహిత్యంలో కనిపిస్తాయి. 1950కి ముందు కథలు రాసిన యం.వి. పాపన్న గుప్త (శారద, హైమావతి, సావిత్రి), సి.ఎస్. నీలకంఠయ్యర్ (భోగపు మేళములు), రావూరి చెంగనార్య (చంద్రికా మోహనులు), టి.ఆర్మొగం పిళ్ళె (రాఘవేంద్రరావుగారి రాజీనామా, బిక్కిరింత పిదప వెక్కిరింత, పాపి చావు) పూతలపట్టు శ్రీరాముల రెడ్డి (ఒక ఆది యాంధ్ర భక్తుని జీవిత చరిత్ర) వంటి వారు సరళ గ్రాంథిక శైలిలో కథలు రాశారు. కె. సభా సరళ శైలిలోనే కథలు రాశారు. ఉదాహరణకు కింద కొన్ని వాక్యాలను ఇస్తున్నాను.

"నేడు నిర్ణీతదినము. పాపము! తనయుడు దూరదేశ మేగుచున్నాడని తల్లిదండ్రులు పరితాపమునకు మేరయేలేదు. వారికన్నా సావిత్రి విచారమున కంతమేలేదు. తన వేడుక చెలికాడు, మనోవల్లభుడు గ్రామము వీడుచుండ యేట్లూరుకొనగలదు? కానీ తన మనోరథము తెలియబరచిన తల్లిదండ్రులు దూరెదరని తన మనోపేటిక యందు భద్రముగా దాచి యుంచుకొనెను" (సావిత్రి కథ. భారత కథానిధి. 1928. మార్చి: 3) అంటూ యం.వి. పాపన్న

గుప్త సావిత్రి కథలో రాసిన వాక్యాలను చూస్తే చిత్తూరు జిల్లా కథాసాహిత్యం ప్రారంభ దినాల్లో శైలి ఏ విధంగా ఉందో అర్థమవుతుంది.

అలాగే నీలకంఠయ్యర్ రాసిన భోగపు మేళములు కథలో *"సోమసుందరుడు కండితముగా వ్రాసి యున్నాడు. భోగపు మేళములు లేని పెండ్లి యది యొక పెండ్లియేనా అని వ్రాసిన బావ గారికి బదులేమని లిఖింప వచ్చునని సత్యసాధనుడు కాగితమును ముందఱ నుంచుకొని కలమును చేతితో ముక్కు చెంత పెట్టుకొని యోచనా సంద్రమున మునిగి యున్నాడు. ఒక వైపు సంఘసంస్కరణమునకు జేయూత నొసంగు వారును, మరియొక వైపు ప్రాత పద్ధతుల ప్రోత్సహించుచు వైవారిని ప్రతిఘటించువారును ప్రపంచమున నున్నారు"* (రాయలసీమ తొలితరం కథలు,2015: 162) అంటూ భాష సరళగ్రాంధికంలో సాగుతుంది.

సరళశైలి ఉదాహరణగా కె. సభ రాసిన 'సమాధి' కథలోని *"నాకు తొలిసారిగా పదేళ్ల మాట స్ఫురణకొస్తోంది. అప్పుడు నా యీడు పది సంవత్సరాలుంటై. పుష్ప నాలుగేళ్ళ పసిపాప".* (పతాంజలి, 1945.01.06: 99) అంటూ సాగే ఈ వాక్యాలు అందరికీ అర్థమయ్యే విధంగా, సులభంగా ఉంటాయి. సభా కథలన్నీ కూడా ఇదే శైలిలో సాగుతాయి.

1950 తర్వాత చిత్తూరు జిల్లా నుండి కథలు రాసిన మధురాంతకం రాజారాం, పులికంటి కృష్ణారెడ్డి, సి. వేణు, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, ఆర్.ఎస్. సుదర్శనం, కాశీనాథ విశ్వం కె.ఆర్. రెడ్డి, మధురాంతకం దొరస్వామి, శ్రీనివాసపురం రామాచార్యులు, కలువకొలను సదానంద, కాసారం కుప్పుస్వామి వంటి వారందరూ సరళశైలికే ప్రాధాన్యతను ఇచ్చారు. సభా, మధురాంతకం రాజారాం, కలువకొలను సదానంద, సి. వేణు లాంటి వారు సరళశైలిలో కథలు రాస్తూనే రాయలసీమ మాండలిక పదాలకు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తూ, పాత్రల స్వభావాలను, వారి పరిస్థితులను వాస్తవిక శైలిలో ఎంతో హృద్యంగా వారి వారి కథల్లో చిత్రించారు.

6.3. చిత్తూరు జిల్లా కల్పనాసాహిత్యం (నవల, కథానిక) – రూప (శిల్ప) పరిణామం:

చిత్తూరు జిల్లా కల్పనాసాహిత్య రూప (శిల్ప) పరిణామంలో ప్రధానంగా గమనించవలసిన విషయాలు పాత్రచిత్రణ, కథాకథనం, భాషా, శైలి.

పాత్రచిత్రణ విషయంలో చారిత్రక పాత్రల దగ్గర నుండి, సామాన్య మానవుని వరకూ అనేక రకాలైన పాత్రలను చిత్తూరుజిల్లా నవలా సాహిత్యంలో చూడవచ్చు. డబ్బు, అహంకారం కల సాహుకారు పాత్రలు, తిండికి గతిలేని పేదల పాత్రలు, నిస్సహాయులైన పాత్రలు, అమాయకపు పాత్రలు, వృత్తి పట్ల గౌరవం లేని పాత్రలు, నిజాయితీకి నిలువుటద్దమైన పాత్రలు, వేశ్యా పాత్రలు, సంఘసంస్కరణ భావాలు కలిగిన పాత్రలు , తను నమ్మిన ఆదర్శాలను చివరి వరకూ పాటించలేక జీవితంతో రాజీ పడిన పాత్రలు ఈ ప్రాంత సాహిత్యంలో చూడవచ్చు.

అలాగే కథా సాహిత్యంలో అయితే మూఢనమ్మకాల పట్ల విశ్వాసాన్ని ప్రకటించే పాత్రల దగ్గర నుండి వాటిపట్ల వ్యతిరేకతను చూపించే పాత్రలు, బాల్య వివాహాల వల్ల చిన్నతనంలోనే వితంతువులుగా మారిన వారి దగ్గర నుండి, తల్లి తండ్రి చనిపోయి ఏ ఆదరువూ లేకుండా

నిస్సహాయులుగా మిగిలే స్త్రీల దగ్గర నుండి వారి కాళ్ళ మీద వాళ్ళు నిలబడి వారి నిర్ణయాలు వారు తీసుకునే స్త్రీల వరకూ ఎదిగిన పాత్రలను ఇక్కడి సాహిత్యంలో చూడవచ్చు. వరకట్నాలు, కన్యాశుల్కాలను ఒక సాంప్రదాయంగా లాంఛనంగా తీసుకునే వారి దగ్గర నుండి అటువంటి దురాచారాలను రూపు మాపాలని కట్నంలేని పెళ్ళికి సిద్ధపడే పాత్రలు, సాహుకార్ల చేతుల్లో బలైపోయిన అమాయకపు స్త్రీల దగ్గర నుండి దేశ స్వాతంత్ర్యం కోసం అవసరమైతే ప్రాణత్యాగానికైనా వెనకాడకూడదని చాటి చెప్పే ధీర వనితల లాంటి పాత్రలు ఉన్నాయి.

కథాకథనం లేదా దృష్టికోణం విషయంలో నవలలో కాని, కథలో కాని ఎక్కువగా ప్రథమపురుష, ఉత్తమపురుష దృష్టికోణాలే కనిపిస్తాయి. కల్పనా సాహిత్య ప్రారంభరోజుల్లో నాటకీయ దృష్టికోణంతో సాగిన రచనలు అంతగా లేవు. 1950 తర్వాతనే కల్పనా సాహిత్యంలో కథనానికి సంబంధించిన ప్రయోగాలు ఎక్కువగా జరిగాయి. చిత్తూరు జిల్లా కల్పనాసాహిత్యంలో కూడా ప్రారంభ దినాల్లో ఎక్కువగా ప్రయోగాలు జరగలేదు. ప్రథమపురుష, ఉత్తమపురుష దృష్టికోణాల్లోనే రచనలు వచ్చేవి. అయితే రాను రాను ప్రథమపురుష, ఉత్తమపురుష దృష్టికోణాలే కాక అక్కడక్కడా చైతన్య స్రవంతి కథన పద్ధతిని, ఫ్లాష్ బ్యాక్ కథన పద్ధతిని, లేఖా కథన పద్ధతిని ప్రయోగించిన సందర్భాలు ఉన్నాయి. రచయిత ఏ పద్ధతిలో కథ చెప్పినప్పటికీ పరిమితులకు లోబడి మాత్రమే కథలో తన ప్రమేయం ఉంటుంది. అయితే అక్కడక్కడా 'పాఠకమహాశయా' అంటూ వివరణలు ఇస్తూ ఉంటారు. ఇటువంటి సందర్భాలు చిత్తూరు జిల్లా నవలా సాహిత్యంలో అనేక చోట్ల చూడవచ్చు. కారణం తెలుగువారికి నవలా ప్రక్రియ (కథ కూడా) అప్పటికి ఆధునికం కాబట్టి. తెలుగులో కల్పనా సాహిత్యానికి సంబంధించిన విమర్శా గ్రంథాలు ఎక్కువగా లేకపోవటం కూడా ఒక కారణం.

చిత్తూరుజిల్లా కల్పనా సాహిత్యంలో భాష-శైలి విషయంలో అనేక ప్రయోగాలే జరిగాయి. మొదట్లో కావ్యభాషను నవలల్లోనూ కథల్లోనూ ప్రయోగించినప్పటికీ అది రాను రాను సరళ గ్రాంథిక శైలికి ఆ తర్వాత ప్రామాణిక శైలికి ఆ తర్వాత వ్యవహారిక శైలికి మారింది. పాత్రల పేర్ల విషయంలో కూడా వస్తువు ఆధునిక కాలానికి సంబంధించినది అయినప్పటికీ మొదట్లో కావ్యాల్లో ప్రబంధాల్లో కనపడేవి పేర్ల లాగా పెట్టారు (రామకిశోరుడు, హరికిషోరుడనే) రానురాను అది కూడా మారింది. రచన పూర్తిగా మాండలిక శైలిలో సాగకపోయినప్పటికీ అక్కడక్కడా సందర్భానికి తగ్గట్టు కొన్ని కొన్ని సంభాషణలు మాండలిక శైలిలో సాగినవి కూడా ఉన్నాయి.

ఈ విధంగా 1920లో మొదలైన చిత్తూరు జిల్లా నవల నుండి 1975 వరకూ వచ్చిన నవల వరకూ, అలాగే 1927లో మొదలైన చిత్తూరు జిల్లా కథ నుండి 1975 వరకూ వచ్చిన కథ వరకూ గమనిస్తే, పై మూడు విషయాల్లోనే కాకుండా వస్తువైవిధ్యంలోనూ, దానిని అభివ్యక్తం చేసే పద్ధతిలోనూ, అందులో ఉపయోగించే భాషలోనూ, శైలిలోనూ ఇలా ఎత్తుగడ మొదలు ముగింపు వరకూ అనేక విషయాల్లో వచ్చిన ఎన్నో పరిణామాలను గమనించవచ్చు.

సింహావలోకనం

'చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యం (నవల కథానిక) – వస్తు, రూప విశ్లేషణ' అనే ఈ సిద్ధాంత వ్యాసాన్ని ఆరు అధ్యాయాలుగా విభజించాను. ఈ సిద్ధాంత వ్యాసంలో ఇమిడ్చిన ఒక్కొక్క అధ్యాయంలో నేను పరిశోధించి, పరిశీలించి, వెల్లడించిన అంశాలను ఈ కింది విధంగా తెలియజేస్తున్నాను.

మొదటి అధ్యాయం ***'చిత్తూరు జిల్లా భౌగోళిక పరిస్థితులు'***లో చిత్తూరు జిల్లా ఏర్పడిన విధానం, జిల్లా భౌగోళిక పరిస్థితులు, జిల్లాకు సంబంధిన శాసనాలు, జిల్లాను పరిపాలించిన రాజ వంశాలు, జిల్లాలో జరిగిన ఉద్యమాలు, జిల్లాలోని సాంఘిక, సాంస్కృతిక విషయాలైన మతం, దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలు, జాతరలు, ఉత్సవాలు, పండుగలు, మొదలైన వాటిని సంక్షిప్తంగా పరిచయం చేశాను. ఎందుకంటే, ఒక ప్రాంత సాహిత్యాన్ని అర్థం చేసుకోవాలంటే ఆ ప్రాంత వనరులు, ఉత్పత్తులు, ప్రజా జీవన విధానం అర్థం చేసుకోవాల్సి ఉంటుంది కనుక. అప్పుడే ఆ ప్రాంత సాహిత్యం బాగా అవగాహన చేసుకోగలం.

రెండవ అధ్యాయం ***'ప్రపంచ సాహిత్యంలో నవల, కథానికల ప్రారంభం'***లో కల్పనా సాహిత్యం అంటే ఏంటి? కల్పనా సాహిత్యం కింద ఏయే ప్రక్రియలు వస్తాయి? అనే అంశాలను పరిచయం చేశాను. అలాగే కల్పనా సాహిత్యాన్ని గురించి పలువురి అభిప్రాయాలను, ప్రపంచ నవల, కథానికల ఆవిర్భావాన్ని, అందుకు గల నేపథ్యాన్ని స్థూలంగా వివరించే ప్రయత్నం చేశాను. అంతేకాక ప్రపంచంలోని వివిధ భాషల్లో మొదటి నవల, మొదటి కథానిక ఎప్పుడు ప్రారంభమైంది, అది ఏది? అనే అంశాలను, పాశ్చాత్య ప్రభావంతో భారతదేశంలోకి ప్రవేశించిన నవల, కథానికల పుట్టుక ఎప్పుడు ప్రారంభం అయ్యింది అనే అంశాలను, భారతదేశంలోని వివిధ భాషల్లో మొదటి నవల, కథానిక ఏది? అన్న విషయాలను, తెలుగులో నవల, కథానికలు ఎప్పుడు ఎలా మొదలయ్యాయి, ఏది మొదటి నవల, ఏది మొదటి కథానిక అనే విషయంలో గల భిన్నాభిప్రాయాలను వివరించాను.

మూడవ అధ్యాయం ***'చిత్తూరు జిల్లా రచయితలు (నవల, కథానిక) – జీవన రేఖలు'***లో కె. సభా కంటే ముందు ఉన్న రచయితలతో(సి.యస్. నీలకంఠయ్యర్, పూతలపట్టు శ్రీరాములు రెడ్డి, టి.కె. రంగస్వామి అయ్యంగార్, రావూరు చంగనార్య, టి. ఆర్కోగంపిళ్ళె)తో మొదలు పెట్టి 94 మంది రచయితలను, రచయిత్రులను స్థూలంగా పరిచయం చేశాను. అలాగే ఈ 94 మందే కాకుండా అప్పుడప్పుడు మాత్రమే కథలు రాసి, పెద్దగా గుర్తింపు రాని వారు, ఇప్పుడిప్పుడే కథారచన చేపట్టిన వారు, ఇతర జిల్లాల నుండి వచ్చి ఇక్కడ స్థిరపడి నవలా, కథా రచన చేపట్టిన వారు అంటూ మధురాంతకం రాజారాం (చిత్తూరు జిల్లా సాహిత్య చరిత్ర), పేరూరు బాలసుబ్రమణ్యం (చిత్తూరు కథ), చిత్తూరు జిల్లా శతాబ్ది సాహిత్య ఉత్సవాలు ప్రత్యేక సంచిక,

టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి (చిత్తూరు జిల్లా వందేళ్ళ కథా సారధులు) లాంటి వాళ్ళు ప్రస్తావించిన మరి కొంత మంది రచయితల పేర్లను కూడా ఈ అధ్యాయంలో పేర్కొన్నాను.

నాల్గవ అధ్యాయం ***'చిత్తూరు జిల్లా నవలా సాహిత్యం – వస్తు వైవిధ్యం'***లో చిత్తూరు జిల్లా నవల పట్ల పూర్వ పరిశోధకుల, విమర్శకుల అభిప్రాయాలను మొదట తెలియజేశాను. ఆ తర్వాత, చిత్తూరు జిల్లా రచయితలు రాసిన నవలల్లో గల వస్తు వైవిధ్యతలను చారిత్రక నవలలు, సాంఘిక నవలలు (సంఘ సంస్కరణ నవలలు, వెట్టి చాకిరీని చిత్రించిన నవలలు, అస్తిత్వవాద ప్రభావం కలిగిన నవలలు, కరువును చిత్రించిన నవలలు, హాస్య వ్యంగ్య నవలలు, ఇతరాలు)గా వింగడించి విశ్లేషించే ప్రయంతం చేశాను.

ఐదవ అధ్యాయం ***'చిత్తూరు జిల్లా కథా సాహిత్యం – వస్తు వైవిధ్యం'***లో చిత్తూరు జిల్లా కథ పట్ల పూర్వ పరిశోధకుల, విమర్శకుల అభిప్రాయాలను మొదట తెలియజేశాను. ఆ తర్వాత, చిత్తూరు జిల్లా రచయితలు రాసిన కథలను మూఢ విశ్వాసాలకు సంబంధించిన కథలు, సామాజిక రుగ్మతలకు సంబంధించిన కథలు, కుటుంబ సంబంధ/అనుబంధాలకు సంబంధించిన కథలు, స్త్రీ సమస్యలకు సంబంధించిన కథలు, ప్రేమకు సంబంధించిన కథలు, వివాహ సంబంధ కథలు, ఉపాధ్యాయ/ ఇతర ఉద్యోగ సంబంధ కథలు, రచయితలకు సంబంధించిన కథలు, వ్యవసాయ, కరువు సంబంధ కథలు, ఆర్థిక సంబంధ కథలు, రాజకీయ సంబంధ కథలు, ఇతరాలకు సంబంధించిన కథలుగా వింగడించి వివరించే ప్రయత్నం చేశాను. అలాగే ఈ అధ్యాయం చివర్లో చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యంలో (నవల, కథ) వచ్చిన వస్తుపరిణామం ఏవిధంగా జరిగిందో స్థూలంగా వివరించాను.

ఆరవ అధ్యాయం ***'చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యం – రూప (శిల్ప) వైవిధ్యం'***లో చిత్తూరు జిల్లా రచయితలు (నవల, కథానిక) వారి వారి రచనల్లో పాటించిన శిల్ప నైపుణ్యాలను అంటే శీర్షిక మొదలు ఎత్తుగడ, పాత్ర చిత్రణలో, కథాకథనం (దృష్టి కోణం), భాష, శైలీ వంటి అంశాలల్లో వారు కనబరిచిన వైవిధ్యాలను వివరించాను. అలాగే చిత్తూరు జిల్లా రచయితలు వారివారి నవలల్లో కథలల్లో సామెతలను, మాండలిక పదాలను, అన్యదేశ పదాలను, ధ్వన్యనుకరణ పదాలను, జంట పదాలను ఎంత వరకూ ప్రయోగించారో సోదాహరణంగా తెలిపాను. చివరగా చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యంలో శిల్పపరిణామం ముఖ్యంగా శైలీ పరిణామం ఏ విధంగా జరిగిందో స్థూలంగా వివరించే ప్రయత్నం చేశాను.

భవిష్యత్ పరిశోధనాంశాలు:

'చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యం (నవల కథానిక) – వస్తు, రూప విశ్లేషణ' అనే అంశంపై పరిశోధన చేసిన తర్వాత ఎంతో విస్తృతి కలిగిన ఈ జిల్లా కల్పనా సాహిత్యంపైన ఇంకా విస్తృతంగా పరిశోధన చేయడానికి అవకాశం ఉందని నాకు అనిపించింది. ఈ అంశం పైన నేను పరిశోధనకు ఉపక్రమించే సమయానికే చిత్తూరు జిల్లా నవలా సాహిత్యం పైన అలాగే కథా

సాహిత్యం పైన విడివిడిగా అనేక పరిశోధనలు జరిగాయి. ఇక కొత్తగా చేయడానికి ఏముంటుంది అనుకునే విషయ సేకరణ కోసం ప్రయత్నించాను. ఈ క్రమంలో పూర్వ పరిశోధకుల, విమర్శకులకు దృష్టిలో పడని కథలు, నవలలు నాకు లభించాయి. వీటి వివరాలను అన్నింటిని నా మూడవ అధ్యాయంలో పెట్టాను. అలాగే సందర్భానుసారంగా వస్తు వస్తువైవిధ్యాన్ని, శిల్ప వైవిధ్యాన్ని వివరించే క్రమంలో ఆయా అధ్యాయాల్లో వివరించాను. విషయ విస్తృతి కారణంగా నాకు లభించిన కొత్త రచనలపైన సంపూర్ణంగా దృష్టి పెట్టలేకపోయాను. అది ఏ పరిశోధనకైనా సర్వసాధారణమే. వీటి పైన భావి పరిశోధకులు పరిశోధన చేయడానికి అవకాశం ఉందని అనుకుంటున్నాను.

అలాగే చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యాన్ని అధ్యయనం చేసిన తర్వాత అందులో గల అనేక కొత్త విషయాల పట్ల నాకు కొంత అవగాహన కలిగింది. చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యం స్వతంత్రానికి ముందు వస్తు స్వీకరణలోను, భాషలోనూ కొంత వైవిధ్యతను ప్రదర్శించింది. ఆనాటి దేశ కాల పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రజలను లేదా పాఠకులను స్వాతంత్ర్య పోరాటం పట్ల ఉన్ముకులను చేయడం లేదా గత వైభవాన్ని తెలియజేస్తూ తద్వారా సంస్కృతి సాంప్రదాయాలను పెంపొందించడం కోసం కొన్ని రచనలు చేసినట్లు తెలుస్తోంది. ఆ విషయాల పట్ల ప్రత్యేక దృష్టిని పెట్టి భావి పరిశోధకులు పరిశోధన చేయడానికి అవకాశం ఉందని నాకు అనిపించింది. అలాగే స్వతంత్రానికి ముందు ఆ తర్వాత వచ్చిన చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యంలో కనపడే భాష పట్ల ప్రత్యేక దృష్టితో పరిశోధనలను చేయవచ్చని అనుకుంటున్నాను.

చిత్తూరు జిల్లా నుండి వచ్చిన నవలల్లో కథల్లో సామాజిక అంశాలను లేదా సామాజిక జీవన పరిస్థితులను తెలియజేసే రచనలు చాలానే ఉన్నాయి. వాటి పట్ల కూడా ప్రత్యేక దృష్టితో పరిశోధన చేయడానికి అవకాశం ఉందని నేను అనుకుంటున్నాను. అలాగే మధురాంతకం రాజారాం, కలువకొలను సదానంద రాసిన నవలల్లో కొంత వ్యంగ్య ధోరణి కనిపిస్తుంది. ఈ అంశం పట్ల కూడా ప్రత్యేక దృష్టితో భావి పరిశోధకులు పరిశోధనకు పూనుకోవచ్చని నా అభిప్రాయం. ఇంకా ఈ ప్రాంతం నుండి వచ్చిన కథ సాహిత్యంలో స్త్రీలకు సంబంధించిన సమస్యలను, ఉద్యోగులకు సంబంధించిన సమస్యలను చిత్రించిన కథలే ఎక్కువగా ఉన్నాయి. ఈ దృష్టితో కూడా పరిశోధనలు చేయడానికి అవకాశం ఉందని అనుకొంటున్నాను.

ఫలితాలు

చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యం ప్రారంభమయ్యే సమయానికి (1920లో నవల,1927లో కథ) తెలుగు నవలా సాహిత్యం ప్రారంభయుగాన్ని, అనువాదయుగాన్ని దాటి వికాసయుగానికి చేరుకున్నది. ఈ సమయంలో దేశకాల పరిస్థితులను చూస్తే ప్రజలపైన జాతీయ ఉద్యమం ప్రభావం ఎక్కువగా ఉంది. అలాగే తెలుగు సాహిత్యంలో భావకవిత్వం కూడా మొదలైంది ఇటువంటి తరుణంలో వెలబడిన సాహిత్యం జాతీయత పట్ల, దేశభక్తి పట్ల ప్రజలను ఉన్ముక్తులను చేస్తూ, మన పూర్వుల గత చరిత్ర వైభవాన్ని తెలియజేస్తూ, తద్వారా సంస్కృతి సాంప్రదాయాలు పట్ల విలువలను పెంచే విధంగా అనేక రచనలు వచ్చాయి.

ఈ విధంగా చూస్తే స్వాతంత్రానికి ముందు వచ్చిన చిత్తూరు జిల్లా కల్పనా సాహిత్యంలో పై విషయాలు ప్రస్ఫుటంగాకనిపిస్తాయి. చిత్తూరు జిల్లా మొదటి నవల చాందసుల్తానాలో వస్తువు 16వ శతాబ్దానికి చెందినదైనా 19 శతాబ్దానికి తగినట్లుగా రచయిత మలుస్తూ రాశాడు. ఈ నవల 1920లో వచ్చింది. అప్పటికే దేశ ప్రజల్లో జాతీయ ఉద్యమం వెల్లివిరుస్తుంది. గాంధీ నాయకత్వాన ఎన్నో ఉద్యమాలు జరుగుతున్నాయి. ఇటువంటి తరుణంలో ఈ నవలలో చాందబీబి తన రాజ్యాన్ని రాజ ద్రోహుల నుండి నమ్మకద్రోహుల నుండి మొగల్ సైన్యాల నుండి కాపాడే విధానాన్ని తెలియజేస్తూ తద్వారా స్వాతంత్ర పోరాటాన్ని ప్రజల్లోకి పురికొల్పి తద్వారా ఆంగ్లేయులపై పోరాడాలని స్ఫూర్తిని కలిగిస్తూ ఈ నవల వచ్చినట్లు అనిపించింది. అలాగే తానీషా అనే చారిత్రక నవలలో హిందూ ముస్లింల ఐక్యత కోసం అక్కన్న మాదన్నలు చేసిన కార్యాలు చూస్తే హిందూ ముస్లింలు ఒకటే హాంగ్లీలతో పోరాడాలని రచయిత సూచించాడని తెలుస్తోంది.

అలాగే రత్నాబాయి, భానుమతి, మోహన, భిక్షుకి అనే నవలల్లో కన్యాశుల్కం, వరకట్నం, వేశ్యా, బాల్యవివాహ, మద్యపాన, మూఢవిశ్వాసాలలు, వెట్టి చాకిరీ వంటి సమస్యలను ఎండుగడుతూ సమాజం మీద వాటి ప్రభావాన్ని తెలియజేస్తూ జిల్లా రచయితలు రాసిన తీరును చూస్తే ఆయా రచయితలు ఈ నవలలను సంఘ సంస్కరణ దృష్టితో రాశారని తెలుస్తోంది.

వ్యక్తి ధర్మానికి వ్యవస్థ ధర్మానికి మధ్య జరిగే సంఘర్షణను చిత్రిస్తూ ఆర్.ఎస్. సుదర్శన మూడు నవలను రాశాడు. అనుబంధాలు, మళ్ళీ వసంతం, అసురసంధ్య అనే ఈ మూడు నవలల్లో, వ్యక్తి తను నమ్మిన ధర్మాలను పాటించే క్రమంలో పరిస్థితుల చేత పరాభవించబడి వ్యవస్థా ధర్మానికి తలగినట్లుగాను, ఒక్కొక్కసారి వాటి మధ్య సమన్వయాన్ని ఏర్పరుచుకునే విధంగానూ కనిపిస్తుంది. అస్తిత్వ/మనోవిశ్లేషణ ప్రభావం గల ఈ నవలలను గమనిస్తే తెలుగు నవలా వికాసయుగంలో వచ్చిన అనేక మార్పులను చిత్తూరు జిల్లా స్వాగతించిందని తెలుస్తోంది.

అలాగే కథ సాహిత్యంలో స్వాతంత్ర సాధన కోసం ప్రాణత్యాగానికి కూడా వెనకాడకూడదని తెలియజేసే విప్లవంగన వంటి కథలు చూస్తే చిత్తూరు జిల్లా రచయితల్లో గల దేశభక్తి తెలుస్తోంది.

చిత్తూరు జిల్లా కథా సాహిత్యాన్ని అధ్యయనం చేసిన తర్వాత అందులో గల వైవిధ్యాలను గమనించిన తర్వాత ఈ జిల్లా రచయితలు మూఢ విశ్వాసాలను, కుటుంబ అనుబంధాలను, స్త్రీ సమస్యలను, సాహుకారుల/భూస్వాముల దురాగతాలను, సామాజిక రుగ్మతలను, ఉద్యోగుల ఆర్థిక కష్టాలను, కరువు చిత్రణలను, వ్యవసాయం బాధలను, మనుషులకు జంతువులపై గల ప్రేమను, కళాకారుల జీవితాలను ఆయా కథల్లో చిత్రించిన విధానాన్ని చూస్తే, రచయితలకి సమాజం పట్ల గల సూక్ష్మ దృష్టి తెలిసింది. అదే విధంగా చిత్తూరు జిల్లా (రాయలసీమ కూడా) సామాజిక జీవన విధానం తెలుసుకోవడానికి ఈ కథలు ఎంతగానో దోహదం చేస్తాయనిపిస్తోంది.

ఉపయుక్త గ్రంథసూచి

అంపశయ్య నవీన్. (2011). ***ఆర్.ఎస్. సుదర్శనం***. హైదరాబాదు: సాహిత్య అకాడమీ

అంపశయ్య నవీన్. (2012). ***తెలుగు నవల***. హైదరాబాదు: తెలుగు అకాడమీ

అశోక్ కుమార్, కె.పి. (2008). ***కథావలోకనం***. హైదరాబాదు: పాలపిట్ట బుక్స్

అశోక్ కుమార్, కె.పి. (2019). ***కథావిష్కారం***. సికింద్రాబాదు: సామ్రాట్ పబ్లికేషన్స్

అశోక్ కుమార్, కె.పి. (2019). ***తెలుగు నవల***. ప్రయోగ వైవిధ్యం హైదరాబాదు: కర్షక్ ఆర్ట్స్ ప్రింటర్స్

అహోబలరావు, కల్లూరు. (186). ***రాయలసీమ రచయితల చరిత్ర నాల్గవ సంపుటం***. హిందూపురం: శ్రీకృష్ణదేవరాయ గ్రంథమాల ప్రచురణలు

ఆరుద్ర. (2012). ***సమగ్ర ఆంధ్ర సాహిత్యం నాలుగవ సంపుటి***. హైదరాబాదు: తెలుగు అకాడమి.

ఆరుద్ర. (2012). ***సమగ్ర ఆంధ్ర సాహిత్యం రెండవ సంపుటి***. హైదరాబాదు: తెలుగు అకాడమి.

ఇమామ్. (2009). ***సీమ గుండె చప్పుడు***. (కరువు సీమ సమాలోచన) ఎర్రనేల కొట్టాల: కదలిక ప్రచురణ.

కాసింఖాన్, మహమ్మద్. (1944). ***కథానిక రచన***. హైదరాబాదు: హైదరాబాదాంధ్ర సాహిత్య పరిషత్తు

కుటుంబరావు, కొడవటిగంటి. (1969). ***సాహిత్య ప్రయోజనం***. విజయవాడ: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

కుటుంబరావు, బి.వి. (1971). ***ఆంధ్ర నవలా పరిణామము***. హైదరాబాదు: దీక్ష ప్రెస్ గాయత్రీ ప్రచురణము,

కృష్ణమూర్తి, టీ.ఎస్. ఏ. (2013). ***చిత్తూరు జిల్లా వందేళ్ళ కథ సారథులు***. మదనపల్లి: కళా ప్రచురణాలు

కృష్ణారావు, వై. వి.(సంపాదకులు). (1998). ***ఆంధ్రప్రదేశ్ దర్శిని 1***. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

కృష్ణారావు, వై. వి.(సంపాదకులు). (1998). ***ఆంధ్రప్రదేశ్ దర్శిని 2***. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

కృష్ణారావు, వైద్యుల. చక్రపాణిరావు, వాడవల్లి. (1986). ***తెలుగు సాహిత్య చరిత్ర***. హైదరాబాదు: తెలుగు అకాడమి.

కె.ఆర్. రెడ్డి (1967 ***అబలలూ – అనుమానాలు***. హైదరాబాదు: మహతీ పబ్లికేషన్స్.

కోదండ రామయ్య, తిమ్మావజ్జల. (1982). ***తమిళ వాఙ్మయ చరిత్ర***. న్యూఢిల్లీ: సాహిత్య అకాడమీ

గంగాధర్, వేంపల్లి. (2010). ***రాయలసీమ కథా సాహిత్యం ఒక పరిశీలన***. తిరుపతి: శ్రీ

వెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత గ్రంథం

చంద్రశేఖర్ రెడ్డి, రాచపాళెం. (2015). ***మన నవలలు మన కథానికలు***. విజయవాడ: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

చలపతి రెడ్డి, బిజీ. శ్రీధర్, బి (సంపాదకులు). (2003). ***పులికంటి కథావాహిని***. తిరుపతి: విశ్వంభరా పబ్లికేషన్స్.

తొలి తెలుగు కథ ఏడ అభిప్రాయాలు. శ్రీకాకుళం కథానిలయం (2006)

దక్షిణామూర్తి, పోరంకి (సంకలనకర్త). (1999). ***తెలుగు కథానిక***. హైదరాబాదు: తెలుగు అకాడమీ.

దక్షిణామూర్తి, పోరంకి. (1988). ***కథానిక స్వరూప స్వభావాలు***. సికింద్రాబాదు: శ్రీ బి నాగేంద్ర, శివాజీ ప్రెస్.

దేవేంద్రాచారి, సంకోజి. (2018). ***రెకాడినంతకాలం***. విజయవాడ: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

నరసింహచార్యులు, శ్రీనివాసపురం. (1969). ***చిత్తూరు జిల్లా సాహిత్య చరిత్ర విమర్శనము***. పుంగనూరు: నవ్యాంధ్ర భారతి.

నరసింహమూర్తి, యూ.ఏ. (2014). ***తెలుగు వచన శైలి***. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ.

నరేంద్ర, మధురాంతకం. (2000). ***కథయాత్ర***. హైదరాబాదు: అజో – విబో ప్రచురణలు.

నవ్య సాహితీ లహరి(1987). హైదరాబాద్: యువభారతి

నాగభూషణ, శర్మ. (1971). ***మొదటి తెలుగు నవలా వికాసం***. హైదరాబాదు: నాట్య కళా ప్రెస్.

నాగరాజు, పొదిలి.(2015). ***రాయలసీమ నవల***. మైదుకూరు: సాహితీ పబ్లికేషన్స్.

నారాయణ, సింగమనేని. (2013). ***మధురాంతకం రాజారాం***. న్యూఢిల్లీ: సాహిత్య అకాడమీ.

నారాయణస్వామి, బండి. (2019). ***రాయలసీమ సమాజం సాహిత్యం***. హైదరాబాదు: పర్స్పెక్టివ్స్.

నిత్యానందరావు, వెల్దండి. (2014). ***విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన***. హైదరాబాదు: వి. గీతారాణి పబ్లికేషన్స్.

పాపన్న గుప్త, యం.వి. (1930). ***భానుమతి***. ప్రొద్దుటూరు: భారత కథానిధి చిత్రకథల పత్రిక.

పురుషోత్తం, వడ్రేవు. (1994). ***సింధీ సాహిత్య చరిత్ర***. న్యూఢిల్లీ: సాహిత్య అకాడమీ.

బాలసుబ్రమణ్యం, పేరూరు (సంపాదకుడు). (2014). ***చిత్తూరు కథ***. చెన్నై: సాయి బాండ్ ప్రింట్.

మనోహర్, కోటకొండ.; ఉమామహేశ్వర రావు, ఆర్.ఎం (సంపాదకులు). (2009). ***వల్లంపాటి కథలు***. మదనపల్లి: వల్లంపాటి ప్రచురణలు.

మనోహర్, కోటకొండ.; ఉమామహేశ్వర రావు, ఆర్.ఎం. (సంపాదకులు). (2009). ***వల్లంపాటి నవలలు***. మదనపల్లి: వల్లంపాటి ప్రచురణలు,

మహంతయ్య, ఎం.ఎస్. (అనువాదకుడు). (1978). ***కన్నడ సాహిత్య చరిత్ర***. న్యూఢిల్లీ: సాహిత్య

అకాడమీ.

మృణాళిని, సి. (1988). ***సాంఘిక నవల – కథన శిల్పం***. హైదరాబాదు: తెలుగు పరిశోధనా ప్రచురణాలు.

రంగనాథాచార్యులు. కె.కె. (2008). ***తొలినాటి తెలుగు కథానికలు***. హైదరాబాదు: డాక్టర్ మాడభూషి రంగాచార్య స్మారక సంఘం.

రంగారావు, మాదిరాజు. (1984). ***నవల స్వరూప సమలోచనము***. వరంగల్: దసదుని ప్రచురణ.

రజిత రంజని. (1988). హైదరాబాదు: శ్రీ బాలాజీ ఆర్ట్స్ ప్రింటర్స్.

రమాపతిరావు అక్కిరాజు. (1975). ***తెలుగు నవల***. హైదరాబాదు: ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ.

రమాపతిరావు, అక్కిరాజు. (1994). ***సాహితీ వ్యాసంగం వ్యాస సంకలనం***. హైదరాబాదు: పద్మావతి ఆర్ట్ ప్రింటర్స్.

రాంబాబు, వేదగిరి. (2000). ***కథానిక లక్ష్యము–లక్షణాలు***. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

రాంబాబు, వేదగిరి. (2012). ***తెలుగు కథానిక***. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

రాజగోపాలనాయుడు, పి. (2012). ***రామానుజని ప్రతిజ్ఞ***. హైదరాబాదు: ఎమ్మెస్కో బుక్స్.

రాజగోపాలనాయుడు, పి. (ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక 1972). ***ఓరుగల్లు పునరాక్రమణ***.

రాజారాం మధురాంతకం. (1967). ***చిత్తూరు జిల్లా సాహిత్య చరిత్ర***. పాకాల: విశ్వప్రభ ప్రచురణలు.

రాజారాం, మధురాంతకం. (1961) ***వర్షించిన మేఘం***. విశాఖపట్నం: పద్మప్రియ ప్రచురణలు

రాజారాం, మధురాంతకం. (1962) ***ప్రాణదాత***. మద్రాసు: శ్రీ పబ్లికేషన్స్.

రాజారాం, మధురాంతకం. (1963) ***తాను వెలిగించిన దీపాలు***. విజయవాడ: ఆంధ్ర హిందీ ప్రచార ప్రెస్.

రాజారాం, మధురాంతకం. (1968) ***కమ్మ తెమ్మెర***. నేండ్రగుంట: విశ్వప్రభ ప్రచురణలు.

రాజారాం, మధురాంతకం. (1968) ***కళ్యాణ కింకిణి***. నేండ్రగుంట: విశ్వ ప్రభ ప్రచురణలు.

రాజారాం, మధురాంతకం. (1968) ***పునర్నవం***. నేండ్రగుంట: విశ్వప్రభా ప్రచురణలు.

రాజారాం, మధురాంతకం. (1968) ***వక్రగతులు***. మచిలీపట్నం: ఎం శేషాచలం అండ్ కంపెనీ.

రాజారాం, మధురాంతకం. (1971). ***చిన్న ప్రపంచం సిరివాడ***. పుస్తక ప్రచురణ సంగతులు లేవు.

రాజారాం, మధురాంతకం. (1975) ***రేపటి ప్రపంచం***. చిత్తూరు: చిత్తూరు జిల్లా రచయితల సహకార ప్రచురణ సంఘం.

రాజారాం, మధురాంతకం. (1994). ***మధురాంతకం రాజారాం కథలు రెండవ సంపుటి***.

హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిక్ సింగ్ హౌస్.

రాజారాం, మధురాంతకం. (1994). ***హోలికులు కుశలమా!***. విజయవాడ: విజయవాడ బుక్ ట్రస్ట్.

రాజారాం, మధురాంతకం. (1998). ***మధురాంతకం రాజారాం కథలు***. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిక్సింగ్ హౌస్.

రాజారాం, మధురాంతకం. (2000). నారాయణ సింగమనేని (సంకలనకర్తలు). ***తెలుగు కథకులు కథనరీతులు***. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

రాజారాం, మధురాంతకం. (2008). ***మధురాంతకం రాజారాం కథలు ఐదవ సంపుటి***. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిక్ సింగ్ హౌస్.

రాజారాం, మధురాంతకం. (2008). ***మధురాంతకం రాజారాం కథలు నాలుగవ సంపుటి***. హైదరాబాద్ విశాలాంధ్ర పబ్లిక్ సింగ్ హౌస్.

రాజారాం, మధురాంతకం. (2013). ***మధురాంతకం రాజారాం కథలు ఆరవ సంపుటి***. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిసింగ్ హౌస్.

రాజారాం, మధురాంతకం. నారాయణ సింగమనేని (సంకలనకర్తలు) (1998). ***తెలుగు కథకులు కథనరీతులు***. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

రాజారాం, మధురాంతకం.(1969) ***త్రిశంకుడి స్వర్గం***. మద్రాసు: శ్రీ కళ ప్రింటర్స్

రాజారాం, మధురాంతకం.1969) ***మధురాంతకం రాజారాం కథలు***. ముసునూరు:శ్రీ గోదా గ్రంథమాల.

రాజారామ్మోహన రావు, వి. (2016). ***నవలా హృదయం 2***. హైదరాబాదు: నవోదయ బుక్ హౌస్ తెలుగు ప్రింట్.

రామకృష్ణ, తుమ్మల. (2009). ***బహుముఖం***. హైదరాబాదు: చంద్రకళ పబ్లికేషన్స్.

రామకృష్ణ, తుమ్మల. (2014). ***పరిచయం***. హైదరాబాదు: చంద్రకళ పబ్లికేషన్స్.

రామప్రసాదరెడ్డి, తప్పేట. (2015). ***సీమ కథ శిలాజాలు***. అనంతపురం: దిక్సూచి పబ్లికేషన్స్.

రామమోహనరాయ్, కడియాల. (2012). ***మన తెలుగు నవలలు***. హైదరాబాదు: అబోవిబో కందాలం ఫౌండేషన్.

రామానుజులు రెడ్డి, బూదూరు. (1925). ***రత్నాబాయి***. ప్రొద్దుటూరు: జానకి ముద్రాక్షరశాల.

రామానుజులు రెడ్డి, బూదూరు. (1931). ***మోహన***. ఏలూరు: రామా అండ్ కో.

లక్ష్మణరావు, కొమర్రాజు. (). ***మహమ్మదీయ మహా యుగం***.

వత్సల. (2005). ***కదంబం*** హైదరాబాదు: ప్రియదర్శిని ప్రచురణలు

విద్యేశ్వరి, డి. (1988). ***భారతీయ భాషల్లో నవలా ప్రక్రియ స్థూల పరిచయం***. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

వివిన మూర్తి (సంపాదకుడు). (2015). ***దిద్దుబాటులు***. యూఎస్ఏ: తానా ప్రచురణలు.

విశ్వం, కాశీనాథ. (1972). ***పరిష్కారం***. చిత్తూరు: శ్రీ బాలాజీ ప్రెస్.

విశ్వం, కాశీనాథ. (1998). ***మిస్. శ్రీరంగ పట్టణం***. చిత్తూరు: శ్రీ బాలాజీ ప్రెస్.

విశ్వనాథరెడ్డి, కేతు (సంపాదకుడు). (2010). ***కె. సభా ఉత్తమ కథలు***. న్యూఢిల్లీ: నేషనల్ బుక్ ట్రస్ట్.

వీరభద్ర రావు, కొత్తపల్లి. (1960). ***తెలుగు సాహిత్యంపై ఇంగ్లీష్ ప్రభావం***. సికింద్రాబాదు: అజంతా ప్రింటర్స్.

వీరభద్ర రావు, కొత్తపల్లి. (అనువాదకుడు) (1972). ***వంగ సాహిత్య చరిత్ర***. న్యూఢిల్లీ: సాహిత్య అకాడమీ.

వీరభద్రయ్య, ముదిగొండ. (2000). ***నవల – నవలా విమర్శకులు***. హైదరాబాదు: మూసి.

వెంకటయ్య, తవ్వా. (2014). ***రాయలసీమ కథానిక తొలి దశ: ఒక అధ్యయనం***. కడప: యోగివేమన విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత గ్రంథం.

వెంకటయ్య, తవ్వా. (2014). ***సీమ కథ తొలకరి***. తవారిపల్లె: అక్షర దీపిక పబ్లికేషన్స్.

వెంకటయ్య, తవ్వా. (2015). ***రాయలసీమ తొలితరం కథలు***. తవ్వారు పల్లె: అక్షరదీపిక పబ్లికేషన్స్.

వెంకటరమణయ్య, దూబగుంట. (1925). ***చాందసుల్తానా***. రాజమండ్రి: రాజేశ్వరి ప్రెస్.

వెంకటరమణయ్య, దూబగుంట. (1925). ***తానీషా***. రాజమండ్రి: నేషనల్ బుక్ డిపో.

వెంకటరావు, నిడదవోలు. (1954). ***ఆంధ్ర వచన వాఙ్మయము***. మద్రాసు: ఆంధ్ర గ్రంథమాల.

వెంకటసుబ్బయ్య, వల్లంపాటి(అనువాదకుడు). (2015). ***నవల ప్రజలు***. విజయవాడ: విశాలాంధ్ర పబ్లిక్ హౌస్.

వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. (1985). ***అణుశీలన వ్యాసాలు***. హైదరాబాదు: హైదరాబాదు బుక్ ట్రస్ట్.

వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. (1997). ***వల్లంపాటి సాహితీ వ్యాసాలు***. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. (2006). ***రాయలసీమలో ఆధునిక సాహిత్యం సామాజిక సాంస్కృతిక విశ్లేషణ***. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. (2016). ***కథాశిల్పం***. విజయవాడ: విశాలాంధ్ర పబ్లిక్ సింగ్ హౌస్.

వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. (2021). ***నవలా శిల్పం***. హైదరాబాదు: నవచేతన పబ్లిషింగ్ హౌస్.

వెంకటేశ్వరరావు, దార్ల. (2009). ***వీచిక సాహిత్య విమర్శ వ్యాసాలు***. హైదరాబాదు: ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్.

వెంకటేశ్వర్లు, పుల్లాభొట్ల. (1974). ***తెలుగు నవలా సాహిత్య వికాసం***. ఖమ్మం: వైఎస్ ప్రెస్.

వేణు, సి. (2014). ***నవ్విన ధాన్య రాశి***. బెంగళూరు: స్వచ్ఛత ప్రచురణ.

శశికళ, నాదం.; రాఘవేంద్ర, బావికాటి (సంపాదకులు). (2015). ***రాయలసీమ కథకులు సామాజిక అధ్యయనం***. కర్నూలు: పబ్లిక్ సింగ్ హౌస్.

శశిశ్రీ, (2012). ***రాయలసీమ సాహిత్యం***. హైదరాబాదు: తెలుగు అకాడమీ.

శివ సామ్రాట్, వల్లూరు. (2016). ***కథానిక పాఠాలు***. గుంటూరు: అభ్యుదయ రచయితల సంఘం.

శ్రీధర్, ఎం. (2019). ***భారతీయ భాషలలో తొలి తరం నవలలు***. హైదరాబాదు: ఎమ్మెస్కో.

శ్రీరామ మూర్తి, కోడూరి. (1979). ***తెలుగు నవలా సాహిత్యము మనో విశ్లేషణ***. రాజమండ్రి: కొండపల్లి ముద్రాక్షరశాల.

సదానంద, కలువకొలను. (1965). ***రక్త యజ్ఞం***. నేండ్రగుంట: విశ్వప్రభ పబ్లిషింగ్ హౌస్.

సదానంద, కలువకొలను. (1967). ***పైరుగాలి. నేండ్రగుంట***: విశ్వప్రభ పబ్లిషింగ్ హౌస్.

సదానంద, కలువకొలను. (1972). ***గాడిద బ్రతుకులు***. నేండ్ర గుంట: విశ్వప్రభ పబ్లిక్ సింగ్ హౌస్.

సదానంద, కలువకొలను. (1975). ***నవ్వే పెదవులు ఏడ్చే కళ్ళు***. నేండ్రగుంట: విశ్వప్రభ పబ్లిషింగ్ హౌస్.

సభా, కె. (1960). ***మొగిలి***. చేతిరాత ప్రతి.

సభా, కె. (1963) ***బంగారు***. చిత్తూరు: రమణా పబ్లిషర్స్.

సభా, కె. (1969) ***పాతాళగంగ***. చిత్తూరు: పద్మశ్రీ అండ్ కో.

సభాపతి. (1948). ***భిక్షుకి***. మద్రాసు: ఆనంద బోధని కార్యాలయం.

సుజాత రెడ్డి, ముదిగంటి. (2017). ***తెలుగు నవలానుశీలనం***. హైదరాబాదు: ఎమ్మెస్కో

సుదర్శనం, ఆర్.ఎస్. (1958). ***అనుభందాలు***. విజయవాడ: ఆదర్శ గ్రంథ మండలి.

సుదర్శనం, ఆర్.ఎస్. (1960). ***మళ్ళీ వసంతం***. విజయవాడ: ఆదర్శ గ్రంథ మండలి.

సుదర్శనం, ఆర్.ఎస్. (1983). ***సాహిత్య నేపథ్యం***. రాజమండ్రి: శ్రీ రత్న ప్రింటర్స్ 1983.

సుదర్శనం, ఆర్.ఎస్. (2018). ***ఆర్.ఎస్. సుదర్శనం కథలు***. రాటకొండ ప్రచురణలు

సుదర్శనం, ఆర్.ఎస్. (భారతి పత్రిక 1965-1966). ***అసుర సంధ్య.***

సునీలా రెడ్డి (సంకలనకర్త). (2000). ***రాయలసీమ ముఖచిత్రం***. హైదరాబాదు: శివాని పబ్లిషర్స్ అండ్ డిస్ట్రిబ్యూటర్స్.

సుబ్బారావు, అన్నం రాజు. (2014). ***పాశ్చాత్య సాహిత్య విమర్శనా రీతులు***. హైదరాబాదు: తెలుగు అకాడమీ.

సుబ్రహ్మణ్యం, జీవీ. ఇరగంటి, కృష్ణమూర్తి. వంగపల్లి, విశ్వనాథం. (సంపాదకవర్గం). (1972). ***మహతి***. సికిందరాబాదు: యువభారతి.

హరికిషన్, ఎం. (2020). ***రాయలసీమ రచయిత్రుల కథలు***. విజయవాడ: దీప్తి ప్రచురణలు.

హరినాథరెడ్డి, అప్పిరెడ్డి. (2015). ***మొదటి తరం రాయలసీమ కథలు***. హైదరాబాదు: అబ్జా క్రియేషన్స్.

పత్రికలు:

అభ్యుదయ మాసపత్రిక

ఆంధ్ర మహిళ

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక

ఆంధ్రప్రభ

కథాంజలి

గృహలక్ష్మి

తెలుగు తల్లి

భారత కథానిధి

వెబ్ సైట్స్

http://pressacademyarchives.ap.nic.in/

https://archive.org/

https://kathanilayam.com/

అభినందన సంచికలు/ ప్రత్యేక సంచికలు

కృష్ణారెడ్డి, నాగోలు.; వెంకటేశ్వర్లు, పిసి. (2017). వి ఆర్ రాసాని సాహిత్య సమాలోచన. చౌడేపల్లి: విజయవాణి ప్రింటర్స్

చిత్తూరు జిల్లా శతాబ్ది సాహిత్య ఉత్సవాలు ప్రత్యేక సంచిక 1999

నాయుని, కృష్ణమూర్తి. (2017). గారి అభినందన సంచిక చిత్తూరు జిల్లా రచయితల సమాఖ్య.

నిఘంటువులు

Cuddon, J.A. (1979). A Dictionary Of Literary Terms. England: Fenguin Books.

నళిని, ఎస్.ఎస్. (2021). సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ. హైదరాబాదు: నవోదయ బుక్ హౌస్.

మాండలిక పదకోశాలు

విజయలక్ష్మి, మూలే. (2019). తెలుగు మాండలిక పదకోశం చిత్తూరు జిల్లా. తిరుపతి: ఎమ్మార్ ప్రచురణలు.

కథాకోశం

మంజులత, ఆవుల (సంపాదకులు). (2005). తెలుగు కథా కోశం. హైదరాబాదు: తెలుగు అకాడమీ.

అనుబంధాలు

(Annexures)

ఈ పరిశోధన గ్రంథం చివర్లో ఐదు అనుబంధాలను జతపరిచాను.

అనుబంధం-1

కాలక్రమంగా చిత్తూరు జిల్లా నవలలు

క్రమసంఖ్య	ప్రచురణ సంవత్సరం	నవల పేరు	రచయిత పేరు
1.	1920	చాందసుల్తానా	దూబగుంట వెంకట రమణయ్య
2.	1920	తానీషా	దూబగుంట వెంకట రమణయ్య
3.	1925	రత్నబాయి	బూదూరు రామానుజులరెడ్డి
4.	1927	వీర గాంధర్వము	బూదూరు రామానుజులరెడ్డి
5.	1930	భానుమతి	యం.వి. పాపన్న గుప్త
6.	1930	పేటకాంతర శవము	పెరుమాల రామచౌదరి
7.	1931	మోహన	బూదూరు రామానుజులరెడ్డి
8.	1948	భిక్షుకి	కె. సభా (కనక సభాపతి పిళ్ళై)
9.	1953	దేవాంతకుడు	కె. సభా (కనక సభాపతి పిళ్ళై)
10.	1958	అనుభందాలు	ఆర్.ఎస్. సుదర్శనం

11.	1960	మళ్ళీ వసంతం	ఆర్.ఎస్. సుదర్శనం
12.	1960	మొగిలి	కె. సభా (కనక సభాపతి పిళ్ళై)
13.	1962	ఇంద్రధనుస్సు	వల్లంపాటి వెంకటసుబ్బయ్య
14.	1965	దూరతీరాలు	వల్లంపాటి వెంకటసుబ్బయ్య
15.	1966	అసురసంధ్య	ఆర్.ఎస్. సుదర్శనం
16.	1969	రామానుజుని ప్రతిజ్ఞ	పాటూరు రాజగోపాలనాయుడు
17.	1969	త్రిశంకుడి స్వర్గం	మధురాంతకం రాజారాం
18.	1971	చిన్న ప్రపంచం సిరివాడ	మధురాంతకం రాజారాం
19.	1972	కాగితం పులి	నూతలపాటి గంగాధరం
20.	1972	గాడిద బ్రతుకులు	కలువకొలను సదానంద
21.	1972-73 ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక పత్రిక	ఓరుగల్లు పునరాక్రమణ	పాటూరు రాజగోపాలనాయుడు
22.	1975-76 భారతి	రక్త యజ్ఞం	కలువకొలను సదానంద
23.	1976	మమతలు మంచుతెరలు	వల్లంపాటి వెంకటసుబ్బయ్య
24.	1976	సంసార వృక్షం	ఆర్.ఎస్. సుదర్శనం
25.	1976	గందరగోళం	కలువకొలను సదానంద
26.	1976 భారతి	పంచ పాత్ర	కె.ఎస్.వి. నరసింహం

			(కె.ఎస్వీ)
27.	1977 భారతి	నగ్న రాత్రి	కలువకొలను సదానంద
28.	1978	వట్టి చేతులు	కలువకొలను సదానంద
29.	1978	ఖేల	నాయుని కృష్ణమూర్తి
30.	1979	ఇన్క్రెడిబుల్ గాడెస్	పెనుమూరు కేశవరెడ్డి
31.	1979	స్మశానం దున్నేరు	పెనుమూరు కేశవరెడ్డి
32.	1981	కల్పవృక్షంలో కార్చిచ్చు	కాశీనాథ విశ్వం
33.	1981	కోనేటి నదులు	కాణిపాకం లింగన్న
34.	1982 చతుర	పరాజితుడు	వీరపల్లె వీణావాణి (వి. ఆంజనేయులు నాయుడు)
35.	1983	అగ్గిపుల్ల	పులికంటి
36.	1983	తూరుపు కొండలు	వారాల కృష్ణమూర్తి
37.	1985 చతుర	దండకారణ్యం	వీరపల్లె వీణావాణి (వి. ఆంజనేయులు నాయుడు)
38.	1985	పాల పొదుగు	నామిని సుబ్రహ్మణ్యం నాయుడు
39.	1985	సుందరమ్మ కొడుకులు	నామిని సుబ్రహ్మణ్యం నాయుడు
40.	1985	అతడు అడవిని జయించాడు	పెనుమూరు కేశవరెడ్డి
41.	1985	రెడ్డెమ్మ గుండు	ఆర్ వసుంధరా దేవి
42.	1985-86 భారతి	సహగమనం	మధురాంతకం నరేంద్ర
43.	1986	రాముడుండాడు రాజ్యముండాది	పెనుమూరు కేశవరెడ్డి
44.	1988	ముని కన్నడి సేద్యం	నామిని సుబ్రహ్మణ్యం

			నాయుడు
45.	1990	లైఫ్ పాట్నర్	కాణిపాకం లింగన్న
46.	1990	స్మైల్ అగైన్	కాణిపాకం లింగన్న
47.	1991	స్వర్ణ సీమకు స్వాగతం	మధురాంతకం మహేంద్ర
48.	1993	చినబాబు	కాణిపాకం లింగన్న
49.	1993	ఎటి గట్టు	లంకిపల్లి కన్నయ్య నాయుడు
50.	1993	పల్లె విరిసింది	సి.హెచ్. వెంకటరత్నం(ద్వారక)
51.	1994	చీకటి రాజ్యం	రాసాని
52.	1995	జేజవ్వ	పాటూరు రాజగోపాలనాయుడు
53.	1995	మూగవాని పిల్లనగ్రోవి	పెనుమూరు కేశవరెడ్డి
54.	1996	చిత్ర	కాణిపాకం లింగన్న
55.	1996	చివరి గుడిసె	పెనుమూరు కేశవరెడ్డి
56.	1996	మట్టి బ్రతుకులు	రాసాని
57.	1997	ఒక ఆదర్శం	కాణిపాకం లింగన్న
58.	1997	కొత్త మలుపు	కాణిపాకం లింగన్న
59.	1998	వలసదేవర	జొన్నవిత్తుల రామచంద్రమూర్తి
60.	1998–2000 ఆంధ్రభూమి	అంతర్యామి	జొన్నవిత్తుల రామచంద్రమూర్తి
61.	2002	నా చెల్లెలు	కాణిపాకం లింగన్న
62.	2003	అతడు గాంధి	కాణిపాకం లింగన్న
63.	2003	సిటీ బ్యూటిఫుల్	పెనుమూరు కేశవరెడ్డి
64.	2005	బ్రతుకు బాట	రాసాని
65.	2005	నీరు నేల మనిషి	సుంకోజి దేవేంద్రాచారి

66.	2005	స్రవంతి	సి.ఎస్. చంద్రశేఖర్
67.	2006	అతడే హీరో	సి.ఎస్. చంద్రశేఖర్
68.	2006	కొత్త బంగారు లోకం	టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి
69.	2007	చండాలుడు	కరణం బాలసుబ్రహ్మణ్యం
70.	2007	దొంగలు బాబోయ్ దొంగలు	రాచపూటి రమేష్
71.	2008	పచ్చగా నూరేళ్ళు	లంకిపల్లి కన్నయ్య నాయుడు
72.	2008	మునెమ్మ	పెనుమూరు కేశవరెడ్డి
73.	2008	రెక్కాడినంత కాలం	సుంకోజి దేవేంద్రాచారి
74.	2008	నేల నవ్వింది	పలమనేరు బాలాజీ
75.	2009	కలువ విరిసింది	టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి
76.	2009	జీవ కోన	లంకిపల్లి కన్నయ్య నాయుడు
77.	2009	అజ్ఞాత పర్వం	రాచపూటి రమేష్
78.	2009	ఈ తప్పెవరిది?	శైలజామిత్ర
79.	2010	తొలి సంధ్య	లంకిపల్లి కన్నయ్య నాయుడు
80.	2010 చతుర	మర్రిమాను సాక్షిగా	కరణం బాలసుబ్రహ్మణ్యం
81.	2011	అనన్య	కె.ఎస్.వి. నరసింహం (కె.ఎస్వీ)
82.	2011 (ఆంధ్రప్రభ వార 1974)	యామినీ కుంతలాలు	నాయుని కృష్ణమూర్తి
83.	2011 (స్వాతి మాస 1985)	మనసు గుర్రమురోరీ మనిషి	నాయుని కృష్ణమూర్తి
84.	2011	ఆకుపచ్చని జాబిల్లి	శైలజామిత్ర

85.	2012	ఏ నావది ఏ తీరమో	శైలజామిత్ర
86.	2012 (ఆంధ్రప్రభ వార 2003-4)	ప్రలోభం	నాయుని కృష్ణమూర్తి
87.	2012	ఏడో గ్రహం	రాసాని
88.	2012	ఒక యుద్ధం తరవాత	ఎస్. మునిసుందరం
89.	2013	చత్రపతి శివాజీ	పాటూరు రాజగోపాలనాయుడు
90.	2013	ఆంస్టర్ డాం లో అద్భుతం	మధురాంతకం నరేంద్ర
91.	2013	భూచక్రం	మధురాంతకం నరేంద్ర
92.	2013	జంగమ దేవర	జొన్నవిత్తుల రామచంద్రమూర్తి
93.	2013	బోయకొట్టములు పండ్రెండ్రు	కరణం బాలసుబ్రహ్మణ్యం
94.	2014	మూలింటామే	నామిని సుబ్రహ్మణ్యం నాయుడు
95.	2014	ముద్ర	రాసాని
96.	2015	చీకటి ముడులు	రాసాని
97.	2015	కలల రాజ్యం	టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి
98.	2015	పరస	రాసాని
99.	2015	కొండకింద కొత్తూరు	మధురాంతకం నరేంద్ర
100.	2015	మిస్సింగ్	సుంకోజి దేవేంద్రాచారి
101.	2015	అమ్మ నాన్నకు	సుంకోజి దేవేంద్రాచారి
102.	2016	మనిషి	సుంకోజి దేవేంద్రాచారి
103.	2016	జయం	నాయుని కృష్ణమూర్తి

104.	2016	ఆయుధం	టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి
105.	2016	వలస	రాసాని
106.	2017ఆంధ్ర భూమి	సాక్షాత్కారం	జొన్నవిత్తుల రామచంద్రమూర్తి
107.	2019	కాటుక కరిగిపోయింది	నాయుని కృష్ణమూర్తి
108.	2020	మనోధర్మ పరాగం	మధురాంతకం నరేంద్ర
109.	2021	వక్ర గీత	రాసాని
110.		శిలా పుష్పాలు	సి. ఉమాదేవి
111.		కేర్ టేకర్	సి. ఉమాదేవి
112.		సాగర కెరటం	సి. ఉమాదేవి
113.		బలి	ఎం.ఆర్. చంద్ర
114.		అమర దంపతులు	ఎం.ఆర్. చంద్ర
115.		రాలని పువ్వు	నక్కల ప్రభాకర రెడ్డి

అనుబంధం-2

కాలక్రమంగా చిత్తూరు జిల్లా కథలు

క్రమసంఖ్య	ప్రచురణ సంవత్సరం	కథ పేరు	రచయిత పేరు
1.	1927 (భారత కథానిధి)	శారద (కథ)	యం.వి. పాపన్న గుప్త
2.	1927 (భారత కథానిధి)	హైమావతి(కథ)	యం.వి. పాపన్న గుప్త
3.	1927 (భారత కథానిధి)	భోగపుమేళములు (కథ)	సి.ఎస్. నీల కంఠయ్యర్
4.	1928 (భారత కథానిధి)	సావిత్రి(కథ)	యం.వి. పాపన్న గుప్త
5.	1928 (భారత కథానిధి)	ఒకఆదియాంధ్రభక్తుని జీవిత చరిత్ర(కథ)	పూతలపట్టు శ్రీరాములు రెడ్డి
6.	1929 (భారత కథానిధి)	నా చిట్టితల్లి(కథ)	టి. కె. రంగస్వామి అయ్యంగార్
7.	1937 (తెనుగు తల్లి)	చంద్రికా మోహనులు(కథ)	రావూరు చంగనార్య
8.	1937 (తెనుగు తల్లి)	రాఘవేంద్రరావుగారి రాజీనామా (కథ)	టి. ఆర్మోగంపిళ్ళె
9.	1937 (తెనుగు తల్లి)	బిక్కిరింత పిదప వెక్కిరింత(కథ)	టి. ఆర్మోగంపిళ్ళె
10.	1937 (తెనుగు తల్లి)	పాపిచావు(కథ)	టి. ఆర్మోగంపిళ్ళె
11.	1961	వర్షించిన మేఘం (7)	మధురాంతకం రాజారాం
12.	1962	ప్రాణదాత (5)	మధురాంతకం రాజారాం
13.	1963	బంగారు (5)	కె. సభా (కనక సభాపతి పిళ్ళె)

14.	1965	రక్త యజ్ఞం (8)	కలువకొలను సదానంద
15.	1966	అవశేషం (పెద్దకథ / నవలిక)	మధురాంతకం రాజారాం
16.	1966	కారనభూతుడు(2)	మధురాంతకం రాజారాం
17.	1967	తాను వెలిగించిన దీపాలు (8)	మధురాంతకం రాజారాం
18.	1967	అబలలూ అనుమానాలు (12)	కె. ఆర్. రెడ్డి
19.	1968	కమ్మ తెమ్మెర (14)	మధురాంతకం రాజారాం
20.	1968	కళ్యాణకింకిణి(10)	మధురాంతకం రాజారాం
21.	1968	తాను వెలిగించిన దీపాలు	మధురాంతకం రాజారాం
22.	1968	వక్రగతులు ఇతరకథలు (7)	మధురాంతకం రాజారాం
23.	1968	పునర్నవం(10)	మధురాంతకం రాజారాం
24.	1968	పైరుగాలి (10)	కలువకొలను సదానంద
25.	1969	పాతాళగంగ (10)	కె. సభా (కనక సభాపతి పిళ్ళై)
26.	1969	మధురాంతకం రాజారాం కథలు	మధురాంతకం రాజారాం
27.	1972(ఆంధ్రజ్యోతి– వార, దీపావళి)	పందెం	నూతలపాటి గంగాధరం
28.	1974	పల్స్ ఆఫ్ రోడ్ (కథ)	పి. కేశవరెడ్డి
29.	1975	రేపటి ప్రపంచం (12)	మధురాంతకం రాజారాం
30.	1975	నవ్వేపెదాలు ఏడ్చేకళ్లు (12)	కలువకొలను సదానంద
31.	1977	వగపేటికి ?(6)	మధురాంతకం రాజారాం
32.	1978	వినోద ప్రదర్శన	మధురాంతకం రాజారాం
33.	1981	నీటి దీపాలు (15)	కె. సభా (కనక సభాపతి పిళ్ళై)
34.	1981	పులికంటి కృష్ణారెడ్డి కథలు (7)	పులికంటి కృష్ణారెడ్డి
35.	1982	గూడుకోసం గువ్వలు (10)	పులికంటి కృష్ణారెడ్డి
36.	1982	పార్థసారథి కథలు (6)	సగరం పార్థసారథి

37.	1983	కోటిగాడు స్వతంత్రుడు (10)	పులికంటి కృష్ణారెడ్డి
38.	1985	పచ్చనాకు సాక్షిగా (31)	నామిని సుబ్రమణ్యం నాయుడు
39.	1985	అరగొండ నుంచి అమెరికా(13)	గల్లా అరుణకుమారి
40.	1987	సిబ్బన్న కథలు(23)	నామిని సుబ్రమణ్యం నాయుడు
41.	1990	మిట్టూరోడి కథలు (24)	నామిని సుబ్రమణ్యం నాయుడు
42.	1991	జీవనం(10)	లంకిపల్లె కన్నయ్య నాయుడు
43.	1993	పాంథశాల(12)	మధురాంతకం రాజారాం
44.	1993	దేవరదున్న (15)	వారాల కృష్ణమూర్తి
45.	1994	పాంథశాల	మధురాంతకం రాజారాం
46.	1994	హాలికులు కుశలమా!(19)	మధురాంతకం రాజారాం
47.	1995	జీవితానికి నిర్వచనం (30)	మధురాంతకం రాజారాం
48.	1995	కూనలమ్మ కోన (11)	మధురాంతకం రాజారాం
49.	1995	రంగురంగుల చీకటి (16)	కలువకొలను సదానంద
50.	1996	వేగుచుక్క(14)	యం.ఆర్. అరుణకుమారి
51.	1998	మిస్ శ్రీరంగపట్నం	కాశీనాథ విశ్వం
52.	1998	కనిపించని కోయిల(14)	మధురాంతకం మహేంద్ర
53.	1999	కుంభమేళ (13)	మధురాంతకం నరేంద్ర
54.	1999	నల్లగుర్రపు నాడా (1)	సౌదా (పబ్బు కరుణానిధి)
55.	2000	పులికంటి దళిత కథలు (18)	పులికంటి కృష్ణారెడ్డి
56.	2001	మలుపులు (16)	కె.ఎస్. రమణ
57.	2001	అపూర్వ పురాణ కథలు (14)	సౌదా (పబ్బు కరుణానిధి)
58.	2001	చిన్ని గుండెల చప్పుళ్ళు ★ (31)	సి. ఉమాదేవి
59.	2002	ఆకాశంబున నుండీ (15)	సి.హెచ్. వెంకటరత్నం(ద్వారకా)
60.	2003	పులికంటి కథావాహిని (72)	పులికంటి కృష్ణారెడ్డి
61.	2003	టి. ఎస్. ఎ కృష్ణమూర్తి	టి. ఎస్. ఎ కృష్ణమూర్తి

		కథలు (14)	
62.	2003	సాగరకోయిల(20)	యం.ఆర్. అరుణకుమారి
63.	2004	వసుంధరాదేవి కథలు (49) (గాలిరథం, నీడలు రెండు సంపుటాలు ఇతర కథలు)	ఆర్. వసుందరాదేవి
64.	2004	కనులు మాటలాడునని	సి.ఎస్. చంద్రశేఖర్
65.	2004	నీకోసమే	సి.ఎస్. చంద్రశేఖర్
66.	2005	అస్తిత్వానికి అటూ ఇటూ (9)	మధురాంతకం నరేంద్ర
67.	2005	మెరవణి	వి.ఆర్. రాసాని
68.	2005	ఊటీలో ఓ సాయంత్రం (16)	సి.ఎస్. చంద్రశేఖర్
69.	2005	భారతం బొమ్మలు (7)	గోపిని కరుణాకర్
70.	2005	తరంగాలు	శైలజామిత్ర
71.	2005	ముళ్ళదోవ (15)	ఎం.కె. దేవకి
72.	2006	అడ్డదారులు (9)	టి. ఎస్. ఎ కృష్ణమూర్తి
73.	2006	మల్లి రేకు (9)	వేంపల్లి అబ్దుల్ ఖాదర్
74.	2006	మన్నులో మన్నునై	యం.ఆర్. అరుణకుమారి
75.	2007	మాట్లాడని మల్లెమొగ్గలు	సగరం పార్థసారథి
76.	2007	బతుకుమాట(10)	లంకిపల్లె కన్నయ్య నాయుడు
77.	2007	పయనం (17)	వి.ఆర్. రాసాని
78.	2007	నీ మనసు నాకు తెలుసు	సి.ఎస్. చంద్రశేఖర్
79.	2007	అన్నం గుడ్డ(13)	సుంకోజి దేవేంద్రాచారి
80.	2007	గాలి గోపురం (15)	రాచపూటి రమేష్
81.	2007	వాళ్ళిద్దరూ... ఇంకా కొందరు	ఎ. పుష్పాంజలి
82.	2007	మాట్లాడని మల్లెమొగ్గ (11)	సనగరం పార్థసారథి
83.	2008	మన్నించుమా ప్రియ	సి.ఎస్. చంద్రశేఖర్
84.	2008	అందమైన అబద్దం (15)	రాచపూటి రమేష్
85.	2008	ది డెత్ ఆఫ్ లాస్ట్ ఇండియన్(16)	జొన్నవిత్తుల శ్రీ రామచంద్రమూర్తి
86.	2009	వల్లంపాటి కథలు (35)	వల్లంపాటి వెంకటసుబ్బయ్య
87.	2009	స్వాతిముత్యం (14)	సి.ఎస్. చంద్రశేఖర్

88.	2009	గదిలోపల గోడ (19)	కె.ఎన్. పలమనేరు బాలాజి (వాకాటి నాగయ్య బాలాజీ)
89.	2010	కె. సభా ఉత్తమ కథలు (25)	కేతు విశ్వనాథ రెడ్డి (సంపా)
90.	2010	ఈ గాలి నాది – ఈ నీల నాది (10)	టి. ఎస్. ఎ కృష్ణమూర్తి
91.	2010	రెండేళ్ళ పద్నాలుగు (13)	మధురాంతకం నరేంద్ర
92.	2010	అమ్యూజింగ్(19)	ఎ. పుష్పాంజలి
93.	2011	ఘటోద్గజపురం గాథలు (11)	టి. ఎస్. ఎ కృష్ణమూర్తి
94.	2011	బిడ్డలు	వేంపల్లి అబ్దుల్ ఖాదర్
95.	2011	నాయుని కృష్ణమూర్తి కథలు (16)	నాయుని కృష్ణమూర్తి
96.	2011	జవాబు తెలియని వాడు (12)	ఎస్. మునిసుందరం
97.	2011	దృశ్యాలు మూడు..ఒకఆవిష్కరణ(13)	సుంకోజి దేవేంద్రాచారి
98.	2011	నిర్ణయం(15)	రాచపూటి రమేష్
99.	2011	నిశ్శబ్దసంకేతం (17)	వారాల కృష్ణమూర్తి
100.	2012	దృశ్యకావ్యం(15)	టి. ఎస్. ఎ కృష్ణమూర్తి
101.	2012	మా ఊరి కథలు	వి.ఆర్. రాసాని
102.	2012	అడ్డా	శైలజామిత్ర
103.	2013	టి. ఎస్. ఎ కథ 2012	టి. ఎస్. ఎ కృష్ణమూర్తి
104.	2013	సిక్కేంటిక(15)	జిళ్ళేళ్ళబాలాజి
105.	2013	వలయం	రాచపూటి రమేష్
106.	2014	నవ్విన ధాన్యరాశి (20)	సి. వేణు
107.	2014	టి. ఎస్. ఎ కథ 2013 (5)	టి. ఎస్. ఎ కృష్ణమూర్తి
108.	2014	ఏం లేదు) (14)	నాయుని కృష్ణమూర్తి
109.	2014	ట్రాఫిక్ జామ్	ఎస్. మునిసుందరం
110.	2014	చిగురించే మనుషులు ★ (20)	కె.ఎన్. పలమనేరు బాలాజి (వాకాటి నాగయ్య బాలాజీ)
111.	2014	నా వాళ్ళు(27)	లక్ష్మీరాఘవ

112.	2014	ఈ కథకి శిల్పం లేదు (16)	జొన్నవిత్తుల శ్రీ రామచంద్రమూర్తి
113.	2015	టి. ఎస్. ఎ కథ 2014 (9)	టి. ఎస్. ఎ కృష్ణమూర్తి
114.	2015	వెదురుపువ్వు (16)	మధురాంతకం నరేంద్ర
115.	2015	పాఠాంతరం (1)	మధురాంతకం నరేంద్ర
116.	2015	మృత్యు క్రీడ(ప్రకృతి వైపరీత్య కథలు)(4)	వి.ఆర్. రాసాని
117.	2016	పరాగ భూమి (20)	కలువకొలను సదానంద
118.	2016	ములుగర్ర (21)	వి.ఆర్. రాసాని
119.	2016	వొంతు (భావోద్వేగ కథలు)(15)	జిళ్ళేళ్ళబాలాజి
120.	2017	విషప్పురుగు (13)	వి.ఆర్. రాసాని
121.	2017	రాగాల రహస్యం	రాచపూటి రమేష్
122.	2018	ఆర్.ఎస్. సుదర్శనం కథలు (17)	ఆర్.ఎస్. సుదర్శనం
123.	2018	ఒక సాయంత్రం త్వరగా ఇల్లు చేరినప్పుడు (12)	కె.ఎన్. పలమనేరు బాలాజి (వాకాటి నాగయ్య బాలాజీ)
124.	2019	మెతుకు (14)	వేంపల్లి అబ్దుల్ ఖాదర్
125.	2019	సి. ఉమాదేవి కథలు (24)	సి. ఉమాదేవి
126.	2022	మట్టి పొయ్యి	తుమ్మల రామకృష్ణ
127.		సుఖాలతీరం (15)	సి.హెచ్. వెంకటరత్నం(ద్వారకా)
128.		పరిష్కారం (12)	కాశీనాథ విశ్వం
129.		తొలకరి వానకు తడిసిన గుండె (9)	లంకిపల్లె కన్నయ్య నాయుడు
130.		నాలుగుకాళ్ల మండపం (31)	మధురాంతకం నరేంద్ర
131.		తిరుపతి కొండకథలు	గోపిని కరుణాకర్
132.		దీపంచెప్పిన కథలు	గోపిని కరుణాకర్
133.		ఒక మేఘం కథ (18)	సుంకోజి దేవేంద్రాచారి
134.		మంటల ఒడిలో (10)	ఎం.కె. దేవకి

అనుబంధం–3

సర్టిఫికెట్స్



DEPARTMENT OF TELUGU
MADURAI KAMARAJ UNIVERSITY
MADURAI - 625021 TAMILNADU

INTERNATIONAL WEBINAR ON

Telugu Katha - Vasturupa Vaividhyam

7th & 8th September, 2020

Certificate

This is to certify that ***Ankireddy Sunilkumar Reddy,*** *Reserch Scholar, Dept. of Telugu, University of Hyderabad* actively participated and presented a paper titled *'Chitturu Jilla Tolitharam Kathalu – Vasthu Vishleshana'* in the two days International Webinar on ***'Telugu Katha - Vasturupa Vaividhyam'*** organized by the Department of Telugu, School of Indian Languages, Madurai Kamaraj University, Madurai, Tamilnadu held on 7th & 8th September, 2020.

Dr. J. Venkataramana
CONVENER

Dr. V.S. Vasantha
REGISTRAR i/c

DEPT. OF TELUGU & COMP.LIT. MADURAI 625 021 M.K.U

శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల

కరీంనగర్, తెలుగు శాఖ

(NAAC 'A' Grade, ISO 9001:2015) మరియు

మద్రాస్ విశ్వ విద్యాలయం

చెన్నై, తెలుగు శాఖ

తెలుగు కథ - సమకాలీనత అంతర్జాతీయ అంతర్జాల సదస్సు

ధ్రువీకరణ పత్రము

శ్రీయుత/శ్రీమతి/కుమారి/డా॥./ఉపన్యాసకులు/ఉపాధ్యాయులు/ఆచార్యులు/సహాయాచార్యులు/పరిశోధక విద్యార్థి అంకిరెడ్డి సునీల్ కుమార్ రెడ్డి కథ - సమకాలీనత అనే అంశం మీద 2021 జూలై 02 , 03 వ తేదిలలో నిర్వహించిన సదస్సులో విషప్పురుగు' కథలు - గిరిజన, సంచార తేగల జీవన చిత్రణ అనే అంశం మీద పత్ర సమర్పణ చేసారని ధ్రువీకరించనైనది.

సదస్సు గౌరవ అధ్యక్షులు	సదస్సు నిర్వాహకులు	సదస్సు సంచాలకులు	సదస్సు అధ్యక్షులు
(ఆచార్య విస్తాలి శంకర రావు)	(డా.పి.విశ్వప్రసాదు)	(డా.కె.మల్లారెడ్డి)	(డా.కె.రామకృష్ణ)
అధ్యక్షులు తెలుగు శాఖ			ప్రిన్సిపల్
మద్రాస్ విశ్వ విద్యాలయం			ఎస్ఆర్ఆర్ కళాశాల



V S R & N V R COLLEGE,TENALI

(Autonomous)-Re Accredited by NAAC

Affiliated to Acharya Nagarjuna University,Guntur

DEPARTMENT OF TELUGU

CERTIFICATE OF APPRECIATION

This is to Certify that ANKIREDDI SUNIL KUMAR REDDY of University of Hyderabad has presented a paper entitled మీడియా వలలో పడ్డ యువతరం భవిష్యత్తుకు నిలువుటద్దం 'ప్రలోభం' నవల in the International Webinar on "TELUGU SAHITYAM -- SAMAKALEENATA" Organized by the Department of Telugu, V S R & N V R College Tenali,Guntur(Dt)-522 201 on 24th & 25th August 2020.

K V Padmavathi
Vice -Principal
& Convener

DBABEC-CE000138

Sri S Niranjanarao
Principal & Chairman

అనుబంధం–4

వ్యాసాలు


RNI No. APTEL/2003/12253
భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study
Vol : 19 Issue No. 3 Monthly March 2022 ISSN No. : 2456-4702 Rs. : 15/-
ఆశావాది ప్రకాశరావు

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 19 - Issue. 3 - March 2022 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-

EDITORIAL BOARD

Chief Editor

PITTA SANTHI

M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,

C/o. Dr. Busi Venkataswamy

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Dept. of Telugu,
   Sri Padmavathi Mahila University,
   Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   HOD & Research Guide, Dept. of Telugu
   PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
   Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
   HOD, Dept. of Telugu,
   Govt. Degree College, Puttur, Chittor Dist.

ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   HOD, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor, Dept.of Hindi,
   Moulana Azad National Urdu University,
   HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
   Board of Studies Chairman,
   Telangana University, Dichpally,
   Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
   Dept. of Telugu & O.L.,
   Acharya Nagarjuna University,
   Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Kakatiya University, Warangal District.
   Telangana.

7. **Dr. J. VENKATARAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole', Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A, M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

LEGALADVISER

Dr. A. GURAVAIAH, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

DTP & PRINTING

TENALI PRAKASH, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

Contents (విషయ సూచిక)

1. చిత్తూరు జిల్లా తొలితరం కథలు - వస్తు విశ్లేషణ	- అంకిరెడ్డి సునీల్ కుమార్ రెడ్డి	6
2. భూమిపుత్రి నవల - దుర్గ పాత్ర చిత్రణ	- బి. శ్రీదేవి డా॥. డి. యువశ్రీ	11
3. పద్మ పురస్కార గ్రహీతలు తెలుగు సాహిత్యానికి చేసిన కృషి - విశ్లేషణ	- చింతరెడ్డి భాస్కర్ రెడ్డి	13
4. తెలంగాణా పాటల్లో స్త్రీ జీవితం	- డా॥. డి. రాంబాబు	19
5. లంబాడీల ఆరాధ్య దైవం - అరుదైన ఆరాధన విధానం	- డా॥. బి. సరస్వతి	22
6. కరోనా కల్లోలం నేపథ్యంగా వెల్లువెత్తిన కవిత్వం	- డా॥. చింతల రాకేశ్ భవాని	26
7. మూడు తరాల సబ్బండ సోయి 'అడపం' కథలు	- డా॥. చింతం ప్రవీణ్ కుమార్	30
8. "రాయలసీమ సంస్కృతి - ఒక పరిశీలన"	- డా॥. డి. సహదేవుడు	38
9. రాలిపోయిన దళిత వేగు చుక్క	- డా॥. గైని రవి	42
10. గురజాడవారి పుత్తడిబొమ్మ పూర్ణమ్మ	- డా॥. గెంజి అరుణ	46
11. వైవిధ్యభరిత మానవ సంబంధాల సమాహారం 'విహారి' కథా సాగరం	- డా॥. ఎం. హరికృష్ణ	49
12. భాష ప్రధాన లక్షణాలు - ఆధునిక భాషాశాస్త్రంలోని పదాంశ విజ్ఞానం	- డా॥. యం. ప్రసాద్ నాయక్	54
13. డా॥సి.నారాయణరెడ్డి సినీగీతాలు - జానపద సాహిత్యంతో ...	- డా॥. యం. వెంకటలక్ష్మమ్మ	61
14. అమెరికా తెలుగు కథానిక - వస్తు వైవిధ్యం	- డా॥. ఎన్. ఈశ్వరరెడ్డి	66
15. జోగిని వ్యవస్థను ప్రతిబింబించిన అపూర్వ నవల	- డా॥. ర్యాగట్ల సాయిలక్ష్మీ	74
16. ప్రాచీన ఒరియా సాహిత్యంపై భక్తి ఉద్యమ ప్రభావాలు	- డా॥. పళని	77
17. కట్ట బ్రహ్మన చరిత్రము - దేశభక్తి కావ్యం	- డా॥. పి. విశ్వప్రసాదు	83
18. ప్రజాకవి సుంకర సత్యనారాయణ సాహిత్యోద్యమం	- పాత శ్రీనివాసరావు	89
19. ప్రవాసంలో తెలుగువారు - ఆశలు అక్కరలు - బాధ్యతలు	- ఆచార్య కొలకలూరి మధుజ్యోతి	92
20. ఆంధ్రకవయిత్రులు - కవితా దృక్పథం	- డా॥. డి. ఉదయకుమారి	102
21. కొండేపూడి నిర్మల 'హక్కు' కథానిక - పరిశీలన	- డా॥. జి. పార్వతి	107
22. శ్రీశ్రీ 'కవితా! ఓ కవితా!' - భాషా వైదుష్యం	- డా॥. మానమ మునిరత్నం	111
23. కథా నేపథ్యంగా తెలుగుభాష - సంస్కృతి - ప్రపంచీకరణ ప్రభావం	- డా॥. వి. శాంతిలక్ష్మి	116
24. తెలంగాణ వెతలే... కథలై - సమాలోచనం	- బి. సునీత	119
25. డిగ్రీ స్థాయిలో ద్వితీయ భాషగా తెలుగు బోధనా లక్ష్యాలు..	- గుత్తి కొండ చంద్రకళ	123
26. నల్లగొండ కథ - వస్తు వైవిధ్యం	- దర్శనం ప్రకాశం	128

27. శ్రీమతి సూర్యా ధనుంజయ్ కథల్లో మానవ జీవన చిత్రణ	- ధనావత్ పద్మ	131
28. "భారతం"లో స్త్రీ	- రమాదేవి ఇడికూడ	139
29. పెన్నా శివరామకృష్ణ సాహిత్యేతర రచనలు - అధ్యయనం	- ఐ.చిదానందం	142
30. కడప జిల్లా కథలు - స్థానికత	- యం. రాణి - డా॥. డి.యువశ్రీ	146
31. సురభి నాటకరంగం - సాంకేతిక వ్యవస్థ	- రేకందార్ నిరుపమ సునేత్రి	148
32. పాటల మధుశాల సీనియర్ సముద్రాల	- తిరునగరి శరత్ చంద్ర	152
33. A Role of International Day of Yoga in the World	- B. Venkateshwarlu	156
34. Ravana : The Hero of Lanka	- Dr. Nilachal Mishra	162
35. Tagore's Views on Education	- Dr. S. Hemalatha	167
36. Feminism in the Novels of R.K.Narayan ...	- Sahithi Modugula	170
37. Horrors of History-Violence-Victimisation of Women in..	- D. Kavitha & - Prof. M. Neeraja	178
38. Foundational principles for the Kcântipâramitâ or Tolerance	- Dr. Mai Ram	182
39. *Jai Bhim* : An Unremitting Discourse on Dalit and Tribal Identity	- Jai Shri Jain	186

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

చిత్తూరు జిల్లా తొలితరం కథలు - వస్తు విశ్లేషణ

- అంకిరెడ్డి సునీల్ సుమూర్ రెడ్డి, పరిశోధక విద్యార్థి, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

తెలుగులో ఆధునిక కథానిక అన్ని లక్షణాలతో గురజాడ రాసిన 'దిద్దుబాటు' (1910) కథతో మొదలైంది అని వల్లంపాటి వెంకట సుబ్బయ్య, పోరంకి దక్షిణామూర్తి, ప్రోలాప్రగడ సత్యనారాయణ మూర్తి, వేదగిరి రాంబాబు లాంటి వాళ్ళు చెప్పారు. అయితే గురజాడ కంటే ముందు కథలు రాసినవాళ్ళు ఉన్నారంటూ భండారు అచ్చమాంబ కథలను, ఆచంట వేంకట సాంఖ్యాయనశర్మ కథలను, వెదురుమూడి శేషగిరిరావు కథలను ప్రతిపాదిస్తూ పురిపండా అప్పలస్వామి, రాయసం వెంకటశివుడు, అక్కిరాజు రమాపతిరావు, ఆరుద్ర లాంటి వారు తొలి తెలుగు కథపై చర్చను లేవదీశారు. ఈ చర్చ జరుగుతుండగానే వివినమూర్తి 2015లో దిద్దుబాటులు పేరుతో గురజాడ దిద్దుబాటు కథ కంటే ముందు వచ్చిన 92 కథలతో ఒక సంకలనాన్ని తెచ్చిన విషయం అందరికీ తెలిసినదే. అయితే లక్ష్య లక్షణ సమన్వయ దృష్టితో చూస్తే పైకథలన్నీ ఆధునిక కథానికకు ఉండవలసిన లక్షణాలతో ఉన్నాయా అన్న ప్రశ్న మనకు జనిస్తుంది. దీనికి వివినమూర్తి గారు ఇచ్చిన సమాధానం "స్వరూప, స్వభావ చర్చలోకి దిగకుండా, 1910 జనవరి-ఫిబ్రవరి ఆంధ్రభారతి తొలి సంచికలో వచ్చిన దిద్దుబాటుకి ముందుగా పత్రికలు ముద్రించిన కథలు లేదీల వారీగా ఒక క్రమంలో ఉంచటానికి ప్రయత్నించాను. ఇవి కథలుగా అనడానికి పాటించిన ప్రమాణాలివి. 1. కథ నిడివి. 2.కథగా పత్రికలు అనడం. 3. సంభాషణల రూపంలో చాలా ఉన్నాయి. వాటిని కథలన్న ఉద్దేశంతోనే రాశారు కాని ప్రదర్శన నిమిత్తం రాయలేదు. కనుక వాటిని కథలుగా తీసుకున్నాను" (దిద్దుబాటులు ముందుమాట) అంటారు. ఈ విషయం ఇక్కడ ఎందుకంటే చిత్తూరు జిల్లా తొలితరం కథలు దిద్దుబాటుకు తరవాత వచ్చినప్పటికీ కొన్ని కథలు సంభాషణల రూపంలో ఉండడం, వాడుక భాషకు బదులు గ్రాంథిక భాషలో ఉండడం వల్ల వాటిని ఆధునిక కథానికలు అనవచ్చా అని సందేహం వచ్చి. దీనికి వినినయ్యూర్తి గారిచ్చిన పై వివరణను చిత్తూరు జిల్లా తొలితరం కథలకు నేను అనువర్తింపచేస్తూ వాటిని కథానికలుగా పరిగణిస్తూ అందులోని వస్తు వైవిధ్యాన్ని విశ్లేషించడం ఈ వ్యాసం ఉద్దేశ్యం.

ఈ చర్చ పక్కన పెడితే ఇలాంటి చర్చే రాయలసీమ తొలి కథ ఏది, రాయలసీమ తొలి కథా రచయిత ఎవరనే విషయాలపై కూడా ఉంది. 1941లో విజయవాణి పత్రికలో వచ్చిన 'చిరంజీవి' కథ తొలి రాయలసీమ కథ అని, దీనిని రాసిన గుత్తి రామకృష్ణ (అనంతపురం) రాయలసీమ తొలి కథా రచయిత అని వల్లంపాటి వెంకట సుబ్బయ్య, రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, వేంపల్లి గంగాధర్, శశిశ్రీ లాంటివారు చెప్పారు. అలాగే ఏప్రిల్ 1944 చిత్రగుప్త పత్రికలో వచ్చిన 'కడగండ్లు' కథ తొలి రాయలసీమ కథ అని, దీనిని రాసిన కె. సభాను(కనక సభాపతి పిళ్ళై) (చిత్తూరు) రాయలసీమ తొలి కథా రచయిత అని మధురాంతకం రాజారాం, సింగమనేని నారాయణ, వేదగిరి రాంబాబు లాంటి వారు చెప్పారు. అయితే ఇటీవల ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమాల నేపథ్యంలో జరిగిన పరిశోధనల ఫలితంగా తొలి తెలుగు కథ విషయంలో మార్చుకోవాల్సిన అభిప్రాయాలలాగా పై అభిప్రాయాలను కూడా మార్చుకోవలసి వస్తుంది.

ఏవిధంగా అంటే మొన్న మొన్నటి వరకూ కె. సభానే చిత్తూరు జిల్లా తొలి కథా రచయిత అనుకున్నాం. అయితే ఇటీవల రాయలసీమ కథా సాహిత్యంపై ప్రాంతీయ అస్తిత్వ నేపథ్యంలో తవ్వా వెంకటయ్య 'భారతకథానిధి' అనే పత్రికపైన, అప్పిరెడ్డి హరినాథరెడ్డి 'జనవినోదిని', 'హిందూసుందరి', 'సౌందర్యవల్లి', 'శారద', 'శ్రీ సాధన',

'తెనుగుతల్లి', 'విజయవాణి', 'చిత్రగుప్త' పత్రికలపైన చేసిన పరిశోధనల ఫలితంగా లభించిన ఆధారాల మేరకు చిత్తూరు జిల్లాలో సభ కంటే ముందే కథలు వచ్చాయని తెలుస్తోంది. పై పత్రికల్లో సేకరించిన కథలను 'రాయల సీమ తొలితరం కథలు' (తవ్వా వెంకటయ్య), 'మొదటి తరం రాయలసీమ కథలు' (అప్పిరెడ్డి హరినాథరెడ్డి) అనే పేర్లతో వెలువరించారు. వీటితో పాటూ తప్పెట రామప్రసాద రెడ్డి సంపాదకత్వంలో 'భారతకథానిధి' పత్రికలో లభించిన మరికొన్ని కథలను 'సీమ కథా శిలాజాలు' అనే పేరుతో కూడా ప్రచురించారు. ఈ మూడు గ్రంథాలలో చిత్తూరు జిల్లాకు సంబంధించిన వది కథలు లభిస్తున్నాయి. ఈ మూడు సంకలన గ్రంథాలలో లేని చిత్తూరు జిల్లాకు సంబంధించిన మరొక కథ (సావిత్రి) కూడా భారతకథానిధి (1928 మార్చ్) పత్రికలో నేడు లభ్యమవుతున్నది.

ఈ పదకొండు కథలు భారతకథానిధి, తెనుగుతల్లి పత్రికల్లో వచ్చాయి. వాటి వివరాలు చూస్తే శారద (1927 జనవరి, భారతకథానిధి), హైమావతి (1927 సెప్టెంబర్, భారతకథానిధి), సావిత్రి (1928 మార్చ్, భారతకథానిధి) అనే కథలను యం.వి. పాపన్న గుప్తబీ ప్రేమానుబంధం (1927 జూలై భారతకథానిధి) అనే కథను చింతా నరసింహారెడ్డిబీ భోగపుమేళములు (1927 డిసెంబర్ భారతకథానిధి) అనే కథను సి.యస్. నీలకంఠయ్యర్‌బీ ఒక ఆదియాంధ్ర భక్తుని జీవిత చరిత్ర (1928 డిసెంబర్ భారతకథానిధి) అనే కథను పూతలపట్టు శ్రీరాములురెడ్డిబీ నా చిట్టితల్లి (1929 నవంబర్ భారతకథానిధి) అనే కథను టి.కె. రంగస్వామి అయ్యంగార్‌బీ చంద్రికా మోహనులు (1937 ఆగస్టు తెనుగుతల్లి) అనే కథను రావూరు చంగనార్యబీ రాఘవేంద్రరావు గారి రాజినామా (1937 సెప్టెంబర్ తెనుగుతల్లి), బిక్కిరింత పిదప వెక్కిరింత (1937 నవంబర్ తెనుగుతల్లి), పాపి చావు (1937 డిసెంబర్ తెనుగుతల్లి) అనే కథలను ఆర్మొగం పిళ్ళె రాశారు.

దీనిని బట్టి చూస్తే తెలుగు కథానిక 1910 (దిద్దు బాటు) నుండి 1879కి (చిలుకను గురించిన సంభాషణ) ఏవిధంగా చేరిందో అదేవిధంగా చిత్తూరు జిల్లా కథ కూడా 1944 (కడగండ్లు) నుండి 1927కి (శారదా) చేరింది. 1927 భారతకథానిధి మాస పత్రికలో ప్రచురితమైన 'శారద' కథే చిత్తూరు జిల్లా మొదటి కథ. దీని రచయిత యం. వి. పాపన్న గుప్త. ఈయనే చితూరు జిల్లా మొదటి కథా రచయిత అని కూడా నిస్సంకోచంగా చెప్పవచ్చు.

సభా కంటే ముందు చిత్తూరు జిల్లా తొలితరం కథలుగా లభిస్తున్న ఈ పదకొండు కథలూ తనదైన ప్రత్యేకతని కలిగి ఉంటూ, మూఢ నమ్మకాలను, భోగపుమేళ వ్యవస్థను, దళిత జీవిత చిత్రణను, సామాజిక పరమైన సమస్యలను, ఆర్థికపరమైన సమస్యలను చిత్రించిన కథలుగా కనిపిస్తాయి.

చిత్తూరు జిల్లా తొలి కథైనటువంటి శారద కథ మూఢనమ్మకాలను, సాంప్రదాయాలను విపరీతంగా పాటించే కృష్ణారావు చివరికి తన ప్రాణాలను కూడా వాటికోసం బలి తీసుకోవడం తెలియజేస్తుంది. రజస్వల అయి ఒక సంవత్సరం అయినప్పటికీ చెడ్డ నక్షత్ర కాలంలో తన కోడలు శారదను తమ ఇంటికి తీసుకురాకూడదని, కనీసం భార్యా భర్తలు ఒకరినొకరు చూసుకోడానికి కూడా శాస్త్రం ఒప్పుకోదని కొడుకైన ప్రసాదరావును ఒక సంవత్సరం నుండి అత్తవారింటికి కూడా పంపకుండా ఉంటాడు. ప్రసాదరావు ఆంగ్ల విద్యను అభ్యసించి, తహసీలుదారుగా ఉద్యోగం రావడంతో ఉన్న ఊరు నుండి వేరే ఊరికి వెళ్ళవలసి వస్తుంది. శారదపైనే ధ్యాస ఉన్న ప్రసాదరావు, పెద్దవారు చెప్పే మూఢాచారాల కోసం నా సంతోషాలను పాడుచేసుకోవాలా అని తండ్రికి చెప్పకుండా తన భార్యను అత్తవారింటి నుండి కాపురానికి తెచ్చుకుంటాడు. ఈ విషయం తెలిసిన కృష్ణారావు శాస్త్ర విరుద్ధంగా తన మాటకి ఎదురుగా కొడుకు చేసిన పనికి కోపగించుకొని ఒక ఉత్తరం రాస్తూ "తనయా! లేక లేక కలిగిన వాడవే యయినను దుష్కర్ముడగుటచే నిన్ను

విసఖించుకున్నాడను. ఇక నీగతినీది. నాగతి నాది. లోకనింద పడజాలను. గాన నేను పాషానమును గొని యీలోకమును, బాయుచున్నాడను" (రాయలసీమ తొలితరం కథలు, పుట 59) అంటూ తన తల్లిని కూడా తన దగ్గరకు పోకుండా నిర్బంధం ఆంక్షలను పెట్టి, "నీ శ్రేయస్సును గోరక, వంశక్షయ మగునట్లు మీరు నిస్సంతులై యుండునట్లు, నా కడబటి యాశీస్సు నిచ్చి వెళ్ళుచున్నాను" (రాయలసీమ తొలితరం కథలు, పుట 59) అంటూ ఆత్మహత్య చేసుకుంటాడు.

యం.వి. పాపన్న గుప్త ఈ కథలో తిరోగమన భావాలతో సమాజాన్ని వెనక్కి నడిపించే మూఢ నమ్మకాలను, శాస్త్ర సంప్రదాయాలను పాటించే వారికి ప్రతీకగా కృష్ణారావు పాత్రను, ఈ పూర్వాచార పరాయణత్వాన్ని విస్మరించి తమ పనులను చక్కపెట్టుకొనే వారికి ప్రతీకగా కృష్ణారావు కొడుకు ప్రసాదరావు పాత్రను ఆధారంగా చేసుకొని కథను నడిపిస్తాడు. ఈ కథను మనం బాగా గమనించినట్లైతే చిత్తూరు జిల్లా మొదటి కథ ప్రారంభ కాలంలోనే సమాజాన్ని పట్టి పీడిస్తున్న మూఢనమ్మకాలపై ఒక రకమైన తిరుగుబాటుతో వచ్చిందని చెప్పవచ్చు.

భోగపుమేళాల ప్రభావం నాటి సమాజం పైన ఎంత బలంగా ఉందో తెలియజేస్తూ సి. ఎస్. నీలకంఠయ్యర్ రాసిన కథ 'భోగపు మేళములు'. ఇందులో సత్యసాధనుడు ఎంత చెప్పినా వినకుండా భోగపుమేళాలు లేని పెండ్లి ఒక పెండ్లేనా అంటూ పట్టు బట్టి తన వియ్యంకుడి చేత తన కొడుకు జగన్నాధము పెళ్ళిలో భోగపుమేళాలు పెట్టిపిస్తాడు సోమసుందరుడు. దీని పర్యవసానం జగన్నాధము వేశ్య లోలత్వంలో పడి తన భార్యను వదిలేసి ఆస్తినంతటినీ విలాసాలకు ఖర్చు చేయడం మొదలు పెడతాడు, ఇది చూసి సోమసుందరుడు వియ్యంకుడు చెప్పిన మాటలను పట్టించుకోనందుకు తనని తాను నిందించుకుంటాడు. ఇది ఈ కథలోని సారాంశం.

ఈ కథలో రచయిత భోగపుమేళాల ప్రభావం నాటి సమాజం పైన ఎంత బలంగా ఉందో తెలియజేస్తూనే, వేశ్యలు ఉన్నంతకాలం ఈ భోగపుమేళాలను ఆపలేమని, ఒక పక్క సంఘసంస్కర్తలు పడపు వృత్తి చేసుకునే వారి ఇండ్లకు వెళ్లి, పడపు వృత్తి మానుకొని వివాహాలు చేసుకోమని శతవిధాలుగా చెప్తున్నప్పటికీ వెయ్యిలో ఒక్కరు కూడా మారడంలేదని తన మనసులోని ఆలోచనల పరంపరను, ఆనాటి సమాజపు తీరును, తనకు గల సంఘసంస్కరణ అభిలాషను మన ముందు ఉంచుతాడు రచయిత. ఈ కథను చూస్తే సమాజాన్ని పట్టి పీడిస్తున్న కొన్ని రుగ్మతల నుండి ప్రజలను జాగృత పరచాలనే ఆకాంక్ష కూడా రచయితకు ఉందని తెలుస్తుంది.

శారదా బిల్లు మొదలు నిర్భయ చట్టం నుండి నిన్న మొన్నటి దిశా చట్టం వరకూ అమాయకపు అబలలపై జరుగుతున్న అకృత్యాలను రోజూ మనం దిన పత్రికలలో చూస్తూనే ఉన్నాం. కొందరు అభం శుభం తెలియని చిన్నారులపట్ల, ఏ ఆదరువూ లేని ఒంటరి స్త్రీల పట్ల, భర్తలు లేని వితంతువుల పట్ల లైంగిక వేదింపులతో పురుషహంకార భావజాలంతో మనిషిలోని మృగత్వాన్ని నిరూపించుకుంటూనే ఉన్నారు. ఇంతటితో చాలక కొంతమంది మద్యం మత్తులోనో లైంగిక వాంఛతో నిండిన వికృత రూపంతోనో కన్న కూతురని కూడా చూడకుండా పైశాచికానందాన్ని పొందుతున్నారు. ఇలాంటి వస్తువుతో రాసిన కథే 'నా చిట్టి తల్లి'. ఈ కథలో ప్రధాన పాత్ర సుందరి. పెళ్ళైన కొంత కాలానికే పాము కాటుతో భర్త మరణించిన బాల వితంతువు. పెద్ద తండ్రి సహాయంతో చిత్తూరులో బాలికల పాఠశాలలో పనిచేసుకుంటూ ఉంటుంది. తన పెత్తల్లి దీపావళికి రమ్మన్నదని కారులో వెళ్తుంది. ఈ క్రమంలో కారులో ఒక సన్యాసి సుందరి పట్ల వ్యామోహంతో ఆమెను పొందగోరుతాడు. చివరికి సుందరి తన కూతురేనని తెలిసి తన నుదిటిపై ముద్దు పెట్టుకుంటాడు. ఈ కథ చిన్న తనంలోనే వితంతువులైన స్త్రీల పట్ల పురుషుల లైంగిక వేదింపులు ఏవిధంగా ఉంటాయన్న దానికి ఉదాహరణగా కనిపిస్తుంది.

మతం ముసుగులో తీరని కోర్కెలను తీర్చుకోవడానికి, అమాయకపు ప్రజల భయాన్ని సొమ్ము చేసుకోడానికి క్రైస్తవ

మతంలోని ఫాదర్లు చేసే అకృత్యాలను, అరాచకాలను తెలిపే కథే 'పాపి చావు'. ఈ కథలో క్రైస్తవ మత ప్రచారం కోసం ఇంగ్లాండు నుండి భారతదేశం వచ్చిన ఫాదరు ప్రజలను మోసం చేసే తీరు, ఆడవారి పట్ల వారి దురాగతాలను కళ్ళకు కట్టినట్టు రచయిత చిత్రించాడు. క్రైస్తవ మత ప్రచారం చేసే ఒక ఫాదరీ తన చుట్టూ ఉన్న ప్రజలకు ఉపన్యాసాలిస్తూ, తన దగ్గరికి వచ్చే రోగులకు మందు ఇవ్వకుండా మందక్కరలేదు మతం పుచ్చుకో నేరుగా స్వర్గానికి చేరుతావు అంటూ మత మార్పిడికి ప్రయత్నిస్తూ ఉంటాడు. అప్పటి వరకూ అణచి పెట్టుకున్న కోరికల్ని తన దగ్గరికి వచ్చే స్త్రీలను చూసినప్పుడు వారిపట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ కోరికను తీర్చుకోవడానికి ప్రయత్నిస్తూ యానాది స్త్రీ 'చెంగి' చేతిలో చనిపోతాడు.

మనుధర్మ శాస్త్రం స్త్రీల పట్ల విధించిన ఆంక్షల పట్ల వ్యతిరేకత ప్రకటిస్తూ, అనాదిగా సాగుతున్న సాంప్రదాయానికి కట్టుబడో లేక వరకట్నం ఆశించో అప్పుడే యవ్వనంలోకి ప్రవేశించిన స్త్రీలను వృద్ధాప్యం మీదపడి కాటికి కాళ్ళు చాచుకున్న వాళ్లకు ఇచ్చి పెళ్ళి చేసి వారి జీవితాన్ని నరక ప్రాయం చేసే విధానాన్ని ఎత్తి చూపుతూ పాపన్న గుప్త రాసిన కథ 'సావిత్రి'.

యం. వి. పాపన్న గుప్త రాసిన మరొక కథ హైమావతి. నిరుపేదలైన తల్లిదండ్రులు అప్పులవాళ్ళు పెట్టే బాధలకు ఏడవడం చూసిన కూతురు ఎలాగైనా వారికి మనశ్శాంతిని కలిగించాలని ప్రాణ త్యాగానికి సిద్ధపడడం ఇందులోని కథ. ఊరిలోని రాజుకు గంగాభవానీ కలలో కనిపించి చెరువు ఉప్పొంగుతుందని దానికి శాంతిగా ఎవ్వరైనా మూడవ కాన్పును బలిగా ఇస్తే అవిధంగా జరగదని చెప్పింది. ఈవిషయాన్ని రాజు చాటింపు వేయిస్తూ ఇరవై వేల రూపాయలను బహుమానంగా కూడా ప్రకటిస్తాడు. ఈ విషయం తెలుసుకున్న హైమావతి రాజు దగ్గరికెళ్ళి నేను బలికి సిద్ధంగా ఉన్నానని చెప్తుంది. అయితే రాజు తల్లిదండ్రుల అనుమతి లేనిదే నేను అంగీకరించనని చెప్తాడు. హైమావతికి ఏమి చెయ్యాలో తెలీక చెరువు గట్టుకెళ్లి అందులో దూకేస్తుంది. ఇది చూసిన బోయవాడు ఆమెను కాపాడడం. విషయం తెలిసి రాజు అక్కడికి రావడం, పురోహితులు గంగాభవాని శాంతించింది అనడంతో రాజు హైమావతి ధైర్యానికి మెచ్చుకొని ప్రకటించిన బహుమానంతో పాటు మరిన్ని వస్త్రాలను ఇస్తాడు.

ఒక అగ్రహారాన్ని ఆశ్రయించుకొని ఉన్న మాలపల్లెలోని నల్లయ్య అనే అమాయకపు దళితుడు పుట్టినప్పటి నుండి మరణించే వరకూ చేసే అమాయకపు పనులను చిత్రిస్తూ 'ఒక అదియాంధ్ర భక్తుని జీవిత చరిత్ర' కథ. ఒకరికి తెలీకుండా ఒకరికి వచ్చిన సినిమా టికెట్ల గురించి అవతలి వారికి తెలీకూడదని రెండు సన్నిహిత కుటుంబాలు ఒకరితో ఒకరు ఆడిన అబద్ధాల కారణంగా కొంత హాస్యాన్ని పుట్టించే కథ 'బిక్కిరింత పిదప వెక్కిరింత'. ఆర్థిక సంబంధాలు మనుషుల మధ్య దూరాన్ని ఏవిధంగా పెంచుతుందో తెలియజేస్తూ ప్రేమానుబంధము కథ. ఇలా ప్రతి కథా ఒక్కొక్క రకమైన ఇతివృత్తంతో చిత్తూరు జిల్లాలోని లొలితరం కథలు ఆనాటి సమాజంలోని మూఢ నమ్మకాలను, భోగపుమేళాల వ్యవస్థను, సామాజిక సమస్యలను, క్రైస్తవ మత వ్యవస్థలోని ఫాదర్ల దురాగతాలను, దళితుల జీవన వ్యవస్థను చిత్రిస్తూ కనిపిస్తాయి.

ఆధార గ్రంథాలు :

1. గంగాధరం, వేంపల్లి. *రాయలసీమ కథా సాహిత్యం (ఒక పరిశీలన)*. పి.హెచ్.డి. అముద్రిత సిద్ధాంత గ్రంథం. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం. 2010.
2. రంగనాథాచార్యులు, కె. కె. *తొలినాటి తెలుగు కథానిక* మొదటి నుంచి 1930 వరకు. హైదరాబాదు: పల్లవి గ్రాఫిక్స్. 2008.

3. రామప్రసాద రెడ్డి, తప్పెట. సీమ కథా శిలాజాలు (రాయలసీమ తొలితరం కథలు 1927-1930). అనంతపురం: దిక్సూచి పబ్లికేషన్స్. 2015.

4 .రాంబాబు, వేదగిరి. తెలుగు కథానిక హైదరాబాదు: సాయిలిఖిత ప్రింటర్స్. 2012.

5. వినమూర్తి. దిద్దుబాటలు: యుఎస్ఏ: తానా పబ్లికేషన్స్. 2015.

6. వెంకటయ్య, తవ్వా. సీమ కథా తొలకరి (వ్యాస సంపుటి). తవ్వారుపల్లె: అక్షరదీపిక పబ్లికేషన్స్. 2014.

7. వెంకటయ్య, తవ్వా. (సంపాదకులు). రాయలసీమ తొలితరం కథలు. తవ్వారుపల్లె: అక్షరదీపిక దీపిక పబ్లికేషన్స్. 2015.

8. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. కథా శిల్పం. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. 2008.

9. శశిశ్రీ. రాయలసీమ సాహిత్యం. హైదరాబాదు: తెలుగు అకాడమి. 2012.

10. హరినాథ రెడ్డి, అప్పిరెడ్డి (సం). మొదటి తరం రాయలసీమ కథలు (1882-1944). హైదరాబాదు: అబ్జ క్రియేషన్స్. 2015.

11. సావిత్రి (కథ). మార్చ్ 1928 భారతకథానిధి మాసపత్రిక

★★★

వి.ఎస్.ఆర్ & ఎన్.వి.ఆర్ కళాశాల

(స్వయం ప్రతిపత్తి) - రీఅక్రిడియేట్

తెనాలి - 522 201, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

భావవీణ ప్రత్యేక సంచిక

Journal of Literary, Culture & Language Studies

Vol. 17 - Issue. 8 - Spl. Edition - August 2020 - ISSN No. : 2456-4702

అంతర్జాతీయ అంతర్జాల సదస్సు (వెబినార్)

24, 25 ఆగష్టు 2020

తెలుగు సాహిత్యం - సమకాలీనత

ప్రధాన సంపాదకులు :

కె. వి. పద్మావతి

వైస్ ప్రిన్సిపాల్ & శాఖాధిపతి, తెలుగు విభాగం, వి.ఎస్.ఆర్ & ఎన్.వి.ఆర్ కళాశాల, తెనాలి.

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 17 - Issue. 8 - August 2020 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-

EDITORIAL BOARD

Chief Editor

PITTA SANTHI

M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,

C/o. Dr. Busi Venkataswamy

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Dept. of Telugu,
   Sri Padmavathi Mahila University,
   Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   HOD & Research Guide, Dept. of Telugu
   PAS College, Pedanandipadu.
5. **Prof. V. Sankara Rao**, M.A.,M.A.,M.Phil, PhD.
   HOD, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI, Tamilnadu.
6. **Prof. Darla Venkateswara Rao,** M.A.,M.Phil., Ph.D.
   Dept. of Telugu,
   Central University of Hyderabad, Hyderabad. Telangana.

ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **THOTTEMPUDI SREE GANESH,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
   Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, University of Heidelberg, Germany.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor, Dept.of Hindi,
   Moulana Azad National Urdu University,
   HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
   Board of Studies Chairman,
   Telangana University, Dichpally,
   Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
   Dept. of Telugu & O.L.,
   Acharya Nagarjuna University,
   Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Kakatiya University, Warangal District.
   Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A, M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

LEGAL ADVISER

Dr. A. GURAVAIAH, *M.A., L.L.M., PhD.,*
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

DTP & PRINTING

TENALI PRAKASH, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - ఎడిటర్.

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

Contents (విషయ సూచిక)

1. సాహిత్యం - ఆధునికత - సమకాలీనత	- డా॥ పి. విజయకుమార్	16
2. భగవద్గీత - భక్తి తత్వం	- డా॥. ఆవుల గిరిబాబు	23
3. కొలకలూరి ఇనాక్ 'రంధి' నవల - సమకాలీనత	- తోట రామకృష్ణ	26
4. ఆధునిక మహేతిహాసం - కన్యాశుల్కం - సమకాలీనత	- డా॥. యన్.సి. సంజీవ రెడ్డి	29
5. చండాలుడు నవల - సమకాలీనత	- తంగి ఓగేశ్వరరావు	32
6. కందుకూరి 'బ్రహ్మ వివాహం' - సాంఘిక విశ్లేషణ	- డా॥. కీలారి గౌరినాయుడు	37
7. కవిత్రయ మహాభారతం - నామాల విశ్లేషణ	- తోట వెంకటస్వామి	40
8. ఆంధ్ర మహా భారతం లో రాజనీతి - సమకాలీనత	- కె. సుజన	49
9. తెలుగు జాతీయోద్యమ, దేశభక్తి సాహిత్యం - సమకాలీనత	- డా॥. కొయ్యా శ్రీనివాసులు	54
10. నన్నయ భారతంలో సమకాలీనత	- తంత్రవహి శ్రీరామమూర్తి	59
11. గుణనిధి కథ - సమకాలీనత	- డా॥. ఏ. వెంకటప్రసాదు	63
12. తెలుగు కథా కావ్యాలు : సమకాలీన పరిస్థితులు	- కె.ఎన్. అన్నపూర్ణాదేవి	67
13. 'రక్తస్పర్శ' కవుల కవిత్వం - సమకాలీనత	- భూక్యా కాశిరామ్	71
14. భాగవతం - సమకాలీనత	- డా॥. బ్రహ్మానందరెడ్డి	74
15. చిలుకూరి నారాయణరావు 'అంబ' (మొండి శిఖండి) నాటకం	- డా॥. చుక్కా యశోద	78
16. ఆధునిక వేమన శతకము - సమకాలీనత	- డా॥. నల్లపనేని విజయలక్ష్మి	82
17. జానపదకళలు - సమకాలీనత	- డా॥. రాచపాళెం పురంధీశ్వరి	85
18. తొలితరపు తెలుగు నవలలు - సమకాలీనత	- డా॥. వి. బాలిరెడ్డి	89
19. లయాత్మక భావరూపం - వచనకవితా ప్రస్థానం	- డా॥. వి. శివనాగార్జున రెడ్డి	93
20. 'శారద లేఖలు' ఆధునిక భావ, రాగాల స్వరపేటికలు	- గొల్లంగి చిన్నబాబు	96
21. 'ఒక పరిమళ కాంతిదీపం' కవిత్వం - సమకాలీనత	- శశికళ యస్.	103
22. యువతరం భవిష్యత్తుకు నిలువుటద్దం 'ప్రలోభం' నవల	- అంకిరెడ్డి సునీల్ కుమార్ రెడ్డి	106
23. అతడు అడవిని జయించాడు - ఏరుకల జీవిత అధ్యయనం	- చౌట బాలకృష్ణ	111
24. గిరిజన సాహిత్యంలో సుగాలీల మౌఖిక సాహిత్యంలో కథా సాహిత్యం	- డా॥. భూక్యా జ్యోతి	114
25. రాయలసీమ రాగాల సొరభాలు	- డా॥. జి. స్వర్ణలత	118
26. జానపద కళల పరిరక్షణ	- డా॥. కొమ్మనబోయిన సుజాత	122
27. సమకాలీన సమాజ ప్రతిఫలనం ప్రాచీన సాహిత్యం	- డా॥. ఒభిన్ని శ్రీహరి	125
28. కవి శిఖామణి కవిత్వం - సమకాలీనత	- ఎలగొండ రాములు	129
29. స్వేచ్ఛనవల పాత్రలు - సమకాలీనత	- కవాడపు లలిత	133
30. సమకాలీన తెలుగు సాహిత్యంలో 'హైకూ' ప్రక్రియ విశిష్టత	- మాదా శంకరబాబు	138
31. జానపదవైద్యం - సమకాలీనత	- పి. దర్గాబాబు	141
32. మహాభారతంలో కొన్ని స్త్రీ పాత్రలు సమకాలీనత	- పప్పుల శైలజ	145

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మీడియా వలలో పడ్డ యువతరం భవిష్యత్తుకు నిలువుటద్దం 'ప్రలోభం' నవల

- అంకిరెడ్డి సునీల్ కుమార్ రెడ్డి, పరిశోధక విద్యార్థి, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

రోజురోజుకు మానవుని ఆలోచనా విధానాలు మారుతున్నాయి. నాగరికత కొత్త పుంతలు తొక్కుతోంది. దీనికి తోడు టెక్నాలజీ ఊహించని రీతిలో అభివృద్ధి చెందుతోంది. నాగరికత ఎంత పెరుగుతున్నప్పటికీ ప్రజల జీవన విధానాల్లో, నైతిక విలువల్లో మాత్రం మార్పురావట్లేదు. సిగ్గు, బిడియం, మర్యాద, సభ్యత వంటి మాటలకు ఇప్పుడు తావులేదు. ఆరేళ్ల అమ్మాయి బూతు సినిమా పాటకు డాన్స్ చేస్తుంటే తల్లిదండ్రులు చప్పట్లు కొడుతున్నారు. అమ్మ, చందమామ పాట పాడుతూ గోరుముద్దలు తినిపిస్తూ ఉంటే పిల్లవాడికి రుచించడం లేదు ఐఫోన్ చేతిలో పెడితే చాలు... బార్లల్లో ఆడ మగకి తేడా లేదు. ఇంకా వేసుకునే బట్టల గురించి చెప్పక్కరలేదు. అబ్బాయిలు అమ్మాయిల వెంటపడి ప్రేమించడం, కాదంటే వేధించడం, లేదంటే యాసిడ్ పోయడం. ఇలాంటి పరిస్థితులను రోజూ మనం చూస్తూనే ఉన్నాం. ఇలాంటి గందరగోళంలో సతమతమవుతున్న మనసులోంచి ఎగదన్నుకొచ్చిందీ 'ప్రలోభం' నవల అంటాడు నాయని కృష్ణమూర్తి.

"ఒంటిమీద ఆచ్ఛాదన లేకుండా తిరిగిన మానవుడు బట్టలు కట్టడం నేర్చుకున్నాడు. గుహల్లో చెట్ల మీద నివసించే వాడు ఇల్లు కట్టడం తెలుసుకున్నాడు. కాలినడకన ప్రయాణం చేసేవాడు కార్లు కనిపెట్టాడు. విమానాలు ఎక్కి గాలిలో తిరుగుతున్నాడు. ప్రపంచం ఒక గ్రామమయింది. అంతా బాగానే ఉంది కానీ ఇప్పుడు ప్రపంచంలో అందరి మెదళ్లనూ మీడియా పురుగు కాటేసింది. ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం ఎక్కడా కనిపించడం లేదెందుకు? ఎవరికీ భుజాలమీద తలలు ఉన్నట్లు లేదే! తలలకు బదులు టీవీలు, సినిమా తెరలు, కంప్యూటర్లు కనిపిస్తున్నాయెందుకు? మనుషుల మధ్య దూరమింత పెరిగిపోయిందేమిటి? ఎదురెదురుగా నిలబడి మాట్లాడుతున్నా మధ్యలో మహాసముద్రాలు కనిపిస్తున్నాయే!" అంటాడు నవల వెనుక కథలో రచయిత నాయుని కృష్ణమూర్తి. అవును ఈ మాటలన్నీ అక్షర సత్యాలు.

ప్రస్తుతం పత్రసమర్పనకు నేను ఎంచుకున్న ప్రలోభం అనే నవలలో కాలేజీ విద్యార్థులకు అందులోనూ ముఖ్యంగా యువతులకు ఎదురయ్యే ప్రలోభాలు, ఆ ప్రలోభాల వల్ల ప్రభావితమైన వారి జీవితాలు చివరికి ఎలా తయారయ్యాయో వైజయంతి, హరిత, మాలిని, ప్రణతి అనే పాత్రల చేత మనకు అవగతం అయ్యే విధంగా నవలను మలిచారు నాయుని కృష్ణమూర్తి. అంతేకాకుండా ఈ నవలలో కాలేజ యూనియన్ ఎలక్షన్లు ప్రస్తుత రాష్ట్ర, దేశ రాజకీయాలను తలపించే విధానం, ఎదురుతిరిగి మాట్లాడే విద్యార్థులను రాజకీయ నాయకులు పోలీసుల చేత తీవ్రవాదులుగా ముద్ర వేయించి వారిని చిత్రహింసలకు గురిచేసే విధానం ఈ నవలలో చూడవచ్చు. పై అంశాలు నవలలో ఏ విధంగా చిత్రించబడ్డాయో విశ్లేషించడం ఈ పత్ర సమర్పన ఉద్దేశం.

ప్రలోభం నవల ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో 15-8-2003 నుండి 2-1-2004 వరకు సీరియల్గా వచ్చింది. దీనిని వియన్నార్ బుక్ వరల్డ్ చౌడేపల్లి వారు 2012లో పుస్తక రూపంలో ప్రచురించారు. నవలా రచయితగా నాయుని కృష్ణమూర్తి యామిని కుంతలాలు, మనసు గుర్రము రోరీ మనిషి!, మహాభారత మూలకథకు నవలా రూపంగా 'జయమ్' వంటి నవలలను రచించాడు. ఖేల,

కాటుక కరిగిపోయింది నవలలను ఆయన చనిపోయిన తర్వాత విజయవాణి ప్రింటర్స్ వారు ముద్రించారు. కథ కుడిగా 'కథలు', 'ఏం లేదు' అనే రెండు కథా సంపుటాలను ప్రచురించాడు. 'ఈ కోతి డ్రామాకు పని కొస్తుందా', 'వియోగవిభావరి' అనే ఏకాంకికలను, రామాయణ భాగవతాలను వచనంలోనూ రచించాడు. ఆంగ్ల అభ్యసనానికి తోడ్పడే మూడు తెలుగు-ఇంగ్లీష్ నిఘంటువులను కూడా నిర్మించాడు. కొంతకాలం బొమ్మరిల్లు, విజయ, నీలిమ పత్రికలకు ఉపసంపాదకుడిగా పని చేశాడు. తర్వాత 'స్నేహబాల' అనే పిల్లల పత్రికను నిర్వహించాడు. పీటీతోపాటు 1977లో 'మాబడి' 1978లో 'పాఠశాల' పత్రికలను విద్యార్థుల కోసం తాను స్థాపించిన విజయవాణి సంస్థ ప్రచురిస్తున్నవే. తెలుగు పత్రికా రంగంలో మా బడి, పాఠశాల పత్రికలకు విశిష్ట స్థానం ఉండడం అందరికీ తెలిసిందే. అలాగే సినీ రచయితగా కూడా మూడు పాటలను అందించడం గొప్ప విషయం. అక్షర తపస్మాన్ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా సాక్షరతా సమితి అకడమిక్ కమిటీ చైర్మన్ గా, రాష్ట్ర సాక్షరతా సమితి కమిటీ సభ్యుడిగా, కేంద్ర స్థాయిలో నేషనల్ లిటరసీ మిషన్ సభ్యుడిగా సేవలందించారు.

ప్రలోభం నవలలో ప్రధాన పాత్ర వైజయంతి. బీఎస్సీ పూర్తి చేసి పెళ్ళి కాకపోయినా పది నెలల కొడుకు ఉన్న ఈమె, కాలేజ రోజుల్లో సెక్స్ విజ్ఞానం పేరుతో వస్తున్న వారపత్రికలకు, బూతులతో నిండిన సినిమాలకు, కథలకు అలవాటుపడి క్షనికావేశాలను అదుపులో ఉంచుకోలేక, వాటి ప్రలోభాలకు లోనై తన జీవితాన్ని నాశనం చేసుకుంటుంది. ఈమెతో పాటు మిగిలిన స్నేహితులు మాలిని, ప్రణతిలు కూడా వివిధ ప్రలోభాలకు లోనై జీవితాలను కష్టాలలోకి నెట్టుకొని చివరికి చంపబడుతారు.

నవల ప్రారంభంలో వైజయంతి ఒక లాయర్ దగ్గరికి వచ్చి "నేను మోసపోయాను లాయరుగారూ...! కళ్ళు తెరిచేసరికి పూర్తిగా ఊబిలో కూరుకుపోయి ఉన్నాను. కారణం ఈ సమాజమే!" అంటుంది. దీనికి లాయరు మీరు ఉంటున్న ఈ సమాజంలో నేనూ ఉంటున్నాను ఈ సమాజం నన్ను మోసం చేయలేదే. మీరు ఏదో తప్పు చేసి ఉంటారు దాని పర్యవసానంగా ఫలితాన్ని అనుభవిస్తుంటారు అంటారు.

దీనికి వైజయంతి "మీరు చెబుతున్నది అక్షరాల కరెక్ట్ లాయరుగారూ! మీరన్నట్టు నేను తెలియకుండా తప్పులు చేశాను. నష్టపోయాను. నేను తప్పులు చేయడానికీ, నష్టపోవడానికీ కారణం నేనే అంటే మాత్రం ఒప్పుకోను. నాలాంటి తెలిసీ తెలియని వయసులో ఉన్న యువతరాన్ని రెచ్చ గొడుతున్నది, బలహీనతల్ని సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నది మీడియా. అది ప్రింట్ మీడియా కావచ్చు విజువల్ మీడియా కావచ్చు. నన్ను తప్పు చేసేలా రెచ్చగొట్టింది. చాలామంది నాలాంటి వాళ్ళు ఈ యువతరంలో ఉన్నారు. మంచి - చెడు మధ్య గీత గియ్యలేని నన్ను ఇప్పుడు విడుదల అవుతున్న పత్రికలు సినిమాలు రకరకాల టీవీ ప్రోగ్రాములు కరెప్ట్ చేశాయి. వెర్రితలలు వేస్తున్న నాగరికత, సెక్స్ వయోలెన్స్ ఇవే ఆదర్శంగా పత్రికలు, సినిమాలు, టీవీలు చూపడంతో నేను వాటి ప్రభావానికి లోనయ్యాను. ఫలితంగా నా జీవితాన్ని నేను నాశనం చేసుకున్నాను". అంటుంది.

పైన కనపడే ఈ సమస్యలు నేటికీ కూడా ఈ సమాజాన్ని పట్టిపీడిస్తున్నాయి. దిన పత్రికలు, వార పత్రికలు నేటికీ వస్తున్నాయి కానీ ఈరోజు వాటి కంటే ప్రమాదకరమైనది స్మార్ట్ ఫోన్. ఇది అరచేతిలోనే అన్నీ చూపించగలదు. పత్రికల్లో, టీవీల్లో రకరకాల ప్రోగ్రాములను ఇంటిల్లపాది చూడడానికి కూడా సిగ్గు పడాల్సిన పరిస్థితి నేడు నెలకొంది. జుగుప్సాకరమైన మాటలతో కూడిన డైలాగులు నిండిన ప్రోగ్రాములు మనం చూస్తూనే ఉన్నాం. వీటన్నింటి ప్రభావాలవల్ల నేడు ఎంత మంది నిగ్రహంగా ఉండగలరు. వారి జీవితాలను చెడు మార్గాలు పట్టకుండా ఎంతమంది కాపాడుకోగలరు. మంచీ చెడు చెప్పడానికి పిల్లలను కనిపెట్టుకొని ఉండడానికి నేడు

ఉమ్మడి కుటుంబాలు పోయి వ్యష్టి కుటుంబాలు ఏర్పడ్డాయి. కావాల్సినంత స్వేచ్ఛ వచ్చింది. దీనికి తోడు అధిక గారాబం. పది పాస్ అయితే మోటారు సైకిల్ కొనివ్వడం. కావలసిన ఫోను తీసివ్వడం. పీటికి తోడు చెడు సావాసాలు. చుట్టూ ఇన్ని ప్రలోభాలు ఉన్న ఈ సమాజంలో యువత చెడు దారి పడుతుందా లేదా అని అరా తీసేలోపే అన్నీ జరిగిపోయుంటాయి. ఇలాంటి ఆవేదననే రచయిత ఈ నవల ద్వారా తెలపదల్చుకున్నాడు.

నవలలో ఇలాంటి వ్యసనాలకు లోనై ప్రాణాలు పోగొట్టుకున్న పాత్ర మాలిని. మండల ప్రెసిడెంట్, గోపీకృష్ణా థియేటర్ ఓనర్ సురేంద్ర గారు వైజయంతిని ఒకసారి వచ్చి కనిపించమని చెప్పారమ్మా అంటూ చెప్పివెల్తాడు ఒక మనిషి. వైజయంతి స్నేహితురాళ్ళతో నన్నెందుకు పిలుచుంటాడు. అయినా నా పేరేలా తెలుసుంటుంది అని అనుకుంటుంది. మరుసటిరోజు మాలిని వైజయంతితో ''నేను వినడం ఎమంటే కాలేజిల్లో ఎవరన్నా మంచి బ్యూటీలు ఉంటే, రాజకీయనాయకులు వలలు వేసి పట్టుకుంటారని!'' అంటుంది. మొత్తానికి విషయం ఎమైవుంటుందో కనుక్కొని రావడానికి మాలిని ప్రణతిలు మండల ప్రెసిడెంట్ ఉండే ఆఫీసు దగ్గరికి వెళ్తారు. మండల ప్రెసిడెంటు ఆ టైంలో అక్కడ ఉండరని థియేటర్ దగ్గర ఉంటారని తెలిసి వెనక్కి తిరుగుతుండగా గోపీకృష్ణాలో 'ది ఉమెన్ ఇన్ రెడ్' సినిమా కదా వెళ్దామా సురేంద్ర కూడా అక్కడే కదా ఉంటాడు అంటుంది సినిమాలపట్ల మోజున్న మాలిని. గోపీకృష్ణాలో ఇంగ్లీష్ సినిమాలు ఆడవు అక్కడ అన్నీ తెలుగు సినిమాలే అని ప్రణతి అంటుంది. ''తెలుగు సినిమా ఏదైతే ఏంలే! బూతు డైలాగులు ఉంటాయి. కావాల్సినంత రోమాన్స్, వెళ్దామంటే వెళ్దాం'' అంటుంది మాలిని.

మాలిని, ప్రణతిలు మండల ప్రెసిడెంట్, గోపీకృష్ణా థియేటర్ ఓనర్ సురేంద్రని కలిసి మాట్లాడుతుండగా, ప్రనతిని ''ఏమ్మా, నువ్వు సినిమా చూస్తుంటావా? రెండు మాటలు మాట్లాడిన తరువాత మీ ఫ్రెండును కూడా పంపుతాను'' అంటూ తన గన్ మాన్ ను పిలిచి ప్రనతిని సినిమాలో కూర్చోపెట్టిపిస్తాడు. తరువాత వైజయంతి కంటే నువ్వే అందంగా ఉన్నావంటూ మాలినికి మాయ మాటలన్నీ చెప్పి, కాసేపు సినిమా చూస్తావా అంటూ ప్రొజెక్టర్ రూముకు తెసుకు వెళ్లి తలుపులు గడిపెట్టి ''మాలినీ! నువ్వు ఎవరివైనా ఈ క్షణం నుండీ నా దేవతవు. నీతో అబద్ధం చెప్పను. నేను ఎంతోమందిని చూసాను. నీలాంటి అందగత్తెను ఎక్కడా చూడలేదు. కారణం నువ్వు సుకుమారమైన గులాబీ పువ్వువి కాదు, ఎంత నలిపినా నలగని సంపెంగవు'' అంటూ బలవంత చేస్తాడు. ఆ సమయంలో అంతా గమనించిన ప్రణతి తన దగ్గరున్న కెమరాతో ఒక ఫోటో తీసి పారిపోతుంది. ప్రనతిని పట్టుకునే ప్రయత్నం చేస్తే అరిచి గోల చేస్తుందేమో అన్న భయంతో మాలిని లోబరుచుకుంటే ఎగోడవా ఉండదు కదా అని, మాలినీ పై అత్యాచారాన్ని కొనసాగించస్తాడు. మాలినికి ఒక భాగం ప్రతిఘటించాలని ఉంది కానీ ''ఇంకో భాగం వారపత్రికల సీరియల్లల్లో, శృంగారకథల్లో, సినిమాల్లో చదివిన, చూసిన దృశ్యాలు కలగాపులగంగా మెదడులో నాట్యం చేస్తూ ''ఊ కానీ, ఏమైంది?'' అంటున్నాయి'' అంతే మాలిని ఆవేశంతో విచక్షణతను కోల్పోతుంది. ఈ విషయం తెలిసిన మాలిని ఫ్రెండ్స్ ప్రణతి తీసిన ఫోటోను అడ్డం పెట్టుకొని సురేంద్రను మాలినీని పెళ్లి చేసుకోమని బెదిరిస్తారు. దీనితో చేసేదేమీ లేక పెళ్ళికి ఒప్పుకున్నట్టే నటిస్తూ రాత్రికి రాత్రే మాలిని ఇంటికి నిప్పంటించి ఇంటిలోని వారందరినీ హత మారుస్తాడు.

అలాగే సినిమాల్లో హీరోయిన్గా నటించాలనే మోజులో పడి చివరికి తనకే తెలీకుండానే నీలి చిత్రాల్లో నటించి ఉరివేసుకొని చనిపోయిన దుస్థితి ప్రణతికి వస్తుంది. తన దగ్గరున్న కెమరాను ఎప్పుడూ ప్రోసెసింగుకి ఇచ్చే స్టూడియో ఓనర్ రఘు, ప్రణతికి జయేంద్రను పరిచయం చేస్తాడు. జయేంద్ర ఎవరో కాదు లోకల్ ఎమ్మెల్యేగారి

బామ్మర్ది. మద్రాసు ఫిల్మ్ ఇన్స్టిట్యూట్లో ఫిల్మ్ డైరెక్షన్ డిప్లమా చేసానని చెప్పుకుంటూ దొరికిన అమ్మాయిలకు మాయమాటలు చెప్పి గెస్ట్ హౌసుకు తీసుకెళ్ళి బ్లూ ఫిల్మ్ తీసి గల్ఫ్ దేశాల్లో అమ్మి సొమ్ము చేసుకుంటూ ఉంటాడు.

ప్రణతితో మీ నవ్వు చాలా బాగుందండీ. మీనవ్వు వీడియోలో బంధించి శ్రీదేవికి చూపిస్తే బాత్రూములోకి వెళ్లి ఉరివేసుకుంటుంది. అని ఆమెని పొగడడం, తనకు చిరంజీవి తెలుసు త్వరలో డైరెక్టరు చాన్సు ఇస్తానన్నాడు అంటూ, ఇంకా ఏవేవో మాటలు చెప్తూ "మిమ్మల్ని మీ మూవ్ మెంట్స్ ని వీడియో తీసి, ఏ ప్రొడ్యుసరుకు అయినా చూపామనుకోండి, ఏమో, మీ అదృష్టం ఎలా ఉందో ఏమో! ఓవర్ నైట్ హీరోయిన్ అయిపోయినా అయిపోవచ్చు". అంటాడు. ప్రణతి నరేనంటుంది. విషయమంతా తెలిసిన వైజయంతి ఇలా బ్లూ ఫిల్ముల వ్యాపారం మొదలుపెట్టిన ఎమ్మెల్యే కొడుకు అలాగే ఇంకొక హీరో కేసుల గురించి చెపుతుంది. ఆకేసులు చివరికి కొట్టేసారుగా అంటూ పెడచెవిన పెడుతుంది ప్రణతి. మొత్తానికి సినిమాల్లో చాన్సు వస్తుందని ఒక ప్రమోషన్ వీడియో తీయడానికి జయేంద్ర రమ్మన్న గెస్ట్ హౌసుకు వెళ్తుంది. అక్కడ జయేంద్ర, ప్రణతితో పాటూ కో వర్కరుగా నటించడానికి వచ్చిన ఆఫ్రికన్ మాన్ తో కలిసి మందు తాగుతూ ప్రణతిని కూడాతాగమని బలవంతం చేస్తారు. పెద్దపెద్ద హీరోయిన్లు, హీరోలు ఒక్క పెగ్గన్నా వెయ్యనిదే పెట్లోకి అడుగు పెట్టరు తెలుసా అంటూ మభ్యపెడుతాడు. ప్రణతి కళ్ళ ముందర ఆక్షణంలో అందరు సినిమా తారలూ కనిపిస్తారు, పక్కన తననూ ఉన్నట్లు ఊహించుకొని మందు తాగేస్తుంది. ఆ మత్తులో జయేంద్రకు కావాల్సిన ఫిలిం రడీ అయి పొతుంది. మత్తు నుండీ తేరుకున్న ప్రణతికి విషయం అర్థమయ్యి సినిమాతారలంతా వేషాలు దొరకని రోజుల్లో ఇలాంటి ఫిల్ముల్లో నటించినవారేలే అనుకుంటూ జయేంద్ర ఇచ్చిన డబ్బు తీసుకుని ఇంటికెల్తుంది. దీని పర్యవసానంగా ప్రణతి నెలతప్పడం, తను నటించిన బ్లూ సినిమా గల్ఫ్ దేశాల్లోనే కాక తన ఊరిలో కూడా దొరుకుతుందని తెలియడం, ఈ విషయం వాళ్ళ నాన్నకు తెలిసి ఆయన గుండె ఆగి చావడం జరుగుతుంది. దీనితో ప్రణతి కూడా ఉరివేసుకుని చనిపోతుంది.

నేటికీ ఇలా సినిమా అవకాశం ఇప్పిస్తామంటూ ఎందరు ప్రొడ్యూసర్లు, డైరెక్టర్లు ఎంతమంది జీవితాలతో ఆడుకోవట్లేదు. అంతెందుకు మొనీమధ్య తెలుగు సినీ రంగంలో ఆడవాళ్ళ పట్ల జరుగుతున్న అన్యాయాలను క్యాస్టింగ్ కౌచ్ పేరుతో శ్రీరెడ్డి లాంటివాళ్ళు సోషల్ మీడియాల్లో వాళ్ళ భాదలను చెప్పుకోవట్లేదా. అయితే నిజానికి తప్పంతా మభ్యపెట్టిన వాళ్ళదే అనలేం మోస పోయిన వాళ్లది కూడా అని చెప్పొచ్చు. ఎందుకంటే వాళ్ళ బలహీనతలు అలాంటివి.

వైజయంతికి తన స్నేహితులకు పట్టిన పరిస్థితులను చూసి మొదటిసారిగా ఆత్మశోధన మొదలవుతుంది. పత్రికలు, టీవీలు, సినిమాలు యువతరాన్ని ఎంత బలంగా ఆకర్షిస్తున్నాయో, పెడతోవాలు పట్టిస్తున్నాయో అర్థమవుతుంది. అయినప్పటికీ ఉద్యోగ ప్రయత్నమై తిరపతి నుండీ విశాఖపట్నం వెళ్ళే క్రమంలో నలుగురి ఆకతాయి కుర్రాళ్ళ శపధానికి ఎరగా మారుతుంది. రైలు విశాఖవట్నం వెల్లేలోగా వైజయంతిని పడేస్తానని పందెంకాసిన రాజశేఖరం నాలుగు తెలుగు పత్రికలు కొనుక్కొని "ఈ ఆయుధాలు చాలు ఎవర్నయినా లొంగ దీస్తాను" అంటూ వెళ్లి తన ముందు సీటులో కూర్చుంటాడు. కొన్ని మాటల తరవాత తను రాజశేఖరం దగ్గర ఉన్న తెలుగు పత్రికలను చదవడం మొదలుపెడుతుంది. చాలా కాలం తరవాత తెలుగు పత్రికలు చదవడం మొదలుపెట్టిన వైజయంతి మరీ ఉద్రేకానికి గురై తనని తాను నిగ్రహించుకోలేక మాలిని, ప్రణతి చేసిన తప్పే చేస్తుంది. పర్యవసానం తను నెలతప్పి ఒక బాబును కంటుంది.

ఈ నవలలో పీడేకాదు ఆలిండియా రేడియోలో తన కవితల్ని ప్రసారం చేపిస్తానన్న కృష్ణన్ చేతిలో బలవ్వడానికి

సిద్ధంగా ఉన్న విశాల, పది పాసు కూడా కాని అమ్మాయి నాగార్జున రామ్మన్నాడంటూ, హీరోయిన్ అవాల్సిందే అంటూ ఇంట్లో చెప్పకుండా ఎవరో రాసిన ఉత్తరాలకు బలవ్వబోతున్న జ్యోతి లాంటి వాళ్ళు మనకు ఈ నవలలో కనిపిస్తారు.

ఈ విధంగా ఒక్కొక్కరు ఒక్కొక్క రకమైన ప్రలోభానికి లోనై సమస్యల్లో ఇరుక్కొని తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. దీనికి గల కారణం ఎదుర్కోవాల్సిన ప్రలోభాలకు ప్రతిఘటించకుండా లేదా వారి మానసిక పరిపక్వతకు బుద్ధి చెప్పకుండా ఆ ఊబిలో పడిపోడానికి కారణం మాత్రం యువతలో నిద్రాణ స్థితిలో ఉన్న ఈ సెక్సు, వయోలెన్స్ లను నిద్రలేపుతున్న ఈ పత్రికలు, బూతు నిండిన సినిమాలు అని చెప్పక తప్పదు. ఇటు వంటి వాటివల్ల యువత చెడిపోకుండా ఉండాలని, మీడియాను కంట్రోల్ చెయ్యాలని, చట్ట పరంగా న్యాయాన్ని ఆశిస్తుంది నవలలో ప్రధాన పాత్ర వైజయంతి. ఈ సమస్యకు చట్ట పరమైన న్యాయాన్ని అటుంచితే పీలైనంత వరకూ ఈ విషయంలో యువతరం నష్ట పోతోంది అనే స్పృహ సమాజ సభ్యుల మధ్య మొదట కలిగించాలని ముందడుగు వేస్తుంది ప్రధాన పాత్ర.

ఆధార గ్రంథాలు :

1. నాయుని కృష్ణమూర్తి గారి అక్షర జ్ఞాపిక. చౌడేపల్లి: విజయవాణి సంస్థలు. 2018.
2. కృష్ణమూర్తి, నాయుని. ప్రలోభం. చౌడేపల్లి: వియన్నార్ బుక్ వరల్డ్. 2012.
3. శ్రీ నాయుని కృష్ణమూర్తి గారి అభినందన సంచిక. చిత్తూరు జిల్లా రచయితల సమాఖ్య. 2017.

⌘⌘⌘


శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల
కరీంనగర్, తెలంగాణ.
మద్రాసు విశ్వవిద్యాలయం
చెన్నై, తమిళనాడు.
UGC
భావవీణ ప్రత్యేక సంచిక
Journal of Literary, Culture & Language Studies
Vol. 18 - Issue. 7 - Spl. Edition - July 2021 - ISSN No. : 2456-4702
అంతర్జాతీయ అంతర్జాల సదస్సు
2 - 3 జులై 2021
తెలుగు కథ - సమకాలీనత
(2000 సం॥. నుండి 2020 సం॥. వరకు)
నిర్వహణ :
తెలుగు శాఖ
శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల : కరీంనగర్.
మద్రాసు విశ్వవిద్యాలయం : చెన్నై

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 18 - Special Issue 7 - July 2021 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-

EDITORIAL BOARD

Chief Editor

Dr. PITTA SANTHI

M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu), Ph.D.,

C/o. Dr. Busi Venkataswamy

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
Associate Professor, Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., Ph.D.
HOD, Dept. of Telugu,
Hyderabad Central University, Hyderabad, Telangana.

ASSOCIATE EDITORS

1. **Dr. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Associate Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
HOD, Dept. of Telugu
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Prof. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

Contents (విషయ సూచిక)

1. తెలంగాణ ఉద్యమ కథలు - విశ్లేషణ	- డా॥. వి. అరుణ్ కుమార్	18
2. నిష్కృతి - అంపశయ్య నవీన్ కథలు బ్రతుకు తెరువు	- జి. బాలకృష్ణ	23
3. ఐతా చంద్రయ్య కథలు - సమకాలీన ప్రభావ ప్రసరణం	- డా॥. చవ్వా వెంకటరెడ్డి	26
4. న్యూబాంబే టైలర్స్ - కాల ప్రభావం	- డా॥. జె. అనూరాధ	33
5. దేవులపల్లి కృష్ణమూర్తి కథలు - పరిశీలన	- జాగర్ల మహేందర్	37
6. ఆధునిక తెలుగు కథా వైశిష్టత - ప్రపంచీకరణ ప్రభావం	- డా॥. కడివెండి మమత	42
7. డా॥. వి. చంద్రశేఖర రావు కథలు - దళితవాదం	- డా॥. కడియాల వెంకటరమణ	45
8. మేరెడ్డి యాదగిరిరెడ్డి కథలు - సామాజికత	- డా॥. తండు కృష్ణ కౌండిన్య	50
9. జూపాక సుభద్ర కథలు - పాలిష్డ్ కుల వివక్ష రూపాలు	- లింగాల ప్రశాంత్	54
10. సి.ఎన్. చంద్రశేఖర్ కథలలో మానవీకోణం	- డా॥. మూడే నాగేంద్ర నాయక్	57
11. పెద్దింటి అశోక్ కుమార్ కథలు-రైతు సమస్యలు	- మన్రు యశోదా	64
12. అబ్బూరి ఛాయాదేవి - తన మార్గం కథ - సమకాలీనత	- యస్. రజిత	66
13. వినోదిని కథల్లో సమకాలీనత	- ఎలగొండ రాములు	69
14. కాలువ మల్లయ్య కథలు సామాజిక చిత్రణ	- పొరండ్ల శంకర్	74
15. మధురాంతకం మహేంద్ర కథలు - సమకాలీనత	- డా॥ రాచపాళెం పురంధీశ్వరి	77
16. సలీం గారి కరోనా కథలు - జీవన చిత్రణ	- హిమ బిందు వేదుల	80
17. "అంగడి సరుకై...." కథ - సమకాలీనత	- టి.వి. రమణ	83
18. అచ్చమైన జీవితాలకు ఆద్యం పట్టిన అమరావతి కథలు	- డా॥. కొత్తిరెడ్డి మల్లారెడ్డి	87
19. తెలంగాణ కథ-బిసి కులవృత్తులు-ప్రపంచీకరణ ప్రభావము	- సన్నె సరేశ్	91
20. డా॥. వి. చంద్రశేఖర రావు కథలు - స్త్రీ హక్కులు	- పి. ఇందిర	95
21. శత వసంతాల తెలుగు కథాసంకలనం - ఒక పరిశీలన	- డా॥. పెద్దింటి ముకుందరావు	98
22. అమ్మాయి పెళ్లి పుస్తకంపై సమీక్ష	- పట్నాల ధర్మారావు	100
23. ముదిగంటి సుజాతరెడ్డి నిత్యకల్లోలం కథసంపుటి అనుశీలన	- శ్రీపతి మారుతి	103

24. బోయ జంగయ్య కథలు- సమకాలీన దళితవాదం - సూరేపల్లి పద్మావతి 106
25. 'విషప్పురుగు' కథలు - గిరిజన, సంచార తెగల జీవన చిత్రణ - అంకిరెడ్డి సునీల్ కుమార్ రెడ్డి 109
26. తెలుగు కథ - సమకాలీనత - యండమూరి పారయ్య 113
27. తెలంగాణ కథ-వలస జీవన చిత్రణ - శ్రీరాముల తిరుపతి 116
28. బతుకు పయనం కథా సంపుటి- పద్మశాలీల జీవన చిత్రణ - పి. అనిల్ కుమార్ 122
29. నామని సుజనా దేవి కథలు - పరిశీలన - డా॥. పుప్పాల చైతన్య 126
30. తెలంగాణ కథల్లో గల్ఫ్ వలసలు - పుప్పాల రవీందర్ 129
31. పల్లె జీవితాల కథాశిల్పి-డా. కాలువ మల్లయ్య - కూకట్ల తిరుపతి 131
32. మంజుశ్రీ కథలు- మధ్యతరగతి కుటుంబాల జీవన చిత్రణ - నిరోష 135
33. 'ఈనాటి బంధమేనాటిదో' కథ -విశ్లేషణ - కటుకం శారద 137
34. కలువకొలను సదానంద కథల్లో సమకాలీనత - డా॥. వి. కృష్ణవేణి 141
35. ముదిగంటి సుజాతారెడ్డి కథలు - మానవీయ విలువలు - డా॥. ఎన్. దీపిక 144
36. డా॥. వి. ఆర్. రాసాని కథలు - మానవతా విలువలు - జి. నాగరాజు 151
37. "మాయిముంత" కథల్లో తెలంగాణ గ్రామీణవ్యవస్థ - రాజిరెడ్డి మహేందర్‌రెడ్డి 155
38. కేతు విశ్వనాథ రెడ్డి కథల్లో స్త్రీ - నాడు నేడు.. - డా॥. వైరాగ్యం ప్రభాకర్ 161
39. సమకాలీన తెలుగు కథ- కొన్ని నిర్మాణ వ్యూహాలు - డా॥. తన్నీరు సురేశ్ 164
40. సూపర్ మామ్ సిండ్రోమ్‌లో నేటి మహిళ - సండూరి అసంతలక్ష్మి 169
41. 2005 తెలంగాణ కథ సమకాలీనత - బూర్ల వేంకటేశ్వర్లు 172
42. సమకాలీన కథ - సార్వకాలీన దృశ్యాలు - డా॥. పి. విశ్వప్రసాద్ 176
43. కరీంనగర్ జిల్లా కథ - వృత్తిజీవనం - గండ్ర మహేశ్ 183
44. సామాజిక ప్రతిబింబంగా కథ - డా॥. బి. వి. ఎన్. స్వామి 193
45. విలక్షణ ప్రశ్నల సమాహారం - కె.వి.నరేందర్ 'విభిన్న' కథలు - వడ్డేపల్లి సంధ్య 196
46. జాతశ్రీ ఆర్తారావం కథసంపుటి పరిశీలన - జవ్వాజి రాణాప్రతాప్ 200
47. తెలంగాణ కథ- రైతు జీవన చిత్రణ - సి.హెచ్. కవిత 203
48. మాలాకుమార్ గారి 'నీ జతగా నేనుండాలి - సమకాలీనత' - ఆంజనేయులు. బి 209

'విషప్పురుగు' కథలు – గిరిజన, సంచార తెగల జీవన చిత్రణ

- అంకిరెడ్డి సునీల్ కుమార్ రెడ్డి, రీసెర్చ్ స్కాలర్, తెలుగు శాఖ, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

మన చుట్టూ ఉన్న ఈ సమాజంలో మమేకమై అనేక రకాలైన మతాల వారు కులాల వారు జీవిస్తూ వారికి తెలిసిన, వారికి వచ్చిన పనిని చేసుకుంటూ ఈ జనజీవన స్రవంతిలో కలిసిపోతున్న వారిని ప్రతిరోజూ మనం చూస్తూనే ఉంటాము. అయితే ఈ విధమైనటువంటి సమాజానికి (ప్రతి రోజూ మనం చూస్తున్న సమాజానికి) భిన్నమైన జీవితాన్ని గడుపుతూ, సమాజం నుండి విసరివేయబడినట్టుగా ఒక విచిత్రమైన వేషధారణతో ఒక విచిత్రమైన బాషతో మనకు దూరంగా ఏ కొండల్లోనో, గుట్టల్లోనో, అడవులలోనో జీవిస్తూ కొన్ని జీవితాలు ఉన్నాయి. వారినే మనం ఈనాడు గిరిజనులుగానో, యాచక తెగలకు సంబంధించిన వారిగానో చెప్పుకుంటున్నాం.

ఈ గిరిజనులు, సంచార యాచక జీవనాన్ని గడుపుతున్న వారు అనేక కారణాలవల్ల మైదాన ప్రాంతాల్లోకి వచ్చి ఇండ్లు కట్టుకొని కాలం గడుపుతున్నారు. వీరిలో కొందరు ఈ నాగరిక సమాజంతో పోటీపడి జీవించలేక అదే యాచక వృత్తిని స్వీకరించి వారికి తెలిసిన విద్యల్ని ప్రదర్శిస్తూ ప్రభుత్వ పథకాలకు దూరంగా విద్య, వైద్య, ఆరోగ్యాలకు, సాంకేతికతకు దూరంగా జీవిస్తున్నారు. ఇటువంటి వారి జీవితాల్ని, వారి సంస్కృతుల్ని, వారి సమస్యల్ని తమ కథల్లో అక్షరబద్ధం చేసిన వారిలో వి.ఆర్. రాసాని ఒకరు.

రాసాని పూర్తిపేరు రాసాని వెంకట్రామయ్య. ఈయన చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలంలోని కురవపల్లెలో 1957 ఏప్రిల్ 19 న పుట్టాడు. ఈయన నూట యాభైకి పైగా కథలు రాశారు. వీరి కథలు 'మెరవణి', 'పయనం', 'మా ఊరి కథలు', 'మృత్యుక్రీడ', 'ముల్లుగర్ర', 'విషప్పురుగు', 'శ్రీకృష్ణ దేవరాయల కథలు' అనే సంపుటాలుగా వెలుగులోకి వచ్చాయి. కథా రచయితగానే కాక రాసాని నవలాకారుడిగా, నాటకకర్తగా, కవిగా, విమర్శకుడిగా, పరిశోధకుడిగా, అధ్యాపకుడిగా అనేక కోణాల్లో తెలుగు సాహిత్యానికి జవసత్వాలను కల్పిస్తున్నాడు. ఇంకా ఈయన కథలు, నవలలు అనేకం కన్నడ, తమిళ, హిందీ, ఆంగ్ల భాషల్లోకి అనువాదం కూడా అయ్యాయి. ప్రస్తుతం 'విషప్పురుగు' అన్న కథాసంపుటిలోని గిరిజన, సంచార తెగల జీవన చిత్రణను, వారి సమస్యలను పరిశీలించడమే ఈ పత్ర ఉద్దేశం.

'విషప్పురుగు' కథా సంపుటి ప్రజాశక్తి బుక్ హౌస్ వారిచే 2017లో ముద్రించబడింది. ఇందులో నాలుగో నాటకం, విషప్పురుగు, వేట, కుబుసాలు, పయనం, ఎన్ కౌంటర్ లాంటి పదమూడు కథలు ఉన్నాయి. ఈ సంపుటి నిండా నక్కల్లోల్లకు, ఇర్లోల్లకు, యానాది, ఎరుకల, దొమ్మర, సుగాలి, యాచక వృత్తిలోని ఎలుగ్గొడ్డోల్లకు, ముడ్డి గంటోల్లకు, జంగమోళ్ళకు సంబంధించిన కథలే ఎక్కువగా కనిపిస్తాయి.

ఈ కథల్లో గిరిజనులు, సంచార తెగల వాళ్ళు ఒక నాటు తుపాకిని చేత పట్టుకునో, ఒక పామేరును నడుముకు కట్టుకునో, ఒక ఎలుగ్గొడ్డును ఆడిస్తూనో, గంగ జాతరలో వేషంలా ముఖానికి రంగేసుకొని ఏ డముకో ధక్కీనో వాయిస్తూనో, దొమ్మరాట వేస్తూనో, సర్కస్ ఫీట్లు చేస్తూనో, అడవిలో నుండి దొంగతనంగా కట్టెల మోపునో, ఏ కుందేలు పిల్లనో, ఏ నక్షత్ర తాబేల్లనో, ఏ పూడుపామునో చేతపట్టుకొని ఫారెస్ట్ ఆఫీసర్ల కంటబడి దెబ్బలు తింటూనో, చేయని నేరం మోపబడి దెబ్బలు తింటూనో, సూదులు, దబ్బనాలు, దారాలు, ఊపర బుడ్లు, కంజు పిట్టలు అంటూ ఏ పీఠిలోనో కనిపిస్తారు. వాళ్ళ వృత్తి జీవన సంస్కృతులతో పాటు ప్రపంచీకరణ

పేరుతోనో, రాజకీయ పలుకుబడి పేరుతోనో ఏదో ఒక విధంగా మోసగింపబడి పాతాళానికి తొక్కివేయబడుతున్న వైనాన్ని రచయిత ఈ కథల ద్వారా మనకు కళ్ళకు కట్టినట్టు చూపిస్తాడు.

ఈ సంపుటిలో మొదటి కథ నాలుగో నాటకం. ఇది పరస్పరానుబంధం ఉన్న యాచక కులాల వారి గురించి రాసిన కథ. ఈ కథలో గొరవయ్య, ఎలుగ్గొడ్డోడు, ముడ్డిగంటోడు ప్రధాన పాత్రలు. శ్రీశైలంలో ఉండే శివయ్య పేరు మీద పెళ్లి కాని మగవారికి శివదీక్ష ఇచ్చి గురవయ్యను చేస్తారు. తరువాత వారు నల్ల గౌను తొడిగి, నడుముకు గవ్వల పట్టీ కట్టి, తలకు ఎలుగుబంటి చర్మంతో కుట్టిన మూరడెత్తు టోపీని ధరించి భిక్షమెత్తు కుంటారు. అప్పటి నుండి వీరిని శివదాసర్లు అంటారు. ఈ శివదాసర్లకు ఆటాపాటా నేర్పే గురువే మన గురవయ్య. ఇతని టోపీని ఎలుకలు కొరికేసాయని దానికోసం ఎలుగ్గొడ్డోడిని వెతుక్కుంటూ ఊరూరు తిరుగుతుంటాడు. ఒకదగ్గర ముడ్డిగంటోడు కన పడడంతో, ముడ్డిగంటోడు ఎలుగ్గొడ్డోడి సహవాసి కాబట్టి వాడుకూడా ఇక్కడే ఉంటాడని వెతికి ముగ్గురూ ఒకచోట కలుస్తారు. గురవయ్యకు కావలసిన టోపీ కోసం ముగ్గురూ కలిసి అడవిలో ఒక బండపైన ఉన్న ఎలుగ్గొడ్డోడి, ముడ్డిగంటోడి 'గెర'కి పయనమైతారు. ఈ క్రమంలో రచయిత గురవయ్యల శివదీక్ష విధానాన్ని, ఎలుగ్గొడ్డోడికి ఆ వృత్తి వాళ్ళ పూర్వీకుల నుండి వచ్చిన విధానాన్ని, నడుముకు డోలు కట్టుకొని ఆట ఆడే ముడ్డిగంటోడి వృత్తి విధానాన్ని ఇలా ఈ మూడు కులాల వాళ్ళ సంస్కృతుల్ని, చరిత్రను పరిచయం చేస్తూ వారివెంట పాఠకులైన మనల్ని నడిపిస్తాడు రచయిత.

అయితే ఇక్కడ వారికి ఎదురయ్యే సమస్య ఒకటి ఉంది. వీళ్ళు అడవిలో ఉన్న వాళ్ళ గెరికి వెళ్లేసరికి అక్కడ బండ మీద ఉండే గుడిసెలు వాళ్ళ మనుషులు కనపడరు. అక్కడున్న పెద్ద బండ కూడా సగం కనపడ కుండా ఉంటుంది. కారణం పట్టణాలల్లో మిద్దెలకు, రోడ్లకు, రైలు పట్టాలకు డిమాండున్న కంకర కోసం ఒక కోటీశ్వరుడు ప్రభుత్వం నుండి లైసెన్సు తీసుకొని పెద్ద మిషన్తో వాళ్ళుంటున్న బండను కొట్టి కంకరగా పట్టణాలకు తోలుతుంటాడు. ఉన్నట్టుండి ఎలుగ్గొడ్డు బండ వైపు పరిగెత్తింది దాని వెనకే ఎలుగ్గొడ్డోడు, ముడ్డిగంటోడు కూడా పరిగెత్తారు చివరికి బండ చీల్చడం కోసం పెట్టిన నాట్లు పేలి ముగ్గురూ మరణిస్తారు. ఈ కథలో రచయిత యాచక కులాల సంస్కృతుల్ని మనకు పరిచయం చేస్తూనే, ఒక వైపు వారిపైన ప్రపంచీకరణ ప్రభావం ఏవిధంగా ఉందో కూడా తెలియజేస్తాడు.

అడవిలో ఎక్కడ నీళ్లుంటే అక్కడ గుడారాలేసుకొని, అడవిలోని జంతువుల్ని వేటాడి తింటూ, ఆ ప్రాంతంలో ఉన్న పల్లెల్లో పిన్నీసులు, పూసల దండలు అమ్ముకొని వచ్చే డబ్బుతో కావలసినవి కొనుక్కొని జీవించే సంచార జీవులైన నక్కల్లోల్ల కథ 'పయనం'.

రచయిత ఈ కథలో అడవిని ఆధారంగా చేసుకొని జీవిస్తూ అక్కడ వర్షాల్లేక నీళ్ళు లేక సరైన ఇండ్లు లేక ఇబ్బంది పడుతూ ఉన్న నాగప్ప తనతోటి గెరి ప్రజల కష్టాలను ఒకపక్క, పట్టణ వాతావరణంలో ఈ పిన్నీసులు, దారాలు లాంటి వ్యాపారంతో పెదపెద్ద కంపెనీలతో పోటీ పడి బతకలేక ఈ ప్రపంచీకరణ దెబ్బకు బలవుతున్న నాగప్ప కొడుకు నరసప్ప కష్టాలను ఒక పక్క చిత్రిస్తాడు.

ఊట్లోని వంకలో గుడారాలేసుకొని బతుకుతున్న వారిలో అజ్జప్ప, నాగప్ప ఒక రోజు నక్కని కొట్టాలని తుపాకి చేతపట్టుకొని అడవులింటీ పోతుంటారు. ఈ అడవులపైనబడి బతకలేక టవునుకు పాయ్యి పూసలు, దారాలు గువ్వలు అమ్ముకుంటూ బతుకుదామని వెళ్ళిపోయిన నాగప్ప కొడుకు నరసప్ప గురించి మాట్లాడుకుంటూ వెళ్తుంటారు. అలా వెళ్తున్న క్రమంలో వీళ్ళకి తెలిసిన ప్రతి ఆకును, ప్రతి తీగను, ప్రతి గడ్డను పాఠకుడికి పరిచయం చేస్తాడు రచయిత. అంతే కాదు అజ్జప్ప, నాగప్పలు వాళ్ళ అనుభవాలను ఒకరితో ఒకరు పంచుకుంటూ అడవిలో నడుస్తూ నక్కల్ని వేటాడడం,

గుడ్లగూబల్ని కొట్టడం మొదలైన నక్కల్లో వేట కళకి సంబంధించిన నైపుణ్యాన్ని రచయిత మనకు పరిచయం చేస్తాడు.

ఒక రోజు కట్టెలమోపు తెస్తున్న పల్లెల వాళ్ళని ఫారెస్ట్ ఆఫీసర్లు పట్టుకొని 'మీ వల్లే అడవిలో జంతువులు నశించిపోతావుండాయి. ఇంక అడవుల్లో డేరాలేసినారంటే జైల్లో తోస్తాం. తుపాకులుంటే ఇచ్చేయండి. ఇంకా అడవుల్లో కనపడ్డారంటే నక్సలైట్లని కాల్చిపారేస్తాం' అంటూ బెదిరించి వాళ్ళ గుడారాలు పీకేస్తారు. ఇక్కడ రచయిత నక్కల్లో ఆవేదనను ఈవిధంగా పలికిస్తాడు. "అడవిలో జంతువులు నాశనమైపోతున్నాయని మమ్మలను తరిమేస్తున్నారే గానీ, అడవుల పైనబడి బతికే మా బతుకులు ఏమైపోతాయోనన్న యోచన ఒగనికీ లేదు. జంతువులకంటే కానాకష్టమై పోతాండాయి మా బతుకులు". తరవాత అడవుల్లో తమ వృత్తిని, తుపాకులు వదిలేసి బతకలేక, పట్టణాలల్లో వారికి తెలిసిన వ్యాపారం చేసి ఎదగలేక దిక్కుతోచని స్థితిలో కొడుకు వెనకంటి నాగప్ప అతని వెనక గెరి జనం గమ్యం తెలీని పయనాన్ని సాగిస్తారు.

'వేట' అనే కథ నద్దినీల్లకు కూడా గతిలేని ఒక యానాది కుటుంబం యిస్సుల్లను పట్టుకుని ఏపూట కాపూట కడుపునింపుకునే విధాన్నాన్ని చిత్రిస్తుంది. ఈ కథలో వెంకటస్వామి తన కుటుంబాన్ని కరువు కాలంలో పోషించడంకోసం, ఒక పామేరుని నోట్లోవేసుకొని ప్రాణాలను పణంగా పెట్టి రెండుమూడు రోజులు కష్టపడి పుట్ట నుండి యిసుల్లను తీస్తాడు. ఇక్కడ రచయిత వెంకటస్వామి ఆ యిసుల్లను ఎంత నేర్పుతో పట్టుకుంటాడో కళ్ళకు కట్టినట్టు చిత్రిక పట్టి చూపిస్తాడు. ఇలా జీవనం సాగిస్తున్న యానాదుల గుడిసెలను రోడ్ల విస్తరణ పేరుతో జేసీపీలతోను, బుల్డోజర్లతోను ప్రభుత్వమే కూలుస్తూ ఉంటే నోరెత్తి ప్రశ్నించలేని యానాదులు అడవుల్లో తిరిగే జీవాలకు రక్షణ కల్పించే ఈ గవర్నమెంటు ఆ అడవులపైబడి బతికే మమ్మల్ని మాత్రం పట్టించుకోరు అంటూ బాధను వ్యక్తం చేస్తారు.

రైతుల దగ్గర నాగళ్ళున్నట్టు, కంసలోళ్ళ దగ్గర సుత్తులు సీర్నాలున్నట్టు, కుమ్మరోళ్ళ దగ్గర సారే ఉన్నట్టు, సాకలోళ్ళ దగ్గర ఇస్త్రీ పెట్టె ఉన్నట్టు, మంగలోల్ల దగ్గర అడపం ఉన్నట్టు, మాల మాదిగోల్ల దగ్గర పలక, పంబళ్ళు ఉన్నట్టు, నక్కల్లోల్ల దగ్గర నాటు తుపాకీ ఉంటే తప్పా అంటూ, మనుషుల్ని కాల్చే తుపాకీకి లైసెన్సు ఉండాలిగాని గువ్వల్ని, నక్కల్ని కాల్చే నాటు తుపాకీలకు లైసెన్సు లెందుకు అంటూ ప్రశ్నించే కథ 'ఎన్ కౌంటర్' కథ. అడవిలో తలా రెండెకరాలు చదును చేసుకోండి పట్టా లిపిస్తామని ఎం.ఆర్.ఓ చెప్పినందుకు గంగజ్జు తన తండ్రి వెంకజ్జు భూమిని సదరం చేసుకొని పట్టాకోసం ఎదురు చూస్తుంటారు. పల్లె పల్లె తిరిగి పూసలు, సవరాలు అమ్ముకొనే బతుకు పోయి ఇదివరకెన్నడూ లేని భూమిని వ్యవసాయం చేసి బ్రతకవచ్చు అని ఆనంద పడుతుంటారు. అయితే తిండికి టికానాలేని వీళ్ళు తన పొలం పక్కనే తనకు ధీటుగా వ్యవసాయం చేస్తారనే ఒక అహంతో ఆ ఊరి సర్పంచ్ చౌదరికి మనసొప్పదు. వారి నుండి ఆ భూమిని ఎలాగైనా కొట్టెయ్యాలని చూస్తాడు. చివరికి సాధ్యపడక మంచి సమయం కోసం చూస్తుంటాడు. తరువాత వారికి వ్యవసాయం కొత్తని ఏ సాయం కావాలన్నా తనని అడగమని మంచిగా నటిస్తూ, సబ్సిడీలో లోను ఇప్పిస్తానని వారిదగ్గర నుండి భూమిని అందులో పంటను లాక్కొంటాడు. దీనికి వ్యతిరేకంగా గంగజ్జు యానాదుల ప్రతినిధిగా అందరూ కలెక్టర్ కి ఫిర్యాదు చేస్తారు. దీనితో చౌదరి పరువు ప్రతిష్టలకోసం వాళ్ళని ఎలాగైనా దెబ్బకొట్టాలనుకుంటాడు. చివరికి ఒక మంత్రి సహాయంతో తుపాకీ ఉన్న కారణంగా నక్సలైట్ అన్న నెపంతో ఎన్ కౌంటర్ చేయిస్తాడు.

ఈ కథలో యానాదులు అధికారుల భూ దాహానికి, పోలీసుల దౌర్జన్యానికి తప్పుడు కేసులకి బలైపోయిన వారుగా కనిపిస్తారు. అయితే ఈ కథ చదువుతున్నప్పుడు వారికి జరిగిన అన్యాయానికి బందులు, రాస్తారోకోలు చేస్తూ వారి అస్తిత్వం కోసం కొంత చైతన్యంతో పోరాటం చేసినట్లు కనిపిస్తారు.

ఈ కథా సంపుటిలో 'అదృశ్య విధ్వంసం', 'పాడిగింపు' అనే కథలు కొంత వైవిధ్యంతో కనిపిస్తాయి. గిరిజన సంచార తెగల కథలలో ఎక్కువగా వేట వృత్తిని నమ్ముకొని జీవించే వారే కనిపిస్తారు. అయితే ఈ యాచక కులాల వారిలో ఉన్న కళాకారుల జీవితాలను చిత్రించిన కథలుగా ఈ రెండు కథలు కనిపిస్తాయి.

ఆధునికత, సాంకేతికత పెరిగి టీవీలు, సినిమాలు పెరగడం కారణంగా వీధుల్లో సర్కస్ ఫీట్లు, రికార్డింగ్ డాన్సులు, దొమ్మరాటలు వంటి వాటికి ఆదరణ తగ్గి, వాటిని నమ్ముకున్న జీవితాలు గడవడం దుర్భర మౌతున్నది. ఇలా దొమ్మరాటను నమ్ముకున్న వెంకట స్వామి కుటుంబ కథే 'అదృశ్య విధ్వంసం'.

అలాగే బుడిగె జంగమోళ్ళ కళను గురించి తెలియ జేసే కథ 'పాడిగింపు'. చనిపోయిన వాళ్ళను తలుచు కుంటూ వారి జ్ఞాపకాలను కలకాలం దాచుకునేందుకు రైతులు ఈ పాడిగింపు పాటను పాడించుకుంటారు. ఇందులో జంగం గుండప్ప అతని భార్య శివమ్మ తంబురను, గుమ్మెతను చేత పట్టుకొని 'తందానతాన' అంటూ ప్రతి ఇంటికి వెళ్లి భిక్షమెత్తుకొని జీవిస్తుంటారు. ఒక ఊరిలో ఇంటికొక చరణం చొప్పున పాట పాడుతూ చివరి ఇంటికి వస్తారు. అప్పటికే శివమ్మకు వంట్లో నీరసం ఎక్కువై కాళ్ళూ చేతులూ వణుకుతూ ఉంటాయి. ఆసమయంలో ఒకామె చనిపోయిన తన చిన్న కొడుకు పైన పాడిగింపు పాడమంటుంది. అప్పటికే ఓపిక నశించిన గుండప్ప, శివమ్మ చాలా రోజుల తరవాత జనం మర్చిపోయిన పాడిగింపును అడిగినందుకు ఉత్సాహంతో పాడుతారు. పాట అయిపోయాక వాళ్ళిచ్చింది తీసుకొని బోరింగు దగ్గర నీళ్ళు తాగుతుండగా శివమ్మ కళ్ళు తిరిగి పడిపోతుంది. అదే సమయంలో గుమ్మెత తంబురపై పడడంతో అవి పగిలిపోతాయి.

ఒకపక్క ఆకలితో నీరసించి కిందపడ్డ భార్య మరోపక్క తరతరాలుగా వస్తున్న వాయిద్యాలు పగిలిపోయిన దృశ్యాన్ని చూసి గుండప్ప తన పరిస్థితికి చాలా బాధపడుతూ, పాడిగింపు పాడి పోయినోళ్ళ జ్ఞాపకాలను పదిలం చేసే మనల్ని ఎవ్వరూ గుర్తించట్లేదు. ఈ కాలంలో అంతా వ్యాపారమే మనకళలు వ్యాపార స్థాయికి ఎదగలేక ఆ విలువలను అందుకోలేక ఆదరణ కరువైపోతుంది. ఈ కళ మనతోనే ముగిసిపోతుంది. ఈ పాడిగింపు మనతోనే కడ అంటూ బాధపడిన పరిస్థితులను రచయిత ఈ కథలో చూపిస్తాడు.

అలాగే కుబుసాలు అనే కథ కూడా ఇర్లోళ్ళ కుల వారసత్వమైన పీధి నాటకం, యానాది చిందును నమ్ముకొని జీవించే వారి కథ. ప్రభుత్వం జంతువుల పాముల చర్మాలు తీసి అమ్ముకోవడం నిషేధించిన తరువాత, ఏపని చెయ్యాలో తెలీక వారి కులవృత్తి అయిన చిందు నాటకం వేద్దామని ముఖానికి రంగులేసుకొని చిన్న వ్యాపార కేంద్రమైన కల్లూరులో అంగళ్ళ ముందర చిందేస్తూ యాచక వృత్తిని సాగిస్తుంటారు ఇర్లోళ్ళు. ఈ క్రమంలో ఇర్లోళ్ళు పాములు పట్టి వాటి చర్మాలు తీసే విధానం, అందులోని మెలుకువలు, వారి జీవనాను భవాల్ని ఈ కథలో మనకు పరిచయం చేస్తాడు రచయిత.

గర్భిణీ చనిపోతే ఆమెను అట్లే దానం చేస్తే ఊరికి కీడు తగులుతుందని, తల్లిని బిడ్డని వేరు చేసి పూడ్చే ఆచారం ఉన్న గ్రామాల్లో ఆపనిని చేసే మొండోళ్ళ వృత్తిని పరిచయం చేసే కథ 'కీడు'. అలాగే ఎరుకల వివాహ వ్యవస్థను తెలియజేస్తూ నల్ల పూసలు కథ, ఇలా ఈ సంపుటంలోని ఏకథను చూసినప్పటికీ మనకు తెలీని, దగ్గరగా లేని కొన్ని జీవితాలను, వారి సంస్కృతులను, వారి కష్టాలను మనకు పరిచయం చేసేవిగానే కని పిస్తాయి.

ఆధార గ్రంథాలు :

1. వి.ఆర్. రాసాని. విషప్పురుగు (గిరిజన, సంచార తెగల కథలు). విజయవాడ: ప్రజాశక్తి బుక్ హౌస్. 2017.
2. కృష్ణారెడ్డి, నాగోలు. వెంకటేశ్వర్లు, పి.సి. (సంపాదకులు). డా.వి.ఆర్. రాసాని సాహిత్య సమాలోచన. చౌడేపల్లి: విజయవాణి ప్రింటర్స్. 2017.

ISBN : 978-93-5396-948-6

యు.జి.సి. వారి సౌజన్యంతో.....

తెలుగు నవల

భారతీయ వృత్తి జీవిత ప్రతిఫలనం



సంచిక

సదస్సు సంచాలకులు, సంపాదకులు
డా॥ పాదిలి నాగరాజు
యం.ఎ., పిహెచ్.డి.

ప్రధాన సంపాదకులు
డా॥ డి. గిరి
యం.ఎస్సీ., పిహెచ్.డి.

శ్రీ అద్దేపల్లి సీతానారాయణ మూర్తి ప్రభుత్వ కళాశాల
(స్వయం ప్రతిపత్తి)
పాలకొల్లు - 534 260, పు॥గో॥ జిల్లా, ఆంధ్రప్రదేశ్

విషయ సూచిక

01. నవలా సాహిత్యంలో కల్లుగీత కార్మిక వృత్తి చిత్రణ – ప్రొఫెసర్ నసుమాస స్వామి 1
02. నా రెండు వృత్తి కళాకారుల నవలలు – డా॥ వి.ఆర్. రాసాని..... 7
03. గంగిరెద్దుల వారి వృత్తి జీవితం – పరస – పెదపాటి ఎస్.వి.వి. శ్రీదేవి..... 11
04. బోయ వీరుల కథ – సుంకర గోపాలయ్య 17
05. "బతుకాట" నవల – వృత్తి జీవితం – దారపురెడ్డి కనకమహాలక్ష్మి..... 21
06. అతడు అడవిని జయించాడు నవల – వృత్తిజీవన ప్రతిఫలనం – డా॥ బిర్రు అశోక్ 24
07. ఎన్నెల నవ్వు – యానాదుల వృత్తి జీవితం – డా. యు.ఝాన్సీ..... 29
08. సలీంగారి "గుర్రపుడెక్క" నవల–చెంచుల వృత్తి జీవనం – డా.పి.భగ్గు నాయక్ 33
09. పోరాట దృక్పథ స్త్రీ కి ప్రతీక – కాటి చిలుక – భమిడిపాటి గౌరీశంకర్ 39
10. 'ఉతికేసిన బతుకులు' నవల – రజకవృత్తి చిత్రణ – డా. జడా సుబ్బారావు..... 42
11. తెలుగు నవల చర్మకారుల వృత్తి జీవితం – పొన్నాల ఉపేందర్..... 45
12. 'పొత్తి' నవల – వ్యావసాయిక వృత్తి చిత్రణం – చల్లా నరేందర్..... 50
13. 'అంధకారంలో ' నవల – సమాజం, వేశ్యావృత్తి వేదనలు.! – ప్రవీణ్ కుమార్ యజ్జల.. 56
14. తెలుగు నవల గిరిజన (ఎరుకల) వృత్తి జీవితం – రాజు దేవర 62
15. పోరంకి దక్షిణామూర్తి 'ముత్యాల పందిరి' నవల – నేతన్నల జీవన చిత్రణ – డా.పి.వి.లక్ష్మణరావు 72
16. "ఋతుపవనాలు" నవల – రాయలసీమ రైతు జీవన విధానం – గంటా శంకరరావు... 78
17. 'పచ్చగా నూరేళ్లు' నవల – వ్యవసాయ వృత్తి సమస్యల చిత్రణ – అంకిరెడ్డి సునీల్ కుమార్ రెడ్డి .. 81
18. సుషుప్తి నవలలో కుమ్మరి జీవిత చిత్రణ – తంగి ఓగేశ్వరరావు 86
19. తోలు బొమ్మలాటలు నవల – విశ్లేషణ – డా॥. బశెట్టి ఉపేంద్ర..... 89
20. బడుగు జీవుల కష్ట సుఖాల కలనేత చిలకలంచు జరీకోక- నవల – ఆచార్య.జి.వి.ఆనంద కుమార్.... 92
21. తెలుగు నవల – వెనుకబడిన కులాల వృత్తి జీవితం – రుద్రరాజు రామకృష్ణం రాజు.... 96
22. చివరి గుడిసె –యానాదుల సంచారజీవితం – తోట రామకృష్ణ 101
23. సంకెళ్లు తెగాయి: వృత్తి జీవన చైతన్యం–విశ్లేషణ – శ్రీపతి మారుతి..... 105
24. 'పంచమం' 'కొంగవాలు కత్తి' నవలల్లో వృత్తి జీవన ప్రతిఫలనం – డా॥ ఈతకోట ఈశ్వరరావు 108
25. ముద్ర – మాతంగి జీవితాలు – డా.చదలవాడ విజయ కుమార్ 111
26. లంబాడీలు – జీవన రేఖ – డా॥ ఎన్.హెచ్.పి. కిరణ్ కుమార్..... 115
27. గిరిజన నవలలు – యానాదుల వృత్తి జీవితం – డా॥ శ్రీను కేతావత్ 118
28. బొగ్గుగని కార్మికుల వ్యథల్ని ఆవిష్కరించిన నవల "సింగరేణి మందుతోంది..." – రామారావు గంజికుంట్ల ... 120

17. 'పచ్చగా నూరేళ్లు' నవల - వ్యవసాయ వృత్తి సమస్యల చిత్రణ

అంకిరెడ్డి సునీల్ కుమార్ రెడ్డి.
పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ
హైదరాబాదు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.
చరవాణి నెం.7382301101

ప్రాచీన మానవుడి దగ్గర నుండి నేటి ఆధునిక మానవుని వరకూ మనిషికి ప్రధానంగా కావలసినవి మూడు. అవి కూడు, గూడు, గుడ్డ. ఆదిమానవ యుగం నుండి మనిషి చాలా కాలం గూడు, గుడ్డ లేకుండా కాలాన్ని నెట్టుకొంటూ వచ్చాడే కాని తిండి లేకుండా మాత్రం కాదు. తిండి లేకుండా మనిషి జీవించలేడు. అలాంటిది నేడు భారతదేశానికే కాదు యావత్ ప్రపంచానికి కూడా తిండిని అందిస్తున్నది కర్షక వీరుడు రైతన్న మాత్రమే.

వ్యవసాయం ప్రధాన వృత్తిగా గల దేశం భారతదేశం. భారతదేశంలో డెబ్భై శాతం ప్రజలు గ్రామాల్లోనే నివస్తున్నారు. వీరిలో చాలా వరకు వ్యవసాయ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఈ వ్యవసాయ వృత్తిని నమ్ముకున్న రైతును ఆశ్రయించి గ్రామాల్లో మంగలి, చాకలి, కంసాలి, కురబ, వడ్రంగి లాంటి అనేక కులవ ృత్తుల వాళ్ళు జీవిస్తున్నారు. అయితే యాంత్రీకరణ పెరిగిన తరవాత వీళ్ళు పల్లె నుండి పట్టణాలకు వెళ్లి రకరకాల వృత్తి పనులను చేసుకుంటూ సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. వ్యవసాయ వృత్తిని నమ్ముకున్న రైతు మాత్రం ఆ మట్టిలోనే కష్టపడుతూ భారతదేశానికి వెన్నెముకగా నిలిచి అన్నదాతగా మారుతున్నాడు. ఇలాంటి రైతు లేకపోతే మనుషులందరూ ఆకలితో అలమటించాల్సిందే. కానీ నేడు వ్యవసాయ వృత్తిని నమ్ముకున్న రైతు జీవితం మాత్రం అనేక ఒడిదుడుకులకు లోనవుతూ ఉంది. భారతదేశం శాస్త్ర సాంకేతిక రంగంలో మహత్తరమైన అభివృద్ధి సాధిస్తున్నప్పటికి, అంతర్జాలం మొత్తం అరచేతిలోకి వస్తున్నప్పటికి రైతు జీవితం మాత్రం మారడం లేదు.

వర్షాభావం, ఎండిపోతున్న బావులు, చెరువులు, బోర్లు, వరదలు, తుఫాన్లు, నకిలీ విత్తనాలు పెరుగుతున్న ఎరువుల ధరలు వీటికి తోడు పంటకు గిట్టుబాటు ధర కల్పించలేని మార్కెట్టు వ్యవస్థ కలిసి రైతు జీవితాన్ని ఇంకా చిద్రం చేస్తున్నాయి. వీటన్నింటి నుండి రైతును బయట పడేస్తాం అంటూ అభివృద్ధి అంచులు చూపిస్తామంటూ నిరంతరం ప్రాకులాడుతున్నట్టు కనపడే రాజకీయ నాయకులు ఐదేళ్లకు ఒకసారి మారుతూనే ఉన్నారు. అనేక హామీలు ఇస్తూనే ఉన్నారు. అయినా వ్యవసాయం అభివృద్ధి చెందలేదు. రైతుల ఆకలి బాధలు తీరలేదు.

ఇలాంటి రైతును, రైతు నమ్ముకున్న వ్యవసాయ వృత్తిని అందులోని కష్ట సుఖాలను, లాభ నష్టాలను, వారి ఈతి బాధలను చిత్రించిన సాహిత్య ప్రక్రియల్లో నవలా ప్రక్రియ ఒకటి.

చిత్తూరు జిల్లా నుండి వ్యవసాయ వృత్తికి సంబంధించి నవలలను కథలను రాస్తూ కల్పనాసాహిత్యానికి జవసత్వాలు కల్పిస్తున్న రచయితలలో లంకిపల్లి కన్నయ్య నాయుడు ఒకడు. ఈయన చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం తోటవారిపల్లెలో జన్మించారు. కథకుడిగా 'జీవనం', 'బతుకు బాట', 'తొలకరి వానకు తడిసిన గుండె' అనే మూడు కథా సంపుటాలను, నవలా రచయితగా 'పచ్చగా నూరేళ్లు', 'జీవకోన', 'తొలిసంధ్య', 'ఏటిగట్టు' అనే నాలుగు నవలలు రాశారు. ఇందులో పచ్చగా నూరేళ్లు, జీవకోన అనే నవలలు వ్యవసాయ వృత్తికి సంబంధించినవి. **పచ్చగా నూరేళ్లు** నవలలో వ్యవసాయ వృత్తికి సంబంధించి రైతుల బాధలను విశ్లేషించడం ఈ పత్రం యొక్క ముఖ్య ఉద్దేశం.

పంటపల్లె కేంద్ర బిందువుగా చుట్టూ ఉన్న పది గ్రామాలను కలిపి పిలవబడే కుంటలదిన్నెల్లోనే ఈ నవలంతా సాగుతుంది. ప్రథమ పురుష కథనంలో సాగిన ఈ నవల వరదరాజు ప్రధాన పాత్రగా, మూడుతరాల కాలంలో మారుతున్న మనుషుల మనస్తత్వాలను, కాలానుగుణంగా పల్లెలో మారుతున్న పరిస్థితులను, వ్యవసాయానికి ప్రతికూలంగా మారుతున్న ప్రకృతిని, శరీర కష్టంతో పగలు, రాత్రి, ఎండ, వాన అనే భేదం లేకుండా కష్టపడి పండించిన పంట దళారీ మోసాలకు, వ్యాపారస్తుల ధగ్గర చేసిన అప్పులకు జమవుతున్న పరిస్థితులను, గిట్టుబాటు ధర కల్పించకుండా రైతును కుంగదీస్తున్న మార్కెట్టు వ్యవస్థలాంటి సమస్యలను ప్రధానంగా చేసుకొని ఈ నవలా రచన సాగుతుంది. వీటితో పాటూ ఈ నవలలో రైతుకు మట్టికి గల బంధాన్ని, వ్యవసాయంలో రైతుకు తోడ్పాటుగా ఉండే ఎద్దుల పట్ల ప్రేమను, పచ్చని పైరు సొగసందాలను, సాటి మనుషుల పట్ల చూపే ప్రేమానురాగాలు ఈర్ష్య అసూయలు, రైతు – రైతు కూలీల అనుబంధాలను, కరువు యొక్క వికృత రూపాన్ని పాఠకుల మనసులను ఆర్ద్రతకు గురిచేసేలా, చాలా సహజంగా, వాస్తవిక కోణంలో దృశ్యమానం చేశాడు రచయిత.

నవలలో పండయ్య కొడుకు వీరయ్య నాకు చదువు అబ్బదంలేదని చదువు మానేస్తానని చెప్తున్న కొడుకును బండ బూతులు తిట్టుకుంటూ సులగలతో కొడుతూ వరదరాజుతో "చూడు నాయనా! ఆ నీయాలు ఫైలయినాడు. కన్న కష్టం పడి చదివిస్తి. చవిటిమడి సవిరిపోయినట్లయింది, వాడి చదువు! కడుపు కాలతావుంది. బడికి పోరా అంటే వినడు"(పచ్చగా నూరేళ్లు, పుట 9). అంటూ ఒక రైతు కూలీ మూడుపూటలా తిండి లేకపోయినప్పటికీ కొడుకును చదివించాలనుకుంటాడు. కాని వరదరాజు తండ్రి రంగయ్య చదువుకున్న వ్యక్తి అయినప్పటికి మూర?త్వంతో "ఒరే! ముట్టాల్ ముండమోపి మాదిరిగా కూచుంటే సేద్యం ఎవరుచేస్తారు? ఒరే! ఒక్క మాట గుర్తుంచుకో. కోటివిద్యలు కూటి కొరకే. ఏ ఉదోగమైనా కొండ్రతో సాటిరాదు!" (పచ్చగా నూరేళ్లు, పుట 26) అంటూ ఎస్.ఎస్.సి లో జిల్లా ఫస్టు వచ్చిన కొడుకుతో ఆన్న మాటలని చూస్తుంటే చదువుపట్ల రైతుకు ఎలాంటి అభిప్రాయం ఉందో అర్థమవుతుంది. అయితే అందుకు కారణం లేకపోలేదు చదువుకు రూపాయి వెచ్చించలేని పేదరికం, అదే తండ్రి వ్యవసాయానికి కొడుకు తోడైతే కుటుంబం కొంతైనా వృద్ధిలోకి వస్తుందన్న నమ్మకం.

నిజానికి ఈ పరిస్థితులు సమాజంలో నేటికీ అలానే ఉన్నాయి. వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులు, రైతు కూలీలు తమ పిల్లల్ని చదివించే శక్తి సామర్థ్యం లేక కూలీలుగానో హోటల్లల్లో పనిచేసే వారిగానో మారుస్తున్న వైనం ఇంకా కనిపిస్తూనే ఉంది. ప్రభుత్వం అన్ని వసతులూ కల్పిస్తున్నప్పటికీ నేటికీ బాల కార్మికులను చూస్తూనే ఉన్నాము. అందుకే అక్షరాస్యత కూడా అంతంత మాత్రంగానే పెరుగుతుంది.

పచ్చగా నూరేళ్లు నవలలోని గ్రామీణ ప్రజలు అందరూ పేదరికం వినిరిన వలలో పడి అల్లాడుతున్న వారే. పల్లె ప్రజల జీవన విధానం ఒక జూదంలాంటిది. వ్యవసాయం ఎప్పుడు ముంచుతుందో ఎప్పుడు గడ్డన పడేస్తుందో అర్థం కాదు. ప్రజల మధ్య ప్రతి చిన్నదానికీ అరుపులు కొట్లాటలే. అందుకు గల కారణం మారని వారి సామాజిక ఆర్థిక పరిస్థితులు చూస్తే అర్థమవుతుంది. "చెరుకు తోట గనేల మీద మోకాటి పడుగు గడ్డి ఏ గోద తనవాత పెట్టుకునిందో. కొడవలితో కోసినట్లు ఖచ్చితంగా మేసింది. దాని కడుపూద! దానికి దోమ్మరోగం తగలా!" (పచ్చగా నూరేళ్లు, పుట 44) అంటూ బొడ్డెమ్మ ఆవు దూడను పట్టుకెల్తున్న చెంగమ్మను తిడుతూ బూతుపురాణం మొదలుపెడుతుంది. దీనితో ఇద్దరి మధ్య వాగ్వివాదం పెరిగి మడి నుండి ఊరు చేరి ఒకరి మానం ఒకరు నది రోడ్డులోనే కడిగేసుకుంటారు. నిజానికి వారు వేరుపడిన ఒకింటి కోడల్లే. ఎంచేద్దాం పల్లెల్లో మనుషుల మధ్య మంచితనం ఉంది. దానివెనక అమాయకత్వమూ ఉంది. అంతకు మించి

అజ్ఞానము, అసూయలు, అమానుషత్వాలు ఉన్నాయి. అందుకే పల్లెల్లో ప్రతి చిన్న వాటికీ మాటలతో చేతలతో చివరికి ఖూనీలు చెయ్యడానికి కూడా సిద్ధపడుతూ ఉంటారు. అందుకు కారణాలు లేకపోలేదు ఎదుగు బోదుగు లేని బతుకులు, పల్లె ప్రజల గుమ్మాలు దాటని నాగరికత. ఇలాంటి గొడవలను నవలలో చాలా సహజంగా రచయిత చిత్రించాడు.

సకాలంలో వర్షాలు పడి, అనుకున్న విధంగా పంట చేతికి వచ్చి మంచి ధర పలికినప్పుడే రైతుకు నిజమైన ఆనదం. కానీ ఈ నవలలో పంటలకు అనువైన వాతావరం కుదిరి, పంటల దిగుబడి బాగా వచ్చినప్పటికీ 'కాసుచెట్టి' లాంటి వ్యాపారస్తుల చేతుల్లో మోసమోతున్న వైనం మనం చూడవచ్చు. కాసుచేట్టి పంటపల్లెలో రైతులకు వడ్డీకి డబ్బులిస్తూ ఒకపక్క వ్యాపారం కూడా చేసేవాడు. పంచాయితీలో కూడా ఇతనిదే పెద్దరికం. అది మధ్యంతర పదవి. ఎందుకంటే పల్లెలో డబ్బు ఎవరి దగ్గరుంటే వారిదే అధికారం.

రైతులు దుక్కి దున్ని నాట్లు వేసి పంటను బట్టి మూడు నెలల నుండి సంవత్సర కాలం కష్టపడి పండించిన పటను పొలంలో ఉండగానే రేటు నిర్ణయించి తీసుకునేవాడు. పంటలు ఇల్లు చేరినప్పుడు చాలా తక్కువ ధరలు. పంటను నిల్వచేసి రేటున్నప్పుడు అమ్ముదామనుకుంటే అందుకు గల సోకర్యాలు రైతులకు లేవు. ఒకపక్క అప్పిచ్చిన వ్యాపారస్తుల ఒత్తిడి. కాసుచెట్టిని కాదని ఏపనీ చెయ్యలేరు. ఎందుకంటే రైతుల పంటకు కావలసిన పెట్టుబడి అప్పురూపంలో ఇచ్చేది అతనే. ఇలాంటి పరిస్థితులలోనే రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటారు. అందుకే రచయిత "ఎద్దు పుండు నొప్పి కాకికేం తెలుస్తుంది? రైతు ఇక్కట్లు వ్యాపారికి సువర్ణావకాశాలు" (పచ్చగా నూరేళ్లు, పుట 59) అని అంటాడు.

ఈ నవలలో రచయిత రైతుల ఇక్కట్లతో పాటు రైతుల మీద ఆధారపడి కాలం గడిపే చాకలి, మేదరి, కంసాలి లాంటి వారి జీవితాల్లో గల దయనీయ పరిస్థితులను కూడా తెలియజేశాడు. చాకలి సాలమ్మకు ఇద్దరు కొడుకులు. వారినైనా మురికి బట్టలు ఉతికే పని నుండీ తప్పించాలన్నది ఆమె కోరిక. "చదువుకున్న వాడికంటే చాకలి నయం అంటారు. ఎంత తెలివిగా ఏ ఇంటి గుడ్డలు వారికి అప్పజెప్పినా అది బండ బతుకని" (పచ్చగా నూరేళ్లు, పుట 50)రచయిత సాలమ్మ పాత్ర ద్వారా వారి బాధను తెలియజేస్తూ, చాకలి వారు బట్టలు ఉతికే విధానమైన 'ఉబ్బ' ప్రక్రియను, 'ఉబ్బదేవర' విధానాన్ని తెలియజేస్తాడు.

రంగయ్య కపిల బాణను కుట్టించడానికి "ఒరే! పొండూ!కనపడవా! ఎప్పుడురా వచ్చేది? నీకు బుద్దిలేదు. నిన్న ఏం చెప్పినావు? తెల్లవారక ముందే వచ్చి కపిల బాణ కుట్టేపని ప్రారంభిస్తానన్నావా? ఇప్పుడెంత పోద్దేక్కింది? నీకు నీతి లేదు...." (పచ్చగా నూరేళ్లు, పుట 54) అంటూ పండయ్యను నోటికొచ్చినట్టు తిడుతూ పిలుస్తున్నాడు. కూతురు బాలింత దానికి కొన్ని నూకలు సరిచేసి వస్తానన్నా వినకుండా నోరుపారేసుకున్నాడు. అయినప్పటికీ రైతు బాగుంటేనే తనబాగని నమ్మే పండయ్య "మాదిగోని బతుకు మదురు మీద గడ్డి" (పచ్చగా నూరేళ్లు, పుట 56) అని బాధపడుతూ పుల్లయ్యని తోడు తీసుకొని ఉదయం నుండి సాయంత్రం వరకు రెండు ముద్దల సంగటి కోసం వారు పడే పాట్లను ఈ నవలలో మనం చూడవచ్చు.

పారిశ్రామిక అభివృద్ధి వల్ల వస్తున్న కొత్తరకం యంత్రాలు, పనిముట్లు వాడుకలోకి రావడంతో ఇళ్లల్లో నూనె దీపాల బదులు విద్యుత్ బల్బులు, బావుల దగ్గర గూడ, కపిల లాంటి వాటికి బదులు ఆయిల్ ఇంజన్లు, కరెంటు మోటార్లు ఇలా అనేక సౌకర్యాలు పల్లెకు తరలి రావడంతో కొలిమి పని చేసేవారి చేతికి పని తగ్గి, ఆ వృత్తి పనివాళ్ళు కనుమరుగవుతున్న విధానం నేడు పల్లెల్లో చూడవచ్చు.

మాధవాచారి వరదరాజుతో నాయనా! వరదా! ఈ కొలిమికి నాతోనే మంగళం అంటూ "మీ తరం ఎలా వుంటుందోనని నా ఆలోచన. భవిష్యత్తులో తుమ్మ మడకల అవసరం వుండదు. ఇనుప బొప్పె మడకలు వస్తున్నాయి. అందుకే ఈ కొలిమి శాస్వతంగా ఆరిపోయే రోజులు దగ్గరలోనే వున్నాయి"(పచ్చగా నూరేళ్లు, పుట: 64) అంటూ మాధవాచారి తన బాధను వేల్లబోసుకుంటాడు.

వాన మబ్బు కన్ను తెరిస్తేనే సమయానికి వర్షమైనా, రైతుకు పైరైనా పంటైనా. లేదంటే అనావృష్టితో కరువు వస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో పంటపల్లె ప్రజల పరిస్థితులను, కరువు వికృతరూప విలయ తాండవాన్ని నవలలో రచయిత చాలా హృదయ విదారకంగా చిత్రించాడు. అన్నీ బాగున్నప్పుడు పంటపల్లె పచ్చని పైర్లతో కళకళలాడుతుంటుంది. కాని కాలం మారింది. భయంకరమైన కరువు కొనసాగి దుర్భిక్షంగా మారి దారిద్ర్యానికి దారితీసింది. బావులు చెరువులు ఎండిపోతున్నాయి. పచ్చికతో నిండుగా ఉన్న నేల ఎవరో శపించినట్టుగా ఎండిపోయి పగుళ్ళు కనిపిస్తున్నాయి. ప్రజలు ఇళ్లల్లో దాచుకున్న ధాన్యాలు అయిపోతున్నాయి. గొడ్డుగోదలను పోషించుకోలేక కసాయివాళ్ళకు అమ్మేస్తున్నారు. రైతులకు అది వర్ణించలేని బాధ. ఆకలి బాధలు మనిషిని పసువు కంటే హీనగా మారడానికి ప్రేరేపిస్తున్నాయి. వరదరాజు తన ఎద్దుల కోసం ఐదు మైల్ల దూరం వెళ్లి ఎండు బోదను తెస్తున్నాడు. డబ్బు వ్యామోహం ఉన్న నరసయ్య(వరదరాజు మేనమామ) బియ్యం వ్యాపారం ప్రారంభించి అప్పు అడిగిన వాళ్లకి "అప్పు ముప్పురా! అప్పు ఊబిరా! ఆ ముప్పు కొనుక్కోవద్దు" అంటూ ధర్మోపన్యాసం చేస్తూ, పేదల గడువు తీరిన కుదవ వస్తువులను తన వశం చేసుకుంటున్నాడు.

ప్రభుత్వం నియమించిన కరువు నిర్ధారణా సంఘానికి సరైన రోడ్లు లేని పల్లెలు కనపడటం లేదు. ప్రజలు బక్కచిక్కి పోతున్నారు. గ్రామాలు వదిలి పట్టణాలకు వలస పోతున్నారు. మనుషుల పరిస్థితే ఇలా ఉంటె అడవిలో జంతువుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించొచ్చు. కట్టెల కోసం అడవికి కెళ్ళిన పుల్లయ్య భార్య పగలే నక్కవాత పడడం, కరువులో తిండి కరువై సాంబయ్య గుడ్డలుతుకుతూ నీటిలో పడి చావడం, నరసయ్య తన బావిలో నీటిని హరిజనులను ఎత్తుకెళ్ళ వద్దు అన్నందుకు రెండుమైళ్ళు నీటి కోసం వెళ్ళిన గంగమ్మ ప్రాణాలు గాల్లో కలిసిపోవడం, వరదరాజు తండ్రి రంగయ్య కరువులో సరైన వైద్యం లేక జ్వరంతో చనిపోవడం ఇలాంటి దుర్భర పరిస్థితుల మధ్య విలవిలలాడుతున్న ప్రజలు జీవన విధానాన్ని రచయిత దృశ్యమానం చేసి పాఠక హృదయాలను ఆర్ద్రతకు గురిచేస్తాడు.

వరదరాజు కరువును నెట్టుకొని గడ్డనపడుతాడు. కొంతకాలానికి వర్షాలు పడి పంటపల్లె పూర్వ వైభవాన్ని చవిచూస్తుంది. ఇంతలో పల్లెలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. పల్లె జనం ఆలోచనల్లో, వృత్తుల్లో అనేక మార్పులు వస్తాయి. పేదలకు ఇళ్ళ పట్టాలు, రోడ్లను, కరెంటు సౌకర్యాన్ని, చక్కర ఫ్యాక్టరీని ప్రభుత్వం సమకూరుస్తుంది. ఇంతలో కొత్త సమస్యలు వస్తాయి. సహాయంగా ఉంటుందనుకొన్న చక్కర ఫ్యాక్టరీ రైతుల ఆశలను వమ్ము చేసింది. వర్షాలకు రోడ్లు పాడైన కారణంగా చెరకును ఫ్యాక్టరీకి తోలాల్సిన లారీలు రావు. రైతులు ఏకారణం చేతనైనా చెరకు తోలకపోతే, వారు చెప్పే కారణాలు నచ్చని యాజమాన్యం అపరాదాలు వసూలు చేసింది. దీనికి తోడు ఫ్యాక్టరీ కార్మికుల సమ్మె. కొట్టిన చెరుకు ఎండి రైతుకు గిట్టుబాటు ధర అందదు. దీనితో రైతుల కష్టాలు ఆధునిక రూపాన్ని సంతరించుకొని మళ్ళీ మొదలవుతాయి.

వరదరాజు మేనత్త(చిన్నమ్మ) కూతురు అనూరాధ సహాయంతో ఇంటిదగ్గరే ఉండి ఆర్థికశాస్త్రంలో ఎం.ఏ పట్టాసాధించడం, నరసయ్య ఆత్మా న్యూనతా భావంతో మారి ప్రజలకు మేలు చేస్తూ, ఉన్న ఆస్తినంతటిని వరదరాజుకు ఇవ్వడంతో, డబ్బు పరపతి, తెలివితేటలు గల వరదరాజే రైతులకు దిక్కయినాడు. ఎం.ఏ చదివిన అనూరాధ అమ్మను ఒప్పించి వరదరాజును పెళ్లిచేసుకున్న తరవాత వరదరాజుకు అన్ని విధాలా తోడుంటుంది. ఒక కపట రాజకీయ నాయకుడు వేసిన ప్రశ్నకు సమాధానంగా

అనూరాధ సహాయంతో యూనివర్సిటీలో తను చదువుకున్న డిపార్ట్మెంట్లో వ్యవసాయ ఆర్థిక శాస్త్రంలో పరిశోధనలు కొనసాగిస్తున్న ప్రొఫెసర్ రావు గారితో పరిచయం, వారితో జరిపిన సంభాషణలతో పాటూ గిట్టుబాటు ధర అంటే ఏమిటి? దానిని ఎవరు నిర్ణయిస్తారు? ఎలా నిర్ణయిస్తారు? అనే వాటి మీదా చాలా పుస్తకాలు చదువుతాడు. ఈ క్రమంలో రచయిత ఆర్థిక అంశాలకు సంబంధించి, డిమాండ్ సప్లై అనే అంశాల గురించి సుదీర్ఘమైన విశ్లేషణ చేస్తాడు.

చివరికి రైతుల ధర్నాని వరదరాజు ముందుండి నడిపించడంతో పోలీసులు లాటీ చార్జీలు, కాల్పులు వంటి చర్యలకు పాల్పడుతారు. ప్రాణనష్టం లేకపోయినప్పటికీ వరదరాజును రెండు రోజులు కనపడనీకుండా చేస్తారు. ఆందోళనతో ఉన్న ఊరి జనం వరదరాజు రాక కోసం ఎదురు చూస్తుంటారు. అనూరాధ స్నేహితుడు కృష్ణమోహన్ అన్న సహాయంతో వరదరాజు ఇల్లు చేరుతాడు. ఇంతటితో నవల ముగుస్తుంది.

పైచెప్పిన విషయాలే కాదు నవలలో ఇలాంటి మరెన్నో అంశాలను వాస్తవిక కోణంలో చిత్రిక పట్టి చూపిన సంఘటనలు నవల నిండా అనేకం ఉనాయి. ప్రకృతితో పాటూ సామాజిక ఆర్థిక కారణాలు ఏవిధంగా కరువుకు కారణమవుతాయో అదేవిధంగా నిరక్ష్యరాస్యత, నిరుద్యోగం, మూఢనమ్మకాలు కూడా కారణమవుతూ కరువును వేగవంతం చేస్తాయి. నియతవిద్యకు నోచుకోక అనియత విద్య ద్వారా చదివి మంచి తెలివితో పరిస్థితులను ఎదుర్కొని, రైతుల ఉద్యమానికి పూనుకోవడం ఒక్క చదువు వల్లే సాధ్యమవుతుందని తెలియజేస్తూ, చదువు యొక్క ప్రాముఖ్యతను తెలియజేశాడు రచయిత.

చివరగా ఈ నవలలో రచయిత చెప్పాలనుకున్నది ఆశించినది ఒక్కటే. పదిమందికి అన్నం పెట్టే రైతు పచ్చగా నూరేళ్ళు బతకాలని, ఒడిదుడుకులకు ఎదురొడ్డి నిలబడాలని, రైతుల పట్ల పాలకులు సానుభూతితో చేయూతని ఇవ్వాలని ఆశాభావం వ్యక్తం చేశాడని నా అభిప్రాయం.

ఆధార గ్రంథాలు:

1. కన్నయ్య నాయుడు, లంకిపల్లె. పచ్చగా నూరేళ్లు. తిరుపతి: సరస్వతి ప్రచురణలు. 2008.
2. విజయ్ కుమార్, దానాల. లంకిపల్లె కన్నయ్యనాయుడు నవలలు – సమగ్ర పరిశీలన. పిహెచ్. డి. అముద్రిత సిద్ధాంత గ్రంథం. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం. 2016.

సీమ సంతకం



తుమ్మల రామకృష్ణ 60 వసంతాల ప్రత్యేక సంచిక

SEEMA SANTAKAM
Tummala Ramakrishna
60 Years Special Issue

© Publishers

First Edition: January, 2021

Copies: 1000

Rs. 500/-

Cover Design : Elay Laxman

Prof. Tummala Rama Krishna
Vice Chancellor
Dravidian University, Srinivasa Vanam
Kuppam, Chittoor Dist.
Andhra Pradesh.

Published by :
Vijaya Kala Publications
T. Vijayalakshmi
Flat No. 204, Sigma Central
Taranagar, Serilingampalli,
Hyderabad - 500 019
Ph : 9949055015

For Copies :
Navodaya Book House,
Kachiguda X Road, Opp. Arya Samaj Mandir,
Hyderabad- 500 027. Ph : 040-24652387
Navachetan Book House,
Bank Street, Koti, Hyderabad
and All leading Book Stores

DTP :
Madhavi Graphics,
23-76/3, R.K. Nagar, Malkajgiri, Hyderabad-47
Email : madhavigraphicsc@gmail.com
Ph : 9908001724

దారి

ఆధునిక సాహిత్య ప్రేమికుడు	- రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, సింగమనేని నారాయణ	v
నేను - నా సృజన నేపథ్యం	- తుమ్మల రామకృష్ణ	xiv

స్పందన **1**

1.	అపురూపమైన దళిత జీవితానుభవ చిత్రణ	- కేతు విశ్వనాథరెడ్డి	3
2.	అభిచందనం	- ఆచార్య మద్దూరి సుబ్బారెడ్డి	6
3.	అమృత భాండం	- ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య	8
4.	ఆత్మగౌరవ స్వరమే తుమ్మల	- డా॥ శాంతి నారాయణ	10
5.	ఆర్తి నిండిన విలక్షణ శైలి	- ఎలనాగ	16
6.	ఈ తరం కథకులకు ఆదర్శం తుమ్మల రామకృష్ణ	- ఉషాజ్యోతి బంధం	19
7.	ఒక తుమ్మల రామకృష్ణుడు	- సింగమనేని నారాయణ	21
8.	ఓ కథకుడా నీ శిల్పానికి నా నమస్సులు	- చొప్పర శివకుమారి	24
9.	కథ కంచికి మనమింటికి	- బి.బి.జి. తిలక్	26
10.	కథలకు కేటలిస్ట్	- మహమ్మద్ ఖదీర్‌బాబు	35
11.	కథా మద్దిస్తం...	- డా. సీతారాం	37
12.	కథాసమయంలో తుమ్మల రామకృష్ణ	- జి. ఉమామహేశ్వర్	42
13.	కల్లోల సంఘర్షణలు	- డా॥ పి. విజయకుమార్	45
14.	కాకిగోల	- నాయుని కృష్ణమూర్తి	48
15.	గ్రామీణ ఈతిబాధల స్పర్శ - మట్టి పొయ్యి (కథలు)	- యదవల్లి హరిప్రసాద్	50
16.	జీవితాలకు ప్రతిబింబాలు మట్టిపొయ్యి కథలు	- కె.పి. అశోక్ కుమార్	52
17.	తాను మాత్రమే రాయగలిగిన కథలు...	- సునీల్ కుమార్ రెడ్డి	54
18.	తుమ్మల - వాత్సల్య మైత్రీ వసంతం	- డా. వి.ఆర్.రాసాని	59
19.	తెల్లకాకులు... తెల్లకాకులేనా?	- టి. విజయలక్ష్మి	62
20.	ధిక్కార స్వరాలు	- జి. లక్ష్మీనరసయ్య (10 TV కార్యక్రమం)	64
21.	నా జీవిత రూపశిల్పి	- జి. శివానందరెడ్డి	68
22.	నాలుగు ముక్కలు	- ఆచార్య బేతవోలు రామబ్రహ్మం	71
23.	పని ప్రేమికుడు	- డా. ఈతకోట ఈశ్వరరావు	72
24.	పరిచయం అవసరం లేని 'పరిచయం'	- ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి	74

తాను మాత్రమే రాయగలిగిన కథలు...

– ఎ. సునీల్ కుమార్ రెడ్డి

ధర్మం నాలుగు పాదాల మీద నడిచిందన్నది త్రేతాయుగం నాటి మాట. అది నిజమోకాదో మనకు ఖచ్చితంగా తెలీదు. ఒకవేళ నిజమైతే నేటి సమాజం మాత్రం అందుకు పూర్తిగా విరుద్ధం. ఈ విరుద్ధమైన సమాజం నూటికి నూరుపాళ్ళు నీతిగా ఉండాలని కాకపోయినా కొంతలో కొంతైనా మార్పు కలగాలని, ఈ అస్తవ్యస్తమైన ఈ వ్యవస్థ యొక్క స్థితి గతుల మార్పు కోసం, కుల, మత, వర్ణ, వర్గ లాంటి విషయాలపట్ల ప్రజల్లో రావాల్సిన చైతన్యం కోసం, ప్రపంచీకరణ వల్ల అంతరించిపోతున్న మానవ సంబంధాల కోసం, వ్యక్తుల్లో మానవత్వం నశించి మృగంకన్నా హీనంగా మారుతున్న ఈ సమాజం పట్ల ఆవేదన వ్యక్తం చేసే వ్యక్తుల్లో తుమ్మల రామకృష్ణ గారు ఒకరు.

వ్యవస్థపట్ల అసంతృప్తి, వ్యతిరేకతతో రామకృష్ణ గారు ఎప్పుడూ ఒక మాట అంటుండేవారు. అది 'ఈ సమాజం, ఈ వ్యవస్థ ఇంకా ఇంకా చెడిపోవాలి పూర్తిగా పాడైపోవాలి' అని. అలా ఎందుకంటున్నారో నాకు మొదట్లో అర్థమయేది కాదు. అయితే దీనికి గల కారణం ఆయన మాటల్లో ఎప్పుడూ స్పష్టంగానే వినిపిస్తుండేది. కాలాన్ని రూపాయలతో కొలిచి, మధ్యతరగతి బ్రతుకులను రోజు రోజుకు పీల్చి పిప్పి చేస్తున్న ఈ దోపిడీ వ్యవస్థ తీరు, వెస్ట్రన్ కల్చర్ పెరిగిపోవడంతో సమాజం హద్దు అదుపు లేకుండా చెడిపోవడం, వ్యక్తుల్లో సోమరితనం, స్వార్థం పెరిగిపోవడం, నేటి యువతలో జీవితం పట్ల చిత్తశుద్ధి, విద్య పట్ల ఆసక్తి రెండు కరువవ్వడం అందుకు గల కారణాలుగా ఆయన మాటల్లో ఎప్పుడూ వినిపిస్తుంటాయి. అందుకే అలా కోరుకుంటారు. అప్పుడైనా దీనికి భిన్నమైన వ్యవస్థ పునర్నిర్మితం అవుతుందన్నది ఆయన ఆశ. ఇందుకు గల కారణాలు దానికి గల సామాజిక నేపథ్యాలు ఒకింత ఆయన రాసిన 'మట్టిపొయ్యి' కథా సంపుటిలోను, 'తెల్ల కాకులు' కథలోనూ కనిపిస్తుంటాయి.

'మట్టిపొయ్యి' కథా సంపుటిలో మొత్తం 12 కథలున్నాయి. ఈ కథలను రామకృష్ణ గారు తనదైన శైలిలో, ప్రత్యేకమైన రాయలసీమ మాండలికంలో రాసారు. ఓ సాయంత్రం, ఊరిమద్దిస్తం, అడపం, డా. గుర్నాధం, రేగడి మిట్ట, మహా విద్వాంసుడు, మట్టిపొయ్యి ఇలా ఏ కథను తీసుకున్నా దేనికదే ప్రత్యేకమైనవిగా కనిపిస్తాయి.

మట్టిపొయ్యి కథలన్నింటిలోకి 'ఓ సాయంత్రం' కథలో లోకం పోకడ, రచయితకు సమాజం పట్ల గల దృక్పథం స్పష్టంగా కనిపిస్తాయి. ప్రపంచం ఎలా ఉంది, మనుషులు ఎలా ఉన్నారు, వారి బలహీనతలు ఎలా ఉన్నాయి, వ్యవస్థ నానాటికి ఎంత దిగాజారిపోతోంది అన్నదే ఇందులోని ప్రధానాంశం. కథలో ప్రధాన పాత్ర తన మిత్రుడు 'సత్యం' కోసం ఎదురు చూస్తూ ఉంటాడు. ఆ సమయంలో ఆ పాత్ర యొక్క ఆలోచనలు, వ్యక్తుల పట్ల, సమాజం పట్ల అతని అభిప్రాయాలు, దృక్పథాలు, వచ్చిపోయే పాత్రలతో జరిపే సంభాషణలు పాఠకులను ఎంతగానో ఆలోచింపచేస్తాయి. నిజానికి ఈ కథలో సత్యం ఒక పాత్ర కాదు వాస్తవిక జీవితానికి సంకేతం. అందుకే కేతు విశ్వనాథ రెడ్డి గారు 'మట్టిపొయ్యి'కి రాసిన ముందుమాటలో "ఎదురు చూసినా ఎంతకు రాని, ఆ 'సత్యం' కథ చివర్లో ఒక సంకేతంలా మారిపోతాడు. ఆ సంకేతం మన చుట్టూ ఉండే వాస్తవిక జీవితాన్ని పట్టి చూపేది" అని అంటారు.

సమాజంలో ప్రతి ఒక్కరు ఏదో ఒక రోగంతో బాధపడేవారే. కొందరు శారీరక రోగంతో బాధపడేవారుంటే మరి కొందరు మానసిక రోగంతో బాధపడేవారు. ఇక్కడ మానసిక రోగం అంటే స్వార్థం, దురాశ లాంటి వాటితో బాధపడేవారు. వికలాంగుల కథ పక్కన పెడితే అన్నీ సక్రమంగా ఉన్నా విపరీతమైన స్వార్థంతో, తరతరాలకు సరిపోయేంత సంపాయించినా చాలదనే దురాశతో ఎవర్ని ముంచుదామా ఎవర్ని చంపుదామా అని ఆలోచించేవారే. పక్కన వాడు బాగుపడితే చూర్వలేరు. అమ్మాకొడుక్కి పడదు, తండ్రీ కొడుక్కి పడదు, అన్నాదమ్ముడికీ కుదరదు. అందుకే కథకుడు అంటాడు 'పూర్ ఫెలో... ముఖం మీద ముక్కు లేదు... చేతికి వేళ్ళు లేవు. హృదయమే లేని వాళ్ళు బాగా బ్రతుకుతున్నారు... డర్టీ కంట్రీ పెంచి పోషిస్తోంది...' అని.

రామకృష్ణ గారు రాసిన 'తెల్ల కాకులు' కథ 'ఓ సాయంత్రం' కథకు కొనసాగింపుగా కనిపిస్తుంది. ఈ రెండు కథలని చూస్తే బహుశా రామకృష్ణ గారు త్రిపురాని, బుచ్చిబాబుని, రావి శాస్త్రిని బాగా చదివారేమో అనిపిస్తుంది. ఎందుకంటే వీళ్ళందరూ చైతన్య స్రవంతిలో బాగా రచనలు చేసినవాళ్ళు. రచయిత అనుభవాలకు, అంతరంగ సంఘర్షణలకు ప్రతి రూపమైన ఈ కవితాత్మక కథ (తెల్ల కాకులు) చైతన్య స్రవంతిలో సాగుతుంది. ఒక్క రోజు నిడివిలో జరిగే ఈ కథలో ప్రధాన పాత్ర (మూర్తి) దైనందిన జీవితంలోని వ్యక్తిగత సంఘర్షణతో కథ మొదలై, ప్రస్తుత సమాజంతో మమేకం అవ్వలేక తన కళ్ళ ముందు జరిగే ప్రతి విషయం పట్ల అసంతృప్తితో, అసందిగ్ధతతో తన మనసులో పడే సంఘర్షణల వెల్లువగా కథ ముందుకు సాగుతుంది. ఒకటా రెండా మూర్తి మనసులో అనేక సమస్యలు, దుర్మార్గాలు, దురాగతాలు, విచ్చలవిడితనాలు, ప్రేమలు, కన్నీళ్లు, జ్ఞాపకాలు, పనికిరాని వాగ్దానాలు, ఉసిగొల్పే ప్రోత్సాహాలు, విభజనలు ఇలా ఒకటేమిటి కథంతా కలగాపులకంగా ఏవేవో అన్నీ పాఠకుడి మనస్సులో కలకలం లేపకుండా వెళ్లవు.

నేటి విద్యా వ్యవస్థ ఎంత చక్కగా ఉందో చెప్పాలంటే మాటలు సరిపోవు. మూడు పువ్వులు ఆరు కాయలుగా కాదు, మూడు పువ్వులు ముప్పైయారు కాయలుగా వర్ధిల్లుతోంది. వీధివీధికో బడి వాడవాడకో కాలేజి అయినా సరిపోవట్లేదు కొత్తగా పుట్టుకొస్తూనే ఉన్నాయి. వేలకు వేలు లక్షలకు లక్షలు డొనేషన్లు, చదువును నేర్చుకుంటున్నారో, కొనుక్కుంటున్నారో ఉద్యోగం సంపాయించేంత

వరకు తెలీదు. ఎటు చూసినా విద్యార్థులే సినిమాలు, షికార్లు, వాట్సప్‌లు, ఫేస్‌బుక్‌లు, సిగరెట్లు, మందు పార్టీలు, ప్రేమలు, ఆత్మహత్యలు, అగాయిత్యాలు. అయితే వీరిని తీర్చిదిద్దాల్సిన భాద్యత ఎవరిది. సరైన వ్యక్తిత్వం నేర్పాల్సిందెవరు. గురువే. అందుకే భారతీయ సమాజం గురువును 'గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః, గురుదేవో మహేశ్వరః, గురు సాక్షాత్ పరబ్రహ్మ, తస్మైశ్రీ గురవేనమః' అని గౌరవించింది.

అయితే ఇలాంటి గురువే పొట్ట పొడిచినా అక్షరం ముక్క రానివాడైతే,"ఆదర్శాలను నమ్ముకుంటే కడుపుకి నీళ్ళు కూడా దొరకవు" అని అనుకునేవాడు గురువైతే, ఆ గురువు దగ్గర చదువు నేర్చుకునే విద్యార్థుల భవిషత్తు ఎలా ఉంటుందో ఊహించవచ్చు. అలాంటి మనిషి కథే డా. గుర్నాథం కథ.

కాపీ కొట్టి పాసై గురువుల దయవల్ల యూనివర్సిటీలో లెక్చరర్ గా స్థిరపడ్డ గుర్నాధం, ఆదర్శాలను నమ్ముకొని చాలిచాలని వెయ్యి రూపాయల జీతానికి టీచర్ ఉద్యోగం చేస్తున్న తన మిత్రుడితో,బ్రతకాలంటే ఎంతసేపూ విలువలు, ఆదర్శాలు, సమాజం సమస్యలు అంటూ కూర్చుంటే కుదరదు అని "నన్ను చూసి నేర్చుకో. కొంచం లౌక్యం ప్రదర్శించు. ఎవర్నీ విమర్శించకు. పొగడ్తలకి లొంగనివాడు, మందు ముట్టనివాడు భూమ్మీద వెతికినా దొరకడు. లోకం ఎట్లాపోతే నీకేం? ఈ లోకాన్ని నువ్వొక్కడివే ఉద్ధరించగలవా? నీ బతుకు నువ్వు బతకడం నేర్చుకో. నాలుగు రాల్లు సంపాయించడం నేర్చుకో. మనకి ఎవరితో అవసరం ఉందొ ముందుగా పసిగట్టు అతని అలవాట్లు గమనించు. తాగేవాడికి తాపించు. తినేవాడికి తినిపించు" అని అంటాడు.

నిజానికి విద్యా బుద్దులు నేర్పాల్సిన గురువులు ఇలాంటి వాళ్ళైతే వందలమంది జీవితాలను నాశనం చేసినవారవ్వరా? తన పని జరగడం కోసం ఎలాగోలా జీవితంలో స్థిరపడడం కోసం ఆత్మాభిమానాన్ని చంపుకుని, మన అవసరాలు తీర్చే వారి అడుగులకు మడుగులొత్తుతూ, ఇరవై నాలుగు గంటలూ వారి చుట్టూనే భజన చేస్తూ, వారి ఇష్టాయిష్టాలను తెలుసుకుని వారికి తాగినంత తాగిస్తూ, తిన్నంత తినిపిస్తూ, నిత్యం వారి కను సన్నల్లో మెదిలే మనస్తత్వంతో గురువులుగా ఎదిగిన వారు ఉంటే వారి దగ్గర చదువుకునే విద్యార్థి లోకం ఎంత నాశనం అవుతుంది. ఇలాంటి గుర్నాధాలు నేటి సమాజంలో లేరా? అందుకే ఈ కథలోని గుర్నాధం పాత్ర ద్వారా కథకుడు నేటి విద్యా వ్యవస్థ ఎంత దారుణంగా తయ్యారవుతోంది. నేటి చదువులు ఎలా ఉన్నాయి. ఉద్యోగాలు ఎలా వస్తున్నాయి. దీనివల్ల సమాజం పురోగమనం వైపు పయనిస్తుందా లేదా తిరోగమనం వైపు పయనిస్తుందా అనే ఆలోచనల్ని పాఠకులలో రేకెత్తిస్తాడు.

రాయలసీమ అనగానే గుర్తుకువచ్చేది కరువులు, కక్షలు, ముఠాలు, తగాదాలు. వీటితోనే ఆ ప్రాంతం తగలబడిపోతూ ఉంది. ఈ నేపద్యంలోనుంచి వచ్చిన కథే 'ఊబి'. తనకు తెలీకుండానే ఫ్యాక్షన్ గొడవల్లో కూరుకుపోయిన తన తమ్ముడి (నారాయణ రెడ్డి) పరిస్థితిని, దానిద్వారా ఊర్లో నెలకొన్న కక్షలను, కుటుంబ పరిస్థితులను చూస్తే విశ్వవిద్యాలయ స్థాయిలో చదువుకుంటున్న కృష్ణారెడ్డికి అసహ్యం వేసి, డబ్బు అధికార దాహంతో ఆటవికులుగా మారుతున్న మనుషుల పట్ల మొహం మొత్తి, వీటన్నింటికీ తోడు డబ్బు, అధికారంతోపాటూ ఫ్యాక్షన్ బ్యాగ్రౌండ్ ఉన్న సంబంధాన్ని

చేసుకొని మళ్ళీ ఆ ఊబిలో పడడం ఇష్టం లేక కృష్ణారెడ్డి ఆ పరిస్థుతులకు దూరంగా వెళ్ళిపోవడమే ఇందులోని కథ.

డబ్బు, అధికారం అనేవి వ్యసనాలుగా మారితే, మనిషి ఎంతకి దిగజారడానికైనా, ఎంతకి తెగించడానికైనా వెనుకాడడు. మొదట డబ్బు కోసం వ్యాపారం తరవాత దోపిడీలు, దందాలు, వీటిని నిలబెట్టుకోవడం కోసం అడ్డు వచ్చిన వాళ్ళని చంపడం, ఈ క్రమంలో శత్రువులు పెరగడం, వారినుండి రక్షణ కోసం నలుగుర్ని వెంటేసుకుని ముఠాలు కట్టడం, చంపడం, నరకడం ఇలా తెలీకుండానే కక్షల్లో దిగిపోతాడు. ఈ పరిస్థితులన్నీ కథలో రచయిత కళ్ళకు కట్టినట్టు చిత్రించాడు.

ఈ ఫ్యాక్షన్ గొడవల్లోకి ఒక్కసారి అడుగు పెట్టాక వెనక్కి తీయడమంటూ జరగదు ముందుకు సాగాల్సిందే. అందుకే రచయిత కృష్ణారెడ్డి పాత్రచే "ఫ్యాక్షన్ అనేది అంటువ్యాది లాంటిది. అది నివురు కప్పిన నిప్పులా ఉంటుంది. అప్పుడప్పుడూ రాజుకుంటూనే ఉంటుంది.ఆ ఊబిలో దిగినోళ్ళు పైకి రాలేరు" అని అంటాడు. రాయలసీమలో ఫ్యాక్షన్ వాతావరణానికి నిలువెత్తు సాక్షంలా కాకపోయినా వాటి వాసనలను అందించే కథగా ఇది కనిపిస్తుంది. అందుకే ఈ కథ ఫ్యాక్షన్ కథా సంకలనంలో కూడా భాగమైంది.

సర్వ జగత్తునూ కదిలించగలిగే శక్తి గల సంగీతానికి కూడా కులం అనే బురదను ఎగజల్లే గొప్ప వ్యక్తులు సమాజంలో ఉన్నారంటూ పరబ్రహ్మ శాస్త్రి పాత్ర ద్వారా తెలియజేసే గొప్ప కథ మహా 'విద్వాంసుడు'.

తాజ్ మహల్ అందాలను గురించి వినడం వేరు, స్వయంగా చూసి ఆ అందానికి మురిసిపోవడం వేరు. ప్రపంచ ఏడు వింతల్లో తాజ్ మహల్ ఒకటి. షాజహాన్ ప్రేమకు ప్రతి రూపం, పాలరాతి అందాలకు నిలువెత్తు సాక్షం, ప్రతి ఒక్కరూ ఎప్పుడో ఒక్కసారైనా తాజ్ మహల్ ని తమ కళ్ళతో చూడాలనుకుంటారు.

మట్టిపొయ్యి కథా సంపుటిలోని తాజ్ మహల్ కన్నీళ్ళు నాకెందుకో ఒకింత విలక్షణంగా కనిపిస్తుంది.కథలోని పాత్రలన్నీ ఒక కుటుంబంలోని వ్యక్తులే. భర్త, భార్య, ఇద్దరు పిల్లలు తాజ్ మహల్ చూడడానికి వెళ్ళడం, ఆ అపురూప పాలరాతి అందాలను చూడడం, అక్కడ ఆ కుటుంబానికి చెందినా ఆరేండ్ల పిల్లవాడు ఏడవడం, భర్త పాత్రలోని కథకుడు తాజ్ మహల్ అందాలను గురించి భార్యకు చెప్పడం, వాటిని భార్య చాలా సర్వసాధారణంగానే భావించడం ఇందులోని కథాంశం.

పిల్లావాడి ఏడుపుకి, భార్య తాజ్ మహల్ అందాలను సర్వసాధారణంగా భావించడానికి కారణం అక్కడ విన్న గైడ్ మాటలు. "తాజ్ మహల్ దగ్గర మీరేమి చూసారో తెలీదు. నాకు అదంతా మొండి చేతులే కనిపించాయి డాడీ" అన్న పిల్లవాడి మాటలు, మొదట్లో నేనుకూడా ఏమో అనుకున్నా. ఏముంది... ఒక రాజు ఆయన భార్య జ్ఞాపకార్థం పాలరాతితో కట్టిన సమాధి. రాజు కాబట్టి అధికారం, డబ్బూ అన్నీ ఉండడం వల్ల ఎంతోమంది శ్రమతో తాజ్ మహల్ కట్టించాడు" అన్న మాటలకు నేనెందుకిలా చూడలేకపోయానా అని భర్తకి ఒక్క క్షణం తల తిరుగుతుంది.

నిజానికి కథ చదివిన తరవాత కథకుడు పాఠకులను సైతం తాజ్ మహల్ ను ప్రేమకు చిహ్నంగా, ప్రపంచవింతల్లో ఒకటిగా చూడాలా లేదా అధికారం డబ్బు ఉన్న ఒక రాజు తన తాహత్తుకు తగ్గట్టుగా భార్య జ్ఞాపకార్థం కట్టించిన ఒక సమాధిలా చూడాలా అనేసందిగ్ధావస్థలో పడేస్తాడు.

ఇలా వ్యవస్థపట్ల అసంతృప్తితో ఓ సాయంత్రం, తెల్లా కాకులు రాసినా, నేటి విద్యా వ్యవస్థ తీరును తెలుపుతూ డాక్టర్ గుర్నాథం రాసినా, వృత్తి చైతన్యం కోసం అడపం, మహా విద్వాంసుడు రాసినా, రాయలసీమ ఫ్యాక్షన్ పరిస్థితులను తెలుపుతూ ఊబి రాసినా ఇలా ఒక్కటేమిటి ఏ కథను తీసుకున్నా వైవిధ్యమైన ఇతివృత్తంతో, తనదైన ముద్రతో రాయడం ఆయన ప్రత్యేకత.

నేనుకూడా చిత్తూరు జిల్లా, సదుం మండలం, గొంగివారి పల్లి నుండి వచ్చాను. మా స్కూ వాళ్ళ ఊరికి మా ఊరి మీదగానే వెళ్ళాలి. అందుకే ఆ వాతావరణం, ఆ జీవన నేపధ్యాలు, ఆ మనుషులు, ఆ దిగువ మధ్య తరగతి జీవితం అవన్నీ చదువుతుంటే నాకు మా కుటుంబం, మా పల్లెలు, అక్కడి మనుషులు గుర్తుకు వస్తున్నారు. ఇలా ఈ సమాజ తీరు తెన్నులను తన కథల ద్వారా తెలుపుతున్న మా గురువుగారు ఆయనే రాయగలిగిన మరిన్ని కథలను రాయాలని కోరుకుంటున్నాను.

అనుబంధం–5 పరిశోధకుడు రాసిన కథ



కథలు

ఇల్లాలి చదువు : డాక్టర్ ఎం.ప్రగతి 5
ఎరుక : గార రంగనాధం 18
కర్లీ హెయిర్ : ఎం.విప్లవ కుమార్ 33
ఇరవై ఏళ్ల కల : అంకిరెడ్డి సునీల్ కుమార్ రెడ్డి 46

కవితలు

కల్లోల యుగాల మీదుగా : నిఖిలేశ్వర్ 8
వాక్యాంతాన్ని నేనే : కంచరాన భుజంగరావు .. 8
తిరుగు ప్రయాణం : ఎస్ హనుమంతరావు 14
అస్తిత్వపు ప్రశ్న : పుష్యమి సాగర్ 22
స్వాతంత్ర్య భారతం : గన్నోజు శ్రీనివాసాచారి 25
నిన్న పాట వైపు ... : బంగారాజు 25
ప్రవహించే ఆత్మ : శ్రీధర్ కొమ్మోజు 32
తలంటు : ఒబ్బిని 37
చివరి గది : పాయల మురళీకృష్ణ..... 41
నవ్వు : డా. పాతూరి అన్నపూర్ణ ... 45
వాడని వసంతం : బి గోవర్ధనరావు 53
ప్రకృతి మర్మం : డా. పి.విజయలక్ష్మి పండిట్ 56
స్వగతం : చొక్కాకుల ప్రసాద్ 57
అంతిమ ఫలితాలు : శ్రీధర్ చౌదరపు 60

వ్యాసాలు

సాహిత్య ప్రస్థానం ఏప్రిల్ 2022 పురస్కారాలు 17
విద్యా వ్యవస్థ కేంద్రంగా చందు నవలలు
- కెపి అశోక్ కుమార్ 9
రావిశాస్త్రి డైరీలో వ్యవహారిక పదాలు
- గార సీత 15
కంచె దాటొచ్చిన ధిక్కార స్వరం
- కెంగార మోహన్ 23
దళిత సాహిత్యం - సామాజిక చైతన్యం
- ఆచార్య డి.వి.ప్రవణ్ కుమార్ ... 26
అరణ్యకృష్ణ కవిత్వంలో ఆమె
- డా. సుంకర గోపాల్ 30
సాహితీ ప్రజ్ఞ 38
స్వయం ప్రకాశ చిత్రకారుడు రాజా రవివర్మ
- గనారా 39
తెలుగు కథలకు ఇంగ్లీషు పేర్లా?
- మొలకలపల్లి కోటేశ్వరరావు 42
శ్రీలంక సంక్షోభం - కొన్ని పాఠాలు
- ఎంవిఎస్ శర్మ 51
ముఖాముఖి : జానపద కళల పరిరక్షణ చారిత్రిక అవసరం
- బద్రి కూర్మారావు 54
మూడు దశాబ్దాల అనుభవాల తివాచీపై కథా చిత్రమాల
- వి.విజయ్‌కుమార్ 58
డైరీ 61
పుస్తకాలు 66

ISSN No: 2581 - 7477

సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !

::రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా::

సాహిత్య ప్రస్థానం, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా. ,
ఫోన్ : 0866-2577248, చందా వివరాలకు : 94900 99057, రచనలకు : 94900 99167
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com

1 సంవత్సర చందా రూ. 240 ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000

Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585,
IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అనిరాయగలరు.

కథ



ఇరవై ఏళ్ల కల

- అంకిరెడ్డి సునీల్ కుమార్ రెడ్డి
7382301101

రాత్రి ఒగ్గంట దాటింది. ఇంట్లో లైట్లు ఆర్పలేదు. నేనూ మా నాయనా మిద్దిపైన పడుకోనుండాం. ప్రతి అయిదు నిమిషాలకొకసారి మా నాయన ఆ డొక్కు సెల్లులో టైం చూసుకుంటా వుండాడు. ఇంకా వస్తుందేమో ఇంకా వస్తుందేమో నని. అయినా రావట్లేదు. ఏదో తెలియని భయం... ఏం తప్పు చేస్తున్నామనో ఏమో?

ఎంతసేపటికీ నిద్ర పట్టట్లేదు. ఇటు చలికాలమూ గాదు, అటు ఎండాకాలమూ గాదు. దుప్పటి కప్పుకుంటే ఉడుకు, తీస్తే సలి. దానికి తోడు సీటీగలు. ఏదో గుబులు మా నాయన్ని పట్టి పీడిస్తూనే ఉన్నట్లుండాది. నేను మా నాయన్ని చూస్తానే ఉండాను. సరిగ్గా ఏ పక్కా ఐదు నిమిషాలు గూడా పడుకోలేదు. ఇంతలో ఎంతనొక్కినా పంజేయని ఆ సెల్లుని పక్కనేసి 'తొమ్మిన్నరకే వస్తుందన్నాడే ఏమైనట్లు, చౌడేపల్లి గూడా దాటేస్నామన్నారు. ఒగసారి ఫోన్ జెయ్యి చిన్నోడా.. యాడోస్తాండారో అడగదాం' అన్నాడు. నేను ఫోన్ చేసి మా నాయనకిస్తే కొంచేపటికి, 'హలో యాడోస్తాండారబ్బా ఇంగా రాలేదే' అన్నాడు.

'ఒచ్చేస్తాండాంనా... సోమల్లో పెట్రోలు కొట్టిచ్చుకుంటాండాము, ఒచ్చేస్తాంలే' అని అవతల నుండి వినపడగానే 'సరే నాయనా భద్రంగా రండి' అని ఫోన్ పెట్టేస్తూ, 'ఏంపాడు నాశనమో ఏమో.. మన బతుకు మనం బతకాల్నా ఒగడి దయాదాచ్చిన్యాలపైన ఆధారపడినట్టుండాది ఈ ముండ బతుకు. ఎప్పుడు బయట పడతామో ఏమో' అంటూ నిట్టూర్సినాడు.

'ఏం నాయనా అట్లంటాండావు. ఏం జరిగింది' అన్నాను.

'నీకు తెలీదురా చిన్నోడా. నువ్వొచ్చింది తెల్లారేగదా, ఈడ చానా జరగతా వుండాయిలే. కన్న బాధలూ వడి ఇరవైయేండ్లు కడుపుగట్టుకొని రేయింబగుళ్ళు ఆ మట్టి పిసుక్కుంటూ జమచేసిన డబ్బుల్తో మనం ఒక బోరు ఏసుకొని, ఎవుని కాళ్ళూ పట్టుకోకుండా బతుకుదామనుకున్నామా. అయితే ఇబ్బుడు అది యాడ జరగనిస్తాండారు రా ఈ నాయాండ్లు. యాడ బన్నోని కండ్లన్నీ మన్నేల్తిమీదనే నాట్యం జేస్తావుంటే ఏం చేసేది చెప్పు'.

'కొంచెం ఇలావరిగా చెప్పు నాయనా.. ఏం అర్థంగాలా' అన్నాను.

'ఇందులో అర్థం కాకపోవడానికి ఏముందిరా... ఆ రాజారెడ్డి ఉండాడు కదా, మనూరి పెద్దల్లో ఒక పెద్ద. ఎవురి పెద్దలకి ఈళ్ళు పెద్దో నాకు తెల్దు గానీ ఈ పెద్దలకు నా...' అంటూ ఏదో మనసులో నాకు ఇనవడకుండా గొనిగినాడు. తరవాత 'ఒగరి బోరు పక్కన ఇంగొగరు బోరెయ్యగూడదంటరా. ఒగేల ఏసినా నూరో ఇన్నూరో అడుగుల దూరం ఉండాలంట. అట్లా కాదని బోరేస్తే ప్రభుత్వం కూడా శిక్షిస్తుందంట. రూల్స్ అంట రూల్స్. ఈనమ్మ రూల్స్. సన్నాబన్నోల్లకే ఈ రూల్స్ అన్నీ, కలిగినోల్లకు యాడుండాయి ఈ రూల్స్. మన చేన్లో మనం బోరు ఏసుకోడానికి కూడా ఇన్ని ఆక్షేపనలేందో'. 'మనం చేన్లో బోరు పాయింటు పెట్టించింది ఎవురెగేసినారో ఏం పాడు నాశనమో ఈ విషయం అబ్బుడే ఊరు ఊరంతా పాకిపోయి ఆ రాజారెడ్డి చెవిలో గూడా పడింది. ఇదేమన్నా ఇచిత్రం పనా ఏందీ'.

'తెలిస్తే తెలీనీలే నాయనా.. ఇబ్బుదేమైంది'

'ఏమయ్యేదేందిరా.. బుడతల చింతమాను కాడ చేనులో రోడ్డుకు పడమరగా మనం బోరు పాయింటు పెట్టించినాం

కదా.. అయితే రోడ్డుకు తూరుప్పక్కంతా పదెకరాలు ఆయనదే కదా. అదే మనూరి పెద్దల్లో ఒగ పెద్ద. ఎవురి పెద్దలకి ఈళ్ళు పెద్దో నాకు తెల్దు గానీ ఈ పెద్దలకు నా...' అంటూ మళ్లా ఏదో గొనిగి, 'ఆయన భూమిలో ఒక బోరు ఉంది. ఆ బోరుకు ఇబ్బుడు మనం పెట్టించిన పాయింటు దగ్గరనేలే. ఆడ మనం బోరు ఏస్తే వాళ్ళ బోరులో నీళ్ళు ఆగిపోతాయంట. అందుకని మనకు బోరు బండి వచ్చి బోరు ఏసే రోజుకి వాళ్ళొచ్చి అడ్డుకుంటారంట' అన్నాడు.

'అట్లేందుకు చేస్తాడులే నాయనా. ఎంతైనా పెద్దాయనే కదా'

ఆ మాటకి మా నాయనకి యాడగాలిందో ఏమో, 'వాళ్ళ గురించి నీకేం తెలుసురా. ఇరవై ఏండ్లనుండి వాళ్ళతో ఎన్నెన్ని పడతా వుండానో నీకేం తెలుసు. అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని అన్నట్లు, మనమా అందరూ ఉన్నా ఒంటిగాల్లమే. పక్కోడు బాగుపడితే చూసి ఆనందించేటోడు ఒగడూ లేడు. మొన్నటికి మొన్న నువ్వు అదేందో చదవాలని యూనివర్సిటీలో చేరడానికని డబ్బుల్లేకపోతే మనోల్లందరికాడికీ కాల్లరిగేదాకా తిరిగితే మతించేటోడు ఒగరూలె. చివరికి ఉన్న ఒగ కుంటావుని అమ్మి కోవాల్సి వచ్చింది. ఇబ్బుడేందో చెప్తాండావ్. పెద్దాయనంట పెద్దాయన. వరసకు పెద్దాయనే అయితే మాత్రం ఏంజేద్దాం. తీరా బోరుబండి వస్తే ఏమంటారో ఏమో...' అంటూ నన్ను చదామడా ఏసుకున్నాడు.

'ఒకసారి టైం ఎంతో చూడరా చానాసేపయ్యింది. యాడొస్తాండారో ఏమో?' అని అంటుండగానే ఇంతలో ఫోన్ వచ్చింది.

'సోవ్ రామిరెడ్డన్నా.. బండి మూడ్డాములకుంట దాటిం దంట బిన్నా రానా' అని వినపడింది. నాయనా నేనూ ఆదరా బాదరా సాపాదిండూ అన్నీ ముదరజుట్టి, గబగబా కిందికి దిగి, అమ్మని లేపి, మేము చేనుకాడికిబయల్దేరి ఇంటిముందుకి వచ్చేసరికి, మానాయన ఏదో గొనుక్కుంటూ చేతిలైటేసి తారాడతా వుండాడు. ఏంది నాయనా తారాడతాండావే అంటే 'ఈ ముండ కుక్కలు ఒగట్రైనా జాతీనైంది ఉందా... తూ... ఈటెమ్మా, రోజూ రాత్రిల్లో నాకిదే పనైపోయిందే' అన్నాడు. మళ్ళా ఏంది నాయనా అంటే 'అవాయ్ చెప్పుల్రా, ఈ కుక్కలు యాడ పడేసినాయో ఏమో. పడేస్తే పర్లేదు వాటెక్క కొరికి పడేసింటే మళ్ళా వాటికోసం యాడ తొంభై రూపాయలు పెట్టేది. సర్లే పదా. వాటికోసం ఈన్నే ఉంటే బండి ఒచ్చేస్తుంది. చేన్లో గెనాలూపాడూ బండిట్రైర్లకు తగులుకోకుండా చూడాల. ఆ సందులో గడ్డపార, పార ఉంటాయి తీసుకొనిరా పదాం' అన్నాడు.

నేనూ మానాయనా చేనుకాడికి పోయి బండికోసం ఎదురుజూసుకోనుండాము. నాకేమో అంత నడిరాత్రిలో అట్లా రోడ్డుపక్కన నిలబడుకోనుంటే ఎందుకో బయమేస్తా ఉంది. రోడ్డుమీద వచ్చే బండ్లలైట్లు నేరుగా నాకళ్ళల్లో పడతా ఉంటే, అవి రోడ్డు మీద పోతాండాయ లేదా నామీదకే వస్తాండాయ అనేటట్లు ఎదురుగ్గా ఏమీ కనబడకుండా ఉంది. ఇంతలో ఒక లారీ హారన్ వేసుకుంటూ వచ్చి నా పక్కనే ఆగింది.

మా నాయన వాళ్ళతో ఎదో మాట్లాడిన తరవాత బండి నేరుగా పాయింటు దగ్గరికి పోయింది. బోరు బండాయన ఒక చిన్న గులకరాయిని తీసుకొని మూడుగుల ఎత్తులో నుండి ఒకరాయిని బోరుబండి పైపు దిగే దగ్గర నుండి వదిలాడు. అది నేరుగా పాయింటుకి గుర్తుగా పెట్టుకున్న కనికిరాయి మీద పడింది. సరిగ్గా ఉందిలే అనుకున్నాక మళ్ళీ ఒగటికి రెండుసార్లు సరిజూసుకొని బండిని ఎగుడు దిగుడు లేకుండా సమంగా పెట్టి, 'మాకింగా ఒగ అరగంట పడుతుంది. ఈలోగా పూజ అట్లాంటిదేదో చేసేడిగా ఉంటే చేసుకోండినా' అని చెప్పివాళ్ళ సరంజామానంతా సిద్ధం చేసుకుంటుండారు.

మా నాయన చెంబుడు నీళ్ళతో బోరు పాయింటు దగ్గర తడిపి, పసుపు కుంకుమని అక్కడ జల్లి, కడ్డీలు ముట్టించి, దండం పెట్టుకొని, టెంకాయను బోరు పాయింటుకు గుర్తుగా పెట్టిన కనికిరాయిని తీసేసి అదే తావులో పెట్టినాడు. ఈ తంతంతా జరుగుతుండగానే మా నాయన అప్పుడప్పుడూ ఏదో భయంతో ఊరిదావ వైపు, రోడ్డుకు తూరుప్పక్క నుండే పదెకరాల వైపు చూస్తానే ఉండాడు.

కొంతసేపటికి మేమంతా పక్కకి జరిగినాం. రెండు నిమిషాలకి బండి ఆన్ అయ్యింది. బోరుబండి శబ్దం హోరుమని వస్తాంది. కొంచేపటికి అది మరింత ఎక్కువైంది. అయితే ఇంగా బోరు డ్రిల్లింగ్ పైపు భూమిలోకి దిగలేదు.

ఇంతలో 'ఆపరా బండి' అంటూ రాజారెడ్డి, ఆయన కొడుకూ వచ్చారు. ఒక్కసారిగా మాకందరికి గుండెలు గుభేల్ మన్నాయి.

'ఏమ్ నా' అంటూ మా నాయన వాళ్ళ దగ్గరికెళ్ళాడు.

'బోరెయ్యద్దండి నిలిపేయండి'

'ఏం నా, ఎందుకెయ్యగూడదు'

'అదంతా నీకనవసరం బోరెయ్యద్దంటే ఎయ్యద్దంతే' అంటూ పెద్దగా అరిసినాడు.

బోరుబండి ఇంగా ఆన్ లోనే ఉంది. ఆ శబ్దానికి ఎవరేం మాట్లాడుతున్నారో సరీగా ఇనపన్నందుకు ఒకరితో ఒకరు గట్టిగట్టిగా మాట్లాడుకుంటాండారు. కల్లకివతలున్న మాకు ఆడేదో పెద్దగొడవే జరగతాందాదే అనేటట్లుండాది. వెంటనే అన్నా నేనూ వాళ్ళదగ్గరికి పోయినాం.

'బండి ఆపండిరా, ఏం చెప్తాంటే ఇనపల్లేదా' అంటూ బోరుబండోల్లని రాజారెడ్డి గదమాయించినాడు.

'బోరు ఆపేది లేదునా. ఎందుకాపల్ల' అని మా నాయన గట్టిగానే అరిసినాడు.

'ఈడ ఎయ్యద్దండిరా. ఇంగ్యాడన్నా ఏసుకోండి.'

'ఇంగ్యాడన్నాఅంటే యాడేసుకోవల్లనా.మాకుండే భూమిలో ఈడ్నే నీళ్లుండాయన్నారు. ఈడ గాకుండా ఇంగ్యాడేసేది.'

'అదంతా నాకు తెలీదు. మీరు ఈడ బోరేస్తే మా బోరు నిల్చిపోతుంది. అందుకే ఎయ్యద్దండి.'

'మీ బోరు ఎందుకు నిల్చిపోతుందినా.'

'మా బోరుకు పోతాండే సార ఈన్నించే వస్తాండేది. అందుకే మీరు బోరేస్తే మాకు నీళ్ళు నిల్చిపోతాయి.'

'అదేంది నా, కింద యాడో బోతాండే నీటి సార ఈన్యే బోతాందని నువ్వెట్లా చెప్తావు.'

'మా బోరు పాయింటు పెట్టేటప్పుడు మాకు వస్తాండే నీళ్ళ సార ఎట్లెట్ల వస్తాండాదో పాయింటు పెట్టేటాయన చెప్పినాడు. అందుకే ఈడ ఎయ్యద్దని చెప్తాండా. ఆపైన నీ ఇష్టం. అట్లా కాదని నువ్వు బోరెయ్యాలనుకుంటే ఇన్నూరడుగులకు అవతల ఏసుకో, లేదంటే లేదు. ఈడ మాత్రం ఎయ్యొద్దు' అంటూ మరీ గట్టిగా అరిసినాడు.

'మీరంటే ఉన్నోళ్ళు కాబట్టి మీరెబ్బుదనుకుంటే అబ్బుడు బోరేసుకునే స్తోమత మీకుంటుంది. కానీ మేమలా కాదునా, ఇరవయ్యేండ్ల నుండి కడుపు కట్టుకొని దాచిపెట్టుకున్న డబ్బుతో బోరేసుకోడానికి మాకిప్పుడే కుదిరింది. ఇప్పుడు మీరు ముందేసినారని ఈడేయ్యద్దని, ఆడేయ్యద్దని, మీకు నీళ్ళు నిల్చి పోతాయని ఇన్ని ఆక్షేపణలు పెట్టడం ఏమన్నా బాగుందానా.'

'అదంతా నాకు తెలీదురా, నువ్వీడ బోరెయ్యొద్దు' అని రాజారెడ్డి. 'నేను ఏసేది ఏసేదే' అని మా నాయన. ఇలా చానాసేపు గట్టిగా అర్సుకుంటా మాట్లాడిన తరవాత రాజారెడ్డి 'నువ్వు ఈడ బోరేస్తే నేను పొయ్యి పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ చేస్తాను' అంటూ వెళ్ళిపోయినాడు.

ఒక్కసారిగా మాకందరికి ఏమి చెయ్యాలో అర్థం కాలేదు. ఏదైతే అది అయ్యిందిలే అని బోరెయ్యడానికి మాకు ధైర్యం సరిపోలేదు. ఒకవేళ ఏస్తే వాళ్ళు ఏం చేస్తారో ఏమోనని ఒకపక్క భయం. అమ్మ నెత్తినచెయ్యిపెట్టుకొని గెనెంమీద అలానే కూల బడిపోయింది. ఒక్కరికీ గొంతులో మాట పెగల్లేదు. గుండెల నిండా ఏదో తెలియని భయం... ఏం చెయ్యాలో అర్థంకాని పరిస్థితిలో మేమంతా ఉంటే, మా నాయన గబగబా ఊరి వైపు దారి పట్టినాడు.

'ఏం నాయనా అట్లా పోతాండావు, యాడికి'

'కృష్ణారెడ్డి దగ్గరికిరా, ఆయనకు అన్ని విషయాలు ముందే చెప్పినాను. అట్లే కొండారెడ్డి కాడికి పోయొస్తా, ఆయన మాటంటే ఊర్లో అందరికీ గౌరవమే. పైగా రెండుసార్లు సర్పంచ్‌గా చేసి మంచి పేరు తెచ్చుకోవడం వల్ల ఎమ్మెల్లే దగ్గర గూడా మంచి పేరుంది. ఆయనకి కూడా విషయమంతా ముందే చెప్పినాను' అని చెప్పి వెళ్ళిపోయినాడు.

మా నాయన ఎంతకీ రాకపోయే సరికి, నాకేదో భయమేసి ఊర్లోకి పోదామని కొంత దూరం పొయ్యేసరికి మా నాయన దిగాలుగా ఎదురైనాడు.

'ఏమైంది నాయనా.. పెద్దలతో మాట్లాడినావా, ఏమన్నారు'.

'అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని అన్నట్లు అందురూ దాయాదులే, పైగా పంచాయితీ పెద్దలే అయినా మాట సాయానికి కూడా ఇంట్ల తలుపులు తీసి ఏమైందిరా అని అడిగేవాళ్ళు లేరు. సమస్య రాకముందు నీకెందుకురా మేమున్నాము అంటూ అందురూ ఎగదోలేవాళ్ళే. తీరా ఇబ్బుడు ఇట్లుంది పరిస్థితి అంటే, రాజారెడ్డికీ మాకు పడదు. ఇబ్బుడు నేనొచ్చి మాట్లాడితే బాగుండదు అని ఒకరు. ఆయన ఇంత పని చేస్తాడనుకోలేదు. వాళ్ళతో గొడవలెందుకులే. వాళ్ళు ఒప్పుకున్నాకే బోరేసుకో అని ఒకరు చేతులెత్తేసేటోళ్ళే' అంటూ అక్కడే కూచ్చున్నాడు.

బోరుబండోల్లు 'ఇంగెంతసేపునా.. మాకు వేరే పార్టీ ఒకటి వెయిట్ చేస్తా ఉంది. మేము పోతాము. మీరు ఒకమాట మీదికి వచ్చినాక మాకు ఫోన్ చెయ్యండి వస్తాము' అన్నారు.

'ఒక పది నిమిషాలు ఉండండినా.. ఏవిషయం చెప్పేస్తాము' అని నేను వాళ్ళతో చెప్పి నేరుగా రాజారెడ్డి ఇంటికి పోయినాను.

♦♦♦

'పెద్నాయనా.. మా నాయన ఇన్నేండ్లు ఆ ఊట బాయిని నమ్ముకొని ఏదో పడతా లేస్తా, అబ్బాఅమ్మా అంటే సంవత్సరానికి ఒక ఫలితం వండిస్తా ఉండే. ఇప్పుడు రెండు మూడెండ్లుగా వానలు సరిగ్గావడక ఆ ఊటబాయి కూడా ఎండిపోయింది. ఇట్లే ఉంటే జరగదని ఏదో ఒక బోరేసుకుంటే అంతోఇంతో ఆవులకు గడ్డేసుకొని రెండు జెర్సీఆవులను పట్టుకొని నిమ్మలంగా వుందామనుకొని, ఈ రోజు ఇట్లా బోరు బండిని పిలిసినాడు. ఇప్పుడు నువ్వు కాదంటే ఎట్లా పెద్నాయనా' అని మాట్లాడతా వుంటే, నా నోట్లోమాట నోట్లో ఉండగానే 'మీరెన్ని బాధలు పడితే మాకెందుకు' అంటూ పెద్దమ్మ ఏదో సాగాదీస్తానే ఉంది. 'పెద్నాయనా నువ్వొకమాట చెప్పు పెద్నాయనా, అట్లా గూడా మా బోరు వల్ల మీ బోరులో నీళ్ళెండిపోతే అది మీరే పెట్టుకోండి' అని ఎంతగా ప్రాధేయ పడినా వాళ్ళ మనసు కరగలేదు.

చివరికి చేసేదేమీలేక 'మీరు ఉన్నన్నాళ్ళూ మీ భూమిపక్కన అది బీడుభూమిగానే ఉంటుంది. అది చూసి మీరు ఆనందంగా ఉండండి. మేము ఆ బీడు భూమిని చూస్తూ బతికినన్నాళ్ళూ బాధ వడుతూనే ఉంటాము' అని అక్కడినుండి నేరుగా చేనుకాడికి పోయినా.

అర్ధగంటకంతా బోరుబండి వెళ్ళిపోయింది. అందరం ఇంటికొచ్చేసినాము. అప్పటికే తెల్లారి జామున అయిదు గంటలైంది. ఎవ్వరికీ నిద్ర రావట్లేదు.

♦♦♦

'వీధిలో రాజారెడ్డి ఎదురుపడినాడు. వాళ్ళ బోరు పాయింటు పెట్టిన కుంటిరెడ్డి వచ్చి దానికి దీనికి ఏ సంబంధం లేదు అని చెప్తే మీరు బోరేసుకోడానికి నాకెటువంటి అభ్యంతరం లేదు అని చెప్పినాడు' అని మా నాయన అమ్మతో చెప్పినాడు. ఆ మాట మా నాయననోట వినగానే మాకందరికి ప్రాణాలు లేచి నిలబడినట్లయినాయి. ఆత్రం పట్టలేక 'నువ్వు బిన్నా పొయ్యి ఆ కుంటిరెడ్డిని పిల్చుకొనిరా' అని మా అమ్మ చెప్పగానే ఆన్ని సద్దినీల్లు తాగి నేనూ మా నాయనా కుంటిరెడ్డి ఇంటికి పోయినాము.

గేటు తీసుకొని కుంటిరెడ్డి ఇంటి మొగసాలలో మేము నిలబన్నాము. ఇంతలో ఎప్పుడొచ్చినాడో ఏమో ఆ రాజారెడ్డి చేతిలో నుండి సిగరెట్టుని కింద పడేస్తూ 'చెప్పింది గుర్తుంచుకో కుంటిరెడ్డి' అని గట్టిగా చెప్తూ వెళ్ళిపొయినాడు. అది విని మా నాయనా నేనూ ఒకరి మొఖాలు ఒకరం చూసుకున్నాం.

ఇంతలో 'రా రా బామ్మర్ది చాన్నాళ్ళకు మా ఇల్లు కనపడిందే ఏమి సంగతి' అని అడిగినాడు కుంటిరెడ్డి. 'ఇప్పటికే అన్నీ తెలుసుంటాయి కదా మామా. మల్లా ఎందుకు పుండుమీద కారం చల్లినట్లు అడగడం' బాధతో అన్నాడు మానాయన. 'ఒరేయ్ నాయాలా నాకన్నీ తెలుసులేరా. అయినా ఆ రాజారెడ్డికి ముందే చెప్పినానే మీ పాయింటుకి వాళ్ళ పాయింటుకి సంబంధం లేదు అని. మళ్ళీ బుద్ధి లేకుండా అట్లెట్లా చేసినాడు' అన్నాడు. ఆ మాటతో మానాయన కళ్ళల్లో ఇరవయ్యేళ్ళ కల నాకు కనపడింది.

'ఎప్పుడొస్తావో చెప్పు మామా.. ఈ పంచాయితీ అట్లా తెగిపోతే మా బతుకేదో మేము బతుకుతాము' అంటూ మా నాయన అడిగినాడు. 'సాయంత్రం నేనే ఫోన్ చేస్తాను. అప్పుడు రా. ఒరేయ్ నాయాలా.. ఆ రాజారెడ్డి అంత మంచోడేమీ కాదురా, మళ్ళా ఏదో ఒక తిరకాసు పెడతానే ఉంటాడు. ఊరి ముందు దారింటి కాకుండా మూడ్రాములకుంట దారింటి వస్తాను. నువ్వు ఆడుండు' అన్నాడు. సరే అనుకుంటూ నేను మా నాయనా ఇంటిదారి పట్టినాం.

♦♦♦

'పాయింట్ ఎక్కడరా బామ్మర్ది'

'ఇంకొంచెం అట్ల ముందుకి పా మామా' అంటూ పది అడుగులు ముందుకేసి 'ఇదే మామా' అని చూపించినాడు నాయన.

అప్పటిదాకా కిందికున్న తెల్ల పంచెను ఎడమ చేతితో ఎత్తిపట్టుకొని, కుడిచేతిని భూమికి అభిముఖంగా పెట్టి, నీళ్ళల్లో కలపెట్టినట్టు చేతిని ఆడించుకుంటూ పాయింటుకు నాలుగడుగులు ఇటూ నాలుగడుగులు అటూ ఏసాడు. 'లాభం లేదు కదరా రేయ్ బామ్మర్ది. ఎవుర్రా ఈడ పెట్టింది పాయింటు' అన్నాడు.

'ఆ తాటిగుంటపాలెం ఆయన పెట్టినాడులే మామా, ఏమైంది'.

'నీళ్ళు లేవు కదరా, యాన్నో అరించీ మాత్రమే తగలతా ఉండాయి కదరా బామ్మర్ది' అని అంటూ 'నీచేను యాన్నుంచి యాడిదాకో చెప్పరా.. ఒకసారి మొత్తం చూద్దాం' అన్నాడు.

మానాయన మొత్తం చూపించినాడు. కుంటిరెడ్డి మామ అంతా తిరిగి చూసి 'లాభం లేదురా బామ్మర్ది. ఇంగ్యాదన్నానీ భూమి ఉంటే చెప్పురా చూద్దాం' అన్నాడు. సరే అని ఈ చేనుకి కొంతదూరంలో ఉండే ముప్పైగుంటల చేనులోకి తీసుకెళ్ళినాడు మా నాయన. ఆ చేనులో పల్లేరుముండ్లు ఎక్కువగా ఉండడంతో, 'ఒరేయ్ బామ్మర్ది... చేనుని అంతా పరిగిలి పట్టించినావ్ కదరా, ఇట్లేనా కాపోడు సేద్యం చేసేది' అని మళ్ళీ ఆయన విద్యను ప్రదర్శించి, 'నాయాలా రేయ్ బామ్మర్ది.. ఈడ పోతావుంది చూడరా సార' అంటూ కాస్త నిదానంగా అడుగులేసినాడు. పది అడుగులు ముందుకి, పది అడుగులు వెనక్కి వేసి 'నాయాలా రేయ్.. ఈడ ఇన్ని నీళ్ళు పెట్టుకొని ఆడేడో తనకలాడ తావుండావు కదరా నీ పానును గాలా' అని దగ్గరలో వుండే కానుగచెట్టు కాడికి పోయి, తమరగా ఉండే సన్నని పుల్లని పెరుక్కొని మళ్ళీ ఇటు పది అడుగులు, అటు పది అడుగులు వేసి చూసినాడు. అదేందో గానీ ఆయన చేతిలోనిపుల్ల దానంతట అదే తిరుగుతూ ఉంటే నాకేమో ఆశ్చర్యమేసింది. 'మూడు ఇంచీల వరకూ నీళ్ళు పడతాయిలేరా బామ్మర్ది' అంటూ గుర్తుగా ఒక రాయిని పెట్టి ఇంగ 'పదాం పదరా బామ్మర్ది' అన్నాడు.

నాలుగు రోజుల తరవాత ఒకరోజు రాత్రి పదకొండు గంటలకు బోరుబండి వచ్చింది. అమ్మ, నేను, అన్నా, మా నాయనా అందరం చేనుకాడికి చేరుకున్నాం. కొంతసేపటికి బండి డ్రిల్లింగ్ రాడ్డు భూమిలోకి దిగింది. ఒక్కసారిగా మొత్తం చుట్టుపక్కలంతా ఒగటే దుమ్ము. మేం అందరం ఆనందంగా చూస్తున్నాం. అలా చూస్తా ఉండగానే యాభై అడుగులు, వంద

అడుగులు ఇలా పైపులు దిగుతూనే ఉన్నాయి. ఉత్త ముగ్గుపిండి తప్ప నీటి చుక్క జాడైనా కనపడకుండా ఉంది. మా నాయన ప్రతి రెండుపైపులకొకసారి ఆ ముగ్గుపిండిని చేతిలోకి తీసుకొని రవ్వంత తడైనా ఉందా లేదా అని చూస్తా ఉండాడు. కొంత సేపటికి సరసరామని మరో అయిదు రాడ్లు దిగిపోయినాయి. ఎక్కడో ఒక సార తగిలినట్లుంది. మట్టి ముద్దలు ముద్దలుగా పడుతూ ఉంది. 'ఒరేయ్ చిన్నోడా ఇలా రారా' అన్నాడు మా నాయన. నేను వెళ్ళేసరికి, ముద్దలు ముద్దలుగా రాలుతున్న ఆ ముగ్గుపిండి కాస్తా మునిసిపల్ కొళాయిల్లో నీళ్ళు వచ్చినట్లు సన్నగా కారడం మొదలైంది. అది చూసి 'ఇంగేం భయంలేదులేరా మన పంట పండేటిగానే ఉంది' అన్నాడు. ఆ క్షణం మా నాయన కళ్ళు కార్తీకమాసంలో సీతమ్మగుట్ట మింద పెట్టే దీపంలా వెలిగిపోతా వుండాయి.

'నువ్వు ఇంటికి బొయ్యి రెండు గోనెసంచులు తేపోరా. బోరులో ఎయిర్ వదిలినప్పుడు నీళ్ళు పైకి ఎగరకుండా పెట్టల్ల' అన్నాడు మా నాయన. నేను ఇంటికి పోయ్యొచ్చేసరికి ఊరిలోని జనం కొంతమంది ఏమాత్రం నీళ్ళు పన్నాయో అని చూడడానికి వస్తూపోతూ ఉండారు.

బోరు ఆరువందల అడుగులు దాటిపోతూ ఉంది. 'ఏంది నాయనా ఆరువందలు దాటినా నీళ్ళు సన్నగానే వస్తాందాయే' అన్నాను. 'కుంటిరెడ్డి మామ ఆరువందల యాభై నుండి ఏడువందల యాభై అడుగుల మధ్యలో నీళ్ళు బాగా పడతాయన్నాడులేరా, చూస్తా ఉండు ఇంగొగ పైపో రెండు పైపులో దిగినాక చూడు' అన్నాడు. నేనేమో అట్లనే చూస్తా ఉండా. మానాయన అన్నట్లు రెండుపైపులు గాదు ఆరుపైపులు దిగిపోయినాయి. నీళ్ళు మాత్రం అవే. ఒగిటిన్నర ఇంచీనే. మా అందరికి ఏదో గుబులు మొదలైంది. మానాయన అటూఇటూ తిరుగుతూ కుంటిరెడ్డికి ఫోన్ చేస్తా ఉండాడు. ఆయనేమో ఫోన్ ఎత్తినట్లు లేదు. కాలుగాలిన పిల్లిలా మా నాయన కాలు యాడా ఒక నిమిషం కూడా ఆగలేదు. కొంత సేపటికి బండి ఆపరేటర్ మా నాయాన్ని పిలిచి, డ్రిల్లింగ్‌లో నుండి వచ్చే చిన్నచిన్న రాళ్ళను చూపించి 'నీకేం భయం లేదు పోనా.. ఇవి వచ్చినాయంటే నీళ్ళు బాగా పడతాయిలే' అన్నాడు. ఆపరేటర్ ఆ మాట అన్నాడోలేదో ఒక్కసారిగా నీళ్ళు పైకి ఎగజిమ్మినాయి. మా ఆనందానికి అవధులు లేకుండా పోయినాయి.

బండి ఆపరేటర్, నీళ్ళ ఫోర్సు ఎక్కువైందినా.. డ్రిల్లింగ్ అవ్వటం లేదు ఇంగ బండి ఆపేద్దాం' అన్నాడు. ఆమాట మేము వింటుండగానే అమాంతం ఒక్కసారిగా డ్రిల్లింగ్ పైపు ఇరవై అడుగులు దిగిపోయింది. ఆపరేటర్ ముందుకి వెనక్కి పైపుని డ్రిల్ చేయడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడు. ఐనా లాభం లేకుండా పోయింది. పైపులోనుండి నీళ్ళుగాని మట్టిగాని ఏదీ పైకి రావడంలేదు. శతవిధాలా వాళ్ళు ప్రయత్నిస్తూనే ఉన్నారు. కొంతసేపు తరవాత గులకరాళ్ళ కంటే పెద్దరాళ్ళు బయటికొచ్చాయి. ఇదంతా చూస్తూనే ఉన్నాం తప్ప మాకేం అర్థం కావట్లేదు. కొంతసేపు తరవాత బండిని ఆపేశారు.

'ఏమైంది?' అన్నాడు మానాయన. 'డ్రిల్లింగ్ రాడ్డుకు చిన్నచిన్న రాళ్ళు తగులుకొని అది తిరగడం లేదు. అందుకే డ్రిల్లింగ్ అవ్వడంలేదు. ఇప్పుడు ఆపైపులన్నా బయటికి వస్తాయో రావో చెప్పలేము' అన్నాడు. మాకు గుండెలు ఝల్లుమన్నాయి. 'మీరేం భయపడద్దండి మా పైపులు పైకి లాగి బోరుని క్లీన్ చేసి మీకు నీళ్ళు వచ్చే విధంగా చేసే పోతాములే' అన్నాడు.

వాళ్ళు సాయంత్రం వరకూ ప్రయత్నించి ప్రయత్నించి వదిలేసినారు. ఆ పైపులు లాగడానికి వీళ్ళ దగ్గరున్న బండి పవర్ సరిపోదని బెంగళూరు బార్డర్లో ఉన్న చింతామణి నుండి ఒక పవర్ బండిని పిలిపించినారు. ఆ మరుసటి రోజుకి వాళ్ళ సామగ్రినంతా పైకి లాగేసుకున్నారు. మిగిలిన ఆ బోరు పరిస్థితిగాని, అందులోని నీళ్ళ గురించిగాని ఎంత అడిగినా మాకు చెప్పడంలేదు. వాళ్ళల్లో వాళ్ళే ఏదో మాట్లాడుకుంటా వుండారు. కొంతసేపటికి ఒకాయన వచ్చి 'ఈ పాయింటులో బోరు వెయ్యలేము. లోపల మట్టి కొంచెంకొంచెమే పూడిపోతా వుంది. ఒకవేళ మేము పైపులు దించితే, తిరిగి అవి వస్తాయన్న గ్యారంటీ లేదు' అని చేతులు పైకెత్తేశాడు. చుట్టుపక్కల వాళ్ళు ఇంగ ఆ బొక్కలో ఉన్న నీళ్ళ కోసం మోటారు, పైపులు కూడా వేయడం దండగే. అవి కూడా పూడిపోతే వాటి ఖర్చు కూడా శివార్పణమే అంటూ వెళ్ళిపోయారు.

ఎంత ప్రాధేయపడినా లాభం లేకుండాపోయింది. చేసేదేమీ లేక వాళ్ళకి ఇవ్వాల్సినడబ్బు వాళ్లకి ఇచ్చేసి అందరం ఇంటికి చేరుకున్నాం. అప్పటికే పొద్దు పోయింది. ఇరవయ్యేళ్ళ కల నెరవేరుతున్నట్లే కనిపించి ఇలా అవ్వడంతో ఆక్షణం ప్రాణముండీ లేనట్లు మా నాయన, బోరులో పడిన ఆ కాసిన్ని నీళ్ళనూ పైకి లాక్కోలేక, కూడపెట్టుకున్న డబ్బూ పోయి, రేపటి జీవితం ఎట్లా అన్న భయంతో మాయమ్మ కనిపిస్తావుండారు. వాళ్ళనలా చూస్తుంటే నాకు ఏం చెయ్యాలో దిక్కు తోచడం లేదు. గబగబా వెళ్లి రెండు చెంబుల నీళ్ళు పోసుకొని, బట్టలు నర్దుకొని పయనమయ్యాను. 'ఇంత మొబ్బులో యాటికి బయల్దేరినావురా' అని మాయమ్మ అడిగింది. 'తిరపతిలో నేను చదువుకునే తాన ఒక హోం ట్యూషన్ ఉందంట. నెలకు నాలుగు వేలిస్తారంట. నేను పోతాను. ఈడ ఉండి ఈ బాధలు నేను చూడలేను...' అని సిద్ధం కాసాగాను. ■